# ఆ పాతపాట మధురం

## - రాజా



శ్రీ కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 90




# సూచిక (Index)


| ఏడాది | నెల | సినిమా పేరు | పేజీ |
|---|---|---|---|
| 2008 | 1 | మల్లీశ్వరి | 5 |
| 2008 | 2 | పాతాళ భైరవి | 12 |
| 2008 | 3 | పెళ్లి చేసి చూడు | 17 |
| 2008 | 4 | దేవదాసు | 21 |
| 2008 | 5 | చండీ రాణి | 28 |
| 2008 | 6 | బ్రతుకు తెరువు | 31 |
| 2008 | 7 | చక్ర పాణి | 35 |
| 2008 | 8 | విప్రనారాయణ | 38 |
| 2008 | 9 | చంద్ర హారం | 43 |
| 2008 | 10 | రేచుక్క | 46 |
| 2008 | 11 | శ్రీ కాళహస్తి మహత్యం | 50 |
| 2008 | 12 | సంఘం | 55 |
| 2009 | 1 | అర్ధాంగి | 59 |
| 2009 | 2 | అనార్కలి | 63 |
| 2009 | 3 | కన్య శుల్కం | 67 |

| | | | |
|---|---|---|---|
| 2009 | 4 | రోజులు మారాయి | 70 |
| 2009 | 5 | సంతానం | 76 |
| 2009 | 6 | దొంగ రాముడు | 80 |
| 2009 | 7 | మిస్సమ్మ | 85 |
| 2009 | 8 | తెనాలి రామకృష్ణ | 91 |
| 2009 | 9 | జయం మనదే | 95 |
| 2009 | 10 | ముద్దు బిడ్డ | 101 |
| 2009 | 11 | జయ సింహ | 106 |
| 2009 | 12 | ఇల వేలుపు | 111 |
| 2010 | 1 | భలే రాముడు | 114 |
| 2010 | 2 | చిరంజీవులు | 119 |
| 2010 | 3 | పాండు రంగ మహత్యం | 124 |
| 2010 | 4 | మాయ బజార్ | 131 |
| 2010 | 5 | మాయ బజార్ – 2 | 136 |
| 2010 | 6 | సువర్ణ సుందరి | 141 |
| 2010 | 7 | భలే అమ్మాయిలు | 148 |
| 2010 | 8 | తోడి కోడళ్ళు | 155 |
| 2010 | 9 | సారంగధర | 161 |
| 2010 | 10 | ప్రేమ  లేఖలు | 164 |
| 2010 | 11 | శ్రీ వేంకటేశ్వర మహత్యం (బాలాజీ) | 170 |
| 2010 | 12 | శ్రీ వేంకటేశ్వర మహత్యం (బాలాజీ) – 2 | 174 |
| 2011 | 1 | రాణి రత్నప్రభ | 179 |

| | | | |
|---|---|---|---|
| 2011 | 2 | సీతా రామ కళ్యాణం | 183 |
| 2011 | 3 | సీతా రామ కళ్యాణం – 2 | 188 |
| 2011 | 4 | వెలుగు నీడలు | 194 |
| 2011 | 5 | వెలుగు నీడలు – 2 | 198 |
| 2011 | 6 | వెలుగు నీడలు – 3 | 201 |
| 2011 | 7 | జగదేక వీరుని కథ | 205 |
| 2011 | 8 | జగదేక వీరుని కథ – 2 | 208 |
| 2011 | 9 | జగదేక వీరుని కథ – 3 | 211 |
| 2011 | 10 | జగదేక వీరుని కథ – 4 | 214 |
| 2011 | 11 | పెళ్లి సందడి | 217 |
| 2011 | 12 | శభాష్ రాముడు | 221 |
| 2012 | 1 | మనోరమ | 224 |
| 2012 | 2 | చెంచు లక్ష్మి | 228 |
| 2012 | 3 | చెంచు లక్ష్మి – 2 | 233 |
| 2012 | 4 | చెంచు లక్ష్మి – 3 | 236 |
| 2012 | 5 | భూకైలాస్ | 240 |
| 2012 | 6 | భూకైలాస్ – 2 | 245 |
| 2012 | 7 | అత్త ఒక ఇంటి కోడలే | 250 |
| 2012 | 8 | మాంగల్య బలం | 255 |
| 2012 | 9 | మాంగల్య బలం – 2 | 260 |
| 2012 | 10 | అప్పు చేసి పప్పు కూడు | 265 |
| 2012 | 11 | అప్పు చేసి పప్పు కూడు – 2 | 270 |

| | | | |
|---|---|---|---|
| 2012 | 12 | ఇల్లరికం | 275 |
| 2013 | 1 | పెళ్లి కానుక | 282 |
| 2013 | 2 | శాంతి నివాసం | 288 |
| 2013 | 3 | శాంతి నివాసం – 2 | 291 |
| 2013 | 4 | కనక దుర్గ పూజ మహిమ | 297 |
| 2013 | 5 | శ్రీ వేంకటేశ్వర మహత్యం | 303 |
| 2013 | 6 | శ్రీ వేంకటేశ్వర మహత్యం – 2 | 308 |
| 2013 | 7 | కుల దైవం | 314 |
| 2013 | 8 | భట్టి విక్రమార్క | 321 |
| 2013 | 9 | రాణి రత్నప్రభ | 325 |
| 2013 | 10 | సీతా రామ కళ్యాణం | 329 |
| 2013 | 11 | సీతా రామ కళ్యాణం – 2 | 335 |
| 2013 | 12 | కలిసి ఉంటె కలదు సుఖం | 341 |
| 2014 | 1 | అన్నపూర్ణ | 346 |
| 2014 | 2 | విమల | 350 |



# ఆ పాత పాట మధురం

## రాజా





# మల్లీశ్వరి



తెలుగు సినీ సంగీతాన్ని విదేశీయులకు కూడా చవిచూపిన తెలుగు చిత్రంగా వాహినీవారి 'మల్లీశ్వరి'నే చెప్పుకోవాలి. అంతకు ముందు విడుదలయిన చిత్రాలను 1931 నుంచీ తీసుకుంటే వాటిలో సంగీత స్థాయి కొంత వరకే ఉండేది. సంగీత సాహిత్యాలను సమతూకంలో నడిపించుకుంటూ ఆసాంతం సంగీత ప్రాధాన్యత గల చిత్రంగా నిర్మితమైన 'మల్లీశ్వరి'తో తెలుగు సినీ సంగీతం యొక్క గమనం, దిశ రెండూ మారిపోయాయి. అందుకే ఈ శీర్షిక 'మల్లీశ్వరి' చిత్రంలోని సాహిత్య విశ్లేషణ, విశేషాలతో మొదలవుతోంది.

ఎన్.టి.రామారావు, భానుమతి హీరో హీరోయిన్లుగా, నిర్మాత దర్శకుడు బి.ఎన్.రెడ్డి నిర్మించిన 'మల్లీశ్వరి' చిత్రం 1951 లో విడుదలయింది. అంతకు ముందు వాహినీ బ్యానరుపై ఎన్నో మంచి చిత్రాలు వచ్చాయి. వారి తొలిచిత్రం 'వందేమాతరం'1939లో విడుదలయింది. ఆ చిత్రంలో కొంత భాగాన్ని హంపీలో చిత్రీకరించ వలసి వచ్చింది. ఆ సందర్భంగా అక్కడ హంపీలో గల విజయనగరంలోని విరూపాక్ష దేవాలయాన్ని సందర్శించారు బి.ఎన్.రెడ్డి. ఆ దేవాలయం గర్భగుడిలో నిల్చుని ప్రార్ధన చేస్తుండగా - 'ఆనాడు శ్రీకృష్ణదేవరాయలు పూజ చేసిన స్థలం ఇదే కదా' అన్న విషయం ఆయన స్ఫురణకి వచ్చింది. వెంటనే ఒళ్ళంతా పులకరించింది. ఆనాటి వాతావరణాన్ని ప్రతిబించేలా ఏదైనా ఒక కథను తీసుకుని చిత్రంగా తీస్తే బావుంటుందనిపించింది. అలా బి.యన్.రెడ్డి గారి మనసులో 'మల్లీశ్వరి' చిత్రానికి సంబంధించిన తొలి బీజం ఆనాడు పడింది. ఏళ్ళు గడుస్తున్నా ఆ ఊహ ఆయన్ని ఒదిలిపెట్టలేదు. తగిన కథ దొరకలేదుకూడా. ఒకరోజు - సుప్రసిద్ధ కథా రచయిత బుచ్చిబాబు రాసిన ఓ రేడియో నాటిక విన్నారాయన. ఆ తర్వాత 'ఇల్‌స్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా'లో వచ్చిన ఓ కథను చదివారు. ఆ రెండిటి ప్రభావంతో ఒక కథను తయారు చేశారు బి.ఎన్.రెడ్డి. అదే 'మల్లీశ్వరి' అయింది.

దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి కవితలన్నా, ఆయన అన్నా బి.ఎన్.రెడ్డిగారికి ఎంతో గౌరవం, ఇష్టం. ఆయన చేతే సినిమాలలో పాటలు రాయించాలని అనుకున్నారు. దేవులపల్లివారు చాలా నిదానంగా రాసేవారు. ఎంత ఆలశ్యమైనా బి.ఎన్.రెడ్డి నిరాశ చెందక వేచి ఉన్నారు. హీరోగా ఎన్.టి.రామారావుని ముందే అనుకున్నా హీరోయిన్ విషయంలో ఒక నిర్ణయానికి రావటానికి జాప్యం బాగానే జరిగింది. రేవతి అనే అమ్మాయిని స్క్రీన్ టెస్టు చేసి చూశారు కూడా. ఆట, పాట, నటన అన్నీ ఉన్న పాత్ర కనుక - అంతకు ముందు స్వర్గసీమ (1945) చిత్రంలో కొంత అవస్థపడినా - చివరికి భానుమతినే ఎంపిక చేశారు బి.యన్.రెడ్డి. రెండేళ్ళపాటు చిత్రనిర్మాణం సాగింది. 8 లక్షలరూపాయలకు పైగా ఖర్చు అయింది. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం. 1939లో మొలకెత్తిన అంకురం ఫలించి పుష్పించి తగు ఫలితాలను ఇవ్వడానికి పన్నెండు సంవత్సరాలు పట్టిందన్నమాట.

'మల్లీశ్వరి' చిత్రానికి పాటలను దేవులపల్లి కృష్ణశాస్త్రి వ్రాయగా, సంగీతాన్ని సాలూరి రాజేశ్వరరావు సమకూర్చారు. టైటిల్స్‌లో రాజేశ్వరరావుగారి పేరుతో పాటు అద్దేపల్లి రామారావు పేరు కూడా ఉండటంతో కొంతమంది ఆయన కూడా కొన్ని పాటలను స్వరపరిచేరేమోనన్న అపోహకు లోనమయ్యారు. కానీ ఆయన ఆర్కెస్ట్రా నిర్వహణ మాత్రమే చూసుకున్నారు. 'మల్లీశ్వరి' పాటల కంపోజింగుకి ఆరునెలలు పట్టిందంటే ఇవాళ ఆశ్చర్యంగానే ఉంటుంది. అంతేకాదు 'మల్లీశ్వరి'లో ఏపాటా ట్యూన్‌కి రాసింది కాదు. అన్నీ దేవులపల్లి రాశాకే ట్యూన్ చేశారు యస్.రాజేశ్వరరావు. ఆ చిత్రంలో ప్రతీ పాట ఆ పాత మధురమే. హిట్ కాని పాట లేదు. అయినా ప్రాధాన్యత క్రమంలో కొన్ని పాటలు ఎన్నుకోగా వాటిలో కొన్నిటి గురించి:

పాట 1

కోతి బావకు పెళ్ళంట ||కోవెల|| ||కోతి||
కోవెల తోట విడిదంట
మల్లి మాలతి వస్తారా
మాలికలల్లి తెస్తారా
బంతీ జాజి చేమంతి
బంతులు కట్టి తెస్తారా ||బంతులు||
పెళ్ళికి మీరు వస్తారా
పేరంటానికి వస్తారా
పందిరి వేస్తాము
ముందర ముగ్గులు పెడతాము
పందిరికింద పెళ్ళివారికి
విందులు చేస్తాము
బాకా బాజా డోలు సన్నాయ్ ||బాకా||
మేళాలెడతారు
తప్పెట తాళాలెడతారు
అందాల మా బావగారికి
గంధాలు పూసి
గారాల మా బావ మెడలో హారాలు వేసి
కుళ్ళాయెడతాము
కుచ్చుల తురాయి పెడతాము
హారాలేసి గంధం పూసి
కుళ్ళాయెట్టి తురాయి
పెడతాము
కుచ్చుల తురాయి పెడతాము
ఓ...పల్లకి ఎక్కి
పల్లకి ఎక్కి కోతి బావ
పళ్ళికిలిస్తాడు .. మా కోతి బావ
పళ్ళికిలిస్తాడు

'కోతిబావకు పెళ్ళంట' పాటను భానుమతి ఆలపించగా తెరపై భానుమతి, ఎన్.టి,రామారావు అభినయించారు. ఈ పాట పొందిన ప్రజాదరణ అంతా ఇంతా కాదు. ఆ రోజుల్లో పెళ్ళి కావలసిన ఆడపిల్లలు తమకు వరసైన బావని, లేదా అక్కకు కాబోయే భర్తని సరదాగా ఆటపట్టించడానికి ఈ పాటని తెగ పాడేవారు. ఈ పాట ప్రభావం నలభై ఏళ్ళు దాటినా తగ్గలేదనటానికి ఓ ఉదాహరణ ఏమిటంటే - హాస్యనటుడు బాబూమోహన్ హీరోగా ఓ చిత్రం తీద్దామనుకున్నారు. అది వేరే విషయం.

ఇదిలా ఉండగా ఈ పాట ట్యూన్‌కి సంబంధించి ఓ తమాషా పరిశీలన ఉంది. అదేమిటంటే - 1948 లో దిలీప్ కుమార్, నర్గీస్, హీరో హీరోయిన్లుగా 'మేలా' అనే ఓ హిందీ చిత్రం వచ్చింది. (ఈ చిత్రం కథనే మార్చి తెలుగులో ఎన్.టి.ఆర్, జమునతో 'చిరంజీవులు' అనే చిత్రాన్ని 1956 లో తీశారు.) ఈ 'మేలా' చిత్రానికి నౌషాద్ సంగీత దర్శకుడు. 'మైభఁవ్ రాతూహీ ఫూల్' అంటూ ముఖేష్, షంషాద్ బేగం పాడిన పాటొకటుంది. ఈ పాటనే ఏ.వి.యం వారు 'జీవితం' (1950) చిత్రంలో' మన మనసు మనసు ఏకమై ఆనందమై నవలోకము చూద్దామా' అనే పాటగా తెలుగు వారికి అందించారు. ఈ రెండు పాటల్లో కామన్‌గా ఉండే ఓ

లైన్ ఉంది. ఆ రెండు పాటలు గాని, కనీసం ఒక్క పాటైనా గానీ దొరికితే ‘ఓ...తూ సూరజ్‘ అనే లైనుని తెలుగు పాటలోనూ వినండి. ఆ ట్యూన్ ఈ ‘కోతి బావకు పెళ్ళంట పాటలో ‘ఓ ... పల్లకి ఎక్కి‘ అనే లైనుకి జతపడ్డ ట్యూనుకి ప్రేరణలా అనిపిస్తుంది.

ఇక సాహిత్యపరంగా చూసుకుంటే ‘తురాయి‘ అనే పదం చరిత్రకారులకు ఆలోచనలు రేకెత్తిస్తుంది... ఇది తెలుగు పదం కాదు. దీనికి మూలం హిందీలో ‘తురహ్‘ అని, మరాఠీలో ‘తురా‘ అని, అరబిక్‌లో ‘త్ర్రా‘ అనీ, నిఘంటువులలో ఉంది. ‘మల్లీశ్వరి‘ కథ శ్రీకృష్ణదేవరాయలు కాలందని చెప్పడానికి బి.యన్.రెడ్డి సెట్‌ల రూపకల్పనలోను, దుస్తులలోను, భాషలోను చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. అవన్నీ దేవులపల్లి వారితోను, యస్.రాజేశ్వరరావు గారితోను, కళా దర్శకుడు ఎ.కె. శేఖర్‌తోను చర్చించేవారు. ఈ విషయం తెలుసుకుంటే - శ్రీకృష్ణదేవరాయలు కాలంలో బహమనీ సుల్తానుల తాకిడి మన రాష్ట్రాలపై ఉండేదని, వారి భాష యొక్క ప్రభావం కూడా మన భాషపై పడిందని అందుకే ‘కుచ్చుల తురాయి పెడదాము‘ వంటి ప్రయోగం జరిగినా బి.యన్.రెడ్డి ఆమోదముద్ర పడిందని మనం గ్రహించటానికి ఎంతోసేపు పట్టదు.

---

పాట 2

అతడు: పరుగులు తియ్యాలి గిత్తలు ఉరకలు వేయాలి || పరుగు ||
ఆమె: బిరబిర చరచర పరుగున పరుగున ఊరు చేరాలి మన ఊరు చేరాలి
హోరు గాలి కారు మబ్బులు || హోరు ||
ముసిరేలోగా మూగేలోగా ఊరు చేరాలి మన ఊరు చేరాలి
గలగల గలగల కొమ్ములు గజ్జెలు
ఘణఘణ ఘణఘణ మెళ్ళో గంటలు
ఇద్దరు: ఆ ఆ ఆ ఆ ||గలగల||
వాగులు దాటి వంకలు దాటి
ఊరు చేరాలి మన ఊరు చేరాలి

అతడు: అవిగో అవిగో నల్లని మబ్బులు
గుంపులు గుంపులు
తెల్లని కొంగలు బారులు బారులు
అవిగో అవిగో అవిగో అవిగో || నల్లని ||
ఆమె: పచ్చనితోటలు విచ్చినపూవులు
ఊగేతీగలు అవిగోఅవిగో
కొమ్మల మోగే కోయిల జంటలు
ఝుమ్మని మూగే తుమ్మెద గుంపులు
అవిగో అవిగో
ఇద్దరు: అవిగో అవిగో

---

‘పరుగులు తియ్యాలి గిత్తలు ఉరకలు వెయ్యాలి‘ పాటను ఘంటసాల, భానుమతి పాడగాఎన్.టి.రామారావు, భానుమతి అభినయించారు. మధ్యమావతి, బృందావన సారంగ రాగాల మిశ్రమంతో సాగిన ఈ పాటలో ఘంటసాల, భానుమతి పోటీపడుతూ ఆలపించిన ఆలాపనలు తల్చుకుంటే ఉప్పొంగని రసహృదయం ఉండదు. తర్వాత కాలంలో వచ్చిన ‘మాయాబజార్‘ (1957) చిత్రంలో నాలుగు యుగళగీతాలను యస్.రాజేశ్వరరావే స్వరపరచారని ధృవీకరించడానికి తగిన ఆధారాలు ఈ ‘పరుగులు తియ్యాలి‘ పాట కంపోజింగ్ లో చాలా దొరుకుతాయి. కావాలంటే ‘మాయాబజార్ ‘ లోని ‘చూపుల కలసిన శుభవేళా‘ పాటని ‘పరుగులు తియ్యాలి‘ పాటని సమాంతరంగా మీలోమీరే పాడుకుని చూడండి. రెండిటి సృష్టికర్తా ఒకరేనని అనిపించి తీరుతారు. ఇక సాహిత్యపరంగా దేవులపల్లి అక్షరం అక్షరంలోనూ ప్రత్యక్షం అవుతూనే ఉంటారు. బిర బిర, చర చర, సందడి గుంపులు గుంపులు, బారులు బారులు లాంటివి ఆయనకే సొంతమైన పద ప్రయోగాలు.

పాట 3

పిలిచిన బిగువటరా ఔరర

పిలిచిన బిగువటరా ఔరర || పిలిచిన ||

చెలువలు తామే వలచివచ్చిన

పిలిచిన బిగువటరా ఔరర

భళిరా... రాజా...

ఈనయగారము ఈ వయ్యారము ||ఈ నయ||

ఈ నవయవ్వనమానగ నిను నే పిలిచిన బిగువటరా

గాలుల తేలెను గాఢపు మమతలు

నీలపు మబ్బుల నీడలు కదిలెను

అందెల రవళుల సందడి మరి మరి ||అందెల ||

అందగాడ ఇటు తొందరజేయగ

పిలచిన బిగువటరా ఔరౌర

'పిలిచిన బిగువటరా' పాట సినిమా వారంతా ఇది 'మా జావళి' అని గర్వంగా చెప్పుకున్న పాట. కాఫీ రాగంలో స్వరపరచబడిన ఈ పాటను భానుమతి ఆలపించగా తెరపై నృత్యం చేస్తూ భానుమతి, ఆ నృత్యం తిలకిస్తూ ఎన్.టి.రామారావు, చాటు నుండీ తిలకించే శ్రీకృష్ణ దేవరాయలుగా శ్రీవత్స ఆయన ఆస్థాన కవిగా న్యాపతి రాఘురావు (ఆలిండియా రేడియో వారి 'బాలానందం' కార్యక్రమ రూపకల్పనా కర్త, బాలన్నయ్య ఈయనే) అభినయించారు. కాఫీ రాగంలో సంపూర్ణంగా ఉండే సినిమా పాటని ఉదహరించవలసి వస్తే 'పిలిచిన బిగువటరా' పాటని మొట్టమొదటి పేర్కొని తీరాలి. అంతటి ప్రాముఖ్యతతో యస్.రాజేశ్వరరావు స్వరపరిచారు కనుకనే తరువాతి రోజుల్లో ఆయన సంగీత దర్శకత్వం వహించిన బొబ్బిలి యుద్ధం (1964), అమరశిల్పి జక్కన్న (1964), వసంత సేన (1967) చిత్రాలలో అంతే ప్రామాణికత కలిగిన జావళులను ఆయన స్వరపరచవలసి వచ్చింది. సంగీత సాహిత్యపరంగా జావళీ కుండే అన్ని లక్షణాలను శాస్త్ర సమ్మతంగా పాటించడిన ఈ 'పిలిచిన బిగువటరా' పాట 1951 లో విడుదలైన ఒక సినిమాలోనిదని తెలియకపోతే వివరాల కోసం భవిష్యత్తులో కొంతమంది 'సంగీత విద్యాదర్పణం' పుస్తకాలు వెతికే ప్రమాదం కూడా ఉంది.

పాట 4

ఆమె:ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు

దేశ దేశాలన్ని తిరిగిచూసేవు...

ఏడ తానున్నాడో బావా ||ఏడ||

జాడ తెలిసిన పోయిరావా ఆ..

అందాల ఓ మేఘమాల

ఆ...చందాల ఓ మేఘమాల

అతడు: గగన సీమల తేలు ఓ మేఘమాల

మాఊరు గుడిపైన మసలి వస్తున్నావా

మల్లి మాటేదైన నాతో

మనసు చల్లగా చెప్పిపోవా

ఆ...నీలాల ఓ మేఘమాల

ఆ...రాగాల మేఘమాల

ఆమె:మమత లెరిగిన మేఘమాల ||మమత

నా మనసు బావకు చెప్పి రావా

ఎన్నాళ్ళు నాకళ్ళు

దిగులుతో రేపవలు ||ఎన్నాళ్ళు||

ఎదురు తెన్నులు చూచెనే

బావకై చెదిరి కాయలు కాచెనే

నీలాల ఓ మేఘమాల

రాగాల ఓ మేఘమాల

అతడు:మనసు తెలిసిన మేఘమాల

మరువలేనని చెప్పలేవా

మల్లితో మరువలేనని చెప్పలేవా

కళ్ళు తెరిచినగాని

కళ్ళు మూసిన గాని ||కళ్ళు||

మల్లి రూపె నిలిచేనే

నా చెంత మల్లి మాటే పిలిచేనే

ఆమె: జాలిగుండెల మేఘమాల

బావ లేనిది బ్రతుకజాలా ||జాలి||

కురియు నా కన్నీరు

గుండెలో దాచుకుని

వాన జల్లుగ కురిసిపోవా

కన్నీరు ఆనవాలుగ బావ మ్రోల

'ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవు' పాటను భానుమతి, ఘంటసాల పాడగా తెరపై భానుమతి, ఎన్.టి.రామారావు అభినయించారు. దూరాన ఉన్న ప్రేయసీ ప్రియులు మేఘాల ద్వారా రాయభారం పంపుకోవటం, దౌత్యం జరుపుకోవటం అనే ప్రక్రియ కాళిదాసు విరచితమైన 'మేఘసందేశం' కావ్యకాలం నుంచీ వస్తున్నదే నిజానికి ఆ ప్రక్రియ బాధతో బరువెక్కి పోయి ఉన్న ప్రేయసీ ప్రియులకు ఎంతటి ఓదార్పుని, ప్రశాంతతని సమకూరుస్తుందో అది అనుభవించిన వారికి మాత్రమే తెలుస్తుంది. ఇటువంటి ఆత్మాశ్రయమైన అనుభూతులను మరింత రసాత్మకంగా చెప్పగలిగిన కలం దేవులపల్లి వారిది. 'మా ఊరు గుడిపైన మసలివస్తున్నావా' మరియు 'నాకన్నీరు గుండెలో దాచుకుని వానజల్లుగ కురిసిపోవా' వంటి వాక్యాలను పదే పదే అనుకుని చూడండి. ఆ అనుభూతి మీకూ అవగతమవుతుంది. 'మల్లీశ్వరిలోని అన్ని పాటలలోకి నాకెక్కువ ఇష్టమైన రాగాలలో భీంప్లాస్ ఒకటి. ఈ పాటను ఆయన స్వయంగా హార్మనీ వాయించుకుంటూ ఎన్నో టీ.వీ ఇంటర్వ్యూలలో పాడుతూ కనిపించేవారు. ఎప్పుడైనా యస్. రాజేశ్వరరావుగారు పాడే ధోరణి ఇలా ఉంటుందని గాయకుడు ఎస్పీ. బాలసుబ్రహ్మణ్యం ఆయన్ని మిమిక్ చేస్తూ చెప్పాలంటే ఉదహరించే పాట కూడా ఇదే

---

**పాట 5**

అతడు:ఔనా నిజమేనా ||ఔనా||
మరతునన్న మరువలేని
మమతలన్ని కలలేనా
రాణి వాసమేగేవా...
బావ మాట మరిచేవా ||ఔనా||
మనసులోన మరులు గొల్పి
కడకు మాయ మాయేనా
ప్రాణమున్న మల్లిపోయి
రాతి బొమ్మ మిగిలేనా ||ఔనా ||

ఆమె: ఔనా కలలేనా
నాటి కథలు వ్యధలేనా
నీటిపైన అలలేనా ||నాటి||
బావ నాకు కరువేనా
బ్రతుకు ఇంక బరువేనా ||బావ||
ఔనా కలలేనా
పగలు లేని రేయివోలె
పలుకలేని రాయివోలె
బరువు బ్రతుకు మిగిలేనా
వలపులన్ని కలలేనా ||ఔనా||

---

ఈపాటను సినిమాలో ఎన్.టిరామారావు, భానుమతి అభినయించారు. కథాపరంగా పాడుతున్న హీరోహీరోయిన్ల ఆవేదనకు అర్ధం ఒకటే అయినా దాన్నే 'ఔనా నిజమేనా' అంటూ హీరోచేత, 'ఔనా కలలేనా' అంటూ విరుద్ధంగా హీరోయిన్ చేతా పలికించటంలో గల ఔచిత్యం, దానికి సంబందించిన ప్రశంసలు అన్నీ దేవులపల్లివారికే చెందాలి. మోహన రాగాన్ని మెయిన్‌గా చేసుకుంటూ, రసానుగుణంగా అన్యస్వరాలు చేరుస్తూ జనరంజకంగా, భావస్ఫోరకంగా స్వరపరచటం ఒక విశేషం అయితే - ఏ రేంజ్‌లో నైనా పాడగల ఘంటసాలతో బేస్‌లోనూ, లిమిటెడ్ రేంజ్‌లో పాడగల భానుమతితో హైరేంజ్‌లోనూ ఈ పాటను పాడించడం మరో విశేషం.



పాట 6

ఆమె: మనసున మల్లెల మాలలూగెనె
కన్నుల వెన్నెల డోల లూగెనె
ఎంత హాయి ఈ రేయి నిండెనో ||ఎంత ||
ఎన్నినాళ్ళకీ బ్రతుకు పండెనో
కొమ్మల గువ్వలు గుసగుసమనినా
రెమ్మల గాలులు ఉసురుసురనినా
అలలు కొలనులో గలగల మనినా ||అలలు||
దవ్వుల వేణువు సవ్వడి వినినా ||దవ్వులు||
నీవు వచ్చేవని నీ పిలుపే విని ||నీవు||
కన్నుల నీరిడి కలయ చూచితిని
గడియ యేని ఇక విడిచిపోకుమా ||గడియ||
ఎగసిన హృదయము పగులనీకుమా
ఎన్నినాళ్ళకీ బ్రతుకు పండెనో
ఎంత హాయి ఈ రేయి నిండెనో

'మనసున మల్లెలు మాలలూగెనే' పాటను భానుమతి పాడగా తెరపై భానుమతి, రామారావు అభినయించారు. అనువణువునా దేవులపల్లి వారి ఆత్మను అక్షరరూపంలో చూపించే ఈ పాటకు ఆధార రాగం యమన్ కళ్యాణి. పల్లవి ఎక్కడా రిపీట్ కాకపోవటం ఈ పాట ప్రత్యేకత. ఇంకోరకంగా చెప్పాలంటే అసలు దీన్ని పాట అనలేం. పల్లవి లేదు, చరణాల విభజన లేదు. రాగపరంగా సాగిన ఈ భానుమతిపై ఎంతో మందికి ఎన్నోరకాల అభిప్రాయాలు ఉండవచ్చుగాక - గానీ ఈ పాట విషయానికొస్తే మాత్రం ఒకే అభిప్రాయానికి రాక తప్పదు. పడుకునే ముందు ఈ పాట పెట్టుకుంటే ఎప్పుడు నిద్రలోకి జారుకుంటామో తెలియనంతటి సుతిమెత్తటి అనుభూతిని, హాయిని అందించే పాట ఇది.

పాట 7

ఆమె: ఎందుకే నీ కింత తొందరా ||ఎందుకే ||
ఇన్నాళ్ళ చెరసాల ఈ రేయి తీరునే || ఎందుకే ||
ఓ చిలుక నా చిలుక ఓ రామచిలుకా
ఒయ్యారి చిలుక నా గారాల మొలక ||ఎందుకే||
బాధలన్నీ పాతగాథలైపోవునే ||బాధ ||
వంతలన్ని వెలుగు పుంతలో మాయునే ఎలాగొ ఒలాగు
ఈ రేయి దాటెనా... ఈ రేయి దాటెనా
ఈ పంజరపు బ్రతుకు ఇక నీకు తీరునే ||ఎందుకే ||
ఆ తోటఆ తోపు ఆకు పచ్చని గూడు
ఆ వంక ఆ తోపు ఆకు పచ్చని గూడు
ఆ వంక గొరవంక అన్ని ఉన్నాయిలే ||ఆ వంక ||
చిరుగాలి తరగలా
చిన్నారి పడవలా
పసరు రెక్కలు పరచి
పరువెత్తి పోదాము

సెమీక్లాసికల్ టచ్‌తో యస్.రాజేశ్వరరావు స్వరపరచిన ఈ చిత్రంలోని పాటలలో శాస్త్రీయతపాళ్ళు కొద్దిగా ఎక్కువగా ఉన్నా, జనమంతా పాడుకున్నపాట - ఎందుకే నీకింత తొందరా! ఈ పాటను భానుమతి పాడగా తెరపై భానుమతి, టి.జి.కమలాదేవి అభినయించారు. ఈ

పాట ఖమాసు రాగంపై ఆధారపడింది. ఈ రాగంలోని ప్రసిద్ధ కీర్తన - 'బ్రోచేవారెవరురా' పాట ఎప్పునా ఎక్కడైనా దొరికితే మళ్ళీ శ్రద్ధగా వినండి. మొదటి చరణం పూర్తయిన తర్వాత, రెండో చరణం ఎత్తుకోబోయే ముందు ఉన్న ఇంటర్లూడ్‌ని హృదయానికి బాగా పట్టించుకుంటే 'డాక్టర్ చక్రవర్తి' చిత్రంలోని 'పాడమని నన్నడగవలెనా పరవశించి పాడనా' పాటలో 'ఈ వీణ మ్రోగక ఆగినా నే పాడజాలక పోయినా' అనే లైను దగ్గర వచ్చే ఆలాపనతో పోల్చుకుని చూడండి - ఖమాసు రాగంలోని జీవస్వరాలన్నిటినీ కలగలుపుకుంటూ గుండెల్ని పిండెయ్యటంలో రాజేశ్వరరావు ఎంతటి ప్రజ్ఞావంతుడో తెలుస్తుంది.

చివరగా ఒక్కముక్కలో చెప్పాలంటే సినిమా పాటలకు సంఘంలో ఒక గౌరవప్రదమైన స్థాయిని, అనుసరణీయమైన ముద్రని కల్పించినది 'మల్లీశ్వరి' చిత్రంలోని పాటలే. అందుకే ఆ చిత్రం రిలీజయి 56 ఏళ్ళ పైనే అవుతున్నా ఈనాటికీ ఆ పాటల్ని, ఆ మధురానుభూతుల్ని హాయిగా నెమరు వేసుకుంటున్నాం.

*ఏదయినా ట్యూన్‌ని కాపీ చెయ్యమంటే సంగీత దర్శకుడు చక్రవర్తి చాలా బాధపడేవారు. వీలయినంతవరకూ నిర్మాతలకు నచ్చజెప్పి ఆ ప్రయత్నాన్ని విరమింపజేయడానికే చూసేవారు. 'పదహారేళ్ళ వయసు'లో 'సిరిమల్లె పువ్వా..' పాటకి తమిళంలో హిట్ ఐన 'సింధూర పూవై..' అనే పాటని యధాతథంగా తెలుగీయం చెయ్యమన్నారు చక్రవర్తిని. వేరే పాటను ప్రత్యేకంగా, బాగా చేస్తానని ఎంతగానో నచ్చజెప్పారు చక్రవర్తి. ఇంతలో ఢిల్లీ నుంచి వార్త వెలువడింది. అది విని అందరూ సంతోషించారు కానీ చక్రవర్తి మాత్రం ముఖం ముడుచుకున్నారు. ఇంతకీ వార్త ఏమిటంటే జాతీయ బహుమతికి గాను యస్.జానకి తమిళంలో పాడిన 'సింధూర పూవై..' పాటనే ఎంపిక చేశారట. ఇక పాటని తెలుగులోకి అనుకరించక తప్పదని తెలిసిపోయింది చక్రవర్తికి. "అసలా తమిళపాటని అంతబాగా ఎందుకు పాడేవు?" అని జానకితో అంటూ ఆయన నిస్సహాయతతో కూడిన బాధతో మధన పడ్డారుకూడా.. ఏది ఏమైనా చివరకు ఆ పాటను అనుకరించక తప్పలేదు.*

- రాజ



# ఆ పాత పాట మధురం
## రాజా



*జానపద చిత్రాన్ని 'క్లాసిక్స్' అనదగ్గ స్థాయిలో తెలుగువారికి సమర్పించిన దర్శకుడు కె.వి.రెడ్డి. అందరికి ఆదర్శప్రాయమైన నిర్మాతలు నాగిరెడ్డి - చక్రపాణి. కొంగ్రొత్త పదాలను సరళమైన తెలుగులో అందించిన కవి పింగళి నాగేంద్రరావు. వీరి కలయికతో అపూర్వ సృష్టిగా 1951 లో విడుదలైంది ఈచిత్రం..*

## విజయావారి పాతాళభైరవి



పల్లవి: తీయని ఊహలు హాయిని గొలిపే - వసంత గానమె హాయీ వసంత
నాట్యమె హాయ్‌హాయ్ ||తీయ||

ఇందు: చివురుల దాగి తీవెలనూగి-పూవులు ఘుమఘుమ నవ్వగా
వనియంతా పరిమళించెనే మనసెంతో - పరవశించెనె ||తీయ||

గిలిగింతలు చెరలాడి - చిరుగాలి సరాగము చేయగా
వనియంతా ఝుల్‌ఝులించెనే-తనువెంతో పులకరించెనే ||తీయ||

క్రొత్తరాగమున కుహూ, కుహూమని మత్తిలి కోయిల కూయగా
వనియంతా రవళించేనే - నన్నెంతో మురిపించెనే ||తీయ||

ఈ పాటను పి.లీల, బృందం పాడగా తెరపై మాలతి, చెలికత్తెలుగా నటించిన ఉపపాత్రధారులు కనిపిస్తారు. ఎన్.టి.ఆర్, బాలకృష్ణ కూడా అభినయించారు. మూడు చరణాలలోనూ పల్లవికి దోవ చూపేలా ఉపసంహారం కోసం 'వనియంతా'.. అని ఉపయోగించడం ఓ ప్రయోగం. అలాగే ఝుల్‌ఝులించటం, మత్తిలి ఇవన్నీ పింగళికి సొంతమైన ప్రయోగాలు. ఇక సంగీత పరంగా చెప్పాలంటే మూడు చరణాల్లోనూ రెండో పాదాల ట్యూన్ ఒకేలా ఉన్నా మొదటి పాదాల వరసల్ని డిఫరెంట్‌గా చేయటం, వీటికి ఈ రెండో పాదాల ట్యూన్ లింకు సరిపోయేలా ఉండటం సంగీత దర్శకుడు ఘంటసాలకి సంబంధించిన క్రెడిట్స్. మోహనరాగం ఈ పాటకు ఆధారం.

ఇందు: కలవరమాయే మదిలో-నా మదిలో -

కన్నులలోన కలలే ఆయే మనసే ప్రేమ మందిరమాయె

రాము: కలవరమాయే-మదిలో నా మదిలో

కన్నులలోన గారడి ఆయే మనసే పూల మంటపమాయె

||కల||

ఇందు: నాలో ఏమొ నవభావనగా-మెల్లన వీణ మ్రోగింది

అనురాగాలే-ఆలాపనగా మనసున కోయిల కూసే ||కల||

రాము: నాలో యేమొ నవరస రాగం-పిల్లనగ్రోవి ఊదిందీ

మోహాలేవో మోసులు వేసి-ఊహాగానము చేసి || కల||

ఇందు: కన్నులలోన కలలేఆయే-మనసే ప్రేమ మందిరమాయే

కలవరమాయే మదిలో నా మదిలో

రాము: కలవరమాయే మదిలో నా మదిలో

ఈ పాటను ఘంటసాల, పి.లీల ఆలపించగా ఎన్.టి.రామారావు, మాలతి అభినయించారు. అతి క్లుప్తంగా ఉండే పల్లవులు, చిన్ని చిన్ని చరణాలు ఈ పాట ప్రత్యేకత. ఇంటర్లూడ్‌లతో సహా వింటే ఓ పెద్ద పాటలా అనిపిస్తుందేమో కానీ రాసుకుని చూస్తే ఈ పాటలో అర్థంకాని పదం ఏదైనా ఉంది అని ఎవరైనా అంటే వారిని తెలుగురాని వారుగా జమకట్టక తప్పదు. కలవరమాయె మదిలో అనే ఎక్స్‌ప్రెషన్ ఎంతగా ప్రజల్లో చొచ్చుకుపోయిందంటే తర్వాత వచ్చిన ఎన్నో కథలకు టైటిల్స్‌గా, ఒక్కోసారి ప్యారడీ టైటిల్స్‌గా, మరి కొన్నిసార్లు సన్నివేశాలకు సహకరించే డైలాగ్‌గా ఉపయోగపడుతూ ఈ నాటికీ సజీవంగా ఉంది. ట్యూన్ పరంగా చూసుకుంటే చరణాల్లో - మెల్లగా వీణ మోగింది అనే వాక్యం తర్వాత ఫ్లూట్ బిట్‌ని ఉపయోగించటం చాలా బావుంది అని అంటే ఇవాళ కొందరికి అంత గొప్పగా అనిపించపోవచ్చుగానీ ఒక పక్క హీరోయిన్ పైట అందాల గురించి హీరో పాడాలని కవిగారు రాయగా పాటకూడా రికార్డు చేశాక ఆ హీరోయిన్ జీన్స్ ఫాంటు, షర్ట్ వేసుకుని ఉండడంతో పోలిస్తే నిజంగా ఆ రోజుల్లో ఎంత ప్లాన్డ్‌గా ఉండేవారో అని అనుకోకుండా ఉండలేం కదా!?

---

ఇందు: ఎంత ఘాటు ప్రేమయో ఎంత తీవ్ర వీక్షణమో ||ఎంత||

కన్నకాటు తిన్నదిగ కళలు విరిసెనే

నా...మనసు మురిసెనే-ఎంత ఘాటు ప్రేమయో

రాము: ఎంత లేత వలపులో ఎంత చాటు మోహములో ||ఎంత||

కన్నులలో కనినంతనే తెలిసిపోయెనే-నా మనసు నిలిచెనే

ఇందు: ఈ జాబిలి ఈ వెన్నెల ఈ మలయానిలమూ ||ఎంత||

విరహములో వివరాలను విప్పిచెప్పెనే

రాము: ఓ జాబిలి ఓ వెన్నెల ఓ మలయానిలమా

ప్రియురాలికి విరహాగ్నిని పెంపుజేయరే ||ఎంత||

తమ మనోభావాలను ప్రతిఫలింపజేసుకుని చూసుకునే అపురూపగీతంగా 'ఎంత ఘాటు ప్రేమయో' పాటను చెప్పుకోవాలి. తెరపై మాలతి, ఎన్.టి.రామారావు అభినయించిన ఈ పాటను పి.లీలతో కలిసి స్వీయ సంగీత దర్శకత్వంలో శ్రోతల హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయేలా పాడారు ఘంటసాల. హిందూస్థానీ సంప్రదాయానికి చెందిన 'రాగశ్రీ' అనే రాగాన్ని ఈ పాటను స్వరపరచటానికి ఉపయోగించారాయన. అందుకు సంబంధించిన ఓ సంఘటన ఇక్కడ ఉదహరించాలి.

1948లో ఓ ప్రముఖ హిందూస్థానీ విద్వాంసుడు బడేగులాం ఆలీఖాన్ మద్రాసుకి వచ్చి సంగీత కచ్చేరి ఇవ్వడం జరిగింది. ఆ ప్రదర్శనను మద్రాసు మ్యూజిక్ అకాడమీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరయిన ప్రసిద్ధ విద్వాంసులు జి.యన్.బాలసుబ్రహ్మణ్యం ఈయన పేరుని ప్రతిపాదించగానే పరమ నిష్ఠాగరిష్ఠులైన కొందరు కర్ణాటక సంగీత విద్వాంసుల తరపు నుండీ తీవ్ర నిరసన వ్యక్తం అయ్యింది.

'ఒక్కసారి విని చూడండి. ఆ తర్వాత-మీకే తెలుస్తుంది' అని అందర్నీ సమాధానపరచి బడేగులాం ఆలీఖాన్‌ని రప్పించారు. ఆ సంగీత ప్రదర్శనకు వచ్చిన వారంతా తన్మయత్వంలో మునిగిపోయారు. మర్నాడు ఉదయం ఏనోట విన్నా బడే గులాం ఆలీఖాన్ గురించే.....

ఆ ఊపులో ఒక్క మద్రాసులోనే 30 నుండి 40 సంగీత ప్రదర్శనలిచ్చారు బడే గులాం ఆలీఖాన్. ఆ తర్వాత మొత్తం దక్షిణాదిని తన స్వరసామ్రాజ్యంలో లీనం చేసుకోగలిగారాయన. ఆ ప్రభావంలో పడిన వారిలో ఘంటసాల కూడా ఒకరు. బడే గులాం ఆలీఖాన్‌ని తన ఇంటికి ఆహ్వానించి రెండు రోజులపాటు ఆతిథ్యం ఇచ్చి ఎన్నో హిందుస్తానీ రాగాలను ఆకళింపు చేసుకున్నారు. ఆయనతో తీయించుకున్న ఫోటోలు ఘంటసాల వారింట్లో ఇప్పటికీ ఉంటాయి. ఈ పాటకు 'రాగశ్రీ' రాగాన్ని ఉపయోగించడంలో ఘంటసాలపై బడే గులాం ఆలీఖాన్ వలన పొందిన సాంగత్య ప్రభావం ఉందంటారు కొంతమంది.

ఘాటు ప్రేమ, చాటు మోహం, తీవ్రవీక్షణం, కన్నుకాటు, ఇవన్నీ పింగళి వారి సాహితీ క్షేత్రంలో అలవోకగా మొలకెత్తి ఎందరో రసజ్ఞుల హృదయాలను పులకింతలతో నింపిన 'పదకావ్యాలు'. ముఖ్యంగా ప్రేమకు ఘాటుని అన్వయించటం ఓ మహత్తర ప్రయోగం. శ్రీశ్రీ అంతటి మహాకవి కూడా 'ఎంతఘాటు ప్రేమయో ఇంత లేటు వయసులో' అంటూ (నవరాత్రిలో) పేరడీ చేసేటంత గాఢంగా ముద్ర వేసుకుందా ప్రయోగం. ఆ తరువాత 'అత్తగారు-కొత్తకోడలు' చిత్రంలో 'ఘాటు ఘాటు ప్రేమ నగుబాటులాయెనే' అంటూ మరో పాట వచ్చినా, ప్రేమ గురించి ఎవరైనా మాట్లాడితే 'అంత ఘాటు ప్రేమా మీది?' అనే ప్రశ్న వ్యావహారికంలోకి వచ్చేసినా దానికి తొలిప్రేరణ 'పాతాళభైరవి' లోని ఈ పాటేనని ఘంటాపథంగా చెప్పొచ్చు.

---

వినవే బాల నా ప్రేమ గోల-నిను కనువేళా నిలువగ జాలా ||వినవే||
గుబుల్ గుబుల్‌గా-గుండెల దడగా
దిగుల్ దిగుల్‌గా యిదియిదిగా ||వినవే||
చిరునవ్వు చాలే-చిత్తయిపోతానే
మురిపిస్తే చాలే - మూర్ఛపోతానే ||వినవే||

జోడిగూడి తోడి రాగం పాడుకుంటూ మేడమీద
పైడిబంగార్-తూగుటుయ్యాల్ వేడుకలరా
ఊగరావా ఊగరావా ఊగరావా ఊగరావా
చెట్టాపట్టేల్ జడకోలాటం తొక్కుడు బిళ్ళా ఆడే నాతో
తొక్కుడుబిళ్ళా ఆడే నాతో...ఆడేనాతో...ఆడేనాతో

ఈ పాటను రేలంగి, మాలతి, ఎన్.టి.రామారావు బాలకృష్ణపై చిత్రీకరించారు. రేలంగే ఈ పాటను పాడటం జరిగింది. ఆయనకు ఆయనే పాడుకున్నాడు కనుక ఆయన పేరుని ఆనాడు నేపథ్యగాయనీ గాయకుల టైటిల్ కార్డులలో పేర్కొనలేదు. ఒక్క ఆయన పేరు మాత్రమే కాదు 'ఇతిహాసం విన్నారా' పాటను పాడిన టి.జి.కమల పేరు, 'ప్రేమకోసమై' పాటను పాడిన వి.జె.వర్మ పేరు. ఇంకా మనకు తెలిసిన చాలామంది పేర్లు టైటిల్స్‌లో లేకపోవటం గమనించవచ్చు. గుబుల్/దిగుల్/పైడిబంగార్/తూగుటుయ్యాల్/చెట్టాపట్టేల్ వంటి పొల్లులతో పొల్లు పోని హాస్యం అందించారు పింగళి. విజయా వారి వద్ద హెమండ్ ఆర్గన్ వంటి కొన్ని వాద్యాలుండేవి. వాటిని ఒక్క మాస్టర్ వేణు మాత్రమే వాయించేవారు. ఈ 'వినవేబాలా' పాటలో 'హుప్ హుప్' అని రేలంగి అన్న తర్వాత వచ్చే 'తొక్కుడు బిళ్ళా ఆడే నాతో' దగ్గర వినిపించే వాద్య సంగీతం (తెరపై పాము రావటం కనిపిస్తూ ఉంటుంది) వేణు వాయించినట్టుగా అనిపిస్తుంది. టైటిల్స్‌లో జాగ్రత్తగా గమనిస్తే ఆర్కెస్ట్రా నిర్వాహకుడిగా మాస్టర్ వేణు పేరుని మనం ఇప్పుడు కూడా గమనించవచ్చు.

---

వగలోయ్ వగలు తళుకు బెళుకు వగలూ
బావలూ మామలూ బావలు మావలు బావలూ
లాలలూ లాలలూ లాలలు లాలలు లాలలు
చింగారీ వీదెంట మావ రంగేళి పిల్లంట బావ
కొంగు తాకిందంటే... హేయ్..కుయ్ కుయ్ కుయిలే ||లాలలూ||

నీ వెంట వస్తాను-ఆ నీ జంట ఉంటాను-ఏం || నీవెంట ||
సైయంటే బావా ఉ అంటె మావా
చెలియనీ, భళియనీ, సరేయనీ, చెలామణి
నావెంట మీరంతా, గుమిగుమి, గుమిలే
లలలూ, లలలూ, లలలు, లలలు, లలలూ
వగలోయ్ వగలు, తళుకు బెళుకు వగలూ

ఈ పాటను జిక్కీ, బృందం పాడగా తెరపై ప్రధాన నృత్యకారిణిగా లక్ష్మీకాంత కనిపిస్తుంది. యస్వీ రంగారావు, యన్.టి.రామారావు, పద్మనాభం, బాలకృష్ణ, వల్లం నరసింహారావు మొదలైన వారందరూ సన్నివేశంలో కనిపిస్తారు. 'చెలియని/భళియని/సరేయని/చెలామణి-కుయ్ కుయ్ కుయిలే/గుమిగుమిలే' ఇవన్నీ పింగళి పాళీ కేళీలు. ఇక సంగీతపరంగా చెప్పాలంటే - 1948లో 'ది లవ్స్ ఆఫ్ కార్మెన్' అనే చిత్రం విడుదలయింది. ఆ చిత్రంలో రీటా హేవర్త్ హీరోయిన్, ఆమె జిప్సీ డాన్స్ చేస్తూ అభినయించిన 'లలలూ లలలూ' అనే గీతం 'ఈ వగలోయ్ వగలు'కి ప్రేరణ. ఈ పాటలో 'తళుకు' అని వచ్చినప్పుడల్లా జిక్కి 'థళుకు' అని పలకటం వల్ల 'తళుకు'కి అందమైన ఒత్తిడి ఊపు వచ్చాయి. జిక్కి అసలు పేరు కృష్ణవేణి. అందుకే టైటిల్స్‌లో 'కృష్ణవేణి' అంటూ బ్రేకెట్లో జిక్కి అని కూడా ఉంచారు. ఇదిలా ఉండగా విజయావారు 'భైరవ ద్వీపం' సినిమాను తీసినప్పుడు యస్.జానకి చేత పాడించిన 'నరుడా ఓ నరుడా ఏమి కోరికా' అనే పాటను సంగీత దర్శకుడు మాధవ పెద్ది సురేష్ అటు ఆ 'లవ్స్ ఆఫ్ కామెన్'లోని 'లలలూ లలలూ' పాటని ఇటు ఈ 'వగలోయ్ వగలు' పాటని కలిపి ఇన్స్పిరేషన్‌గా తీసుకున్నాడు. దొరికితే ఈ రెండు పాటల్నీ మార్చి మార్చి విని చూడండి పోలిక తెలుస్తుంది.

---

ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడు....
అయ్యో పాపం పసివాడు
వేమరు దేవుల వేడుకుని తన కొమరుని క్షేమం కోరుకుని
ఏమైనాడో-ఏమౌనోయని కుమిలే తల్లిని కుములుమనీ || ప్రేమ||

ప్రేమకన్ననూ పెన్నిధియేమని యేమిధనాలిక తెచ్చుననీ
భ్రమసి చూచు ఆ రాజకుమారిని
నిముసమె యుగముగా గడుపుమనీ || ప్రేమ ||
ప్రేమలు దక్కని బ్రతుకేలాయని ఆ మాయావిని నమ్ముకుని
ఏమివ్రాసెనో...అటు కానిమ్మని బ్రహ్మదేవునిదే భారమనీ || ప్రేమ ||

ఈ పాటను వి.జె.వర్మ పాడగా మధ్యన ఒక ఆలాపనతో ఘంటసాల తన గొంతును కలిపారు. ఎన్.టి.రామారావు, యస్వీ.రంగారావు, సురభి కమల, మాలతిపై చిత్రీకరించారు. సిందుభైరవి రాగచ్ఛాయలలో ఈ పాటను స్వరపరిచారు ఘంటసాల. పాటల రచయితగా ఈ పాట ద్వారా పింగళి సాధించిన విజయం చాలా ఉంది. 'ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడు' అనే వాక్యం ఒక సామెతలా తెలుగునాట ఈ నాటికి చెలామణిలో ఉందంటేనే ఆలోచించుకోవచ్చు - ఆ విజయం ఎంతటిదో!? వాసిగల వాక్యానికి వార్ధక్యం ఉండదంటారు... బహుశా ఇదేనేమో!! ఈ పాటను పాడింది వి.జె.వర్మ అని చాలామందికి తెలియదు. ఈ పాట మొత్తం ఘంటసాలే పాడారనుకునే వాళ్ళయితే లెక్కేలేదు.

---

ఈ పాటలే కాక 'పాతాళభైరవి'లో ఎన్నదగిన పాటలు ఇంకా ఉన్నాయి. కాకపోతే ప్రజాదరణతో పోలిస్తే పైన ఉదహరించిన పాటలకే ప్రాచుర్యం ఎక్కువ. తెలుగు సినీ చరిత్రలో ఎన్నో సినిమాలను తిరిగి నిర్మించడం జరిగింది. పాతాళభైరవికి నకలుగా చాలా సినిమాలు రిపీట్ అయ్యాయి కానీ మళ్ళీ 'పాతాళభైరవి'ని తెలుగులో తీయలేక పోయారంటే కారణం అంతటి ప్రామాణికత దాదాపు అసంభవం కనుక...!





# ఆ పాత పాట మధురం

## రాజా



చిత్రంలోని కథ, నటీనటులు మొదలైన వాటికి ఎంతటి ప్రాధాన్యతనీయాలో సంగీత సాహిత్యాలకు కూడా అంతే విలువనిచ్చే విజయా సంస్థ నుంచి వెలువడిన సంపూర్ణ హాస్య చిత్రం.

### పెళ్ళి చేసి చూడు

ఈ చిత్రం 1952లో విడుదలయింది. ఎన్.టి.రామారావు, జి.వరలక్ష్మి హీరోహీరోయిన్లు కాగా సావిత్రి సెకండ్ హీరోయిన్ పాత్ర ధరించింది. ఈ చిత్రం యస్వీరంగారావుకు మరింత పేరు తెచ్చింది. 'దూపాటి వియన్న'గా ఆయన స్థానాన్ని మరింత పటిష్టం చేసింది. ఒక్క రంగారావే కాదు రామారావు, జి.వరలక్ష్మి అప్పట్లో హాస్యనటుడుగా మంచి పేరున్న జోగారావు, సావిత్రి, డా. శివరామకృష్ణయ్య, మహంకాళి వెంకయ్య మొదలైన వారంతా ఈ చిత్రాన్ని సంపూర్ణ హాస్య భరితంగా తీర్చిదిద్దారు. ఈ చిత్రంలో బాలనటుడిగా నటించిన కందా మోహన్ 'మోహన్ కందా'గా ఐ.ఏ.యస్. ఆఫీసరై చాలా ఉన్నత పదవులను నిర్వహించారు. యల్వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ 'పెళ్ళి చేసి చూడు' చిత్రానికి సంగీతం ఘంటసాల. పాటలను పింగళి నాగేంద్రరావు, ఊటుకూరి సత్యనారాయణ వ్రాశారు. అసలు 'పెళ్ళి చేసి చూడు' అని ఎవరైనా అంటే చటుక్కని స్ఫురించే పాటలివి:

ఓ... భావి భారత భాగ్య విధాతలారా
యువతీ యువకులారా
స్వానుభవమున చాటు సందేశమిదే
వారెవ్వా...
తాదిన్న తకదిన్న తాంగిటకతక తరికిటకతోం
పెళ్ళి చేసుకుని ఇల్లు చూసుకుని
చల్లగ కాలం గడపాలోయ్

ఎల్లరి సుఖము చూడాలోయ్
మీరెల్లరు హాయిగ ఉండాలోయ్
కట్నాల మోజులో మనజీవితాలనే బలిచేసి
కాపురములు కూల్చు ఘనులకు శాస్తి కాగా
'పట్నాల పల్లెల దేశదేశాల
మనపేరు చెప్పుకుని
ప్రజలు సుఖపడగా

తాధిన్న తక్ధిన్న తాంగిటకతక తరికిట కతోం
ఇంటా బయటా జంట కవులవలె
అంటుకు తిరగాలోయ్... తరంపం..... ||ఇంటా||
కంటి పాపలై దంపతులెపుడు
చంటి పాపలను సాకాలోయ్ ||కంటి || ||పెళ్ళి ||
నవ భావములా నవరాగములా
నవ జీవనమే నడపాలోయ్
భావ కవుల వలె ఎవరికి తెలియని
ఏవో పాటలు పాడాలోయ్ ||భావి|| ||పెళ్ళి ||

ఇవ్వదలచుకున్న సందేశాన్ని వ్యంగ్యంతో ముడిపెట్టి అతి చతురంగా చెప్పడంలో పింగళి వారి పాళీకున్న శక్తిని తెలిపే పాటలలో ప్రథమ స్థానం ఇవ్వదగ్గ పాట ఇది. 'ఇంటా బయటా జంటకవులవలె అంటుకు తిరగాలోయ్', 'భావ కవుల వలె ఎవరికి తెలియని ఏవో పాటలు పాడాలోయ్', వంటి వాక్యాలు మచ్చుకి ఓ రెండు మెచ్చు తునకులు. కళ్యాణి రాగం ప్రధానంగా సాగిన ఈ పాటను ఘంటసాల ఆలపించగా ఎన్.టి.రామారావుతో పాటు జోగారావు, మాస్టర్ కుందు, జి.వరలక్ష్మి, బాలకృష్ణ అభినయించారు. కళ్యాణి రాగంలో ఘంటసాల చేసిన పాటలు ఒకటా... రెండో.. ఎన్నో... రావే నా చెలియా, తలనిండ పూదండ దాల్చిన రాణి, బహుదూరపు బాటసారీ ఇటురావో ఒక్కసారి, నా సరిసీవని నీ గురినేనని, విరిసె చల్లని వెన్నెలవంటి పాటలు అందులో కొన్ని... వీటన్నిటితో పోలుస్తూ 'పెళ్ళి చేసుకుని ఇల్లు చూసుకుని' పాటకు లభించిన జనాదరణ, ఈనాటికి నిత్యనూతనంగా ఉన్న ఆ నాటి ఆ వరుస - ఇవన్నీ ఒక్కసారి పునశ్చరణ చేసుకుంటే ఘంటసాల పట్ల గౌరవం ఎన్నింతలుగా పెరుగుతుందో వర్ణించలేం.

---

ఓ... మనసులోని మనసా...ఆ ...ఆ
ఏమిటే నీ రభస
ఏమిటే నీ రభస నా మనసులోని మనసా ||2 ||
ఇల్లలికిన పండుగనటే ఒళ్ళు తెలిసి మెలగరటే
పాలు గాచి చేజేతుల ఒలకబోసుకుందురటే ||2|| ||ఏమిటే||
హద్దు పద్దు లేకుండా పెద్దలతో ఆటలటే ||2||
శాణతనము చాలింపుము జాణవులే నెరజాణవులే ||2|| ||ఏమిటే ||

ఈ పాటను ఘంటసాల పాడగా ఎన్.టి.రామారావు, జి. వరలక్ష్మి పై చిత్రీకరించారు. డాక్టర్ శివరామకృష్ణయ్య, బాలకృష్ణ కూడా పాటలో కనిపిస్తారు. హీరో హీరోయిన్లకు పెళ్ళి జరిగినా కాపురం చేసే అదృష్టం ఉండదు. కథానాయకుడు పిచ్చివానిలా నటిస్తే అతన్ని నయం చేసే నర్సుగా కథానాయక అతని ఇంట్లో ప్రవేశిస్తుంది. అతని తండ్రి మెప్పుని సంపాదించుకుంటుంది. ఆ విషయాన్నే కథానాయకుడు - 'పెళ్ళి చేసుకోగానే సరిపోతుందా కాపురం చెయ్యొద్దూ' అనే అర్థంలో 'పాలుగాచి చేజేతుల ఒలకపోసుకుందురటే' అని మొదటి చరణంలోనూ 'ఈ నాటకం సంగతి తెలిస్తే ఏం అవుతుంది...? ఈ అధోగతి మనకు తప్పుతుంది అయినా మీ మామగారిని (మానాన్నగారిని) అలా మోసం చెయ్యొచ్చా... తప్పు కదూ... హన్నా' అనే చిలిపి ధోరణి రెండవ, మూడవ చరణాలలోను ఉండేట్టు రాశారు పింగళి. ఇంత వివరణ ఎందుకంటే పాటల రచయితకి కథ పూర్తిగా తెలిసుండడం ఎంత ముఖ్యమో ఈ పాట ద్వారా మరోసారి తెలుసుకోవాలని పాట చివరలో వచ్చే 'శాణతనం' పింగళివారి పనితనం.

గాయకుడి గానే కాక సంగీత దర్శకుడిగా కూడా ఘంటసాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి ఈ పాటలో. ఈ పాటకు ఆయన హరికాంభోజి రాగాన్ని ఆధారంగా తీసుకున్నారు. 'అందరికోసం హరికాంభోజిలో లేని 'కాకలి నిషాద' స్వరాన్ని కూడా ప్రయోగించారు.' అని ప్రముఖ లలిత సంగీత విద్వాంసులు శ్రీ ఎం.చిత్తరంజన్ తెలిపారు. శాస్త్రీయ రాగాల్ని లలిత సంగీతంలో ఉపయోగించేటప్పుడు రస, భావాలకోసం అన్య స్వరాలను చేర్చటం 1940 ప్రాంతాలలో మొదలయింది. దానికి ఇంచుమించుగా యస్. రాజేశ్వరరావే ఆద్యుడు. ఆ తరువాత సి.ఆర్.సుబ్బరామన్, ఘంటసాల, మొదలైన వారంతా ఆ ఒరవడిని కొనసాగించారు. ఈ 'మనసులోని మనసా ఏమిటే నీ రభసా' పాటతో పాటు ఆ రోజుల్లో వచ్చిన పాటల్ని వరుసగా పెట్టుకుని వినగలిస్తే ఈ అనుభవం

అవగాహనలోకి వస్తుంది. ఈ పాట నడక, ఇంటర్లూడ్‌లు అన్నీ బాగా గమనిస్తే ఘంటసాల ప్రఖ్యాత గీతం 'మరువలేనురా నిన్ను నేను మరువలేనురా ఓ పంచదార వంటి పోలీసెంకటసామి నిను నేను మరువలేనురా' అనే పాట జ్ఞప్తికి వస్తుంది. మనసులోని మనసా, పంచదార వంటి పోలీసెంకటసామి పాటలు దొరుకుతాయి కనుక ఒకదాని తర్వాత ఒకటి విని చూడండి. రెండింటికీ ఎంత పోలిక ఉందో తెలుస్తుంది.

---

ఏడు కొండల వాడ వెంకటారమణా
సద్దు సేయక నువు నిదురపోవయ్యా
పాల సంద్రపుటలలు పట్టెమంచముగా
పున్నమి వెన్నెలలు పూలపానుపుగా
కనులనొలికే వలపు పన్నీటి జల్లుగా
అన్ని అమరించెనీ అలిమేలు మంగా ||ఏడు||

మా పాలి దైవమని నమ్ముకున్నామయ్య
నా భాగ్యదేవతా నను మరువకయ్య
బీబీ నాంచారమ్మ పొంచి ఉన్నాదయ్య
చాటు చేసుకు ఎటులో చెంతచేరెదనయ్య
ఏడు కొండల వాడ వెంకటారమణా
సద్దు శాయక...దొంగా....నిదురపోవయ్య

ఈ పాటను పి.లీల పాడగా జి.వరలక్ష్మి అభినయించారు. చక్రవాక రాగానికి సంబంధించినంత వరకూ మన తెలుగు సినిమాల్లో పాటల సంఖ్య తక్కువే అని చెప్పాలి. చక్రవాక రాగం అనగానే బాలమురళీ పాడిన 'పిబరే రామరసం'గా 'పడమటి సంధ్యారాగం' సినిమాలో ఉపయోగించినా - అంతకు ముందు అదే పద్ధతిలో 'జగమే రామమయం' పాటగా కథానాయిక మొల్ల' చిత్రంలోనూ, 'రాధకు నీవేరా ప్రాణం' పాటగా 'తులాభారం' చిత్రంలోనూ ఉపయోగించి చక్రవాక రాగానికి కొన్ని ఉదాహరణలుగా చేర్చదగ్గ ప్రయత్నాలు జరిగినా... అవన్నీ "ఏడుకొండలవాడ వెంకట రమణా" పాట చేరుకున్న స్థాయి అందుకోలేక పోయాయి.

ఈ పాటలో గమనించ దగ్గ విషయం మరొకటుంది. అది 'సద్దు శాయక' అనే ప్రయోగం. ఇది పూర్తిగా పింగళి వారు మాత్రమే చేసే ప్రయత్నం 'పాతాళభైరవి' చిత్రంలో 'సాహసం శాయరా' అనే డైలాగ్‌ను, 'గుండమ్మ కథ' చిత్రంలో 'ప్రేమయాత్రలకు బృందావనము' పాటలో 'సేవలు శాయవలెరా' అంటూ రాశారు.

---

ఎవరో ఎవరో
ఈ నవ నాటక సూత్రధారులు
ఎవరో.. ఎవరో
ఎవరా... ఎవరా
మంచి వారు మా మావగారిని
వంచన చేసిన వారెవరో వారే ఆ
మనవులుగా అమాయక చూపుల
మనసును లాగిన దెవరో ||2||

నిను విడజాల నీదాన నేనని
నను నిలవేసిన దెవరో
ఎవరో వారే
ఆ : ప్రియ సఖిపై గల ప్రేమను చాటి
భయమును విడిచినదెవరో ||2||
న్యాయవాది అన్యాయవాదిఅయి
మాయలు నేర్చినదెవరో
ఎవరోవారే

అ: హృదయములో విశాల భావము
ఉదయము జేసినదెవరో ||2||
ఆ : చదువుల సారం సంసారమునకే
పదిలము చేసినదెవరో
ఎవరో వారే
అ: వారే వీరు
ఆ: వీరే వారు
ఇద్దరు: వారే వీరు.

ఈ పాటను ఘంటసాల, లీల పాడగా ఎన్.టి.రామారావు, జి.వరలక్ష్మి అభినయించారు. ఈ పాటలో కూడా సాహిత్యాన్ని గమనిస్తే కథ అర్థం అయిపోతుంది. సాధారణంగా మనం విన్నపం, విజ్ఞాపన మొదలైన వాటికి బహువచనాలుగా విన్నపాలు, విజ్ఞాపనలు అంటూ వాడతాం. కానీ 'మనవి' అనే మాటకి బహువచనాన్ని ప్రయోగించం, 'మనవులుగా' అంటూ మొదటి చరణంలో పింగళి చేసిన ప్రయోగాన్ని ఈ సందర్భంగా గుర్తించాలి మనం. అలాగే 'ఉదయము జేసిన దెవరో' ప్రయోగం కూడా పింగళివారి శైలిని పట్టి ఇచ్చేదిగా కనిపిస్తుంది.

ఈ పాటకు చారుకేశి రాగం ఆధార రాగం. ట్యూనుని ఒకటి రెండుసార్లు బాగా విని ఆ రాగాన్ని మననం చేసుకుంటే 'రాజమకుటం' సినిమాలోని 'ఊరేది పేరేది ఓ చందమామ' అనే పాట మనకి స్ఫురిస్తాయి. ఈ రెండు పాటలకు స్వరకర్త మాస్టర్ వేణు. ఆయన శైలి ఈ 'ఎవరో ఎవరో' పాట చాలా వరకు ప్రతిబింబిస్తూ ఉంటుది. 'పెళ్ళి చేసి చూడు' సినిమా టీవీలో గానీ, థియేటర్‌లో గానీ వస్తే (ఆ ఛాన్సు తక్కువ) చూడండి లేదా వీహెచ్‌యస్ క్యాసెట్‌లో గాని (ఇవి మార్కెట్లో ఉన్నాయి) చూడండి. 'ఆర్కెస్ట్రా వేణు' అని టైటిల్స్‌లో ఉంటుంది.

ఇవి గాక 'పెళ్ళి చేసి చూడు' లో ఎన్నదగిన పాటలు ఇంకా ఉన్నాయి. సంగీత పరంగా చెప్పుకోవలసిన మరో ముఖ్య విశేషం ఏమిటంటే ఈ సినిమాలో 'ఏడవకు ఏడవకు వెర్రి పాపాయి నను పాలడగమోకోయ్ దొరల బాబాయి! దొరల తాతాయి' అనే పాటను పామర్తి పాడేరు. (తరువాత ఆయన కూడా సంగీత దర్శకునిగా పేరు తెచ్చుకున్నారు.) అయితే గాయనీ గాయకుల లిస్ట్‌లో ఆయన పేరు లేదు.

---

*మంచి సంగీతం,హుందాగా ఉండే చక్కని హాస్యం కోరుకునే వారిని ఈ నాటికీ అలరించే చిత్రం - 'పెళ్ళి చేసి చూడు'.*



# ఆ పాత పాట మధురం

## రాజా




Devadasu / Devadas (1953)

# దేవదాసు



*తెలుగు సినీ పరిశ్రమనే కాక యావద్భారత చలనచిత్ర రంగాన్నీ ఒక్కసారిగా తనవైపు చూసేట్టు చేసుకున్న చిత్రం దేవదాసు - ఈ చిత్రానికి సంగీతం సి.ఆర్.సుబ్బరామన్ అందించారు. అక్కినేని - సావిత్రి నట జీవితంలోను, ఘంటసాల - సముద్రాల (సీనియర్) సంగీత సాహిత్య జైత్రయాత్రలోను అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ చిత్రం 1953లో విడుదలయింది. ఈ చిత్రం సంకల్పించినప్పటి నుంచీ కురిసిన విమర్శల వర్షం విడుదలయిన తరువాత ప్రశంసల వెల్లువగా మారిపోయింది. అంతటి ప్రాభవాన్ని సంతరించుకోవడానికి గల కారణాలలో వేరులా నిలిచిన సంగీత సాహిత్యాల పాత్రను వేరుచేసి చూడలేం. చిత్రంలో గల పాటలలో కొన్నింటి గురించి ఈ సారి:*

పల్లెకు పోదాం పారుని చూద్దాం చలో చలో ||పల్లెకు||
అల్లరి చేద్దాం చలో చలో ||పల్లెకు||
ప్రొద్దువాలే ముందుగానే ముంగిట వాలేము ||ప్రొ||
||పల్లెకు||
ఆటా పాటలందు కవ్వించు కొంటె కోణంగి ||ఆటపాట||
మనసేమో, మక్కువేమో
మనసేమో మక్కువేమో
నగవేమో వగేమో
కనులారా చూతుము ||పల్లెకు||
నన్ను చూడగానె చిననాటి చనువు చూపెనో ||నన్ను||
నా దరికి దూకునో
తా నలిగి పోవునో ఏమౌనో చూతుము ||పల్లెకు||

ఈ పాటను ఘంటసాల పాడగా అక్కినేని నాగేశ్వరరావు ప్రధాన పాత్రధారిగా అభినయించారు. చరణాల మధ్య ఇంటర్లూడ్స్ వింటుంటే ఒక వెస్టర్న్ ఆర్కెస్ట్రా పీస్ వింటున్నట్టు ఉంటుంది. ఈ నాటికీ నవీనంగా ఉండటమే ఈ పాట ప్రత్యేకత. స్వరపరంగా చూసుకుంటే ఇది కార్డ్ కాంపోజిషన్. ఘంటసాల గళానికున్న రేంజ్‌ని, సొగసుగా లబ్బుగా వినిపించే నాసికా ధ్వనిని అతి అందంగా వాడుకున్న పాట ఇది. 'ఆటా పాటలందు కవ్వించు కోణంగి / నన్ను చూడగానే చిననాటి చనువు చూపెను' అనే వాక్యాలు ఏ రేంజ్‌కయినా ఆ రేంజ్‌కయినా అరేంజ్ అవుతూ మాధుర్యాన్ని కోల్పోని ఆయన స్వరపటిమను తెలియచేస్తే - 'నా దరికిదూకునో / తానలిగిపోవునో 'వాక్యాలలోని 'నో' అనే అక్షరాలు ఆయనలో ప్రత్యేకంగా గల 'నాసికాధ్వని సౌందర్యానికి' అద్దం పడతాయి.

---

ఓహోహో ఓహోహో ఓహో
అ: ఓఓదేవదా
అ:ఓ ఓ పార్వతి
ఆ: చదువు ఇదేనా, మనవాసి ఒదిలేసి
అసలు దొరల్లె సూటూ బూటా? ||ఓ ఓ దేవదా ||
అ: పల్లెటూరి పిల్లకు కులుకు హెచ్చిందె
బదులు పల్కటము పట్టు బడిందె ||పల్లెటూరి||
పసికూన సిసలైన జాణా అయ్యిందె బాగోబాగు ||పసికూన||ఓఓ
పార్వతి||
ఆ:తీరు మారినా, ఊరు మారినా తమరు
ఎన్నిటికి పసివారేనా ||ఉన్నతీరు||

అ: అలనాటి కలలన్నీ వెలుగులయ్యేనా
నిజమయ్యేనా ||అలనాటి|| ||ఓ పార్వతి||
ఆ: నా ఎదుటే నీ బడాయి
అ: జీవితమే ఓ లడాయి
ఆ:లడాయిలా సరే మనకు జిలాయిలోయి, జిలాయిలోయ్
లడాయిలా సరే మనకు జిలాయిలోయి, జిలాయిలోయ్
అ:ఆనాడు, ఈనాడు ఒకటేమాట, ఉడుకుమోతా ||ఆనాడు ||
అ: ఓఓపిరికి పార్వతి
ఆ: ఓఓ దుడుకు దేవదా

ఈ పాటను ఘంటసాల, జిక్కీ పాడగామొట్టమొదట 'ఓ హో హో ఓహో' అంటూ వచ్చే ఆలాపన కె.రాణిది. యమన్ రాగచ్ఛాయలతో సాగిన ఈ పాట చరణాల ముందు వచ్చే ఇంటర్లూడ్‌లలో వినిపించే హవాయిన్ గిటార్ నేరుగా మనసునే మీటినంత హాయిగా ఉంటుంది. ఈ పాట సాహిత్యాన్ని ఆసాంతం రెండు మూడుసార్లు గమనిస్తే దేవదాసు, పార్వతి పాత్రల మనస్తత్వాన్ని, ఒకరిపై ఒకరికి గల అభిప్రాయాన్ని, వీలయినంత కుప్తంగా సగటు ప్రేక్షకునికి కూడా అర్థమయ్యే సామాన్యమైన భాషలో చెబుతూనే వారి పాత్రలు విడిపోతాయి అనే విషయాన్ని అన్యాపదేశంగా హెచ్చరిస్తున్నట్లు ఉంటుంది.

---

అంతా భ్రాంతియేనా
జీవితాన వెలుగింతేనా
ఆశా నిరాశేనా
మిగిలేది చింతేనా
చిలిపితనాల చెలిమీ మరచితివో ||చిలిపి||
తలితండ్రుల మాటే దాట వెరచితివో ||తలి||

పేదరికమ్మూ ప్రేమపథమ్మూ మూసి వేసినదా
నా ఆశే దోచినదా ||అంతా||
మనసున లేని వారి సేవలతో ||మనసున||
వంతల పాలై చింతిలుటే నావంతా ||దేవదా||
నావంతా దేవదా ||అంతా||



కె.రాణి

ఈ పాటను కె.రాణి పాడగా సావిత్రిపై చిత్రీకరించారు. మిశ్ర శివరంజని రాగాన్ని ఆధార రాగంగా చెప్పుకోవాలీ పాటకి. హుషారుగా ఉండే పాటలని, శృంగార గీతాలని పదే పదే పాడుకోగలం కానీ విషాదగీతాలను ఎక్కువసార్లు పాడుకోలేం - గుండె బరువెక్కి వున్న పరిస్థితులలో తప్ప...! ఈ పాట మాత్రం అటువంటి అనుభూతులకు, అనుభవాలకు ఓ మినహాయింపు. మనసు హాయిగా ఉన్న స్థితిలో సైతం ఈ పాటను పాడుకోవటం జరిగితే రసానుభూతికి ఏ మాత్రం భంగం కలగదు సరికదా మరింత ఆస్వాదించగలం కూడా! అందుకు కారణం సుబ్బరాయన్ ట్యూన్ మాత్రమే కాదు ఇంటర్లూడ్స్ కూడా! అందుకే ఈ పాట ఇవాళ్టికీ ఇంటర్‌లూడ్స్ తో సహా అందరికీ గుర్తుంది.

---

అ: చెలియలేదు చెలిమి లేదు వెలుతురే లేదు ||చెలియ||
ఉన్నదంతా చీకటైతే ఉందీ నీవేనే ||ఉన్న ||
మిగిలిందీ నీవేనే ||చెలిమి||
ఆ:చెలిమిపోయె, చెలువు పోయె, నెలవే వేరాయే ||చెలిమి||
చేరదీసి, సేవచేసి తీరు కరువాయె చేరదీసి
నీదారే వేరాయె ||చెలిమి||

ఆ:మరుపురాని బాధకన్నా మధురమే లేదూ||మరుపురాని||
గతము తలచి వగచే కన్నా సౌఖ్యమే లేదు ||గతము ||
అందరాని పొందుకన్నా అందమే లేదు
ఆనందమే లేదు ||చెలిమి ||
ఆ: వరదపాలౌ చెరువులైన పొరలి పారేనే || వరద ||
రగిలి పొగలౌ గుండెలైన పగిలి జారేనే ||రగిలి ||

దారిలేని బాధతో నేనారిపోయేనా
కథ తీరీ పోయేనా ||చెలిమి ||
అ: ఉన్నదంతా చీకటైతే ఉందీ నీవేనే
మిగిలిందీ నీవేనే

ఈ పాటను ఘంటసాల, కె.రాణి పాడగా అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి అభినయించారు. 'దేవదాసు' చిత్రంతోనే సంగీత ప్రియులంతా ఈ నాటికీ గుర్తుపెట్టుకునే కె.రాణి పాడిన తెలుగు పాటలు తక్కువే. ప్రస్తుతం ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉన్నట్టుగా చెప్పుకుంటారు. ఈ పాటలో తొలి స్థానం సాహిత్యందే 'మరుపురాని బాధ కన్నా మధురమే లేదు / గతము తలచి వగచే కన్నా సౌఖ్యమే లేదు / అందరాని పొందు కన్నా అందమే లేదు / ఆనందమే లేదు' వంటి వాక్యాలు లేదు అప్పుడే కాదు. ఇప్పుడు విన్నా, మరో యాభై సంవత్సరాల తర్వాత విన్నా మనసున్న ప్రతి కంటికీ చెమరింపు ఖచ్చితంగా కలిగి తీరుతుంది. కాలదోషం పట్టని భాషా సౌందర్యాన్ని అందించే సౌలభ్యం, అదృష్టం ఆనాటి రచయితలకుండేది. ఇక సంగీత పరంగా చెప్పుకోవాలంటే.... ఈపాట మొదలవుతున్నప్పుడు వచ్చే వాద్య సంగీతంవింటే ఆ రోజుల్లో వచ్చే క్లబ్ డాన్సులకు ఉపయోగించే ఆర్కెస్ట్రయిజేషను మెల్లగా విషాదానుభూతిలోకి తీసుకు వెళ్ళిపోతుంది. ఆర్కెస్ట్రా వారికి, అందుకు తగినట్టుగా నొటేషన్‌ని (స్వరాలని) చెప్పి, ప్రాక్టీస్ చేయించటం అంత సులువైన విషయమేమీ కాదు. ఈ మాట ఇక్కడెందుకు ఉదహరించాలంటే సంగీత దర్శకుడు సి.ఆర్.సుబ్బరామన్‌కి స్వరం రాసుకునే అలవాటు లేదు. ట్యూన్ ఓసారి గనక మనసులోంచీ బైటకి వచ్చి అందరి ఆమోదన్నీ పొందిందంటే, కొన్ని సంవత్సరాల తర్వాత రికార్డింగ్ పెట్టుకున్నా సరే ఆనాడు అనుకున్న ఆ స్వరం అలాగే అచ్చుగుద్దినట్టు యధాతథంగా వచ్చేది. "విపరీతమైన జ్ఞాపకశక్తి గల మహామేధావి ఆయన" అని అంటారు ఆ రోజుల్లో ఆయనకు సహాయకునిగా పని చేసిన ప్రఖ్యాత సంగీత దర్శకుడు శ్రీ ఎమ్మెస్ విశ్వనాథం ఆనాటి సంగతులు గుర్తు చేస్తే.

---

కుడి ఎడమైతే పొరపాటులేదోయ్
ఓడిపోలేదోయ్ ||కుడి ||
సుడిలోకి దూకి ఎదురీదకా..........ఆ...ఆ....ఆ
సుడిలోకి దూకి ఎదురీదకా
మునకే సుఖమనుకోవోయ్ ||మునకే|| || కుడి ||
మేడలోన అలపైడి బొమ్మ
నీడలోనే చిలకమ్మా ||మేడ||

కొండలే రగిలే వడగాలి ||కొండ ||
నీ సిగలో పూవేలోయ్ ||నీ సెగలో|| ||కుడి||
చందమామ మసకేసి పోయే
ముందుగా కబురేలోయ్ ||చంద||
లాయిరి నడి సంద్రములోన ||లాయిరి||
లంగరుతో పనిలేదోయ్ లంగరు ||కుడి||

ఈ పాటను ఘంటసాల పాడగా అక్కినేని నాగేశ్వరరావు అభినయించారు. కళ్యాణి రాగంలో గల అందాలన్నిటినీ పొందుపరచుకున్న మంచి పాటలలో ఖచ్చితంగా పేర్కొనితీరవలసిన పాట ఇది. ముఖ్యంగా 'సుడిలో దూకి ఎదురీదకా' తరువాత వచ్చే ఆలాపనలో గల ఎగుడు దిగుడులు, తారాస్థాయిలోనూ, మద్రస్థాయిలోనూ గాయకుని గళాన్ని రసవత్తరంగా ఆవిష్కరించే చరణాలు, రాగపరంగా పాటకు అమరిన ఆభరణాలు. అందుకే మంచి పాటకు చెవియొగ్గి వినేవారి హృదయాలలో నేటికీ సజీవంగాఉందీ పాట.

భావ సౌదర్యాన్ని, భాషా సౌందర్యాన్ని గుంభనగా అందించిన సాహితీ ప్రక్రియ రచనాపరంగా కనిపిస్తుందీ పాటలో. ఉదాహరణకి - తొలి చరణంలో గల 'మేడలోనే అలపైడి బొమ్మ' అనే వాక్యంలో 'పైడి బొమ్మ' అంటే బంగారపు బొమ్మ అని, బంగారానికి పర్యాయపదంగా హేమము అని తీసుకుంటే హేమ అనే పదానికి పార్వతి అనే ఇంకో అర్థం కూడా ఉంది కాబట్టి పాత్రపరంగా సరిపోతుందనీ, అలాగే తర్వాత వచ్చే 'నీడలో చిలకమ్మా' అనే వాక్యంలో 'చిలకమ్మ'ని చంద్రముఖికి అన్వయించుకోవచ్చని, ఎందుకంటే చిలక ముక్కు అర్థ'చంద్రా'కారంలోఉంటుంది కనుక ఆ అర్ధచంద్రాకారం ముఖంలో గల 'చిలకమ్మ' చంద్రముఖికి సరిగ్గా సరిపోతుందని సాహితీ పరిశోధకుడు ఆరుద్ర విశ్లేషిస్తే "భలేగా పట్టేవే...?" అంటూ ఆయన గురువు మల్లాది రామకృష్ణ శాస్త్రి మెచ్చుకున్నారట.

'సుడిలో దూకి ఎదురీదకా మునకే సుఖమనుకోవోయ్', 'లాయిరి నడి సంద్రములో లంగరుతో పని లేదోయ్'లాంటి వాక్యాలు అటు తాగుబోతు నిస్సహాయ మనఃస్థితికి ఎంతగా అద్దం పట్టేయో, ఇటు వేదాంతపరంగా అంతు పట్టని లోతులతో మనలోని ఆధ్యాత్మిక భావాలుగానీ, సహేతుకమైన సంఘర్షణలుగానీ చెలిమి చేసే విధంగా అర్థాన్ని సూచ్యప్రాయంగా ధ్వనిస్తాయి.

ఇక ఇతర విలువల గురించి చెప్పాలంటే 'చందమామ మసకేసిపోయే ముందుగా కబురేలోయ్' దగ్గర అక్కినేని చూపిన అభినయం, మొత్తం పాటలోనూ.... ముఖ్యంగా 'కొండలే రగిలే వడగాలి'దగ్గర ఛాయాగ్రాహకుడు బి.యస్.రంగా (తర్వాత రోజుల్లో 'విక్రమ్ ప్రొడక్షన్స్' పతాకంపై నిర్మాత - దర్శకుడుగా 'అమరశిల్పి జక్కన' వంటి కళాఖండాల్ని తీశాడీయన) చూపిన లైట్ అండ్ షేడ్స్... ఈ పాట ఎప్పుడు గుర్తొస్తే అప్పుడు కళ్ళ ముందు కదలాడే విధంగా జీవం పోశాయి.

ఇవన్నీ ఇలా ఉండగా ఈ పాటపై సముద్రాల (జూనియర్) ఒక సందర్భంలో వెల్లడించిన అభిప్రాయాన్ని ఆయన మాటల్లోనే చూడండి.

"దేవదాసులోని పాటలన్నీ మేలిమి బంగారు తునకలు. ఆ పాటలే పిక్చరుకు ప్రాణం. నాగేశ్వరరావు గారి నటనకు ఘంటసాల తన గొంతుతో ఊపిరి పోసాడు. ఆ పాటలన్నీ ఘంటసాల ఎంతో తాదాత్మ్యంతోపాడాడు. అందులో నాకు అతి ప్రియమైన పాట "కుడి ఎడమైతే"! ఈ పాటకి అర్థమేమిటని నాన్న (సముచిత సీనియర్)నడిగితే కొందరికి ఆయన చెప్పారు.

కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ - తానికటి తలిస్తే దైవమొకటి తలచింది. అది జీవితంలో సహజం. అంత మాత్రాన ఓడిపోయాననుకోకు. పార్వతి తనదే అనుకున్నాడు దేవదాసు. కానీ ఆమె అతనికి దక్కలేదు. ఆ బాధని మర్చిపోవాలని త్రాగుడు ప్రారంభించాడు. అది ఒక సుడిగుండం. అలవాటు పడితే బయట పడటం కష్టమని తెలిసి కూడా ఈ సుడిగుండంలోకి దూకాడు. అప్పుడు ఎదురీత తెలివి తక్కువ. మునిగిపోవడమే సుఖం. సుడిలో దూకి ఎదురీదక మునకే సుఖమనుకోవోయి - ఇలా తప్ప తాగుతూ జీవితం ముగించుకో! పార్వతి మేడ మీద ఉన్న బంగారు బొమ్మ. చేతికి చిక్కదు. నీవు పిలిస్తే పలికే చంద్రముఖి నీ నీడలోనే ఉంది. 'మేడలోనే అలపైడి బొమ్మ నీడనే చిలకమ్మా!' కానీ నీ పరిస్థితి ఏమిటి? కొండలే రగిలే వడగాలి నీ సిగలో పూలేనోయి ఎందుకీ ప్రాణాలు? తప్పతాగి జీవితం చాలించు. చావటానికే నిర్ణయించుకున్న తర్వాత ఎవరికీ చెప్పవలసిన పనిలేదు. చందమామ మసకేసి పోయేముందు కబురేలోయి. నీ బ్రతుకు నడిసముద్రపు నావలాగున్నది. మునిగి పోవడానికి సిద్ధంగా ఉండు. ఒడ్డున ఉండే నావకి లంగరు కానీ నడి సముద్రంలో మునిగిపోయే నావకు లంగరు ఎందుకు? లాయిరి నడి సముద్రంలో మునిగిపోయే నావకు లంగరు ఎందుకు? లాయిరి నడి సముద్రంలో లంగరుతో పని లేదోయి ఇది దేవదాసు మానసిక పరిస్థితి. మా నాన్నగారు ఇంత సింబాలిజమ్‌తో పాట రాశారు. సుబ్బరామన్ అంత ఆవేశంతో స్వరపరిచారు. కవితా హృదయాన్ని అందిపుచ్చుకుని అంత ఆర్తితో అనుభవించి పాడుతూ ఆ అనుభూతి శ్రోతలలో కలిగించే నేర్పరి ఘంటసాల".

---

జగమే మాయ బ్రతుకే మాయ
వేదాలలో సారమింతేనయా
జగమే మాయ బ్రతుకే మాయ
వేదాలలో సారమింతేనయా
ఈ వింతేనయా ||జగమే||
కలిమి లేములు కష్టసుఖాలు ||కలిమి||
కావడిలో కుండలని భయమేలోయి
కావడిలో కుండలని భయమేలోయి
కావడి కొయ్యేనోయ్ కుండలు మన్నేనోయ్
కనుగొంటే సత్యమింతేనోయి
ఈ వింతేనోయి ||కావడి|| ||జగమే||
ఆశా మోహముల దరిరానీకోయి ||ఆశా||
అన్యులకే నీ సుఖము అంకితమోయి
అన్యులకే నీ సుఖము అంకితమోయి
బాదే సౌఖ్యమనే భావన రానీవోయ్
ఆ ఎరుకే నిశ్చలానందమోయ్
ఆ ఎరుకే నిశ్చలానందమోయ్
బ్రహ్మానందమోయ్ ||బాధే|| ||జగమే||

ఈ పాటను ఘంటసాల పాడగా అక్కినేని నాగేశ్వరరావు అభినయించారు. తెలుగు చలనచిత్ర సంగీత చరిత్రలోనూ, తెలుగు వారి జీవితాలలోనూ శాశ్వత స్థానం సంపాదించుకున్న పాట ఇది. 'దేవదాసు' సినిమాకు ముందు ఎలా వ్యవహరించారో గానీ, తాగి ఒళ్ళు గుల్ల చేసుకున్న వారిని 'దేవదాసు' అని పిలవటం పరిపాటిగానూ, పీకలదాకా తాగినవాడు సైతం అంత మైకంలోనూ 'జగమే మాయ' పాటని ఆలపించటం ఓ అలవాటుగానూ మారిపోయింది. అఫ్‌కోర్స్... ఆ తాగినవాడు తెలుగువాడైతేనే...! జనంలోకి ఈ పాట నటనాపరంగా కూడా అంత గాఢంగా ముద్ర వేసుకోబట్టి, తరువాతి రోజుల్లో తను సంగీత కచ్చేరీలు ఎక్కడ చేయవలసి వచ్చినా "ఆ దగ్గ కూడా నాదే బాబూ" అంటూ చెప్పుకునేవారు ఘంటసాల.

కొన్ని కొన్ని విషయాలు వయసు పెరిగిన కొద్దీ, అందుకు తగిన అనుభవాలు జీవితానికి జమ అవుతున్న కొద్దీ మరింత అవగాహనతో అవగతమవుతూ ఉంటాయి. దేశకాలమాన స్థితిగతులకు అతీతమైన అటువంటి విషయాలలో ఈ పాట సాహిత్యం కూడా ఒకటి. అందుకు ఎవరి అనుభవమే వారికి సాక్ష్యం. 'బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్ / ఆ ఎరుకే నిశ్చలానందమోయ్ / బ్రహ్మానందమోయ్' అనే వాక్యాలని జీవితకాలంలో ఒక్కసారైనా నెమరు వేసుకోని తెలుగువాడు ఉండడేమో బహుశా...! ఏది ఏమైనా 'జగమే మాయ' పాటకుండే ఆయుఃప్రమాణం ఇంకే పాటకీ లేదంటే అతిశయోక్తి కాదేమో.....!?

---

ఈ సినిమాకు సంబంధించినంత వరకూ సంగీత దర్శకుడు సి.ఆర్.సుబ్బరామన్ గురించి కొంత చెప్పుకుని తీరాలి. ఈ చిత్ర నిర్మాణం సగంలో ఉండగా తన 29 వ ఏటనే హఠాన్మరణం చెందిన సుబ్బరామన్ మృతిపై రకరకాల ఊహాగానాలున్నాయి. ఎందుకంటే ఆయన 'వినోదా' సంస్థలో వాటాదారు కూడా. ఈ నిజాన్ని ఆయన హఠాన్మరణ సంఘటనకు జోడించి - వాళ్ళ మధ్య వ్యాపార పరమైన విభేదాలు వచ్చాయని, కొందరు కిట్టని వాళ్ళు చేసి విషప్రయోగానికి ఆయన బలైపోయారని చెప్పుకుంటూ ఉంటారు. ఆయనకు చిన్నతనం నుండే తరచూ ఫిట్స్ వచ్చేవి. ఆ ఫిట్సే ఆయన గుండె మీద పనిచేసి ఆయన్ని పరలోకానికి తీసుకు వెళ్ళిపోయాయి. ఈ విషయాన్ని ప్రముఖ సినీనటుడు, రచయిత, నాటక కర్త అయిన రావి కొండలరావు వెల్లడించారు. ఒక జర్నలిస్ట్‌గా పత్రికా నిర్వహణ బాధ్యతను కూడా నిర్వర్తించారు గనుక ఆయన మాటలను మనం విశ్వసించవచ్చు.

సి.ఆర్.సుబ్బరామన్‌కు అసిస్టెంట్‌గా వ్యవహరించిన ఎమ్మెస్ విశ్వనాథం ఆయన ఒప్పుకున్న చిత్రాలన్నిటినీ ఎంతో చిత్తశుద్దితో, నిజాయితీ గల గురుభక్తితో - వయొలిన్స్ టి.కె.రామమూర్తి సహాయంతో పూర్తి చేశారు. ఆ నాటి ఆ ఎమ్మెస్ విశ్వనాథం, టి.కె.రామమూర్తి కలిసి దర్శకత్వం కొన్నాళ్ళపాటు 'విశ్వనాథం - రామమ్మూర్తి' పేరు మీద జంటగా చాలా చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. 'దేవదాసు'కి సంబందించినంతవరకూ - ఆ సినిమా రీరికార్డింగ్‌తో పాటు, 'అందం చూడవయా' పాటని, 'జగమే మాయ' పాటనీ ఎమ్మెస్ విశ్వనాథమే స్వరపరిచారు.

---

తానేమారెనా గుణమ్మే మారెనా
దారీ తెన్నూ లేనే లేక ఈ తీరాయెనా||తానే||
తొలిచూపు నాటి రూపు మారే
ధోరణి మారే ||తొలి చూపు ||
నిలువెల్లా మెల్లనాయె నిట్టూర్పే తనదాయే
ఏదీ లేని పేదైపోయి ఈ తీరాయెనా
వలపు తీరు ఈ తీరౌనా ...ఆ... ||వలపు||
మా చెలిమి కలలో పెన్నిధేనా...ఆ...ఆ...ఆ

పెను చీకటైన జీవితానా వెలిగిన జ్యోతీ ||తానే ||
మధుపాయే మాసిపోగా అంతమ్మే ఫలమ్మా
ఏరీ కోరు ఉల్లాసాలు ఈ తీరాయెనా తానే
నా సేవలకు ఇంతే వరమా........ఆ..... ||నా సేవ||
నాకిదే కడసారి దరిశనమా...ఆ...ఆ..ఆ
అడియాస పాలు చేసినారు కోరినవార ||అడియాస||
మనసైన చేరలేని ఈ దాసీ ఇటాయే
గాలీ మేడ కూలిపోయి ఈ తీరాయెనా ||తానే||

ఈ పాటను రావు బాల సరస్వతి దేవి పాడగా చంద్రముఖి పాత్రను ధరించిన లలిత అభినయించారు. రాజ్‌కపూర్ తీసిన 'జిస్ దేశ్‌మే గంగా బెహతీ హై' సినిమా హీరోయిన్ అయిన పద్మినికి స్వయాన అక్కగా, నేటి ప్రముఖ నటి శోభనకు మేనత్తగా పరిచయం చేస్తేనే లలిత అంటే ఎవరో ఈ తరం వారికి కూడా అర్ధం అవుతుంది.

సంగీత పరంగా ఈ పాటలో చెప్పుకోదగ్గ విషయాలు కొన్ని ఉన్నాయి. కళ్యాణి రగాన్ని మిశ్రమం చేసి వాడుకున్నారీ పాటలో. మొదటి చరణంలో గల 'మా చెలిమి కలలో పెన్నిధానమా' దగ్గర, రెండవ చరణంలో గల 'నాకిదే కడసారి దరిశనమా' దగ్గర వచ్చే ఆలాపనలను - 'కుడీ ఎడమైతే పొరపాటు లేదోయ్' పాటలో 'సుడిలో దూకి ఎదురీదకా' తర్వాత ఆలాపనతో పోల్చుకుని చూడండి. రెండూ ఒక్కలాగే ఉంటాయి. అలాగే ఇంకా జాగ్రత్తగా గమనిస్తే.. 'పల్లెకు పోదాం పారుని చూదాం' పాటను పాడుకుంటూ ఆ పాటలో వచ్చే 'కనులార చూతము', 'ఏమౌనో చూతము' అనే వాక్యాలని ట్యూన్‌తో సహా మినహాయించేసుకుని దానికి 'దారీ తెన్నూ లేనేలేక ఈ తీరాయెనా' లైనుని ట్యూన్‌తో సహా కలుపుకుని పాడుకుని చూడండి. ఈ 'తానే మారెనా' పాట ఎలా అతి చక్కగా అతికిపోతుందో తెలుస్తుంది.

పైన ఉదహరించిన పాటలే కాక మరో నాలుగు మంచి పాటలు కూడా ఉన్నాయి 'దేవదాసు'లో. ఈ సినిమాలోని పాటల సాహిత్యాన్ని క్షుణ్ణంగా వంటబట్టించుకుంటే - ఆ అవగాహన ఎటువంటి వారికైనా తమ జీవితకాలంలో ఒక్కసారైనా అనుభవంలోకిరాకుండా ఉండదు. అందుకే వినోదా వారి 'దేవదాసు' తెలుగు చలనచిత్ర చరిత్రలో అజరామరంగా నిలిచిపోయింది.



# ఆ పాత పాట మధురం

## రాజా



# చండీరాణి

*'మ్యూజిక్' అనే ఆంగ్ల పదానికుండే స్పెల్లింగ్‌లోని 'ఎమ్ - యు - యస్ - ఐ - సి' లో 'ఎమ్' అంటే మెలోడీ అని, అది గనుక మిస్సయితే 'యు బికం సిక్' అనీ కొందరంటారు సరదాగా! అదొక చమత్కారంగా తీసుకున్నా సరే నిజంగా అదే నిజం!! కొన్ని కొన్ని అనుభవం మీదనే తెలిసొస్తాయని, ఈ మాట కూడా ఆ కోవలోనిదేనని అనుభవం మీదనే ఒప్పుకుంటారు కూడా!! అటువంటి అనుభవం మీద అర్థమయ్యే మెలోడీకి పెద్ద పీట వేసిన చిత్రాలలో భరణీవారి 'చండీరాణి' కూడా ఒకటి.*

ఈ చిత్రానికి కథ, *దర్శకత్వం: భానుమతి, నిర్మాణం, కూర్పు: పి. రామకృష్ణ, మాటలు, పాటలు:సముద్రాల, సంగీతం: కీ.శే.సుబ్బరామన్, విశ్వనాథ్ ఈ చిత్రంలో గల ఎనిమిది పాటలలో మూడు పాటల గురించి.*

ఈ వయార మీ విలాస మోహో - రాజరాజా నీదేరా ||ఈ వయార ||
నీటూ గోటూలా తరితీపి మాటలా ||నీటుగోటు||
సయ్యాటలోన సాటిలేని
జాణనోయి రాజా - ఏలరా ||సయ్యాట|| ||ఈ వయార ||
ఓ వెన్నెల రేడా - ఓ - ఓ నా వన్నెల రేడా - ఓ - ఓ
వయసూ మనసూ వలపూ వగలూ కనరా - కొనరా రాజా ||వన్నెల రేడా||

ఈ పాటను ఎ.పి కోమల పాడగా, రీటా అభినయించింది. హిందూస్థానీ సంప్రదాయంలో మారూబేహాగ్ అనే రాగం ఒకటుంది. వసంత్ దేశాయ్ సంగీతాన్ని ఇచ్చిన 'గూంజ్ ఉఠీ శహనాయీ' సినిమాలో 'తేరే సుర్ ఔర్ మేరే గీత్' పాట దానికి మంచి ఉదాహరణ. మన

'చెంచులక్ష్మి' సినిమాలో 'నీల గగన ఘనశ్యామా' అనే పాటను కూడా చెప్పుకోవచ్చు. ఇవి కేవలం ఆ రాగం ఇలా ఉంటుందని తెలుసుకోడానికి మాత్రమే. ఆ రాగంలో కొంత భాగాన్ని, యమన్ రాగంతో కలుపుతూ 'ఈ వయార మీ విలాసమోహో రాజ రాజా' పాటని స్వరపరిచినట్టు అనిపిస్తుంది. అది కూడా మొదటి చరణం వరకే!

ఈ పాట దొరికితే విని చూడండి. 'ఈ వయార మీ విలాస మోహో' అని వింటున్నప్పుడు ఒక విలాసిని వగలొలికించే విధంగా నడుస్తూ వస్తున్నట్టు అనిపిస్తుంది. దృశ్యానుభూతి కలిగేలా స్వరకల్పన చేయగల ప్రతిభకు తార్కాణంగా ఈ పాటను ఉదహరించవచ్చు.

---

కలిసే కన్నులా - తొలి వలపే తూలే ||కిలా కిలా ||

మిల మిల తారకలా - అందాలూ చూడ

జాబిలి మబ్బులలో - దోబూచులాడె

బెదిరీ నా మనసూ ఉయ్యాల లూగె ||బెదిరీ ||

నా వలపే సోలి - చేజారిపోయే ||కిలా కిలా ||

పనులూరేలెప్పుడూ - నీ స్మరణే ఆయే

గాలి మేడలలో - కాపురమైపోయే

మనసూ నీ చెలిమీ - మరువాలేదాయే ||మనసూ ||

నా కథయే - వింతగాధై పోయే కిలా కిలా

ఈ పాటకు ఆలాపన, అభినయం భానుమతే! ఈ పాటను ఆలపిస్తున్న కొద్దీ ఇందులోని డెప్త్‌ని ఆస్వాదించగలుగుతాం. అందుకు కారణం ఆధార రాగమైన దర్బారీకానడ! ఆ రాగాన్ని ఎంత ఆలపిస్తూ ఉంటే గుండె అంత బరువవుతూ ఉంటుంది. కావాలంటే 'బైజూ బావ్ రా'లో 'ఓ దునియాకే రఖ్‌వాలే' పాటని ఆలపించుకుంటూ అదే మూడ్‌లో ఉండుండి - తెలుస్తుంది. కొంతమంది ఈ 'కిల కిలా నవ్వులా' పాటలో 'కురిసే లేవెన్నెలా' అనే లైనుని 'వెన్నెల కురిసిందిలే' అనే అర్థం వచ్చేట్టు 'కురిసేలే - వెన్నెలా' అని పాడతారు. 'లేవెన్నెల' అంటే లేత వెన్నెల.... అంచేత ఈ అర్థంలో పాడాలి. ఈ పాట కొంత కష్టపడితే బైట దొరుకుతుంది. సంపాదించి వినండి. భానుమతి ఒకవైపు ఆ అర్థం వచ్చేట్టుగాను, మరో వైపు బ్రీతింగ్ స్పేస్‌కు వీలు కలిగేట్టుగాను ఎలా పాడిందో తెలుస్తుంది.

---

అ: ఓ - తారకా ఓ

ఆ: ఓ - జాబిలి ఓ

అ: ఓ తారకా నవ్వులేలా ననుగనీ

ఆ: అందాలు చిందెడి - చందమామ నీవనీ

ఓ - జాబిలీ - ఓ - ఆతారకా నవ్వునోయీనినుగనీ

అ: వినువీధిలోని - తారాకుమారీ

కుమారీ దరి చేరనౌనా - ఈ చందమామా

ఆ: చేరువే తారా రేరాజుకూ

ఓ... తారక నవ్వునోయీ నినూగని -

అ: మనోగాధ నీతో నివేదించలేనూ -

నివేదించకున్నా జీవించలేనూ

ఆ: నెరజాణవేలే - ఓ జాబిలీ

ఓ.. ఆ తారకా నవ్వునోయీ నినూ గనీ

అ: తొలిచూపులోనీ - సంకేతమేమో -

చెలి నవ్వులోని ఆ శిల్పమేమో

ఆ: నీ నవ్వువెన్నెలే - ఓ జాబిలీ

ఓ...ఆ తారకా నవ్వునోయీ నినూగని

మిశ్రయమన్ రాగ చ్ఛాయలలో స్వరపరచబడిన ఈ పాటలో హవాయిన్ గిటార్ వాద్యం అడుగడుగునా మాధుర్యాన్ని వినిపిస్తూ ఉంటుంది. పాట మొదట్లో వచ్చే సాకీలో గల 'నవ్వులేలా' అనే పదం వద్ద మంద్రస్థాయిలో వినిపించిన ఘంటసాల గళ పరిమళాన్ని

జ్ఞాపకాల దొంతర్లతో అనుభూతి పరంగా ఆవహింప చేసుకోగలిగితే శరీరం రోమాంచితం అయిపోతుంది. మెజాయిక్ ఫ్లోర్ మీద మంచుగడ్డలా, పట్టుదారం పై మంచి ముత్యంలా జాలువారే గమకాలతో ఎప్పుడూ విలక్షణంగా భాసించే భానుమతి స్వరమాధుర్యం - ఈ పాటలో అంత దగ్గరి గమకాలు లేకపోయినా - సుస్వరానికి పరవశించగల ప్రతి హృదయాన్నీ పులకరింప జేస్తుంది. రచనలోనూ, స్వరరచనలోనూ పవిత్రత తొణికిసలాడే ఈ పాటకి ముగింపులో వచ్చే మ్యూజిక్ - ఆ తర్వాత ఇంకో చరణం ఉందేమో - అందుకు ఇది ఇంటర్‌లూడేమో అనే భావన కలిగించి అతి ఆశ్చర్యకరంగా ముగుస్తుంది. ఈ పాటను ఎన్.టి.ఆర్., భానుమతి అభినయించారు.

---

ఒకవైపు ద్విపాత్రాభినయాన్ని, మరో వైపు దర్శకత్వాన్ని ఏక కాలంలో చేయడమనే ప్రక్రియను ఓ సాహసంగా, ఓ రికార్డుగా భావిస్తున్న ఈ తరం వారికి - ఇవన్నీ 'చండీరాణి' చిత్రంలో ... ఆనాడే.. అంటే 1953లోనే భానుమతి చేశారని, అదీ మూడూ భాషలలో చేశారని తెలిస్తే ఆనాటి కళాకారులను గొప్పవారుగా ఈ నాటికీ ఎందుకు చెప్పుకుంటున్నారో కొంత అర్థమయ్యే అవకాశం ఉంది.

ఈ చిత్రానికి సంగీతం: సి.ఆర్.సుబ్బరామన్ - విశ్వనాథ్ అని టైటిల్స్‌లో వేశారు. నిజానికి 'చండీరాణి' ముహూర్తంతో మొదలైన తర్వాత సి.ఆర్.సుబ్బరామన్ మరణించారు. ఆయనకు అసిస్టెంట్‌గా పనిచేసిన విశ్వనాథ్ ఈ చిత్రాన్ని పూర్తిచేశారు. మొత్తం స్వరరచనా బాధ్యతనంతటినీ తానే అయి స్వీకరించినా "ఇది గురువుగారి సినిమా... ఆయన పేరు వేయడమే ధర్మం. అందుకని ముందు ఆయన పేరే వేయండి" అంటూ పట్టుబట్టి మరీ ఆయన పేరుని వేయించారు విశ్వనాథ్. ఈరోజుల్లో అంతటి నైతిక విలువలను చూడగలమా!?

ఆ విశ్వనాథ్ ఎవరో గాదు... తర్వాత రోజుల్లో తన సంగీత ఝురితో దక్షిణ భారతదేశాన్ని ఓ ఊపు ఊపేసి ఇళయరాజా వంటి సంగీత దర్శకులకు ఆరాధ్య దైవంగా గౌరవాలనందుకున్న - ఎమ్.ఎస్. విశ్వనాథనే!!...

---



# ఆ పాత పాట మధురం

రాజా



# బ్రతుకు తెరువు

గీతాలకు శ్రావ్య గౌరవంతో పాటు కావ్య గౌరవం కూడా తెచ్చి పెట్టిన పాటలలో 'అందమె ఆనందం' పాటని చెప్పుకోవాలి. 1953 లో విడుదలయిన భాస్కర్ ప్రొడక్షన్స్ వారి బ్రతుకు తెరువు చిత్రంలోని ఈ పాటకు రచన జూనియర్ సముద్రాల. సంగీతం సి. ఆర్ సుబ్బరామన్, ఘంటసాల.

అందమె ఆనందం
ఆనందమె జీవిత మకరందం
అందమె ఆనందం
పడమట సంధ్యా రాగం
కుడి ఎడమల కుసుమ పరాగం ||పడమట||
ఒడిలో చెలి మోహన రాగం
ఒడిలో చెలి మోహన రాగం ||అందమె||
పడిలేచే కడలి తరంగం
వడిలో జడిసిన సారంగం

పడిలేచే కడలి తరంగం
వడిలో జడిసిన సారంగం
సుడిగాలిలో ఎగిరే పతంగం
జీవితమే ఒక నాటక రంగం... ||అందమె ||
ఒడిలో చెలి తీయని రాగం
జీవితమె మధురాను రాగం ||జీవితమే ||

---

బీంప్లాస్ రాగంలో స్వరపరచబడిన ఈ పాటని పాడుకోని వాళ్ళు, కంఠోపాఠం రాని వాళ్ళు ఆ రోజుల్లో దాదాపుగా అరుదనే చెప్పాలి. ఘంటసాల పాడిన ఈ పాటను తెరపై అక్కినేని నాగేశ్వరరావు అభినయించగా మరో సన్నివేశంలో సావిత్రికి పి.లీల ఇదే వరుసలో పాడిన పాట కొద్ది మార్పులతో ఇలా ఉంటుంది.

అందమె ఆనందం
ఆనందమె జీవిత మకరందం
అందమె ఆనందం
పడమట సంధ్యారాగం
కుడి ఎడమల కుసుమ పరాగం ||పడమట||
ఒడిలో చెలి తీయని రాగం ||ఒడిలో||
జీవితమే మధురానురాగం ||జీవితమే|| ||అందమె||

చల్లని సాగర తీరం
మది జిల్లను మలయ సమీరం ||చల్లని||
మదిలో కదిలే సరాగం || మదిలో ||
జీవితమె అనురాగ యోగం ||జీవితమె ||
అందమె ఆనందం
ఆనందమె జీవిత మకరందం

అనాటి సినీ గీతాల్లో సంగీత సాహిత్యాలు పవిత్ర పూజా ప్రసూనాల వలె ఎంతగా గుబాళించి ప్రకాశించేవో చెప్పడానికి ఈ పాటే ఒక ఉదాహరణ. అంతే కాదు ఓ వైపు కవితా సుగంధాలు విరజిమ్ముతూ మరో వైపు కథాపరంగా పాడే పాత్రల వ్యక్తిత్వాలు, సన్నివేశానుగుణమైన రసపోషణ కూడా ప్రతిఫలింప చేసేవి. అందుకే భార్యాపిల్లలపై ప్రేమ కలిగిన కథానాయకుడు (అక్కినేని) మొదటి చరణంలో 'జీవితమె మధురానురాగం' అంటాడు. వారికోసం చేస్తున్న ఉద్యోగాన్ని రక్షించుకోవడానికి పెళ్ళికాలేదని అబద్ధం చెప్పి ఆ బ్రతుకులో తన బ్రతుకు తెరువుని చూసుకుంటున్నాడు. కాబట్టి, రెండో చరణంలో 'జీవితమె ఒక నాటక రంగం' అంటాడు. ఈ విషయం తెలియక అతనిపై ప్రేమను పెంచుకున్న మరో కథానాయికి (సావిత్రి) 'జీవితమె అనురాగ యోగం' అంటూ మనసులోని మాటను బైట పెడుతుంది. జీవితానుభవ సారాన్ని కాచి వడబోసి, పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయగలిగిన కవి రాసిన ప్రతి అక్షరం శిలాక్షరమైపోతుంది. ఆ శిలాక్షరాలను శిల్పంగా మలచి ప్రాణప్రతిష్ఠ చేయగలిగిన ప్రతి స్వరం జీవ స్వరమై పోతుంది. వీటన్నిటినీ ఈపాట నిరూపిస్తుంది. అందుకే ఈ పాట 55 సంవత్సరాలు దాటినా ఇంకా ప్రేక్షక శ్రోతల హృదయాల్లో చెక్కు చెదరకుండా ఉంది.

ఈ పాట గురించి సముద్రాల జూనియర్ ఏమన్నారంటే -

"1953 లో బ్రతుకు తెరువు సినిమా వచ్చింది, అది నాకు బ్రతుకు తెరువు నిచ్చింది. "అందమే ఆనందం" అన్న పాట నన్ను గేయరచయితను చేసింది. దానికి ఓ చిన్న చరిత్ర ఉంది. ఆ పాట స్థానంలో ఓ పాట రాశాను. దర్శకుడు పి. రామకృష్ణ రావు (భానుమతి గారి భర్త) గారికి అది నచ్చలేదు. మరో పాట ప్రయత్నించు అన్నారు. మ్యూజిక్ సెషన్ నుంచీ అలాగే సినిమాకు బయలు దేరాను. సూర్యాస్తమానం అవుతోంది. పడమటి సంధ్యారాగంతో పాట ప్రారంభం అయింది. పాటంతా వెల్లువలా ఒక పది నిమిషాలలో వచ్చేసింది. మర్నాడు ఉదయం 9 గంటలకి పాట ఘంటసాలకిచ్చేను. ఆనందమె జీవిత మకరందం తర్వాత "సుర నందన వనం మాకందం" అనే పల్లవిని వ్రాసి ఇచ్చాను. "నాకు వద్దు" అన్నాడు ఘంటసాల. ఒక గంటలో ట్యూన్ చేయడం అయిపోయింది. పదిగంటలకు దర్శకుడు విని 'ఓకే' అన్నాడు. పదకొండు గంటలకి ఇంటికి వెడితే అప్పుడే వచ్చేశారేమిటి? అని శ్రీమతి ఘంటసాల అడిగారు. పాట రాయడం, ట్యూన్ చేయడం, ఓకె అనడం అన్ని అయిపోయాయని సగర్వంగా అన్నాడు ఘంటసాల. ఎంత హాయిగా పాడాడు ఆ పాట. అంత నిండుగా ఆ స్థాయిలో సంచారం చేయాలంటే అతనికే చెల్లు."

'బ్రతుకు తెరువు' చిత్రం తరువాత అదే కథతో హిందీలో 'జీనే కీ రాహ్ (1969) చిత్రాన్ని తీసినా, ఆ హిందీ చిత్రంలో చేసిన మార్పులతో తిరిగి అక్కినేనితో తెలుగులో 'భార్యా బిడ్డలు' (1971)గా మళ్ళీ వచ్చినా, ఈ 'అందమె ఆనందం' పాటకున్నంత ఆయుః ప్రమాణాన్ని ఆ రెండు చిత్రాల్లోని పాటలూ బాగున్నా సరే పొందలేక పోయాయి. 'బ్రతుకు తెరువు' వచ్చిన మరుసటి సంవత్సరమే రిలీజయిన 'మేనరికం' చిత్రంలో అదే పాట ప్రేరణతో

ఆనందం ఆనందం
ఆనందమె జీవిత పరమార్థం ఆనందం
ముసి ముసి నవ్వుల మోహన రాగం
కొసరే కోకిల వసంత గానం
శరన్మల్లికా మధుర నికుంజం
ప్రేమ దృగంచల బాల కురుంగం ఆనందం
చల్లగాలిలో గగన విహారం
సాగే ఊయల స్వైరవిహారం
సెలయేటిలో స్వేచ్ఛాయానం
కలిసే మనసుల ప్రణయ కలాపం
పున్నమి వెన్నెల పొంగే సంద్రం
కన్నులు కన్నులు కలిసే సమయం
ఏమున్నది జీవిత చరితార్థం
ప్రేమదేవత కదే పరమార్థం

అంటూ పెండ్యాల సంగీత దర్శకత్వంలో జంపన ఓ పాట రాసినా అది సోదిలోకి రాకుండా పోయింది. భరణి పిక్చర్స్ అధినేతగా గుర్తింపు పొందిన పి.రామకృష్ణ బయటి సంస్థలకు కూడా దర్శకత్వం చేసిన రెండు, మూడు చిత్రాల్లో 'బ్రతుకు తెరువు' ఒకటి. జాన్ కీట్స్ అనే అంగ్ల కవి రాసిన 'A thing of beauty is joy for ever' అనే కొటేషన్ 'అందమె ఆనందం ఆనందమే జీవిత మకరందం' పాటకు స్ఫూర్తి అని కొందరంటారు.

---

ఏదో మత్తుమందు జల్లి
మాయలూ జేసి
మది దోచినాడే
మెల్ల మెల్లగా చల్ల చల్లగా || ఏదో ||
తొలి చూపులోనే తరి తీపి రేపి
మలి చూపులోనే
నా మతే మాపె ||మలి || || ఏదో ||

ఆ....
కనుల కనినంతనే ఏదో కలవరమాయె...
మాట వినినంతనే
మైమరుపులాయె.... || ఏదో||
వలపే వలలాయె
తలపులే తొలకలాయె
పసిడి సంకెల బ్రతుకాయె
పలుకే రాదాయె ||ఏదో ||

ఈ పాటను పి.లీల పాడగా సావిత్రి అభినయించారు. అక్కినేని కూడా సన్నివేశంలో ఉంటారు. ఈ పాటకు రచన సముద్రాల. (జూనియర్, సీనియర్ ప్రత్యేకంగా పేర్కొనబడలేదు.) సాధారణంగా సాకీ, పల్లవి, చరణం ఇలా పాటలో ఉంటుంటాయి. కానీ తొలుత పల్లవి, ఆ తరువాత చరణం, ఆ తరువాత సాకీల వలె అనిపించే చరణాలు ఉండటం ఈ పాట ప్రత్యేకత. సాహిత్యాన్ని పట్టించుకునే అలవాటున్న వారిని 'తరితీపి' అనే ప్రయోగం ఆకర్షిస్తుంది పాటలో. తరి అంటే గాఢమైన, చిక్కని, దృఢమైన అనే అర్థాలున్నాయి.

ఈ సినిమాకి సంగీతం సి.ఆర్. సుబ్బరామన్ అండ్ ఘంటసాల అని టైటిల్స్‌లో ఉంటుంది. 'అందమే ఆనందం' పాటను ఘంటసాలే స్వరపరచినట్టుగా సముద్రాల జూనియర్ చెప్పిన మాటలను బట్టి తెలుస్తోంది. కాస్త జాగ్రత్తగా గమనిస్తే "ఏదో మత్తు మందు

జల్లి' ఈ పాటను కూడా ఘంటసాలే స్వరపరచినట్టు మనకి తెలిసిపోతుంది. కావాలంటే పాటను సంపాదించి వినండి. ఏదో కలవరమాయె / పలుకేరాదాయె అనే వాక్యాల దగ్గర వచ్చే ట్యూన్‌ని అలా ఆలపించుకుంటూ పోతే 'మర్మయోగి' సినిమాలోని 'నవ్వుల నదిలో పువ్వుల పడవ కదిలే' పాట దగ్గర తేలతాం. ఈ పాటకి సంగీతం ఘంటసాల. ఇదే నడక 'ఏదో మత్తుమందు'పాటలో పేర్కొన్న వాక్యాల దగ్గర కనిపిస్తుంది.

---

ఈ 'బ్రతుకు తెరువు' సినిమాలో గల పాటలలో 'గాలి మేడలా కూలే ఆశా' అనే పాటను మాత్రం సుబ్బరాయన్ ట్యూన్ చేసి చనిపోయారని, మిగిలిన పాటలన్నిటినీ ఘంటసాలే ట్యూన్ చేశారని ఆయన సతీమణి సావిత్రిగారు తెలిపారు. ఈ 'గాలిమేడలా కూలే ఆశా' పాటను ప్రసాదరావు పాడారట.

---



# ఆ పాత పాట మధురం
## రాజా



# చక్రపాణి

*సినిమాలో పాటంటే - కొన్ని సంభాషణలు వ్యక్తపరచలేని భావాన్ని ప్రేక్షకుడి మనసు అట్టడుగు పొరలకు అందించేటట్టు ఉండాలి. పాడే పాత్ర వ్యక్తిత్వాన్ని ప్రతిబించేట్టు ఉండాలి. ఇటువంటి లక్షణాలను పుణికి పుచ్చుకున్న పాటలతో తులతూగిన స్వర్ణయుగంలోనే విడుదలయింది.*

*భానుమతి భర్త శ్రీ పి. రామకృష్ణ - నిర్మాత, దర్శకుడిగా కూర్పరిగా వ్యవహరించిన ఈ చిత్రానికి భానుమతీ రామకృష్ణ సంగీత దర్శకత్వాన్ని వహించారు. మాటలు పాటలు రావూరి సత్యనారాయణరావు రాశారు. అక్కినేని నాగేశ్వరరావు, భానుమతి హీరోహీరోయిన్లు కాగా టైటిల్ రోల్ 'చక్రపాణి' పాత్రను సి.యస్.ఆర్ పోషించారు. ఈ చిత్రంలో నాలుగు పాటలు, 'పక్కాల నిలబడి' అనే త్యాగరాజ కీర్తన ఉన్నాయి. ఆ నాలుగుపాటలలో ఓ మూడు పాటలివి.*

రాగముతో అనురాగముతో
మెల్ల మెల్లగా నిద్రా రావే
మెల్ల మెల్లగా చల్ల చల్లగా రావే నిదురా హాయిగా ||మెల్ల||
వెన్నెల డోలికలా పున్నమి జాబిలి పాపవై
కన్నుల నూగవే చల్లగా రావే నిద్రా హాయిగా ||కన్నుల||
మెల్లమెల్లగా చల్లచల్లగా రావే నిదురా హాయిగా
పిల్ల తెమ్మెరలా ఊదిన పిల్లన గ్రోవివై
జోలపాడవే తీయగా
రావే నిదురా హాయిగా || జోల ||
మెల్లమెల్లగా చల్లచల్లగా రావే నిదురా హాయిగా
కలువ కన్నియలా వలచిన తుమ్మెద రేడువై
కన్నుల వ్రాలవే మెల్లగా రావే నిదురా హాయిగా
మెల్లమెల్లగా చలచల్లగా
రావే నిదురా హాయిగా
రాగముతో అనురాగముతో
మెల్లమెల్లగా నిదురారావే

ఈ పాటకు గానం, అభినయం కూడా భానుమతే...! నిద్రకు ఉపక్రమించే ముందు ఈ పాటను కనుక పెట్టుకుంటే మనసు ప్రశాంతమై అతి త్వరగా నిదుర మబ్బులోకి జారుకోవడం నూటికి నూరుపాళ్ళు గ్యారంటీ అని చెప్పే స్థాయిలో ఉంటుందీ పాట. అలాగే

పాట సాహిత్యం కూడా నిద్రకు సంబంధించినదే కావటం వల్ల మనకున్న మంచి జోల పాటల లిస్టులో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకోగల సత్తా ఉన్న పాట ఇది అని పాటను విన్నవాళ్ళెవరైనా ఒప్పుకుంటారు. భానుమతి సినిమాల్లో... కళ్యాణిరాగంలో .. ముఖ్యంగా యమన్ కళ్యాణిరాగంలో ఖచ్చితంగా ఒక్క పాటైనా ఉంటుంది. ఆ సంప్రదాయాన్ని తెలియజేస్తుందీ పాట. చరణాల మధ్య వచ్చే ఇంటర్‌లూడ్‌లను గమనిస్తే యస్.రాజేశ్వరరావు యమన్ కళ్యాణిని ఉపయోగించే పద్ధతి గుర్తొస్తుంది. ఈ పాట గనుక దొరికితే వినిచూడండి. మొదట చరణం తరువాత వచ్చే ఇంటర్లూడ్ రాజేశ్వరరావు స్వరపరచిన పాలకడలిపై శేషతల్పమున పవళించేవా దేవా (చెంచులక్ష్మి) పాట నడకను జ్ఞాపకం చేస్తూ ఉంటుంది. అందుకు కారణం 'మల్లీశ్వరి' రోజులనుండీ ఎన్నో మ్యూజిక్ సిట్టింగ్‌లతో రాజేశ్వరరావు గారితో భానుమతి కూర్చోవటం కావచ్చు. ఆమె అభిరుచి మేరకు రాజేశ్వరరావు యమన్‌లో చేసిన కొన్ని పాటల రిపిటేషన్ కావచ్చు. యమన్ రాగం పట్ల వారిరువురికిగల వేవ్‌లెంగ్త్‌కావొచ్చు. ఏది ఏమైనా ఇంత మంచి పాటను తిరిగి ఈ తరం వారికి అందించే ప్రయత్నం జరిగితే బావుంటుంది. ఇవన్నీ ఇలా ఉండగా ఈ పాటలో హవాయిన్ గిటార్‌ను ఉపయోగించిన తీరు ఒక ఎత్తు అయితే స్పష్టత పరంగా 'వ్రాలవె' అంటూ పలికిన భానుమతి వాచకం మరొక ఎత్తు

---

ఓ ప్రియురాలా
ఓ ప్రియురాలా
పలుకవేలనే.. నాతో
ఓ ప్రియురాలా ఓ జవరాలా
ప్రియురాలా.. ఓ జవరాలా
పలుకవేలనే.. నాతో.. ఓ ప్రియురాలా..
ఆ...ఆ...ఆ..ఆ...ఆ...
వెన్నెల సెలయేరున విరబూసిన ||2||
కలువవు నీవేనే జవరాలా ||2||
నా మదిలో డోలలూగరావే...
ఓప్రియురాలా
మిన్నుల పువుతోటల విహరించే ||2||
కిన్నెర నీవేనే జవరాలా ||2||
నా మదిలో...
నా మదిలో వీణమీటరావే ||2||
ఓ ప్రియురాలా
పొన్నల నీడలలో నడయాడెడి ||2||
నెమలివి నీవేనే జవరాలా ||2||
నా మదిలో...
నా మదిలో నాట్యమాడరావే ||2||
ఓ ప్రియురాలా... ఓ జవరాలా
అలుకలేలనే నాపై ... ఓప్రియురాలా

ఈ పాటను ఏ.ఎం.రాజా పాడగా అక్కినేని నాగేశ్వరరావు అభినయించారు. పాట చివర్న భానుమతి కూడా వచ్చి సన్నివేశంలో పాల్గొనడం జరుగుతుంది. ఏ.ఎం.రాజాకు ఎన్నో మంచి పాటలున్నాయి. ఆ ఎన్నో మంచి పాటలలో అతి అరుదుగా లభించే పాట ఇది. ఈ పాటకు హిందూస్థానీ సంప్రదాయానికి చెందిన శుద్ధసారంగ్ రాగాన్ని ఉపయోగించారు. హేమంత్ కుమార్ సంగీత దర్శకత్వంలో వచ్చిన నాగిన్ 1954) సినిమాలోని 'జాదుగర్ సయ్యా ఛోడో మొరెబయ్యా' పాట, రవి సంగీతాన్నిచ్చిన 'ధూల్‌కాఫూల్'లో 'తేరేప్యార్ కా ఆసరా' అనే పాట ఈ రాగానికి మంచి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఆ రోజుల్లో ఈ రాగాన్ని హేండిల్ చెయ్యటంలో సంగీత దర్శకుడు నౌషద్‌కి ఓ ఒరవడి ఉండేది. ఈ 'ఓ జవరాల' పాటతో 'పొన్నల నీడలలో నడయాడెడి' చరణం ముందు వచ్చే ఇంటర్లూడ్ ని కనుక వింటే భానుమతి మీద కూడా నౌషద్ ప్రభావం ఉందనిపిస్తుంది. ఒకసారి వింటే మళ్ళీ మళ్ళీ వినాలనిపించే పాట ఇది.

---

ఉయ్యాల జంపాల లూగరావయా
తులలేని భోగాల తూగి ||ఉయ్యాల ||
తాతయ్య సిరులన్ని వేగ రప్పింప
జాబులో పుట్టినా బాబూ నీవయ్యా
జాబులో పుట్టినా బాబూ నీవయ్యా ||ఉయ్యాల ||
మా మనోరమక్కాయి మదిలోన నిలిచి
ఎదురింటి ఇల్లాలి ఒడిలోన వెలిసి
ఎత్తుకుని ముత్తాత ఎంతెంతో మురిసి
ఎత్తుకుని ముత్తాత ఎంతెంతో మురిసి
నా వారసుడా అంటూ నవ్వరా కలిసి ||ఉయ్యాల ||
మా మదిలో కోర్కెలను మన్నింప దయతో
అవతరించినావయ్యా అందాల రాశి
చిన్ని నా తండ్రికి శ్రీరామరక్ష
తప్పకా ఇత్తురా తాతయ్య లక్ష ||ఉయ్యాల ||

కథాగమనాన్ని తేటతెల్లం చేసే ఈ పాట సాహిత్యాన్ని గమనించగానే సిట్యుయేషన్ సాంగ్‌కి ఉండవలసిన లక్షణం అంటే ఇది కదా అనిపిస్తుంది. మనువడు తనతో పోట్లాడి ఇల్లు వదిలి పోవటం వల్ల - పెళ్ళయి అత్తవారిళ్ళలో ఉన్న మనవరాళ్ళలో ఎవరు తనకు ముందుగా మునిమనవణ్ణి ఇస్తారో వారికి లక్షరూపాయలిస్తానని ప్రకటిస్తాడు సి.యస్.ఆర్! దాంతో మనవరాళ్ళ మధ్య పోటీ పెరుగుతుంది. అందులో ఒక మనవరాలైన భానుమతి తను మనోరమక్కాయ్ అంటూ ఆప్యాయంగా పిలుచుకునే సూర్యకాంతం ఇచ్చిన సలహాపై ఎదురింట్లో కొత్తగా దిగిన ఇల్లాలి ఒడిలోని పిల్లాడిని తీసుకువచ్చి తన కొడుకేనని తాతయ్యకి చూపించాలని నిశ్చయించుకుంటుంది. సదరు నాటకంలోని భాగంగా పిల్లాడిని ఉయ్యాల్లో వేసి జోలపాడి నిద్రపుచ్చే తతంగాన్ని ఓ రిహార్సిల్లా భానుమతి చేత చేయిస్తుంది సూర్యకాంతం. ఆ సందర్భంగా వచ్చే పాట ఇది.

భీంప్లాస్ రాగంలో స్వరపరచిన ఈ పాట ఈనాటికీ వినసొంపుగా ఉంటుంది. 1950 దశకంలో వచ్చిన పాటలలో లాగానే ఈ పాటలలోనూ హవాయిన్ గిటార్ వాద్యం వేరు చేసి పాడుకోలేనంతటి ప్రాధాన్యత పరవశింప చేస్తూ ఉంతుంది.

1954 లో 'చక్రపాణి' విడుదలయిన సుమారు ఇరవైయేళ్ళకి 'తల్లిదండ్రులు' అనే చిత్రం వచ్చింది. ఆ చిత్రంలో 'ఈనాడు అమ్మాయి పుట్టిన రోజు' అనే పాటను ఘంటసాల స్వరపరచి సుశీలతో పాడారు. ఆ పాట వినగానే 'ఇది ఉయ్యాల జంపాలలూగరావయ్యా పాటని తీసుకు చేసేశారు" అనేశారు కొంత మంది. నిజానికి ఆ పాటకి, ఈపాటకీ పల్లవిలోని మొదటి ఆరు అక్షరాల వరకే స్వరపరంగా కాస్త పోలిక కనబడుతుంది. అది యాదృచ్ఛిక సామ్యమే తప్ప కాపీగాని, ప్రేరణగానీ కానే కాదు. అయినా సరే కొంతమంది అటువంటి అభిప్రాయానికి లోనయ్యారంటే అది ఆ 'ఉయ్యాల జంపాలలూగరావయ్యా' పాట వేసిన చెరగని ముద్ర ప్రభావమే తప్ప వేరొకటి కాదు.

సంగీత పరంగా చూసుకున్నా, హాస్య ప్రధానంగా చూసుకున్నా 'చక్రపాణి' తెలుగువాళ్ళందరూ గర్వంగా చెప్పుకోదగ్గ సినిమా. తెలుగుతనం ఆసాంతం ఉట్టిపడుతూ ఉంటుంది. చిన్న సమస్యని అతి సున్నితంగా చిత్రీకరించడం ఎలా అనే విషయాన్ని ఈ సినిమా చూసి తెలుసుకోవచ్చు.



# ఆ పాత పాట మధురం



రాజా

# విప్రనారాయణ

*అభిరుచికి అద్దం పడుతూ కొత్తందాలతో తియ్యందనాలు అద్దుకుంటూ శిఖరాయమాన ప్రమాణాలను అందుకునే పాటలను అందించే స్థాయిగల భరణీ సంస్థ నిర్మించిన చిత్రం విప్రనారాయణ. ఈ చిత్రంలోని సంగీతం - తెలుగువారంతా మరోసారి గర్వంతో తలెత్తుకోదగ్గదే, తలెకెత్తుకోదగ్గదీనూ! స్వరాల నరాలలో రాగ చైతన్యాన్ని కలిగించే యస్.రాజేశ్వరరావు ఈ చిత్రంలో 'రాగేశ్వరరావు'గా తన ముద్రను మరింత పటిష్టం చేసుకోగలిగారు. 'విప్రనారాయణ' చిత్రానికి ఆయన సమకూర్చిన ఆణిముత్యాల వంటి పాటలలో ఓ నాలుగింటి గురించి.*

చూడుమదే చెలియా ||చూడ||
బృందావనిలో నందకిశోరుడు ||బృందా||
అందముగా దీపించే లీలా ||చూడ||
మురళీ కృష్ణుని మోహనగీతికి || మురళీ ||
పరవశమైనవి లోకములే || పరవశ ||
విరబూసినవి పొన్నలు పొగడలు
పరిమళమెగసెను మలయానిలయముల
సోలెను యమునా ||చూడు||
నారీ నారీ నడుమ మురరీ నారీ నారీ
హరికీ హరికి నడుమ వయ్యారీ
తానొక్కడైనా ... ఆ...
తానొక్కడైనా తలకొకరూపై ||తానొక||
మనసులు దోచె రాధామాధవ
కేళీనటన... ||చూడు||

అక్కినేని నాగేశ్వరరావు, భానుమతి అభినయించిన ఈ పాటను సముద్రాల రాఘవాచార్య రచించారు. ఏ.ఎం.రాజా ఆలపించారు. అంతవరకూ ఘంటసాల గళంతో ముడిపడ్డ అక్కినేని అభినయానికి ఏ.ఎం.రాజా స్వరాన్ని జతచేయటం సాహసమే అయినా,

'చూడుమదే చెలియా' పాటకు లభించిన ఆదరణ - అటు ఏ.ఎం.రాజా సుతిమెత్తని స్వరసౌందర్యాన్ని, ఇటు సంగీత దర్శకునిగా రాజేశ్వరరావు సామర్థ్యాన్ని తెలుగు వారికి తేటతెల్లం చేసింది.

ఇక సాహిత్యపరంగా చెప్పుకోవాలంటే - పామరుడి నోట కూడా పలికే విధంగా 'నారీ నారీ నడుమ మురారీ / హరికీ హరికీ నడుమ వయ్యారీ / తానొకడైనా తలకొక రూపై ' అంటూ శ్రీకృష్ణుని శృంగార లీలా విలాసాలని అతిక్లుప్తంగాను. అతి గుప్తంగాను అందించిన సముద్రాల వారి సాహితీ ఆధ్యాత్మిక సంయమనానికి - నైతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చే ప్రతి మనస్సు నమసులర్పిస్తూనే ఉంటుంది. ఇక్కడ చిత్రీకరణ పరంగా కూడా కొంత చెప్పాలి. ఈ సన్నివేశ సమయానికి విప్రనారాయణుడిలో శృంగార భావాలకు సంబంధించిన చిత్తచాంచల్యం మొదలు కాదు. అతనికి దేవదేవిలో కూడా కృష్ణుడే కనిపిస్తూ ఉంటాడు. ఈ భావాన్ని ప్రేక్షకుని మదిలో ఖచ్చితంగా నాటుకునేలా భానుమతిని శ్రీకృష్ణుని గెటప్‌లో 'నారీ నారీ నడుమ మురారీ' చరణానికి ముందు చూపిస్తారు. ఆ సన్నివేశ అంతరార్థాన్ని తన సాహిత్యంతో తెలిపిన సముద్రాల వారిని, చిత్రీకరణలో తేటతెల్లం చేసిన దర్శకుడు పి. రామకృష్ణని కృతజ్ఞతున్న వాడెవడూ మెచ్చుకోకుండా ఉండలేడు. ఇటువంటి సన్నివేశాలలో ప్రేక్షకుని బలహీనతలను సొమ్ము చేసుకోకుండా - తెలిసినదేదో చెప్పి వీలైనంత వరకూ వారిని మరింత ఉన్నతులుగా చేయాలనుకునే వారి సంస్కారానికి జోహార్లు అర్పించకుండా ఉండలేము.

ఈ పాట గురించిన ఒక ఉదంతం - 'నారీ నారీ నడుమ మురారి' అనే భావన ప్రముఖ రచయిత, అనువాదకుడు మద్దిపట్ల సూరి గారికి బాగా నచ్చిందిట. ఈ సినిమాకు సముద్రాలగారితో కలిసి పనిచేసిన మల్లాది రామకృష్ణశాస్త్రిగారితో 'చాలాబాగా రాసారండీ' అని మెచ్చుకోబోతే ఆయన "మాదేముంది, లీలాశుకుడు శ్రీ కృష్ణకర్ణామృతంలో చెప్పిన భావమే కదా తెలుగులో చెప్పాం" అంటూ ఆ శ్లోకాన్ని పాడి వినిపించరట.

"అంగనా అంగనా మన్తరే మాధవో, మాధవం మాధవం చాన్తరే ణాంగనా
ఇత్థమాకల్పితే మండలే మధ్యగః, సంగు వేణునాదేవకీనందనః"

(తా: ఒక్కొక్క స్త్రీకిని నడుమ తానును తన రెండు రూపుల నడుమ ఒక్కొక్క స్త్రీయునుగా వృత్తాకార మండలముగా తీర్చి మధ్య తాను వేరొకడై నిలిచి దేవకీ నందనుడు శ్రీకృష్ణుడు చక్కగా వేణువుగానం చేసెను.)

ఇక సంగీత పరంగా చెప్పాలంటే - హిందోళ రాగంలో ఎన్ని సినీగీతాలు వచ్చినా సరే ఎప్పటికప్పుడు కొత్త సొగసులతో అందిస్తున్నారు మన సంగీత దర్శకులు. పరిధులు ఎంత తక్కువగా ఉన్నా, పరిమితులు ఎంత ఎక్కువగా ఉన్నా ఆ రాగానికి ఉన్న శక్తి ఎంతటిదో ఈ పాట ద్వారా మరోసారి నిరూపించారు యస్.రాజేశ్వరరావు. ముఖ్యంగా 'నారీ నారీ నడుమ మురారీ' చరణానికి ముందు ఇంటర్లూడ్‌లా వినిపించే వాద్య సంగీతాన్ని రాజేశ్వరరావు పరంగనూ, ఆ చరణం ఎత్తుకుంటున్నప్పుడు మంద్రస్థాయిలో మన చెవికి సోకే గళ మాధుర్యాన్ని ఏ.ఎం.రాజా పరంగానూ ఒకసారి వింటే మరిచిపోలేం.

---

ఎందుకోయీ తోటమాలి
అంతులేని యాతనా ||ఎందు||
ఇందుకేనా నీవు చేసే
పూజలన్నీ తపోధనా ||ఇందు|| ||ఎందు||
వన్నె చిన్నెలీను ఈ విలాసం ||వన్నె||
చందమామ చిన్నబోవు ఈ ప్రకాశం
నిన్నేలు వానీ లీలలేరా
కన్నారా కనరా ఏలుకోరా ||కన్నారా||
ఓ...ఓ...ఓ...ఓ ||ఎందు||
అందరానీ విందుపైనా ఆశలేలా ||అంద||
పొందుకోరు చిన్నదానీ పొందవేలా
అందాల రాయా, అందరార ||అందా ||
ఆనందమిదియే అందుకోరా ||ఆనందా||
ఓ...ఓ...ఓ ||ఎందు||

ఈ పాటను సముద్రాల రాఘవాచార్య రచించగా భానుమతి ఆలపించగా అక్కినేని, భానుమతి అభినయించారు.

'ఎందుకోయి తోటమాలి' విషయానికొస్తే... వాహినీ వారి 'స్వర్గసీమ' సినిమాలోని 'ఒహోహో పావురమా' పాట తరువాత రకరకాల పోకడలతో, విన్యాసాలతో మలచబడ్డ పాటగా ఈ పాటను చెప్పుకోవాలి. అరబిక్, పర్షియన్ సంగీతంలో ఒక రకమైన వశీకరణ శక్తి ఉంటుంది. ఆ ఆకర్షణను ఛాయాచిత్రంగా స్పృశిస్తూ ఆ స్వభావాన్ని అందించడానికి 'కీరవాణి' రాగాన్ని ఎన్నుకోవటంలోనే రాజేశ్వరరావుగారి ప్రజ్ఞ తెలుస్తుంది. పైగా పాడింది 'భానుమతి గనుక ఆ గమకాలు, ఆ సంగతులు అతి అందంగా అతికిపోయాయి ఆ కంఠానికి. అందుకే ఆ రోజుల్లో కొందరనేవారు 'భానుమతి గళంలో అద్భుతంగా పలుకుతాయి - గమకాలూ, సంగతులూ... అదే మిగతా కంఠాలకిస్తే ఇక అంతే సంగతులు' అని.

---

విరహే...తవ...దీనా
సా విరహే తవ దీనా... రాధా
సా విరహే తవ దీనా రాధా
సా విరహే తవ దీనా రాధా
సా విరహే తవ దీనా...
నిందతి చందన మించు కిరణమను
నిందతి ఖేదమధీరం
వ్యాకనిలయమిళ నేన గరళమిప ||వ్యాళ||
కలయతి మలయ సమీరం
కుసుమ విశిఖర తల్పమనల్ప

విలాసకళా కమనీయం
వ్రతమివ తవపరి రంభసుఖాయ
కరోతి కుసుమ శయనీయం ||సావిరహే||
ప్రతిపదమిదమపి నిగదతి మాధవ
నిగదతి మాధవ నిగదతి మాధవ
తవ చరణే పతి తాహం
త్వయివిముఖేమయి
సపది సుధానిధి
రపితనుతే తనుదాహం || సావిరహే ||
కృష్ణా... తవ విరహే... దీనా....

ఈ పాటను భానుమతి ఆలపించగా అక్కినేని నాగేశ్వరరావు, భానుమతిపై చిత్రీకరించారు. పన్నెండవ శతాబ్దానికి చెందిన జయదేవ మహాకవి రాసిన గీతగోవిందంలోని ఈ అష్టపదికి యస్.రాజేశ్వరరావు చేసిన స్వరకల్పన ఆయన సంగీత జైత్రయాత్రలో ఓ మధురమైన మజిలీగా చెప్పుకోక తప్పదు. 'విప్రనారాయణ' చిత్రం విడుదలకు ముందు ఈ గీతాన్ని తెలుగువారు ఎలా గుర్తుంచుకునే వారో కానీ తరువాత నుంచీ ఎప్పుడు ఎవరు ఉదహరించవలసి వచ్చినా రాజేశ్వరరావు చేసిన వరస ఆశ్రయించటం తప్ప గత్యంతరం లేదనే అనిపిస్తుంది. యమన్ కళ్యాణి రాగంలో రాజేశ్వరరావు చేసిన పాటలన్నీ ఆ రాగంలోని సారాన్నంతా ఎప్పటికప్పుడు తేనెలూరుతూ అందిస్తూనే ఉన్నాయి. ఆ పాటల వరుసలో అగ్రస్థానంలో ఉంచదగ్గ గీతమిది. ఈ పాటల్లో ఫ్లూట్‌ని, హవాయిన్ గిటార్ని ఆయన ఉపయోగించిన తీరు ఆ రాగం పైనా, ఆయా వాద్యాల పైనా ఆయనకున్న పట్టుని పట్టిస్తాయి. ముఖ్యంగా 'తవ చరణేపతి తాహం' అనే పాదం తరువాత వచ్చే ఫ్లూట్‌బిట్, చరణాల మధ్యలో వచ్చే ఇంటర్లూడ్‌లతో పాటు గీతానికి ఆద్యంతమే కాక ఆది అంతాలలో కూడా వినిపించే హవాయిన్ గిటార్ బిట్లు - ఇవన్నీ మధుర లోకాలకు తీసుకుపోయే మెట్లు.

ఇక ఈ పాటను భానుమతి పాడిన తీరు అన్యులకు అసాధ్యమనే అనిపిస్తుంది. వేరొకరి గళంలో ఈ పాటని వింటే భానుమతిపై గౌరవం ఇంకా ఇనుమడిస్తుంది. ఏకంగా భానుమతి పాడిన పాటనే గనక వింటే అంతటి గొప్ప జిలుగులను అందించగల కంఠం ఆమెకున్నందుకు, వాటిని అందుకోగల చెవి మనకున్నందుకు ముచ్చటేస్తుంది. పాటకు ముందునా, చివర్నా వచ్చే 'తవ విరహే దీనా' దగ్గర 'దీ...నా' అంటూ ఆమె తన స్వరం దావారా చూపిన 'అప్స్ అండ్ డౌన్స్' నభూతో అని చెప్పక తప్పదు.

---

అతడు:మధుర మధురమీ చల్లని రేయి
ఆమె:మరువతగనిదీ ఈ హాయీ ||మధుర||
అతడు:నవ్వుల వెన్నెల నాలో వలపుల ||నవ్వుల ||
ఆమె:స్వాముల సోయగమెంచి
పులకించునదేమో రేరాణి ||మధుర||
అతడు: విరికన్నెలు అరవిరిసిన కన్నుల
దరహాసించునో దేవీ
ఆమె: మన అనురాగము చూసి.... ||విరికన్నెలు||
చిరునవ్వులు చిలుకును స్వామీ ||మధుర ||
నీ వరమున నా జీవనమే
పవనమాయెను స్వామీ ||నీ వరమున||
అతడు: ఈ వనసీమయె నీ చెలిమీ.... ||ఈవన ||
జీవన మాధురి చవిచూపినదే || మధుర ||

ఇది పూర్తిగా యస్.రాజేశ్వరరావు పాట, మోహనరాగం ఆయన చేతిలో ఎంత సమ్మోహనంగా రూపుదిద్దుకుంటుందో నిరూపించే పాట. ఈ పాటలో కూడా హవాయిన్ గిటార్ని ఆయన వాడుకున్న తీరుకి మన మనసులు పులకించిపోతాయి. ఏదైనా ఒక వాద్యంతో అంతో ఇంతో ప్రవేశం వున్న వారికి ఈ హవాయిన్ గిటార్ని కూడా నేర్చేసుకుంటే బావుండుననేటంత ఆకర్షణీయంగా ఈ పాటలోని ఇంటర్లూడ్‌లను మలచారాయన. మోహనరాగంలో అతి తక్కువ సినీగీతాలను పాడిన భానుమతి స్వర జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయిన పాట కూడా ఇదే ముఖ్యంగా మన అనురాగము చూసి దగ్గర - దగ్గర గమకాలతో ఆవిడ తీసిన ఆలాపన - మోహన రాగంలో విన్యాసాలను చేయాలనుకునే వారికి స్వంతంగా స్వర పరీక్ష చేసుకునేందుకు ఉపయోగపడే ఓ గీటురాయి. ఇక సహగాయకుడిగా ఏ.ఎం రాజా కాంట్రిబ్యూషన్ కూడా తక్కువేం కాదు. మంచి పాటకు చెవియొగ్గి వినేవారి హృదయాలలో శాశ్వత పీఠాన్ని వేసుకోదగ్గ అర్హతలన్నీ ఉన్న పాట ఇది. ఈ పాటను తెరపై అక్కినేని నాగేశ్వరరావు, భానుమతి అభినయించారు.

కేవలం పాటల పరంగానే కాకుండా తదితర విలువల పరంగా కూడా చక్కని ప్రమాణాలను కనపరచిన ఈ విప్రనారాయణ చిత్రం రాష్ట్రపతి ప్రశంసలను అందుకుని జాతీయ స్థాయిలో మన తెలుగువారికి మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది.

*ఈ సినిమాకి సంబందించిన ఓ ఉపకథ ఉంది. ప్రముఖ దర్శకుడు, రచయిత కీ.శే.జంధ్యాల ఈ చిత్రాన్ని చూసి ప్రభావితులైన వారిలో ఒకరు. అప్పుడాయనకి మూడేళ్ళుంటాయేమో! సినిమా చూసినప్పటినుంచీ విప్రనారాయణుడిని చూడాలని ఉందనేవారు. ఒకసారి అక్కినేని నాగేశ్వరరావు ఏదో పనిమీద విజయవాడకు రావటం జరిగింది. అది తెలుసుకున్న జంధ్యాల బంధువులు ఆయన్ని అక్కినేని దగ్గరకు తీసుకువెళ్ళి "ఇదిగోరా నీ విప్రనారాయణుడు" అంటూ చూపించారు. అక్కినేని అప్పుడు పాంటు, షర్ట్‌లో ఉన్నారు. జంధ్యాల మనసులో భక్తుడి గెటప్‌లో ఆయన రూపం ముద్రపడిపోయి ఉండటం వలన "అరె... నామాలేవీ...!" అంటూ ఆశ్చర్యపోయారు. పవిత్రమైన ఆ అమాయకత్వానికి ముచ్చటేసుసింది అక్కినేనికి. వెంటనే జంధ్యాలను ఎత్తుకుని ఒళ్ళో కూర్చోపెట్టుకున్నారు. చాలా సేపటివరకూ దింపలేదు కూడా. "మీకిబ్బందిగా ఉందేమో" అని పక్కనున్న వాళ్ళు మొహమాటపడుతున్నా "ఫరవాలేదండీ" అంటూ వదల్లేదు జంధ్యాలని. అదే జంధ్యాల భవిష్యత్తులో దర్శకుడౌతాడని, అక్కినేనితోనే ఓ సినిమాని తీస్తారని ఎవ్వరూ అనుకోలేదు అప్పటికి. అదే జీవిత చిత్రం. ఆనాటి ఆ తీపి గురుతుని తన మనసులో భద్రంగా దాచుకున్నారు జంధ్యాల. తను దర్శకుడిగా మారిన తరువాత 'అమరజీవి' అనే చిత్రాన్ని అక్కినేనితో తీసినప్పుడు అందులో విప్రనారాయణుని కథను ఓ సంగీత రూపకంగా మలచి ఆనాడు తన మనసులో ముద్రపడిపోయిన ఆ వేషధారణలో అక్కినేనిని మరోసారి చూసుకున్నారాయన. 'అసుర సంధ్య వేళ ఇది' అంటూ ప్రారంభమయ్యే ఆ సంగీతం రూపకంలో అక్కినేనితో దేవదేవి పాత్రలో నటించింది జయప్రద.*



# ఆ పాత పాట మధురం
## రాజా



# చంద్రహారం

*చెప్పదలచుకున్న విషయాన్ని పాట రూపంలో చెప్పాలనుకున్నప్పుడు సాహిత్య రూపంగా వెలువడిన ఆ భావంలోని వస్తు గణానికి ప్రాణం పోసేది సంగీతమే. అందుకే సాహిత్యానికి సంగీతం దోహదం చెయ్యాలేగానీ ద్రోహం చెయ్యకూడదు. 1954 లో విడుదలయిన విజయావారి చంద్రహారం చిత్రంలోని ఈ రెండు పాటలను ఈ రోజున వింటే - కిక్కిరిసిన రోడ్డు మీద - ట్రాఫిక్ సెన్స్ లేని జనం మధ్య నుంచీ ఒక్కసారిగా ఎగిరిపోయి తపోవనంలో పడిన వాడి మనసులో నిండే ప్రశాంతత, పోల్చుకోవడం వచ్చి మాట్లాడ్డం రాని పిల్లాడు సంతలో తప్పిపోయి ఏడుస్తుంటే అమ్మ కనిపించినప్పుడు ఆతగాడికి కలిగే ఆనందోద్వేగం - ఇవన్నీ అనుభూతి పరంగా అవగతమవుతాయి. ముందు ఉటకించిన ఉపోద్ఘాతాన్ని అవుననిపిస్తాయి. ఈ పాటలను పింగళి నాగేంద్రరావు రాశారు. ఘంటసాల సంగీతం సమకూర్చి గానం చేశారు. ఎన్.టి.ఆర్ అభినయించారు.*

ఎవరివో ఎచటనుంటివో ఓ సఖి!
నీలమేఘ మాలికలో మెరిసిపడే చంచలవో
చెలిమి చూపి చెంతరాక
మురిపించే మిలమిలవో!! ||ఎవరివో ||
ఊహలోనె తళుకుమని -
మోహములో ముంచినావె
ఏనాటికినైన భువిని -
కనిపించువో కనరావో!! ||ఎవరివో ||
ఇది నా చెలి, ఇది నా సఖి
నా మనోహరి
మనసులోని మమతలన్ని
కనుల ముందు నిలిచినటుల
వన్నెలతో చిన్నెలతో
మనసు గొనిన ఊహాసుందరి
ఇది నా చెలి, ఇది నా సఖి
నా మనోహరి
కలువ కనుల చల్లని సిరి
ఉల్లములో ప్రేమలహరి
వినయ సహన శోభలతో
తనివినించు సుగుణ సుందరి
ఇది నా చెలి, ఇది నా సఖి
నా మనోహరి

1948 లో ప్రముఖ హిందుస్థానీ విద్వాంసుడు బడేగులాం ఆలీఖాన్ మద్రాసుకి వచ్చి సంగీత కచ్చేరీ ఇవ్వడం, ఆ ప్రభావంలో పడిన ఘంటసాల తన ఇంటికి బడే గులాం ఆలీఖాన్‌ని ఆహ్వానించి రెండురోజులపాటు ఆతిథ్యం ఇచ్చి ఎన్నో హిందూస్థానీ రాగాలను ఆకళింపు చేసుకోవటం ఇవన్నీ 'పాతాళ భైరవి'కి సంబందించిన సమీక్షలో పాఠకులకు అందించడం జరిగింది.

'చంద్రహారం' చిత్రంలోని 'ఇది నా చెలి' పాటకు హిందూస్థానీ సంప్రదాయానికి చెందిన 'రాగేశ్వరి' రాగాన్ని ఉపయోగించడం వెనుక బడే గులాం ఆలీఖాన్‌తో పంచుకున్న సాంగత్య వైభవం ఉందంటారు కొంతమంది. అలాగే 'ఎవరివో ఎచటి నుంటివో' పాటకు ఉపయోగించిన 'మోహన' రాగంలో చేసిన కొన్ని అన్యస్వరాల ప్రయోగానికి కూడా ఆ ప్రేరణ ఉందని వినికిడి.

జనరంజకత్వం కోసం రాగాలను మిశ్రమం చేసుకునే సౌలభ్యం, చెవికింపుగా ఉండేంత వరకూ ఆలాపనలో స్వతంత్ర సంచారం చేసుకునే వీలు - హిందూస్థానీ సంప్రదాయంలోను, ముఖ్యంగా లలిత గీతాల స్వరకల్పనలోను ఉంది. ఈ అవకాశాలన్నింటినీ అలవోకగా అందిపుచ్చుకుని అత్యద్భుతంగా స్వరపరచి - ముందు అనుకున్నట్లుగా - భావాన్ని అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినంత సులువుగా తన గళమాధుర్యంతో ప్రేక్షక శ్రోతల హృదయాలను ఈ పాటల ద్వారా రసప్లావితం చేయగలిగారు ఘంటసాల.

ఇక సాహిత్య పరంగా చెప్పాలంటే చెలి, సఖి, మనోహరి, చల్లని సిరి, లహరి, తనివినించు, చంచలవో, మిలమిలవో ఇవన్నీ పింగళి వారి పాళిపై మురిసి, మెరిసిన తళతళలే...

ఈ 'ఎవరివో' పాట ముగియగానే ఆ సినిమాలో దుష్టపాత్రను ధరించిన మహానటి సావిత్రి అభినయించిన ఓ స్వరఖండిక వస్తుంది. ఎ.పి.కోమల పాడగా, కళ్యాణి రాగంలో స్వరపరచబడిన ఆ చరణం సాహిత్యం ఇలా ఉంటుంది:

వలపు పాట వినగానె
నిలవలేక చేరితినోయ్
మనసు పడిన వరాలొసగి
నిను తరింపజేయుదునోయ్
సఖా ఓ సఖా....

---

*<u>ఈ రెండు పాటలూ కాక మరో పాటను కూడా ఇక్కడ ప్రస్తావించవలసి ఉంది.</u>*

ఒహూం ఒహూం హూం -
ఒహూం ఒహూం
ఏం చేస్తే అదే ఘనకార్యం
మనమేం చేస్తే అదే ఘనకార్యం
అదే ఘనకార్యం ||ఒహూం ||
నేను చెప్పినది నీకు తెలియక
నీవు చెప్పినది నాకు తెలియక
మనము చెప్పినది మనకే తెలియక
జిలిబిలి గిలిబిలి గలిబిలిగా ||ఒహూ||

చెప్పేదెపుడూ చెప్పకుండగా
చేసే దెపుడూ చెప్పకుండగా
చెప్పి చేయునది ఒప్పకుండగా
గలిబిలి గిలిబిలి గజిబిజిగా ||ఒహూ ||
వాడి జుట్టు ముడి వీడికి పెట్టి
వీడి జుట్టుముడి వాడికి పెట్టి
వాడు వీడు సిగపట్టు పట్టగా
గజిబిజి గిజిబిజి గడబిడగా ||ఒహూ||

ఈ పాటను పిఠాపురం నాగేశ్వరరావు, బృందం పాడగా జోగారవు, పద్మనాభం, శర్మ (కె.వి.యస్.శర్మ) అభినయించారు. ఆనందభైరవి రాగం ఈ పాటకు ఆధారం. పూర్తి శాస్త్రీయత తొణికిసలాడే ఈ రాగాన్ని హాస్య, వ్యంగ్య గీతానికి ఉపయోగించటంలో సంగీత దర్శకుడిగా ఘంటసాల చతురతను మనం ప్రత్యేకంగా గమనించాలి. ఈ పాట ఓపెనింగ్ బిట్‌ని, ఇంటర్ లూడ్‌లని జాగ్రత్తగా వింటే 'బంగారు పాప'లోని 'తాధిమి తకధిమి తోల్‌బొమ్మ' పాట గుర్తుకు వస్తే అందుకు కారణం ఆనందభైరవి రాగమే! ఇక సాహితీ పరంగా పాటలో పింగళి చేసిన గమ్మత్తులు, విసిరిన చెణుకులు ఎప్పుడు విన్నా, అన్వయించుకున్నా నిత్య నూతనంగా ఉంటాయి. వ్యంగ్యం అంటే ఇలా ఉండాలి అని అనిపించేలా ఉంటాయి. పాట సాహిత్యాన్ని పదే పదే మననం చేసుకుంటే మనచుట్టూ ఉండే వారిలోనే బోలెడంత మంది జ్ఞాపకం వస్తారు. అంతటి విశ్వజనీయత ఉందీ గీతంలో!

మొదటి చరణం చివరి వాక్యమైన 'జిలిబిలి గిలిబిలి గలిబిలిగా'లో 'గలిబిలి'ని తీసుకుని రెండవ చరణం చివరి వాక్యంకి మొదటిగా చేర్చి 'గలిబిలి గిలిబిలి గజిబిజిగా' అనీ, ఈ వాక్యం చివర్న ఉన్న 'గజిబిజి'ని తీసుకుని మూడో చరణం చివరి వాక్యమైన 'గజిబిజి గిజి బిజి గడబిడగాకి మొదట చేర్చటం పింగళి చేసిన మరో తమాషా!





# ఆ పాత పాట మధురం

## రాజా



# రేచుక్క

*ప్రతిభకు తగిన గుర్తింపు లభించని సంగీత దర్శకులలో అశ్వత్థామ ఒకరు, ఆయన సంగీత దర్శకత్వం వహించిన చిత్రాల పాటలన్నిటినీ సంపాదించి ఏకబిగిన వినదలిస్తే - కొన్ని కొన్ని పాటలలో - ఆయనకు సమకాలీనులుగా ఉన్న సంగీత దర్శకులతో సమానమైన డెప్త్ కనిపిస్తుంది. ఆయన ప్రతిభకు అద్దం పట్టే చిత్రాలలో ఒక చిత్రం ప్రతిభావారి రేచుక్క.*

ఇది ఘంటసాల బలరామయ్యగారి చిత్రం. కథ, బ్యానర్ ఆయనవే. ఘంటసాల బలరామయ్య అంటే ఈ తరం వారికి తెలియకపోవచ్చుగాని, అక్కినేని నాగేశ్వరరావుకు చలన చిత్ర జీవితాన్ని ఇచ్చిన వ్యక్తిగా - బాలరాజు వంటి చిత్రాన్ని తీసి ప్రతిభా సంస్థకు గుర్తింపు తెచ్చిన నేతగా పరిచయం చేస్తే కొందరికి అర్థం అయ్యే అవకాశం ఉంది.

1954 లో విడుదలయిన 'రేచుక్క'లో ఎన్.టి.రామారావు, అంజలీదేవి, దేవిక (అప్పుడామె పేరు ప్రమీల) ముఖ్య తారాగణం. అక్కినేని కూడా ఓ సన్నివేశంలో కనిపిస్తారు. సంగీత సాహిత్యాలపై మక్కువ ఉన్న ప్రతివారికి ప్రాతఃస్మరణీయులైన స్వర్గీయ మల్లాది రామకృష్ణశాస్త్రిగారు ఈ చిత్రానికి మాటలను, పాటలను రాశారు. మనసులో మననం చేసుకుంటే 'స్వర్గీయ' అనే మాటను ఏ సంకోచం లేకుండా ఆయన పేరు ముందు ఉంచదగ్గ మహోన్నతమైన వ్యక్తిత్వం, పుంభావ సరస్వతి అనే మాటకు నిస్సందేహంగా ఓ నిర్వచనంలా నిలబడ్డదగ్గ మేధోసంపద గల మల్లాది రామకృష్ణశాస్త్రిగారు రాయగా, అశ్వత్థామ స్వరపరచిన 'రేచుక్క'లోని పాటలలో అయిదింటి గురించి:

ఎక్కడిదీ -!
ఎక్కడిదీ అందం! ఎవ్వరిదీ ఆనందం!
వెలిగే అందం - చెలరేగే ఆనందం!
ఎక్కడిదీ అందం!
లోకంలో కన్నెలకూ లోపాలెన్నే చిన్నది ||లోకంలో||
మారుని జవరాలికైనా -
వంకలు దిద్దే వన్నెది ||మారుని||
వెన్నెల దీపల్లె - మెరుపూతీవల్లె
ఏడుమల్లెపూవులెత్తు - తూగే
బంగారుపాప ఎవరో!
ఏలేవారెవరో - కలలేలేవారెవరో! || ఏలే||
ఎన్నెన్నో ఊహలు - కొసరే కోరికవేళ ||ఎన్నెన్నో||
మేల్ మేల్ నెయ్యములు - మిడిసే వేడుక వేళ ||మేల్||
చిక్కని మక్కువల - చక్కలి గింతలవేళ ||చక్కని||
ఊహల ఉయ్యాలలో - ఊగే బంగారు పాప
ఎవరో -
ఏలేవారెవరో - కలలేలేవారెవరో
ఏలేవారెవరో!

ఈ పాటను జిక్కి పాడగా దేవిక(ప్రమీల)పై చిత్రీకరించారు. 'లోకంలో కన్నెలకు లోపాలెన్నె చిన్నది / మారుని జవరాలికైనా (రతీదేవికైనా) వంకలు దిద్దే వన్నెది' అనే వాక్యాలు మల్లాదివారు అద్దిన జిలుగులు. ఈ పాట మోహనరాగం ఆధారంగా స్వరపరచబడింది. ఈ రాగం పోకడ తెలిసినవారికి, పాటలోని పోకడ తెలిసినవారికి పాటలోని - 'బంగారు పాప' అనే మాట తర్వాత నుంచి 'ఎవరో ఏలే వారెవరో కలలేలేవారెవరో' అనే వాక్యాల దాకా స్వరపరంగా తీసుకున్న అందమైన మలుపులు అశ్వత్థామ సామర్థ్యానికి గీటురాళ్ళుగా నిలబతాయి. దొరికితే ఈ పాటను సంపాదించి వినండి. మళ్ళీ మళ్ళీ వినాలనిపించే విధంగా ఉంటుందో లేదో మీకు మీరే బేరీజు వేసుకుని చూడండి.

---

ఎటు చూసినా బూటకాలే - ఎవరాడినా నాటకాలే ||3||
తలక్రిందుల మారి - కలికాలంలో
చెడిపోలేనివారూ - చేతకానివారే! ||తలక్రిందుల||
అంటుంది నానా - నమ్మమంటూంది నానా!! ||అంటుంది||
రూకల సంచీ రొండిన గ్రుచ్చితే
రొమ్ము విరుపొచ్చిందా మొనగాడా
కరుకుందా - కాళ్ళకు కదనుందా
ఒరతీయని చురకత్తికి పదునుందా
మనలో కదనుందా పదునుందా
పొగా చుట్టావ్ పగడీ పెట్టావ్
వేషం కట్టావ్ మీసం మెలేశావ్ దొరకొడుకా
అడవుల్లో పులికి ఆకలేసి నీ మీదికి ఒక దుముకు దుమికితే
నిలబడి కలబడతావా?
లాలించి లంచం పెడతావా -హోయ్ ||నిలబడి||
ఆ....లేకలేక ఓపిక చేసుకు
రాకరాక రానే వచ్చావ్‌గాని - ఏం లాభం! ||లేకలేక||
మీ జగం కాదు - ఈ యుగం వేరు తాతా!
తరాల్ మారి సం - బరాల్ మీరినయ్ తాతా ||మీ|| ||ఎటు చూసినా||

ఈ పాటను పి.లీల పాడారు. సినిమాలో అంజలీదేవి (పాత్ర పేరు నానా) పాడుతూ నృత్యం చేస్తూ చూడ్డానికి వచ్చిన వాళ్ళ దగ్గర ధనాన్ని దొంగిలిస్తూ ఉంటుంది. ఆ నృత్యానికి హాజరయిన వాళ్ళలో కథానాయకుని పాత్ర ధరించిన (పేరు కన్నయ్య) ఎన్.టి.రామారావు, బాటసారిగా వచ్చిన అక్కినేని నాగేశ్వరరావు ఉంటారు. 'పొగచుట్టావ్, పగడీ పెట్టావ్, వేషం కట్టావ్, మీసం మెలేశావ్ దొరకొడుకా' అంటూ అంజలీదేవి ఉద్దేశించి పాడినది అక్కినేని గురించే! అలా పాడుతూ ఆయన రొంటిన ఉన్న సొమ్ము అంజలీదేవి కాజేస్తుంది. అది చూసి ఎన్.టి.ఆర్ ఆ సొమ్మును తిరిగి అక్కినేనికి ఇప్పిస్తారు. ఈ ఒక్క సన్నివేశంలో మాత్రమే వచ్చే ఈ పాత్రని

ఘంటసాల బలరామయ్యగారి మీద గౌరవంతో అక్కినేని ధరించారు. విశేషమేమిటంటే ఆయన పేరు పాటల పుస్తకంలో గానీ సినిమా టైటిల్స్‌లోగాని చూపించలేదు.

ఇక పాట పరంగా చెప్పుకోవాలంటే సంగీతపరంగా రకరకాల పోకడలు పోతుందీ గీతం. మధ్య మధ్య కవ్వాలీ బాణీ కూడా కనిపిస్తుంది.'తలకిందుల మారి కలికాలంలో చెడిపోలేని వారు చేతకానివారే' అని మల్లాది వారు విసిరిన చెణుకుని ప్రత్యేకంగా గమనించి తీరాలి.

---

ఒంటరొంటరిగ పోయేదానా
ఒకమాట వినిపో ||ఒంట||
ఒకమాట వినిపో
ఆడేపాడే ఈడున ||ఆడే||
తోడుండాలి సైదోడుండాలి నానా ఓ నానా
అదిగదిగో చిట్టడవి అల్లదిగో నట్టడవి
సింహాలుంటాయ్ దోబూచులుంటయ్
ఉసుకోమంటే...

ఉసుకోమంటే.....
ఉసుకోమంటే ఉలిక్కిపడతావ్ నానా ఓ నానా -
తేరతేరగా దొరికిందంటూ దోర మనసూ దోచుకుపోతావ్
తేరగా దోచుకుపోతవ్ ||తేర తేరగా||
నిన్నంటే కన్నెత్తనంటావ్ పలుకరిస్తే పన్నెత్తనంటావ్
ఓ మైనా ఈ పైన చీటికి మాటికి కోపాలైతే
చిరాకు పెడితే చిక్కున పడతావ్ నానా ఓనానా--!!

ఈ పాటను ఘంటసాల పాడగా ఎన్.టి.రామారావు, అంజలీదేవి అభినయించారు. మధ్యమావతి రాగంలోని మాధుర్యాన్నంతా పిండి మరీ తయారు చేశారానిపిస్తుందీ పాటను వింటుంటే! ఈ పాటని అప్పుడు ఇప్పుడు మాత్రమే కాదు ఎప్పుడు విన్నా ఒకే రకం రసస్పర్శ కలుగుతుంది. అందుకు కారణం అశ్వత్థామ ట్యూన్ మాత్రమే కాదు ఘంటసాల పాడిన పద్ధతి కూడా! ముఖ్యంగా 'నానా..' అంటూ ఆయన పలికిన ప్రతిసారీ - మార్దవంగా మాధుర్యంతో ఇన్నిరకాల ఎక్స్‌ప్రెషన్స్‌తో పాడొచ్చా అని మ్యూజిక్ ఇయిర్ ఉన్న ప్రతివారికీ అనిపించి తీరుతుంది. మొదటి చరణంలో 'ఉసుకోమంటే...' అంటూ ఘంటసాల ఎత్తుకోగానే 'ఇప్పుడే చెబుతా ఇనుకో బుల్లెమ్మా' (లేచింది నిద్రలేచింది - గుండమ్మ కథ) అనే లైను శ్రోతలకు గుర్తొస్తే వారికి చక్కని 'శ్రుతపాండిత్యం' ఉన్నట్లనుకోవాలంతే!

---

అయ్ సంబరమే
అయ్ సంబరమే అయ్ పండగలే
చినదాన! వన్నెదాన!
నిను రమ్మనెనే ఇది నమ్మకమే
మనసైనవాడె ఆ రాణా ||ఆయ్||
మరోసారి వాదులాడ వేడుకైనదో ఏమో
ఆ జాణకు!
సరేకాని ఇంకోపాటా పాడించనా

దరిజేరి ఇంకో ఆట ఆడించనా
కంటికి బందం వేసి బలేపిల్ల గిర ||కంటికి ||
ఎటు మారిపోవునో ఏమో! !! ||ఆయ్ ||
తనో అందగాడేలే చిందులాడి చిన్నదాని
ఒక్కచూపులోనే మెచ్చి తల్లక్రిందులాయెనే ||తనో||
దారికి రానేరానీ సరాగాల బాణి ||దారికి||
ఎటుమారిపోయినా కానీ ఆయ్ సంబరమే!!

ఈ పాటను పి.లీల పాడగా అంజలీదేవి అభినయించారు. ఆరోజుల్లో ప్రతివారి నోట బాగా నలిగిన పాట ఇది. పాట వింటుంటే మనకు సలిల్ చౌదురి స్టయిల్ గుర్తొస్తుంది. కేవలం భావసారూప్యం గల మనసులకు మాత్రమే అవగతమయ్యే అనుభూతుల్లో ఇదొకటి. సాహిత్యాన్ని బాగా ఒకటికి పదిసార్లు గమనించి చూడండి. మల్లాది వారి ప్రభావం అటు వేటూరిలోనూ, ఇటు సీతారామశాస్త్రిలోనూ ఉందేమోనని సాహితీ ప్రియులందరికి అనిపించి తీరుతుంది. కంటికి బందం వేసే బలే పిల్ల గీర / సరే కాని ఇంకో పాట పాడించనా / తనో అందగాడేలే ఈ వాక్యాలు ఆ భావానికి బలంగా నిలబడతాయి. ఇవాళ 'బంధం' అని 'భందం' అని 'భంధం' అని రకరకాలుగా పలుకుతున్న ఈ తరం 'బందం' అంటూ ఈ పాటలో మల్లాది రాసిన మాటని, దాన్ని అలాగే పలికిన లీల ఉచ్చారణని ఒకసారి గమనించక తప్పదు.

---

ఆ మనసేమో ఆ సొగసేమో ||ఆ||
గారామో అది మారామో
ఆ తీరే వేరేమో....!!
మనసేమో సొగసేమో
లాలనగా రారా రమ్మని ||లాలనగా||

మాలిమైన జవరాలిపైన ||మాలిమైన||
జాలి లేదో మరీ మరీ బ్రతి
మాలించుకోవాలో బ్రతిమాలించుకోవాలో ||ఆ మనసేమో||
నేరనితనమా నెరజాణ తనమా! ||నేరని||
సరసాల వేళలో చెరసాలె సుఖమేమో ||సరసాల||

ఈ పాటను జిక్కి పాడగా దేవిక (ప్రమీల) అభినయించారు. ఎక్కువగా కళ్యాణి రాగంపై ఆధారపడుతూ కావలిసిన చోట మోహనరాగచ్ఛాయల లోకి వెళుతూ విన్నవారి హృదయాలపై 'రసపట్టు'ని సాధించే విధంగా అశ్వత్థామ ఈ పాటను స్వరపరచిన 'రసిక్ బల్మా' పాట, 'పేయింగ్ గెస్ట్'లో ఎస్.డి.బర్మన్ స్వరపరచిన 'చాంద్ ఫిర్‌నిక్‌లా' పాట, గుర్తొస్తే - మనం గర్వంగా కాలరెత్తుకోవచ్చు. ఎందుకంటే రేచుక్క రిలీజయింది. 1956 లోను, 1957 లోను కాబట్టి! ఏది ఏమైనా ' ఆ మనసేమో ఆ సొగసేమో' సంగీత పరంగా, సాహిత్యపరంగా, గానపరంగా ఏ విధంగా చూసిన మంచిపాట, హృదయాన్ని ఆకట్టుకునే పాట!

పైన ఉదహరించిన పాటలే కాక 'ఒంటరొంటరిగా పోయెదానా', ''ఒరయ్యో బంగారుసామి' పాటలు కూడా ఇవాళ్టికీ బావుంటాయి.

---



# ఆ పాత పాట మధురం
## రాజా



## కాళహస్తి మహత్యం

**శాశ్వతంగా నిలిచిపోయే పాటలను ప్రజలు అందించిన చిత్రాలు తెలుగు సినీ సంగీత చరిత్ర లో ఎన్నో ఉన్నాయి. తారాగణం, కథనం, సన్నివేశాలు, సాంకేతిక నిపుణుల వివరాలు వంటివి స్మృతిపథం నుంచి చెరిగిపోయినా పాటలు మాత్రం ప్రేక్షక శ్రోతల హృదయాలల్లో సుస్థిరంగా ఉండి, ఆయా పాటల ద్వారానే సదరు చిత్రం పేరుని గుర్తుకు తెచ్చుకునే సంఘటనలు కొన్ని సినిమాలకు వర్తిస్తాయి. అటువంటి చిత్రాలలో చెప్పుకోదగ్గ చిత్రం కాళహస్తి మహత్యం.**

ఈ చిత్రం 1954 లో విడుదలయింది. హెచ్.ఎల్.ఎన్. సింహా ఈ చిత్రానికి దర్శకుడు. కన్నడ చిత్రరంగాన్ని మకుటం లేని మహారాజులా ఏలిన రాజ్‌కుమార్ ఈ చిత్రానికి కథా నాయకుడు. ఇదే అతని సినీ జీవితంలో తొలిచిత్రం కూడా! తెలుగులో 'కాళహస్తిమహత్యం' పేరుతోనూ, కన్నడంలో 'బేడర కన్నప్ప' పేరుతోనూ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'పాతాళభైరవి' హీరోయిన్ మాలతి ఈ చిత్ర కథానాయిక. ముదిగొండ లింగమూర్తి పద్మనాభం, రాజసులోచన తదితర ముఖ్యపాత్రధారులు. ఈ చిత్రానికి మాటలు - తోలేటి, సంగీతం సుదర్శనం. శివునికి సంబంధించిన పర్వదినాలలో దేవాలయాలలో సైతం తప్పనిసరిగా వేసే విధంగా ఈ చిత్రంలోని భక్తి గీతాలు, పద్యాలు రూపొందాయి. అంతేకాదు, గాయకునిగా ఘంటసాల సంగీత జీవనయానంలో ఒక మహత్తరమైన మజిలీగా నిలిచిపోయాయి. 'కాళహస్తి మహత్యం' చిత్రంలో తక్కిన పాటలెన్ని ఉన్నా ఘంటసాల పాడిన భక్తిగీతాలు, పద్యాలు మాత్రం సంగీత సాహిత్య గానపరంగా ఈ నాటికీ ప్రామాణికంగా నిలిచిపోయాయి అవి:

ఓ నమశ్శివాయా నవనీత హృదయా
తమః ప్రకాశా తరుణేందుభూషా నమో...శంకరా దేవదేవా
మహేశా పాపవినాశా కైలాసవాసా ఈశా
నిన్ను నమ్మి నాను రావా నీలకంధరా దేవా ||మహేశా||
భక్తి యేదో పూజలేవో తెలియనైతినే ||భక్తి||
పాపమేదో పుణ్యమేదో కాననైతినే ||మహేశా||
చ:మంత్ర యుక్త పూజసేయ మనసు కరుగునా ||మంత్ర||
మంత్రమో తంత్రమో ఎరుగనే
నాదమేదో - వేదమేదో తెలియనైతినే ||నాద||
వాదమేల పేదబాధ తీర్చరావయ్యాస్వామి ||మహేశా||
చ:ఏకచిత్తమున నమ్మినవారికి శోకము తీర్చుము రుద్రయ్య
ప్రాకటముగ చిరువేట చూపి నా ఆకలి తీర్చగరావయ్య
దీటుగనమ్మితి గనవయ్య వేట చూపుమా రుద్రయ్యా (2)

కాళహస్తి మహత్యం చిత్రంలో మిగిలిన పాటలతో పోలిస్తే ఎక్కువ మంది నోటికి పట్టేసిన పాట ఇది. ఈ పాటకు లభించిన ప్రజాదరణ ఎంతటిదంటే - నడుస్తున్న రైళ్ళలో అడుక్కునే బిచ్చగాళ్ళు ఈ పాటను పాడే తమ పొట్ట పోసుకునే వారు. ఇది కొన్ని సంవత్సరాలపాటు నిరంతరంగా పాడినా ప్రయాణికులు పట్టించుకునే వారు కాదు. ఆ పాట ప్రారంభించగానే ట్యూన్ అయిపోయేవారు.

ఈ పాటకు పీలూరాగం ఆధారం. పరువు - ప్రతిష్ట (ఎన్.టి.ఆర్.హీరో) సినిమాలో పెండ్యాల స్వరపరచిన 'ప్రభు గిరిధారి శౌరీ రావయ్యా' అనే పాట 'చీకటి వెలుగులు' సినిమాలో చక్రవర్తి స్వరపరచిన 'చీకటి వెలుగుల కౌగిలిలో' అనే పాటలోని 'గలగలమన కూడదు' అనే చరణం ఈ రాగంలో చెప్పుకోదగ్గ ఉదాహరణలు.

---

చేకొనవయ్య మాంసమిదే చెల్వుగ దెచ్చితి బాస చొప్పునన్
ఆకొనియుంటివేమో కడుపార బిరాన భుజించవయ్య
ఈలోకులు చూడరయ్య భువిలోని క్షుదార్తుల బాధలెన్నడున్
శ్రీకర కాళహస్తి శశి శేఖరా దివ్య కృపాకరా హరా... హరా.

తనకు ఆహారాన్ని చూపితే సగం సమర్పిస్తానని దేవాలయంలోని శివలింగంతో తిన్నయ్య పలికి 'మహేశా పాపా వినాశా' పాటను పాడిన తర్వాత శివుని లీల వలన ఎదురుగా రెండు కుందేళ్ళు కనిపిస్తాయి. వాటిని తన బాణంతో కూల్చి, కాల్చి - సగం వాటాగా గుడిలోని శివలింగానికి సమర్పించే సన్నివేశంలో పై పద్యం వస్తుంది. సందర్భం తెలిసిపోతూ అతి సులువుగా అర్థమై పోయే ఈ పద్యంలోని మూడవ వాక్యం విశ్వజనీనమైనది. హంసనంది రాగంలో స్వరపరచబడిన ఈపద్యంలోని చివరి పాదం వద్ద తొలిసారి 'హరా' అని ఘంటసాల పలుకుతున్నప్పుడు మన గుండెల్లోంచి ఆ స్వరం వెలువడిందా అన్నంత రసానుభూతి కలుగుతుంది. రెండవ సారి 'హరా' అంటూ ఘంటసాల చేసిన ఆలాపనలు యధాతథంగా సాధన చేస్తే హంసనంది రాగాన్ని ఎక్కడున్నా సరే పోల్చేసుకోగల జ్ఞానం వచ్చేస్తుంది.

---

దేవా సేవకులన్న నీచమతులై దీనాళి వేధించు దుర్భాగ్యుల్లీ నరజాతి
ఈ నరజాతి పూజకును ఆ బ్రహ్మాది దేవేంద్రతత్సేవా వ్రాతనువీడి
భిక్షుడవై సేవింప ఈ బంటుకే ఈవే బంటుగ వచ్చినావు భళిరా
శ్రీకాళ హస్తీశ్వరా శ్రీకాళ హస్తీశ్వరా శ్రీకాళ హస్తీశ్వరా

తిన్నయ్య భక్తికి సంతోషించిన శివుడు ముసలి బ్రాహ్మణుని వేషంలో నీల (తిన్నని భార్య) ఇంటికి వచ్చి 'నేను కన్నయ్య బంటుని, మా యజమాని మీకివ్వమన్నార'ని చెబుతూ ఆహారపదార్థాలు, వస్త్రాలు ఇచ్చి వెళతాడు. ఇంటికి వచ్చిన కన్నయ్య నిజం తెలుసుకుని పని వాళ్ళను హీనంగా చూసే ఈ నరజాతిలో జన్మించిన నన్ను సేవించడానికి ఆ బ్రహ్మ, దేవేంద్రుల సేవలను విడిచి నీ

బంటువైన నాకు బంటుగా, వచ్చావా అంటూ పులకించిపోతూ పాడే సందర్భంలో పై పద్యం వస్తుంది. మోహనరాగంలో ఈ పద్యం స్వరపరచబడింది.

మధురము శివమంత్రం మహిలో
మరువకె ఓ మనసా (2)
ఇహ పర సాధనమే (5) నరులకు
సురుచిర తారకమే
ఇహ పర సాధనమే నరులకు సురుచిర తారకమే
ఆగమ సంచార... ఆగమ సంచార
నా స్వాగతమిదెగొనుమా ||ఆగమ||
భావజసంహారా (3) నన్నుకావగరావయ్య ||భావజ||
పాలను ముంచెదవో... ||పాలను||
మున్నీటను ముంచెదవో పాలను
భారమునీదయ్యా (2) పాదము విడనయ్యా
నీ పాదము విడనయ్యా
జయహే సర్వేశా (2) సతీ శాంభవి ప్రాణేశా ||జయహే||
కారుణ్యగుణ సాగరా (2) శ్రీ కాళహస్తీశ్వరా నన్ను
కాపాడవా శంకరా ||కారుణ్య|| ||మధురం||

మరొక గొప్ప పాట ఇది. త్రాసులో ఉండే సూచికగా సాహిత్యాన్ని భావించి సంగీతాన్ని, గానాన్ని, చెరోవైపు ఉంచితే సమతూకంలో తూగేపాట ఇది. 'ఇహ పరసాధనమే' అనే వాక్యాన్ని అయిదుసార్లు రకరకాలుగా స్వరపరచటంలోను, పాడడంలోను అటు సుదర్శనం ఇటు ఘంటసాల -ఆధ్యాత్మిక అనుభూతికి సంగీతం ఎంతగా దోహదం చేస్తుందో ఋజువు చేసి చూపించారు. అలాగే 'పాలను ముంచెదవో' దగ్గర 'ఓఓఓ' అంటూ ఘంటసాల ఆలపించిన తీరుకి గగుర్పాటు చెందని గుండెని హృదయం అనటానికి వీల్లేదు. ఈ పాటను యథాతథ రసభావాలతో పాడగలిగిన ఏ గాయకుడైనా ఏ సినీ సంగీత పోటీలోనైనా బహుమతి గెలుచుకుంటాడు.

ఈ పాటలో - 'మధురము శివ మంత్రం' నుంచి 'సురుచిర తారకమే' వరకు సింధుభైరవి రాగాన్ని 'ఆగమ సంచార' నుంచి 'నన్ను కానగరావయ్యా' దాకా శుభపంతువరాళి రాగాన్ని వరాళి రాగాన్ని, 'పాలను ముంచెదవో' దగ్గర్నుంచి 'నీ పాదము విడనయ్యా' వరకు సామరాగాన్ని, 'కారుణ్యగుణ సాగరా' దగ్గర్నుంచి 'కాపాడవా శంకరా' వరకు కామవర్ధిని రాగాన్ని ఉపయోగించారు. ఒక్కసారి ఈ పాటను స్వంతం చేసుకుని చూడండి. సంగీత సాగరంలో ఈడటం తెలిసిపోయినంత భావన కలిగితీరుతుంది.

జయజయ మహాదేవ శంభోహర శంకరా
సత్య శివసుందరా నిత్య గంగాధరా
బ్రహ్మ విష్ణుల్ సురల్ తాపసుల్
నిను వర్ణింపలేరన్న నేనెంతవాడన్
దయాసాగరా....
భీకరారణ్య మధ్యంబునన్ - బోయనైపుట్టి
పశుపక్షి సంతానముల్ కూల్చి బక్షించు పాపాత్ముడన్
విశ్వరూపా, మహామేరు చాపా
జగత్ సృష్టి సంరక్ష సంహార కార్యత్కలాపా
మహిన్ పంచభూతాత్మ నీవేకదా దేవదేవా శివా
పృధ్వి జలవాయురాకాశ తేజోవిలాసా మహేశా... ప్రభో....
రంగు బంగారు గంగాతరంగాల
రాజిల్లు, కాశీపురాధీశ విశ్వేశ్వర కాశీ
శ్రీశైల మల్లేశ్వరా
కోటినదులందు సుస్నానముల్ చేయు
ఫలమిచ్చు క్షేత్రాన వశియించు
శ్రీరామలింగేశ్వరా శ్రీరామ
నిత్య గోదావరి నృత్యసంగీత
నీరాజనాలందు
ద్రాక్షారామవాసా భీమేశ్వరా... భీమేశ్వరా....
దివ్యఫల పుష్పసందోహ బృందార్చితానంద
భూలోక కైలాస శైలానవ శియించు
శ్రీకాళహస్తీశ్వర(2)
దేవ దేవా...ఆ...ఆ...ఆ...
నమస్తే, నమస్తే, నమస్తే నమః

అత్యద్భుతమైన స్పందనని, రసానుభూతి కలిగించే స్వరరచన ఇది. 'జయజయ మహాదేవ' దగ్గర్నుంచి 'పాపాత్ముడన్' వరకు ఆరాభి రాగాన్ని 'దివ్యజపహోమ తపమంత్ర' దగ్గర్నుంచి 'తేజోవిలాసా మహేశ ప్రభో' వరకు దర్బారీని కానడని కలుపుకున్న మిశ్రమాన్ని 'రంగు బంగారు గంగా తరంగాల' దగ్గర్నుంచి 'శ్రీశైల మల్లేశ్వరా' వరకు మోహనరాగాన్ని 'కోటినదులందు సుస్నానముల్ చేయు' దగ్గర్నుంచి చివర్న వచ్చే 'నమస్తే నమస్తే నమస్తే నమః' వరకు హిందోళ రాగాన్ని ఉపయోగించారు.

సినీ సంగీతం మీద ప్రేమాభిమానాలు ఉన్న ప్రతి వారు సంగీత సాహిత్యాలతో సహా మొత్తం కంఠోపాఠం చేసి మనసులో పదే పదే మననం చేసుకోదగ్గ గొప్ప స్వర రచన ఇది. అటువంటి 'స్వర వ్యాయామం' వలన చేకూరే మనోబలం - తద్వారా లభించే మానసిక ప్రశాంతత - కేవలం అనుభవైక వేద్యాలే తప్ప ఉదహరించి చెప్పడానికి సరిగా తూగేవి లేవనే చెప్పాలి.

---

స్వామీ చంచలమైన చిత్తమిదే నీ జ్ఞానాంజనా రేఖచే
నీమంబున నే నిశ్చలత్వమొదవెన్
నిండారు నీ భక్తిచే కామ క్రోధవిరోధ వర్గములను చీకాకై నశించెన్
భవద్ధామంబౌ రజితాద్రి జేర్చాదయందా కాళహస్తీశ్వరా కాళహస్తీశ్వరా

ఈ పద్యం సింహేంద్ర మధ్యమం రాగంలో స్వరపరచబడింది. ఈ రగంలో సినిమా పాటలు ఉదహరించే స్థాయిలో దొరకవు.

---

చండా హృతాశుకీలికలు చయ్యన గ్రక్కుచు దండధారి
మార్కండునిపై మహోగ్రగతి గ్రక్కున వైచిన కాలపాశమే
గ్రక్కున వైచిన కాలపాశమే
తుండెములై పతాలుమని తూలిపడెన్
నిన్ను నమ్మువారికి దండన లేమి లెక్క
రచితా చలవాసా మహేశా ఈశ్వరా

పూజారి మాటలు విని మోసపోయిన జనం తిన్నయ్యని చెట్టుకు కట్టేయగా - నిన్ను నమ్మిన మార్కండేయునిపై యముడంతటివాడు వేసిన కాలపాశమే పతాలుమని తెగిపోగా లేనిది - ఈ త్రాళ్ళు, ఈ దండన ఒక లెక్కా అంటూ తిన్నయ్య పాడిన సందర్భంలోనిది ఈ పద్యం. ఈ పద్యం కేదారగౌళ రాగంలో స్వరపరచబడింది. ఈ రాగాన్ని పోల్చుకోవాలంటే 'మహాకవి కాళిదాసు'లో 'శ్యామలా దండకం'లోని 'చతుర్భుజే చంద్రకళావతంసే' అనే శ్లోకాన్ని గుర్తుకు తెచ్చుకుంటే చాలు.

ఈ పద్యంలోనే తిన్నయ్యని బంధించిన త్రాళ్ళు తెగిపోవగా అతడు శివాలయానికి వెళుతుండగా వచ్చే పాట. ఆ తరువాత వచ్చేపద్యం ఇది!

---

ధన్యుడనైతిని దేవదేవా (2)
ఎన్నడైన మరువనయ్యా పాదసేవ
ఎన్నడైన మరువనయ్యా నీ పాదసేవ
పాహి శంకరా
మాం పాహి శంకరా
దీనాళి రక్షించు దేవదేవా (2)
నాగతి నీవయ్య దేవ దేవా (2)

పాహి శంకరా మాం పాహి శంకరా (3)
దేవా దివ్యకృపాకరా బవహరా దీనావనా శంకరా
నీవాలభ్యదృగంచలామృతాఝురుల్ నీ పుత్తుపై జల్లగా
భవాతీత మనోజ్ఞ
నేత్రములు విస్ఫారించినావా
ప్రభో... సేవా భాగ్యము కల్గజేయుమా దయన్
శ్రీకాళ హస్తీశ్వరా శ్రీకాళహస్తీశ్వరా

ఈ పాట షణ్ముఖప్రియరాగంలో స్వరపరచబడింది. తర్వాత వచ్చే పద్యానికి శంకరాభరణం రాగంలోని స్వరాలను తీసుకుని స్వతంత్ర సంచారం చేస్తూ స్వరపరచడం జరిగింది.

ఈ పాటలు, పద్యాలన్నిటికీ రాజ్‌కుమార్ ఇచ్చిన అభినయాన్ని ఇవాళ చూడగలిగితే తన మాతృభాష కాకపోయినా తెలుగులో ఇంతటి క్లిష్ట సాహిత్యానికి... సినీ కళాకారుడుగా ఇది ఆయనకు మొదటి చిత్రమైనా సరే... ఆయన ఇచ్చిన లిప్ మూమెంట్‌ని చూస్తే కర్ణాటక రాష్ట్రం ఎందుకు ఆయన్ని మహానటుడిగా గౌరవించి నెత్తిన పెట్టుకుందో - వీరప్పన్ ఆయన్ని అపహరిస్తే (రిటైరైపోయిన తర్వాత కూడా) కన్నడ సినీరంగం షూటింగులు ఆపేసి ఎందుకు స్థంభించిపోయిందో అర్థం అవుతుంది. ఇవాళ అతి తేలికైన మాటలక్కూడా లిప్‌మూమెంట్‌ని కనీకనిపించని రీతిలో - లాంగ్ షాట్లలో - కళ్ళు చెదిరే లొకేషన్స్‌లో - స్టెప్పుల మధ్య - మేనేజ్ చేసేసుకుంటున్న వారంతా ఒక్కసారి ఈ చిత్రంలో రాజ్‌కుమార్ నటన చూస్తే చాలు. తర్వాత దాన్ని ఒక సిలబస్‌లా స్వీకరించాలని అనిపించి తీరుతుంది.

సంగీతపరంగా చివరగా ఒక్కమాటలో చెప్పాలంటే - ఈ చిత్రంలోని పాటను పద్యాలను పంతం పట్టినట్టుగా రాక్షస సాధన చేసైనా సరే సాధించితే కొన్ని రాగాలపై కొంచెం పట్టును సంపాదించగలిగినట్టే.



# ఆ పాత పాట మధురం

## రాజా



## సంఘం

తెలుగు, తమిళ, హిందీ రంగాలలో ప్రతిష్టాత్మక చిత్రాలను నిర్మించిన సంస్థలలో ఏవీయమ్ ఒకటి. ఇప్పటికీ కొనసాగుతున్న ఘన చరిత గల ఏవీయమ్ సంస్థ (చిత్రాల) గురించి ఏకంగా ఓ పుస్తకాన్నే తీసుకురావచ్చు. ఆ సంస్థ నిర్మించిన చిత్రాలలో ఒక మంచి చిత్రం 'సంఘం'.

ఎన్.టి.రామారావు, అంజలీదేవి, వైజయింతిమాల, యస్.బాలచందర్, యస్.వి.రంగారావు, నాగయ్య. రమణారెడ్డి మొదలుగువారు ముఖ్యతారాగణం, ఈ చిత్రానికి దర్శకుడు ఎమ్.వి.రామన్, మాటలు - పాతలు తోలేటి, సంగీతం ఆర్. సుదర్శనం. ఈ చిత్రాన్ని తమిళంలో 'పెణ్'గాను హిందీలో 'లడ్కీ'గాను తీశారు. తెలుగు వెర్షన్ 'సంఘంలో' పన్నెండు పాటలున్నాయి. అందులో ఓ నాలుగు పాటల గురించి:

ఆ౦....
లలాలాలలా
భారత వీర కుమారిని నేనె నారీ రతనము నేనె
భారత నారీ అభ్యుదయానికి నాయకురాలిని నేనె ||భారత ||
స్వార్థముతో కులమత భేదముతో
సతతము పోరే భర్తావనిలో శాంతి జ్యోతి వెలిగిస్తా సతతము
కర్షక సౌఖ్యం కార్మిక శ్రేయం (2)
కలిగే మార్గం చూపిస్తా (2)
రాణీ రుద్రమ మల్లమదేవి రెడ్డి నాగమ్మనేనే (2)
రణ తిక్కన భార్యా సతిమాంచాల (2)
శౌర్య ధైర్యములు నావే
శౌర్య ధైర్యములు నావే
శౌర్యధైర్యములు నావే

ఈ పాటను సుశీల పాడగా వైజయింతిమాల అభినయించింది. ఇవాళ విన్నాకూడా బావుండే ట్యూన్ ఇది. ఈ పాటకు మోహనరాగం ఆధారరాగం. పల్లవి చివరలో గల - 'నాయకురాలిని నేనే' తర్వాత వచ్చే ఇంటర్ లూడ్‌తో సహా ఆ రోజుల్లోని పిన్నలు, పెద్దలు 'హమ్' చేసుకునేవారు. అంతగా జనంలోకి వెళ్ళిపోయిన పాట ఇది. పాత్ర స్వభావాన్ని ప్రతిబింబించే ఈ పరిచయగీతాన్ని

(ఇంట్రడక్షన్ సాంగ్) పాతిక, ముప్పై ఏళ్ళ తర్వాత తమిళ దర్శకుడు భారతీరాజా ఓ చిత్రంలో కథానాయిక రేవతి పాత్ర ఎంట్రన్స్‌కి నేపథ్యగీతంలా వాడుకున్నారంటేనే ఊహించుకోవచ్చు - ఈ పాట ప్రభావం ఎంతగా ఉండేదో!? ఈ పాట ఎక్కడైనా దొరికితే విని చూడండి చాలా ఇన్స్పయిరింగ్‌గా ఉంటుంది. అంతేకాదు స్పష్టత, మాధుర్యంతోపాటు సుశీల గొంతు ఎంత ఖంగుమని మోగేదో కూడా తెలుస్తుంది

---

సుందరాంగ మరువగలేనోయ్ రావేలా
నా అందచందములు దాచితి నీకై రావేలా (2)
ముద్దు నవ్వుల మోహన కృష్ణా రావేలా ముద్దు
నవ్వులలో రాలు సరాగాలు రాగమయ రతనాలు నవ్వు ||సుంద||
నీలి కనులలో వాలు చూపుల ఆవేళా
నను చూసి కనుసైగ చేసితివోయీ రావేలా ||నీలి||

కాలి మువ్వల కమ్మని పాట ఆ వేళ
ఆ మువ్వలలో పిలుపు అదే వలపు మురిపెముల కలగలపు || సుంద||
హృదయ వీణ తీగలు మీటి ఆ వేళా
అనురాగ రసములే చిందితివోయి రావేల ||హృదయ||
మనసు నిలువదోయ్ మధువసంతమోయ్ రావేలా ||మనసు||
పూవులు వికసించె ప్రకాశించె ప్రేమతో పల్లవించె పూవులు || సుంద||

ఈ పాటనుసుశీల పాడగా అంజలిదేవి, వైజయింతి అభినయించారు. ఈ పాటకు అక్కడక్కడ యమన్ కలసిన కళ్యాణిరాగం ఆధారం. ఆనాటి హిట్ సాంగ్స్ గురించి చెప్పుకుంటే ఇవాళ్టికి జనామోదం పొందే గీతం ఇది. చాలా సాదాసీదాగా, సాఫ్ట్‌గా ఉండే ట్యూన్, అక్కడక్కడ కొద్దిపాటి వైవిధ్యం తప్ప పాట మొదట్నించి చివరివరకు ఒకేరకం నడకతో సాగిపోయే ఈ వరసను జనం ఆదరించటానికి కారణం - మెలోడీ ప్లస్ రాగం! 'సంఘం' సినిమా విడుదలయిన 14 ఏళ్ళ తర్వాత కె.వి.రెడ్డిగారి 'భాగ్య చక్రం' అనే జానపద చిత్రం విడుదలయింది. ఆ సినిమాలో ఎన్.టి.ఆర్. అభినయంతో 'కుండ కాదు కుండ కాదు చిన్నదానా నా గుండెలదర కొట్టినావే' అనే పాటను పెండ్యాల స్వరపరచారు. పల్లవి వింటూనే "ఇది సుందరాంగ మరువగ లేనోయ్ పాట ట్యూన్‌రా" అంటూ జనం పెదవి విరిచేశారు. అంతగా గుర్తుండి పోయిందా పాట.

---

సుమారు 20 ఏళ్ళ క్రితం నాటి మాట... హైదరాబాద్ అశోకా హోటల్‌లో వేటూరి సుందరరామ్మూర్తిగారు మద్రాసు నుంచి వచ్చి బసచేశారు. 'అడవిరాముడు' పాటలు మారుమ్రోగిపోతున్న రోజులవి. అప్పటికి పత్రికలలో మ్యూజిక్ రివ్యూలు రాస్తున్న ఓ జర్నలిస్ట్ వచ్చి ఆయనని కలిశాడు.

"నీ రివ్యూలు చూస్తున్నాను. నిరంతర అధ్యయనంతో మన మస్తిష్కాలలో సమాచారాన్ని అలా పోగుచేసుకుంటూ ఉండాల్సిందే! ఇది అనంతం... దీనికి విసుగు, విరామం ఉండకూడదు" అని చెప్పి "సరదాగా పందెం ఒకటి పెట్టుకుందాం.. నేను పది సినిమా పాటల పల్లవులు పాడతాను. ఆ పాటలు ఏ సినిమాలోవో, వాటిని ఎవరు రాశారో, ఎవరు పాడారో, ఎవరు మ్యూజిక్కో, ఎవరు నటించారో చెప్పాలి. అన్నీ కరెక్ట్‌గా చెబితే నీకు పదివేల రూపాయలు బహుమానం. అయితే మొదటి తొమ్మిది కరెక్ట్‌గా చెప్పినా ఒక్క పైసా ఇవ్వను. పదవ పాట కూడా కరెక్ట్‌గా చెప్పగానే మొత్తం పదివేల రూపాయలు ఇచ్చేస్తాను... సరేనా!?" అన్నారు వేటూరి.

ఇరవై ఏళ్ళ క్రితం పదివేల రూపాయలంటే ఇవాళ దాని విలువ ఎంతో ఈజీగా ఊహించుకోవచ్చు.

"డబ్బు కోసం కాకపోయినా మీ అంతటివారితో పందెం కనుక ఓకే" అని అన్నాడా జర్నలిస్ట్.

వేటూరి 9 పాటలు పాడారు. వాటన్నిటికి కరెక్ట్‌గా చెప్పాడా జర్నలిస్ట్. పదవ పాట - 'జాతి భేదం సమసిపోదా జనులు సుఖమందా' అనే పల్లవిగల పాట. దీని గురించి చెప్పలేక పందెం ఓడిపోయాడతను.

"పందెం సరే... అసలేమీ చెప్పలేవా?" అని అడిగారు వేటూరి. "ఒక్కటి మాత్రం చెప్పగలనండి.. ఇది పాడింది నాగయ్య అని అనిపిస్తోంది" అని అన్నాడా జర్నలిస్ట్.

"ఎలా!?" అన్నారు వేటూరి.

"మీరు పాడుతున్నప్పుడు 'జా' అనే అక్షరాన్ని పలికిన తీరు, 'సుఖమందా' అనే పదంలో 'మందా'ని అటు 'మన్‌దా' అని కాకుండా ఇటు 'మమ్‌దా' అని కాకుండా ప్రత్యేకంగా పలికిన పద్ధతి - వీటిన్నటిని బట్టి నాగయ్యగారు పాడి ఉంటారనిపించింది" అని వివరించాడా జర్నలిస్ట్.

"కరెక్ట్... అది పాడింది నాగయ్యే! 'సంఘం' సినిమాలోని పాత అది! ఆ రోజుల్లో పాడుకుంటూ నటించేవారి పేర్లు నేపథ్యగాయనీ గాయకుల లిస్ట్‌లో వేసేవారు కాదు, అంచేత నాగయ్య పేరు టైటిల్స్‌లోగాని, పాటల పుస్తకంలోగాని లేదు. ఏది ఏమైనా నీ అబ్జర్వేషన్ బావుంది. ఇలాగే నిశితంగా ఆలోచిస్తూ కృషి చేసుకుంటూ సాగిపో... తప్పకుండా మంచి గుర్తింపు వస్తుంది నీకు" అంటూ ఆశీర్వదించారు వేటూరి.

---

ఓంకార నాదస్వరూపా భావరాగ తాళప్రదీపా
సాకి:నాట్యకలాపా నటరాజా నమో నమో
నటరాజ నమో నమో నమామి
ప: ఇలలో సాటిలేని భారతదేశం (2)
మా దేశం ఇలలో సాటిలేని భారతదేశం
కనులకు సుందరం - కళలకు మందిరం
మా దేశం సుందరం - కళలకు మందిరం
ఇలలో సాటిలేని భారతదేశం

చ౧: పావన హిమశైలం - గౌరి కిరీటం || పావన
మాకాశ్మీరం - రమ్యారామం || మా ||
ఇలలో సాతిలేని భారతదేశం
చ2: భగవద్గీత...భగవద్గీత వేదనినాదం
గౌతమ బుద్ధుని జ్ఞానప్రదీపం భగవద్గీత
రామకృష్ణ బోధలో అమృతసారం || రామ ||
దేశాల వెదజల్లే దివ్యప్రదేశం || దేశాల ||

ఇలలో సాటిలేని భారతదేశం
మా దేశం ఇలలో సాటిలేని భారతదేశం
చ3: కాళిదాస కావ్యం - జయదేవుని గానం ||కాళి ||
అజంత ఎల్లోరా - అద్భుత శిల్పం
గాంధి రవీంద్రుల - ఘన సందేశం || గాంధి ||
ఖండ ఖండముల చాటే దేశం || ఖండ||
ఇలలో సాటిలేని భారతదేశం మా దేశం || ఇలలో ||

ఈ పాటను సుశీల పాడగా వైజయింతిమాల అభినయించింది. సంగీతపరంగా, సాహిత్యపరంగా, గానపరంగా సినిమాలోగల పాటలన్నిటిలో పెద్దపీట వేయదగ్గపాట ఇది. నిజానికి ఈ పాటను ఆ తరంలో కొందరు తప్ప చాలామంది మరచిపోయారు. ఒక్కసారి తిరిగి ఈ పాటను మళ్ళీ వినడం జరిగితే అలా మరిచిపోయినందుకు బాధపడతారు కూడా! ఆగస్టు 15కి జనవరి26కి జాతీయపతాకాన్ని ఎగురవేసే సమయాన ఈ పాటను ఆలపించి తీరాలని (ఆంధ్రప్రదేశ్‌లో) రూలు పెట్టదగ్గంత మంచి, గొప్పపాట ఇది.

'ఇలలో సాటి లేని భారతదేశం' అంటూ రెండు రకాలుగా కంపోజ్ అయిన ట్యూన్ - 'మాదేశం' అంటూ ట్యూన్ పరంగా తీసుకున్న మలుపుకి టోన్‌పరంగా జత చేసిన బేస్ - 'భగవద్గీత...' అనే చరణానికి కళ్యాణి రాగంలో కలగలిసిన కమ్మదనం - చివర్న జోడించిన తిల్లానా ఇవన్నీ ఈ పాటకు అందంగా అమరిన ఆభరణాలు.

---

పెళ్ళీ...పెళ్ళీ పెళ్ళీ పెళ్ళీ....
ఈడైనా దానితో జోడీగా హాయిగా ఈడైనా
ఈలోకమందు సౌఖ్యాల పొంది ఆనందమొందగ
పెళ్ళీ...భలే మజా పెళ్ళీ.. అహోహో పెళ్ళీ....
పందిళ్ళకింద విందులు చేసే
అత్తిల్లే స్వర్గం ఆనందమార్గం
అమ్మాయికి అబ్బాయి అబ్బాయికి అమ్మాయి
చేరిన సంసార జీవితం భలే భలే

చేరిన సంసార జీవితంలో సంఘంలో పూజితం
ఈ లోకమందు సౌఖ్యాల పొంది ఆనందమొందగా
పెళ్ళి... ఢంఢంఢం పెళ్ళి.. డుండుండుం పెళ్ళీ
ప్రేమకి జాతి కీర్తి నీతి రీతి లేదయ్యోయ్
తెలుపు నలుపు లేదయ్యోయ్
మూడు ముళ్ళు వెయ్యయ్యోయ్
పెళ్ళి...జిల్‌జిల్‌జిల్ పెళ్ళి... టకటకటక పెళ్ళి
దేవుడు నన్నే చల్లగ చూస్తే

అప్పుడే నాకు అవుతుంది పెళ్ళి నాకూ అవుతుంది పెళ్ళి ||దేవుడు||
సరోజ గిరిజ వనజ జలజ మాలతి మాధవి మల్లిక మోహిని
ఎవతో ఓ భామిని ఆమే నీ కామిని
పట్నం పిల్లో పల్లెటూరి పిల్లో చిక్కిన రాజా చక్కిరకొట్టు
జణక్కు తకథిమి జణక్కు తకధిమి టికుటికుటికు డుండుం
వైవాహ కంకణం ప్రాప్తి బంధనం దైవ నిర్ణయం || వైవాహ||
పెళ్ళి...తళుక్కు జనపెళ్ళి...తదిగిణతోం పెళ్ళీ ||ఈడైనా||

ఈ పాటను పిఠాపురం నాగేశ్వరరావు పాడగా యస్.బాలచందర్ అభినయించారు. సన్నివేశపరంగా ఎన్.టి.ఆర్. కూడా చివర్న పాల్గొంటారు. పిఠాపురం నాగేశ్వరరావుకి లైఫ్ టైమ్ సాంగ్ ఇది. ఈ పాటను పాడకుండా గాని, ప్రస్తావించకుండాగని ఆయన బైటకిరాలేదు. అంతేకాదు - ఆ రోజుల్లో ఈ పాటను వెయ్యని పెళ్ళిపందిరి ఆంధ్రదేశంలో లేదు గాక లేదంటే అందులో ఆవగింజంత అతిశయోక్తి కూడా లేదు. ఎన్నిసార్లు విన్నా ఎన్ని తరాల తర్వాత విన్నా ఒకే రకం రసస్పర్శని కలిగించే గీతాలు కొన్నే ఉంటాయి. హుషారు గీతాల విషయానికొస్తే అభిరుచి మారిపోతూ ఉంటుంది కూడా! ఈ పాట మాత్రం ఓ మినహాయింపు. ఎప్పుడైనా వినండి... అదే ఊపు అదే హుషారు కలిగి తీరుతుంది.

ఈ పాటకు కొసమెరుపు ఏమిటంటే - ఈ పాతలో ముఖ్యపాత్రధారిగా అభినయించ యస్. బాలచందర్ తన తర్వాత జీవితంలో ప్రసిద్ధ వైణికుడిగా మారడం! ఆయన వీణా వాదనను విన్నవారు - ఆయన కచ్చేరీలకు హాజరయినవారు - వెనక్కి తిరిగి 'సంఘం' చిత్రంలో ఆయన చేసిన పాత్ర పోషణకు, ఈ 'పెళ్ళి' పాటకు అభినయించిన తీరుకి - ఒకింత ఆశ్చర్యానికి, మరింత ఆనందానికి, రవంత ఆరగించుకోలేని తనానికి లోనవడం సహజం.

పైన ఉదహరించిన నాలుగు పాతలే కాక మిగిలిన 8 పాత్రలలో కూడా ఆడదంటే అలుసుకాదోయ్, జాతి భేదం సమసిపోదా, కరవాలమా నీ శూరతయిల చూపు బిరాన, నలుగురిలో నను నగుబాటు చేయుట న్యాయమ్ముగా తోచెనా, గుభీగుభీమని జాతుల గోడలు కూలిసిరావోయ్ - పాటలు కూడా బావుంటాయి.

ఈ చిత్రాన్ని 'లడ్కీ'గా హిందీలో తీసినప్పుడు - నిదురించెడి భగవానుని ఉయ్యాల జోల అనే పాట ట్యూన్‌ని 'భగవాన్‌తో ఆకాష్ పె సోతాహి రహెగా' పాటకి 'పెళ్ళి...' పాట ట్యూన్‌ని 'షాదీ... షాదీ.. షాదీ... కిస్మత్‌కి బాత్ హై మాలిక్ కె హాత్ హై / జీవన్ కా సాత్ హై' పాతకి వాడుకున్నారు వీలయితే ఈ 'షాదీ' పాటను కూడా సంపాదించి వినగలిగితే వినండి. కిషోర్ కుమార్ ఎన్ని ఛమక్కులు చేశాడో ఎన్ని గమ్మత్తులు చేశాడో... అసలు వాయిస్‌లో ప్లెక్సిబిలిటీ అంటే ఎలా ఉండాలో తెలుస్తుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే మంచి పాటకు చెవియొగ్గి వినేవారికి ఈ పాటలు ఓ అందమైన అనుభవం



# ఆ పాత పాట మధురం

## రాజా



## అర్ధాంగి

తెలుగు సినీ చరిత్రలో 1955 వ సంవత్సరం ఇచ్చిన ఆణిముత్యాలలో ఒక చిత్రాన్ని ఖచ్చితంగా ప్రస్తావించి తీరాలి. ప్రసిద్ధి చెందిన బెంగాలీ కథ 'స్వయం సిద్ధ' ఆధారంగా తీసిన ఆ చిత్రానికి సర్వ జనామోదం పొందే చిత్రాలు తీసే 'పీపులయ్య'గా ముద్రవేయించుకున్న పి.పుల్లయ్య దర్శకుడు. సంగీత దర్శకుడు భీమవరపు నరసింహారావుతో ఆయన కలిసి స్థాపించిన రాగిణీ సంస్థ ద్వారా తీసిన ఆ చిత్రం అర్ధాంగి.

బి.ఎన్.ఆర్ గా పిలవబడే నరసింహారావు తెలుగు సినీసంగీతంలో ఓ మలుపు తీసుకొచ్చిన వ్యక్తి. అంత వరకు రాగయుక్తంగా, కొంత శాస్త్రీయంగా ఉండే సినిమా పాటలలో జానపద రీతుల్ని ప్రవేశపెట్టి వాటికి జనరంజకత్వాన్ని కలగజేసిన కళాకారుడు. విచిత్రమేమిటంటే ఈయన సంగీత విద్వాంసుడు కాదు. ఎవరి దగ్గరా సంగీతం నేర్చుకోలేదు. ఎనిమిదో ఏట నుంచీ నాటకాల్లో వేషాలు వేస్తూ పాటలు పాడుతూ ఉండేవారు. ఓ రోజు హార్మోనియం వాయించాలని కోరికపుట్టి తనంతట తానే సాధన చేసి మంచి పట్టు సంపాదించుకున్నారు. ఆ కృషిలో రాగాలను తెలుసుకోవటం, స్వరకల్పన చేయటం అబ్బింది. ఆయనకు సిగిరెట్లు కాల్చే అలవాటు విపరీతంగా ఉండేది. అందుకు డబ్బు కావాలి కనుక అప్పట్లో థియేటర్లలో నడిచే మూకీ చిత్రాలకు నేపథ్య సంగీతంలా హార్మోనియం వాయించేవారు. అలా అంచెలంచెలుగా ఎదుగుతూ సినిమాలకు సంగీత దర్శకత్వం వహించే అవకాశాలను అందుకోగలిగారు. 'మాలపిల్ల' చిత్రంలో 'నల్లవాడే గొల్లపిల్లవాడే' పాటతో ఆయన పేరు ప్రభంజనంలా ఆంధ్రదేశాన్ని చుట్టేసింది. బి.ఎన్.ఆర్ నటుడు కూడా కావటం చేత 'రైతుబిడ్డ', 'తిరుగుబాటు', 'అర్ధాంగి, 'చిరంజీవులు', 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రాలలో నటించారు. 'రైతుబిడ్డ' చిత్రంలో కాసా సుబ్బన్న పాత్రను ఆ తరం వారు నేటికి మర్చిపోలేరు. ఈ 'అర్ధాంగి' చిత్రంలో ఆయన ఓ పాత్రను ధరించటమే కాక ఎడిటింగ్ బాధ్యతను కూడా నిర్వహించారు.

రచన, శ్రావ్యత పాటకు ముఖ్యమైనవని, ఆ రెండిటినీ ఐక్యం చేస్తూ సంగీత దర్శకుడు పాటను స్వరపరచాలని నమ్మే బి.ఎన్.ఆర్ - ఆత్రేయ రాయగా 'అర్ధాంగి' చిత్రం ద్వారా అందించిన పాటలలో ఓ అయిదు:

రాధను రమ్మన్నాడు
రాసక్రీడకు మాధవదేవుడు
రాధను రమ్మన్నాడు
నల్లనివాడు అల్లరివాడు
నమ్మినవారికి చల్లనివాడు
ముల్లోకాలను పిల్లన గ్రోవితో
మురిపించే మోహనకృష్ణుడు ||రాధను||

గోపాలుడు మా పాలిటి దేవుడు
రేపల్లెకు తానెపుడూ పాపడు చల్లను తెచ్చే గొల్లపిల్లతో
సరసలాడుచు ఉన్నాడు
ఇది అనువౌ సమయం అన్నాడు
యశోదమ్మకీ విషయాలేవీ
తెలుపవద్దనీ బతిమాలాడూ ||రాధను||

ఈ పాటను ఆకుల నరసింహారావు పాడేరు. సినిమాలో ఓ హరిదాసు (పాత్రధారి పేరు బెంగుళూరు రంగస్వామి) ఇల్లిల్లూ తిరుగుతూ హీరోయిన్ (సావిత్రి) ఇంటి ముందు ఆగిపాడే పాట ఇది. అప్పట్లో మన తెలుగు సినీ సంగీతంపైనా, రంగస్థల సంగీతంపైనా మరాఠీ నాటక గీతాల ప్రభావం ఉండేది. ఆ వరసల ప్రభావం ఆధారంగా కూర్చిన ఈ పాటలో కొంతవరకు ఖమాజ్, మోహన, యమన్ వంటి రాగాల ఛాయలను అక్కడక్కడ కనిపించేట్టుగా ట్యూన్‌ని రూపొందించారు. 'పాటపాడటం' అనే వ్యాపకాన్ని నిజాయితీగా స్వీకరించే ప్రతివారూ చిత్తశుద్ధితో సాధన చేయదగ్గ ట్యూన్ ఇది. ఇలాంటి వరసల్ని ప్రాక్టీస్ చెయ్యటం వలన గాత్రానికి సుస్వరవ్యాయామం జరుగుతుంది.

---

ఎక్కడమ్మా చంద్రుడూ? చుక్కలారా, అక్కలారా
నిక్కి నిక్కి చూతురేల ఎక్కడమ్మా చంద్రుడూ...?
చక్కనైన చంద్రుడు ఎక్కడమ్మా కానరాడు
మబ్బు వెనక దాగినాడో మనసులేక ఆగినాడో ||ఎక్కడమ్మా||
పెరుగునాడు తరుగునాడు ప్రేమ మారని సామి, నేడు
పదము పాడి బతిమలాడి పలుకరించిన పలుకడేమి! ||ఎక్కడమ్మా||
చక్కనైన చంద్రుడు ఎక్కడమ్మా కానరాడు
ఏలనో కానరాదు ఎక్కడమ్మా చంద్రుడు
చక్కనైన చంద్రుడు ఎక్కడమ్మా చంద్రుడూ...!

ఈ పాటను జిక్కి పాడగా ప్రధాన పాత్రధారిణిగా సావిత్రి అభినయించింది. సన్నివేశపరంగా అక్కినేని నాగేశ్వరరావు కూడా కనిపిస్తారు. తాళికట్టిన వానికి బుద్ధిమాంద్యం అని తెలుసుకున్న కథానాయిక కన్నీళ్ళతో అతడి బాధ్యతను స్వీకరించి అతడిని నిద్రబుచ్చే సన్నివేశంలో పాడిన పాట ఇది. పీలూ రాగచ్ఛాయలలో ఈ పాట స్వరపరచబడింది. భార్యాబిడ్డలు (1971) అనే చిత్రంలోని 'చక్కనైన చందమామ ఎక్కడున్నావూ నీవు లేక దిక్కు లేని చుక్కలైనాము' అనే పాటను ఆత్రేయ రాసేటప్పుడు 'అర్ధాంగి' లో తను రాసిన ఈ 'ఎక్కడమ్మా చంద్రుడు' పాటకు సంబంధించిన తునకలు జ్ఞాపకాలతో రవంతైనా మెదిలి ఉండాలి.

---

వద్దురా కన్నయ్య ఈ పొద్దు ఇల్లు వదిలి పోవద్దురా అయ్య
పశువులింటికి తిరిగి పరుగులెత్తేవేళ
పసిపాలను బూచి పట్టుకెళ్ళేవేళ ||వద్దు||
పట్టు పీతాంబరము మట్టిపడి మాసేను
పాలుగారె మోము గాలికే వాడేను
గొల్లపిల్లలు చాల అల్లరి వారురా
గోల చేసి నీపై కొండెములు చెప్పేరు ||వద్దు||
ఆడుకోవలెనన్న పాడుకోవలెనన్న
అచట నీకున్న అన్నిటను నీదాన

కాఫీ రాగంలో స్వరపరచబడిన ఈ పాట పాడినది జిక్కీ, తెరపై అభినయించింది సావిత్రి, అక్కినేని. బుద్ధిమాంద్యంగల తన భర్తను ప్రజ్ఞావంతుడిగా తీర్చిదిద్దే ప్రయత్నంలో కథానాయిక ఉండగా ఓ రోజు ఆమెకు తెలియకుండా ఆ భర్త బయటికి దొంగతనంగా వెళ్ళిపోతున్న సమయంలో ఆమె పాడే పాట ఇది. ఇటువంటి సన్నివేశాలకు ఈ రోజులలో ఎటువంటి పాటలు వస్తాయో ఊహించుకుంటే ఈ పాట గొప్పతనం మనకు తెలియకుండానే తెలిసిపోతుంది.

ఈ పాటకు సంబంధించినదే ఒక విషయం: స్వరకర్త బి.యన్.ఆర్ ఎవ్వరి దగ్గరా సంగీతం నేర్చుకోకపోవటం వలన - ఈపాటను కొంత క్లాసికల్ బ్యాక్‌గ్రౌండ్‌తో ట్యూన్ చెయ్యాలనుకోవటం వలన - మరొక సంగీత దర్శకుడు అశ్వత్థామను పిలిపించారు. బి.యన్.ఆర్ అంటే అశ్వత్థామకి, అశ్వత్థామ అంటే బి.యన్.ఆర్‌కి మంచి గౌరవం ఉండేది. అంచేత 'వద్దురా కన్నయ్య' మొత్తం పాటంతా అశ్వత్థామే ట్యూన్ చెయ్యడం జరిగింది. ఈ పాటకు స్వరకర్తగా అశ్వత్థామ పేరు వేస్తానని రాగిణి సంస్థ భాగస్వామి హోదాలో బి.యన్.ఆర్ అన్నా... అశ్వత్థామ మర్యాదగా, మృదువుగా 'దాన్దేముందండీ' అంటూ ఒద్దన్నారని 'అర్ధాంగి' చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసి, తర్వాతి రోజుల్లో ఎన్నో చిత్రాలను తీసిన ఆమంచర్ల శేషగిరిరావు చెప్పారు.

---

రాక రాక వచ్చావు చందమామ
లేక లేక నవ్వింది కలువ భామ
మబ్బులన్ని పోయినవి మధుమాసం వచ్చినది
మరులు కొన్న విరికన్నె విరియ బూసి మురిసింది
లేక లేక నవ్వింది కలువభామ ||రాక||
రేకులన్ని కన్నులుగా లోకమెల్ల వెతికినది
ఆకసాన నిను జూచి ఆనందం పొంగినది

ఆకసాన నిను జూచి ఆనందం పొంగినది
లేక లేక నవ్వింది కలువభామ ||రాక||
తీరని కోరికలే తీయని తేనియలై
వెన్నెల కన్నులలో వెల్లివిరిసి మెరిసినవి......
దొంగలాగ దూరాన తొంగి చూతువేల
రావోయి రాగమంత నీదోయి ఈ రేయి
రాక రాక వచ్చావు చందమామ
లేక లేక నవ్వింది కలువభామ

ఈ పాటను జిక్కి పాడగా ప్రధాన పాత్రధారిణిగా సావిత్రి, సన్నివేశపరంగా అక్కినేని అభినయించారు. ఈ పాటకు యమన్ రాగం ఆధారం. కానీ 'రేకులన్ని కన్నులుగా లోకమెల్ల వెతికినది' అనే రెండవ చరణంలోని మొదటి రెండు పంక్తులకు మోహనలాగ బాణీని కూర్చి తిరిగి తరువాతి పంక్తులకు యమన్‌లోకి రావటం జరిగింది.

బుద్ధి మాంద్యంతో వెనకబడ్డ భర్తను సంపూర్ణమైన వ్యక్తిత్వంగల ప్రజ్ఞావంతుడిగా తీర్చి దిద్దిన తరువాత కథానాయిక తన జీవిత భాగస్వామితో హాయిగా పాడుకునే సందర్భానికి రాసిన పాట ఇది. సన్నివేశం డిమాండ్ చేసినా సరే సభ్యత, సంస్కారం దిగజారని రోజులవి. అందుకే ఈ పాట సంగీత సాహిత్యాలలో ఆ పవిత్రత అణువణువూ తొణికిసలాడుతూ కనిపిస్తుంది. మనసు కవి ఆత్రేయ మనసు అనే పదాన్ని ఉపయోగించకుండా చాలా పాటలు రాశారని వాటిలో మనసు పెట్టి రాసిన మరో మనసైన పాట ఇదని తెలిస్తే కొందరికి ఆశ్చర్యంగానే ఉంటుంది మరి.

---

సిగ్గేస్తదోయ్ బావ సిగ్గేస్తదీ
మొగ్గలేను ఒగ్గలేను
మొగమెత్తి చూడలేను ||సిగ్గే||
పచ్చికా బయలులోన

మచ్చికగా మనముంటే
సిగ్గులేని చందమామ
చాటుగుండి చూస్తాడు ||సిగ్గే ||
రెప్పలార్పకుండా ని
న్నెప్పుడైనా చూస్తినా

టక్కులాడి చుక్కలన్ని
ఫక్కుమని నవ్వుతాయి || సిగ్గే||
గుట్టుగా చెట్టుక్రింద
గుసగుసలు చెప్పుకుంటే
చెట్టుమీది పిట్టలన్ని

చెవులు నిక్కబెడతాయి ||సిగ్గే ||
ఎందుకో అందరికి
ఇంత ఈసుమనమంటే
ఎవ్వరూ చూడలేని
ఏడకైన ఎళదాము || సిగ్గే||

ఈ పాటను పి.లీల పాడగా కథానాయకుడు (అక్కినేని) తమ్ముడు (జగ్గయ్య)ని వలలో వేసుకున్న యువతిగా నటించిన సురభి బాలసరస్వతి అభినయించింది. యమన్, బేహాగ్, గౌడ్ సారంగ్ రాగాల ఛాయలను కలుపుకుంటూ జానపద శైలిలో బాణీని సమకూర్చారు. ఎక్కడైనా జానపద నృత్యాలు జరుగుతుండగా ఈ పాటకు వేరే నృత్యరీతులను జతచేసి ప్రదర్శిస్తే 'మొక్కజొన్న తోటలో' పాటకు దీటుగా నిలబడదగ్గంత విషయం ఉంది ఈ పాటలో.

పైన పేర్కొన్నవే కాక చరిత్రపరంగా ఇంకొన్ని విషయాలు ఉన్నాయి ఈ చిత్రంలో. 'అర్ధాంగి' పేరిట తెలుగులోను 'పెణ్ణిన్ పెరుమై' పేరిట తమిళంలోనూ ఈ 'స్వయం సిద్ధ' కథను నిర్మించటం జరిగింది. రెండిటికీ దర్శకుడూ పి.పుల్లయ్యే. తెలుగులో అక్కినేని, జగ్గయ్య వేసిన పాత్రలను తమిళంలో జెమినీ గణేశన్, శివాజీ గణేశన్ నటించారు. రెండు వెర్షన్స్‌లోనూ సావిత్రి కామన్. ఈ కథను వినిపించగానే నాగేశ్వరరావు రోల్ అయితేనే వేస్తానని జెమిని గణేశన్ పట్టుబట్టాడట. మరి శివాజీ ది నెగిటివ్ రోల్ అవుతుంది కదా అని పుల్లయ్యగారు ఫీలవుతుంటే - "వాటెవర్ రోల్ యు గివ్ ఐ విల్ డూ ఇట్ డాడీ"... అని శివాజీ గణేశన్ అని ఆ నెగిటివ్ రోల్‌ని ఆనందంగా స్వీకరించి అద్భుతంగా పోషించారు. దటీజ్ శివాజీ" అంటూ చెప్పారు ఆమంచర్ల శేషగిరిరావు. ఇవాల్టి ప్రముఖ దర్శకుడు శ్రీ కె. రాఘవేంద్రరావు ఆనాడు పుల్లయ్యగారికి అసిస్టెంట్‌గా దర్శకత్వ శాఖలో పనిచేయటం ఈ చిత్రానికి సంబంధించిన మరో విశేషం!



# ఆ పాత పాట మధురం



## రాజా

## అనార్కలి

హిందీ సినీ సంగీత ప్రభావం పడని ప్రాంతీయ భాషా చిత్రాలు దాదాపుగా అరుదనే చెప్పుకోవాలి. ఆ ప్రభావంతో ఎన్నో పాటలు మక్కీకి కక్కీగా వచ్చాయి. స్ఫూర్తిని మాత్రమే తీసుకుని తమదైన బాణీలో కొంగ్రొత్త పోకడలు పోయాయి కొన్ని.. సంగీత దర్శకుల వ్యక్తిత్వానికి మచ్చరానీయని విధంగా మాతృకల వలే చక్కటి గుర్తింపుని సంపాదించుకున్నాయి మరికొన్ని. ఈ కోవలోకే వస్తుంది అంజలీ పిక్చర్స్ వారి అనార్కలి

ఈ చిత్రానికి ముందు - హిందీలో వచ్చిన ఫిల్మిస్థాన్ వారి అనార్కలి చిత్రంలోని సంగీతం యావద్భారత దేశాన్ని ఒక ఊపు ఊపేసింది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా మొదట అనిల్ బిశ్వాస్‌ని అనుకున్నారు. 'ఓజానేవఫా' అనే పాటను ఆయన స్వరపరచటం జరిగింది కూడా. (ఈపాటే తెలుగు అనార్కలీలో 'రావోయి సఖా' పాటగా వచ్చింది.) తీరా పారితోషకం దగ్గరకి వచ్చేసరికి అనిల్ బిశ్వాస్ చిన్నబుచ్చుకుని ఇక ఆ చిత్రాన్ని చేయనని కావాలంటే తన కుడి భుజంలాంటి సి.రామచంద్రతో మ్యూజిక్ చేయించుకోమని చెప్పి తప్పించుకున్నారు. అప్పటికి సి.రామచంద్ర బయట కొన్ని చిత్రాలు చేసినా అనిల్ బిశ్వాస్ కమిట్‌మెంట్‌గా ఫిల్మిస్థాన్ వారి అనార్కలిని అంగీకరించి ఒక వారం రోజుల్లోనే మిగిలిన పాగ్తల్ని స్వరపరిచారాయన. మొహమాటం కొద్దీ ఒప్పుకున్నా - వారం రోజులు మాత్రమే కష్టపడ్డా - తరాలు పాటు నిలిచిపోయే సంగీతాన్నిచ్చారు సి.రామచంద్ర. ఇక్కడ మరో విషయం కూడా ఉంది. అనిల్‌బిశ్వాస్ సంగీతంలో బెంగాలి ప్రభావం ఉంటుంది. సి.రామచంద్ర సంగీతంలో మరాఠీ ధోరణులు ఉంటాయి. ఈ రెండింటి ముద్రను హిందీ అనార్కలిలో గమనించిన కొందరు రసజ్ఞులు ప్రశ్నించగా అప్పుడు ఈ విషయాలు బయటపడ్డాయి. ఏది ఏమైతేనేం, అంతటి స్వర ప్రాభవం కలిగిన ఆ హిందీ అనార్కలి చిత్రం నుండి కొన్ని పాటలను తెలుగులోకి తీసుకుంటూ నిర్మించిన అంజలీ పిక్చర్స్ అనార్కలి 1955లో విడుదలైంది. ఈ చిత్రానికి సంగీతం ఆదినారాయణరావు, రచన సీనియర్ సముద్రాల.

నటి అంజలీదేవికి భర్త, అంజలీ పిక్చర్స్ అధినేత ఆదినారాయణరావు మధుర సంగీత దర్శకుడు మాత్రమే కాదు. మంచి కథకుడు, మేధావి కూడా. బాంబే సినీ సంగీత దర్శకులతో సమానంగా నిలిచి ఉత్తమ సంగీత దర్శకుని అవార్డును చేజిక్కించుకున్న తొలి దక్షిణ భారత సంగీత దర్శకుడాయన. తెలుగు అనార్కలి కోసం తీసుకున్న హిందీ బాణీలను ఆంధ్రులకు అందించటంలో చక్కని

సమన్వయాన్ని పాటిస్తూనే తను స్వతంత్రంగా చేసిన గీతాలతో స్వీయ ప్రతిభను అత్యంత నైపుణ్యం చాటుకున్నాడు. అనార్కలీ అనగానే గుర్తొచ్చే ముఖ్యమైన పాటలలో ఓ అయిదింటి గురించి.

జీవితమే సఫలము జీవితమే
ఈ జీవితమే సఫలము
రాగసుధా భరితము
ప్రేమ కథా మధురము జీవితమే
హాయిగా తీయగా ఆలపించు పాటలా ||హాయిగా||
వరాల సోయగాల ప్రియుల వలపు గొలుపు మాటలా ||వరాల||
అనారు పూల తోటలా... ఆ....ఆ
అనారు పూల తోటలా
ఆశ దెలుపు ఆటలా ||జీవితమే||
వసంత మధుర సీమలా ప్రశాంత సంధ్య వేళలా ||వసంత||
అంతులేని వింతలా అనంత ప్రేమలీలలా || అంతు ||
వరించు భాగ్య శాలులా...ఆ...ఆ
వరించు భాగ్యశాలులా
తరించు ప్రేమజీవులా ||జీవితమే||

భీంప్లాస్ రాగంలో స్వరపరచబడిన 'జీవితమే సఫలము' పాటని హిందీ అనార్కలిలోని 'యే జిందకీ ఉసీకీ హై' పాటకి అనుసరణగా చెప్పుకోవాలి. ఇక్కడ ముఖ్యంగా చెప్పుకోవలసింది ఆదినారాయణరావుగారి ప్రతిభ. ఈ పాటకు హిందీ మాతృకకు పోలికతో పాటు చాలా సూక్ష్మమైన వ్యత్యాసాలు ఉన్నాయి. అవి రెండు పాటలను దగ్గరగా పెట్టుకుని సాధన చేసిన వారికి నొటేషన్సు (స్వరాలు) రాయటం తెలిసిన వారికి మాత్రమే అవగాహనలోకి వస్తుంది. సాహిత్య పరంగా చూస్తే 'జీవితమే సఫలము' పాట మొదట చరణంలో 'వరాల సోయగాల ప్రియుల' అనే పద ప్రయోగం కొందరి దృష్టిలో పడింది. ప్రియుని అనకుండా ప్రియుల అని బహువచనం వాడడం పట్ల కించిత్తు నొచ్చుకోవడం కూడా జరిగింది. అయితే ఆ పాట సృష్టికర్త కలం వ్యర్థప్రయోగాలు చేసేది కాదు. అది రెండో చరణంలో 'వరించు భాగ్యశాలులా' అనే వాక్యం చూస్తే అర్థమయిపోతుంది. ఇక్కడ కవి చెప్పాలనుకున్నది ఎవరి జీవితము సఫలమో తెలియజేయటమే. కనుక అటువంటి సమయంలో ప్రేమికుల అనే అర్థంతో ప్రియుల అనే పదాన్ని తీసుకుంటే సరిపోతుంది. జిక్కి పాడిన ఈ పాటను అభినయించింది అంజలీదేవి.

---

సిపాయి బిరాన రావోయి
ఓఓఓ సిపాయి
మన తరాన ప్రేమ పరువు మాయరాదోయి....
రావోయి సఖా రావోయి సఖా
రావోయి సఖా నీ ప్రియ సఖి
చేరగదోయి ||రావోయి||
లోకానికి మన ప్రేమ విలువ తెలుపు సిపాయి
పరువు నిలుపు సిపాయి ఓయి సఖా.... రావోయి సఖా....
రారాజునకు నీ చెలికి పడెను లడాయి
రారాజునకు నీ చెలికి పడెను లడాయి
రాజాలవని పాదుషహా పలికె బడాయి
రానింతునని పంతమునే పలికితినోయీ...
రానింతునని పంతమునే పలికితినోయీ....
లోకానికి మన ప్రేమ విలువ తెలుపు సిపాయి
పరువు నిలువు సిపాయి
ఓయీ సఖా రావోయి సఖా
మన ప్రేమలు మన బాసలు మరువకుమా సఖా
జననాథుని జడిపింపులు వెరువకుము సఖా
మన ప్రేమలు మన బాసలు మరువకుమా సఖా
జననాథుని జడిపింపులు వెరువకుము సఖా
పెనుగాలివలె పరుగిడి రావోయి సఖా
లోకానికి మన ప్రేమ విలువ తెలుపు సిపాయి
పరువు నిలుపు సిపాయి
ఓయీ సఖా రావోయి సఖా...
కలిగించకు నీ ప్రియతమకు పరాభవాలు
కలిగించకు నీ ప్రియతమకు పరాభవాలు
కలిగించుము నీ ప్రభువునకు పరాజయాలు
వినుతుంచును నీ ధీరసము ముందుతరాలు
రావోయి సఖా.....
రావోయి సఖా...
రావోయి సిపాయీ...

ఈ పాటకు మాతృక హిందీ 'అనార్కలి'లో గీతాదత్ పాడిన 'ఓ జానెవఫా' అయినా – తెలుగులోకి వచ్చేసరికి పూర్తిగా జిక్కి పాట అయిపోయింది. కావాలంటే రెండు పాటలను ఒకేసారి పెట్టుకుని వినడం తటస్థిస్తే అప్పుడు అర్థం అవుతుంది ఇది ఎందుకు జిక్కి

పాట అయిపోయిందో!? ముఖ్యంగా 'సఖా' అనే పదం... అందులో 'ఖ' అనే అక్షరం... జిక్కి గొంతుతో పలికినంత గొప్పగా మరొక గాయని గళంలో పలకదు. ఇదిలా ఉండగా తెలుగుపాటలో ఉన్న ఊపు, జీవం హిందీ పాటలో అంతగా గోచరించదు. తొలుత వచ్చిన పాటని అనుసరిస్తున్నప్పుడు మెరుగుపరుచుకునే అవకాశం తర్వాత వచ్చిన పాటకు ఉండడంతో పాటు - అది సమర్థుల చేతిలో పడితే తద్వారా కలిగే సొగసులే వేరు, కళ్యాణి స్వరాలను అక్కడక్కడ కలుపుకుంటూ మోహన రాగం ప్రధానంగా సాగిన ఈ పాటలో అవన్నీ గమనించవచ్చు.

---

సోజా నా మనోహరి
సోజా సుకుమారి సోజా
జోగే పూవుల తీగలాగ
తూగే తుమ్మెద రాగలాగ ||జోగే||
ఆదమరచి హాయిగా సోజా ||సోజా||
విరిసే వెన్నెల కోటలోన
మురిసే కన్నులకాపులోన
రాకుమారి తీరున
రాకుమారి తీరున సోజా సోజా
ఎవరూ నీదరి లేరు
మనలా వేరు చేయలేరు ఎవరు
ఆదమరచి హాయిగా
ఆదమరచి హాయిగా సోజా

ఈ పాటను ఏ.ఎం.రాజా పాడగా అక్కినేని అభినయించారు. అంజలీదేవి కూడా సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తుందీ పాటలో. సినిమాలో పాటలన్ని తెలుగు పల్లవులతో ఉండి ఈ ఒక పాటకు మాత్రం పల్లవి 'సోజా' అన్న పదాన్ని ఉపయోగించటం వెనక 'జిందగీ' (1940) సినిమాలో పంకజ్ మల్లిక సంగీత దర్శకత్వంలో కె.ఎల్.సైగల్ పాడిన 'సోజా రాజకుమారీ సోజా' అనే పాట ప్రభావం ఉందనుకోవటంలో తప్పులేదనిపిస్తోంది. 'సోజా నా మనోహరి సోజా' పాట ఆలాపనలోనూ, ఇంటర్‌లూడ్స్‌లోనూ బహార్ రాగచ్ఛాయలు పల్లవి, చరణాలలో మధ్యమావతి రాగధోరణులు కనిపిస్తాయి. అయితే చరణాల చివర బృందగాన సారంగ రాగమేమో అనిపించే అవకాశం ఉంది. అయితే ఆ రాగ లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపించినందున నిర్ధారించలేం. ఏది ఏమైనా ఏ.ఎం.రాజా పాడిన మెలోడిస్‌లో ఈ పాటకు ఒక ప్రత్యేక స్థానాన్ని ఇచ్చి తీరాలి.

---

మదన మనోహర సుందర నారీ
మధుర ధర స్మిత నయన చకోరీ
మందగమన జిత రాజమరాళీ
నాట్య మయూరీ...
అనార్కలీ... అనార్కలీ... అనార్కలీ...
వహ్వా
ఆ
రాజశేఖరా నీ పై మోజు తీరలేదురా
రాజసాన ఏలరా ||రాజశేఖరా||
మనసు నిలువ నీదురా
మమత మాసి పోదురా
మధురమైన బాధరా
మరుపురాదు....ఆ..... ||రాజశేఖరా||
కానిదాన కానురా
కనులనైన కానరా ||కాని||
జాగుసేయనేలరా
వేగరావదలేరా ||జాగు||
చేరరార చేరరార చేరరార

రాజశేఖరా పాట ఆదినారాయణరావు గారి స్వతంత్ర స్వర రచన మాల్కోస్ రాగంలోని ఈ పాటకి హిందీ అనార్కలిలో హేమంత్‌కుమార్, లతా మంగేష్కర్ భాగేశ్రీ రాగంలో పాడిన 'జాగ్ దర్ద్ ఇష్క్ జాగ్' పాట యొక్క నడకను మాత్రమే తీసుకోవటం జరిగింది.

రాజశేఖరా పాట ఘంటసాల - జిక్కీ యుగళగీతం. వీరిరువురి సంగీత జైత్రయాత్రలో మరుపురాని మజిలీగా నిలిచిపోగా రసిక జన స్వరార్త హృదయాల పాలిట చలివేంద్రంగా మిగిలిపోయింది.

ఎక్కువ జనాదరణ పొందిన ఈ రాజశేఖరా పాటలో మధ్యలో వచ్చే వహ్వా నుంచి చివర్న వచ్చే వాద్య గోష్ఠి వరకూ ఒక్క బిట్టుని కూడా మర్చిపోకుండా యధాతథంగా అప్పజెప్పగల సంగీతాభిమానులు ఇప్పటికీ ఉన్నారు. అతికొద్దిమందికి మాత్రమే తెలిసిన ఇంకో విశేషమేమిటంటే ఈ పా టలో ఎస్వీ రంగారావు, అంజలీదేవి, అక్కినేనితో పాటు తెరపై అక్బర్ ఆస్థాన గాయకునిగా కనిపించి అభినయించింది - ఈ చిత్ర దర్శకుడు, ప్రముఖ నృత్య దర్శకుడు కీ.శే. వేదాంతం రాఘువయ్య.

---

ఆనందమే... అందాలు చిందేటి ఆనందమే...
నినుగన్న సంబరాన మనసు సోలి
ఎనలేని పరవశాన మేనుతూలే
తాగితూగేనని తలచేను లోకము
తూగచేసేను నును ప్రేమ మైకము ||తాగి||
మెరసే కనులా చెలుని మోహన రూపము
విరిసే మదిలో మాయని సంతోషము
సరాగాల రాగాల వయ్యారిలా
నవ్వుతాను... నవ్విస్తాను నా రాజును ||తాగి

ఆపలేరు ప్రేమిక్ల ఆవేశము
అణచలేరు అనురాగాల ఆనందము
ఆపలేరు ప్రేమిక్ల ఆవేశము
అణచలేరు అనురాగాల ఆనందము
సరాగాల రాగాల వయ్యారిలా
సరాగాల రాగాల వయ్యారిలా
నవ్వుతాను... నవ్విస్తాను నా రాజును ||తాగి||
హృదయ పీఠాన పూజింతు మోజుగా
ప్రణయ లోకాన ఏలింతు రారాజులా

హృదయ పీఠాన పూజింతు మోజుగా
ప్రణయ లోకాన ఏలింతు రారాజులా
సరాగాల రాగాల వయ్యారిలా
సరాగాల రాగాల వయ్యారిలా
నవ్వుతాను... నవ్విస్తాను నా రాజును

ఈ పాటను జిక్కీ పాడగా అంజలీదేవి అభినయించింది. యస్వీ రంగారావు, అక్కినేని నాగేశ్వరరావు, సురభి బాలసరస్వతి, పేకేటి మొదలైనవారు సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. రాజ్‌కుమార్ తీసిన 'బర్సాత్' (1949) చిత్రంలో శంకర్ - జైకిషన్ స్వరపరచగా లతా పాడిన 'మేరే ఆంఖోమే బస్ గయా కోయిరే' అనే పాటలోని తొలిలైను ట్యూనుని గుర్తు చేస్తూ ఈ 'తాగి తూగేనని తలచేను లోకము' పాట సాగుతుంది. మిగిలిన పాటలలోలాగే జిక్కీ సామర్ధ్యాన్ని చూపించే పాటయిది. ఈ పాటకు 'పహాడీ' రాగం ఆధారం. అయితే లలిత సంగీతంలో స్వతంత్ర సంచారం చేసుకునే వీలుంది కనుక కొన్ని అన్యస్వరాలను కలుపుకుంటూ 'మిశ్ర పహాడీ'గా రూపొందింది ఈ పాట.

పైన ఉదహరించిన పాటలే కాక 'అందచందాలు కని', కలిసె నెలరాజు కలువ చెలిని' వంటి పాటలను కూడా ఇప్పుడు విన్నా బాగుండే పాటలుగా చెప్పుకోవచ్చు.

---



# ఆ పాత పాట మధురం

రాజా



## కన్యాశుల్కము

**తెలుగు సాహితీ చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించుకున్న నాటకం గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం**

ఈ నాటకాన్ని తెరకు అనుగుణంగా మలుచుకునే విషయంలో సర్వజనామోద ముద్ర పడేలా రూపొందించారానాడు. ఈ చిత్రానికి దర్శకుడు పి. పుల్లయ్య. 'దేవదాసు' చిత్రం ద్వారా ఈనాటికీ తన బ్యానర్ గుర్తుండేలా చేసుకున్న డి.యల్.నారాయణ ఈ చిత్రానికి నిర్మాత. రచన సదాశివ బ్రహ్మం కాగా పాటలను సదా శివబ్రహ్మం, దేవులపల్లి, మల్లాది, సముద్రాల రాశారు. ఇవి కాక బసవరాజు అప్పారావుగారి నాగుల చవితి గీతం, గురజాడ అప్పారావుగారి పుత్తడి బొమ్మ పూర్ణమ్మ కథ, శ్రీ శ్రీ రాసిన ఆనందం అర్ణవమయితే గేయం పాటలుగా ఉన్నాయి. ఘంటసాల సంగీత దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఈనాటికీ మరిచిపోలేని రెండు పాటలివి.

ఆనందం అర్ణవమైతే అనురాగం అంబరమైతే ||ఆనందం||
అనురాగపు టంచులు చూస్తాం ఆనందపు లోతులు తీస్తాం ||ఆనందం||
నీ కంకణ నిక్వాణంలో నా జీవన నిర్వాణంలో
నీ మదిలో డోలలు తూగి నా హృదిలో జ్వాలలు రేగి..
నీ తలపున రేకులు పూస్తే నా వలపున బాకులు దూస్తే (2)
మరణానికి ప్రాణం పోస్తాం స్వర్గానికి నిచ్చెన వేస్తాం (2) ||ఆనందం||

ఆ....
హసనానికి రాణివి నీవై వ్యసనానికి బానిస నేనై
విషమించిన మదీయ ఖేదం కుసుమించిన త్వదీయమోదం
ఆ...
విషవాయువులై ప్రసరిస్తే విరితేనియలై ప్రవహిస్తే
ప్రపంచమును పరిహసిస్తాం భవిష్యమును పరిపాలిస్తాం (2) ||ఆనందం||

శ్రీ శ్రీ 'మహాప్రస్థానం'లోని 'ఆనందం అర్ణవమైతే' గేయాన్ని ఈ చిత్రం కోసం పాటగా మలుచుకున్నారు. సుశీల పాడిన ఈ పాటను సావిత్రి ప్రధాన పాత్రధారిణిగా అభినయించింది. శంకరాభరణంలోని స్వరాలను స్కేలుగా తీసుకుని అక్కడక్కడ ప్రతి మధ్యమాన్ని (మ అనే స్వరంలో) కైశిక నిషాదాన్ని (ని అనే స్వరంలో) కూడా ఉపయోగిస్తూ పాటను స్వరపరిచారు ఘంటసాల. గేయాన్ని

గీతంగా మలచటంలో కొన్ని ఇబ్బందులున్నాయి. అందులోను బహుళ ప్రచారంలో ఉన్న గేయమైతే అవి ఇంకా జటిలం అవుతాయి. వాటన్నిటినీ ఘంటసాల ఎలా అధిగమించారో ఈ ట్యూన్‌ని నాలుగైదు సార్లు వింటే తెలుస్తుంది. ఇదొక ఎత్తు ఖంగుమంటూ మ్రోగే సుశీల గొంతులోని ఫ్రెష్‌నెస్ ఒక ఎత్తు.

---

చిటారు కొమ్మనూ...
చిటారు కొమ్మను మిఠాయి పొట్లం చేతి కందదేం గురుడా
వాటం చూసి వడుపు చేసి వంచర కొమ్మను నరుడా ||వాటం|| ||చిటారు||
పక్కన మెలగే చక్కని చుక్కకు
చక్కిలిగింత లేదేం నరుడా
కంచు మోగక కనకం మోగదు
నిదానించరా నరుడా ||చిటారు||
వాటం చూసి వడుపుచేసి
వంచర కొమ్మను నరుడా
పండంటి పిల్లకు పసుపు కుంకం
నిండుకున్నదేం గరుడా
దేవుడు చేసిన లోపాన్ని
నువ్వు దిద్దుకు రారా నరుడా ||దేవుడు||
కొద్దిగ హద్దుమీరరా నరుడా ||చిటారు||
విధవలందరికి శుభకార్యాలు
విధిగా చెయ్ మంటావా ||విధవ||
అవతారం నీదందుకోసమే.....
ఆరంభించర నరుడా
వాటం చూసి వడుపుచేసి
వంచర కొమ్మను నరుడా ||చిటారు||

'కన్యాశుల్కం' కథ పల్లెటూరి వాతావరణంలో ఎక్కువగా జరుగుతుంది కనుక పల్లెపట్టు ప్రాంతంలో తరచు వినిపించే రాగం అయితే బావుంటుందన్న ఆలోచన ఈ పాట స్వరరచనలో కనిపిస్తుంది. సాధారణంగా పల్లె ప్రాంతాల గీతాల్లోనూ తత్త్వ గీతాలలోనూ హరి కాంభోజి రాగాన్ని, యదుకుల కాంభోజి రాగాన్ని ఉపయోగించడం జరుగుతూ ఉంటుంది. ఈ పాటకు సంబంధించి యదుకుల కాంభోజి రాగచ్ఛాయలే ఎక్కువగా ఉన్నాయని చెప్పొచ్చు. ఈ రాగాన్ని ఈ ధోరణిలో ఘంటసాల తరువాతి రోజుల్లో చాలాసార్లు ఉపయోగించారు. మాయాబజార్ (1957) చిత్రంలో 'దయచేయండి దయచేయండి' పాటని, 'జయం మనదే' (1956) చిత్రంలో 'చిలకన్న చిలకవే బంగారు చిలకవే' పాటని, ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుని ఆలపించుకోండి - ఆ తరువాత ఆ పాటల ఎత్తుగడ, ఈ పాట ప్రారంభం అవటానికి ముందు వచ్చే వాద్య సంగీతంతో పోల్చుకోండి. మూడు పాటలూ ఎంత దగ్గరగా ఉన్నాయో గమనించవచ్చు.

ఇక గాయకుడిగా ఘంటసాల చేసే పరకాయ ప్రవేశం గురించి ప్రత్యేకించి చెప్పనక్కరలేకపోయినా కొన్నిటిని పునశ్చరణ చేసుకుంటే మన సంస్కారం మరింత మెరుగుపడుతుంది. గిరీశం పాత్రను గురజాడ అప్పారావుగారు అప్పటి దేశకాలమాన పరిస్థితులకు అనుగుణంగా, వ్యంగ్య ధోరణిలో సృష్టించారు. ఆ పాత్రకుండే కొన్ని బలహీనతలు, వాటిని అతి చమత్కారంగా సమర్థించుకోగలిగిన మేధో సంపద, వాటన్నిటికి తోడుగా వయసు హుషారు - ఇవన్నీ గాయకుడి గళంలో కూడా ప్రతిఫలించాలి. అప్పుడే లోపభూయిష్టమైన కొన్ని కట్టుబాట్లను తమ స్వార్థం కోసం అతిక్రమించమంటూ ప్రవచించే ఇటువంటి పాటలకు అంతులేని ఆదరణ లభిస్తుంది. పాత్ర స్వభావంతో పాటు పూర్వాపరాలను కూడా పూర్తిగా ఆకళింపు చేసుకున్న వ్యక్తి కావటంచేత ఘంటసాల వాటిన్నిటినీ సంగీత దర్శకుడిగానే కాకుండా గాయకుడుగా కూడా సంపూర్ణ న్యాయంతో ప్రతిఫలించేట్టు చూసుకున్నారీ పాటలో. కావాలంటే గిరీశం పాత్ర స్వభావం గురించి మీలో మీరు తర్కించుకుని ఈ పాటను విని చూడండి. ఘంటసాల చేసిన ప్రాణ ప్రతిష్ఠ ఎటువంటిదో తెలుస్తుంది.

పైన ఉదహరించిన ప్రాణప్రతిష్ఠ జరగడానికి అవసరమయ్యే జీవాన్ని, చైతన్యాన్ని తన అక్షరాల ద్వారా మల్లాది రామకృష్ణశాస్త్రిగారు సంక్రమించేట్టు చేశారని చెప్పాలి సాధారణంగా మల్లాది రామకృష్ణశాస్త్రిగారి రచనలు మేధోవర్గానికి పట్టినంత త్వరగా పాటకజనానికి

పట్టవు. కానీ ఈ పాటకి సంబంధించినంతవరకు మాత్రం ప్రతి పదానికీ అర్థం తెలియకపోయినా, విశ్లేషించుకోవటం తెలియకపోయినా తమకు కావలసినదేదో పూర్తిగా లభించినంతగా ఆ వర్గం వారు కూడా సంతోషించారు. కన్యాశుల్కం నాటకంలో ఒకచోట గిరీశం అంటాడు - భగవంతుడు నాకు ప్రత్యక్షమైతే... నువ్వు నన్ను డిపెండెంటుగా పుట్టించావా, ఇండిపెండెంటుగా పుట్టించావా అని అడుగుతాను. డిపెండెంటుగా పుట్టించానంటాడనుకో - మరింకేం... నేనేం చేసినా నువ్వు చేయిస్తున్నట్టే లెక్క అంటాను. ఇండిపెండెంట్‌గా పుట్టించాడనుకో అయితే నా ఇష్టం వచ్చినట్టు చేసుకుంటా నువ్వెవడివి అడగడానికి అంటాను. ఇదిగో అలా ఉంటుంది గిరీశం ధోరణి! మరి అలాంటి వాడు కనుకనే - కంచు మోగక కనకం మోగదు (పూర్వాశ్రమంలో సంబంధం ఉన్న ఆడవాళ్ళలా బుచ్చెమ్మ అంత త్వరగా పడదుగా మరి) నిదానించరా నరుడా అని తనకి తాను సర్ది చెప్పుకోగలడు, దేవుడు చేసిన లోపాన్ని నువ్వు దిద్దుకురారా నరుడా అంటూ సమర్థనీయంగా 'అహంభావించగలడు', 'కొద్దిగ హద్దు మీరరా నరుడా' అంటూ రెచ్చిపోడానికి రంగం సిద్ధం చేసుకోగలడు. విధవలకు శుభకార్యాలను విధిగా చెయ్యడం కోసమే ఈ అవతారం కనుక షురూగురూ అంటూ తన వాదనకు తగ్గ సామాగ్రిని సమగ్రంగా సిద్ధం చేసేసుకోగలడు. అటువంటి గిరీశాన్ని యధాతథంగా, అక్షరాలా - 'స అక్షరాత్కరింప' చేశారు మల్లాది రామకృష్ణశాస్త్రి ఈ పాట ద్వారా.

నిర్మాతకి, దర్శకుడికి, రచయితకి, సంగీత దర్శకుడికి, గాయనీగాయకులకి, నటీనటులకి, పాత్ర(ల) పట్ల అంతటి అవగాహన ఉండేది ఆ రోజుల్లో. అందుకు అవసరమయ్యే హోమ్‌వర్క్ కూడా ఎవరికి వారు చేసుకునేవారు. అవసరమైతే చర్చించేవారు. అందుకే ఈనాటికీ ఆ పాటలను మరీ మరీ తలచుకుంటున్నాం.



# ఆ పాత పాట మధురం
## రాజా



### రోజులు మారాయి

స్వాతంత్ర్యం వచ్చాక జమిందారీ పద్ధతుల పట్ల సామాజికంగా వచ్చిన అభిప్రాయాల వల్ల కొందరు అభ్యుదయవాదులు తీసిన సినిమాలు వస్తున్న రోజులవి. 'దున్నేవాడిదే భూమి' అనే నినాదాన్ని బలపరుస్తూ చిత్రం మొత్తం గ్రామీణ వాతావరణ నేపథ్యంలో తయారు చేసిన కథతో 1955లో తీసిన చిత్రమే సారథివారి రోజులు మారాయి.

అక్కినేని నాగేశ్వరరావు షావుకారు జానకి, సి.యస్.ఆర్, రేలంగి, పెరుమాళ్ళు, అమ్మాజీ ముఖ్యతారాగణం. ఈ చిత్రానికి దర్శకుడు తాపీ చాణక్య. మాటలు కొండేపూడి లక్ష్మీనారాయణ. పాటలు తాపీ ధర్మారావు, కొసరాజు. సంగీత దర్శకుడు మాస్టర్ వేణు. ఆయన కెరీర్‌లో ఓ పెద్ద మలుపు, మైలురాయి, మహత్తరమైన మజిలో అని చెప్పుకోతగ్గ చిత్రం ఈ "రోజులు మారాయి". మాస్టర్ వేణు అంతకు ముందు విజయా సంస్థలో ఇన్ ఛార్జిగా ఉండేవారు. ఈయన వివిధ వాద్య ప్రవీణుడు. హార్మోనియం, పియానో, సితార్, గిటార్, దిల్‌రుబా, మాండొలిన్, ఎకార్డియన్, ఫ్లూటు, సెల్లో, వుడోఫోన్, జలతరంగిణి, హెమండ్ ఆర్గన్ వంటి పదిహేను రకాల వాద్యాలను అవలీలగా వాయించగల దిట్ట. సారథీవారి పిలుపునందుకుని విజయా సంస్థను వదిలి వెళ్ళారాయన. 'రోజులు మారాయి' చిత్రం కోసం ఆయన స్వరపరచిన పాటలలో ఓ అయిదింటి గురించి.....

ఆ: ఇదియే హాయి కలుపుము చేయి
వేయి మాటలేలనిక (2) ఓ..... ||ఇదియే ||
ఆ: ఇదియే హాయి కలుపుము చేయి
వేయి మాటలేనింక (2) ఓ..... ||ఇదియే||
ఆ: ఆ చూపులోనె కురియును తేనె
చిరునగువాహా వెలుగున వాలె
మనసేదో హాయి సోలునే ఓ..... ||మన||
నీ వాడిన మాట సాటిలేని పూలబాట
సాటిలేని పూలబాట ఇదియే

అ: అందాలలోన నడవడిలోన
తొలుతవు నీవే తెలియగరావె
బ్రతుకున మేలు చూపవె ఓ.... ||బ్రతు||
బ్రతుకున మేలు చూపవె ఓ..... ||బ్రతు||
నీ చూపే చాలు ||అదే|| ఇదియే||
ఇ: ఈ లోకమేమో మరీ లోకమేమో
మనసులతోనే తనువులు తేలే
బ్రతుకిక తూగుటూయలే ఓ..... ||బ్రతు||
ఈనాటి ప్రేమ లోటు లేని మేటి సీమ
లోటు లేని మేటి సీమ ఓ..... ||ఇదియే||

ఈ పాటను ఘంటసాల, జిక్కి పాడగా అక్కినేని నాగేశ్వరరావు, షావుకారు జానకి అభినయించారు. మాస్టర్ వేణు శైలి ఇదీ అని పట్టి ఇచ్చే పాటయిది. మధ్యమావతి, శ్రీ రాగాలను మిశ్రమం చేసుకుంటూ తన గురువైన నౌషద్ స్టయిల్ ఆఫ్ కంపోజిషన్‌ను గుర్తుచేస్తూ వరసల్ని కల్పించటం మాస్టర్ వేణు ట్యూన్ చేసే పద్ధతి. కావాలంటే నౌషద్ సంగీత దర్శకత్వంలో 'అన్‌మోల్‌ఘడీ' చిత్రం కోసం నూర్జహాన్ పాడిన 'ఆజా... మెరీ బర్ బాత్ మెహబ్బత్‌కీ' అనే పాటని సంపాదించి వినండి. మాస్టర్ వేణు స్వర రచనలలో నౌషద్ ప్రభావం ఎంత ఉందో తెలుస్తుంది.

---

రండయ్య పోదాము మనము
లేచి రండయ్య పోదాము మనము
ఇకను కొండలన్నీ పిండికొట్టి పారేద్దాము ||రండయ్య||
బసవన్న చెండించి రంకె వేస్తున్నాడు
పాలేరు మనతోటి పయనమౌతున్నాడు
భూదేవి కరుణించి పులకాంకురంబెత్తి ||భూదేవి||
రత్నాల ముత్యాల రాసి కురిపిస్తుంది ||రండయ్య||
కాపు బీదే కాని గడ్డ బీదే కాదు
కోటి విద్యలు కూడా కొండకే లోకువ ||కోటి||
ఏకధాటిగ మనము ఏకమై నడవాలి
కరువు రక్కసి గుండె తారెత్తిపోవాలి
తుంగభద్రా కృష్ణ గోదావరి నదులు
చెంగు చెంగున పొరలి చేలపై తిరిగాలి
గట్టు తన్నుక పంట కాలువలు పారాలి కాలువలు పారాలి
గర్భదారిద్ర్యం కడతేరిపోవాలి ||రండయ్య||
బంజర్లన్నిటిని పద పదాలుగ చేసి
అడవులన్నీ హతాహతముగా చెక్కేసి హతముగా చెక్కేసి
దేవుడిచ్చిన తీర్థమెవడడ్డగించినా.... (2)
ప్రవహింప చేస్తాం బ్రతుకు సాగిస్తాం (2)
గంగా మహాదేవి గబగబా రావాలి
గిరగిరా జరజరా తిరిగి హోరెత్తాలి
జలజలా బొల బొల బొలా (2) నదులు పరుగెత్తాలి
మేలుకోళ్ళేకమై ఎగిసి నీళ్ళురకాలి
కదిలి రావమ్మా... దూకి రావమ్మా... పొంగి రావమ్మా....

ఈ పాటను ఘంటసాల, బృందం ఆలపించగా అక్కినేని నాగేశ్వరరావు, షావుకారు జానకి, సీతారాం మొదలైన వారు అభినయించారు. బిళహరి రాగాన్ని ప్రధాన ఆధార రాగంగా తీసుకుని అన్యస్వరాలను కూడా చేర్చుకుని పూర్తి జానపద ధోరణిలో మలచారీపాటని. పాట మొదలైన దగ్గర్నుంచి చివర్న గట్లు తెంచుకుని పారే నీళ్ళ శబ్దం వరకు మొత్తం పాటనంతటినీ పాడేవాళ్ళు ఇప్పటికీ ఆంధ్రదేశంలో కొన్ని కొన్ని ప్రాంతాలలో మనకి కనిపించినా ఆశ్చర్యపోనవసరంలేదు. ఈ పాట వేసిన ముద్ర అలాంటిది!

ఈ పాటలో కొసరాజు ఉపయోగించిన పదాలు చూడండి - చెండించి / పులకాంకురంబెత్తి / కాపు బీదే కాదు / తారెత్తి పోవాలి / గట్లు తల్లుక పంట కాలువలు పారాలి / పదపదాలుగా చేసి / హతహతముగా చేసి / బొలబొలా / మేలుకోళ్ళు ఏకమై ఎగిసి నీళ్ళు ఉరకటం - ఇలా... జనాల హృదయాలను పట్టుకునే పల్లెపట్టు పదాలతో పాటను రక్తి కట్టించాడు కనుకనే ఆయన 'జానపద కవి బ్రహ్మ' అయ్యాడు.

---

కల్లా కపటం కానని వాడ లోకం పోకడ తెలియని వాడ
ఏరువాక సాగారో రన్నో - చిన్నన్న
చ: 1. నవధాన్యాలను గంపకెత్తుకుని
చద్ది అన్నము మూటగట్టుకుని (2)
ముల్లుగర్రను చేతబట్టుకుని
ఇల్లాలును నీ వెంటబెట్టుకుని
ఇల్లాలును నీ వెంటబెట్టుకుని ||ఏరువాక||
చ:2. పటమట దిక్కున వరద గుడేసె
ఉరుముల మెరుపుల వానలు కురిసె (2)
వాగులు వంకలు ఉరవడి జేసె
ఎండిన జీళు ఇగుళ్ళు వేసె ||ఏరువాక||

చ:3. కోటేరును సరిజూసి ఎన్నుకో
ఎలపడ దాపట ఎడ్ల దోలుకో
పాలుదప్పక కొండ్రదున్నుకో
విత్తనమ్ములిసిరి సిరి చల్లుకో ||ఏరువాక||
చ:4 పొలాలమ్ముకుని పోయేవారు
టౌనులో మేడలు కట్టేవారు
బ్యాంకులో డబ్బులు దాచేవారు
నీ శక్తిని గమనించరు వారు ||ఏరువాక||

చ:5 పల్లెటూళ్ళలో చెల్లనివాళ్ళు
పాలిటిక్స్‌తో బ్రతికేవాళ్ళు
ప్రజాసేవయని అరచేవాళ్ళు ||ప్రజా||
ఒళ్ళు వంచి చాకిరికి మళ్ళరు ||ఏరువాక||
పదవులు స్థిరమని భ్రమిసే వాళ్ళే
ఓట్లు గుంజి నిను మరిచే వాళ్ళే
నీవే దిక్కని వత్తురు పదవోయ్ (2)
రోజులు మారాయ్ రోజులు మారాయ్
మారాయ్ మారాయ్ మారాయ్
రోజులు మారాయ్ ||ఏరువాక||

తెలుగు సినిమా సంగీతంలో జానపద గీతాల ప్రభావం అనే అంశం గురించి ఎవరైనా ప్రస్తావించవలసి వస్తే 'రోజులు మారాయి' చిత్రంలోని 'ఏరువాక సాగారో రన్నో చిన్నన్న' పాటను ఉదహరించకుండా ముందుకు వెళ్ళలేరు. ఒక్క తెలుగునాట మాత్రమే కాక మొత్తం భారతదేశంలోని సంగీత ప్రపంచానికి సంబంధించిన వారందరినీ ఒక ఊపు ఊపిన పాట అది. కొసరాజు రాఘవయ్యా చౌదరి రాసిన ఈ పాటను పాడినది జిక్కి. వహీదారెహమాన్ నృత్యం చేసి అభినయించగా అక్కినేని నాగేశ్వరరావు, షావుకారు జానకి, సీతారాం మొదలగువారు సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ఈ పాటలో డప్పు వాయిస్తూ వహీదారెహమాన్ పక్కన కనిపించే ఒక వ్యక్తి కె.యస్.రెడ్డి. తర్వాత రోజుల్లో నృత్య దర్శకుడిగా, దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు.

నృత్య దర్శకుడిగా అప్పటికే లబ్ధప్రతిష్ఠుడైన వెంపటి పెద్ద సత్యం ఈ చిత్రం గురించి విన్నారు. హుటాహుటిన నిర్మాత సి.వి.ఆర్.ప్రసాద్‌గారి దగ్గరకెళ్ళి 'అదేంటండీ... ఒక్క డాన్సు కూడా లేకుండా ఎలా ... నన్ను మర్చిపోయారా... నేను సారధీవారి మనిషిని కానా?' అని అడిగారట. దాంతో ప్రసాద్‌గారు ఆలోచనలో పడ్డారు. ఆ చిత్రంలో ఒక్క పాట తప్ప మిగిలిన పాటలన్నిటినీ రాసిన కొసరాజుగారిని పిలిపించారు. "పెద్ద సత్యం ఇలా అన్నాడు. నిజమే కదా... ఎక్కడ పాట పెడతాం?" అని ఆలోచించారు. కలెక్టరు వచ్చి బంజరు భూముల్ని పేదరైతులకు పంచి ఇచ్చే సీను ఉంది. అది బడుగు రైతుల విజయమే కదా, అక్కడ పెడితే బాగుంటుంది అనుకున్నారు. మరి ఏం రాయాలి అని చర్చించుకుంటుండగా, ఏరువాక పౌర్ణమికి అరకులు కట్టే సంప్రదాయం గురించి గుర్తుచేసారు నిర్మాత సి.వి.ఆర్ ప్రసాద్. "ఆ... వచ్చేసింది" అన్నారు కొసరాజు వెంటనే. అంతే.... ఆశువుగా చెప్పుకుంటూ పోయారు పాటని. సినిమాలో అయిదు చరణాలే ఉన్నాయిగానీ ఆ రోజు ఆయన నోట వెలువడ్డ చరణాలు ఎన్నో.. ఎన్నెన్నో... తెలుగు సినిమాల్లో జానపద సాహిత్యానికి సంబంధించిన గీతాలు రాయాలన్నా, హాస్యగీతాలు రాయాలన్నా కొసరాజుని మించిన కవి లేరన్నది నిర్వివాదాంశం. ఆయన తర్వాత ఆ లోటు ఇప్పటికీ భర్తీకాలేదు గనుక ఆయనే 'కొస'రాజు అని సినీజనులు చమత్కరిస్తుంటారు కూడా. పల్లెటూళ్ళలో పొలం దున్నుకునే వారి నుడికారానికి ఓ ప్రాకారం కట్టి పాటరూపంలో ఆయన స్వరార్చన చేసిన ఈ పాటలోని ప్రతీపదం జీవన గుణాన్ని సంతరించుకున్నదే అప్పటికి కొందరు ప్రసిద్ధులైన నర్తకీమణులు ఇండస్ట్రీలో ఉన్నా, వారిలో శాస్త్రీయత విపరీతంగా తొంగిచూస్తూ ఉండటం వల్ల వద్దనుకున్నారు. వాహినీ సంస్థలో పని చేసే వేదాంతం జగన్నాథ శర్మ ఈ విషయం తెలిసి మాట సాయం చేశారు. "రాజమండ్రిలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న రహమాన్‌గారికి వహీదా, షహీదా అనే ఇద్దరమ్మాయిలున్నారు. వాళ్ళు బాగా డాన్స్ చేస్తున్నారు. ఒకసారి ప్రయత్నించి చూడండి" అని సలహా ఇచ్చారు. వెంటనే వహీదా రహమాన్‌ని పిలిచి ఓకే చేశారు సారధివారు.

ప్రతిరోజూ కనీసం మూడు గంటల నుండి - ఆమె ఆడి ఆడి అలిసిపోయేవరకు కనీసం ఓ నెలరోజులపాటు రిహార్సిల్స్ జరిగాయి. మాస్టర్ వేణు హార్మోనియం వాయించేవారు. కొసరాజుగారే పాడేవారు. పాటలో డప్పులుంటే బాగుంటుందని పాత డప్పులన్ని చల్లపల్లి పంపించి తిరిగి కొత్త చర్మం వేయించి ఉపయోగించేవారు.

ఆ డప్పులే ఆ పాటకి ప్రధాన ఆకర్షణ అయి కూర్చున్నాయి. అంతేకాదు. పాటలో పల్లవికి కట్టిన ట్యూనే ఇంటర్‌లూడుగా వాడుకున్నారు. నిజానికి అప్పటికి అదో ప్రయోగం. పల్లవి మీద ఎంత నమ్మకం లేకపోతే దానిని తిరిగి ఇంటర్లూడ్‌గా వాడుకుంటారు? ఏ మాత్రం బాగులేకపోయినా అది మొనాటనీ అయ్యే ప్రమాదం ఉంది కదా!? ఆ ప్రయోగం ఎంతగా విజయం సాధించిందంటే ఆ తర్వాత తమిళ రంగంలో ఒకేసారి అయిదు చిత్రాల్లో ఇటువంటి పాటలు వచ్చాయి. ఇవన్నీ ఒక ఎత్తు. మొత్తం సంగీత దర్శకులందరూ ఎంతో గౌరవంగా 'బర్మన్‌దా' అంటూ పిలుచుకునే ఎస్.డి.బర్మన్ కూడా ఈ 'ఏరువాక సాగారో' ట్యూన్‌ని తీసుకుని 'బొంబై కా బాబు' చిత్రంలో 'దేఖనే మే భోలా హై బాబూ చిన్నన్న' అనే పాటను స్వరపరచడం మరో ఎత్తు. సంగీత దర్శకుడిగా మాస్టర్ వేణు ఘనవిజయంగా చెప్పుకోవచ్చు ఈ సంఘటనని. మరోవిధంగా ట్యూన్‌తో పాటు 'చిన్నన్న' అనే తెలుగు పదం ప్రభావంలో తప్పించుకోలేని విధంగా బర్మన్ మహానుభావుణ్ణి సైతం పడేసిన కొసరాజు విజయం కూడా.

---

చిరునవ్వులు వీచే అదిగోనా ఆశలు ఫలియించే (2)
మదిలోని ఊహలు పూవులు పూచి వలుపులు కురిపించే ||చిరు||
పరుగెత్తెను కాలువ నీళ్ళు తలయెత్తును ఆవేశాలు
పులకించెను నవభావాలు ఉలికించెను ఆలోచనలు
అనుకున వన్నెకాడె అనురాగం చూపెగా (2)
అహహా వలలో చిక్కెనుగా అహా నీ వలలో చిక్కెనుగా
అదియేమొ గాని అదిగో నీ ఆశలు ఫలియించె ||చిరు||
చిలకంచుల చీరగట్టి
సిగ పూలతో షికారు కెళ్ళే
నిలువెత్తున పెరిగిన చేను
నిను జూచి కన్నుగీటెగా
వరికన్నె రమ్మని నిన్నే సైగలెన్నో చేసెగా (2)
మురిపాలు చూడమని నవ్వెగా
ఉలిపాట పాడమని నవ్వెగా
అదియేమోగాని ||అదిగో||
వరికెంపుల సొంపులు తీరె
వదినమ్మకు లేదేం నోరే
కలహాలన్నీ గతించె
వరహాల రోజులు వచ్చే
నువ్వుగంటే భాగ్యం పండి
పాపాయింట్లో దోగును (2)
పై రీనిన పాతర నిండును
దేశానికి సౌఖ్యం గల్గును
ఆనందమౌను
అదిగో మన ఆశలు ఫలియించ్చె... ||చిరు||

ఈ పాటను ఘంటసాల, జిక్కి, కృష్ణకుమారి పాడగా అక్కినేని నాగేశ్వరరావు, షావుకారు జానకి, అమ్మాజీ అభినయించారు. సోగ్గాడు, యవ్వనం కాటేసింది, రిక్షారాజీ చిత్రాలలో హీరోయిన్‌గాను, ప్రస్తుతం టీవీ రంగంలో క్యారెక్టర్ నటిగాను ప్రేక్షకులకు తెలిసిన జయచిత్రకు ఈ అమ్మాజీ తల్లి.

మాస్టర్ వేణు మచిలీపట్నంకి చెందినవాడు కావటం చేత బందరులో అప్పట్లో మంచి పేరు తెచ్చుకున్న కృష్ణకుమారిని గాయనిగా ఈ పాటకోసం తీసుకొచ్చి పాడించారని, ఆ తరువాత ఆమె సినీగీతాలు పెద్దగా పాడలేదని 'రోజులు మారాయి' చిత్రానికి ప్రొడక్షన్ వ్యవహారాలు చూసిన తమ్మారెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. తమ్మారెడ్డి కృష్ణమూర్తి - తర్వాతి రోజుల్లో నిర్మాతగా మారి లక్షాధికారి, జమిందార్, ధర్మదాత వంటి విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. నేటి దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈయన కుమారుడే

ఇక పాట విషయానికొస్తే - దేశ్ రాగాన్ని ప్రధాన రాగంగా తీసుకుని మధ్య మధ్య బృందావన సారంగ రాగం కూడా అనిపించేట్టుగా స్వరపరిచారీపాటని.

అభ్యుదయవాదులు తీసిన చిత్రం కనుక సరదాగా పాడుకునే ఇటువంటి - అన్నా వదినా చెల్లి కలిసి పాడుకునే - పాటలో కూడా దేశానికి సంబంధించిన ప్రసక్తి ఉండటాన్ని మూడవ చరణంలో గమనించవచ్చు.

---

ఎల్లిపోతుందెల్లి పోతుంది జోడెడ్లబండి
ఎల్లిపోతుందెల్లి పోతుంది పెళ్ళోరి బండి ||ఎన్ని||
అతుకు బొతుకుల్లేని బండి
గతుకులకు భయపడిన బండి
కాలచక్రం ధాటి కన్నా గబగబా పరుగెత్తుబండి ||ఎల్లి||
కోడెలంటె కోడెలా ఈ బండి లాగే కోడెలు
సాలూరు సంతకాడ సై అన్న కోడెలు
జిగమగ కోడెలు టంగువాడ కోడెలు
వంటి మీద చెయ్యేస్తే మింట పోయె కోడెలు ||ఎల్లి||
పెళ్ళంటే పెళ్ళిరా పేరు మోగే పెళ్ళిరా ఇది
పేరు మోగే పెళ్ళిరా పేరు మోగే పెళ్ళిరా ఇది
పేరు మోగే పెళ్ళిరా
వీధిలోన నిలువబెట్టి వేలు వేలు పాకపెట్టి
వెర్రి ఆవేశాలు బుట్టి కన్నవారి కాళ్ళు పట్టి
ఇల్లు వాకిలి కుదువ పెట్టి
అల్లుడికి కట్నం కట్టి
చుట్టపక్కాలందరికి
పెట్టలేక వాత బట్టి
రభస చేసే పెండ్లికాదిది
రట్టులోపడు పెండ్లికాదిది
చూడచక్కని పెండ్లిరా బహు వేడుకైన పెండ్లిరా
వేడుకైన పెండ్లిరా ||ఎన్ని||
పల్లెటూరి బాబులంతా భళీ భళీ అని మెచ్చుబండి
హరి హరాదులే అడ్డగించినా అపశక్యం కాని బండి
గంటల గణగణ నాదం తోటి
మువ్వల గలగల మోదం తోటి
పెళ్ళివారి పందిరిలో ఘల్లు ఘల్లునా దూకే బండి ||ఎల్లిపో||

ఈ పాటను మాధవ పెద్ది సత్యం పాడగా ప్రధాన పాత్రధారిగా వల్లం నరసింహారావు అభినయించారు. పెళ్ళికి తరలి వెళ్ళే బృందంలోని ఓ పెద్దగా వ్యవహరించిన మోదుకూరి సత్యం రెండవ చరణాన్ని అభినయించారు. తరువాత రోజుల్లో విఠలాచార్య సినిమాలద్వారా ఈ మోదుకూరి సత్యం హాస్యనటునిగా పేరు తెచ్చుకున్నారు.

శంకరాభరణం రాగంలోని స్కేల్‌ని తీసుకుని స్వరపరచిన ఈ పాటలో రెండవ నిషాదమైన కైశిక నిషాదాన్ని ('ని' అనే స్వరం) కూడా కలపటంతో హరి కాంభోజి రాగం అనిపించడానికి కూడా ఆస్కారం ఉంది. సాధారణంగా జానపదగీతాలు ఎక్కువగా హరికాంభోజి రాగం ఆధారంగానే ఉంటుంటాయి. అంచేత ఫోక్ సాంగ్స్‌కి కావలసిన ఊపు, తూగు కూడా పాటకు జతపడింది. చివరి చరణంలో సాధారణ గాంధార ప్రయోగం (గ' అనే స్వరం) కూడా జరిగింది, దాంతో సంపూర్ణ స్వతంత్ర సంచారం లభించి పూర్తిస్థాయి జానపదగీతంలా విలసిల్లిందీ గీతం.

పాట మొత్తం గమనిస్తే - బండి, ఎడ్లు, పెళ్ళి, వీటికి సంబంధించిన అంశాలను ఓసారి సూటిగా, మరోసారి తిప్పుతూ - గ్రామీణ వాతావరణంలో వాడుకునే మాటలతో ఎంత తెలివిగా రాశారోనని అనిపిస్తుంది
ఇక గాయకుడిగా మాధవపెద్ది సత్యం కంఠానికుండే రేంజ్ ఈ పాటకు ఒక మంచి వేదికగానే కాకుండా బహువేడుకగా అమిరింది.

ఎప్పుడైనా 'రోజులు మారాయి' చిత్రం టీవీలో వచ్చినప్పుడుగాని, రెంటల్ లైబ్రరీలో సీడీ ద్వారా వీడియో క్యాసెట్ల ద్వారా దొరికినప్పుడుగాని మనసుని ఆరోజులలోకి పంపించి ఏ టెన్షన్లూ, హడావుడీ లేకుండా తీరిగ్గా కూర్చుని చూడండి. ఆ తర్వాత మనసుకి కలిగే ఆనందాన్ని బేరీజు వేసుకుని చూడండి - ఎంత తృప్తిగా, గర్వంగా ఉంటుందో తెలుస్తుంది!



# ఆ పాత పాట మధురం

## రాజా



### సంతానం

*తొలిసారిగా విన్నప్పుడు మాత్రమే కాక, కొన్నాళ్ళ తర్వాత విన్నా, ఎన్నేళ్ళ తర్వాత విన్నా ఒకే రకమయిన రసస్పందనను కలిగించగల గీతాలు వచ్చిన 1950 దశకంలోనే ఓ చిత్రం వచ్చింది. తెలుగు సినీ సంగీత వైభవానికి వైతాళికులవలె నిలిచిన ఎందరో సంగీత దర్శకులలో సీనియర్ అయిన సుసర్ల దక్షిణామూర్తి ఆ చిత్రం ద్వారా సంగీత దర్శకునిగా తన స్వర స్మామాజ్యాన్ని మరింత సుసంపన్నం చేసుకున్నారు. జాతీయస్థాయిలో గర్వించతగ్గ మేలుజాతి గాయని లతామంగేష్కర్ తొలిసారి తెలుగుపాట పాడిన సినిమాగా, ఘంటసాల కీర్తికిరీటంలో మరో రెండు రత్నాల్ని పొదిగిన చిత్రంగా ఆ చిత్రాన్ని మరిచి పోవటం సంగీతాభిమానులకు అసాధ్యం. 1955 లో విడుదలయిన ఆ చిత్రమే సాధనా వారి సంతానం. ఈ చిత్రంలోని ఆణిముత్యాల్లాంటి పాటల్లో ముచ్చటగా ఓ నాలుగు పాటలివి:*

నిదురపో...నిదురపో...నిదురపో
నిదురపో...నిదురపో...నిదురపో
నిద్దురపోరా తమ్ముడా
నిద్దురపోరా తమ్ముడా
నిదురలోన గతమునంతా
నిముసమైనా మరచిపోరా ||నిదుర||
కరుణలేని ఈ జగానా
కలత నిదురే మేలురా ||నిదుర||
కలలు పండే కాలమంతా
కనుల ముందే కదలిపోయే

ఆ.....
లేతమనసుల చిగురుటాశ
పూతలోన రాలిపోయే
జాలితలచి కన్నీరు తుడిచే
దాతలే కనరారే ||జాలి||
చితికిపోయిన జీవితమంతా
ఇంతలో చితి ఆయె
నీడ చూపె నెలవు మనకు
నిదురయేరా తమ్ముడా ||నిదుర||

ఆనాటి నుంచీ ఈనాటి వరకూ - తెలుగు సినీ సంగీత చరిత్రలో ఈ పాటను మించిన జోల పాట మరొకటి లేదనిపించే విధంగా నిలిచిపోయిన 'నిదురపోరా తమ్ముడా' గురించి ఎంత చెప్పినా మరికొంత మిగిలిపోయిందేమోననిపిస్తుంది. పాడుకునే అలవాటున్న ప్రతివారిని తాదాత్మ్యంలోకి తీసుకుపోయి గుండెని చెమరింపచేయగల గీతమిది. పల్లవికి, తొలిచరణానికి హిందూస్థానీ రాగమైన బేహాగ్‌ని ఆధారంగా చేసుకుంటూ 'జాలితలచి కన్నీరు తుడిచే' చరణానికి హిందుస్థానీ భైరవిని వాడుకున్నారు సుసర్ల. హాయిగా జోలలా సాగే ఈ రస స్పందనను కరుణ, ఆర్ద్రతతో నింపుతూ శోకానికి తారాస్థాయిగా మిగిలేలా తీసుకుపోవాలంటే ఆ శక్తి హిందూస్థానీ  భైరవికే ఉందని గ్రహించిన సుసర్ల రససిద్ధికి నిదర్శనం ఈ పాట. చిత్రం తొలిభాగంలో వచ్చే ఈ పాట తిరిగి పతాక సన్నివేశంలో కూడా వస్తుంది. ఇందులో ఘంటసాల కంఠం కూడా వినిపిస్తుంది. ఘంటసాల - లతా పాడిన ఈ రెండో పాట అప్పట్లో రికార్డుగా వచ్చిన దాఖలా లేదు. ఇప్పుడు కొన్ని క్యాసెట్లలో దొరుకుతున్నట్లు వినికిడి. ఈ 'నిదురపోరా తమ్ముడా' పాటని భావస్ఫోరకంగా లతా పాడిన పద్ధతికి ఆమెకు తెలుగు రాదంటే ఇప్పటికీ నమ్మనివాళ్ళు ఉన్నారు. అంత గొప్పగా ఉంది ఆమె తెలుగు ఉచ్చారణ. రెండో చరణం 'జాలి తలచి'లో గాత్ర ధర్మానికి ఆయువు పట్టుగా నిలిచే 'దాతలే కనరారే' దగ్గిర అటు లతా, ఇటు ఘంటసాల ఇద్దరూ ఇద్దరే అన్నట్టు శిఖరాయమాన స్థానంలో నిలిచారు.

---

దేవీ శ్రీదేవీ ||దేవీ||  
మొరలాలించి పాలించి నన్నేలినావే ||దేవి||  
మదిలో నిన్నే మరువను దేవీ ||మదిలో||  
నీ నామ సంకీర్తనే చేసెద ||దేవీ||  
నీ కనుసన్నల నిరతము నన్నే ||నీ కను||  
హాయిగా ఓలలాడించరావే ||నీ కను ||  
ఇలదేవతగా ఆ......ఆ....  
ఇలదేవతగా వెలసితినీవే ||ఇల||  
ఈడేరే...  
ఈడేరే నా కోర్కెలేనాటికీ ||దేవీ||

ఈ పాటను ఘంటసాల పాడగా అక్కినేని, సావిత్రి అభినయించారు. 'దేవీ శ్రీదేవి' పాట గురించి చెప్పేముందు ఆ పాటకు ఆధారమైన షణ్ముఖ ప్రియరాగం గురించి కొంచెం చెప్పాలి. 56వ మేళ కర్త రాగమైన ఈ షణ్ముఖప్రియ రాగాన్ని పూర్వం నాటకాల్లో పద్యాలకు ఉపయోగించేవారు. కారణం ఈ రాగం మంద్రంలో కంటే మధ్యమ తారాస్థాయిల్లో స్వర సంచారం చేసుకోవటానికి, గాయకుని శక్తి సామర్థ్యాలు చాటుకోవడానికి చాలా అనుకూలంగా ఉంటుంది. ఈ రాగంలో నిసరి, సదాప అనే స్వరప్రయోగాలు జనరంజకంగా ఉంటాయి. అంతే కాక 'రి' (రిషభ) దగ్గర ఆపినా, 'రిసదా...ప' అనే దాటు ప్రయోగం చేసినా కర్ణపేయంగా ఉంటుంది. ఇవన్నీ బహు చక్కగా తెలిసిన సంగీతజ్ఞుడు సుసర్ల దక్షిణామూర్తి ఆ ప్రయోగాలన్నిటిని పొందుపరుస్తూ రూపొందించారు 'దేవీ శ్రీదేవి' పాటని. కథకి సినిమాకి క్లయిమాక్సు ఉన్నట్లే రాగానిక్కూడా ఓ క్లయిమాక్స్ ఉంటుంది. పాడేవారి సామర్థ్యానికి పరీక్షగా నిలిచే రీతిలో ఈ పాటలోని 'ఇలదేవతగా వెలసితివీవే' అనే వాక్యాన్ని - రాగాని క్లయిమాక్స్‌గా ప్రతిగాయకుడూ తల్చుకునేలా మలిచారు సుసర్ల దక్షిణామూర్తి. ఇక గాయకుడిగా ఘంటసాల తన గళానికున్న రేంజ్ ఎటువంటిదో చూపిన పాట ఇది. ఘంటసాల అభిమానులంతా గర్వంగా చెప్పుకునే ఈ

పాటను యధాతథంగా పాడగలిగే ఏ ఔత్సాహిక గాయకుడైనా సరే ఎటువంటి లలిత, సినీ సంగీతపు పోటీలలోనైనా ఉత్తీర్ణుడయి తీరతాడు. గాయకుడిగా రాణించాలనుకునే ప్రతి కళాకారుడు సాధన చేయదగ్గ గీతమిది.

---

చల్లని వెన్నెలలో ||చల్లని||
చక్కని కన్నె సమీపములో ||చల్లని||
అందమె నాలో లీనమాయెనే
ఆనందమె నా గానమాయెనె ||చల్లని||
తెలి మబ్బుల కౌగిలిలో జాబిలి
తేలియాడెనే ముద్దులలో
తెలిమబ్బుల కౌగిలిలో జాబిలి
తేలియాడెనే ముద్దులలో

గాలి పెదవులే మెల్లగ సోకిన
గాలి పెదవులే మెల్లగ సోకిన
పూలు నవ్వెనే నిద్దురలో ||చల్లని||
కళకళలాడే కన్నె వదనమే
కనిపించుచు ఆ తారలతో
ఓ...ఓ...ఓ
కలకాలం నీ కమ్మని రూపము
కలకాలం నీ కమ్మని రూపము
కలవరింతునే నా మదిలో ||చల్లని||

ఈ పాటను ఘంటసాల పాడగా అక్కినేని, సావిత్రి అభినయించారు. ఈ పాట మొత్తం ఒక్కటీ ఒక ఎత్తు. ఆలాపన ఒక్కటీ ఒక ఎత్తు. ఆలాపన వరకు హృదయునికి పట్టించేసుకోగలిగితే కళ్యాణి రాగంలో ఉన్న ఏ పాటైనా సరే ఇట్టే గుర్తు పట్టెయ్యొచ్చు.

కళ్యాణి రాగంలో మాండ్ రాగచ్ఛాయలను కలుపుకుంటూ స్వరపరచిన 'చల్లని వెన్నెలలో' పాట 'లలిత గీతం అంటే ఇలా ఉండాలి' అనిపిస్తుంది. 'గాలి పెదవులే మెల్లగ సోకిన పూలు నవ్వెలే నిద్దురలో' అనే పద ప్రయోగం - ప్రేమ ఎంతో సున్నితమైనది; దాన్ని అభివ్యక్తీకరించటంలో కూడా కొంత వ్యక్తిత్వం, అభిరుచి, సున్నితత్వం ఉండాలి - అనే విషయాన్ని అన్యాపదేశంగా చెపుతుంది.

ఈ పాటను పాడడానికి లబ్దప్రతిష్టులైన గాయకులు కూడా ఉత్సాహపడుతుంటారు. అందులో యస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒకరు. ఘంటసాలకి సంబంధించిన కొన్ని సభలలో, సంగీత కార్యక్రమాలలో వారి గొప్పతనాన్ని వర్ణించడానికి ఈ పాటను బాలు పాడి విశ్లేషిస్తూ వివరించేవారు. అంతెందుకూ - ప్రభుదేవా, నగ్మా హీరో హీరోయిన్లుగా నటించిన 'ప్రేమికుడు' సినిమా గుర్తుకు తెచ్చుకోండి. అందులో నటించిన బాలసుబ్రహ్మణ్యం - ప్రభుదేవాతో కలిసి డాబా మీద కూర్చుని ప్రేమ వివరాలు రాబట్టే సన్నివేశంలో ఈ 'చల్లని వెన్నెలలో' పాటను ఆలపించి తన సరదా తీర్చుకోవటం అందుకు మరో ఉదహరణ.

---

ఆ:తొలివలపుల కుసుమాంజలి నీకై
అర్పించితి నోయీ! దీవనలే
ఆశించితినోయీ!
అ:సంతోషమేలా, సంగీతమేలా!
పొంగి పొరలేను మనసేవేళా!
మది పులకించే మోహమిదేనా!
మమతలు నింపే స్నేహమిదేనే!
అ:పరవశమయ్యే ప్రణయ మిదేలే

ప్రతి క్షణమీ ఇల పండుగ యేలే
సంతోషమేలా, సంగీతమేలా!
ఆ:నీ చిరునగువు కాంతిలో జీవింతునోయీ!
నీ తలపేనోయ్ తొలివలుపు హాయీ!
కౌగిలియే నీ కాలయమోయీ
కనులందే నీ కాపురమోయీ, నా
కనులందే నీ కాపురమోయీ!
కనులందే నీ కాపురమోయీ! ||సంతోష||

ఆ:ఈ ఆనందం, ఈ ఆవేశం
నీ అందానికే ఆశించేనా!
ఆ:అనురాగంలో నవభోగంలో
మన జీవనమే తరియించేనా!
అ:అనురాగంలో నవభోగంలో
మన జీవనమే తరియించేనా
ఇ:సంతోషమేలా సంగీతమేలా
పొంగి పొరిలేను మనసీవేళా!

ఈ పాటను చలం, కుసుమకుమారి అభినయించారు. ఈ కుసుమకుమారి తరువాత తన పేరు 'మాలిని'గా మార్చుకుని మరికొన్ని చిత్రాలలో నటించింది. జమునారాణితో పాటు ఈ పాటను పాడింది కోదండపాణి. తరువాతి రోజుల్లో సంగీత దర్శకుడిగా పేరుగాంచిన కోదండపాణే ఈ కోదండపాణి. 'పండంటి కాపురం' సినిమాలో 'ఇదిగో దేవుడు చేసిన బొమ్మ' పాట తప్ప కోదండపాణి ఇంకే పాటనూ పాడలేదనుకునేవారికి ఈ పాటను ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. శాంతారాం నిర్మించిన 'సుబహ్ కా తారా' (1954) చిత్రంలో సి. రామచంద్ర సంగీత దర్శకత్వంలో తలత్ మహమ్మద్, లత పాడిన 'గయా అంధేరా / హువా ఉజాలా / చమ్కా సుభా కా తారా' అనే హిందీ గీతం ట్యూన్‌ని ఈ పాటకు వాడుకోవటం జరిగింది. ఈ హిందీ ట్యూన్‌ని ఎన్.టి.ఆర్, ఏ. యన్. ఆర్. నటించిన 'భూకైలాస్' చితంలోని ఓ పాటను కూడా వాడుకోవడం జరిగింది. ఆ వివరాలు ఆ సినిమా సంగీతాన్ని గురించి రాసే సమయంలో చర్చించటం జరుగుతుంది.

ఈ 'సంతానం' సినిమాలోని పాటల ద్వారా అజరామరమైన ఖ్యాతిని సంపాదించిన సుసర్ల దక్షిణామూర్తి తాతగారు కీ.శే. సుసర్ల దక్షిణామూర్తి త్యాగరాయ స్వామి శిష్యపరంపరలో ఒకరు. ఒక గురువుగా ఆంధ్రదేశానికి ఎంతోమంది శాస్త్రీయసంగీత విద్వాంసులను అందించిన కీ.శే.సుసర్ల దక్షిణామూర్తి వద్ద శిష్యరికం చేసిన ముఖ్యులలో ఒకరు పారుపల్లి రామకృష్ణయ్యగారు. రెండోవారు మంగళంపల్లి బాల మురళీకృష్ణ తండ్రి అయిన పట్టాభిరామయ్యగారు. బాల మురళీకృష్ణను శిష్యునిగా స్వీకరించి స్వరసంపన్నుణ్ణి చేసిన పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారిని దృష్టిలో పెట్టుకుని విశ్వనాథ్ శంకరాభరణంలో శంకరశాస్త్రి పాత్రను రూపొందించారని చెబుతారు. సినీ సంగీత దర్శకుడిగా ఇవాళ మనం మననం చేసుకుంటున్న కె. సుసర్ల దక్షిణామూర్తి స్వరప్రాభవం వెనక అంతటి గొప్ప సంగీత వాతావరణ ప్రభావం ఉంది మరి.



# ఆ పాత పాట మధురం

## రాజా



### దొంగరాముడు

**తెలుగు** సినీ సంగీత చరిత్ర పుటలకు ఎక్కిన మంచి పాటలలో - ఉదాత్త స్థాయిని ఉంచదగ్గ వాటిని తిరిగి మరో చోట చేర్చి పరిశీలిస్తే - అందులో సింహభాగాన్ని ఓ పదిహేనేళ్ళపాటు అన్నపూర్ణ సంస్థ నుంచి వచ్చిన గీతాలకు ఇవ్వవలసి ఉంటుంది. కథ, సంభాషణలు, నటనా స్థాయి, చిత్రీకరించే తీరు - వీటితో పాటు సంగీత సాహిత్యాల విషయంలో కూడా నిబద్ధతతో కూడిన బాధ్యత ఇవన్నీ ఆ సంస్థ తీసిన చిత్రాలలో కనిపిస్తూ ఉంటాయి. అసలు ఈ సంస్థకు పెట్టిన `అన్నపూర్ణ` పేరు అక్కినేని నాగేశ్వరరావుగారి భార్య పేరు అని చాలామంది అనుకుంటారు. కానీ అది నిర్మాత దుక్కిపాటి మధుసూధనరావుగారిని పెంచిన తల్లిపేరు. కృతజ్ఞతా సూచకంగా ఆ పేరు పెట్టుకున్నారు. అంతకుముందు ఈ పేరుతో పాటు దుక్కిపాటి మధుసూధనరావుగారి కూతుళ్ళ పేర్లయిన లలిత కుమారి, కళ్యాణి పేర్లను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. సముద్రాల రాఘవాచార్యులుగారు, నార్ల వెంకటేశ్వరులుగారు కలిసి సంఖ్యా శాస్త్రం ప్రకారం `అన్నపూర్ణ` పేరు కలిసొస్తుందని చెప్పటంతో ఈ పేరునే తమ సంస్థకు ఖరారు చేసుకున్నారు.

తొలి చిత్రానికి దర్శకుడిగా మొదట భరణి పిక్చర్స్ అధినేత, భానుమతి భర్త అయిన రామకృష్ణని అనుకుని అడ్వాన్సు కూడా ఇచ్చారు. కానీ ఆయన వ్యక్తిగతమైన ఒత్తిడుల వలన ఆ అడ్వాన్స్ తిరిగి ఇచ్చేసి చెయ్యలేనని చెప్పేశారు. ఆ తర్వాత పి.పుల్లయ్యగారిని అనుకున్నారు. అయితే తమ చిత్రం పూర్తయ్యేవరకు ఇంకే చిత్రాన్నీ అంగీకరించరాదని మధుసూధనరావుగారు షరతు పెట్టారు. పుల్లయ్యగారు అందుకు అంగీకరించినా, అంతకుముందే ఒప్పుకున్న చిత్రాల ఒత్తిడి అందుకు సహకరించలేదు. దాంతో ఆయన కూడా తప్పుకోవలసి వచ్చింది. ఆ తర్వాత బి.యన్.రెడ్డిగారిని కలిశారు. వాహినీ సంస్థ నుండి బైటికి వచ్చి మరో చిత్రం చెయ్యాలంటే లక్షరూపాయలు ఇవ్వవలసి ఉంటుందన్నారు బి.ఎన్.రెడ్డి. అంత ఇవ్వలేక ఆ ప్రపోజల్‌ని డ్రాప్ చేసుకున్నారు. చివరకు అక్కినేని నాగేశ్వరరావు, దుక్కిపాటి మధుసూధనరావు కలిసి వెళ్ళి కె.వి.రెడ్డిగారిని కాంటాక్ట్ చేశారు. అప్పుడాయన `పెద్ద మనుషులు` చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అదయ్యేవరకు ఆగక తప్పదు. ఎందుకంటే కె.వి.రెడ్డిగారు ఒకేసారి రెండు చిత్రాలకు దర్శకత్వం వహించరు. సరే ఆగుతాం అన్నారు దుక్కిపాటివారు.

ముందు కె.వి.రెడ్డిగారు ఓ కథను సూచించారు. దానిపై 6 నెలలపాటు చర్చలు జరుగాయి. మధుసూధనరావుగారికి ఆ కథ నచ్చలేదు. మొదటి సగం ఒక కథలాగ, రెండో సగం ఇంకో కథలాగ మొత్తం 2 కథలు కలిసినట్టు ఉంది అని అనుకున్నారు. ఈ సంగతి కె.వి.రెడ్డిగారికి డి.వి.నరసరాజుగారి ద్వారా తెలిసి - సందేహాలు పెట్టుకుంటూ సినిమా తియ్యకూడదు. మరో సబ్జెక్ట్ వర్కవుట్ చేద్దాం -

అన్నారు. అలా ఆ సబ్జెక్ట్ పక్కన పడింది. పక్కన పడిన ఆ సబ్జెక్ట్‌తో కె.వి.రెడ్డిగారు కొన్నాళ్ళ తర్వాత 'పెళ్ళినాటి ప్రమాణాలు' అనే సినిమా తీశారు. అది వేరే సంగతి.

ఈలోగా హిగ్గిన్ బాదమ్స్‌లో 'లవింగ్ బ్రదర్స్' అనే పుస్తకం దుక్కిపాటివారి కంటపడింది. అట్టమీద ఇచ్చిన సంక్షిప్త కథను చదివి పుస్తకం కొని మొత్తం చదివారు. తమ్ముడి కోసం అన్న దొంగతనాలు చేసి చదివించటం అందులోని పాయింట్. ఆ పాయింట్ తీసుకుని తమ్ముడి పాత్రను చెల్లెలు పాత్రగా మారిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. దుక్కిపాటివారు, డి.వి. నరసరాజుగారు ఆ పాయింట్ మీద వర్క్ చేసి కె.వి.రెడ్డిగారికి వినిపించారు. ఆయన బావుందన్నారు. పూరిస్థాయిలో ట్రీట్‌మెంట్ మొదలయింది.

అలా 1951లో సంస్థను రిజిస్టర్ చేసిన అన్నపూర్ణావారు తమ మొదటి ప్రయత్నంగా నిర్మించి 1955లో విడుదల చేసిన ఆ చిత్రమే దొంగరాముడు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు. ఉన్న తొమ్మిది పాటలకు కర్త సముద్రాల రాఘవాచార్యులు - ఆ తొమ్మిది పాటలలో 'దొంగరాముడు' సినిమా పేరు వినగానే చటుక్కున స్ఫురించే ఓ ఆరు గీతాలివి.....

అంద చందాల సొగసరివాడు (2)
విందు భోంచేయ వస్తాడు నేడు
చందమామ...ఓహో చందమామ
చందమామ ఓహో చందమామ
చందమామ ఓహో చందమామ ఓఓఓ...
ఓ..ఓ..ఓ...చూడచూడంగ మనసగువాడు
ఈడు జోడైన వలపుల రేడు
ఊ...వాడు నీకన్నా సోకైన వాడు.....
విందు భోంచేయ వస్తాడు నేడు ||చందమామ||

ఓ...ఓ...ఓ వాని కన్నుల్లో వెన్నెల్లజాలు
వాని నవుల్లో ముత్యాలు రాలు
ఊ..... వాడు నీకన్నా చల్లనివాడు
విందు భోంచేయవస్తాడు నేడు ||చందమామ||
ఓ...ఓ...ఓ... నేటి పోటీల గడుసరివాడు
మాటపాటించు మగసిరివాడు
ఊ... వాడు నీకన్నా సిరిగలవాడు....
విందు భోంచేయ వస్తాడు నేడు ||చందమామ||




ఈ పాటను జిక్కి పాడగా సావిత్రి అభినయించింది. సన్నివేశ ప్రాధాన్యంగా చివర్లో అక్కినేని నాగేశ్వరరావు కనిపిస్తారు. పహడీ రాగచ్ఛాయలలో అన్యస్వరాలు కలుపుకుంటూ స్వతంత్ర సంచారం చేసుకుంటూ ఈ పాటను స్వరపరచినట్టు అనిపిస్తుంది. పాట సాహిత్యాన్ని చూస్తే - ఇటువంటి ఎక్స్‌ప్రెషన్స్‌తో మనం చాలా పాటలు వినేశాం కనక - 'ఏముందంత?' అని అనిపించవచ్చు కానీ ఇది 47 ఏళ్ళ క్రితం రాసినది అని ఒక్కసారి మనసుకి సజెషన్ ఇచ్చుకుని చూడండి. అప్పుడు కలిగే అభిప్రాయం ఖచ్చితంగా బావుంటుంది.

---

అ: ఓ..చిగురాకులలో చిలకమ్మా
చిన్నమాట వినరావమ్మా
ఆ: ఓ - మరుమల్లెలలో మావయ్యా
మంచి మాట సెలవీవయ్యా
అ: పున్నమి వెన్నెల గిలిగింతలకు
పూచిన మల్లెల మురిపాలు
నీ చిరునవ్వుకు సరికావమ్మా ||ఓచిగురాకులలో||
ఆ: ఎవరన్నారో ఈ మాట
వింటున్నాను ఈ మాట




తెలిసీ పలికిన విలువేనా ||ఓ...మరుమల్లెలో||
అ: వలచే కోమలి వయ్యారాలకు
తలచే మనసుల తియ్యదనాలకు
కలవా విలువలు సెలవీయ ||ఓ...చిగురాకులలో||
ఆ: పైమెరుగులకే భ్రమపడకయ్యా
మనసే మాయని సొగసయ్యా
గుణమే తరగని ధనమయ్యా ||ఓ... మరుమల్లెలలో||

ఈ మాటను జిక్కి ఘంటసాల పాడగా తెరపై సావిత్రి, అక్కినేని అభినయించారు. పాటలో మొత్తం సాహిత్యం అంతా ఒక ఎత్తు. 'వలచే కోమలి వయ్యారాలకు' అనే చరణంలోని సాహిత్యం ఒక్కటీ ఒక ఎత్తు. పాడుకునేందుకు వీలుగా భాష ఎంత సరళంగా, వినసొంపుగా ఉందో భావం అంత గుంభనంగా గుబాళిస్తూ ఉంటుంది. ప్రేమకు మనం ఆదర్శంగా ఉదహరించుకునే లైలా - మజ్నూ జంటలో లైలా అంత అందంగా ఉండదట. "మరి ఆమె గురించి ఎందుకంత పడి చచ్చిపోతావ్?" అని అడిగితే "నా కళ్ళతో చూడు" అన్నాడట మజ్నూ. గాఢమైన ప్రేమకు నిదర్శనంగా చెప్పుకునే ఆ సంఘటనను కవితా రూపంలో చెప్పాల్సి వస్తే దానికి ఈ చరణాన్ని మించిన ఉదాహరణ లేదనిపిస్తుంది. భీంప్లాస్ రాగంలో మిగిలిన సంగీత దర్శకులు ఇచ్చిన బాణీలతో పోలిస్తే పెండ్యాల పోకడ ప్రత్యేకంగా ఉంటుంది. ఈ పాట వరకూ ఆయన అక్కడక్కడ శుద్ధ ధన్యాసి రాగాన్ని స్పృశించినా ఎక్కువగా భీంప్లాస్ రాగం మీదే నడిపారు. మధ్య మధ్య వినిపించే ఫ్లూట్ బిట్స్‌కి ఈ చిత్రం విడుదలకు కొన్ని సంవత్సరాల ముందు వచ్చిన 'దిల్లగీ' హిందీ చిత్రంలో నౌషాద్ స్వరపరచిన 'తూ మేరీ చాంద్‌నీ' అనే పాటలోని ఫ్లూట్ బిట్స్ ప్రేరణ అని కొందరంటారు.

---

బలే తాత మన బాపూజీ - బాలల తాతా బాపూజీ (2)
బోసి నవ్వుల బాపూజీ - చిన్నీ పిలక బాపూజీ ||బలే||
కులమత బేధం వలదన్నాడు - కలిసి బతికితే బలమన్నాడు
మానవులంతా ఒకటన్నాడు - మనలో జీవం పోశాడు ||బలే||
నడుం బిగించి లేచాడు - అడుగు ముందుకు వేశాడు
కదం తొక్కుతూ పదం పాడుతూ - దేశం దేశం కదిలింది!

గజగజలాడెను సామ్రాజ్యం -
మనకు లభించెను స్వారాజ్యం! (2)
సత్యా హింసలే శాంతి మార్గమని
జగతికి జ్యోతిని చూపించాడు
మానవ ధర్మం బోధించాడు (2)
మహాత్ముడై ఇలవెలిశాడు ||బలే||




పాటను పి.సుశీల, బృందం పాడగా ప్రధాన పాత్రధారిణిగా జమున అభినయించారు. అన్నపూర్ణావారి ప్రతి చిత్రంలోనూ దేశభక్తికి సంబంధించిందిగాని కనీసం ఒక్క పాట అయినా ఉండి తీరుతుందన్న నమ్మకానికి, సంప్రదాయానికి పునాది వేసిన పాట ఇది. ఇవాళ్టికీ ఖద్దరు ధరించే దుక్కిపాటి మధుసూధరావు, అక్కినేని నాగేశ్వరరావుల కమిట్‌మెంట్‌కి ఓ సూచిక - ఈ గీతం! దేశానికి సంబంధించిన పాట కాబట్టి దేశ్‌రాగాన్ని ఈ పాటకి ఎక్కువగా వాడుకున్నారనిపిస్తుంది...! అప్పట్లో సుశీల గాత్రాన్ని సెకెండ్ హీరోయిన్‌కే ప్రిఫర్ చేసేవారు. దుక్కిపాటి మధుసూధనరావుగారి ప్రోత్సాహం వల్లనే ఆవిడ హీరోయిన్‌లకు పాడే స్థాయికి ఎదిగింది. ఆకథా కమీషూ 'తోడికోడళ్ళు' సినిమాను గురించిన వివరాలు చర్చించడం జరుగుతుంది. ఇంతకూ ఈ విషయం ఎందుకు ప్రస్తావించవలసి వచ్చిందంటే ఆ రోజుల్లో సుశీల గొంతు ఎంత షార్ప్‌గా ఉందో తెలియజేయడానికే. ఈ పాట దొరికితే విని చూడండి మీకే తెలుస్తుంది.

---

అనురాగము విరిసేనా - ఓ...రేరాజా
అనుతాపము తీరేనా!
వినువీధినేలే రాజువే
నిరుపేద చెలిపై మనసౌనా? ||అను||
నిలిచేవు మెయిలు మాటున
పిలిచేవు కనుల గీటునా!
పులకించు నాధుడెందము

ఏనాటి ప్రేమబంధమో! ఓ... రేరాజా..... ||అను||
మనసుసాగే మోహాలేమో
వెనుకాడే సందేహాలేమో ||మునుసాగే ||
నీ మనసేమో తేటగా
తెనిగించవయ్యా మహారాజా...... ఓ..... రేరాజా ||అను||



ఈ పాటను పి.సుశీల పాడగా జమున అభినయించారు. సన్నివేశ ప్రాధాన్యంగా జగ్గయ్య వేరే షాట్‌లలో అక్కడక్కడ కనిపిస్తారు. ఇది బొత్తిగా, పూర్తిగా పెండ్యాల వారి పాట. పెండ్యాల మార్క్ భీంప్లాస్ రాగం పాటంతా పరుచుకుని వినిపిస్తూ ఉంటుంది. కావాలంటే - చరణాలలోని మొదటి రెండు లైనులూ ఆలపించుకుని చూడండి. ఆ ఆలాపన - ఓ నెలరాజా వెన్నెల రాజా మా వన్నెలన్ని చిన్నెలన్ని నీకేనో ఈ (భట్టి విక్రమార్క), ఆ పూలదారులలో ఆ నీలి తారల వెన్నెల స్నానాలు చేయుదమా (నాకంటి పాపలో నిలిచిపోరా - వాగ్దానం), నీలి మేఘాలలో గాలికెరటాలలో (బావా మరదళ్ళు), ధరణి నేమి మహిమ చూప ద్వారకలో నుంటివో (దేవ దేవ నారాయణ పరంధామ పరమాత్మం - శ్రీకృష్ణార్జున యుద్ధం).... లీలా శుకులు ఋష్యశృంగులు మన యతీంద్రులై వెలసిరిగా (స్వాముల సేవకు వేళాయె - శ్రీకృష్ణార్జు యుద్ధం) .....వంటి వరసల్ని వరసగా మన మనసుల్లో కదలాడేట్టు చేస్తుంది. భీంప్లాస్ పెండ్యాల మార్కు వరసలివి.

ఈపాటలో జమునని ఎక్కువగా ఎడంవైపు నుండే చిత్రీకరించటం జరిగింది. దాంతో ఆమెకి కుడివైపుగల ‘పన్ను మీద పన్ను‘ దృశ్యపరంగా కొత్తందాలను చూపించటం, ఆ పన్ను మీద పన్ను తర్వాత చిత్రాల్లో ఓ విశేషాకర్షణగా మారడం, తాహశిల్దార్ గారమ్మాయి వంటి చిత్రాల్లో ఆ పన్ను మీదే ఓ డైలాగు ఉండడం - వీటన్నిటికీ - అనురాగము విరిసేనా పాటే శుభారంభం కావటం చెప్పుకోదగ్గ విశేషం.

---

లేవోయ్ చిన్నవాడా
లేలేలేవోయి చిన్నవాడా
నిదుర లేవోయి వన్నెకాడా
నిదురలేవోయి వన్నెకాడా
పొడిచింది చందమామ....
చేరి పిలిచింది వయ్యారి భామా (2)
కురిసింది వెన్నెల వాన.....
ఆహా.... విరిసింది పన్నీటివాసన ||లేవోయ్||

కన్నుల్లో కళమూసె నేల (2)
వెత చెంది సుఖపడలేవురా....
నీ బతుకల్లా కలయైపోవురా....||లేవోయ్||
నిన్న కలసి మొన్న లోన
మొన్న నేడు రేపు సున్న (2)
ఉన్ననాడే మేలుకో
నీ తనివి తీరా ఏలుకో ||లేవోయ్||




ఈ పాటను జిక్కి పాడగా నృత్య కళాకారిణి కుచల కుమారి అభినయించింది. సన్నివేశ ప్రాధాన్యంగా అక్కినేని నాగేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు ఉంటారు. అక్కడక్కడ హాస్య నటులు పద్మనాభం, బాలకృష్ణ కూడా కనిపిస్తారు. మధ్యమావతి రాగచ్ఛాయలలో ట్యూన్ చేయబడిన చక్కటి మధురగీతమిది.

హీరో డిప్రెషన్‌లో ఉంటే అతడి మనసుకి సేద తీరుస్తూ తిరిగి ఉతేజితుణ్ణి చేయడానికి ఉద్దేశించబడిన గీతమిది. ఇది దృష్టిలో పెట్టుకుని సాహిత్యాన్ని మరోసారి వినండి. అన్నపూర్ణా సంస్థపైనా, ఆనాటి కళాకారుల నిబద్ధత మీద గౌరవం ఎంతగా పెరిగిపోతుందో బేరీజు వేసుకుని చూడండి, అంతకుమించి వివరంగా విశ్లేషించటం అనవసరం.

---

రావోయి మా ఇంటికి - మావో
మాటున్నది మంచి మాటున్నది ||రారోయి||
నువ్వునుంచుంటె నిమ్మ చెట్టు నీడున్నది
నువ్వు కూసుంటె కురిసీల సీటున్నది
నువ్వు తొంగుంటె పట్టెమంచం పరుపున్నది
మాటున్నది - మంచి మాటున్నది ||రారోయి||
ఆకలైతే సన్న బియ్యం కూడున్నది
నీకాకలైతే సన్నబియ్యం కూడున్నది
అందులోకి అరకోడి కూరన్నది
ఆపైన రొయ్యిపొట్టు చారున్నది
మాటున్నది - మంచి మాటున్నది ||రారోయి||
రంజైన మీగడ పెరుగున్నది
నంజుకోను ఆవకాయ ముక్కున్నది
నీకు రోగమొస్తే ఘాటైన మందున్నది (2)
నిన్ను సాగనంప వల్లకాటి దిబ్బున్నది
మాటున్నది - మంచి మాటున్నది ||రారోయి||





మద్దాలి కృష్ణమూర్తి

'రారోయి మా ఇంటికి' పాటను జిక్కి పాడగా తెరపై సావిత్రి, ఆర్.నాగేశ్వరరావు అభినయించారు. ఈ పాటలో మరో పురుష కంఠం కూడా వినిపిస్తుంది. ఆ మాటలను ఆర్ నాగేశ్వరరావే పలికేరనుకునేవాళ్ళు ఇప్పటికీ ఉన్నారు. నిజానికి ఆ కంఠం మద్దాలి కృష్ణమూర్తి అనే ఓ నటునిది. అంత గొప్పగా పలికారాయన ఆ తాగుడు మాటలను.

ఈ పాటకి పెండ్యాల వారు చాలా తెలివిగా హిందుస్తాని సంప్రదాయంలోని ముజ్‌రాలలో శృంగారపూరితమైన ఆహ్వానం వశీకరణం పద్ధతిలో ధ్వనిస్తూ ఉంటుంది. ఓ రకమైన ఊపు, మత్తు ఉంటాయి. అవన్నీ ఈ పాట స్వభావానికి సరిపోయాయి. ఈ పాట మ్యూజిక్ సిట్టింగ్స్‌లో తాగిన వాడి నోటికి ఏవి రుచిస్తాయో అవి ఉదహరిస్తే బాగుంటుందన్న సలహా రావడంతో సముద్రాల వారు పెండ్యాల గారిని అడిగారట... 'ఒరే..నాగేశ్వరరావు...కోడి కూర అంటారు కదా..... అదెలా ఉంటుందిరా?' అని. పెండ్యాల గారు 'నాకంతగా అనుభవం లేదండి' అన్నారట. చివరకు ఆర్ట్ డైరెక్టర్ కృష్ణారావుగారిని అడిగితే - అరకోడి కూర, రొయ్యిపొట్టు చారు బ్రహ్మాండంగా ఉంటాయని చెప్పారట. అప్పుడా రెండిటినీ రెండో చరణంలో అద్వితీయంగా జొప్పించి అందర్నీ మెప్పించారు సద్బ్రాహ్మణుడైన సముద్రాల రాఘవాచార్య. ఇక తెరపై చిత్రీకరణ పరంగా ఈ పాట ఎంత భాగా రక్తి కట్టిందంటే 'అప్పుడు ఆర్.నాగేశ్వరరావు దొరికిపోయాడు సావిత్రి చేజిక్కి - ఎందుకంటే అక్కడ అద్భుతంగా పాడింది గాయని జిక్కి" అంటూ కొందరు కవితాత్మకంగా చెప్పుకునేవారు ఆరోజుల్లో.



# ఆ పాత పాట మధురం



రాజా

## మిస్సమ్మ

సంగీత సాహిత్యాలకు పెద్దపీట వేసిన నిర్మాణ సంస్థల్లో విజయావారిది అచంచల అగ్రస్థానం. వారి పాటల్లో సినిమా కథ, పాత్ర వ్యక్తిత్వమే కాక, ప్రతి మనిషికీ కావలసిన జీవితానుభవసారం మొత్తం తొంగిచూస్తూ ఉంటుంది. ఇప్పటికీ విజయావారి పాటలు సజీవంగా ఉండడానికి, తరువాతి తరానికి ఒక సాంస్కృతిక వారసత్వంగా మనం వాటిని అందజేసుకోగలగడానికి, అదే కారణం. 1955లో

విడుదలైన **మిస్సమ్మ**

చిత్రంలోని ప్రతీపాటా ఒక ప్రత్యేకతను సంతరించుకుంటూ అందుకు సాక్ష్యంగా నిలబడతాయి. పింగళి నాగేంద్రరావు రచించిన ఈపాటలను సాలూరి రాజేశ్వరరావు స్వరపరిచారు. 'ముఖే ముఖే సరస్వతీ' అన్నట్టు ఇద్దరూ సరస్వతీ రూపాలే. పింగళివారు పుంభావ సరస్వతి అయితే రాజేశ్వరరావుగారు రసభావ సరస్వతి. ఇటువంటి కలయిక - 'కల ఇక' - అనుకునే విధంగా ఆ చిత్రంలో వారిరివురూ ప్రాణ ప్రతిష్ఠగావించిన పద్నాలుగు పాటల్లో విజయావారి విజయకేతనాన్ని నేటికీ ఎగురవేయగల ఓ తొమ్మిది ప్రతిష్ఠాత్మక గీతాలివి.

---

ఔనంటే కాదనిలే - కాదంటే ఔననిలే
ఆడువారి మాటలకు - అర్థాలే వేరులే ||ఔనంటే||
అలిగి తొలిగి నిలిచినచో - చెలిమి చేయ రమ్మనిలే
చొరవ చేసి రమ్మనుచో - మరియాదగ పొమ్మనిలే ||ఆడువారి||
విసిగి నసిగి కసిరినచో - విషయమసలు ఇష్టమేలే
తరచి తరచి వూసడిగిన - సరసమింక చాలనిలే ||ఆడువారి||

స్త్రీ మనస్తత్వాన్ని మనో నేత్రంతో వీక్షించి ప్రతీవాక్యమొక శాస్త్రకారుని భాష్యంలా రూపొందించిన పాట 'ఔనంటే కాదనిలే, కాదంటే ఔననిలే'! ఈ పాటలోని 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' అనే వాక్యం ఎంత పాపులర్ అయిందంటే ఆ మాటను ఓ సామెతలాగా, ఓ సూక్తిలాగా వాడమే కాక, నిజంగా అసలది ఓ సామెత అని భావించేవాళ్ళు కూడా ఎంతోమంది ఉన్నారు. వారికి పింగళి, సాలూరి, ఏ.యం.రాజా, ఎన్టీఆర్, విజయావారు, "మిస్సమ్మ" గురించి తెలియకపోవచ్చు. కానీ ఆ వాక్యం "మిస్సమ్మ" ద్వారానే

తెలుగువారికి అందిందంటే నమ్మలేరు. అంతటి శాశ్వత స్థానం తెలుగు భాషలో సంపాదించుకుంది ఆ వాక్యం. జానపద సంగీత పోకడలను నవీనం చేస్తూ మలచబడ్డ ఈ పాటకు 'పీలూ' రాగం ఆధారం. ఈ కాలంలో కూడా పవన్ కళ్యాణ్ 'ఖుషీ'లో ఈ పాటను తిరిగి అదే సంగీత సాహిత్యాలతో వాడడం, ఆ పాట ఇప్పటి పాటలను మించిన ఘనవిజయాన్ని సాధించడం ఇవన్నీ ఈ తరానికి తెలిసిన విషయాలే అయినా ఈ పాటకున్న 'బలం ఇదీ' అని ఓసారి మననం చేసుకోటానికే ఈ ప్రస్తావన! ఏ.యమ్.రాజా పాడిన ఈ పాటను ఎన్.టి.ఆర్, రేలంగి అభినయించారు.

---

సీతారాం - సీతారాం - సీతారాం - జై సీతారాం సీతారాం
పైన పటారం లోన లొటారం - ఈ జగమంతా డంబాచారం ||సీతారాం||
నీతులు పలుకుని ధర్మవిచారం - గోతులు తీసే కూటాచారం ||సీతారాం||
చందాలంటూ భలే ప్రచారం - వందలు వేలు తమ ఫలహారం
గుళ్ళో హాజరు ప్రతి శనివారం - గూడుపుఠానీ ప్రతాదివారం
డాబులు కొడుతూ లోకవిహారం - జేబులు కొట్టే ఘన వ్యాపారం ||సీతారాం||
టాకుటీకుల టక్కుటమారం - కలికాలం మనగ్రహచారం ||సీతారాం||

ఈ పాటను రేలంగి స్వయంగా గానం చేశారు. ఆ రోజుల్లో కొంతమంది నటీనటులకు స్వయంగా పాడుకునే అలవాటుండేది కనుక వారి పేర్లను నేపథ్యగాయనీ గాయకుల పట్టికలో వేసేవారు కాదు. ఈ పాటను రేలంగి, ఎన్.టి.ఆర్ మరికొంతమంది ఉపపాత్రధారులపై చిత్రీకరించారు. ఈ పాటను వినడంగాని చూడడం గాని తటిస్థిస్తే - జాగ్రత్తగా గమనిసే గాయకుడిగా రేలంగి ఫెర్ఫార్మెన్స్, పింగళి అందించిన సాహిత్యం ప్రత్యేకంగా కనబడతాయి. ముఖ్యంగా సాహిత్యం వరకు చూసుకుంటే ఇవాళ్టికీ సమాజంలో అదే పరిస్థితి. కవి దార్శనికుడు అని ఊరికే అన్నారా మరి!?

---

బాలనురా మదనా
విరి తూపులు వేయకురా మదనా ||బాలనురా||
నిలిచిన చోటనె - నిలువగనీయక
వలపులు కురియునురా - తీయని
తలుపులు విరియునురా - మదనా ||బాలనురా||
చిలుకలవలె గోర్వంకలవలెనూ
కులుకగ తోచునురా తనువున
పులకలు కలుగునురా మదనా ||బాలనురా||
చిలిపి కోయిలలు చిత్తములోనె
కలకలకూయునురా మనసును
కలవర పరచునురా - మదనా ||బాలనురా||

ఈ పాటను సుశీల పాడగా, జమున నృత్యం చేస్తూ అభినయించింది. ఎన్.టి.ఆర్, సావిత్రి, యస్.వి.రంగారావు, ఋష్యేంద్రమణి మొదలైన వారంతా సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ఈ పాటకు ఖరహరప్రియ రాగం ఆధారం. ఖరహరప్రియరాగంలో

'పక్కన నిలబడి' అనే త్యాగరాయ కీర్తన భరణీ వారి 'చక్రపాణి' ద్వారా సినీ సంగీత ప్రియులకు పరిచయమై పోయింది. కనుక రెండిటినీ కలిపి వింటే ఖరహరప్రియ రాగం మీద అవగాహన కలుగుతుంది. రాజేశ్వరరావు ఈ రాగాన్ని ఉపయోగించిన పద్ధతి చాలా బావుంటుంది. కావాలంటే 'సంగీత లక్ష్మి' సినిమాలో 'పాటకు పల్లవి ప్రాణం' అనే పాట యొక్క పల్లవిని 'బాలనురామదనా' పాట పల్లవిని కలిపి పాడుకుని చూడండి. వెంటనే ఎంత పోలిక వుందో, రెండిటిలో ఎంత వైవిధ్యం ఉందో తెలుస్తుంది.

---

తెలుసుకొనవె చెల్లీ
అలా నడుచుకొనవె చెల్లీ ||తెలుసు||
మగవారికి దూరముగ
మగువలెపుడు మెలగాలని ||తెలుసు||
మనకు మనమె వారికడకు
పనియున్నా పోరాదని

అలుసు జేసి నలుగురిలో
చులకనగా చూచెదరని ||తెలుసు||
పదిమాటల కొకమాటయు
బదులు చెప్పకూడదని
లేనిపోని అర్థాలను
మన వెనుకనె చాటెదరని ||తెలుసు||

ఈ పాటను పి.లీల పాడగా సావిత్రి, జమున, యన్.టి.రామారావు అభినయించారు. ఎన్నేళ్ళు గడిచినా - ఎప్పుడు అన్వయించుకున్నా - 'కరక్టే సుమా' అని అనిపింపజేసే సాహిత్యాన్ని అందించిన పింగళి వారికి ఆడవారంతా ఋణపడి ఉండక తప్పదనిపిస్తుంది. ఈ పాట అర్థాన్ని ఆసాంతం ఆకళింపు చేసుకోగలిగిన ఏ అమ్మాయికీ ఎటువంటి జాగ్రత్తలూ చెప్పనవసరంలేదు.
ట్యూన్ పరంగా చెప్పాల్సివస్తే - బేహాగ్, యమన్, ఖమాచ్ రాగాలను రేఖా మాత్రంగా స్పృశిస్తూ 'రాజేశ్వరరావు టైప్ ఆఫ్ కమాచ్'ని సాధన చేయడానికి వీలైన విధంగా చక్కటి ట్యూన్‌ని ఇచ్చారు రాజేశ్వరరావు. ఖమాచ్‌రాగంలో రాజేశ్వరరావుది ఓ ప్రత్యేక శైలి. 'ఎందుకే నీ కింత తొందరా' (మల్లీశ్వరి) వంటి క్లాసికల్ ట్యూన్‌ని, 'పాడమని నన్నడగవలెనా' (డాక్టర్ చక్రవర్తి) వంటి సెమీ క్లాసికల్ ట్యూన్‌ని అందించగలిగాడాయన. ఆ రెండు పాటలనీ సాధన చేస్తే రెండు వైవిధ్యాలని స్వంతం చేసుకున్నట్టే. ఇదిలా ఉండగా ఓ చిన్న పరిశీలన - చాలామందికి 'పడోసన్' సినిమా గుర్తుండే ఉంటుంది. ఆ సినిమాలోని 'ఏక్ చతుర్ నార్' పాటలో 'థానారే జారె జారె...' అనే లైను కూడా గుర్తుండే ఉంటుంది. ఆ లైన్‌కి ఒరిజినల్ 1948 లో దేవ్ ఆనంద్, కామినీ కౌశల్ హీరో హీరోయిన్లుగా నటించిన 'జిద్దీ' చిత్రంలోని 'చందారే జారే జారే' అనే పాట! ఖేమ్ చంద్ ప్రకాశ్ స్వరపరచిన ఆ పాటను లత పాడింది. ఆ పాట కొన్ని షాపుల్లో ఇంకా దొరుకుతోంది. వీలైతే సంపాదించి వినండి. ఈ 'చందారే జారే జారే' పాట ఇన్స్పిరేషన్ 'తెలుసుకొనవే యువతీ' పాటని స్వరపరుస్తున్నప్పుడు రాజేశ్వరరావుగారి మనసులో రేఖా మాత్రంగానైనా ఉండి ఉండాలని ఈ సమీక్షకుని వ్యక్తిగత అభిప్రాయం. కావాలంటే చరణాంతాలలోని ట్యూన్‌ని 'చందారే జారే జారే'తో కలుపుకుని చూడండి. ఎంత చక్కగా అతికిపోతుందో తెలుస్తుంది.

---

తెలుసుకొనవె యువతీ
అలా నడుచుకొనవె యువతీ ||తెలుసు||
యువకుల శాసించుటకే
యువతు లవతరించిరని ||తెలుసు||
సాధింపులు బెదిరింపులు
ముదితలకిక కూడవని

హృదయమిచ్చి పుచ్చుకునే
చదువేదో నేర్వాలని
మూతిబిగింపులు అలకలు
పాతబడిన విద్యలనీ
మగువలెపుడు మగవారిని
చిరునవ్వుల గెలవాలని ||తెలుసు||

ప్రారంభం నుంచీ చివరి వరకు ప్రతీఅక్షరాన్ని 'మోహన' రాగం అనే తేనెలో ముంచి పంచిన పాట ఇది. ఈ పాటలోని సాహిత్యం అనుభవంలోకి రాని జంట అప్పటికీ, ఇప్పటికీ ఉండదనే చెప్పాలి. కొన్ని కొన్ని పాటల గురించి చెప్పడానికి ఎక్కువ శ్రమపడాలి. మరి కొన్నిటి గురించి తక్కువగా చెప్పడానికి ఎక్కువ శ్రమపడాలి. రెండో కోవలోకి చెందినదే ఈ పాట. నిజానికి - మగవారితో ఎంత జాగ్రత్తగా మెలగాలో తెలియచెప్పే 'తెలుసుకొనవె చెల్లీ' పాటకు నాణానికి అటువైపు లాగా మలచబడ్డ ఈ చిన్ని పాటలో మనస్తత్వ శాస్త్రానికి సంబంధించి ఓ గ్రంథానికి సరిపడే విషయం ఉంది.

---

కరుణించు మేరిమాతా మా భువికి కలిగె రక్ష ||కరుణించు||
శరణింక మేరిమాతా గురిలేనిదారి జేరి
పరిశుద్ధ ఆత్మ మహిమ పరిహాసమాయ బ్రతుకు
వరపుత్రు గంటివమ్మా క్షణమైన శాంతిలేదే
ప్రభు ఏసునాథు కృపచే దినదినము శోధనాయే... ||కరుణించు||

భక్తి, విరహం, విషాదం ఈ మూడు 'జయజయావంతి' రాగంలో అద్భుతంగా పలుకుతాయి. ఈ మర్మమెరిగిన రాగజ్ఞుడు రాజేశ్వరరావు 'జయజయావంతి' రాగాన్ని బేస్‌గా చేసుకుని స్వరపరచిన గీతమే - 'కరుణించు మేరిమాతా'. పీలూ రాగానికి దగ్గరగా ఉందేమోనని కొందరు అభిప్రాయపడడానికి ఆస్కారం ఉంది కానీ వాడుకున్న విధానంలో తేడా వల్ల జయజయావంతి రాగమే దీనికి బేస్ అని చెప్పాలి. క్రైస్తవ మతస్థులు కూడా వారి వారి ప్రార్థనా గీతాలలో ఈ పాటకు సముచిత స్థానాన్ని కల్పించుకోవడం - ఈ పాట కవిగా క్రైస్తవేతరుడైన పింగళి నాగేంద్రరావు సాధించిన విజయానికి మరో నిదర్శనం. పి.లీల పాడిన ఈ పాటను సావిత్రి అభినయించగా ఎన్.టి.ఆర్, రేలంగి, యస్.వి రంగారావు, ఋష్యేంద్రమణి సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు.

---

బృందావనమది అందరిదీ - గో
విందుడూ అందరి వాడేలే ||బృందా||
ఎందుకె రాధా ఈసునసూయలు
అందము లందరి ఆనందములే
పిల్లన గ్రోవిని పిలుపును వింటే
ఉల్లము ఝల్లున పొంగదటే
రాగములో అనురాగము చిందిన
జగమే ఊయల నూగదటే ||బృందా||
రాసక్రీడల రమణుని గాంచిన
అసలు మోసులు వేయవటే
ఎందుకె రాధా ఈసునసూయలు
అందము లందరి ఆనందములె ||బృందా||

'బృందావనమది అందరిది' పాటను ఏ.యమ్. రాజా, సుశీల పాడగా ఎన్.టి.ఆర్, జమున అభినయించారు. సావిత్రి, అక్కినేని, యస్.వి.రంగారావు, ఋష్యేంద్రమణి సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ఇది తెలుగువారందరూ గర్వంగా చెప్పుకోగల గీతం. ఎందుకంటే 'మిస్సమ్మ' చిత్రాన్ని హిందీలో 'మిస్ మేరీ'గా తీసినప్పుడు ఆ హిందీ చిత్రానికి సంగీత దర్శకుడైన హేమంత్ కుమార్ మిగిలిన పాటలన్నింటికీ వేరే ట్యూన్స్ ఇచ్చారు. కానీ ఈ పాట ట్యూన్‌ను మాత్రం యధాతథంగా తీసుకుని 'బృందావన్ కా కృష్ణ కన్హయా' అనే పాటగా మలుచుకోలేక తప్పలేదాయనకి. సామరాగంలో స్వరపరచబడిన ఈ పాట సాహిత్యాన్ని ఓపక్కన పెట్టేస్తే వరసంతా ఏమాత్రం

వైవిధ్యం లేకుండా ఒకేలా ఉంటుంది. అయినా సరే అదొక హాంటింగ్ ట్యూన్‌లా మారిందంటే ఆ స్వరబలం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచు. అంతేకాదు మొతం 'సదప, పదస' అనే స్వరాల మధ్యనే తిరగడం ఓ విశేషం.

రావోయి చందమామ
మా వింత గాథ వినుమా
సామంతముగల సతికి
ధీమంతుడనగు పతినోయ్
సతి పతి పోరే బలమై
సతమతమాయెను బ్రతుకే ||రావోయి||
ప్రతినలు పలికిన పతితో
బ్రతుకగ వచ్చిన సతినోయ్
మాటలు బూటక మాయే
నటనలు నేర్చెను చాలా ||రావోయి||
తన మతమేదో తనదీ
మనమతమసలే పడదోయ్
మనమూ మనమను మాటే
అనరీయదు తాననదోయ్ ||రావోయి||
నాతో తగువులుపడుటే
అతనికి ముచ్చటలేమో
ఈ విధి కాపురమెటులో
నీవొక కంటను గనుమా ||రావోయి||

తెలుగులోవచ్చిన యుగళగీతాలు, ప్రేమకు సంబంధించిన అతి మంచి గీతాలు, భీంప్లాస్ రాగంలో వచ్చిన గొప్ప పాటలు, విజయావారి మధుర గీతాలు, ఏ.యం.రాజా హిట్స్, లీల హిట్స్, రాజేశ్వరరావు హిట్స్, ఎన్టీ ఆర్ హిట్స్, సావిత్రి హిట్స్ ఇలా ఎన్నిరకాలుగా విడదీసినా అన్ని విభాగాల్లోనూ చోటుచేసుకోదగ్గ పాట - 'రావోయి చందమామ' - ఈ పాటకు లభించిన ప్రజాదరణను కొలిచేందుకు, వర్ణించేందుకు తగ్గ కొలమానాలు, ఉపమానాలు లేవు.

ఏమిటో ఈ మాయా - ఓ
చల్లని రాజా - వెన్నెల రాజా - ఏమిటో నీ మాయా
వినుటయేకాని వెన్నెల మహిమలు
అనుభవించి నే నెరుగనయా
నీలో వెలసిన కళలూ కాంతులు
లీలగ ఇపుడే కనిపించెనయా ||ఏమిటో||
కనుల కలికమిడి నీ కిరణములే
మనసును వెన్నగ చేసెనయా
చెలిమి కోరుచూ - ఏవో పిలుపులు
నాలో నాకే వినుపించెనయా ||ఏమిటో||

ఈ పాటను పి.లీల పాడగా సావిత్రి అభినయించారు. సింధుభైరవి రాగానికి అతి చక్కని ఉదాహరణగా చెప్పుకోదగ్గ మంచి గీతమిది. ఈ పాట సాహిత్యాన్ని చరణాలలో బాగా గమనించండి. ప్రేమలో పడిన ప్రతివారికి తమ తొలిరోజుల్లో ఇలాగే ఉండి తీరుతుందని అనిపించి తీరుతుంది. వెన్నెల మహిమలు, కనులకలికమిడి వంటి పదప్రయోగాలు అందుకు వత్తాసుగా నిలబడతాయి.

తన స్వరజీవితంలో ఇచ్చినంతకాలం మంచి సంగీతమే ఇచ్చిన ఎస్. రాజేశ్వరరావు గురించి, అందరికీ తెలిసిన పదాలతోనే ఎంతో అర్థాన్ని వినసొంపుగా అందజేయగల పింగళి నాగేంద్రరావు గురించి ఓ పరిశోధనాత్మక గ్రంధం రాయదలుచుకుంటే అందులో పూర్తిగా ఓ అధ్యాయానికి సరిపడేంత పరిజ్ఞానాన్ని అందజేయగల సత్తాగలవి ఈ 'మిస్సమ్మ' చిత్రంలోని పాటలు.

ఇవిగాక 'మిస్సమ్మ'ను గురించిన కొన్ని విశేషాలున్నాయి. 'రాసమణి గర్ల్స్ హైస్కూల్' అనే బెంగాలీ నవలను చక్రపాణి 'ఉదరనిమిత్తం' అనే మకుటంతో అనువదించారు. దాన్నే 'మిస్సమ్మ' మెయిన్‌ప్లాట్ కు ధారంగా వాడుకున్నారు. మొత్తం సినిమాకు ఈ కథ సరిపోదనిపించి 'డిటెక్టివ్' అనే మరో బెంగాలీ నవల అనువాదాన్ని కూడా జోడించారు.

'మిస్సమ్మ' చిత్రంలో సావిత్రి పాత్రకు మొదట భానుమతిని అనుకున్నారు. నాలుగు రీళ్ళు చిత్రీకరించారు. చిన్న అభిప్రాయభేదం వల్ల ఆమెకు ఆ చిత్రంలో స్థానం లేకుండా పోయింది.



# ఆ పాత పాట మధురం
## రాజా



### తెనాలి రామకృష్ణ

1956 లో విడుదలయిన ఈ చిత్రం రాష్ట్రపతి రజత పతకాన్ని కూడా పొందింది. అతిరథ మహారథులు నటించిన ఈ చిత్రానికి సంగీతం విశ్వనాథం - రామ్మూర్తి. రచన సముద్రాల రాఘవాచార్య. ఈ చితంలోని పాటలన్నీ ప్రామాణికతను కలిగివున్నవే అయినా కొన్నిపాటలని మాత్రమే ఇక్కడ విశ్లేషించటం జరుగుతోంది అవి:

చందన చర్చిత నీలకళేబర పీతవసన వనమాలీ
కేళి చలన్మణికుండలమండిత గండయుగ స్మితశాలీ
హరిరిహ ముగ్ధ వధూనికరే! విలాసిని విలసతి కేళిపరే...
కాపి విలాస విలోల విలోచన ఖేలనజనితమనోజం
కాపి విలాస విలోల విలోచన ఖేలనజనితమనోజం
ధ్యాయతి ముగ్ధవధూ రధికం మధుసూదన వదన సరోజం
ధ్యాయతి ముగ్ధవధూ రధికం మధుసూదన వదన సరోజం

హరిరిహ ముగ్ధ వధూనికరే! విలాసిని విలసతి కేళిపరే....
శిష్యతి కామపి చుంబతి కామపి రమయతి కామపి రామాం
పశ్యతి సుస్మిత చారుతారాం అపరామనుగచ్ఛతి వామాం
హరిరిహ ముగ్ధ వధూనికరే! విలాసిని విలసతి కేళిపరే...
చందన చర్చిత నీలకళేబర పీతవసన వనమాలీ

పి.సుశీల ఆలపించిన ఈ జయదేవ కృతిని నటి సంధ్య వీణ వాయిస్తూ అభినయించింది. దృశ్య ప్రాధాన్యంగా ఎదురుగా రాధాకృష్ణుల నృత్యాన్ని కూడా తెరపై చూపిస్తారు. 'పురచ్చితలైవి'గా పేరుగాంచిన తమిళ రాజకీయ నాయకురాలు, నటి జయలలిత - ఈ పాటకు అభినయించిన సంధ్య కుమార్తెయేనని ఈ తరం వారికి తెలుసుకోవలసిన అవసరం ఉంది. మోహనరాగానికి ఒక ప్రామాణిక గీతంగా నిలిచిపోదగ్గ ఈ గీతం సుశీల హిట్స్ ఒకటిగా ఇప్పటికీ చెప్పుకోవచ్చు.

---

ఝుణ్ ఝుణ్ కంకణములూగ
ఘల్ ఘల్ కింకిణులు మ్రోగ
కోరిక లీడేర కూడేనురా... ||ఝుణ్ ఝుణ్ ||
రూపున కెరయ్యైనదానా జాణా నెరజాణా
నెనరుకు తగుదానా!

నే రూపున కెరయ్యైనదానా జాణా నెరజాణా
కూరిమి మీరా నీతో కులికే
వరమూ లభించెను బ్రతుకే ఫలించెన
వలపులవల రాజా నన్నేలరా...||ఝుణ్ ఝుణ్||
కనుసన్నల మెలగేనురారా..
సుకుమార... సుకుమార

పరువము మనదేరా
రాధా మనోహర
వెన్నెల వేళ విరులాలీలా
వెన్నెల వేళ విరులాలీలా
విరిసి సుఖింతుము పరవశింతము
సొంపుగ సంపంగి జంపాలలోన ||ఝుణ్ ఝుణ్||

ఈ పాటను రావు బాల సర్వస్వతి దేవి పాడగా సురభి బాలసరస్వతి అభినయించటం జరిగింది. అక్కినేని, ఎన్.టి.ఆర్, ముక్కామల కూడా సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. రావు బాలసరస్వతి దేవి పాడిన మంచి పాటలలో ఈ పాటకు అభిమానులు విపరీతంగా ఉన్నారు. శుద్ధ సారంగరాగం ఆధారంగా స్వరపరచబడిన ఈ పాట సాధన చెయ్యదగ్గది కూడా!

దురదృష్టం ఏమీటంటే - ఈ పాటను తరువాతి రోజులలో 'తెనాలి రామకృష్ణ' సినిమా ప్రింట్ నుండి తొలిగించారు. సీడీలలో గాని, వీ హెచ్ ఎస్ టేపులలో గాని ఈ పాట దొరికే అవకాశమే లేదు. ఆ రోజులలో రికార్డుల రూపంలో దాచుకున్న వారి దగ్గర, హెచ్.ఎం.వి.వారి 'తెనాలి రామకృష్ణ' క్యాసెట్‌లోనూ, 'అలనాటి అందాలు' పేరిట వి ఎకే రంగారావుగారు తీసుకు వచ్చిన ఆర్. బాలసరస్వతి దేవి క్యాసెట్‌లోను ఆడియో రూపంలో ఈ పాట లభిస్తుంది.

---

ఆకతాయి పిల్లమూక
అందాల చిలకా
నాకేసి చూస్తారు నవ్వుతారే
అయ్యయ్యో నాకేసి చూస్తారు
నవ్వుతారే ||ఆకతాయి||
చలా మడత కట్టుకునీ
తలపాగా చుట్టుకుని
వీపున మూటేసుకుని
వీధియెంట పోతుంటే ||ఆకతాయి||

కనుముక్కు తీరులోన
పనివాడి తనములోన
కనరారు నాసాటి
అందాల చిలకా
గూనొకటి దాపురించి
పరువు తీసెనే
నలుగురిలో నా బతుకు
నవ్వుల పాల్‌చేసెనే ||ఆకతాయి||

సినిమాలోని కథ ప్రకారం - ఏనుగుతో తొక్కించడానికి వీలుగా తెనాలి రామకృష్ణుని రాజభటులు గోతిలో కంఠం వరకు పాతిపెట్టి ఏనుగును తీసుకురావటానికి వెళతారు. ఆ సమయంలో తెనాలి రామకృష్ణునికి రాయలవారిపై జరుగుతున కుట్ర తెలుస్తుంది. ఎలా తప్పించుకుని వెళదామా అని ఆలోచిస్తుండగా గూని కలిగిన ఓ రజకుడు పాడుకుంటూ అటు వస్తాడు. అతడిని బుట్టలో పడేసి తన స్థానంలో అతడిని కప్పిపెట్టి బైటపడతాడు తెనాలి రామకృష్ణుడు. ఈ సన్నివేశంలో రజకుడిగా నటించిన హాస్యనటుడు రామకోటి ఈ పాటను పాడారు. ఎంచుకున్న వస్తువుకు అనుగుణంగా గల అంశాలను అందమైన మాటలతో అర్థమయ్యేలా చెప్పగలగటమే సినీ కవికి ఉండవలసిన ముఖ్య లక్షణం. తన కలానికి ఏ వైపైనా పదునే అని తెలిసే విధంగా రాసిన సీనియర్ సముద్రాల చాతుర్యం పాటను ఒకటి రెండు సార్లు గమనిస్తే అర్థమవుతుంది

---

తీరని నా కోరికలే తీరెను ఈ రోజు
కూరిమి నా చెలిమి కోరెను రారాజు ||తీరని||
తరుణలలోన నా సరిచానా సరసుల నీకు సరీ లేరు నెరజాణా ||2||
ఆటల పాటలలో వినోదాల వేడుకలో
వాటముగా నిను లాలింతురా దొరా

వన్నెల మేడ వెన్నెల నీడ
వాడని మల్లియల వాడలలో హాయిగా ||2||
వింతల చేయుదురా విలాసాల తేలుతురా ||2||
చూతువురా స్వర్గ వైభోగమీ ఇలా... ||2|| ||తీరని||

ఈ పాటను భానుమతి పాడగా భానుమతి, ఎన్.టి.రామారావు అభినయించారు. సినిమాలో గల మిగిలిన పాటలతో పోలిస్తే కొంత రిలీఫ్‌గా అనిపించే పాట ఇది. గత సంచికలలోని 'సంతానం' సినిమాకు సంబంధించి విశ్లేషణలో 'సంతోషమేలా సందేహమేలా' పాట గురించి చెబుతూ 'సుభాహ్ కాతారా' అనే సినిమాలోని తలత్ మహమ్మద్ పాడిన 'గయా అంధేరా హువా ఉజలా' పాటను ప్రస్తావించుకోవటం జరిగింది. ఆ హిందీ పాట చరణాల వరస గుర్తుంటే - ఈ 'తీరని నా కోరికలే తీరెను ఈనాడు' పాటలోని 'తరుణుల లోన నా సరిచాన / వన్నెల మేడ వెన్నెల నీడ' అనే చరణాల ఎత్తుగడతో పోల్చి చూసుకోండి. ఒకేలా ఉంటాయి. ఇది కేవలం ఒక అందమైన అన్వయింపులా భావించాలే కాని దీనివల్ల విశ్వనాథన్ - రామమ్మూర్తి శక్తి సామర్ధ్యాలని తక్కువగా అంచనా వెయ్యడానికి వీల్లేదు. చరణాంతాలలో - అంటే - వాటముగా నిన్ను లాలింతు రా దొరా / వైభోగమీ ఇల - దగ్గర ఆలపించుకుంటూ - 'దేవదాసు' సినిమాలోని 'అందం చూడవయ్యా ఆనందించవయ్యా' పాటలోకి వెళ్ళి చూడండి. రెండిట్లోను విశ్వనాథన్ (యం.యస్.విశ్వనాథం) కాంట్రిబ్యూషన్ ఎంతో తెలుస్తుంది.

---

హరేరాం హరేరాం (3)
గండుపిల్లి మేను మరచి
బండ నిదుర పోయెరా
కొండ ఎలుకలిచట
రెండు కొలువు చేయుచుండెరా... గండు..
హరేరామ రామకృష్ణ హరేకృష్ణ హరే హరే
హరేరామ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే
హరేరాం హరేరాం హరే రాం (3)
ఎక్కరాని మానికొమ్మ
నొక్కపండు పండెరా
మొక్కకోరి చిలుకలైదు
నిక్కి నిక్కి చూసెరా
రంకెవేసి చేపపిల్ల
రాజ్యమంత మేసెరా
హుంకరించి మిడతపిల్ల
దానికి ఎరవేసెరా
హరేరామ రామకృష్ణ హరేకృష్ణ హరేహరే
హరేరామ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే
హరేరాం హరేరాం హరేరాం (3)

హరికాంభోజి రాగచ్ఛాయలలో స్వరపరచబడిన 'గండుపిల్లి మేను మరచి' పాటను ఘంటసాల, నాగయ్య పాడేరు. తెరపై అక్కినేని నాగేశ్వరరావు, నాగయ్య అభినయించారు.

విజయనగర సామ్రాజ్య పతనానికి బహమనీ సుల్తానులు పథకం వేసి, వారి వ్యూహ రచనను అమలు చేస్తున్న తరుణంలో ఆ పన్నాగాన్ని పసిగట్టిన తెనాలి రామకృష్ణుడు, మహామంత్రి తిమ్మరుసు మారువేషాలు ధరించి పాడే సన్నివేశానికి అనుగుణంగా రాసిన పాట ఇది. మంద్రస్థాయిలో గంభీరంగా ఉండే నాగయ్య కంఠం, తారస్థాయిలో కూడా అద్భుతంగా ఉండే ఘంటసాల గాత్రం యుగళంగా చేరి రసానుభూతిని ద్విగుణీకృతం చేయగా విన్నవారి మనో వీధులలో చిరుస్థాయిగా నిలిచిపోయే రీతిలో రూపొందింది ఈ పాట. తత్వగీతాల ధోరణిలో జానపద బాణీలను కలబోసి అందించారు విశ్వనాథం - రామమ్మూర్తి. ఇక నర్మగర్భంగా మర్మాలను కప్పిపుచ్చుతూ విప్పి చెప్పడంలో సీనియర్ సముద్రాల తను సీనియర్ నేనని మరోసారి ఋజువు చేసుకున్నారీ గీతంలో.

---

చేసేది ఏమిటో చేసెయ్యి సూటిగా
వేసెయ్యిపాగా ఈ కోటలో ||చేసేది||
ఎన్ని కష్టాలు రానీ నష్టాలు గానీ
నీ మాట దక్కించుకో బాబయా.. బాబయ్య ||చేసేది||

నాటేది ఒక్క మొక్క వేసేది నూరుకొమ్మ
కొమ్మ కొమ్మ విరగబూసె వేలాదిగా... ఆ... ||నాటేది||
ఇక కాయాలి బంగారు కాయలు
భోంచేయాలి మీ పిల్లకాయలు ఇక కాయాలి ||చేసేది||

రహదారి వెంట మొక్కనాటి పెంచరా
కలవాడు లేనివాడు నిన్ను తలచురా
భువిని తరతరాల నీదు పేరు నిలచురా
పనిచేయువాడె ఫలము నారగించురా... భువిని||చేసేది||

ఈ పాట సూటిగా హృదయాల్ని తాకి అందరి ఆదరాభిమానాలను చూరగొంటుంది. సింధుభైరవి రాగానికి చక్కని ఉదాహరణగా మిగిలిపోయిన ఈ పాటలో ఉడోఫోన్ వాద్యం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటూ వినిపిస్తుంది. 1950 లో విడుదలయిన హిందీ చిత్రం 'సమాధి'లో సంగీత దర్శకుడు సి.రామచంద్ర సిందుభైరవిరాగంలో స్వరకల్పన చేసిన 'ఓ పాస్ ఆ రహే హై హమ్ దూర్ జారహే హై' పాటలో వుడోఫోన్ వాద్యాన్ని ఉపయోగించిన తీరు ఈ పాటకు ప్రేరణగా నిలిచి ఉండవచ్చునని కొందరు పరిశీలకుల అభిప్రాయం. ఈ పాటను ఘంటసాల పాడగా తెరపై అక్కినేని అభినయించారు.

ఈ తెనాలి రామకృష్ణ చిత్రంలో జయదేవుని అష్టపది 'చందన చర్చిత నీలకళేబర'తో పాటు అన్నమాచార్య విరచితమైన 'ఇచ్చకాలు నాకు నీకు ఇంక ఏలరా' అనే కృతి కూడా ఉంది. అయినా టైటిల్స్‌లో వారి పేర్లు ఉండవు. ఎందుకంటే ఆ మహానుభావులు రాసినవి ఈ చితంలో ఉపయోగించుకోవడం జరిగిందే గాని ఈ చిత్రం కోసం వారు వ్రాయలేదు కనుక. అలాగే అలాగే నేపథ్యగానం చేసిన వారిలో భానుమతి, నాగయ్య, రామకోటి పేర్లు కూడా వుండవు. ఎందుకంటే వారు తమకు తాము పాడుకునే వారే గానీ నేపథ్యగానం చేసినవారు కాదు కనుక. ఇప్పుడు తెనాలి రామకృష్ణ చిత్రాన్ని చూస్తే ఆ సంప్రదాయం ఆశ్చర్యంగానే ఉంటుంది మరి.

ఇవిగాక జగముల దయనేలే జనని, ఓలాలా, ఈ వాలు కన్నులు ఈ వన్నె చిన్నలు ఖుషీ మీర కనరా, నీవె రారాజీవెగా వంటి పాటలతో పాటు అద్భుతమైన పద్యాలు కూడా ఉన్నాయి. ఈ చిత్రంలోని పాటలన్నీ ఒక ఎత్తు, పద్యాలన్నీ ఒక ఎత్తు.. ఆ పద్యాలను పాడి మెప్పించిన తీరు మరొక ఎత్తు. 'మంచి మనసులు' సినిమాలో 'ఆహో ఆంధ్ర భోజా శ్రీకృష్ణదేవరాయా' అనే 'శిలలపై శిల్పాలు చెక్కినారు' పాటలో 'తెనాలి రామకృష్ణ' పద్యాలలోని షాట్లు ఉపయోగించడం - 'ఆదిత్య 369' సినిమాలో 'మేక తోకకు మేక' అనే పద్యాన్ని చెప్పవలసినప్పుడు ఈ 'తెనాలి రామకృష్ణ' చిత్రంలో ఆ పద్యానికి కట్టిన ట్యూన్‌నే ఉపయోగించటం - ఇవన్నీ ఆ చిత్రంలోని పద్యాలు, వాటి చిత్రీకరణ ఎంత గాఢంగా నాటుకొనిపోయాయో తెలియ చెబుతాయి.

ఈ పద్యాలను పాడినందుకు స్వర్గీయ ఘంటసాల ఏమీ తీసుకోలేదట "చిన్న చిన్న పద్యాలండీ... వీటికి పారితోషికం తీసుకోవడం ఏమిటి?" అని అన్నారట. అయినా సరే నిర్మాత - దర్శకుడు అయిన బి.ఎన్.రంగా పద్యానికి వంద చొప్పున ఇంటికి వచ్చి ఇచ్చి వెళ్ళారని ఘంటసాల వారి సతీమణి సావిత్రమ్మగారు తెలిపారు.



# ఆ పాత పాట మధురం



## రాజా

### జయం మనదే

ఆదర్శ భావాలతో సినిమాలు తీసి ప్రజల ఆలోచనలను అభ్యుదయ పథం వైపు నడిపించాలనుకునే కమిట్‌మెంట్ ఉన్న దర్శకులు తమ అభిరుచికి మేధోసంపదను జతచేసి చిత్రాలను నిర్మించటం తెలుగు సినీచరిత్రలో మొదటినుంచీ ఉన్నదే 1956లో టి.ప్రకాశరావు దర్శకత్వంలో వచ్చిన జయం మనదే కూడా అటువంటిదే ఈ చిత్రంలోని పాటలను సముద్రాల, కొసరాజు, జంపన, ముద్దుకృష్ణ, సదాశివబ్రహ్మం రాశారు. ఘంటసాల సంగీత దర్శకత్వం వహించారు. అంతేకాదు తర్వాత తరంలో దర్శకులుగా వినుతికెక్కిన వి.మధుసూధనరావు. కె. ప్రత్యగాత్మ ఈ చిత్రానికి దర్శకత్వ శాఖలో పనిచేయగా, కె.విశ్వనాథ్ శబ్దగ్రహణ శాఖను నిర్వహించారు. ఇంతమంది మేధావులు ఓ కాపుకాచిన ఈ చిత్రంలోని పాటలన్నీ ఉన్నత ప్రమాణాలతో ఉన్నవే. వాటిలో ప్రజాదరణ పొందిన ఏడుపాటలివి:

వినవోయీ బాటసారి
కనవోయీ ముందు దారి ||వినవోయీ||
కష్టాలు ఎవరికైన - కలకాలం ఉండవోయ్
ఆనందం అనుభవించు - అవకాశం కలుగునోయ్
తగదోయీ పరితాపం
కదలి రావోయ్ ఎదురు లేదోయ్ ||వినవోయీ||
నిదురబోవు లోకాన్ని - చేయితట్టి లేపవోయ్
అంధకారమంతరించి - వెలుగుజాడ తోచునోయ్
కాలం నీ కనుకూలం
తలచుకోవోయ్
తెలుసుకోవోయ్
నీరసించు శక్తినంత - చేరదీయబూనవోయ్
జీవితమ్ము సార్థకమ్ము - చేయుదారి వెదకవోయ్
జనవాక్యం మనదేనోయ్
భయములేదోయ్
జయము నీదోయ్ ||వినవోయీ||

ఈ పాటను జిక్కి పాడగా షావుకారు జానకి అభినయించింది. సన్నివేశ ప్రాధాన్యంగా ఎన్.టి.ఆర్. కనిపిస్తారు. పాటను ఆసాంతం ఒకటి రెండుసార్లు గమనిస్తే - ఇవాళ కౌన్సిలింగ్స్ పేరిట వస్తున్న వ్యాసాలు, కోచింగ్‌లు, ప్రశ్నలు - సమాధానాలూ వీటన్నిటి సారాంశం - ఈ పాట సాహిత్యంలో కనిపిస్తుంది. ఈ పాట రచన కొసరాజు. ఇక సంగీతపరంగా చెప్పుకోవాలంటే ఆ రోజుల్లో జనం నోట బాగా నలిగిన పాట ఇది. ఈ పాట ట్యూన్‌ను బాగా వంట పట్టించుకుని - తరువాత రోజుల్లో విడుదలైన రిపబ్లిక్ ప్రొడక్షన్స్ వారి 'పెళ్ళిసందడి' (1959)సినిమాలోని 'అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా అది తెలిసి మసలుకో బస్తీ చిన్నోడా' అనే పాటతో పోల్చి

చూసుకుంటే పోలికలు ఛాయామాత్రంగా కనిపిస్తాయి. ఆ చిత్రానికి కూడా సంగీతం ఘంటసాలే కనుక అలా ఉండటం అసహజం కాదు.

---

దేశభక్తిగల అయ్యల్లారా
జాలిగుండెగల అమ్మల్లారా
ఆలోచించండీ - న్యాయం
ఆలోచించండి ||దేశభక్తి||
దున్ననివాడికి ఎక్కడ చూచిన
ఎన్నో ఈడవలు - అబ్బో - ఎన్నో బాడవలు
దున్నేవాడికి నారెడు నేలయు
దొరకనె బోదండీ - కష్టం - విరగడగాదండీ ఓయ్ ||దేశభక్తి||
రెక్కలు విరుచుక శ్రమపడువానికి
బొక్కెడు మెతుకులు కరువండీ
గుక్కెడు గంజీ కరువండీ
ఉక్కిరి బిక్కిరి తిండండి
డొక్కుకు మించిన బరువండీ ||దేశభక్తి||
పచ్చని వెన్నెల పైరుజొన్నబల్
పంట పండి తలవంచిందీ
బంగారంవలె మెరిసిందీ
కాకుల దరిమే కావలివాడు
ఊచబియ్యముకు నోచకయుండె
ఉసూరుమంటూ చూస్తూవుండె ||దేశభక్తి||

ఈ పాటను ఘంటసాల పాడగా ఎన్.టి.ఆర్ అభినయించారు. సన్నివేశపరంగా అంజలీదేవి కూడా కనిపిస్తుంది. ఈ పాట పూర్తిగా కొసరాజు పాట - నిజానికి సన్నివేశపరంగా ఆలోచిస్తే - రథంలో ఉన్న అంజలీదేవిని ఎన్.టి.ఆర్ ఏడిపిస్తున్నట్టుగా ఓ పాట పెట్టొచ్చు. ఇలాంటి ప్రభోధాత్మక, ఆలోచనాత్మక, అభ్యుదయ గీతం పెట్టవలసిన అవసరం లేదు. కానీ ఆ రోజులు వేరు, ఆ కమిట్‌మెంట్‌లు వేరు. ఆ కోణంలో ఆలోచిస్తూ బేరీజు వేసుకోగలిగితే ఈ పాట పట్ల కలిగే భావం ఖచ్చితంగా ఉన్నతంగా ఉండి తీరుతుంది. వ్యవసాయం చెయ్యని కామందుకి ఎన్నో భూములు వచ్చి చేరుతుంటాయి. పల్లపునేలకి నీరు చేరినట్టు వచ్చి కలుస్తుంటాయి. దున్నేవాడికి మాత్రం చారెడు నేల కూడా ఉండదు. ఉండకుండా చేస్తారు కూడా. ఈ భావాన్నే పాటలో చొప్పించారు. ఆ భావానికి కొసరాజు వాడిన పదాలు - ఈడవు, బాడవలు. 'ఈడవలు' అన్నది 'ఈడు'లోంచి వచ్చినది. అంటే జతపడడం అనే అర్థంలో తీసుకోవాలి. బాడవ అంటే పల్లపునేల. ఈ అర్థాలలో తీసుకుని కొసరాజు వాడిన పదాలను గమనిస్తే కవిగా ఆయనపై గౌరవం రెట్టింపవుతుంది.

---

అ: ఓ చందమామ అందాల భామ
ఎందున్నదో పలుకుమా (2)
సొగసూ వయసూ తన లావణ్యమే చాలనీ (2)
పై సోయగాలు ఏలనీ లాలించుమా
సోయగాలు ఏలనీ లాలించుమా ||ఓ చందమామ||
మదిలో మెదిలే మధురానందమే తాననీ (2)
ఇక ఆలసించరాదనీ బోధింపుమా
ఆలసించరాదనీ బోధింపుమా ||ఓ చందమామ||

'ఓ చందమామ అందాల భామ' పాటను ఘంటసాల గానం చేశారు. చివర్న జిక్కి హమ్మింగ్ ఉంటుంది. ఉదయ రవిచంద్రిక రాగంలో అప్పుడప్పుడు 'రి' అన్న స్వరాన్నిచేరుస్తూ పాటకు కొత్త సొగసుని, సోయగాన్ని చేకూరుస్తూ అందిలో మెదిలే మధురానందాన్ని అందించగలిగేది తానేనని అనిపించేటంత మృదువుగా ఘంటసాల పాడిన తీరు - తరాలు మారినా అదే అనుభూతిని చెక్కు చెదరకుండా అందజేస్తుంది. కావాలంటే ఈ సినిమా ఆడియో సంపాదించి ఈ పాటను వినిగాని, పాడుకుని గాని చూడండి. పాట ఎంత నిత్యనూతనంగా ఉందో అనుభవపూర్వకంగా తెలుస్తుంది. ఈ పాటను తెరపై ఎన్.టి.ఆర్, అంజలీదేవి అభినయించారు.

---

కలువలరాజా కథ వినరావా
కదిలే మదిలో రగిలె నిరాశా ||కలువల||
చూచు చూచు పూలన్ని రాలె
కలికి కోకిలా జాలిగా పాడె ||చూచి చూచి||
ప్రియుని జేరి ఒకసారి పిలువవోయ్
కంటి ముత్యాలె కాన్క సేతునోయ్ ||కలువల||
వెదకి వెదకి వేసారినానోయ్
హృదయవేదనా ఎరిగింపలేనోయ్
చలువరాతి చెరసాల చాలునోయ్
సఖుడే రానిచో నేమనలేనోయ్ ||కలువల||

ఈ పాటను జంపన రాయగా పి.లీల ఆలపించగా అంజలీదేవి అభినయించింది. ఘంటసాల స్వరపరచిన గీతాల అక్కౌంటులో చూసుకున్నా - పి.లీల పాడిన పాటల అక్కౌంటులో చూసుకున్నా - చాలా మంచిపాట ఇది. ఎంతోమంది సంగీత ప్రియుల స్మృతిపథం నుండి తొలిగిపోవడం వల్లనో ఏమో తగిన ఆదరణ లభించని చక్కని పాట ఇది. ఇవాళ గనుక ఈ పాటను వినడం జరిగితే - 'అలిగినవేళనె చూడాలి' (గుండమ్మ కథ) పాటలా ఉంది కదూ అని ప్రతి సంగీత ప్రియుడు అనుకుని తీరతాడు. ముఖ్యంగా - 'ప్రియుని జేరి ఒకసారి పిలువవోయ్' / 'చలువరాతి చెరసాల చాలునోయ్' అనే వాక్యాల దగ్గర 'అలిగినవేళనె' పాటలోని 'దృష్టి తగులునని జడిసి యశోదా' అనే వాక్యానికి జతపడిన ట్యూన్ జ్ఞాపకం వచ్చి తీరుతుంది. మంచిపాటకు చెవియొగ్గి వినే ప్రతివారి దగ్గరా ఉండతగ్గ పాట ఇది. ఈ పాటకు దేశ్ రాగం ఆధారం.

---

అ:చూడ చక్కని సుక్క - సురుకుసూపులెందుకే కరుకు చూపులెందుకే
ఈడు జోడు నీకు నాకు - ఇలాగిలారాయె ఇలాగిలారాయె
నువ్విలగిలగిలరాయే ||సూడచక్కని||
ఆ: ఓ అందాల చందమామ - ఆడదానినోయీ ఆడదాననోయీ
ఎందుకో నిన్ను చూస్తె -
ఎంతో సిగ్గౌతుందోయ్
నాకెంతో సిగ్గౌతుందోయ్

అ:ముందు వెనకలెందుకే - మూతిముడుపులెందుకే
మూతిముడుపులెందుకే
సందెపొద్దుపోయె మనకే - తందనాలతోనే
తందనాలతోనే...హోయ్.. ||సూడసక్కని||
ఆ: అందరిలోన నువ్వే - అందగాడవోయీ
బలె వన్నెకాడవోయీ
అందచందాలు నీకే ||అందరిలోన||
అందచందాలు నీకే - తొందరెందుకోయీ
ఈ తొందరెందుకోయీ ||సూడసక్కని||

ఈ పాటను సదాశివ బ్రహ్మం రాయగా ఘంటసాల, లీల పాడగా ఎన్.టి.ఆర్, అంజలీదేవి అభినయించారు. ప్రతినాయకపాత్రధారి ఆర్. నాగేశ్వరరావు కూడా సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ప్రతినాయక పాత్రధారిని ఆటపట్టిస్తూ హీరో హీరోయిన్లు రకరకాల విన్యాసాలు చేస్తూ సరదాగా సాగే పాట ఇది. మారువేషాలు వేసేటప్పుడు ఎన్.టి.ఆర్ తనదైన బాణీలో అభినయించే తీరుని ఈ పాటలో ఇవాళ గనక చూస్తే ఆ తరం ప్రేక్షకుల పెదవుల మీద ఓ చిరుదరహాసం తొంగిచూడడం ఖాయం. ఘంటసాల గళంలో ఓ చక్కటి నటుడూ ఉన్నాడు. అతడు పాత్రవైఖరిని పాత్రధారి స్వభావాన్ని ఈ రెండిటి పోకడను సమన్వయ పరచుకుంటూ పాడే తత్వం అంతర్లీనంగా ఉన్న గాయకుడు కనుక ఆయన పాడిన పాటలో ఎక్స్‌ప్రెషన్లు కొన్ని - పాత్రధారులకి సహాయపడిపోతూ ఉంటాయి. ఈ పాటలో - 'ఇలా ఇలారాయే' అని అంటూ 'ఇలగిలగిలరాయే' అని ఆయన పలకటం కామెడి పరంగా బాగా వర్కవుట్ అయింది. దురదృష్టం ఏమిటంటే హె.ఎం.వి వారు తీసుకొచ్చిన 'చిరంజీవులు - జయం మనదే' కాంబినేషన్ క్యాసెట్‌లో ఈ పాటను తొలిగించటం జరిగింది. ఏదైనా ఛానల్‌లో ఈ సినిమా ప్రసారం అయినప్పుడు చూడాల్సిందే

---

చిలకన్న చిలకవే బంగారు గిలకవే
పంచవన్నెల రామ చిలక హోయ్
పంచవన్నెల రామచిలక ||చిలక|| (2)
ఆ: ఏడుకొండల మీద ఎగిరి వచ్చిన పిట్ట
ఎందున్నదో చెప్పవే ఎందున్నదో చెప్పవే
మేడల్లో ఉన్నదో మిద్దెల్లో ఉన్నదో
జాడైనా చెప్పవే చిలకా దాని
నీడైనా చెప్పవే చిలకా
ఆ: పంజరమ్మున ఇనుప సంకెళ్ళు తగిలించి
బంధించి ఉంచారె చిలుకా
మూడారు వాకిళ్ళు దాటి రావాలంటె
కోడెతాచున్నదె చిలుకా
కోడె తాచున్నదె చిలుకా

అ: పట్టుబడ్డా చోట ప్రాణానికేమైన
మోసంబులేదటే చిలకా
మోసమ్ము లేదటే చిలకా
పచ్చన్ని చేలపై స్వేచ్ఛగా ఎగిరేటి
భాగ్యమెప్పుడె రామచిలకా అంత భాగ్య మెప్పుడె రామ చిలకా
ఆ: బంధాలు విడిపించి బైటికంపాలంటే
సమయమ్ము చిక్కాలె చిలుకా
ఓర్పు చూపక నీవు ఒడుపు జారావంటె
ఓగు తప్పదు రామ చిలుకా
అ: బళువు భారమ్మంత నీ మీదనే బెట్టి
భయము లేకుంటామె చిలకా
రామచిలకా
నీళ్ళల్లో ముంచినా పాలల్లో ముంచినా
నీవె దిక్కో రామచిలకా మాకు
నీవె దిక్కో రామ చిలుకా ||చిలకన్న||

'చిలకన్న చిలకవే' గురించి చెప్పాలంటే చాలా ఉంది. కథాపరంగా - విలన్ కుయుక్తి వలన సామంతరాజు దగ్గర బందీగా పడున్న హీరో జాడ తెలుసుకోవటానికి అతని స్నేహితుడు (రేలంగి) కోయవాని వేషంలో ఓ చిలకని పట్టుకుని పాడుకుంటూ అన్వేషిస్తుంటాడు. హీరోని ప్రేమించిన సామంతరాజు కూతురు (అంజలీదేవి) ఆ పాటలోని ప్రశ్నలకు నర్మగర్భంగా సమాధానమిచ్చే సన్నివేశానికి అనుగుణంగా ఊపిరిపోసుకున్న పాట ఇది. ఇందులో సంగీత సాహిత్యాలు ఎంతటి ఔన్నత్యాన్ని సంతరించుకున్నాయో మాటల్లో చెప్పలేం. రచనలో, స్వరరచనలో, గాయనీ గాయకులు పాడే పద్ధతిలో ఆయా రంగాలకు చెందిన కళాకారులు పాత్రలపరంగా ఎంత నిజాయితీగా ఆ రోజుల్లో పరకాయ ప్రవేశం చేసేవారో చెప్పడానికి ఈ పాటే ఓ చక్కని ఉదాహరణ.

రాచరికంలో పుట్టి పెరిగిన సామంతరాజు కూతురు 'చిలుకా' అని అంటే అంతటి విద్యాగంధాలు అంటని కథానాయకుని స్నేహితుడు 'చిలకా' అని అనటం అందుకు ఓ మచ్చుతునక.

ఇక మూడారు వాకిళ్ళు, ఒడుపు జ్వరావంటే ఓగు తప్పదు, బళువు భారమ్ము వంటి పదప్రయోగాలు వింటుంటే ఆ రోజుల్లో కాబట్టి అలా చెల్లింది కానీ, ఈ రోజుల్లో అయితే అలాంటి వాటికి కాలం చెల్లిందని నిట్టూర్చటంతప్ప ఏమీ చేయలేం. తర్వాతి రోజుల్లో వచ్చిన 'రహస్యం' చిత్రంలోని ఆనంద కృష్ణ తత్వగీతాల్లో - నవరంధ్రాలను జయించి జ్ఞానేత్రాన్ని తెరవగలిగితే మోక్షం లభిస్తుందని చెప్పడానికి మూడారు వాకిళ్ళు మూసివెయ్యాలి ముక్తివాకిట నిలిచి తలుపు తీయాలి - అనే చరణాల ద్వారా ఈ 'మూడారు వాకిళ్ళు' అనే పదప్రయోగం సినీ సాహిత్యంలో మరోసారి దర్శనమిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేసుకోకతప్పదు.

ఇక సంగీత పరంగా చెప్పాలంటే ఈ పాటకి ఉపయోగించిన యదుకుల కాంభోజి, దేశ్ రాగాలు సంగీత దర్శకుడు కథాపరంగా ఎంత లీనమయ్యారో తెలుపుతాయి. ముఖ్యంగా ఎరుకల (కోయ) వాని వేషంలో వచ్చిన కథానాయకుని స్నేహితుడు పాడే చరణాలకు 'ఎరుకల కాంభోజి'గా పూర్వులచే పిలువబడే యదుకుల కాంభోచిని ఎన్నుకోవడంలో ఎంతటి రసాత్మకత... ఎంతటి ఔచిత్యం.. నిజంగా సంగీత సాహిత్యాలు తరించిన రోజులవి. అంతరించిన రోజులివి..... అనిపిస్తుంది.

ఇక్కడున్న గాయనీ గాయకుల విషయానికొస్తే అటు మాధవపెద్ది సత్యం, ఇటు జిక్కి ఇద్దరూ ప్రాణం పెట్టి మరీ పాడారు. కలకండ తీపిని తన 'గళకండ'లో ఇముడ్చుకున్న కంఠం మాధవపెద్ది సత్యానిదైతే (ఆయనకి గొంతుముడి ఉన్నది) మార్దవాన్ని ప్రతిబింబించే పాటలెన్నిటినో చే'జిక్కి'ంచుకున్న స్వరం జిక్కిది.

అంతేకాదు 'పంజరం' అంటూ వ్యాకరణ శుద్ధితో పలికే అలవాటుతో జిక్కి, సుశీల ఆరోజుల్లో చక్కటి సంప్రదాయాన్ని పాటించేవారు అని అంటే 'చ'కారాన్ని 'శ'కారాన్ని వింతగా విచిత్రంగా పలుకుతూ పాడే ఈనాటి వర్ధమాన వర్తమాన ఔత్సాహిక గాయనీమణులకు కొరుకుడు పడని విషయంగా ఉంటుందేమో మరి...!?

---

వస్తుదోయ్ వస్తుందోయ్ (2)
కారే పేదల చెమట ఏరులై
కబళించే రోజొస్తుందోయ్ ||వస్తుందేయ్||
ఈ చెమటే రేపింత్తై అంత్తై
తేరి చూడరా అనంత తీవ్రమై ||ఈ చెమటే||
తుఫాను రూపై ధూమధాములతో (2)
ప్రపంచాన్ని కదలించే రోజు వస్తుందోయ్ వస్తుందోయ్
కూటికి గుడ్డకు కుమిలే వాళ్ళను
పూరి గుడిసెలను పొర్లే వాళ్ళను
గర్భదరిద్రులనుద్ధరించుటకు (2)
దేవుడు తానైదిగి వచ్చే రోజొస్తుందోయ్ ||వస్తుందోయ్||

ఆలోచించి లాభం లేదు
అవతల మొర్రోయన్నాలేదు ||ఆలోచించి||
కొంపలు భగభగమండేటప్పుడు
నూతులు తవ్వి ఫలితం లేదు ||వస్తుందోయ్||
అందరు దేవుని బిడ్డలేయంటూ
అనురాగం చూపించకపోతే
అందరు అన్నలు తమ్ములెయంటూ ||అందరు||
అసూయ పెరిగి విషము గ్రక్కురోజొస్తుందోయ్
వస్తుందోయ్ వస్తుంది
చకచక చకచక వస్తుందోయ్ వస్తుంది
గబ గబ గబగబ వస్తుందోయ్ వస్తుంది.

అభ్యుదయానికి అద్దం పట్టే 'వస్తుందోయ్ వస్తుంది' పాట - గొంతులో నినాదంలా రగిలే ఆవేశానికి, గుండెల్లోని నాదంలా ధ్వనించే చైతన్యానికి మధ్యగల వ్యత్యాసాన్ని క్షీరనీర న్యాయంలా వేరు చేసి చూపి - విచక్షణకు కావలసిన స్పందనను స్పష్టంగా అందించగల గీతం. మధ్యమావతి రాగంలో స్వరపరచబడిన ఈ పాటను ఘంటసాల, జిక్కి పాడగా, నృత్యబృందంతో రేలంగి

అభినయించారు. 'రోజులు మారాయి' చిత్రంలోని 'ఏరువాక సాగారో రన్నో చిన్నన్న' పాట నడక ఈ పాటలో కొద్దిగా కనిపించినా ఆ ప్రభావం ఈ పాట స్వభావంతో పూర్తిగా ఒదిగిపోయింది. ఈ పాటలోని 'తుఫాను రూపై ధూముధూముధాములతో', 'గర్భదరిద్రులనుద్ధరించుటకు', అనే వాక్యాలు వింటున్నప్పుడు 'గుండమ్మకథ' చిత్రంలోని 'లేచింది నిద్రలేచింది' పాటలోని 'ఇప్పుడే చెబుతా యినుకో బుల్లెమ్మా' అనే వాక్యం ట్యూన్ పరంగా గుర్తుకు వస్తుంది. అంతేకాదు ఈ పాటని ఇవాళ మళ్ళీ విని అవగాహన చేసుకోగలిగితే 'బీట్ అండ్ మెలొడీ విత్ లిరికల్ బ్యూటీ' అంటే ఏమిటో అర్థం అవుతుంది. ఈ పాట రచన కూడా కొసరాజే.



# ఆ పాత పాట మధురం

## రాజా



### ముద్దుబిడ్డ

**సంగీతం, సాహిత్యం,** కథ, నటన.. ఇలా ప్రతి విభాగంలోనూ అత్యద్భుతమైన ప్రతిభా వ్యుత్పత్తులను చూపిస్తూ 'మంచి చిత్రాలను మాత్రమే తీయాలి' అనే కమిట్‌మెంట్‌తో ఏర్పడ్డ సంస్థల్లో 'అనుపమ' ఒకటి. దర్శకుడుగా తిలక్, పాటల రచయితగా ఆరుద్ర, సంగీత దర్శకుడిగా పెండ్యాల ఈ సంస్థ కీర్తిప్రతిష్ఠలను నిలబెట్టడంలో మూల స్థంభాలుగా నిలిచారు. శరత్ నవల 'బిందుగారబ్బాయ్' (బిందూర్ ఛేలో) ఆధారంగా 1956లో ఆ సంస్థ తీసిన చిత్రమే ముద్దుబిడ్డ. ఈ చితంలోని పాటలు ఎన్నేళ్ళ తర్వాత విన్నా ఒకే అనుభూతిని అందిస్తూ ఉత్తమ గీతం యొక్క లక్షణం, లక్ష్యం అదేనని నిరూపిస్తూ ఉంటాయి. ఆ చిత్రంలోని ఆరుపాటలివి.

చిట్టీ పొట్టీ వరాల మూటా
గుమ్మడి పండు గోగు పువ్వు
నీకూ నాకూ ఏ వేళైనా ఎడబాటే లేదమ్మా
ఏమంటావే బొమ్మా ఓ..ఓ..ఓ
ఎవరూ లేరే నీ సాటి
పోటీ ఎవరే నీ తోటి
ఆటా పాటా అల్లన మెల్లన
ఆడుకుందామమ్మా

ఏమంటావే బొమ్మా
ముందుగ ఇప్పుడూ ముస్తాబు
అవుదామయ్యా నా బాబు ||ముద్దుగ||
మేఘాలందున తేలీ సోలీ పోవాలమ్మ షికారు
రారూ - బొమ్మగారూ ||చిట్టీ||
ఊసులన్నీ నీతోనే ఆశలన్నీ నీమీదే ||2 ||
నీవే దగ్గర లేకపోతే ఏమౌతానోమ్మా
నేనేమౌతానే బొమ్మా ఓ..ఓ..ఓ ||చిట్టీ||

ఈ పాటను పి.సుశీల పాడగా జమున అభినయించింది. పాట చివర్లో పెరుమాళ్ళు, విజయలక్ష్మి కనిపిస్తారు. ఈ పాట మిశ్రపహాడీ, యమన్ రాగచ్చాయలలో స్వరపరచబడింది. 'ముద్దుగ ఇప్పుడు ముస్తాబు' అనే చరణంలో ఎక్కువగా యమన్ రాగచ్చాయలు కనిపిస్తాయి, తక్కిన పాటంతా అన్యస్వరాలతో కలిసిన పహాడీ రాగంతో కనిపిస్తుంది. పహాడీ రాగాన్ని ఉపయోగిస్తూ పెండ్యాల 'భాగ్యరేఖ' సినిమాలో చేసిన 'కన్నీటి కడలీ లోనా' పాటను గుర్తుచేసుకుంటూ ఈ 'చిట్టి పొట్టి' పాటను వింటే రెండిటికీగల పోలిక తెలుస్తుంది. ఈ పాటలో గల 'ఓ..ఓ..ఓ..' అంటూ సుశీల తీసిన ఆలాపనను పొడిగించుకుంటూ పోతే అది

'చిరంజీవులు' సినిమాలోని 'చికిలింత సొగసు' పాటలోని ఆలాపనలను అందుకునే అవకాశం ఉంది. ఈ పోలిక కేవలం యాదృచ్ఛికమే.

పదరా సరదాగా పోదాం పదరా
బావ చిందేసుకుంటూ ||పదరా||
ఝల్లు ఝల్లుమని గుండెలదరగా ||6 ||
చల్లని రేతిరి సరసాలాడగ ||పదరా||
ఈడూ జోడూ ఇంపుగ కుదిరే ||8 ||
పాలు తేనె కలిసినట్లుగ ||పదరా||
నా సోగకన్నులు కాయలు కాచెను ||2 ||
కాచుకునియున్నాను నీకోసమే ||నా సోగ ||

దాచిన వలపంతా
దోచుకునిపోయావు ||దాచిన||
కాసుకుని యున్నాను నీ కోసమే ||దాచిన||
మొక్కజొన్న చేలలోన
పక్క పక్కన నడుచుకుంటూ
చక్క చక్కని కలలుగంటూ ||మొక్కజొన్న||
సుతారంగ చూపులు చూస్తూ
చూపులలోనే సోలిపోదాం ||పదరా||

ఈ పాటను జిక్కి పాడగా శాంతారాం నిర్మించిన 'తీన్ బత్తీ - చార్ రాస్తా' హిందీ చిత్రంలో నటించి పేరు తెచ్చుకున్న మీనాక్షి అభినయించింది. ఈ పాటను జగ్గయ్య, జమున, నాగయ్య, లక్ష్మీరాజ్యం మొదలైన వారంతా ఇతర ముఖ్యపాత్రధారులతో సహా సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. హీరో హీరోయిన్‌లకు పెళ్ళయిన సందర్భంగా రిసెప్షన్‌లాగా ఏర్పాటు చేసిన ఓ సాంస్కృతిక కార్యక్రమంలో ఈ నృత్యగీతం వస్తుంది. ఇటువంటి సందర్భాల్లో ఓ అవుట్‌డోర్ డ్యూయెట్ లేక ఓ శోభనపు పాటో జొప్పించకుండా ఇంచుమించు చిత్రంలో నటించిన ముఖ్యపాత్రలందరినీ ఒకచోట చేర్చి ఓ నృత్యగీతాన్ని చూపించటం దర్శక నిర్మాత తిలక్ అభిరుచికి, కమిట్‌మెంట్‌కి ఓ పవిత్ర నిదర్శనం. ఈ పాటలో డప్పు వాద్యాలకు ప్రాధాన్యత ఉంది. రికార్డింగ్ సమయంలో మంట వేసి ఆ మంటల్లో డప్పులను శృతిచేసుకుని రికార్డింగుకి వెళ్ళారు. డప్పులు వాయించటంలో ఆ రోజుల్లో పేరెన్నిక గన్న ఏసుదాసు, అమృతయ్యలను పిలిపించి, వారిచేతనే వాయింపజేసి వారే నటించేట్టుగా చేశారు తిలక్. ఇకపాటలో కొస్తే మధ్యమావతి రాగం ప్రధానరాగంగా మలుచుకుంటూ పాటను స్వరపరిచారు పెండ్యాల.

జానపద ధోరణిలో సాగే ఈ పాట ట్యూన్ ఎంతోమంది హృదయాలలో బాగా నాటుకుపోయింది. ఈమధ్య వచ్చిన "భామరో నన్నే ప్యార్ కరో" (ఘటోత్కచుడు), "పోరి హుషారు గుందిరో హైటేమో ఆరుందిరో" (సీమ సింహం) పాటల్ని ఈ పాటతో సహా సంపాదించి వినగలిగితే ఆ నాటి ఆ పాట ప్రభావం ఇవ్వాళ్టికి తెలుగు సినీసంగీతంపై ఎంతగా ఉందో తెలుస్తుంది. ఈ పాటలో కొన్ని లైన్లు - ఒక్కొక్కటి ఎనిమిదిసార్లు, ఆరుసార్లు, నాలుగుసార్లు రిపీట్ అయినా సరే బోరుకొట్టకుండా మరింత హుషారుగా ఉండడం ఈ పాట ప్రత్యేకత.

ఇటులేల చేశావయా ఓ దేవ దేవ ||3||
ఎటుపోయి ఎటు తిరిగి ఏమౌనో మరి ||ఇటు||
చూడ ముచ్చట గొలిపే ఈడూ జోడూ కలిపి ||చూడ||
వాడి బ్రతుకే కడకు బీడు చేసేవా? ||ఇటు||
హాలాహలము మ్రింగ నీలాంటి వాడే తగు || హాలా||
మాలాటి మానవులు ఎలాగు సైచేరు ||ఇటు||
నా మొరవిని ఈ స్థితి గని కాపాడు దేవా
మదిలోలోన దావాగ్ని రగిలించినావే ||నా మొర||
అది వేగ కరుణించి ఆర్పేయలేవా?
దేవదేవా

ఈ పాటను నాగయ్య పాడి అభినయించారు. సన్నివేశ ప్రాధాన్యంగా లక్ష్మీరాజ్యం, జగ్గయ్య, పెరుమాళ్ళు కనిపిస్తారు. 1960 నాటికి నాగయ్యకు ప్లేబాక్ వచ్చేసింది. (భక్తరామదాసు ఓ మినహాయింపు) అంతకు కొద్ది సంవత్సరాలు ముందుగా తీసుకుంటే - నాగయ్య పాడిన సోలో గీతాలలో ఓ మంచి గీతమిది. చక్రవాక రాగం ఈ పాటకు ఆధార రాగం. ఆ రాగంలోని మట్లు, పట్లు, జీవస్వరాలు ఇవన్నీ నాగయ్య గొంతులో ఎంతగా జీవం పోసుకున్నాయే తెలుస్తుంది ఈ పాట వింటే.. ! సినిమాలోని మొత్తం పాటలన్నిటినీ రికార్డు చేసుకుని దాచుకునే అలవాటున్న వాళ్ళ దగ్గర మాత్రమే ఈ పాట దొరికే అవకాశం ఉంది.

---

ఎవరు కన్నారెవరు పెంచారు
నవనీత చోరుని గోపాలబాలుని
ఎవరు కన్నారెవరు పెంచారు
నోము నోచి నెలలు మోసి
నీలమేఘశ్యాము కన్నది దేవకి
లాలపోసి పాలు పట్టి
జోల పాడె కలిమి కలిగె యశోదకి ||ఎవరు||

తడవ తడవకు కడుపు శోకము
తాళజాలక పెంచనిచ్చెను దేవకి
తాను కనకయె తల్లి అయ్యెను
తనయుడాయెను దేవుడే యశోదకి ||ఎవరు||
ఎవరు కనినా ఎవరు పెంచిన
చివరికతడానందమిచ్చిన దెవరికి
అవనిలో తనపైన ఎన్నో
ఆశలుంచిన వారికి తననాశ్రయించిన వారికి ||ఎవరు||

'ఎవరు కన్నారెవరు పెంచారు' నీలాంబరి రాగంపై ఆధారపడ్డ గీతం. పి.లీల ఆలపించిన ఈ గీతంలో ఆరుద్ర చూపిన భావబలం, భాషా చమత్కారం ఆయన తన గురువుగా భావించే మల్లాది రామకృష్ణశాస్త్రి గారి ప్రశంసల్ని ఆశీస్సులని మరోసారి ప్రత్యేకంగా పొందేట్టు చేశాయి. ముఖ్యంగా 'కి' అనే అక్షరాన్ని అంత్యప్రాసకు అనువుగా వాడుకుంటూ లయబద్ధంగా రాసిన ఆరుద్ర ప్రతిభకు అద్దం పడుతుందీ పాట. రెండో చరణంలో 'త' అనే అక్షరంతో అది ప్రాసను కూడా జతచేయటం, ఒప్పించటం, మెప్పించటం ఇవన్నీ ఆరుద్రకే చెల్లాయి. ఆఖరు చరణం వింటే ఆరుద్ర నాస్తికుడేంటి అని అనాలనిపిస్తుంది. అలా అనిపించటమే సృజనాత్మకత కల్గిన కవికి సార్థకత. ఒక బిడ్డను ఇద్దరు సాకాల్సివస్తే దేవకి, యశోద ప్రేమతో పోల్చే ప్రక్రియను ఆ తర్వాత ఎన్నో సినీగీతాల్లో ఎందరో ఉపయోగించడం జరిగింది.

---

అంతలోనే తెల్లవారె
అయ్యో ఏమి సేతునే
కాంతుని మనసెంత నొచ్చెనో
ఇంతీ ఎటు సైతునే ||అంతలోనే||
కొంతసేపు ప్రియములాడి
చెంత జేరి చేయి జాపి
దోర వయసు నాసామి
దొంతర విడెమందుకొనే ||అంతలోనే||
చెక్కిలిపై కొనగోటితో
ఒక్కసారి కొసర లేదు
మక్కువతో గోపాలుడు సుంత
పరిహాసమాడు ||అంతలోనే||

ఈ పాటను సుశీల పాడగా జ్యోతికృష్ణ అభినయించింది. తొలి తెలుగు సినీనటి సురభి కమలా భాయ్ కూడ సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తుంది. భోగం మేళం ఆనాటి సంప్రదాయాలలో ఒకటి. అదే సంప్రదాయాన్ని ఇవాళ్టి సినిమాలలో చూపించవలసి వస్తే సంగీతం, సాహిత్యం యొక్క వైఖరి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. అటువంటి అవసరం అంటని రోజులు కనుక చక్కని జావళిగా మలిచి ఓ మంచిగీతాన్ని సమర్పించారు - ఆరుద్ర, పెండ్యాల, తిలక్! కమాచ్ రాగం ఆధారంగా స్వరపరచిన ఈ పాటను ఇవాళ గనుక వింటే ఓ సినిమా పాట అని అనుకోరు. ఎప్పటినుంచో వస్తున్న ఓ సంప్రదాయ గీతం అని అనుకుంటారు. ఏదైనా ఓ సాంస్కృతిక కార్యక్రమంలో ప్రదర్శించ దగ్గ - మరుగున పడిపోయిన మాణిక్యమిది.

---

చూడాలని ఉంది
అమ్మా చూడాలని ఉంది
నిన్ను చూడాలని ఉంది
పొరపాటు పనులిక
చేయబోనని నీతో చెప్పాలి
అమ్మా చూడాలని ఉంది
కంటికి నిద్దర రాదే
నే తింటే నోటికి పోదే
చేశాచిన్న తప్పు
నువు వేశావెంతో ఒట్టు
ఒకసారి మాత్రం
నిన్ను చూస్తే చాలులే అమ్మా ||చూడాలని||
కాళ్ళు అటే పోయేనే
నాకళ్ళు అటే లాగేనే
చూడక పోతే దిగులు
నిను చూస్తే ఏమౌతావో
చూడడం మరి కూడదంటే
ఏడుపొస్తుందమ్మా ||చూడాలని||

'చూడాలని ఉంది' పాటను సుశీల పాడగా మాస్టర్ వెంకటేశ్ అభినయించారు. పల్లవిని, చరణాలలోని మొదటి రెండు లైన్లని 'మధ్యమావతి' రాగంలో స్వరపరిచారు. పాటల్లో కవులు తమ మేధో సంపదను చూపించుకునే ప్రయత్నం చేయడం మంచిదే అవసరం కూడా. అయితే అది పాత్రల స్థాయికి మించినది, దించేది అయితేనే వస్తుంది చిక్కు. ముఖ్యంగా పిల్లల పాటలు రాసేటప్పుడు ఎందుచేతనో ఈ విషయాన్ని పట్టించుకునే ప్రయత్నం అంతగా కనబడదు. కానీ ఆరుద్ర రాసిన ఈ పాట వినగానే చెప్పొచ్చు ఇది పిల్లలు పాడే పాటని. 'బాల భాషని' శభాషనిపించే విధంగా ఉపయోగించిన ఆరుద్రతో తర్వాత్తర్వాత పిల్లల పాటలెన్నిటినో రాయించడానికి ఈ గీతం ఓ విధంగా పునాది అయిందని చెప్పొచ్చు. ఈ పాటని రికార్డు చేసే సమయంలో పాడడానికి వచ్చిన సుశీల ఒంట్లో బాగులేని కారణంగా మరో రోజు రికార్డింగ్ పెట్టుకోమని కోరడం జరిగిందట. కానీ సంగీత దర్శకుడు పెండ్యాల 'ఏం ఫర్వాలేదు అలాగే పాడు' అని బాగా నచ్చచెప్పి పాడించారట. రికార్డ్ అయిన పాట విన్న సుశీల ఆశ్చర్యపోయారట. 'ఇంతబాగా వస్తుందనుకోలేదు' అంటూ ఎంతో ఆనందించారట.

పైన ఉదహరించిన పాటలే కాక పీలూ రాగంలో పి.లీల పాడిన 'జయ మంగళ గౌరీదేవీ'పాట కూడా ఈచిత్రంలో ఉంది. తెలుగునాట నేటికీ ఓ సంప్రదాయ గీతంగా ఇళ్ళలో జరుపుకునే పూజల సమయంలో ముత్తయిదువుల చేత పాడబడుతున్న గీతమిది. అటు నేల విడిచి సాము చెయ్యకుండా ఇటు నేలబారుగా ఉండకుండా సామాన్యుడికి సైతం అర్థమయ్యేలా సినీ గీతాల్ని రాయడంలో ఆరుద్ర ముద్రను ఒక పార్శ్వంలో ఆవిష్కరించిన ఈ చిత్రంలోని గీతాలు రసాంబుధినుండి జాలువారిన జలపాతాలు.



# ఆ పాత పాట మధురం

## రాజా



### జయసింహ

చలన చిత్ర నిర్మాణ రంగంలో ఎన్.ఎ.టి. సంస్థలకి గల స్థానం ప్రత్యేకం. పిచ్చిపుల్లయ్య, తోడుదొంగలు, ఉమ్మడి కుటుంబం, వరకట్నం, కోడలు దిద్దిన కాపురం, తల్లా - పెళ్ళామా, తాతమ్మ కల వంటి సామాజిక స్పృహ కలిగిన సాంఘిక చిత్రాలు, సీతారామకళ్యాణం, శ్రీ కృష్ణపాండవీయం, దానవీరశూరకర్ణ, శ్రీమద్విరాట పర్వం, బ్రహ్మర్షి విశ్వామిత్ర వంటి పౌరాణిక చిత్రాలు, చాణక్య - చంద్రగుప్త, సామ్రాట్ అశోక్, అక్బర్ సలీం అనార్కలీ, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర, శ్రీనాథ కవి సార్వభౌముడు వంటి చారిత్రాత్మక చిత్రాలు, పాండురంగ మహాత్యం వంటి భక్తిరస చిత్రం, జయసింహ, గులేబకావళికథ వంటి జానపద చిత్రాలు.. ఇలా ఉన్నత ప్రమాణాలు కలిగిన చిత్రాలను నిర్మించిన సంస్థగా (మధ్యలో బ్యానర్ పేరులో స్వల్ప మార్పులు సంభవించినా) అందరికీ తెలుసు. ఒక సంస్థ వైవిధ్యంతో కూడిన ఇన్ని రంగాలను స్పృశిస్తూ చిత్ర నిర్మాణం కావించడం ఒక విశేషం అయితే ఆ అభిరుచికి కారణం ఎన్.టి.ఆర్, ఆయన సోదరుడు త్రివిక్రమరావు. ఇద్దరూ సంగీత సాహిత్యాల పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తులు కావడం వల్ల ఆ సంస్థ నుంచి వచ్చిన చిత్రాల గీతాలలో కూడా ఒక ప్రామాణికత తొంగిచూస్తూ ఉండేది. 1955లో ఎన్.ఎ.టి బ్యానర్‌లో వచ్చిన జయసింహ చిత్రంలోని పాటలు ఎంతగానో ప్రజాదరణ పొందాయి. అప్పట్లో ఆ సంస్థకు ఎక్కువగా సీనియర్ సముద్రాల రచన సాగించేవారు. టి.వి.రాజు, సముద్రాల జూనియర్ కాంబినేషన్‌తో ఆ నందమూరి సోదరులు, ప్రేక్షక శ్రోతల హృదయాలలో ఆనందమూరిన విధంగా చేయించుకున్న గీతాలివి.

అరెరెరెరెరె వినండి బాబూ ఇదేనండి లోకం తీరూ
ఈ జనం పోకడా ఇదేనండీ
అరె నిసగమపా లోకం మోసం పామగరిసా ||2||
మోసం మోసం అంటారంతా ||2||
మోసం చెయ్యని దెవ్వరంటా ||నిస||
ఆయాసమంతా గ్రాసం కోసం
లోకం పలువేషం ఈ లోకం పలువేషం
జగమంతా బల్ మోసం ||అరె నిస||

మోసాలు చేసి మోక్షం కోరి
ఇచ్చే టెంకాయా దేవుడికిచ్చే టెంకాయా! ||అరె నిస||
అడుక్కు తినటం మరిగిన వాళ్ళ
కాళ్ళు, కళ్ళూ, కీళ్ళూ, మోకాళ్ళూ, కళ్ళూ, కీళ్ళూ!
వ్యాపారి వాడే తరాసుముల్లూ
తక్కెడలో రాళ్ళూ అరె అంతా మోసంరా
జగమంతా వేషంరా ||అరె నిస||

ఈ పాటను పిఠాపురం నాగేశ్వరరావు పాడగా, రేలంగి అభినయించారు. 1950లో 'సబక్' అనే ఒక హిందీ చిత్రం వచ్చింది. ఈ చిత్రానికి సంగీతం అల్లారఖా ఖురేషీ, ఈయన సంగీత దర్శకత్వంలో జి.యమ్. తుర్రానీ పాడిన 'అరె నిసగమపా...హయ్‌రామ్‌జీ పామాగారిస' అనే పాట బాగా పాపులర్ అయింది అప్పట్లో. ఆ పాట పల్లవినే ప్రేరణగా తీసుకుని ఈ పాటను చేశారు. తెలుగు పాటలో కొన్ని లైన్లు రాసుకుని తర్వాత తొలిగించారేమోనని అనిపిస్తుంది. అవి సినిమాలోనూ, ఆడియోలోనూ లేవు. పాటల పుస్తకంలో మాత్రం ఉన్నాయి. కేవలం ఇన్ఫర్మేషన్ కోసం మాత్రమే ఉదహరిస్తున్న ఆ వాక్యాలు ఇవే: వీభూది రేఖల గడ్డం మీసం / అంతా పై వేషం - జగమంతా బల్ మోసం /

పూజారి చెక్కా - భక్తుడు ముక్కా బుట్టలో వేసేస్తె - పాపం దేవుడు పస్తేగా /

---

జయ జయ శ్రీరామా రఘువరా
శుభకర శ్రీరామా! జయ
త్రిభువన జన నయనాభిరామా (2) ||జయ||
తారకనామా...
తారకనామా... దశరథరామా ||తారక||
దనుజవిరామా పట్టాభిరామా (2) ||జయ||
రామా రఘుకుల జలనిధిసోమా (2)
భూమిసుతా కామా రామా
కామిత దాయక కరుణాధామా (2)

అరభి రాగంలోని జీవ స్వరాలన్నింటినీ అందిపుచ్చుకుని వీనులవిందుగా తయారైన 'జయజయ శ్రీరామా' పాట ఆ రోజుల్లో ప్రతి రామమందిరంలోనూ విరామం లేకుండా మారుమ్రోగిపోయేది. ఆ పాట కంఠోపాఠంగా రాని భక్తులు, ఘంటసాల అభిమానులు దాదాపుగా అరుదనే చెప్పాలి. ఘంటసాల తన గానామృతంతో అజరామం చేసిన ఈ గీతాన్ని గుమ్మడి అభినయించారు. ఎన్.టి.ఆర్, రేలంగి, అంజలి సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ఈ పాటను బాగా సాధన చేస్తే ఆరభిరాగంపై కొంతపట్టుదొరుకుతుంది.

---

ఆ: ఈనాటి ఈ హాయీ
కలకాదోయి నిజమోయి! ||ఈనాటి||
నీ ఊహతోనే పులకించిపోయే
ఈ మేను నీదోయీ! ||నీ ఊహ||
నీకోసమే ఈ అడియాసలన్నీ
నా ధ్యాస, నా ఆశ నీవే సఖా ||ఈనాటి||
అ: ఏ నోము ఫలమో ఏ నోటి వరమో
ఈ ప్రేమ జవరాలా ||ఏనోము||
మనియేములే ఇక విరితావి లీల
మన ప్రేమ కెదురేది లేదే సఖీ ||ఈనాటి||
ఆ: ఊగేములే తుల తూగేములే ఇక
తొలిప్రేమ భోగాలా!
అ: ఊగేములే
ఇ: మురిపాల తేలే మన జీవితాలూ ||2||
దరహాస లీలా విలాసాలులే ||ఈనాటి||

మోహన రాగంలోని సమ్మోహన శక్తులన్నింటినీ పొందుపరుచుకున్న పసందైన గీతం ఇది. స్వరకర్త సృష్టించిన మాధుర్యాన్ని అందజేయటంలో ఘంటసాల, లీల సరియైన సంధానకర్తలుగా వినబడతారు. ఇక ఎన్.టి.ఆర్, అంజలీదేవి అభినయించిన 'ఈనాటి ఈ హాయి' పాట విషయానికి వస్తే ఓ తమాషా సంఘటన చెప్పాలి. నందమూరి సోదరులు మ్యూజిక్ సిట్టింగ్‌కి వస్తున్నారనగానే వారితో సన్నిహితంగా ఉండే టి.వి.రాజు గారిక్కూడా టెన్షన్‌గా ఉండేది, ఆయన బృందంతో సహా. 1968లో 'పాలమనసులు' చిత్రం ద్వార పరిచయమై తర్వాత్తర్వాత సంగీత దర్శకుడిగా ఎంతో పేరు సంపాదించుకున్న సత్యం అప్పట్లో ఆ బృందంలో ఉండేవారు. ఢోలక్ వాయించే వారు కనుక 'ఢోలక్ సత్యం' అనేవారాయన్ని. హిందీ సినిమా పాటలంటే చెవికోసుకునే సత్యం మంచి పాటలున్న హిందీ సినిమా విడుదలయిందని తెలిస్తే రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఎవరికీ తెలియకుండా వెళ్ళి సెకండ్ షో చూసేసి బస్సులు అవీ లేకపోతే కాలినడకన వచ్చేసి, తిరిగి బుద్ధిమంతుడిలా పడుకుండిపోయేవారు ఆ బృందంలో.

ఆ రోజు 'ఈనాటి ఈ హాయి' పాటకి సంబంధించిన ట్యూన్ నందమూరి సోదరులకు వినిపించితీరాలి. ఏవేవో తయారు చేశారుగానీ ఎవరికీ తృప్తిగా లేదు. 1953 ప్రాంతంలో దిల్-ఎ-నాదాన్ అనే హిందీ చిత్రం విడుదలయింది. గులామ్ మహమ్మద్ ఆ చిత్రానికి సంగీత దర్శకుడు. ఆయన స్వరపరచగా తలత్ మహమ్మద్ పాడిన ఓ పాట తలత్ స్వర్ణోత్సవ విజయగీతాల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఆ పాట పల్లవి ఇలా ఉంటుంది.

**జిందగీ దేనే వాలీ సున్ - తెరి దునియాసే దిల్ భర్‌గయా - మై యహా జీ తేహీ మర్‌గయా - జిందగీదేనే వాలీసు**

ఈ పాటని వినిపించి 'ఇలా చేద్దామా?' అని అడిగారు సత్యం. 'వాళ్ళు కనిపెట్టలేరనుకున్నావా? చంపేస్తారు జాగ్రత్త' అని హెచ్చరించారు టి.వి.రాజు. 'అదికాదండీ చిన్న గమ్మత్తు చేస్తా వినండి' అంటూ 'జిందగీ దేనే వాలీసు' పాటలోని రెండోలైన్ అయిన 'తేరీ దునియాసే దిల్ భర్ గయా'కి గల ట్యూన్‌ని 'ఈనాటి ఈ హాయి' పాటకి మొదటి లైనుగా తీసుకుని మోహనరాగాన్ని ఆలపించుకుంటూ 'కలకాదోయి నిజమోయి' అనే లైన్‌ని పూర్తిచేశారు సత్యం. వెంటనే పాట పూర్తి స్వరూపం టి.వి.రాజుగారికి సాక్షాత్కరింపచేసింది. ఇంటర్ లూడ్స్ (చరణాలు మధ్య వచ్చే వాద్య సంగీతం)తో సహా చరణాల ట్యూనును సిద్ధం చేసేశారాయన. మొత్తం పాట చకచకా తయారయిపోయింది. ఫస్ట్ హియరింగ్‌లోనే ఓకే చేసేశారు నందమూరి సోదరులు. ఎంత భయపడ్డారో అంత సుఖంగా, విజయవంతంగా ఆ సిట్టింగ్ ముగిసినందుకు 'ఈనాటి ఈ హాయి కలకాదోయి నిజమోయి' అని పాడుకున్నారట ఆ రోజు.

---

మనసైనా చెలీ పిలుపూ (2)
వినరావేల ఓ చందమామా ||మనసైన||
పిలిచీ నిన్నే నే వలచాననా
బిగిసేరూ మగవారలూ ||పిలిచి||
తలచేరులే చెలి నిను చౌకగా
వలచేసే ననూ జాబిలీ

అదొ నవ్వేను నను చూచి ||అదొ||
నను కవ్వించి ఆడేను దోబూచి ||అదొ||
లే నవ్వుల తొలి లాలింతురే
తుది కన్నీట తేలింతురే ||లే నవ్వుల||
నమ్మేదెలా మనసమ్మేదెలా
మనసనాడో ఆ రాజు సొమ్మాయెనే ||మన||

ఈ పాటను రావు బాలసరస్వతి, ఎ.పి.కోమల పాడగా తెరపై వహీదా రెహమాన్, సీత అభినయించారు. కొన్ని పాటలు తరాలు గడిచిన తరువాత - తొలిరోజులలో ఇచ్చిన అనుభూతిని ఇవ్వలేవు. కానీ పాట అలా కాదు, ఇవాళ్టికీ అదే ఫ్రెష్‌నెస్ ఫీలవుతాం. మరొక విషయం ఏమిటంటే 1951 లో వచ్చిన 'ఢోలక్' చిత్రం కోసం శ్యామ్ సుందర్ సంగీత దర్శకత్వంలో మధుబాల ఝవేరీ పాడిన 'చోరీ చోరీ ఆగ్‌సే దిల్‌మే లగాకర్ జల్‌దిమే' అనే పాట యొక్క నడక - 'మనసైనా చెలీ పిలుపు' పాటకు ప్రేరణ అయిఉండవచ్చునని కొందరు

పరిశీలకుల అభిప్రాయం. 'బ్రతుకు తెరువు' సినిమాలోని 'అందమే ఆనందం' పాటలోని 'ఆనందమే జీవిత మకరందం' అనే రెండవలైన్ యొక్క టేకాఫ్ నోట్స్, ల్యాండింగ్ నోట్స్ ఈ పాట రెండవ లైన్ అయిన 'వినరావేల ఓ చందమామ'లా ఉన్నాయని మరికొందరి అభిప్రాయం.

---

ఆ: మదిలోని మధురభావం
పలికేను మోహనరాగం ||మది||
అ: ప్రహింపవే నా రావం ||ప్రవ||
వివరించు ప్రేమ సరాగం ||మది||
ఆ: అరుణ సంధ్యా కిరణాలలోన!
మురిసె నాలోన మోహాల తలపు (2)
విరిసె మురిపాల కలలేవో మరి ||మది||
అ: కలలదేలే మాధుర్యలీలా
వెలుగులే ఇక మన జీవితాలూ!
కలిసి రవళించు హృదయాన పాట (2)
వలపు పయనాల విరిబాట చెలి ||మది||

**నేపథ్యం:**

మింటిపైనా వెలుగారిపోయె
కంటికీలోకమె చీకటాయె
బ్రతుకు నులివేడి కన్నీరయేనా...
ఆశలన్నీ అడియాసలేనా...

ఈ పాటను ఘంటసాల, రావుబాలసరస్వతి దేవి పాడగా ఎన్.టి.ఆర్, వహీదా రెహమాన్ అభినయించారు. ఈ పాటలోని రెండు చరణాలకు కొనసాగింపులా అంజలీదేవి అభినయించగా 'మింటిపైనా వెలుగారిపోయే' అనే మరొక చరణం కూడా వస్తుంది. ఆ చరణం హెచ్.ఎం.వి వారు విడుదల చేసిన ఆడియో క్యాసెట్‌లో లేదు. ఈ మూడు చరణాలు ప్రధానంగా మోహనరాగం పైనే ఆధారపడి ఉంటాయి. ఓ వైపు అందరినీ ఆకర్షించగలిగే 'ఈ నాటి ఈ హాయి' లాంటి పాటకు మోహనరాగాన్ని పూర్తిగా వాడుకుంటూ అభిరుచి వున్న కొంతమందికి మాత్రమే రుచించగలిగే ఈ 'మదిలోని మధుర భావం'లాంటి పాటకి కూడా మోహనరాగాన్ని ఉపయోగించటం, అందులోనూ.. ఆనంద విషాదాలు రెండూ ప్రతిఫలించేట్టుగా ఇవన్నీ టి.వి.రాజు గారిపై గల గౌరవాన్ని రెట్టింపు చేస్తాయి.

---

నడిరేయి గడిచేనే చెలియా
రాడాయెనే సామి నా సామి
రాడాయెనే సామి నేడూ ||నడి||
ఎదురు తెన్నులు చూచి చూచి
ఓ చెలియా వానికై వేచి వేచి నేడు ||నడి||
గగనాన నెలరేడు దిగజారిపోయె
సిగలోని విరులన్ని పసివాడిపోయె!
దిగులాయనే...(2) మది వగలే మిగులాయే
మగరాయడే వాడు మనలేనో నేడూ ||నడి||
గడపా పడిగాపు పడియుండలేనే!
గడియొక్క యుగముగ గడుపగ లేనే! ||గడపా||
ఎడబాటుతో - ఎడబాటుతో
గమరిస రిసనిసదప గమరిగమ ఎడబాటుతో
సా..నీ..దా..సానీ సనిదపమ
నీ...దా..పా..నీద నిదపమగ
మాపమగమగమ పాదప మపమస
దానిద పద పద నినిసని పపదమప
ఎడబాటుతో ఈ సడిలేని రేయి
కడలేని కన్నీరై నిలువగలేనే ||నడి||

సుశీల పాడిన ఈ జావళికి తోడయిన వహీదా రెహమాన్ నృత్యాభినయాన్ని ఈనాటికీ మరచిపోని వారున్నారు. ఆ రోజుల్లో స్కూళ్ళల్లో, కాలేజీల్లో ఏదైనా శాస్త్రీయ నృత్యంలా అభినయించాల్సి వస్తే ఈ పాటను సాధన చేసి ప్రదర్శించిన సంఘటనలు కూడా కొన్ని కొన్ని కుటుంబాలలో ఉన్నాయి. అంతటి ఆదరణకు గౌరవానికి నోచుకున్న ఈ జావళిని బేగడ రాగంలో స్వర పరిచారు. బేగడ రాగంలో సినిమా పాటలేమున్నాయని ప్రశ్నించుకుంటే ఇవాళ్టికీ సమాధానం కోసం చాలా కష్టపడాల్సిన పరిస్థితే ఉంది. కొంతమందైతే 'లవ - కుశ' చిత్రంలో ఘంటసాల స్వరపరచి గానం చేసిన 'ఇదె మన ఆశ్రమంబు' అనే పద్యాన్ని మాత్రమే ఉదహరిస్తారు గానీ ఎందుకో ఈ జావళిని గుర్తుచేసుకోరు.

---

ఓ- కొండ మీద కొక్కిరాయి
కాలు జారి కూలిపోయే ||ఓ కొండ||
టక్కరి నక్క నక్కింది పక్క
ఎక్కడి దొంగలక్కడే గుప్ చుప్ చుప్! ||టక్కరి||
ఏకాడ నీ వున్నా నీ నీడనే వున్నా!
చిక్కేవు చేతిలో
చిక్కేమీ లేదులే గప్ చుప్ చుప్ ||కొండ||

వేసెయ్యి ఏసమూ చేసెయ్యి మోసమూ (2)
మోసగాడే మొనగాడూ, గప్ చుప్ చుప్ ||కొండ||
ఆకలి వేస్తే రోకలి మింగూ
ఏ పాటు కూటికేనులే గుప్ చుప్ చుప్ ||కొండ||
మేకలు కావ్ కావ్ కావ్ కాకులు మే మే మే
లోకులు కాకులు
తోకలేని మేకలు గప్ చుప్ చుప్ చుప్ ||కొండ||

ఈ పాటను అంజలీదేవి పిచ్చిదానిలా నటిస్తూ నృత్యం చేస్తూ పాడే సన్నివేశంలో ప్రధానంగా ఎన్టీ రామారావు, ఉపపాత్రధారుల్లో ముఖ్యంగా పద్మనాభం, బాలకృష్ణ కనిపిస్తారు. కేవలం సరదాగా వినడానికి మాత్రమే పనికొచ్చే ఈ పాటను ఎ.పి.కోమల పాడినట్టుగా హెచ్.ఎం.వి వారు విడుదల చేసిన క్యాసెట్‌లో (నం. ఎస్.ఎఫ్.హెచ్.ఒ.848261) ఉంది. పాటల పుస్తకంలో సుశీల పాడినట్టుగా ఉంది. అప్పుడు రిలీజయిన 78 ఆర్.పి.ఎం. రికార్డుల మీద 'దేవదాసు' ఫేమ్ కె.రాణి పాడినట్టుగా ఉంది. జాగ్రత్తగా వింటే కె.రాణి పాడినట్టుగానే అనిపిస్తుంది.



# ఆ పాత పాట మధురం



రాజా

## ఇలవేలుపు

అక్కినేని, అంజలీదేవి, జమున హీరో హీరోయిన్లుగా ఎల్.వి.ప్రసాద్ నిర్మాణ పర్యవేక్షణలో, డి.యోగానంద్ దర్శకత్వంలో 1956 లో వచ్చిన 'ఇలవేలుపు' సినిమా పేరు చెప్పగానే చటుక్కున స్ఫురించే పాట - 'చల్లని రాజా ఓ చందమామ'.

విడుదలయి నలభై ఆరేళ్ళు పూర్తయినా ఇంకా స్మృతి పథంలో సంపూర్ణంగా మెదులుతోందంటే ఆ పాటకు సంగీతాన్నిచ్చిన సుసర్ల దక్షిణామూర్తికి అగ్రతాంబూలాన్నివ్వాలి. శ్రీ శ్రీ, అనిసెట్టి, కొసరాజు, వడ్డాది పాటలను రాయగా, ఆయన సంగీత దర్శకత్వంలో వచ్చిన 'ఇలవేలుపు' చిత్రంలోని నాలుగుపాటలివి.

సాకీ: నిఖిల భువనపాలం నిత్య తేజో విశాలం
సకల సుగుణ శీలం సచ్చిదానంద రామం
జనగణ మంగళదాయక రామం - రఘుపతి రాఘవ రాజారామం
1: రోగవినాశకరం శ్రీరామం - భవ బంధములను బాపెడు రామం
భక్తలోక పరిపాలక రామం - శరణు! శరణు! శ్రీ సీతారామం ||జనగణ||
సాకీ: ఏకో దేవః కేశవోవా - ఏకో రూపం నిత్య సత్య ప్రదీపం
వాతీతం రామ నామ స్వరూపం
జనగణ మంగళదాయక రామం - రఘుపతి రాఘవ రాజారామం
2. సర్వధర్మముల సారమె రామం ||2||
సకల మతములకు సమతే రామం ||2||
శాంతిలోని విశ్రాంతియె రామం ||2||
శరణు! శరణు! శ్రీ సీతారామం ||2|| ||జనగణ||
సాకీ: పంచ భూతైక రూపం పావనం రామనామం
ఔషధాతీత తేజం అమృతం రామనామం ||జనగణ||

ఈ పాటను పి.లీల పాడగా అంజలీదేవి ప్రధాన పాత్రధారిణిగా అభినయించింది. అమీర్ కళ్యాణి, బేహాగ్, కళ్యాణి రాగచ్ఛాయలలో ఈ గీతం స్వరపరచబడింది. సినీ భక్తిగీతాలలో చాలావాటిని కాలానికి ఎదురీది నిలబడగలిగే శక్తి ఉన్నా కొన్ని చరణాలు ఆయా సినిమాలకు, పాత్రలకు సంబంధించి ఉండడం సహజం. ఉదాహరణకి 'సీతారామ కళ్యాణం' సినిమాలో 'జగదేక మాతా గౌరి' పాటను పార్వతీ దేవికి సంబంధించిన పూజా సమయాలలో చాలా మంది పేరంటాళ్ళు మొత్తం సాహిత్యంతో సహా పాడుతుంటారు. అందులో 'నా పతికాపద కలుగనీయక' అన్న లైను పాడుకునే ఆవిడ భర్త ఆపదలో ఉన్నా లేకపోయినా చెల్లిపోతుంది. గాని 'నీ పదములను లంకాపతిని నా పెన్నిధిగా నమ్ముకుంటిని' అన్న లైను అర్థం తెలుసుకుని పాడితే ఇబ్బందిగా ఉంటుంది. ఇటువంటి

ఇబ్బందిని కలుగజేయకుండా ఏ కాలంలో ఎవరు పాడుకున్నా చక్కగా ఉండే పాటలకోవలోకి 'జనగణ మంగళదాయక రామం' పాట చెందుతుంది.

---

ప: నీమము విడి అజ్ఞానముచే పలుబాధలు పడనేల?
సోదరా! ప్రకృతి మాత లేదా?
చ: భానుకిరణముల ప్రభావమే ఈ ప్రపంచమోయన్నా
వాటిలో ప్రాణ శక్తిమిన్న రోగముల ప్రార్ద్రోలునన్నా
దేహమున కెంతో మేలన్నా ||3|| ||నీమము||
చ: మన్నూ, నీరూ, గాలియుండగా భయమింకేలనన్నా
జగతికే ఆదిశక్తులన్నా - అవే మన ప్రాణతుల్యమన్నా
వ్యాధులిక రావని నమ్మన్నా
దేహములకెంతో మేలన్నా ||2|| ||నీమము||
చ: మధురమైన ఫలజాతులనెపుడు మానక తినుమన్నా
మనకదే చాల ముఖ్యమన్నా వీటిలో ఓ జీవము కలదన్నా
రోగములు చేరవు నిజమన్నా దేహమున కెంతో మేలన్నా
చ: ఆవిరిలోనె పంచభూతములు అమరియున్నవన్నా
ఆవిరికి శక్తి అమితమన్నా అదే మన చలనశక్తి యనా
వ్యాధులిక రానే రావన్నా
దేహమునకెంతో మేలన్నా ||2|| ||నీమము||

ఈ పాటను కూడా పి.లీల పాడగా అంజలీదేవి ప్రధాన పాత్రధారిణిగా అభినయించింది. జాగ్రత్తగా గమనిస్తే ఇవాళ బ్యూటీషియన్లు, డైటీషియన్లు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లోని ఎక్స్‌పర్ట్ డాక్టర్లు నేచర్ క్యూర్ హాస్పిటల్లో ఇచ్చే సారాంశం ఇదంతా - ఈ పాటలోని నాలుగు చరణాల ద్వారా ఆ రోజుల్లోనే చెప్పారని అనిపిస్తుంది. భవిష్యత్తులో కూడా ఎంతో మందికి ఉపయోగపడగల ఈ పాటను ప్రభుత్వం వారు కూడా గుర్తించి విస్తృతంగా ప్రచారం, ప్రసారం చేయవలసిన అవసరం ఉందని ఈ సమీక్షకుని వ్యక్తిగత అభిప్రాయం. నాస్తిక్ (1954) సినిమాలో సి.రామచంద్ర స్వరపరచగా గీత రచయిత ప్రదీప్ స్వయంగా గానం చేసిన 'దేఖ్ తెరే సన్‌సార్‌కె హాలత్ క్యాహోగయీ భగవాన్, కిత్‌నా బదల్ గయా ఇన్‌సాన్' అనే పాట పల్లవిలోని ట్యూన్‌ని ఈ పాట పల్లవికి ప్రేరణగా వాడుకున్నారు.

---

చల్లని రాజా ఓ చందమామ ||చల్లని||
నీకథలన్ని తెలిశాయి
ఓ చందమామ నా చందమామ ||చల్లని||
పరమేశుని జడలోన చామంతివి
నీలిమేఘాలలో మేటి పూబంతివి
నినుసేవించెద నను దయచూడవా
ఓ వన్నెల వెన్నెల నా చందమామ ||చల్లని||

నిను చూసిన మనసెంతొ వికసించుగ
తొలి కోరికలెన్నో చిగురించుగ
ఆశలూరించునె చెలి కనుపించునె
చిరునవ్వుల వెన్నెల కురిపించునే ||చల్లని||
నను చూడవు పిలిచిన మాటాడవు
చిన దానను అబలను ప్రియురాలను
నిన్నె కోరెనురా నన్ను కరుణించరా
ఈ వన్నెల కన్నెతొ విహరించరా ||చల్లని||

ఈ పాటను లీల, రఘునాథ పాణిగ్రాహి, సుశీల పాడారు. వడ్డాది రాసిన ఈ పాటను తెరపై అంజలీదేవి, అక్కినేని, జమున అభినయించారు. తెలుగు సినీసంగీత చరిత్రలో త్రిగళ గీతాలు అతి తక్కువ. అందులో బాగున్నవి. ఆయుఃప్రమాణం అధికంగా కలిగి ఉన్నవి మరీ మరీ తక్కువ. అటువంటి పాటలను లెక్కించవలసివస్తే ఈ పాటను ఉదహరించకుండా ముందుకు సాగడం కష్టం. భీంప్లాస్

రాగం స్కేల్ ఆధారంగా మలచబడ్డ ఈ పాట ద్వారా రఘునాధ పాణిగ్రాహి అందరికీ తెలిశాడు. ఒరిస్సాకు చెందిన ఈ గాయకుడు ప్రముఖ నృత్య కళాకారిణి సంయుక్తను వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత ఆమె సంయుక్తా పాణిగ్రాహిగా ప్రసిద్ధురాలైంది. రఘునాధ ప్రాణిగ్రాహి తెలుగులో పాడినవి తక్కువే అయినా ఈ పాట ద్వారా ఆయన శ్రోతల హృదయంలో చిరస్థాయిగా, స్థిర స్థాయిగా నిలిచిపోయాడు ఎక్కువగా ఆధ్యాత్మిక వాతావరణంలో బ్రతికే అంజలీదేవి పాత్ర మొదటి చరణాన్ని, ఆమెను ప్రేమించిన అక్కినేని పాత్ర రెండవ చరణాన్ని, అతడిని ప్రేమించే జమున పాత్ర మూడవ చరణాన్ని పాడటం జరుగుతుంది. అభినయించే పాత్రల స్వభావాలు చంద్రుని ఊహించుకుంటూ కథాపరంగా ఎలా స్పందిస్తాయి అన్నదే ఈ పాటలోని సాహిత్య సోయగం.

---

అన్నా అన్నా విన్నావా
చిన్ని కృష్ణుడు వచ్చాడు
చిన్నీ కృష్ణుడు వచ్చాడు
నా వన్నెల చెలికాడొచ్చాడు ||అన్నా అన్నా||
కాళియ మడుగున దూకిన వాడు
ఆపద తొలిగి వచ్చాడు
చల్లని చూపుల చూస్తాడు
కన్నుల పండుగ చేస్తాడు ||అన్నా అన్నా||

గోకుల మందున గోవిందునితో
గోపికనై విహరిస్తాను
ముద్దుల మూర్తిని కంటాను
మోహన మురళిని వింటాను ||అన్నా అన్నా||
బృందావనిలో నందకిశోరుని
చెంతను నాట్యం చేస్తాను
యమునా తీర విహారములో
హాయిగ పరవశమవుతాను ||అన్నా అన్నా||

ఈ పాటను జిక్కి పాడగా తెరపై జమున, రేలంగి అభినయించారు. కథా పరంగా చనిపోయాడనుకున్న కథానాయకుడు బ్రతికున్నాడని, ఇంటికి తిరిగొస్తాడని తెలిసి అతనిని ప్రేమించిన అమ్మాయి ఆ ఆనందాన్ని తన సోదరునితో పంచుకుంటూ పాడే సన్నివేశానికి రాయబడ్డ గీతమిది. సాధారణంగా 'ఛస్తే శివరంజని (రాగం) - నవ్వితే సితార్ (వాద్య)' లాంటి సంప్రదాయాలు సినీ సంగీతంలో ఎక్కువగా ఉన్నరోజుల్లో శోక సన్నివేశాలను ఉపయోగించే శివరంజని రాగం స్కేల్‌ని తీసుకుని విషాదానికి కాక హుషారుకి ఉపయోగించడం సుసర్ల వారి ప్రతిభకు ఓ మచ్చుతునక. అయితే ఇక్కడ ఇంకో విషయం ఉంది. రవి సంగీత దర్శకత్వంలో వచ్చిన 'వచన్' హిందీ చిత్రంలో ఆశా భోంస్లే పాడిన ఓ పాట ఆ రోజుల్లో పెద్ద హిట్టు. ఆ పాట పల్లవి ఇలా ఉంటుంది.

చందామామా దూర్‌కే / పుయె పకాయె భూర్‌కే / ఆప్ ఖాయే థాలిమే / మున్నేకో దియే ప్యాలిమే

ఈ పాటలో ప్రముఖంగా వినిపించే ఫ్లూట్ బిట్‌ని, పల్లవి ట్యూన్‌ని యధాతథంగా 'అన్నా అన్నా విన్నావా' పాటకు వాడుకుంటూ చరణాలకు మాత్రం తను వేరే ట్యూన్‌ను చేసుకున్నారు సుసర్ల దక్షిణామూర్తి. పైన ఉదహరించిన సన్నివేశాన్ని, పాటకు జతపడ్డ సాహిత్యాన్ని పక్కపక్కన పెట్టి చూస్తే సినీ గీతాల్లో విలువల్ని కాపాడే విషయంలో రచయితల నైతిక బాధ్యత ఎంతో అవగతమవుతుంది.

---



# ఆ పాత పాట మధురం

## రాజా



### భలేరాముడు

1956 లో **అశోక్ కుమార్ హీరోగా** నటించిన 'కిస్మత్' చిత్రం విడుదలయింది. అందులో - విధివశాత్తూ దొంగగా మారి పైకి ఘరానాగా చలామణి అవుతూ దొరికిపోతానని తెలిసినా - తనవల్ల అవిటి బ్రతుకు సాగిస్తున్న కథానాయికను ఆ దౌర్భాగ్యం నుంచి తప్పించడానికి సాహసాలు చేసే హీరో పాత్ర ఎందర్నో ఉత్తేజితుల్ని చేసింది. కాకపోతే ఆ చిత్రం విడుదలయిన మొదటివారంలో బొంబాయిలో దొంగతనాలు జరిగాయన్న కంప్లయింట్స్ ఎకువయ్యాయని, దానికీ చిత్రం ప్రభావమే కారణమని చెప్పుకునేవారు. ఆ చిత్రంలో సంగీత దర్శకుడు అనిల్ బిశ్వాస్ స్వరపరచిన 'ధీరే ధీరే ఆరే బాదల్', 'ఘర్ ఘర్ మె దివాలీ హై, మెరా ఘర్ మె అంధేరా' వంటి పాటలు బాగా పాపులర్ అయాయి. ఆ 'కిస్మత్' ఆధారంగా 1956లోనే నిర్మించిన ఈ 'భలేరాముడు' చిత్రం కూడా తెలుగునాట చక్కటి ప్రజాదరణ పొందింది. ఈ చిత్రానికి దర్శకుడు వేదాంతం రాఘవయ్య, సంగీత దర్శకుడు యస్. రాజేశ్వరరావు, మాటలు, పాటలూ సదాశివబ్రహ్మం. ఈ చిత్రంలోని కొన్ని పాటల గురించి.

.

ఓహో..
ఓహో మేఘమాలా - నీలాల మేఘమాలా
చల్లగరావేలా - మెల్లగరావేలా - చల్లగరావేలా - మెల్లగరావేలా.. మెల్లమెల్లగరావేలా
ఈలీలా దుడుకుతనమేలా - ఈ లీలా దుడుకుతనమేలా
ఊరుకోవే మేఘమాలా
ఊరుకోవే మేఘమాలా ఉరుముతావేలా - మెరవగానేలా
చల్లగరావేలా - మెల్లగరావేలా
ఓహో..గూటిలోన రామచిలుక నిదురపోతుంది
ఊరుకోవే మేఘమాలా - ఊరుకోవే మేఘమాలా
ఉరుముతావేలా మెరవగానేలా - చల్లగరావేలా - మెల్లగరావేలా
ఓహో...తీయతీయని కలలు కంటూ మురిసిపోతోందీ
తీయ తీయని కలలు కంటూ మురిసిపోతోందీ
తీయతీయని కలలుకంటూ మురిసిపోతోందీ మైమరచిపోతోందీ
ఊరుకోవే మేఘమాలా - ఉరుముతావేలా - మెరవగానేలా
చల్లగరావేలా - మెల్లగరావేలా - చల్లగరావేలా - మెల్లగరావేలా...ఓహో....ఓహో

అ: ఓహో మేఘమాలా - నీలాల మేఘమాలా
ఓహో మేఘమాలా - నీలాల మేఘమాలా
చల్లగరావేలా - మెల్లగరావేలా - చలల్గ రావేలా - మెల్లగరావేలా
వినీలా మేఘమాలా - వినీల మేఘమాలా
నిదురపోయే రామ చిలుకా
నిదురపోయే రామచిలుకా బెదిరిపోతుందీ కల చెదిరిపోతుందీ
చల్లగ రావేలా మెల్లగరావేలా
ప్రేమ సీమలలో చరించే బాటసారీ ఆగవోయీ
ప్రేమ సీమలలో చరించే బాటసారీ ఆగవోయీ
పరవశంతో ప్రేమగీతం పాడబోకోయీ
పరవశంతో ప్రేమగీతం పాడబోకోయీ

ఏం...? నిదురపోయే రామచిలుక
నిదురపోయే రామచిలుక బెదిరిపోతుందీ కల చెదిరిపోతుందీ
చల్లగరావేలా మెల్లగ రావేలా
అ: ఓహో... ఆ:ఓహో.....
ఆ: ఆశలన్నీ తారకలుగా హారమొనరించీ
ఆశలన్నీ తారకలుగా హారమొనరించీ అలంకారమొనరించి
మాయచేసి మనసు దోచీ - మాయచేసి మనసు దోచీ
పారిపోతావా దొంగా పారిపోతావా
చల్లగ రావేలా మెల్లగరావేలా - చల్లగ రావేలా మెల్లగరావేలా

ఈ రెండు పాటలూ భీంప్లాస్ రాగంలో స్వరపరచబడ్డాయి. 'సాలూరి రాజేశ్వరరావు - భీంప్లాస్ రాగం' అనగానే సంగీత ప్రియులెవరికైనా మదిలో మెదిలేపాట 'పాట పాడుమా కృష్ణా.. పలుకు తేనెలొలుకు నటుల.. మాటలాడుమా ముకుందా మనసు తీయగా' - హృదయం రసప్లావితం అయ్యేటట్లు భావస్ఫోరకంగా పాడే విధానానికి ఒరవడి దిద్దిన ఈ ప్రైవేట్ సాంగ్‌లో రాజేశ్వరరావు ఒక ప్రయోగం చేశారు. భీంప్లాస్ రాగానికి ఆరోహణలో 'సగమపనిస' అవరోహణలో 'సనిదమసగరిస' స్వరాలు వస్తాయి. ఆరోహణలో 'సరిగమపదనిస' అనే స్వరాలను ఉపయోగిస్తే 'ఖరహరప్రియ' రాగంలా వినిపించే అవకాశం ఉంది. అయినా సరే ఆరోహణలో 'సరిగమపదనిస' స్వరాలనే ప్రయోగిసూ భీంప్లాస్‌లాగే వినిపించేట్టుగా స్వరపరిచారాయన. 'భలేరాముడు' చిత్రంలోని 'ఓహోమేఘమాల' పాటలో కూడా అదే విధంగా ఆరోహణలో సప్తస్వరాల్ని పలికిస్తూ భీంప్లాస్ లక్షణాలకు దూరం కాకుండా స్వరపరిచారాయన.

యస్. రాజేశ్వరరావు తన తొలిరోజుల్లో జెమినీ సంస్థలో ఉండేవారు. జెమినీ అధినేత వాసన్ మంచి కళాపోషకుడూ, ప్రతిభావంతుల్ని తన సంస్థలో తెచ్చిమరీ పెట్టుకునేవారు. వారితో పని చేయించుకున్నా లేకపోయినా సరే, కొన్ని సమయాల్లో ఆయా కళాకారుల అమూల్యమైన అభిప్రాయాలను స్వీకరించి అమలు జరిపేవారు. తమిళ నాట వాగ్గేయకారుడిగా పేరుపొందిన పాపనాశమ్ శివన్ వంటి సత్సంప్రదాయ నిష్ఠాగరిష్టులు వాసన్ ఆ స్థానంలో ప్రముఖ స్థానంలో ఉండేవారు. 'అటువంటి వారు మీ ప్రయోగాలను ఎలా ఆమోదించేవారు?' అని యస్.రాజేశ్వరరావుగారిని అడిగితే - చెవికి ఇంపుగా ఉండే ఈ ప్రయోగాన్ని ఆయన ఎంతగానో అభినందించేవారని చెబుతూ ఒక ఉదాహరణను కూడా తెలిపారు. ఒకసారి కాంభోజి రాగం ఆలపించవలసివస్తే ఎనిమిది రకాలుగా పాడి వినిపించారట యస్. రాజేశ్వరరావు. దానికి పాపనాశమ్ శివన్ పొంగిపోయి రాజేశ్వరరావుగారి ప్రయోగశీలత్వాన్ని కొనియాడారట.

అటువటి కారణజన్ముల శుభాశీస్సులు జెమినీ సంస్థ రాజేశ్వరరావు వదిలిపెట్టినా ఆయన వెన్నంటే ఉన్నాయి. అందుకే భీంప్లాస్ రాగం ఆరోహణలో తిరిగి సప్తస్వరాలను స్పృశిస్తూ జనరంజకమైన పాటగా 'ఓహో మేఘమాల నీలాల మేఘమాల' పాటను స్వరపరిచారని ఆయన అభిమానులు గర్వంగా అనుకుటారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి. 'భలేరాముడు' మాతృక అయిన 'కిస్మత్'లోని 'ధీరే ధీరే ఆరే బాదల్' పాటకు, 'ఓహో మేఘమాల' పాటకు సంగీతపరంగా ఏ పోలికా లేదు. తెలుగు పాటలో 'ఊరుకోవే మేఘమాల' అనే లైను హిందీ పాటలో 'మేర బుల్ బుల్ సోరహాహా' అనే లైను యొక్క నడకను కొద్దిగా గుర్తుచేస్తుంది తప్ప రెండిటికీ మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఈనాటికే కాదు ఏనాటికైనా స్వరతరాల మధ్య అంతరాలు వచ్చినా సరే - అభిరుచి,

ఆదరణ విషయంలో ఏ అవాంతరంలేని పాటగా 'చల్లగా రావేలా' పాటను ఉదహరించవచ్చు. మొదటి పాటను సావిత్రికి లీల నేపధ్యగానం చేసారు. రెండవ పాటను ఘంటసాల, లీల పాడగా అక్కినేని, సావిత్రి అభినయించారు.

ఇదిలా ఉండగా రెండు పాటల్లోనూ చెప్పుకోతగ్గ తమాషా ఏమిటంటే నిజానికి చరణాలు అతిచిన్నవి. అనుపల్లవిలో వచ్చిన లైన్లే రిపీట్ అయి పల్లవిని చేరుకుంటాయి. అయినాసరే అది మోనాటనస్‌గా జనం ఫీలవ్వలేదంటే ఆయా సంగీత సాహిత్యాలు సన్నివేశంలో ఎంతగా ఇమిడిపోయాయో ఊహించుకోవచ్చు. చిత్తశుద్ధి ఉంటే లక్ష్యసిద్ధి దానంతటదే సమకూర్తుందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏముంటుంది?

---

మురళీధరా హరే మోహనకృష్ణ - మురళీధరా హరేమోహనకృష్ణ
మొరవినవా దేవా - కరుణింపరావా - మురళీధరా హరే - మోహనకృష్ణ
కనిపించినా తండ్రి ఎడమాయెనే - మాకు యెడమాయెనే ||2||
ఎనలేని సంపదలిటులాయెనే - కుంతి బ్రతుకాయెనే
కనరాని కష్టాలు ఎదురాయెనే - కనరాని కష్టాలు యెదురాయనే
కాపాడరారా గోపాలకృష్ణా
మురళీధరా హరేమోహనకృష్ణా

అనుదినము నిన్నే ధ్యానింతురా - మనసార నిన్నే ధ్యానింతురా
కనికారమింతైనా కనవేమిరా - కనికారమింతైన కనవేమిరా
కాపాడరారా గోపాలకృష్ణా
కాపాడరారా గోపాలకృష్ణా - మురీధరా హరేమోహనకృష్ణా
మొరవినవాదేవా కరుణింపరావా - మురళీధరా హరేమోహనకృష్ణా
హరేమోహనకృష్ణా - హరే మోహనకృష్ణా
హరేమోహనకృష్ణా - హరే మోహనకృష్ణా

ఈ పాటను పి.లీల పాడగా సావిత్రి అభినయించింది. సన్నివేశ ప్రాధాన్యంగా అక్కినేని నాగేశ్వరరావు కూడా కనిపిస్తారు. నిజానికి ఈ పాటలో సాహితీ విలువలకన్నా సంగీతానికి సంబంధించిన విలువలు ఎక్కువ. ఒకసారి ఈ పాటను విన్నవారు ఈ పాటకి సంబంధించిన రాగాన్ని అలా ఆలపించుకుంటూనే ఉంటారు. దేశ్ రాగంలో రాజేశ్వరరావు స్వరపరచిన పాటలు తక్కువే అయినా వన్నీ మిన్నగా ఎన్నదగినవి. దేశ్‌రాగంలో ఉన్న ఆర్ధ్రతని సమూలంగా పిండుకుని ఈ పాటనిండా నింపారు రాజేశ్వరరావు.

---

కలమాయమయేనా - తల్రవాత ఇదేనా
వలపించుట మురిపించుట మరపించుటకేనా - కలమాయమయేనా
అనురాగ సుధాధార వర్షింపగనేలా అలరింపగనేలా
అనురాగ సుధాధార వర్షింపగనేలా అలరింపగనేలా
కొనసాగిన ఆశాలత కృశియించుటకేనా - కలమాయమయేనా
మసారగ ప్రేమించుట విలపించుటకేనా తలవంచుటకేనా ||2||
మురిపించుటకేనా - కలమాయమయేనా

ఈ పాటను పి.లీల పాడగా సావిత్రి అభినయించింది. సన్నివేశ ప్రాధాన్యంగా అక్కినేని నాగేశ్వరరావు కూడా కనిపిస్తారు. ఇది పూర్తి రాజేశ్వరరావు మార్కుపాట. మొదటి చరణంలో 'అలరింపగనేలా' రెండవ చరణంలో 'తలవంచుటకేనా' దగ్గర వచ్చే ఆలాపనలు రాజేశ్వరరావు శైలిని స్పష్టంగా చూపిస్తాయి. ఎస్.రాజేశ్వరరావు పాటలను, ఆయన స్వరపరిచే పద్ధతిని సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్న వారికి ఈ పాటను ఇప్పుడు వింటే మరో రెండు పాటలు గుర్తొచ్చి తీరతాయి. అందులో మొదటిది 'అమరశిల్పి జక్కన్న' సినిమాలో

'మధురమైన జీవితాల కథ ఇంతేనా' అయితే రెండవది 'డాక్టర్ చక్రవర్తి' సినిమాలో 'ఎవరో జ్వాలను రగిలించారు'. ఈ మూడు పాటలను ఒకసారి పక్కన పెట్టుకుని వింటే రాజేశ్వరరావు పాటల నడకలోని పోలికలు , తేడాలు సొగసుగా అవగాహనకి వస్తాయి.

ఈ పాటను పి.బి.శ్రీనివాస్ పాడగా రాఘవన్ అభినయించారు. అర్ధాంగి చిత్రంలో 'రాధను రమ్మన్నాడు' పాటను అభినయించిన హరిదాసుగా ఈ రాఘవన్ సినీ ప్రేక్షకులకు గుర్తుండే ఉంటాడు. పి.బి.శ్రీనివాస్‌కు తొలి రోజుల్లో గుర్తింపుని తెచ్చిన పాటలలో 'భయమేల ఓ మనసా' పాటను చెప్పుకోవాలి. టైటిల్స్‌లో పి.బి.శ్రీనివాస్ పేరును 'శ్రీనివాసాచారి'గా ఆ రోజుల్లో వేసారు. సింధు భైరవి రాగచ్ఛాయలో సాగిన ఈ పాటలో సన్నివేశ ప్రాధాన్యంగా సావిత్రి, గిరిజ, అక్కినేని కనిపిస్తారు.

---

అ: బంగరు బొమ్మా బలేజోరుగా
పదవేపోదామూ పై దేశం చూదాము
బంగరు బొమ్మా బలే జోరుగా
పదవే పోదాము పది దేశం చూదాము
ఆ: పైసా పైసా పైసా.. పైసా అ: హూ
ఆ: పైసా ముందు జూపిస్తేను పై సంగతి చూదాము
అప్పుడు లంగరెత్తివేదాం - అప్పనమామా ఓ అప్పనమామా
అ: కలకత్తాపోయి కారులెక్కుదాం - బొంబాయిపోయి బోటు లెక్కుదాం
కలకత్తాపోయి కారులెక్కుదాం - బొంబాయి పోయి బోటు లెక్కుదాం
ఢిల్లీ వెళ్ళీ విమానమెక్కి - ఢిల్లీ వెళ్ళి విమానమెక్కి
మళ్ళీ తిరిగి మనూరొద్దాం ||బంగరు బొమ్మా||
ఆ: దారికర్చుకి దప్పికర్చుకీ డబ్బు దస్కం తయారుచేస్తే
దూరదేశమైనా తెల్లదొరల దేశమైనా
వస్తా పైసా పైసా
అ: పైసాకేమీ పరవాలేదు డబ్బుంటే మనకిబ్బందిలేదు
ఆ: ఓహో..
అ: ఉన్నపాటున కురిపిస్తాను గలగలగలగలా
ఆ:ఏమిటి?
అ: కాసులు - రూకలు
ఉన్నపాటున కురిపిస్తాను - తాతగారి సొమ్ము మన
తాతగారి సొమ్ము
ఆ: తాతగారి సొమ్ముందని నాతో కోతలు కోస్తావేం
మామా కోతలు కోస్తావేం
చేతికిచ్చిమాటాడవోయి - చేతికిచ్చిమాటాడవోయి
నీతో వస్తా - నిను మురిపిస్తా అప్పనమామా
అ: బంగరు బొమ్మా!
ఆ: అప్పనమామా!
అ: బొమ్మా
ఆ: మామా

ఈ పాటను పి.బి.శ్రీనివాస్, జిక్కి పాడగా రేలంగి, సీత అభినయించారు. రేలంగికి పి.బి.శ్రీనివాస్ కంఠం నప్పుతుందని ఎస్. రాజేశ్వరరావు నమ్మారనిపిస్తుంది. అందుకే 'భలే అమ్మాయిలు' చిత్రంలో కూడా ఆయన 'చీటికి మాటికి చీటీకట్టి' అనే పాటలో రేలంగికి పి.బి.శ్రీనివాస్ చేతనే పాడించారు. ఇక ఈ 'బంగారు బొమ్మ' పాట విషయానికొస్తే పాడించటంలోని ఆర్కెస్ట్రేషయిజేషన్‌లో గాని బోలెడంత హడావిడి చేసి ఒక కామెడీ పాటకి కావలసిన సరదాని, ఊపుని తగు పాళ్ళలో కూర్చి పెట్టారు రాజేశ్వరరావు.

---

నా బ్రతుకింతేనా
నా జీవితమంతా తీరని కన్నీరేనా
ఇంటింటను దీపావళి మాఇంటికి లేదా - ఆ భాగ్యమురాదా ||2||
కనిపెంచిన మా తండ్రి కనుపించకపోయే
కనికారమింతలేక తనదారిని పోయే సోదరి ననువిడిపోయె
మనసార వలచి వలపెంచిన ప్రియు డటులాయె మనోహరుడటులాయే ||2||
ఇంటింటను దీపావళి మాఇంటికి లేదా - ఆ భాగ్యమురాదా
సిరిని వదలేనాడో చెల్లాచెదరాయె
నెరనమ్మినవారంతా ఏకాకిజేసిపోయె
కొరగాని బ్రతుకాయె మనసువ్యాకులమాయె
పరితాపము మితిమీరి లోకమంధకారమాయె
ఇపుడెవ్వరు మొరవినువారున్నారు జగాన
కృపజూపెడువారు అకటా లేరొకరైనా
విపరీతమైన లోకము నేనేమనుదానేటులేమనుద్నా
ఇంటింటను దీపావళీ మా ఇంటికిరాదా - ఆ భాగ్యమురాదా

ఈ పాటను పి.లీల పాడగా సావిత్రి అభినయించింది. క్లయిమాక్స్‌లో వచ్చేపాట గనక హీరో దగ్గరనుంచి సినిమాలోగల ముఖ్యపాత్రధారులందరూ సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ఈ పాటకి మాత్రం ఈ సినిమాకి మూలమైన 'కిస్మత్'లోని 'ఘర్ ఘర్ మె దివాలీ హై మెరాఘర్ మెం అంధేరా' పాట ట్యూన్‌ను రాజేశ్వరరావుగారికి అనుకరించక తప్పలేదు అది కూడా కొద్దిగానే.....!

పైన ఉదహరించిన ఏడుపాటలు కాక - 'ఎందుకున్నావో ఓ మాధవా', 'నాడెమైన పచ్చబొట్టు పొడిపించుకోవా', 'హరే మురారే హే చక్రధారే ఇటుసేయమేలా', 'భారతవీరా ఓ భారత వీరా', - అనే మరో నాలుగుపాటలు కూడా ఉన్నాయి. హిందీ చిత్రం 'కిస్మత్'లోని పాటలను, ఈ 'భలేరాముడు' చిత్రంలోని పాటలను సంపాదించి పక్కపక్కన పెట్టుకుని వినడం కనక జరిగితే మన యస్. రాజేశ్వరరావుగారి పైన గౌరవం ఎన్నో రెట్లు ఇనుమడిస్తుందనడంలో ఏ మాత్రం సందేహించనక్కరలేదు.



# ఆ పాత పాట మధురం

రాజా



## చిరంజీవులు

**తెలుగు ప్రేక్షకుడికి** సినిమా పాట మీద అపారమైన అభిమానం, గౌరవం కలిగించిన ఘంటసాల గాయకునిగా చిరస్మరణీయుడు, తెరస్మరణీయుడు. సంగీత దర్శకునిగా స్వరస్మరణీయుడు, స్థిరస్మరణీయుడు...1956లో విడుదలైన చిరంజీవులు చిత్రం ఆయనలోని ఆ రెండు పార్శ్వాలను ద్విముఖంగానే కాక ప్రముఖంగా కూడా ఆవిష్కరించింది. ప్రతిపాటలోను ఏదో ఒక ప్రత్యేకతను నింపుకున్న 'చిరంజీవులు' చిత్రంలోని కొన్ని పాటల గురించి విశేషంగా చెప్పుకోవాలి. తెలుగు సినీకవులందరూ మనఃస్ఫూర్తిగా మొక్కే స్వర్గీయ మల్లాది రామకృష్ణ శాస్త్రి ఇందులోని పాటలను రాశారు..

అల్లవాడే - రేపల్లెవాడే ||అల్లవాడే||
అల్లిబిల్లి పిల్లంగోవి పాటకాడే సయ్యాటకాడే ||అల్లవాడే||
నీలాల కన్నుల నీటుకాడే తెరవాటుకాడే -
వాలారు చూపుల వన్నెవాడే వన్నె చిన్నెవాడే
నీలాటి రేవులు ఏలేవాడే ||నీలాటి||

కన్నార నినుజూచి కవ్వించివాడే ||అల్లవాడే||
గానాల తేనెలు చిందువాడే కనువిందువాడే
మైమరిపించే మాటకాడేమో మాటకాడే
అర విరిసే చిరునవ్వులవాడే ||అర||
అనువైన మనవాడే అందాలవాడే ||అల్లవాడే||

ఈ పాటను ఘంటసాల, లీల, బృందం పాడగా ఎన్.టి.ఆర్, జమున మరికొంతమంది ఉపపాత్రధారులు అభినయించారు. మోహనరాగచ్ఛాయల పైన ఆధారపడిన ఈ గీతాన్ని ఇప్పుడు వినడం తటస్థిస్తే శ్రోతల మనసులలో రకరకాల భావాలు చెలరేగుతాయి. అందుకు ముఖ్యకారణం 'మాయాబజార్' సినిమాలోని సంగీతానికి సంబంధించిన విశేషమే! 'మాయాబజార్' సినిమాకు సంగీత దర్శకునిగా ఘంటసాల పేరువున్నా, అందులోని ముఖ్యమైన నాలుగు యుగళగీతాలూ యస్.రాజేశ్వరరావు స్వరపరిచారన్న విషయం తెలుగు సినీ సంగీతాన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉన్న వారందరికి తెలుసు. అయితే అందులో చాలామంది ఆ నాలుగు పాటల్నీ రాజేశ్వరరావు గారు ట్యూన్ చేయటమే కాకుండా రికార్డింగ్ కూడా చేసేసారని అనుకుంటూ ఉంటారు. కానీ ఆ పాటలు ట్యూన్‌లు 'ఓకే' అయిపోయాక కొన్ని కారణాంతరాల వలన రాజేశ్వరరావుగారు ఆ సినిమా నుండి తప్పుకోగా ఘంటసాలగారు మిగిలిన పాటలను

ట్యూన్ చేయటమే కాకుండా ఈ నాలుగు పాటలకు ఇంటర్ లూడ్‌లు సమకూర్చి రికార్డింగ్ బాధ్యతలు అవీ నెరవేర్చారు. ఆ విషయాన్ని ఈ 'అల్లవాడే రేపల్లెవాడే' పాట ధ్రువీకరిస్తుంది. కావాలంటే 'మాయాబజార్' లోని 'లాహిరి లాహిరి లాహిరిలో' పాటను ఈ 'అల్లవాడే రేపల్లెవాడే' పాటను పక్క పక్కన పెట్టుకుని, ఒకదాని తర్వాత ఇంకొకటి విని చూడండి. రెండింటి రూపకల్పనలోనూ ఎంతపోలిక ఉందో తెలుస్తుంది.

---

అ: చికిలింత చిగురు - సంపంగి గుబురు
చినదాని మనసూ - చినదానిమీద మనసూ ||చికిలింత||
ఆ: మనసైన చినదానికి అందానికీ ||మనసైన||
కనుసైగ మీద మనసూ
అ: ఆ...ఆ...ఆ
ఆ. ఆ...ఆ...ఆ...
అ: చెంపకు చారడేసి కన్నులున చిన్నదీ
చిన్నదాని సిగలో రేకలెన్నో గువ్వకన్ను రైకమీద చుక్కలెన్నో
ఆ: ఎన్నుకో - వన్నెలెన్నుకో - చిన్నెలెన్నుకో ||ఎన్నుకో||
వన్నెచిన్నెలెన్నుకో - ఎన్నికైన చిన్నవాడా
పైరుగాలి ఘుమఘుమలో - చెంగావి చెంగు రిమరిమలో
అ: ఆ...ఆ...ఆ
ఆ: ఆ...ఆ...ఆ

ఆ: దిరిసెన పూవుమీద చిలుకూ ముగ్గులూ
చిన్నారి బుగ్గమీద చిలిపీ సిగ్గులూ
మల్లెల దొంతరలూ మరుమల్లె దొంతరలూ
ఆ: మనసే.. మనసే మరుమల్లెల దొంతర
అ: మన ఊసే - విరజాజి దొంతర
అ: పాలవెన్నెలలో
ఆ: మురిపాలవెన్నెలలో
అ: ఆ...ఆ...ఆ
ఆ: ఆ...ఆ...ఆ చికిలింత

ఈ పాటను ఘంటసాల లీల పాడగా ఎన్.టి.ఆర్, జమున అభినయించారు. సాహిత్యపరంగా చూస్తే పాటనిండా కనిపించేది తెలుగుతనం - తెలుగుధనం! చికిలింత చిగురు, గువ్వకన్ను రైక, పైరగాలి, రిమరిమ, ఊసు, దొంతర ఇలా ఎన్నో మురిపించే పదాలు..! చిన్నారి బుగ్గమీద చిలిపి సిగ్గులు దిరిసెన పూవు మీద చిలికే ముగ్గుల్లా ఉన్నాయట.. ముగ్గులు చిలకటం.. ఎంత భావుకత..'సాహో రామకృష్ణ శాస్త్రి' అని తక్కిన కవులు ఊరికే అన్నారా!? ఇక ట్యూన్ పరంగా చూసుకుంటే పల్లవి లోని స్పీడుకి బుడిబుడి గంతులు వేసే కుందేలు పిల్ల గమనం, చరణాలలో హాయిగా తీసుకునే టేకాఫ్‌కి స్లోమోషన్‌లో పరుగెడుతున్న లేడి పిల్లల పరుగు ఈ రెండూ కళ్ళముందు కనిపిస్తున్నట్టు ఉంటుంది. తర్వాతి రోజుల్లో ఘంటసాల ఇటువంటి పాట మరొకటి చెయ్యలేదేమోనని కూడా అనిపిస్తూ ఉంటుంది.

---

ఆ: ఎందాక? ఎందాక? ఎందాక?
అ: అందాక - అందాక - అందాక ||ఎందాక||
ఆ: ఈ ఉరుకేమిటి ఈ పరుగేమిటి...ఓ...ఓ...ఓ ||ఎందాక||
అ: చివ్వున పోయి రివ్వున వాలి చిలకను సింగారించాలి
ఓ చిలకను సింగారించాలి
ఆ: పువ్వులతోనా అ: రవ్వలతోనే ఆ: ఆ!
అ: ఆ! మా నాన్న కోడలు బంగారు బొమ్మా
ఆ: ఓ...ఓ...ఓ
ఆ: అయితే గియితే అమ్మాయి ఎవరో
అ: ఆడే పాడే అందాల బాల
ఆ: అయితే నువ్వో అ: నేతి మిఠాయి

ఆ: ఆ! అ: ఆ!
ఆ: పక్కింటి అబ్బాయి బంగారు తండ్రి
అ: ఓ...ఓ...ఓ...
అ: కన్నులు నిండే కలకలలే కన్నెకు సొమ్ముగ తేవాలి
నవకాలొలికే నీ చిరునవ్వే చిలుకకు సింగారం కావాలి
కావాలి కావాలి - కావాలి - పరుగున
రావాలి రావాలి - రావాలి
ఆ: రావాలి రావాలి - రావాలి పరుగున
రావాలి రావాలి - రావాలి

ఈ పాటను ఘంటసాల, లీల ఆలపించగా ఎన్.టి.ఆర్, జమున అభినయించారు. కవులలో రామకృష్ణ శాస్త్రిగారి శైలి ప్రత్యేకంగా ఉంటుంది. ఎందాక, అందాక, ఎంచక్క, నవకాలు ఇవన్నీ ఆ పరిమళాన్ని పట్టి ఇచ్చే పదాలు. ఇందులో నవకంలాంటివి ప్రస్తుతం వేటూరి సుందర్రామ్మూర్తి గారి పాటలలో మాత్రమే కనిపిస్తూ ఉంటాయి. మంచిపాటకి చెవియొగ్గి వినే ప్రతి శ్రోత గుండెలోనూ నేటికీ నిలిచిపోయిన పాటలలో ఇదొకటి. అందుకు సాక్ష్యం - ఇవాళ్టికీ ఆంధ్రప్రాంతాలలో కొన్ని చోట్ల ఎవరైనా ఎక్కడికైనా వెళుతుంటే 'ఎందాక ఎందాక ఎందాక' అని సరదాగా ట్యూన్‌లో అడగటం గమనించవచ్చు.

---

ఏనాటికైనా నీ దాననే
ఏనాటికైనా నీ దాననే
చిననాటి మాటలూ
మనసైన పాటలూ
మటుమాయమౌనా
మనపూలబాటలూ ||ఏనాటికైనా||
కనులార చూడవ
దయలేని వాడవ
మిగిలేవి - తీరని కోరికలా
చిననాటి మాటలూ
మనసైన పాటలూ
మటుమాయమౌనా
మన పూలబాటలూ ||ఏనాటికైనా||
నిలచిన వలచిన నీ నీడనేగా
చివురుకు జీవము నీవేగా
చిననాటి మాటలూ
మనసైన పాటలూ
మటుమాయమౌనా
మనపూలబాటలూ ||ఏనాటికైనా||

ఈ పాటను పి.లీల పాడగా జమున అభినయించారు. ఈ పాటలో గమనించవలసింది ఏమిటంటే చరణాలలోని వాక్యాలు రెండే మిగిలినవన్నీ అనుపల్లవి నుంచి తీసుకుని పల్లవి వైపు నడిపించేవే. పునరుక్తి అంతగా ఉన్నా పాట నిలబడిందంటే అందుకు కారణం తేలికగా పట్టుబడే సంగీత సాహిత్యాలే!

---

మనసు నీదే - మమత నాదే
నాదానవే - నే నీ వాడనే ||మనసు||
చివురు మామిడి పందిళ్ళనీడా
నిలిచింది చిలక నాకోసమే ||చివురు||
చివురింటి చిన్నదానా - నా దానవే - నేనీ వాడనే ||మనసు||
కనుల కాటుక కళ్యాణ తిలకం
నగుమోము కలకల - నా కోసమే కనుల
చిరునవ్వు చిన్నదాన - నా దానవే - నేనీవాడనే ||మనసు||
పువ్వులు జల్లీ - పన్నీరు జల్లి
దీవించి మీ వారు పంపారులే ||పువ్వులు||
మనసైన చిన్నదానా - మీ ఇంటికి - మీ ఇంటికి ||మనసు||

ఈ పాటను ఘంటసాల పాడగా ఎన్.టి.ఆర్, అభినయించారు. ఈ పాటలో కూడా మనకు కనిపించేది చిన్న చిన్న చరణాలు, తేలికైన సాహిత్యం నోటికి పట్టుబడే వరస! కాకపోతే కొద్దిగా గమనిస్తే పాడనడకలో 'ఆగ్'(తెలుగులో ప్రేమలేఖలుగా వచ్చింది) చిత్రంలో 'చోటీసీ యే జిందగానీ ' (తెలుగులో 'పాడు జీవితము యవ్వనము' అనే పాటగా వచ్చింది) పాట గుర్తొస్తూ ఉంటుంది.

---

తెల్లవారవచ్చె - తెలియక నా సామి
మళ్ళీ పరుండేవు లేరా మళ్ళీ పరుండేవు లేరా
మళ్ళీ పరుండేవు మసులుతూ ఉండేవు
మారాము చాలింక లేరా
మారాము చాలింక లేరా ||తెల్లవార||
కలకలమని పక్షి గణములు
చెదిరెను కళ్యాణ గుణధామ లేరా ||కలకల||
తరుణలందరు దధి చిలికే వేళాయే

దైవరాయ నిదురలేరా తరుణలందరు దధి చిలికే వేళాయే
దైవరాయ నిదురలేరా దైవరాయ నిదురలేరా
నల్లనయ్యా రారా! ననుగన్నవాడా!
బుల్లి తండ్రి రారా బుజ్జాయి రారా
నాన్నా మీ అమ్మ గోపెమ్మ పిలిచేను
వెన్నతిందువుగానీ రారా
నాన్నా మీ అమ గోపెమ్మ పిలిచేను
వెన్నతిందువుగానీ రారా వెన్న తిందువుగాని రారా

మోహనరాగానికి ప్రామాణిక గీతంగా నిలిచిపోదగ్గ స్థాయిలో ఈ పాట స్వరపరచబడింది. సాధారణంగా మేల్కొలుపు పాటలకు ఉపయోగించే 'భూపాల' రాగానికి బదులు మోహన రాగాన్ని ఎన్నుకోవటంలో ఔచిత్యమేమిటన్న ప్రశ్నకు మోహనని హిందుస్థానీ సంప్రదాయంలో 'భూపాలీ' అని అంటారనే చమత్కారమే తగిన సమాధానం. కోమల స్వరాలు పలికే భూపాల రాగాన్ని మరపిస్తూ తీవ్రస్వరాలు తొణికే మోహనరాగంలో ఈ పాటని మలచుకుంటూ పి.లీల సంగీత జీవితంలో ఓ మరుపురాని మజిలీగా తీర్చిదిదడంలో ఘంటసాల ప్రజ్ఞను మాటలతో కొలిచి చూపలేం. మొదటి చరణం తరువాత పల్లవి రిపీట్ కాకపోవటం, పాటలోని చాలా పంక్తులు పలుమార్లు పునరుక్తి అవుతున్నా రసోత్పత్తికి భంగం కలగకుండా స్వరపరచడం.. ఈ పాట ప్రత్యేకతలలో కొన్ని. సాహిత్యపరంగా చెప్పుకోవాలంటే ఈ పాటకు మాతృకగా ఓ జానపదగీతం ఉంది. అదిలా ఉంటుంది:

తెల్లవారెనమ్మ, చెల్లనేమందు నల్లని నా సామిలేరా
మరల పడుకునేవు మసలుచున్నావు మర్యాద గాదిక పోరా ||తెల్ల||
కలకలమని పక్షి గణములు కూసెను కాంతుడ ఇక నిద్రలేరా
జలజారి కాంతులు వెలవెల బారెను తలుపు తీసి చూడలేరా ||తెల్ల||
తరుణులందరు లేచి దధి చిల్కువేళాయె తడవుండ రాదింక లేరా
అరగంట చూపుతో నట్టిట్టి చూచేవు నెరజాణ వౌదువులేరా ||తెల్ల||

ఈ జానపద మాతృకలో అయిదు చరణాలున్నా సినిమా వరకూ రెండు చరణాలనే తీసుకున్నారు. స్వతంత్రంగా, అత్యద్భుతంగా రాయగలిగి ఉన్నా సరే గీత రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి ఆ మాతృకలోని చరణాలనే తీసుకుని మార్చుకోవటానికి గల కారణం మల్లాది వారికి ఆ సాహిత్యం పట్ల గౌరవమే తప్ప వేరొకటి కాదు.

---

మిగిలింది నేనా - బ్రతుకిందుకేనా... ఇందుకేనా..
మిగిలింది నేనా - బ్రతుకిందుకేనా
మరచేవా ఎడబాసి - మాయమ్మావా ||మిగిలింది||
కన్నార చూసింది - కలకలా నవ్వింది ||కన్నార||
మనసార దరిచేరి మురిసిపోయింది
మనసైన పాట... మనసైన పాట.. మన పూలబాట
మరచేవా ఎడబాసి - మాయమ్మావా ||మిగిలింది||

నీవు నేను కలసి కలగన్న మన ఇల్లు ||నీవు నేను||
ఈ తీరై కన్నీరై కూలిపోయెనా
ఆకాశమేలే అలనాటి మన ఊహ ||ఆకాశమేలే||
ఈ తీరై కన్నీరై కూలిపోయెనా ||మిగిలింది||
కనుల వెలుగులేదు నీ పలుకు వినరాదు
మనసు నిలువలేదు నిన్ను మరవలేదు
భరమై - విషమై - రగిలే ఈ బ్రతుకెందుకో

ఈ పాటను ఘంటసాల పాడగా ఎన్.టి.ఆర్. అభినయించారు. ఈ పాటలో పల్లవి ముగియగానే మొదలయ్యే ఇంటర్‌లూడ్‌ని అందుకునే పద్ధతిని గురించి ముఖ్యంగా చెప్పుకోవాలి. పల్లవి చివర్న గల ల్యాండింగ్ నోట్ - ఇంటర్ లూడ్ మొదలయ్యే టేకాఫ్ నోట్ - ఈ రెండిటికీ సమన్వయం కుదిరితే అది ఎంత చక్కగా ఉంటుందో - అసలు ఇంపుగా అమరటం అంటే అర్థం ఏమిటో తెలుస్తుంది. ఈ పాటకి సంబందించిన మరొక విషయం ఏమీటంటే ఇది హరికాంభోజి స్వరాలమీద స్వరపరచబడింది. హరికాంభోజి స్వరాల మీద ఘంటసాల కూర్చిన మరొకపాట "మరువలేనురా - ఓ ...పంచదార వంటి పోలిసెంకటసామి నిన్ను నేను మరువలేనురా"! ఈ పాట మరచిపోయే తెలుగువాడుండడు. ఈ పాట ఇంటర్లూడ్లు, 'మిగిలిందినేనా' పాట ఇంటర్లూడ్లు ఒకదాని తరువాత ఇంకొకటి విని చూడండి. ఎంత పోలిక కనబడుతుందో మీకు తెలుస్తుంది. "అరె! అది హుషారు గీతం, ఇది విషాద గీతం.. అదెలా!?" అని అనిపించటం సహజం.. మూలం ఒకే రాగానికి సంబంధించిన స్వరాలు అనితెలిస్తే ఆ అనుభూతి చాలా బావుంటుంది. ప్రయత్నించి చూడండి. ఇదిలా ఉండగా 'భరించునది' అనే అర్థంలో మల్లాది వారు ఈ పాటలో 'భరమై' అనే పదాన్ని వాడారు. తర్వాత తర్వాత ఈ పదాన్ని ఇంకే సినీగీతం లోనూ వాడినట్టు లేదు.

అ: కనుపాప కరవైన కనులెందుకో
తనవారే పరులైన బ్రతుకెందుకో ||కను||
ఆ: విరజాజి శిలపైన రాలేందుకే
మరుమల్లె కెంధూళి కలిసేందుకే ||విర||
మనసైన చినదాని - మనసిందుకే - రగిలిందుకే ||కను||
అ: అలనాటి మురిపాలు కలలాయెనా
చిననాటి కలలన్ని కథలాయెనా
తలపోసి తలపోసి కుమిలేందుకా
తమ విందుకా ||కను||

ఆ: తనవారు తనవారె విడిపోరులె
కనుమూసి గగనాన కలసేరులే ||తన ||
ఆ: ఏనాటికైనా నే నీదాననే - నీదాననే
అ: చిననాటి మన పాట మిగిలేనులే
కలకాలమీగాధ రగిలేనులే
కలకాల మీగాధ రగిలేనులే
రగిలేనులే..

ఈ పాట నటభైరవి రాగంలో స్వరపరచబడింది. ఘంటసాల, లీల గానం చేయగా ఎన్.టి.ఆర్, జమున అభినయించారు. ఈ పాటని ఆలపించుకుంటే బరువెక్కని గుండె ఉండదని, ఒకవేళ అలా ఉంటే ఆ గుండె సానుభూతికే తప్ప రసానుభూతికి నోచుకోలేదని అనుకోవాలి. తర్వాతి తరంలో ఈ నటభైరవి రాగంలో ఎన్నో సినీగీతాలు వచ్చినా అందులో ఎక్కువ భాగం దైవత్వాన్ని (ద అనే స్వరాన్ని) మార్చుకుంటూ ఉన్నవే. నటభైరవి రాగానికుండే స్వరాలను యధాతదంగా వాడుకుంటూ వచ్చిన ఈ పాటలో సంగీతం, సాహిత్యం, గాత్రయుగళం వీటన్నిటి ప్రతిభావ్యుత్పత్తులూ పతాకస్థాయిలో సమకూరాయి. సరితూగాయి.



# ఆ పాత పాట మధురం

## రాజా



### పాండురంగమహాత్మ్యం

**వివిధరంగాలకు** చెందిన అత్యుత్తమ చిత్రాలను నిర్మించిన ఎన్.ఎ.టి సంస్థ తెలుగు చలన చిత్ర చరిత్రలో ఓ ప్రతిష్ఠాత్మక సంస్థగా ప్రజల హృదయాలలో నిలిచిపోయింది. ఎన్.టి.ఆర్, ఆయన సోదరుడు త్రివిక్రమరావు మూలస్థంభాలుగా రూపుదిద్దుకున్న ఈ సంస్థలో రచయిత సీనియర్ సముద్రాల, సంగీత దర్శకుడు టి.వి.రాజు వంటి ప్రముఖ వ్యక్తుల కృషి కూడా ఉంది. సీనియర్ సముద్రాల (రాఘవాచార్య)కు ఆయన కుమారుడు సముద్రాల జూనియర్ (రామానుజాచార్య) చేదోడువాదోడుగా ఉండేవారు. తరువాత సముద్రాల జూనియర్ ఎన్నో చిత్రాలకు స్వతంత్రంగా రచన చేసినా ఎన్.ఎ.టి సంస్థకు ఆయన రాసినవి ప్రత్యేకంగా ఉండేవి. అందులో ఎన్నదగినది, మిన్న అయినది అయిన చిత్రం 1957 లో వచ్చిన పాండురంగ మహత్యం.

ఈ చిత్రానికి మాటలు, పాటలు సముద్రాల జూనియర్ రాశారు. ఇక టి.వి.రాజు సంగీతం గురించి చెప్పనే అక్కరలేదు. ప్రతిపాటా పదిమందీ మెచ్చుకునే విధంగా స్వరపరిచారు. అన్నీ మంచిపాటలే గల ఈ చిత్రంలో ప్రజలు అత్యధికంగా మెచ్చుకున్న పాటలలో కొన్ని...

తరం తరం నిరంతరం యీా అందం
ఓహో ఆనందం అందం ఆనందం ||తరం తరం||
ఆనంద లీలే గోవింద రూపం
ఈ మాట అంటే పెద్దలకు కోపం ||తరం తరం||
మోజులే రేపు చిరునవ్వూ చిందులూ
జాజి చెక్కిళ్ళ సోయగాల విందులూ ||మోజు||

వరద పొంగేనులే వయసు సింగారమూ
అనుభవించీ సుఖించీ తరించరా..హోయ్ ||తరం తరం||
మోహమూరించు పరువాల గోలకు
ముసుక తెరచాటు అలవాటులేలనే
నేడు వెనకాడినా రేపు ఒనగూడునా
అనుభవించీ సుఖించీ తరించరా..హోయ్ ||తరం తరం||

ఈ పాటను ఘంటసాల పాడగా తెరపై ఎన్.టి.రామారావు ప్రధాన పాత్రధారిగా అభినయించారు. బి.సరోజాదేవి, మరికొందరు ఉపపాత్రధారులు సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. 'హ' కారాన్ని పాటలలో పెట్టి అనిర్వచనీయమైన ఆనందాన్ని, మత్తుని కలగచేసిన ఒకవడి ఘంటసాలదే.. తెలుగు సినీ సంగీతానికి సంబంధించినంత వరకు ఆ ప్రక్రియలో ఎవరు పాడవలసి వచ్చినా ఆయనను అనుకరించక తప్పదు. లేదా కనీసం గుర్తుచేసే విధంగానైనా పాడక తప్పదు. ఈ పాటలో 'అహహహా' అని ఘంటసాల అంటున్నపుడు

ఆయన కంఠంలో తొణికిసలాడిన జిలుగులు, సొగసులు కేవలం అవి తమ వీనుల ద్వారా అందుకోగలిగిన వారికే తెలుస్తుందది. సాహిత్యపరంగా చూసుకుంటే రెండవ చరణంలోని – 'మోహమూరించు పరువాల గోలకు ముతక తెరచాటు అలవాటులేలనే నేడు వెనకాడినా రేపు ఒనగూడునా' అనే వాక్యాలను వివరణాత్మకంగా విశ్లేషించవలసి వస్తే శృంగారపరంగా ఎంతో డెప్త్‌కి వెళ్ళి చెప్పవలసి ఉంటుంది. ఒకొక్కసారి అది ఘాటుగా కూడా ఉంటుంది. అంచేత ఆ వాక్యాలను ఉపరితలం మీదనుంచే స్పర్శించి ఇందులో డెప్త్ ఉంది అని చిన్నగా ఆలోచనను రేకెత్తించగలిస్తే చాలు. ఆ తరువాత ఎవరి సంస్కారాన్ని బట్టి వారు తర్కించుకుంటారు.

---

ఆమె: నీవని నేనని తలచితా
నీవే నేనని తెలిసితిరా ||నీవని||
నిజమిది
అతడు: ఋజువేది
ఆమె: ఊహు హు హూ...
అతడు: అహాహాహా ||నీవని||
ఆమె: కలయగ జూచితి నీకొరకైనే ||కలయగ||
కనుపాపలలో కనుగొన్నారా ||కనుపాప||
అతడు: ఔనో కాదో నే చూడనా
నీవని నేనని తలచితినే
నీవే నేనని తెలిసితినే
అతడు: కలవరపాటున కల అనుకుంది ||కలవర||
కాదనుకొందు కళా నీముందు ||కాదను||
ఆమె: కాదు సఖా కల నిజమేలే ||నీవని||

'నీవని నేనని తలచితిరా' పాటను ఘంటసాల, సుశీల పాడారు. తెరపై ఎన్.టి.ఆర్, బి.సరోజాదేవి అభినయించారు. 'నటభైరవి' రాగాన్ని ప్రధానంగా తీసుకుని ఈ పాటని అల్లుకున్నారు. 'ని' అన్న స్వరాన్ని మరోసారి వేస్తే ఈ రాగం కీరవాణి రాగమైపోతుంది. అలా రెండు 'ని'లని (కైశిక నిషాదం, కాకలి నిషాదం) ప్రయోగిస్తూ కీరవాణి రాగంలా ధ్వనించకుండా ఎంతో జాగ్రత్తగా మలిచారు టి.వి.రాజు కథ ప్రకారం వేశ్య వ్యామోహంలో చిక్కుకున్న కథానాయకుడు ఆమెతో కలిసి పాడిన పాట ఇది. ఆ రోజుల్లో కథా చర్చల్లో సంగీత దర్శకుని పాత్ర కూడా ప్రముఖంగా ఉండేది కనుక ఈ పాట ప్రాధాన్యత తెలిసిన టి.వి.రాజు పాటలో ఓ రకమైన వశీకరణ శక్తిని నింపి మరీ ట్యూన్ చేశారనిపిస్తుంది. దానికి నిదర్శనం – ఇంటర్ లూడ్స్ అన్నీ అరబిక్ సంగీత రీతుల్లో ఉండటమే. ఈ రకమైన పర్షియన్, అరబిక్ సంగీతానికి వశీకరణ సామర్థ్యం ఉంటుందని లోగడ 'విప్రనారాయణ' చిత్రంలో 'ఎందుకోయీ తోటమాలి' పాటకు సంబంధించిన విశ్లేషణతో వివరించటం జరిగింది. మరికాస్త లోతుల్లోకి వెళితే, 'పాండురంగ మహత్యం' గాని ఆళ్వారులకు సంబంధించిన 'విప్రనారాయణ' గాని, పౌరాణిక నేపథ్యంలో రూపుదిద్దుకున్నవే. ఆ చిత్రాల్లోని పాటలకు సనాతన సంప్రదాయపు పోకడలతో కూడిన వరసలు కాకుండా అరబిక్, పర్షియన్ సంగీత రీతుల్ని ఆశ్రయించటం ఎంతవరకు సబబు – అన్న ఆలోచన కూడా రానీయనంత ఉన్నతంగా, సహజంగా ఇమిడ్చి పాట అందాలను ఇనుమడింప చేసిన టి.వి.రాజుని (విప్రనారాయణ సంగీత దర్శకుడైన ఎస్.రాజేశ్వరరావుతో పాటు) అభినందించకుండా ఉండలేం.

---

ఆమె: వన్నెల చిన్నెల నెరా
కన్నెల వేటల దొరా
అతడు: జాణవు నా హృదిరాణివి నీవె
కూరిమి చేరగ రావే చెలీ
ఆమె: వెన్నెల చిన్నెల నెరా
కన్నెల వేటల దొరా
ఆమె: కనివిని ఎరుగముగదా
ఇది ఎంతో వింత సుమా
చాలులే సతికి కన్నులే గీటు
చతురులే పెనిమిటైనా
వన్నెల చిన్నెల నెరా
కన్నెల వేటల దొరా
అతడు: అలక లేలనే చెలీ
అలవాటున పొరపాటదీ
అలక లేలనే చెలీ
అలవాటున పొరపాటదీ
మురిసిపోవాలి చల్లనీ రేయి
పరిమళించాలి హాయీ
ఆమె: వన్నెల చిన్నెల నెరా
కన్నెల వేటల దొరా
అతడు: జాణవు నా హృది రాణివి నీవె
కూరిమి చేరగ రావే చెలీ

ఈ సందర్భంగా మరో విషయాన్ని కూడా చెప్పుకోవాలి.. కర్ణాటక సంగీతానికి సంబంధించి శాస్త్రీయపరమైన స్వరజ్ఞానం కావలసినంత ఉన్నాసరే అటు పాశ్చాత్యత్య సంగీతమన్నా ఇటు హిందూస్థానీ సంగీతమన్నా టి.విరాజుగారికి పంచప్రాణాలు. అందుకే ఆయన పాటల్లో ఈ మూడు ధోరణులు ఎలా కావాలంటే అలా ఆక్రమించుకుంటూ ఉంటాయి. ఒక్కోసారి కేవలం తొంగిచూస్తూ మాత్రమే ఉంటాయి. కావాలంటే 'వన్నెల చిన్నెల నెరా' పాట పల్లవిలోని సాహిత్యాన్ని పక్కన పెట్టేసి లైట్‌గా ఆలపించుకుని చూడండి. అందులో స్వదేశీయత తక్కువగా ఉన్నట్టనిపిస్తుంది. ఇదిలా ఉండగా పాట మొత్తం హవాయిన్ గిటార్ ఉపయోగించిన తీరు గమనిస్తే హృదయానికి దగ్గరగా ఉండే నాళాలని తంత్రులుగా చేసుకుని మీటేరా అన్నంత జలదరింపు కలుగుతూ ఉంటుంది. ఈ పాటల్లో మరో ప్రత్యేకత కూడా ఉంది. అది ఘంటసాల, లీల కంఠస్వరాలలోని మాధుర్యాని చిక్కగా చేసి పిండుకున్న పద్ధతి, చరణం తర్వాత వచ్చే పల్లవిలో 'వన్నెల చిన్నెల నెరా కన్నెల వేటల దొరా' అని లీల అంటుంటే అదే ట్యూనులో ఘంటసాల 'అహహ అహహ అహో' అని సమాంతరంగా అనటం, ఆ తర్వాత వచ్చే అనుపల్లవిలో 'జాణవు నా హృది నా రాణివి నీవే' అని ఘంటసాల అంటుంటే పి.లీల అదే వరసని హమ్ చేయటం ఇవన్నీ పాటని ఊహించని ఎత్తులకి తీసుకు వెళతాయి. ఈ పాటని ఎన్.టి.ఆర్, అంజలీదేవిపై చిత్రీకరించారు.

పూర్వపు రోజుల్లో మాటలు - పాటలు ఒకరే రాయటం వల్ల కథలో ఇమిడే పాటలు, కథతో సంబంధం ఉండే పాటలు వచ్చేవనడానికి ఈ చిత్రంలోని పాటల్ని కూడా చెప్పుకోవచ్చు. 'నీవని నేనని' పాటలో 'కాదనుకొందు కళా నీ ముందు' (పాత్రపేరు కళావతి) ఒక ఉదాహరణ అయితే 'వన్నెల చిన్నెల నెరా' పాట మొత్తం అంతా మరో ఉదాహరణ. స్త్రీ వ్యామోహపరుడైన కథానాయకుడు తన భార్యకు(కూడా) ఒక సన్నివేశంలో కన్నుగీటుతాడు. ఆ తర్వాత వచ్చే ఈ పాటలో ఆ చర్యకి ఆశ్చర్యపోయిన కథానాయిక మనోభావాలు మొదటి చరణంతో ప్రతిఫలిస్తూ ఉంటాయి. 'ఇవన్నీ మనకు మామూలే' అంటూ చాలా తేలికగా తీసుకునే కథానాయకుని వ్యసన మనస్తత్వం రెండో చరణంలో ప్రతిబింబిస్తూ ఉంటుంది. అందుకే ఈ పాటలు వింటుంటే ఈనాటికీ మనకు మొత్తం కథ గుర్తుకొచ్చేస్తూ ఉంటుంది. నిజానికి పాటల ప్రయోజనం కూడా చాలా వరకు అదే

---

ఆనందమూ...ఓ
ఆనందమిదేనోయి సఖా
ఆగదు కాలం
మనేది కొద్దికాలం
క్షణాల ఇంద్రజాలం ||ఆనందమూ||
ఉన్నది నేడు
మరి రేపనుమానం..ఓ ||ఉన్నది||
పనిలేనిపని పరాలని
తలచువిధానం
ఈ జీవిత బహుమానం
సుఖసారపు పానం
ముచ్చటగొన్నా
చెలి నీజతనున్నా.. ఓ ||ముచ్చట||
మురిపాల సరాగాల
సుఖలీలలకన్నా
ఆనందపు పరమావధి
వేరే ఇక సున్నా ||ఆనందమూ||

ఈ పాటను పి.సుశీల పాడగా బి.సరోజాదేవి అభినయించారు. కథా పరంగా కథా నాయకుని మత్తులో ముంచే సన్నివేశం కనుక ఎన్.టి.రామారావు కూడా పాటంతా కనిపిస్తారు. ఈ పాటలో ముఖ్యంగా చెప్పుకోవలసింది సుశీల కంఠం గురించి! ఆ రోజుల్లో ఆమె కంఠం ఎంత వాడిగా ఉండేదో తెలియచేసే పాటలలో ఇదొకటి! ఇక సాహిత్యం గురించి చెప్పాలంటే - భాషతో ఆకట్టుకునే జూనియర్ సముద్రాల మార్కు అక్షరేంద్రజాలం పాటంతా పరుచుకుని మరీ కనిపిస్తుంది.

---

అమ్మా.. నాన్నా
అమ్మా...అమ్మా అని అరచినా ఆలకించవేమమ్మా
ఆవేదన తీరు రోజు ఈ జన్మకు లేదా ||అమ్మా||
పదినెలలు నను మోసి పాలిచ్చి పెంచి
మదిరోయక నాకెన్నో ఊడిగాలు చేసిన
ఓ తల్లీ నిను నలుగురిలో నగుబాటు చేసితీ
తలచకమ్మా తనయుని
తప్పులు క్షమించవమ్మా ... అమ్మా.. అమ్మా..

దేహము విజ్ఞానము బ్రహ్మోపదేశమిచ్చి
ఇహపరాలు సాధించే హితమిచ్చిన తండ్రిని
కనుగానని కామమున ఇలువెడల నడిపితీ
కనిపిస్తే కన్నీళ్ళతో కాళ్ళుకడుగుతా నాన్నా.. నాన్నా.. నాన్నా...
మారిపోతినమ్మా నాగతి ఎరిగితినమ్మా
మీ మాట దాటనమ్మా ఒకమారు కనరమ్మా
మాతాపిత పాదసేవ మాధవసేవేయని
మరువనమ్మ ||మాతా||
నన్ను మన్నించగరారమ్మా.. అమ్మ.. అమ్మా ||అమ్మా అని||

ఏ పాద సీమ కాశీ ప్రయాగాది ప
విత్ర భూములకన్న విమలతరము
ఏ పాదపూజ రమాపతి చరణాబ్జ
పూజలకన్నను పుణ్యతమము
ఏ పాద తీర్థము పాప సంతాపాగ్ని
ఆర్పగా జాలిన అమృతఝరము
ఏ పాదస్మరణ నాగేంద్రశయ సుధ్యా
నమ్ముకన్నను మహానందకరము
అట్టి పితురుల పదసేవ ఆత్మ మరచి
ఇహపరమ్ములకెడమై తప్పించువారి
కావగలవారు లేరు ఈ జగాన వేరే
నన్ను మన్నించి బ్రోవుమో అమ్మా....

'అమ్మా అని అరచినా' పాట సింధుభైరవి రాగంలో కూర్చబడింది విస్తృమైన పరిధిగల ఈ రాగాన్ని హిందుస్థాని సంప్రదాయంలో 'భైరవి' అని అంటారు. హనుమత్తోడి రాగానికి జన్యరాగామైన ఈ సింధుభైరవి రాగాన్ని అన్ని రకాల అనుభూతుల్ని ఆవిష్కరించటానికి ఉపయోగించుకున్నారు మన సంగీత దర్శకులు. అయితే భక్తి, విషాదం ఈ రాగంలో బాగా పండుతాయని 'అమ్మా అని అరచినా' పాట ద్వారా అనిపిస్తుంది. కథానాయకుని మనస్తత్వం విషాదయోగం నుండి భక్తి మార్గానికి పయనించనునదన్న కథా క్రమాన్ని సూచ్యప్రాయంగానే కాకుండా సన్నివేశపరంగా కూడా బలంగా హత్తుకోవటానికి ఈ రాగం ఎంతగా దోహదం చేసిందో పాట విన్న వారికి బాగా అనుభవమవుతుంది. సాధారణంగా బాధతో గుండె బరువెక్కినప్పుడు కంఠం రుద్ధమైపోతుంది. అప్పుడు పాటే కాదు మాట కూడా స్పష్టతను కోల్పోతుంది. కానీ శోకరసానికి జీవం పోస్తూ, విన్నవారి హృదయాలలో సానుభూతి రసానుభూతి కలిగేలా గాద్గదికగళంతో అనితర సాధ్యంగా ఘంటసాల పాడే పద్ధతికి ఆ తర్కం తలపులోంచి పారిపోతుంది. మనసంతా ఘంటసాల స్వరమాధుర్యంతో మార్మోగిపోతుంది. ఇక సాహిత్యపరంగా చెప్పాలంటే - సముద్రాల (జూనియర్) లోతుల కెళ్ళి రాశారనిపిస్తుందీ పాటని. రెండో చరణంలో ఉన్న 'దేహము విజ్ఞానము బ్రహ్మోపదేశమిచ్చి ఇహపరాలు సాధించే హితమిచ్చిన తండ్రిని' అన్న వాక్యాలే అందుకు ఉదాహరణ. శరీరానికి ప్రాణాధారమైన బీజోత్పత్తికి కారకుడు తండ్రి. అహం బీజః ప్రధః పితా (తండ్రిగా నేనే బీజమునై ఉన్నాను) అంటూ భగవద్గీతలో చెప్పినదీ అదే ఇహలోకానికి సంబంధించిన శరీరంతో పరలోకానికి సంబంధించిన విజ్ఞానాన్ని

సాధించటానికి కావలసిన హితవే బ్రహ్మోపదేశం. అందుకే ఉపనయనంలో గాయత్రిమంత్రాన్ని వటువు చెవిలో తండ్రి చేత చెప్పిస్తారు. తండ్రి యొక్క ప్రాధాన్యతని, ప్రాముఖ్యతని చెప్పటానికి సముద్రాల ఎన్నుకున వస్తువు ఎంత ప్రశస్థంగా ఉందో తెలియచేయటానికి ఇంతకన్నా వేరే ఉదాహరణ ఏముంది? తెలిసిన మంచి విషయాన్ని ప్రజలకు ఉపయోగపడేరీతిలో చెప్పడంలోనే కవి జన్మకు సార్థకత చేకూరుతుంది. ఆ రీతిలో ఈ గీతాన్ని రాసిన సముద్రాల (జూనియర్), ఆయనలోని కవితాత్మకు 'అహం బీజః ప్రధః పిత' అన్నట్టుగా ప్రేరకుడైన సముద్రాల సీనియర్ ఈ సందర్భంగా అభినందనీయులు. ఈ పాట తరువాత వచ్చే పద్యం 'సింహేంద్ర మధ్యమం' రాగంలో స్వరపరచబడింది. పద్యం తెలుగు వాడి సొత్తు. సిన్మాలకు సంబంధించినంత వరకు పాటలకే కాక పద్యాలకుకూడా అపూర్వమైన గౌరవాన్ని కట్టబెట్టిన మహా కళాకారుడు ఘంటసాల. ఆ విషయం ఈ పద్యంలో మరింత తేటతెల్లమవుతుంది. కవి ఎంత చందోబద్దంగా రాసినా అనుభూతికోసం ఛందస్సును కూడా అతిక్రమించి ఘంటసాల పాడతారని చెప్పటానికి కూడా ఈ పద్యం ఉపకరిస్తుంది. కావాలంటే ఈ పద్యాన్ని దగ్గర పెట్టుకుని ఆడియో ద్వారా విని చూడండి.'కావగలవారు లేరు. లేరు ఈ జగాన వేరే' అంటూ ఘంటసాల 'లేరు' అనే పదాన్ని రెండుసార్లు పలకటాన్ని గమనించవచ్చు .

---

హే..కృష్ణా..ముకుందా. మురారీ.
జయకృష్ణా ముకుందామురారీ ||జయ||
జయ గోవిద బృందావిహారీ
దేవకి పంట వసుదేవు వంట ||2||
యమునను నడిరేయి దాటితివంట
వెలసితివంట నందుని ఇంట ||2||
వ్రేపల్లె ఇల్లాయ నంటా
నీ పలుగాకి పనులా గోపెమ్మ ||2||
కోపించి నిను రోట బంధించెనంట
ఊపున బోయి మాకుల గూలిచి
శాపాలు బాపితివంట ||కృష్ణా ||

అమ్మా తమ్ముడు తినేనూ
చూడమా అని రామన్న తెలుపగా
అన్నా అని చెవి నులిమి యశోద
ఏదన్నా నీ నోరు చూపుమనగా...
చూపితివట నీ నోటను
బాపురే పదునాల్గుభువన భాండమ్ముల
ఆ రూపము గనిన యశోదకు
తాపమునశియించి
జన్మ ధన్యతగాంచెన్
కాళీయ ఫణి ఫణ జాలాన ఝుణ ఝుణ
కేళీఘటించిన గోప కిశోరా
కంసాది దానవ గర్వాపహార
హింసా విదూరా పాప విదారా ||కృష్ణా ||

కస్తూరీ తిలకం లలాట ఫలకే
వక్షస్థలే కౌస్తుభం నాసాగ్రే నవమౌక్తికం
కరతలే వేణుం కరే కంకణం
సర్వాంగే హరిచందనంచ కలయం కంఠేచ ముక్తావళీమ్
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణీ
విజయతే గోపాల చూడామణీ

లలిత లలిత మురళీ స్వరాళీ ||లలిత||
పులకిత వనపాలీ గోపాలీ.. పులైత వనపాలీ
విరళీకృత నవరాసకేళీ ||2 ||
వనమాలీ శిఖిపింఛమౌళి ||2||
కృష్ణా ముకుందా మురారీ

శ్రీ కామినీ కామితాకార
సాకార కారుణ్య ధారా నవాంకూర
అంసార సంతాప నిర్వాపణా -
పాప నిర్వాపణోపాయనామ ప్రశంసానుభావా
భవా భావాహే వాసుదేవా -
సదానంద గోవింద సేవించు మావిందవై
డెందమానంద మొందింప ఎందున్
విచారంబు లేమిన్ - వచోగోచరా గోచరత్వంబు లూహింప లేమైతిమో
దేవా - నీ పాద సేవా దరంబున్ మదిన్ గోరుచున్ వేదవాదు; శమాదుల్
కడుంజాల నార్జించి భోగేచ్ఛ వర్జించి నానాతపశ్చర్య తాత్పర్యపర్యాకు
లత్వంబునన్ గైకొనన్ మాకునే యత్నముల్ లేకయే నీ కృపాలోక సంసిద్ధి
సిద్ధించుటల్ బుద్ధి తర్కింప నత్యంత చిత్రంబుగాదే? జగనాధా హే  జగన్నాథ
ఈ రీతి చెన్నార మున్నే ఋషుల్ నిను గన్నార కన్నారు - నా
కన్నులెనంగ యే పుణ్యముల్ జేసినో నిన్నుదర్శింపగా - భవ్య
కల్యాణ నానాగుణ శ్రీ సముద్భాసింతాంగా - దయాపూర
రంగత్తరంగాంతరంగా నమో రుక్మిణీసంగా
హేపాండురంగా.. హే పాండురంగ
నమస్తే - నమస్తే - నమః.

'కృష్ణా ముకుందా మురారీ' పాట ఓ మనోహర రాగమాలిక. పల్లవికి, మొదటి చరణానికి మోహనరాగాన్ని ఉపయోగించారు. 'వెలసితి వంట' దగ్గర ఆ రాగంలో పడకూడని మధ్యమం ('మ' అన్న స్వరం)తో కూడిన అది కూడా అందాన్ని పెంచేదిగానే ఉంది. 'నీ పలుగాకి' చరణానికి కళ్యాణి రాగాన్ని వాడుకున్నారు. పద్యాల ఆలాపనకు అనువైన ఆరభి రాగాన్ని 'అమ్మా తమ్ముడు మన్ను తినేను' అన్న పద్యాన్ని ఉపయోగించారు. 'కాళీయ ఫణి ఫణి' చరణాన్ని మాండ్ రాగంలో మలచారు. లీలాశుకుడు రాసిన 'శ్రీకృష్ణ కర్ణామృతం'లోని 'కస్తూరి తిలకం' శ్లోకానికి ఈ పాటలో సముచిత స్థానం కల్పించటం ఔచిత్యానికి నిలువెత్తు నిదర్శనం. హిందోళరాగంలో స్వరపరచిన ఈ శ్లోకం తరువాత వచ్చే 'మ' (మధ్యమం) స్వరాన్ని స (షడ్జమం) స్వరంగా చేసుకుని 'లలిత లలిత మురళీ స్వరాళి' అనే చరణాన్ని స్వరపరచారు. ఇలా చేయటాన్ని గ్రహభేదం అంటారు. ఆ రకంగా చేయించటం వల్ల పాట చివర్న 'హే కృష్ణా' అంటూ తారాస్థాయిలో ఆలపించి శ్రోతల హృదయాలకు ఓ జలదరింప, కనులకు చెమరింపు చేకూర్చగలిగారు ఘంటసాల. 'లలిత లలిత మురళీ స్వరాళి' అనే చరణాన్ని యమన్ రాగాన్ని ఆధారంగా చేసుకుని స్వరపరిచారు. ఇంకాస్త తరచి చూస్తే 1936లో వచ్చి, పాటల పరంగా ప్రజాదరణకు నోచుకున్న 'సంత్ తుకారం' చిత్రంలోని 'ఆదీ బీజయాకళే, ద్విజ అంకురాలే, రూపవాఢలే' అనే మరాఠీ గీత ఛాయలుకనిపిస్తాయి. తరువాత 1973లో తెలుగులో వచ్చిన 'భక్తతుకారాం' చిత్రంలో వినిపించిన అభంగాలలోని 'నీవే అది దైవము' అనే చరణానికి ఈ ట్యూన్‌ని యథాతథంగా సంగీత దర్శకుడు ఆదినారాయణరావు వాడారు. 'పాండురంగ మహత్యం'కి సంగీతాన్ని ఇచ్చిన టి.వి.రాజు ఒకప్పుడు ఆదినారాయణరావుగారి దగ్గర శిష్యరికం చేసినవారే కనుక, అప్పటికే ఆదినారాయణరావుగారికి మరాఠీ సంగీతం మీద కూడా అవగాహన ఉండటం వల్ల 'లలిత లలిత ' చరణానికి  మరాఠీ గీత సువాసనలు అబ్బడంలో ఆశ్చర్యం లేదు. 'కృష్ణాముకుందా మురారీ'లో పాటకు చేసిన స్వర రచన అంతా ఒక ఎత్తు, 'లలిత లలిత మురళీ స్వరాళీ' చరణం తర్వాత

సుమారు రెండున్నర నిమిషాల పాటు వచ్చే వాద్య సంగీతం ఒక్కటీ ఒక ఎత్తు. వేణువాద్యంలో నైపుణ్యం సంపాదించాలనుకునే వారైవరైనా సరే ఈ వాద్య సమ్మేళనాన్ని ఒకసారి గనక వినటం తటస్థిస్తే సాధన చేయకుండా ఉండటం కష్టం.

ఈ చిత్రం దర్శక నటి విజయనిర్మల తొలిచిత్రం కావటం, ఆమె శ్రీకృష్ణునిగా కనిపించటం, తరువాతి రోజుల్లో ఆమె పాపులర్ అయ్యాక ఈ గీతానికి చేకూరిన మరో ప్రత్యేకత. పాట తరువాత వచ్చే దండకం ఆరభి రాగంలో స్వరపరచబడింది. ఇటువంటి దండకాలను, శ్లోకాలను సాధన చేయడం వాక్శుద్ధిని కోల్పోతున్న ఈనాటి ఔత్సాహిక గాయకులకు అత్యంత అవసరం.



# ఆ పాత పాట మధురం

రాజా



## మాయాబజార్

ఏ **సినిమా గురించైనా** వయోబేధం వలన గాని, సిద్దాంతాల వలన గాని, పండితులు వర్గీకరించిన కొన్ని నిర్ధుష్ట లక్షణాల వలనగాని, అభిరుచి వలనగాని, దినదిన ప్రవర్ధమానమవుతున్న వైజ్ఞానిక సముపార్జ వలనగాని, వ్యక్తిగత ఆవేశకావేష సంస్కారాల వలనగాని, మేధో సంపదలోగల వ్యత్యాసాల వలనగాని భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. వీటన్నిటికీ అతీతంగా నిలబడి - తరాల తరబడి - అందరిచేత ఆమోదముద్ర వేయించుకుంటున్న ఏకైక చిత్రం మాయాబజార్.

1957 నుంచి నేటివరకు వన్నె తగ్గని ప్రభావంతో, ప్రాభవంతో అప్రతిహితంగా కొనసాగుతూ ఉన్న ఆ చిత్రాన్ని కళా ʻఖండంʻ అంటే.. కాదు కళాʻపూర్ణంʻ అని అనేవారు కూడా ఉన్నారు.

దర్శకుడు కె.వి.రెడ్డి ప్రతిభావ్యుత్పత్తులకు దర్పణంలా నిలిచిన ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు పింగళి నాగేంద్రరావు, సంగీతం ఘంటసాల, సంగీత సాహిత్య సౌరభాలను వెదజల్లే ఈ చిత్రంలోని పాటలలో అణువణువునా ప్రశంసార్హమైన కొన్ని గీతాలివి. వీటిలో యుగళగీతాలను ఘంటసాల, లీల గానం చేశారు. అక్కినేని, సావిత్రి అభినయించారు.

శ్రీకరులు దేవతలు శ్రీరస్తులనగా,
చిన్నారి శశిరేఖ వర్ధిల్లమ్మా
వర్ధిల్లు మా తల్లి వర్ధిల్లవమ్మా -
చిన్నారి శశిరేఖ వర్ధిల్లవమ్మా
సకల సౌభాగ్యవతి రేవతీదేవి
తల్లిఅయి దయలెల్ల వెల్లివిరియగను ||సకల||
అడుగకే వరములిడు బలరామదేవులే
జనకులై కోరిన వరము లీయగను
వర్ధిల్లు మా తల్లి వర్ధిల్లవమ్మా - చిన్నారి శశిరేఖ వర్ధిల్లవమ్మా

శ్రీకళల విలసిల్లు రుక్మిణీదేవి
పినతల్లియై నిన్ను గారాము శాయ ||శ్రీకళల||
అఖిల మహిమలు కలుగు కృష్ణపరమాత్ములే
పినతండ్రియై సకల రక్షణలు శాయ
వర్ధిల్లు మాతల్లి వర్ధిల్లవమ్మా - చిన్నారి శశిరేఖ వర్ధిల్లవమ్మా
ఘన వీరమాతయగు శ్రీ సుభద్రాదేవి
మేనత్తయై నిన్ను ముద్దు శాయగను || ఘన ||
పాండవ యువరాజు బాలుడభిమన్యుడే
బావయై నీవె తనలోకమని మురియ
వర్ధిల్లుమా తల్లి వర్ధిల్లవమ్మా - చిన్నారి శశిరేఖ వర్ధిల్లవమ్మా

సినిమా మొదలవగానే శ్రీకారం తొలి అక్షరంగా వినిపించే విధంగా రాసినట్టు అనిపిస్తుందీ పాట. అంతేకాక ముఖ్యపాత్రల పరిచయం కూడా ఈ పాటలోనే అయిపోయేలా పాటను రూపొందించారు. దేశ్, తిలక్ కామోద్ రాగాలను ఆధార రాగాలను పాటకు తీసుకున్నారు. బేబి సరస్వతి, ఛాయాదేవి, గుమ్మడి, సంధ్య, ఎన్.టి.రామారావు, ఋష్యేంద్రమణి, మాస్టర్ ఆనంద్ కాక ఉపపాత్రధారులెందరో కనిపిస్తారీ పాటలో. పాత్రల పరిచయంతోపాటు వాటి స్వభావాలు, ప్రాముఖ్యత కూడా సాహిత్యంలో ప్రతిఫలింపచేయడం ఈ పాట ముఖ్య విశేషం! అడుగకే వరములిడు బలరామదేవు లే, అఖిల మహిమలు కల కృష్ణపరమాత్ములే, శ్రీకళలు విలసిల్లు రుక్మిణీదేవి (లక్ష్మీదేవి అవతారం కదా!) లాంటి వాక్యాలు అందుకు ఉదాహరణలు.

---

లల్లిలలా.. లల్లిలలా
లల్లిలలా.. లల్లిలలా.. లల్లిలల్లి... లల్లిలలా ||2||
అల్లీబిల్లీ ఆటలే లల్లిలలా పాటలే || 2||
ఎవరెవరే కోయిలలూ
కుహూ కుహూ కుహూ కుహూ
ఎవరెవరే నెమిళలూ
కకే కకే కకే కకే
ఎవరెవరే ఎవరెవరే
వన్నెలేడి పిల్లలూ || 2 లల్లిలలా ||
అల్లీబిల్లీ అమ్మాయికి చల చల చల్లని జోస్యం చెపుతామూ
చక్క చక్కని జోస్యం చెపుతామూ || అల్లీబిల్లీ ||
నూతన విద్యల ప్రవీణుడే బల్ ప్రతిభావంతుడె
నీ బావా - నూతన
అతి చతుర వీరుడె నీ బావా || అల్లీబిల్లీ ||
మల్లీ జాజీ మాలతి సంపెంగ
పూలబాణములు వేసెనూ ||మల్లీ||
బాలామణితో మురిసేను
మన బాలామణితో మురిసేను
తన పెళ్ళికి బావను పిల్చేను ||అల్లీబిల్లీ||

శశిరేఖ చెలికత్తెలు అభినయించిన పాటయిది. చిన్న శశిరేఖ, ఆ వయసు చెలికత్తెలు ఆడుకుంటూ పాడుకుంటూ పెరిగి పెద్దవారయినట్టుగ చూపించటం పాట లక్ష్యం. సాహిత్యం కూడా ఆ పద్ధతిలోనే ఉంటుంది. తొలి చరణంలో పిల్లల మేధస్సుకి పరిమితమైన కోయిలలు, నెమలులు, లేడిపిల్లలు మలి చరణాలలో యుక్తవయసు వచ్చిన వారి మనసులో చెలరేగే రకరకాల భావాలు.. భవిష్యత్తు గురించి, కాబోయే వాని గురించి.. ఇలా..! పాటలో తిలంగ్ రాగం ప్రధాన రాగంగా వినిపిస్తుంది పాటలో చిన్న శశిరేఖ పెరిగి పెద్ద శశిరేఖ అయినట్టుగా నీటిలోని ప్రతిబింబం ద్వారా చూపించే షాటు - ఇవాళ్టికీ ఎందరెందరి మనోఫలకాలపైనో మనోహరంగా నిలిచిపోయి ఉంది.

---

**అభిమన్యుడు:** నీవేనా....
నీవేనా నను తలిచినది
నీవేనా నను పిలిచినది
నీవేనా నా మదిలో నిలచి
హృదయం కలవరపరిచినది.. ||నీవేనా||
**శశిరేఖ:** నీవేలే నను తలచినది
నీవేలే నను పిలిచినది
నీవేలే నా మదిలో నిలచి
హృదయము కలవరపరిచినది... నీవేలే
**అభిమన్యుడు:** కలలోనే ఒక మెలకువగా
ఆ మెలుకువలోనే ఒక కలగా ||కలలోనే||
కలయో నిజమో వైష్ణవమాయయో
తెలిసి తెలియని అయోమయంలో ||నీవేనా||
**శశిరేఖ:** కన్నుల వెన్నెల కాయించి
నా మనసునమల్లెలు పూయించి ||కన్నుల||
కనులను మనసును కరగించి
మైమరపించి - నన్నలరించి || నీవేలే ||

ఈ పాట భీంప్లాస్ రాగంలో స్వరపరచబడింది. నిజమైన ప్రేమ మెదడులోని పొరలలోకి చొచ్చుకుని పోతుంది. సబ్ కాన్షస్ స్టేజ్‌లో కూడా ప్రేమించిన వారినే కలవరిస్తూ ఉంటుంది. వారే పిలిచినట్లు అనిపిస్తూ ఉంటుంది. కలలోనే ఒక మెలుకువగా ఆ మెలుకువలోనే ఒక కలగా, కలయో నిజమో వైష్ణవ మాయో తెలిసీ తెలియనని అయోమయములో అనే చరణంలో ఆ భావాన్నే అతి గొప్పగా వ్యక్తీకరించారు. ఇక పాత్రోచితమైన పదజాలం ఉపయోగించటం అనే సంప్రదాయం గీత రచయితలకు కథవల్ల గల అవగాహన తెలియచేస్తుంది. 'కలయో నిజమో వైష్ణవ మాయో' అనే పదప్రయోగం కూడా అటువంటిదే ఎందుకంటే విష్ణువు అవతారమైన శ్రీకృష్ణుని అభిమానించే అభిమన్యుని నోట 'వైష్ణవమాయ' అని వస్తుందే గానీ 'ఈశ్వరేచ్ఛ' అని రాదుగా.

కోరుకున్నవారిని చూపించే 'ప్రియదర్శిని' పేటికలో శశిరేఖకు అభిమన్యుడు కనిపించి, పాడాక, శశిరేఖ ఆ పేటికను మూసేయబోతూ మరొకసారి తెరిచిచూస్తే అంతవరకు పాడిన అభిమన్యుడు వెళ్ళబోతూ మళ్ళీ వెనుదిరిగి చూడటం - పాట ఉన్నంతకాలం ప్రేక్షకుల గుండెల్లో మరిచిపోలేని చిత్రీకరణ!

---

**గోపికలు:** విన్నావ యశోదమ్మా! ||2||
మీ చిన్ని కృష్ణుడు చేసినట్టి
అల్లరి చిల్లరి పనులు విన్నావ యశోదమ్మ
**యశోద:** అన్నెం పున్నెం ఎరుగని పాపడు
మన్నుతినే నా చిన్ని తనయుడు
ఏమి చేసెనమ్మా ఎందుకు రవ్వ చేతురమ్మా.
**గోపికలు:** ఆఁ.. మన్ను తినేవాడా? వెన్న తినేవాడా?
కాలిగజ్జెల సందడి చేయక
పిల్లివలె మా ఇంట్లో దూరి ||కాలి||
ఎత్తుగ కట్టిన ఉట్టందుకుని
దుత్తలన్నీ క్రింద దించుకుని ||ఎత్తు||
పాలన్నీ తాగేశనమ్మా.
పెరుగంతా జూరేశనమ్మా,
వెన్నంతా మెక్కేశనమ్మా
**కృష్ణుడు:**ఒక్కటే ఎట్లా తినేశనమ్మా? ఎక్కడనైనా
కలదమ్మా, ఇది ఎక్కడనైనా కలదమ్మా?
విన్నావటమ్మా ... విన్నావటమ్మ
ఓ యశోదా! గోపిక రమణుల కల్లలూ
ఈ గోపిక రమణుల కల్లలూ...
**గోపికలు:** ఆ.. ఎలా బూకరిస్తున్నాడో!
పోనీ పట్టిద్దామంటే చిక్కుతాడా!
భామలందరొక యుక్తిని పన్ని
గుమ్మము నొకరుగ కాచియుండగా
ఒకరింట్లో విని గజ్జెల గలగల
ఒకరింట్లో విని వేణుగానమూ ||ఒకరింట్లో ||
ఆహా: ఇంకేం
దొంగ దొరికెనని పోయిచూడగా
ఛంగున నెటకో దాటిపోయే
ఎలా వచ్చెనో ఎలా పోయెనో
చిలిపి కృష్ణుడనే అడగవమ్మా.. ||ఎలా||
**కృష్ణుడు:** నాకేం తెలుసు నేనిక్కడ లేందే!
**యశోద:** మరి ఎక్కడున్నావు?
**కృష్ణుడు:** కాళింది మడుగున విషమును కలిపె
కాళియు తలపై తాండవమాడి ||కాళింది||
ఆ విషసర్పము నంతము జేసి
గోవుల చల్లగ కాచానే... ||3 ||
**ద్రౌపది:** హే కృష్ణా..... హే కృష్ణా..
ముకుందా మొరవినవా,
నీవు వినా దిక్కెవరు దీనురాలి గనవా కృష్ణా
నా హీనగతిని గనవా.. కృష్ణా కృష్ణా కృష్ణా....

శ్రీకృష్ణుని చిన్ననాటి ముచ్చట్లు శ్రీకృష్ణుని ఎదుటే ఓ అంతర్నాటకంలా ప్రదర్శించటం, యాదవ కుటుంబమంతా మైమరచి చూస్తుండగా - నిండు కొలువులో ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతున్నట్టు ఇక్కడ శ్రీకృష్ణునికి తెలియటం, తద్వారా పాండవులు తమ రాజ్యాలను కోల్పోయారని ఈ పాట ద్వారా చూపిస్తారు. తిలంగ్ రాగంలో మొదలై 'కాలిగజ్జెల సందడి చేయక' దగ్గర చారుకేశి రాగాన్ని అందుకుని 'భామలందరొక యుక్తిని పన్ని' దగ్గర పీలూ రాగాన్ని స్పృశిస్తూ, 'కాళింది మడుగున విషమును కలిపె' దగ్గర శంకరాభరణం స్వరాలపై నడుస్తూ పాట మొత్తం జానపద సంగీత ధోరణిలో సంచరిస్తూ ఉంటుంది. ఎన్.టి.రామారావు, సంధ్య, సావిత్రి, గుమ్మడి, ఛాయాదేవి, నాగభూషణం వంటి ముఖ్యపాత్రధారులతో పాటు ఎంతో మంది కనిపిస్తారు ఈ పాటలో! అంతర్నాటకంలో బాలకృష్ణునిగా వేసింది ప్రముఖ తార పుష్పవల్లి కుమారుడు బాబ్జీ. అక్కడ ఆ ముచ్చట అలావుండగా మధ్యలో 'విన్నావటమ్మ ఓ యశోద గోపిక రమణుల కల్లలు' అని బాలకృష్ణుడు అంటుంటే తిలకిస్తున్న రుక్మిణి పాత్రధారిణి సంధ్య నవ్విన

నవ్వులు, 'భామలందరొక యుక్తిని పన్నిగుమ్మము నొకరుగ కాచియుండగ' అనే వాక్యం తర్వాత వచ్చే ఇంటర్‌లూడ్‌లో - శశిరేఖగా నటించిన సావిత్రి చిన్నపిల్లలా ఉత్సాహంగా చేతితో రుక్మిణిని కుదపటం ఇవన్నీ మాయాబజార్ అభిమానులు తల్చుకుని తల్చుకుని మురిసిపోయే ముచ్చట్లు.

---

**అభిమన్యుడు:** చూపులు కలిసిన శుభవేళా
ఎందుకు నీకీ కలవరము
ఎందుకు నీకీ కలవరము
ఉల్లాసముగా నేనూహించిన
అందమె నీలో చిందెనులే ||చూపులు||

**శశిరేఖ:** చూపులు కలిసిన శుభవేళా
ఎందుకు నీకీ పరవశము
ఎందుకు నీకీ పరవశము
ఏకాంతంలో ఆనందించిన
నా కలలే నిజమాయెనులే ||చూపులు||

అభిమన్యుడు: ఆలాపనలు సల్లాపములు
కలకల కోకిల గీతములే.... ||ఆలాపములు||
చెలువములన్నీ చిత్రరచనలే... ||చెలువము ||
చలనములోహో నాట్యములే ||చూపులు ||

శశిరేఖ: శరముల వలెనే చతురోక్తులను
చురుకుగ విసిరే నైజములే... శరము
ఉద్యానమున వీర విహారమే.. ||ఉద్యా||
చెలి కడనోహో శౌర్యములే. ||చూపులు||

ఈ పాట బృందావన సారంగ రాగంలో స్వరపరచబడింది. చిన్నప్పటినుంచి ఒకరినొకరు ముచ్చటపడ్డ బావ, మరదలు యుక్తవయసువచ్చాక కలుసుకుంటే అతడికి పరవశంగానే ఉంటుంది. ఆమెకు కలవరంగానే ఉంటుంది. ఆ భావాలనే అచ్చ తెలుగులో అందించారు పింగళి. అదీగాక ప్రేమించిన అమ్మాయి ఏం చేసినా బావుంటుంది. 'చెలువములన్నీ చిత్రరచనలే చలనము లోహో నాట్యములే' అంటే అదే

**అభిమన్యుడు:** లాహిరి లాహిరి - లాహిరిలో
ఓహో జగమే ఊగెనుగా - ఊగెనుగా - తూగెనుగా

**శశిరేఖ:** లాహిరి - లాహిరి -లాహిరిలో - ఓహో జగమే
ఊగెనుగా - ఊగెనుగా - తూగెనుగా...

**అభిమన్యుడు:** ఆ...ఆ..ఆ

**శశిరేఖ:** ఆ...ఆ....ఆ
తారా చంద్రుల విలాసములతో..
విరిసే వెన్నెల పరవడిలో

అభిమన్యుడు: ఉరవడిలో ||తారా||
పూలవలపుతో ఘుమఘుమలాడే
పిల్లవాయువుల లాలనలో ||లాహిరి||

అభిమన్యుడు: అలల ఊపులో తీయని తలుపులు
చెలరేగే ఈ కలకలలో

శశిరేఖ: మిలమిలలో ||అలల||

అభిమన్యుడు: మైమరిపించే ప్రేమనౌకలో
హాయిగ చేసే విహారణలో ||లాహిరి||

శ్రీకృష్ణుడు: రసమయి జగమును రాసక్రీడకూ....
ఉసిగొలిపే ఈ మధురిమలో

రుక్మిణి: ఎల్లరి మనములు
ఝల్లున చేసే
చల్లని దేవుని అల్లరిలో ||లాహిరి||

ఈ పాట మోహనరాగంలో స్వరపరచబడింది. ఇవాళ్టికీ మోహనరాగానికి ప్రామాణికంగా ఓ సినిమా పాట చెప్పు అని అడిగితే చాలామంది ఉదహరించే పాటయిదే! ఈ పాటను అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి పైన మాత్రమే కాకుండా సంధ్య (రుక్మిణి)ని నౌకా విహారానికి తీసుకువెళ్ళి 'రసపట్టులో తర్కం కూడదు' వంటి మహత్తరమైన మాటని పలికిన ఎన్.టి.ఆర్ (శ్రీకృష్ణుడు) పైనా, 'కాలమహిమ కాదు ప్రకృతి మహిమ' అంటూ ఛాయాదేవి (రేవతి)ని నౌకా విహారానికి పురిగొల్పి గుమ్మడి (బలరాముడు) పైనా చిత్రీకరించారీ పాటని. ఈ పాటలో మరో ప్రత్యేకత వెన్నెల....! నిజమైన వెన్నెల ఇలాగే ఉంటుందా అనిపించేటంతగా, అసలు వెన్నెల అంటే 'లాహిరి లాహిరి' పాటలో వెన్నెలేనని ఉదహరించేట్టుగా చిత్రీకరించిన మార్కస్ బార్ట్లీ పనితనాన్ని పేర్కొని తీరాలి. అందుకే ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో 'విజయా వారి వెన్నెల' అని కూడా అంటుంటారు.

'మాయాబజార్' అనే దృశ్యకావ్యం గురించి ఎందరు ఎన్ని కోణాలలో ఎంత చెప్పినా ఇంకా ఎంతో మిగిలిపోతూ ఉంటుంది.



# ఆ పాత పాట మధురం



## రాజా

### మాయాబజార్ - 2

**చెరుకుగడ** ఏ వైపు నుంచి తిన్నా తీయదనంలో ఎటువంటి మార్పు ఎలా ఉండదో 'మాయాబజార్' గురించి ఎక్కడ చెప్పుకోవడం మొదలు పెట్టినా రసాస్వాదనకి భంగం ఉండదు.

అలాగే మాయాబజార్ గురించి మరో ఉదాహరణ కూడా చెప్పుకోవచ్చు. తలిదండ్రులకు ప్రదక్షిణ చేసిన వినాయకులవారు మొత్తం భూప్రదక్షిణ చేస్తున్న కుమారస్వామికి ఎక్కడకి వెళితే అక్కడ అంతకన్నా ముందుగా చేరి ఎలా కనిపించాడో ఒక్క 'మాయాబజార్'ని ఆమూలాగ్రం అధ్యయనం చేసినవారు తెలుగు సినిమాలో విలువల గురించి ఏ అంశం మీదైనా సాధికారంగా చెప్పాలనుకునేవారికి ముందుంటారు.

భళి భళి భళి దేవా
బాగున్నదయా నీ మాయా
ఒకరికి ఖేదం ఒకరికి మోదం
సకలం తెలిసిన నీకు వినోదం
నీవారెవరో పై వారెవరో
ఆ విధికైనను తెలియదయా ||బాగున్నదయా||
సుఖదుఃఖాలతో గుంజాటనపడు
లోకము నీ చెలగాటమయా
లీలలు మాయలు
నీ గుణకథలూ తెలిసినవారే ధన్యులయా ||బాగున్నదయా||

ఈ పాటలో సుభద్రాభిమన్యులుగా ఋషేంద్రమణి, అక్కినేని నాగేశ్వరరావు - వారు వెళ్ళే రథాన్ని తోలే దారుకునిగా గాయకుడు మాధవపెద్ది సత్యం నటించారు. చారుకేశి రాగంపై ఆధారపడిన ఈ పాటను పాడింది కూడా మాధవపెద్ది సత్యమే! సాధారణంగా

వేదాంతపరమైన గీతాలలో ఉండే జటిలమైన భాషలేకపోవటం, ఓ వైపు అర్థం అవుతూనే మరోవైపు ఇందులో ఎంతో లోతైన అనుభవం ఉంది అని అనిపించేలా ఉండడం ఒక ఎత్తయితే - ఇది అందరికీ తెలిసినదే కదా అని అనుకునేటంత సామాన్యంగా ఉండడం మరొక ఎత్తు. ఈ పాట ఇవాళ్టికి సజీవంగా ఉండడానికి అసలైన కారణం ఇదే!

---

శశిరేఖ: నీకోసమే జీవించునది
ఈ విరహములో ఈ నిరాశలో ||నీకోసమే||
వెన్నెల కూడా చీకటిఐనా
మనసున వెలుగే లేకపోయినా ||నీ కోసమే||
అభిమన్యుడు: విరహము కూడా సుఖమే కాదా
నిరతము చింతన మధురము కాదా
నిరతము చింతన మధురము కాదా ||విరహము||
వియోగ వేళల విరిసే ప్రేమల
విలువను కనలేవా
నీ రూపమునే ధ్యానించునది
నా హృదయములో నా మనస్సులో ||నీ రూపమే||
శశిరేఖ: హృదయము నీతో వెడలి పోయినా
మన ప్రేమలనే మరి మరి తలచి
ప్రాణము నిలుపుకొనీ
అభిమన్యుడు: మెలుకువనైనా కలలోనైనా
కొలుతును నిన్నే ప్రణయ దేవిగా
లోకములన్నీ ఏకమె అయినా
ఇక నాదానమేగా ||నీ రూపమే||

ఈ పాటను ఘంటసాల, లీల ఆలపించగా - అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి అభినయించారు. ఈ పాట భాగీశ్వరి, చారుకేశి రాగాలలో స్వరపరచబడింది. హృదయము నీతో వెడలిపోయినా, మెలుకువనైనా కలలోనైనా కొలుతును నిన్నే ప్రణయ దేవిగా అనే వాక్యాలకు చారుకేశి రాగాన్ని - మిగిలిన పాటకు భాగీశ్వరి రాగాన్ని ఉపయోగించారు. ఘంటసాల సంగీత దర్శకుడిగా అంతకు ముందు విడుదలయిన 'షావుకారు' చిత్రంలో 'ఎవరో... వారే' పాటలో చారుకేశి రాగాన్ని ఉపయోగించిన పద్ధతి, తర్వాతి రోజుల్లో విడుదలయిన 'లవకుశ' చిత్రంలో 'శ్రీరామ సుగుణధామ రఘువంశ జలధిసోమా' పాటలోను 'శ్రీ సత్యనారాయణ వ్రత మహత్యం' చిత్రంలో 'ఓం నమోనారాయణ' పాటలోను భాగీశ్వరి రాగాన్ని వాడుకున్న విధానం ఇవన్నీ ఆయా రాగాలలో వారి సృజనాత్మక సంచారానికి అద్దం పట్టేవే!

అక్షరాలను అమృతధారలుగా అన్వయించి రాసే పింగళి పాళి వెలువరించిన 'విరహము కూడా సుఖమే కాదా, నిరతము చింతన మధురము కాదా' లాంటి వాక్యాలు - మనుషుల్లో ప్రేమ తత్వం, తెలుగు సినీగీతాలలో సాహితీ స్పర్శ ఉన్నంతవరకూ అజరామరంగా ఉంటాయి.

---

1. దయచేయండీ దయచేయండీ
తమంత వారికలేరండీ! తమంత వారిక లేరండీ!
అతి ధర్మాత్ములు అతి పుణ్యాత్ములు అతి ధీమంతులు మీరండీ
తగు కైవారం తగు సత్కారం
తగు మాత్రంగా గైకొండి
తమంత వారిక తమరండీ - తతంగమంతా తమకండి
హై హై వైవై కైకై గైగై జియ్యా...
2. పెండ్లి కుమారా, రావయ్యా, మా భాగ్యం కొద్దీ దొరికావయ్యా
ముల్లోకాలను వెతికి తెచ్చిన అల్లుడవంటే నీ వయ్యా
ముల్లోకాలను గాలించి తెచ్చిన అల్లుడవంటే నీవయ్యా
3. కిరీటాలు! కిరీటాలు! వజ్రాల కిరీటాలు! ధగ ధగ కిరీటాలు!
ధరించినంతనె తలలో మెరయును
బలె యోచనలు బ్రహ్మాండముగా
శిరస్త్రాణములు శిరోధార్యములు శిరోజ రక్షలు కిరీటాలివె
అందుకోండయ్యా దొరలు ముందుకు రండయ్యా
అందుకోండయ్యా దొరలు ముందుకు రండయ్యా
5. రక్షలు రక్షలు పాదరక్షలు - నాట్య శిక్షణలో బాలశిక్షలు
తొడిగిన తోడనె - తోధిమి తోధిమి
అడుగువేయగనే - తైతక్కతైతక్క

తొడిగన తోడనె - తోధమి తోధమి
అడుగువేయగనే - తైతక్క తైతక్క
నేలమీదనిక నిలువనీయక కులాసగ మిము నటింపజేసే ||రక్షలు||

6. ఒకటే మా వయసూ ఓ రాజా ఒకటే మా సొగసూ
ఒకటే మా వయసూ ఓ రాజా ఒకటే మా సొగసూ
నయగారము నా కళరా వయ్యారము నా వలరా
నయగారము నా కళరా వయ్యారము నా వలరా ఒయ్
నేనే నీ జోడురా నేనే నీ ఈడురా వన్నె చిన్నె లెన్నరా ||ఓ రాజా||
వన్నె చిన్నె లెన్నరా ఓ రాజా ||ఒకటే||
సరసతలో ఇది జాణరా రసికతలో ఇది రాణిరా,
సరసతలో ఇది జాణరా రసికతలో ఇది రాణిరా, ఒయ్
నిన్నే కోరితిరా నిన్నే చేరితిరా వన్నె చిన్నెలెన్నరా ఓ రాజా
వన్నె చిన్నెలెన్నరా ఓ రాజా ||ఒకటే||

ఈ పాటను ఫలానా ఫలానా వారు పాడారని గాని, ఫలానా ఫలానావారు నటించారని గాని విడివిడిగా పేర్కొనటం కష్టం. అయినా ఘంటసాల, మాధవపెద్ది సత్యం, లీల, సుశీల కంఠాలు ప్రముఖంగా వినిపిస్తాయి. ఇక నటీనటులంటారా అదంతా ఓ కౌరవసేన....! సంగీతం సాహిత్యం పోటీపడి సమతూకంలో తూగిన పాటలలో ఇదొకటి. అసలు ప్రయోగాన్ని 'పాట' అని అనకూడదు. 'భావరాగ సంపుటి' అనాలి.

ఈ ప్రయోగంలోని మొదటి రెండు చరణాలలో ప్రశంస వెనుక తొంగి చూసే వ్యంగ్యం ఓ ప్రత్యేకత! ఇక... కిరీటాలకు శిరోధార్యములు. శిరోజరక్షలు అని, హారాలకు అందాలకు అనుబంధాలని, చీరలకు సంతోషాలకు సంబంధాలని, పాద రక్షలకు నాట్య శిక్షణలని వర్ణించటం ఇవన్నీ పింగళి వారి నైపుణ్యం - తెలుగువారికి పుణ్యం! హరికాంభోజి రాగస్వరాల మీదనే ఈ స్వర రచన ఎక్కువగా నడిచినట్టు కనిపిస్తుంది. ఎక్కువమంది గాయనీ గాయకులు పాడేటప్పుడు, గాత్ర ధర్మాన్ని బట్టి వాక్యాలను పంచుకోవటం లేదా పంచి ఇవ్వటం ఓ ప్రత్యేకమైన కళ! ఆ కళ ఈ పాటలో స్ఫుటంగా కనిపిస్తోంది. ఎందుకంటే ఘంటసాల వారి కంఠంలో పరుషాలు, సరళాలు, అనునాసికాలు మొదలైనవన్నీ తగిన రసస్పందనతో పలుకుతాయి. మాధవపెద్ది వారి కంఠంలో పరుషాలు మహాద్భుతంగా పలుకుతాయి. అందుకు ఉదాహరణ - తొడిగిన తోడనే తోధిమి తోధిమి - అని ఘంటసాల వారంటే - అడుగు వేయగనే తైతక తైతక్క - అని మాధవపెద్ది వారి చేత పలికించటం వల్ల అవి ఎంత బాగా పండాయో శ్రోతలకు అనుభవైక వేద్యమే!

---

మాయాశశి: అహ నా పెళ్ళియంట ఓహో నా పెళ్ళియంట
అహ నా పెళ్ళంట ఓహో నా పెళ్ళియంట
అహో నా పెళ్ళంట ఓహో నా పెళ్ళంట
మీకు నాకు చెల్లంట లోకమెల్ల గోలంట
టాంటాంటాం అహ నా
వీరాధి వీరులంట ధరణీ కుబేరులంట
భోరు భోరుమంటు మా పెళ్ళి వారు వచ్చిరంట ||వీరాధి||
అబ్బబ్బబ్బబ్బబ్బబ్బబ్బ బ్బో ||అహనా||
బాలాకుమారి నంట చాలా సుకుమారివంట ||బాలా||
పెళ్ళికొడుకు నన్నుచూసి మురిసి మూర్ఛపోవునంట
అయ్యయ్యయ్యయ్యయ్యయ్యో అహహ ||అహనా||
తాళికట్టవచ్చునంట - తగని సిగ్గు నాకంట తాళి కట్టవచ్చునంట
పాదనిదపమ - మా పదమగ తాళికట్టవచ్చునంట
పపప్పద మమమ్మప గగగ్గామ రిగమప తాళికట్ట వచ్చునంట

ఘటోత్కచుడు: తధో, ధోం దొంత తధీం ధీం ధీంత
దధోంత తధీంత అటుతంతాం ఇటు తంతాం
తంతాం తంతాం తంతాం సనిదప మగరిస
తాళికట్టవచ్చునంట.. అయ్.. తాళికట్ట
మాయాశశి: తాళి కట్టవచ్చునంట తగని సిగ్గు నాకంట
మేలుముసుగు చాటువేసి - దాగుడుమూతలాడునంట ష్హా ష్హా ష్హా

ఈ పాటను సుశీల పాడారు. మధ్యలో స్వరాల దగ్గర ఘంటసాల కంఠం వినిపిస్తుంది. తెరపై సావిత్రి యస్వీరంగారావు, మరికొంతమంది చెలికత్తె పాత్రధారులు అభినయించారు. ఈ పాటను సుశీల గానం చేసిన విధానంలో - పెళుసుదనంతో కూడిన వైవిధ్యం సూటిగా మనసులో నాటుకుపోతుంది. కథాపరంగా ఆలోచిస్తే - సౌకుమార్యం అలవర్చుకుంటున్న రాక్షసాంశకి అది తగినదేమోనని అనిపిస్తుంది కూడా! ఈ పాట మధ్యలో ఘంటసాల స్వరం వినిపించినా అది పాడింది మాధవ పెద్ది సత్యమేనని ఇప్పటికీ అనుకుంటున్నవాళ్ళున్నారు. ఆ క్రెడిట్ టోటల్‌గా మాధవపెద్దిదే అయినా ఆయనను స్ఫురింపచేస్తూ ఘంటసాల వారు ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్లకు హ్యాట్సాఫ్ అనాల్సిందే! సాధారణంగా 'నభూతో నభవిస్యతి' అనే పదప్రయోగాన్ని చేసేటప్పుడు "నభూతో... అను... న భవిష్యతి" అని అనటానికి మనకు హక్కులేదు. ఎంచేతంటే "భవిష్యత్తులో ఇంతకంటే గొప్పది రావచ్చు కదా" అని అంటారు పెద్దలు. కానీ ఈ పాటకు సావిత్రి అభినయించిన విధం, ఆమె చూపించిన హావభావాలు, ఆ ముఖంలో పలికిన ఎక్స్‌ప్రెషన్లు ఇవన్నీ మనకు తెలియకుండానే మనచేత 'నభూతో నభవిష్యతి' అని పలికేట్టు చేస్తాయి. శంకరాభరణం, హరికాంభోజిరాగ స్వరాల మిశ్రమం ఈ పాటలో ఎక్కువగా కనబడుతుంది.

---

లక్ష్మణ కుమారుడు: సుందరి నీవంటి దివ్య స్వరూపంబు
ఎందెందు వెదకిన లేదుకదా
ఎందెందు వెదికిన లేదు కదా
ఎందెందు వెదికిన లేదు కదా
నీ అందచందాలింక నా వేకదా
సుందరి ఓహో సుందరి అహ సుందరి
మాయాశశి: దూరం దూరం
లక్ష్మణకుమారుడు: దూరమెందుకే చెలియా వరియించి వచ్చిన
ఆర్యపుత్రుడనింక నేనేకదా ||దూరం||
మన పెళ్ళివేడుకలింక రేపెగదా
మాయాశశి: రేపటిదాకా ఆగాలి
లక్ష్మణ కుమారుడు:
ఆగుమంచు సఖియ అరమరలెందుకే నీ సొగసులన్నీ నాకు నచ్చేగదా
నీ నగల నా విరహము హెచ్చేగదా
మాయాశశి: హెచ్చితే ఎలా? పెద్దలున్నారు
లక్ష్మణకుమారుడు: పెద్దలున్నారంటు హద్దులెందుకే రమణి
వద్దకు చేరిన పతినే కదా పెద్ద
నీ ముద్దు ముచ్చటలింక నావేకదా ||సుందరి||

'సుందరి నీ వంటి' పాటను ఘంటసాల పాడగా మధ్యలో సావిత్రి స్వరం వినిపిస్తుంది. తెరపై రేలంగి, సావిత్రి, చెలికత్తె పాత్రధారిణి అభినయించారు. ఈ పాటను ఘంటసాల పాడిన పద్ధతి చిరస్మరణీయం. రేలంగికి ఘంటసాల ఎప్పుడు పాడినా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనే పాడేవారని మరోసారి నిరూపిస్తుందీ పాట. ముఖ్యంగా 'పెద్దలున్నారంటూ హద్దులెందుకె రమణీ', తర్వాత సావిత్రి "ఆఁ?" అంటే తిరిగి "హే!" అంటున్నప్పుడు - చివర్న 'సుందరీ.. సుందరీ..' ఎలుగెత్తి పిలుస్తూ జీరతో కూడిన ఏడుపుని తన కంఠంద్వారా అభినయించినప్పుడు ఘంటసాల వారి గానకళాభినయానికి జోహార్లు అర్పించకుండా ఉండలేం.

---

ఘటోత్కచుడు: వివాహభోజనంబు వింతైన వంటకంబు
వియ్యాలవారి విందు ఒహోహ్హో నాకె ముందు
అహహ్హహహ్హ హహ్హ ||3||
ఔరర గారెలెల్ల అయ్యారె బూరెలెల్ల
ఓహ్హోరె అరిసెలెల్ల ఇవెల్ల నాకె చెల్ల ||వివాహ||
భళీరె లడ్డులందు వహ్ ఫేణిపోణిలిందు
భలె జిలేబి ముందు ఇవెల్ల నాకె విందు ||వివాహ||
మఝూరె అప్పడాలు పులిహోర దప్పళాలు
వహ్వారె పాయసాలు ఇవెల్ల నాకె చాలు ||వివాహ||

ఈ పాటను మాధవ పెద్ది సత్యం పాడగా యస్వీరంగారావు అభినయించారు. ఘటోత్కచుని భీకరాకార ఆహార్యాలకు తగిన శరీరం యస్వీ రంగారావుది అయితే అందుకు ఏ మాత్రం తగ్గని శారీరం (గళం) మాధవపెద్ది సత్యంది. 'వివాహ భోజనంబు' పాటను మాయాబజార్ తమిళ వెర్షన్‌లో తిరుచ్చి లోకనాథన్ అనే గాయకుడు పాడగా అతని గొంతు పుండై మూడు రోజులు భోజనం చేయలేకపోయాడట. ఆ శరీరం ఈ శరీరానికి అంతగా నప్పింది కనుకనే 'వివాహ భోజనంబు' పాట ఈ నాటికీ మాధవపెద్ది కీర్తి కిరీటంలో కలికితురాయిగా ఒప్పింది. అందుకే అంత 'మంచి రాక్షసుడు' భాషించిన ఔరౌర, ఒహ్హోరే, భళిరే, మఝూరే, వహ్వారే లాంటి ప్రశంసాత్మక పదాలు భాసించాయి. శహభాషనిపించాయి. ఉల్లాసానికి ఉత్కృష్ట నిర్వచనంలా ఈ పాట నిలిచిపోయింది. కనుకనే ప్రేక్షకులు కూడా ఆ బాణీలో పడి ఊగిపోయారే కాని ఆ ట్యూన్ పాశ్చాత్య ధోరణిలో ఉందన్న సంగతే పట్టించుకోవటం మానేశారు.

చివర్నగల ఈ మూడు పాటలలోను సమాంతరంగా చెప్పుకోదగ్గ అంశాలు కొన్ని ఉన్నాయి. అతి తక్కువ వ్యవధిలోనే ఈ మూడు పాటలు సినిమాలో వరసగా రావటం జరుగుతుంది. అయినా దేనికదే ఒక ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ శ్రోతల్ని ప్రేక్షకులుగా చేసుకుంటూ, ప్రేక్షకులను నిరంతర వీక్షకులుగా మార్చేసుకుంటూ 'మాయాబజార్' సాధించిన ఘనవిజయానికి మూల స్థంభాలుగా నిలిచాయి. తర్వాత తరంలో వచ్చిన ఎన్నో చిత్రాల టైటిల్స్‌కి 'అందాలరాముడు'లో 'సమూహ భోజనంబు' పాటకి, 'సీతారామయ్యగారి మనవరాలు'లో 'సుందరి నీ వంటి స్వీటు స్వరూపము వేర్వేరు సెర్చిన నోయె కదా' పాటకి, 'మిష్టర్ పెళ్ళాం'లో, 'ముల్లు పోయి కత్తి వచ్చే ఢాం ఢాం ఢాం' పాటకి మాయాబజార్‌లోని పాటలు ప్రేరణలుగా నిలిచిపోయాయంటే – ఆ ఘనత వాటిని తెలుగుజాతికి స్థిరాస్థిగా మలిచిన కె.వి.రెడ్డి, పింగళి, ఘంటసాల, నాగిరెడ్డి చక్రపాణి వంటి సృష్టికర్తలది, వాటిని తెరమీద ప్రతిఫలింపచేసిన ఆవిష్కర్తలది.



# ఆ పాత పాట మధురం

## రాజా



### సువర్ణసుందరి

సంగీత సాహిత్యాలకు సముచిత స్థానం కల్పించిన సంస్థల్లో అంజలీ పిక్చర్స్ కూడా ఒకటి. భార్యాభర్తలైన నటి అంజలీదేవి, సంగీత దర్శకుడు ఆదినారాయణరావు ఆ బ్యానరుపై నిర్మించిన చిత్రాలన్నీ మంచివే అయినా 1957 లో విడుదలయిన సువర్ణసుందరి చిత్రం గడించిన కీర్తి ప్రతిష్టలు మాత్రం సాటిలేనివి. ఒకరకంగా తెలుగువారి శక్తి సామర్థ్యాలను ఉత్తరాది వారికి చవి చూపించిన చిత్రమిది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషలలోనే కాక హిందీలో కూడా నిర్మించారు. హిందీలో కూడా అక్కినేని, అంజలీదేవి నటించటం, తమ పాత్రలకు తామే డబ్బింగ్ చెప్పుకోవడం ఒక ఎత్తు అయితే ఉత్తమ సంగీత దర్శకుడిగా ఉత్తరాదిన ఆదినారాయణరావు ఎంపిక కావటం మరో ఎత్తు. ఇంతటి ఘన చరిత్ర గల 'సువర్ణ సుందరి' చిత్రంలో సముద్రాల రాఘవాచార్య కర్తృత్వం వహించగా అత్యంత ప్రజాదరణ పొందిన కొన్నిపాటలివి.

సరళ: ఓ బంగారు వన్నెల రంగారు సంజా - రంగేళి ఏతెంచెనే - నా రాజా
కోరస్: చెంగూన రాడాయెనే ||బంగారు ||
సరళ: ఎలపొద్దూ గని తొలి ముద్దూగొనీ...ఓఓఓ
ఎలపొద్దూగ నీ తొలి ముద్దూగొనీ - తనే వస్తానని
తీవిగా - నా రాజారాడే ననూ చేరగా
ఓ చెలియా - రాడేమో ఈ చాయగా ||బంగారు||
సరళ: జత జేరే తొలి వెత దీరే చెలీ - ఎలా సూరేడటూ
డాయగా - నా రాజా జారే మటుమాయగా
కోరస్: ఆ మనసూ మారెనేమో రాయుగా
సరళ: ఓఓఓ
కోరస్: ఆ మనసూ మారెనేమో రాయుగా
సరళ: ఓఓఓ
కోరస్: బంగారు వన్నెల
సరళ: సొగసించీ మరీ సిగ నుంచి విరీ - వగముంచి గిరి గీసెనూ
నా రాజా ఏ గారడో జేసెనూ
కోరస్: ఓ చెలియా రాగాలు దోచేసెనూ
సరళ: ఓ....

ఈ పాటను పి.లీల, బృందం పాడగా సూర్యకళ, కొందరు ఉపపాత్రధారులతో అభినయించటం జరిగింది. 1952 లో వచ్చిన 'బైజూ బావ్ రా'లో 'దూర్ కొయి గాయె / ధున్ ఎ సునాయె' అనే పాటొకటుంది. నౌషాద్ సంగీత దర్శకత్వంలో షంషాద్ బేగం, లతా, రఫీ పాడేరా పాటని. ఆ పాటలో నీటి కోసం కడవలతో వెళుతున్న అమ్మాయిలు హీరోయిన్ని ఉడికించటం, దూరం నుంచి హీరో ఆలాపించడం... ఇవన్నీ ఆ సినిమా చూసిన వారికి గుర్తుండే ఉంటాయి. ఆ పాట చిత్రీకరణ, పాటలో ఘటాన్ని ఉపయోగించిన తీరు -

ఇవన్నీ ఈ 'బంగారు వన్నెల రంగారు సంజా' పాట రూపకల్పనకు ప్రేరణగా నిలిచి ఉండవచ్చు. ఈ పాటను ట్యూన్ తో సహా ఆలపించుకుంటూ ఉంటే - సాహిత్యంలో విరుపులు, పదాల పొందిక చక్కని స్వీయానుభవంగా మిగులుతాయి.

---

కైలాసం: ఏరా! - ఏరామన తోటి గెల్చే - ధీరులెవ్వరురా! రణ - శూరులెవ్వరురా!

రణ - శూరులెవ్వరురా! భళా భళి:

కోరస్: ||ఏరా మనతోటి||

కైలాసం: అద్దిరభన్న -గుద్దుల బెల్లం - గుభిగుభిగుభి వీపుకు సున్నం

దుబ్ దుబ్ దుబ్ దూదేకుడూ - ఆ దెబ్బలతో తోకపీకుడూ

అరె ఆంజనేయుడికి అన్నదమ్ములం - భీమసేనుడికి పెద్దకొడుకుల

కోరస్: అద్దిరభన్నా

కైలాసం: అద్దిరభన్నా

అరె సాగితే మహారాజులం

కోరస్: అరె చతికిలబడితే రరాజులం ||ఏరా మనతోటి||

కైళాసం: పిన్నా పెద్దా - బేధం లేదూ కొద్దీ గొప్పా తేడాలేదు

కోరస్: అద్దిరభన్నా

కైళాసం: జుట్టూ జుట్టూ ముడిపెడతాం - చెవులకు తాటాకులు కడతాం

కోరస్: అద్దిరభన్నా

కైలాసం: మా సొంత మన్నదే లేదు - మేం చుప్పనాతులంగాదు

ఎప్పుడు కోపం రాదు - అది వచ్చినదంటే పోదూ

కోరస్: అది వచ్చినదంటే పోదూ ||ఏరా మనతోటి||

కైలాసం: మీసం జూడు - రోసం జూడూ - పక్కనున్న సావాసం జూడు

కోరస్: అద్దిరభన్నా

కైళాసం: ఈ బాటకు సుంకం కట్టు - మా కాళ్ళకు దణ్ణం పెట్టు

అరె చిక్కెర చేతిలో జుట్టు ఇక - తిరగెయ్‌ర పెసరట్టు

కోరస్: ఇక తిరగెయ్‌రా పెసరట్టు

కోరస్: ఇక తిరగేయరా పెసరట్టు

కైలాసం: అద్దిరభన్నా - గుద్దులు బెల్లం గుభిగుభిగుభిగుభి వీపుకు సున్నం

దుబ్ దుబ్ దుబ్ దుబ్ దూదేకుడూ - ఆ దెబ్బతో తోకపీకుడు

కోరస్: ఆ దెబ్బతో తోకపీకుడూ ||ఏరా మనతోటి ||

ఈ పాటను మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు, బృందం పాడగా రేలంగి, రమణారెడ్డి, బాలకృష్ణ అభినయించారు. ఇది ఓ సరదా పాట. అంచేత సంగీతం - సాహిత్యం ఆ స్థాయిలోనే ఉంటాయి. పట్టించుకోకుండా ఎంజాయ్ చెయ్యదల్చుకుంటే పాట మధ్యలో వచ్చే ఇంటర్లూడ్‌లో కొంత పాశ్చాత్య ధోరణి కూడా ఉంటుంది. కాస్త పట్టించుకుంటే పల్లవిలో మోహనరాగచ్ఛాయలు కూడా కనిపిస్తాయి.

---

కోరస్: ఓఓఓ ఓం నమశ్శివాయః సిద్ధనః ఓం
సుందరి: జగదీశ్వరా - పాహి పరమేశ్వరా
దేవా పురసంహరా - ధీరా నటశేఖరా
త్రాహి కరుణాకరా - పాహి సురశేఖరా
కోరస్: ఆఆఆ ||జగదీశ్వరా||
సుందరి: శంభో హరా - వినుత - లంబోదరా - అంబావరా కావరా
కోరస్: ఆఆఆ
సుందరి: వరమీయగా గౌరి వర సుందరా గౌరివర సుందరా
కోరస్: నిన్నేకని మేము కొలిచేము గంగాధరా
దేవ గంగాధరా ఆఆ ||జగదీశ్వరా||
సుందరి ప్రమధులు పాడా ఫణిగణమాడా - పార్వతి సయ్యాడా
మౌని వరుల్ నిను మనసారా - గని పారవశంబున కొనియాడ
కోరస్: ఓఓఓ
సుందరి: ధిమిత ధిమిత ధిమితైతై తయని - తాండవమాడిన పాదమే
కోరస్: మధురాతి మధుర శృతి గీతమే
సుందరి: ధిమిత ధిమిత ధిమితైతై తయ్యని - తాండవమాడిన పాదమే
కోరస్: మదిసేవించిన సమ్మోదమే
సుందరి: జగంబులా ఏకికా శివకామ సుందరి నాయకా ||జగంబు||
కోరస్: ఓఓఓ ప్రమధులు

ఈ పాటను పి.సుశీల, బృందం ఆలపించగా అంజలీదేవి. కొందరు ఉపపాత్రధారులతో అభినయించారు. సన్నివేశ ప్రాధాన్యంగా అక్కినేని నాగేశ్వరరావు కూడా కనిపిస్తారు. ఈ పాటకు భీంప్లాస్ రాగం ఆధారం. ఆ రోజుల్లో వచ్చిన కొన్ని భక్తిగీతాలు సినిమాలకు మాత్రమే పరిమితమైపోకుండా బైట విడిగా కూడా పాడుకునే స్థాయిలో ఉండేవన్న విషయం ఈ పాట సాహిత్యాన్ని గమనిస్తే అర్ధమవుతుంది.

---

పిలవకురా
అలుగకురా
నలుగురిలో నను ఓ రాజా
పలుచన సలుపకురా ||పిలవకురా||
మనసున బాళీ మరువనులేరా
చలమున మోడి సలువకు రాజా
సమయము కాదుర నిను దరిచేర ||సమయము||
కరుణను నన్నీవేళ మన్నించరా రాజా ||కరుణ|| ||పిలవకురా||
ఏలినవారి కొలువుర సామి
మది నీ రూపె మెదలిన గాని
ఓయన లేనురా కదలగలేరా ||ఓయన||
కరుణను నన్నీవేళ మన్నించరా రాజా ||పిలవకురా||

ఈ పాటను సుశీల బృందం పాడారు. అంజలీ దేవి తక్కిన నట్టువరాళ్ళతో అభినయించారు. ఇంటర్ లూడ్స్‌లో అక్కినేని వేణువు వాయిస్తూ కనిపిస్తారు. హిందోళరాగంలో స్వరపరచబడిన ఈ పాట కూడా మూడు భాషలలోనూ సరిసమానంగా హిట్ అయింది. తమిళంలో 'అష్టైజాదే', తెలుగులో 'పిలవకురా', హిందీలో 'ముఝే నా బులా' పాటలలో ఏది గొప్పది అంటే ఓ పట్టాన తేల్చి చెప్పటం కష్టం. కాకపోతే హిందీ కొచ్చేసరికి పాడుకోవటానికి కాస్త సులువుగా మలిచారు. తెలుగుపాటలో పల్లవి చివర్న 'పలుచన సలుపకురా' అనే పదం తర్వాత కొంత ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ వస్తుంది. ఆ మ్యూజిక్ లేకుండా ఆలపిస్తే - విన్నవారికి. పాడుకున్న

వారికి కాస్త అసంపూర్ణంగా ఉంటుంది. కానీ హిందీలో ఆ వెలితిని చాలా తెలివిగా పూరించి, విజయ శంఖం పూరించారు ఆదినారాయణరావు. అది ఏమిటో ఎలాగో రెండు పాటలను దగర పెట్టుకుని విన్నవారికి మాత్రమే తెలుస్తుంది.

---

ఆమె: ఆఆఆ
హాయి హాయిగా ఆమని సాగె ||హాయి||
సోయగాల గన వోయీ సఖా హాయి సఖా ||హాయి||
అతడు: లీలగా పువ్వులు గాలికి ఊగ ||3||
సనిదమదనిస
ఇద్దరూ: రిసనిదని/ సరిసని/ సరిసని
దనిని దనినిదని మదర మదదమగ
గరిగమదని లీలగా
కలిగిన తలపుల వలపులు రేగ ||కలిగిన||
ఊగిపోవు మది ఉయ్యాలగా జంపాలగా ||హాయి||

ఆమె: ఏమో.. ఏమో తటిలతిక మేమరుపు ||2|| ||మైమరపేమో||
అతడు: మెయిలు రాజు దరి మురిసినదేమో
ఆమె: మైమరపేమో
అతడు: మెయిలు రాజు దరి మురిసినదేమో
ఇద్దరు: వలపు కౌగినుల వాలిసోలి
ఊగిపోవు మది ఉయ్యాలగా జంపాలగా ||హాయి||
ఆమె: చూడుమా చందమామ అటు చూడుమా చందమామ
అతడు: కనుమా వయారి శారద యామిని కవ్వించె
ప్రేమా చూడుమా చందమామ
ఆమె: పగల తూలె విరహిణుల ||పగల||

అతడు: మనసున మోహము రేపునదవురా ||మనసు||
ఇద్దరూ: ఊగిపోవు అంది ఉయ్యాలగా జంపాలగా.. ఆ.. హాయి
అతడు: ఆ...
కనుగవా తనియగా ప్రియతమా కలువలు విరిసెనుగా ||కను||
ఆమె చెలువము కనుగొనా
మనసానంద నాట్యాలు చేయినోయి
ఆనంద నాట్యాలు చేయినోయి
ఇద్దరు: నిరిగమదనిస దనిస
సనిసగరిగ సరినిసదని మదనిస నిరినిరి
దనిదని మద మద గమగమ గమదనిన గమదనిన దనిసా

ఈ పాటను ఘంటసాల, జిక్కి పాడారు. తెరపై అక్కినేని, అంజలీదేవి అభినయించారు. పల్లవినుంచి మొదటి చరణం వరకు హంసానంది రాగంలోను, 'ఏమో తటిల్లతిక' అనే రెండో చరణాన్ని దర్బారీ కానడ రాగంలోనూ 'చూడుమా చందమామ' అనే మూడో చరణాన్ని బహార్ రాగంలోను, 'కనుగవతనియగ' అనే నాలుగో చరణాన్ని కళ్యాణి రాగంలోను స్వరపరిచారు. నాలుగు విభిన్న రాగాలను కలిపినా వింటున్నప్పుడు ఎక్కడా ఒక జంప్ లాగ కాని, ఓ జర్క్‌లా గాని ఫీలవం. ఇదే పాటని హిందీలో చిన్న చిన్న మార్పులతో మనం గమనించవచ్చు. తెలుగులోను, హిందీలోను చరణాల స్వరకల్పన ఒకేలా ఉంటుంది. కానీ తెలుగు పల్లవి 'హాయి హాయిగా ఆమని సాగే'కి హిందీ పల్లవి 'కుహూ కుహూ బోలే కో యలియా'కి ట్యూన్‌లో కొద్దిగా తేడా ఉంటుంది. తెలుగు పాట రెండో చరణంలో 'మైమరపేమో' అన్న మాటని జిక్కి ఆలపించగా హిందీలో అదే స్థానంలో ఉన్న 'హో సఖ్ తా హై' అనే పదాన్ని లతా చేతకాక రఫీతో పలికించారు. ఆ రెండు పాటల మధ్య ఈ మాత్రం తేడా కూడా ఉందని అంటే ఇప్పటికీ నమ్మని వాళ్ళు ఉన్నారు. నాటి నుండి నేటివరకు ఎవరు పాడితే వారి శక్తిసామర్థ్యాలకు పరీక్షగా నిలిచే ఈ గీతాన్ని పోటీలలో పాడటం అంటూ జరిగితే బహుమతిని

పొందకుండా వెనక్కు వెళ్ళిన వాళ్ళని మునివేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. సంగీతం పెద్దగా నేర్చుకోకపోయినా ఈ పాటని స్వరాలతో సహాపాడేవారు ఇంటికొకరైనా గల కుటుంబాలు ఆంధ్రదేశంలో చాలా ఉన్నాయి. అంతేకాదు ఈ గీతం లేని క్లాసిక్ కలెక్షన్స్ ఆడియో లైబ్రరీ కూడా ఉండి ఉండదు. ఉంటే అవి క్లాసిక్ కలెక్షన్‌గా అనిపించుకోదు కూడా. అదీ ఈ గీతం సాధించిన ఘన విజయం. తెలుగు సినీ సంగీతానికి సంబంధించినంత వరకు ఇది ఒక శాశ్వత విజయం.

పై రెండు (తెలుగు) పాటలలో సముద్రాల సీనియర్ రచనా సామర్ధ్యాన్ని వర్ణించాలంటే సరైన తూకపు రాళ్ళు దొరకవనే చెప్పాలి. ఇటీవల ఈ పాటను పాడుతున్న ఓ ఔత్సాహిక గాయకుణ్ణి ఆఖరు చరణంలో గల 'కనుగవ తనియగ' అంటే అర్ధం ఏమిటి అని అడగటం జరిగింది. దానికతడు - కనుగవ అంటే చూడవా, తనియగ అంటే తనివితీరా అని అర్ధం - అన్నారు. నిజానికి కనుగవా అనే పదాన్ని అక్కడ నేత్ర ద్వయమర్ధంలో రాయటం జరిగింది. అలాగే పిలవకు అనే పాటలో బాళి, ఓడి వంటి పదప్రయోగాలు జరిగాయి. ఇపుడు అటువంటి పదాలు వాడితే నిఘంటువులో అర్ధాలు వెతుక్కునే సమయం, జిజ్ఞాస కూడా లేకుండా 'ఎందుకొచ్చిన గొడవండి తీసేసి ఇకో మాట వేయరాదా' అని అంటారు కూడా. కాలక్రమంలో కొన్ని పదాలు లుప్తమయిపోతుంటాయి. వాటిలో ఈ పదాల్ని కూడా చేర్చాలేమో. అసలు లుప్తం అన్నమాటే కాలగర్భంలో కలిసిపోయిందేమో ... ఏది ఏమైనా అటు సాహితీ ప్రయోగాల్ని గాని ఇటు స్వరప్రయోగాలను గాని ఇటువంటి పాటల ద్వారా మరోసారి అవగాహనకు తెచ్చుకోగలిగితే విజ్ఞాన సంపద మరికాస్త పెరిగినట్టే.

---

సుందరి: ఆ-ఆ-ఆ

సాకీ నీ నీడలోన నిలిచేనురా - యువతీ మనోజా

పాట: నీ నీడఓన నిలిచేనురా

నిను కొలిచేనురా - యువతీ మనోజా

ఏనాటికైనా నీదానరా - యువతీ మనోజా

ఏనాటికయినా నీదానరా

ఆ - ఆ - ఆ

నీ తీయ్యె కొనగోరుల మీటి ||2||

మేళవించిన హృదయ విపంచి మేళవించిన ప్రేమ విపంచి

మురిసిన చిరుగాలి సోకునా మొరసి భవదీయ గీతమే

వినిచేనే మేళా - ఏనాటికయినా నీదానరా

యువతీ మనోజా ఏనాటికైనా నీదానరా ఆ-ఆ-ఆ

ఈ పాటను పి.సుశీల, బృందం పాడగా ఉప పాత్రధారులైన కొందరు నట్టువరాళ్ళతో అంజలీదేవి అభినయించారు. ఈ పాటలో రాగేశ్రీ కమాచ్ రాగచ్చాయలు మిళితమై ఉన్నాయి. సాహిత్య పరంగా ఈ పాటలో కూడా గమనించండి. ఫ్రెష్‌గా ఓ జానపద చిత్రాన్ని గాని, పౌరాణిక చిత్రాన్ని గాని ఇప్పుడు తీసినా మొరసి, వినిచేసే లాంటి పదాల్ని ఆ చిత్రాలలో ఊహించగలమా..!? కళాకారుల ప్రతిభను పూర్తిగా వాడుకోగల వాతావరణం జతపడినప్పుడే జిజ్ఞాస ఉన్నవారి మెదడుకి మేత కల్పించగల సృష్టి ఆవిర్భవిస్తుంది. లేకపోతే తర్వాతి తరం చెప్పుకోడానికి మిగలని - ఆత్మలేని - రూపాలు అంకురిస్తూ ఉంటాయి.

---

సుందరి:
బొమ్మా లమ్మా బొమ్మలూ చూడడి బలే బొమ్మలూ
రండి పాపలూ ఇలా రండి బొమ్మ
బొమ్మలా పసా చూడండి చౌకేనండి.. ఓ...ఓ...ఓ "బొమ్మ"
ఓ..ఓహో రాణీ ఇదో నాగరాణీ - కానీ చేతిబోణీ కొనీ కనూ పూబోణీ
ఏదికొన్నా ఖరీదొక బేడేసుమా - ||2|| కానీ చేతిబోణీ కొనీ కనూ పూబోణి
ఏదికొన్నా ఖరీదొక బేడేసుమా - ||2|| ఏరికోరి కొనండివి మీకే సుమా
రండి రండి రండి పాపలు ఇలా రండి
మిలమిలా తళ తళా మెరిసిపోయె బొమ్మా
నిగానిగా కనూగనా జిగేలనే బొమ్మా మిలమిలా
మేలు మేలయిన బిమ్మలు చూడండయా ||2||
కారు చౌకైన బేరము విడకండయా - రండి రండి పాపలూ ఇలా రండి
బొమ్మలా పసా చూడండి - చౌకేనండీ - బొమ్మలమ్మా బొమ్మలూ
గొల్లభామ - పల్లెటూరి పిల్ల - కీలు గుఱ్ఱము
బాలరాజు - చంద్రలేఖ - బాలనాగమ్మ
అరటిపళ్ళు, జామిపళ్ళు, ద్రాక్షగుత్తులు

ఆడపిల్ల లాడుకునే లక్కపిడతలూ
శిల్ప లక్ష్మి జనించెను మా నాటనే -
శిల్పవిద్యా ఫలించెను మా వీట
రండి రండి పాపలూ ఇలా రండి
బొమ్మలాపసా చూడండి చౌకేనండి

ఈ పాటను పి.సుశీల పాడగా అంజలీదేవి - ఉపపాత్రధారులతో అభినయించారు. సుశీల గొంతులో పలికిన ఎక్స్‌ప్రెషన్లు ఈ పాటకి జీవం, ఈ సినిమా రిలీజయ్యే రోజుల్లో అణాలు, బేడలు ఉండేవి. అందుకే 'ఏది కొన్నా ఖరీదొక బేడే సుమా' అనే వాక్యం చోటు చేసుకుందనుకోవాలి - లేకపోతే ఈ జానపద చిత్రానికి కథాకాలం, అప్పుడు చలామణిలో ఉన్న మారక ద్రవ్యం గురించి ఊహిస్తే ఆ వాక్యం చర్చకు నిలబడుతుందా.. సందేహమే!? అలాగే ఈ సినిమా విడుదలయ్యే నాటికి పాపులర్ సినిమాలుగా ముద్రపడిన - 'గొల్లభామ', 'పల్లెటూరి పిల్ల', 'కీలుగుఱ్ఱం', 'బాలరాజు', 'చంద్రలేఖ, 'బాలనాగమ్మ' సినిమాల పేర్లను వాడుకోవటంలో కూడా కొంత వ్యాపారాత్మకమైన తెలివితేటలు కూడా ఉన్నాయనుకోవటంలో తప్పులేదు. పైగా అందులో అధికభాగం సినిమాలు అంజలీదేవి నటించినవే..!

---

అమ్మా! అమ్మా! అమ్మా!
అమ్మా అమ్మా అమ్మా యని అడిగేవు బాబూ
మీ అమ్మ ఎటనున్నదో ||అమ్మా అమ్మా అని||
పలుకాడలేని - పసివాడవే - నువ్వు - తెలిపేదెలా బాబూ
అమ్మను కలిసేదెలా బాబూ
పతి సతులను బాసి బ్రతుకన్న రోసి - మగవేషమే వేసి
అల్లాడు తల్లి అగుపించినా నువ్వు - తెలిసేదెలా బాబూ
అమ్మను కలిసేదెలా బాబూ
విధి చేతివ్రాలే శాపాలపాలై - ఈ రీతి జవరాలై
అల్లాడు తండ్రి అగుపించినా నువ్వు - తెలిసేదెలా బాబూ
అయ్యను కలిసేదెలా బాబూ
అనాథాళికి ఆలన పాలన దేవుడే
మహాదేవుని సన్నిధి చేరరా బాలుడా - దయజూచి దరిజేర్చినా
ఆ దేవుడే గతిరా మహాదేవుడే గతిరా

ఘంటసాల పాడిన ఈ నేపథ్య గీతాన్ని బాబ్జీ (నాటి పుష్పవల్లి కుమారుడు), అంజలీదేవి, రాజసులోచనపై చిత్రీకరించారు. శుభపంతువరాళి రాగం ఈ పాటకు ఆధారం. ఆవేదన, ఆర్తి ఈ రాగంలో బాగా పండుతాయి. పైగా పాడింది ఘంటసాల కావటంతో

విన్నవారి హృదయం ద్రవిస్తుందనటంలో సందేహం లేదు.ఈ పాటను బాగా సాధన చేస్తే శుభపంతువరాళి రాగంపై కొంత అవగాహన ఏర్పడుతుంది.



# ఆ పాత పాట మధురం
## రాజా



## భలే అమ్మాయిలు

తెలుగు సినిమా పాటకు ఓ లాలిత్యాన్ని అద్ది - ఆ పాటను పదిమంది పాడుకునే స్థాయినుంచి సాంస్కృతిక రంగంలో ప్రతిభా పాటవ ప్రదర్శనా స్థాయికి తీసుకువెళ్ళిన సంగీత దర్శకుల్లో ఎస్.రాజేశ్వరరావు స్థానం అపూర్వం. ప్రేక్షక శ్రోతలలో ప్రతి ఒక్కరూ 'ఇది రాజేశ్వరరావు ముద్ర' అని ఎవరికి వారే - తమకు మాత్రమే పరిచయమున్నంత సాధికారంగా చెప్పగలరు ఆయన బాణీల గురించి. అంతగా మన హృదయాలతో పెనవేసుకుపోయి ఆయన పాటలు. 1957 లో వచ్చిన నరసు వారి భలే అమ్మాయిలు. చిత్రంలోని పాటల్ని అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సినిమా రచన విభాగానికి సంబంధించిన వారంతా మాటలూ, పాటలూ కలిపి రాసే రచయితలుగా ఉంటున్న ఆ రోజుల్లో కథకి అంటూ ప్రత్యేకంగా తయారై 'కథా శివబ్రహ్మం'గా పేరు తెచ్చుకున్న రచయిత సదా శివబ్రహ్మం, జానపద రసరాజుగా పేరొందిన కొసరాజు ఈ చిత్రంలోని పాటలను రాశారు.

గోపాల జాగేలరా నన్ను లాలించిపాలింప రావేలరా బాలగోపాల జాగేలరా

దరిజేర చలమేలరా...ఆ...

దరిజేర చలమేలరా ||2||

నన్ను దయజూడ విధియేమిరా ||దరి||

మొర వినవేల కనవేల మురళీధర కరుణాకర గిరిధర ||గోపాల||

కనుగవ అరమోడ్చి శృతి గూర్చి మురళి

అనుపమ సంగీత మొలికించు సరళి

కనుగొని ప్రేమించి నిను జేరినా...ఆ...

చనువున నేనెంతో బ్రతిమాలినా ||కనుగొని||

కనికరించి పలుకరించవేలరా

మురళీధర కరుణాకర గిరిధర ||గోపాల ||

సరిగపద ||గోపాల||

సదపగరి సరిగపద ||గోపాల||

పగరిసదా సరిగపద ||గోపాల||

**షణ్ముఖ ప్రియ**

రీగ రిగ రీరీ....ఆ.....

రిగ రిరిసనీని దసని నిరస సగరి నిరిస దసని పనిదా

గమపదని ||గోపాల||

నిస్సనినిసా.. ఆ.... ||గోపాల||

నిరిస నిసదా పగరిసదా పరిసదా పసదా పదపదని

దనిదనిస నిసనిసరి సరిగగరీ నిసరిరిసని దనిస సనిద

పపమాపదని ||గోపాల||

**కాంభోజి**

గగమ గమగా గామగమ రిమగ గరిస గరిస నిదరిస నిద

సనిదపపా దసరిగా... ఆ...

రీగరిగరీరీ రిమగగారిన గరిరీస దరిస సానీదాప దసరిగరీ.... ఈ....

రిగమ రిగమామ సరిగ సరిగాగ దసరి పదమగారి సనిద పదగరీస

నిద పదరిసా నిద పసనిద పనిద మదపమ గరిసరి గమ పద సరిగ ||గోపాల||

మగపదస మాగా మగగరిస దాసా దరిసనిదపాదా సనిదపద ||జాగేలరా||

<u>మధ్యమావతి:</u>

రిమపపనిస రీరి రిమరిమ రిరిసని ససరి నినిస పపని రిసని పమరిరిమమ

నినిరీ..ఆ ..రీపమలసని సమరి మసరి నిరిసరి నిపమనిసరి

మారీ రిసని రీసా సనిపసారీ మపని ||గోపాల||

మోహన: గాగరిరిగ రిగరిరిస సదగగ రిగగ సరిరి దసస పదరిసరి దసదప పాదా

సారిగా.. గగప గప గగరి రిరిగరిగరిరి ససరిసరిసపద పాపదగరీ....

రీరీ గరిసద సానారిసదప దాదా సదపద గపద గరిసా

దగారీ సాదప రీసాదాపగ సాదాపా గసరిగ పసదా

గారీరీసా రిసదపదసా... రిరిసారిరిదా సదప గపదా...

గరి సదగరీ.. సదపగసదా... సదసపదగా.. గపదాగరిసా

గరిసాపగరీ దవగా సదపా రిసగరి పగ ధపసదరిప రిగరిగ సరిస

దసద పద గాలీ సద రీసా సదప సారీ గపద ||గోపాల జాగేలరా||

ఈ పాటను ఎమ్.ఎల్.వసంతకుమారి, పి.లీలపాడగా సావిత్రి, గిరిజ, రేలంగిపై చిత్రీకరించారు. శాస్త్రీయ సంగీత కచ్చేరీల స్థాయిలో సినీగీతాలను కూడా స్వరపరచి ప్రదర్శించవచ్చుననే నమ్మకాన్ని కలిగించే పాట ఇది. ఎం.ఎల్.వసంత కుమారి వంటి శాస్త్రీయ సంగీత విద్వాంసురాలితో పాడించుకున్నది కూడా అందుకే! ఈ పాటను స్వరాలతో సహా తప్పులు దొర్లకుండా పాడి మెప్పించగల గాయనీ గాయకులెవరికైనా సరే ఏ పాటైనా పట్టుపడితీరుతుంది. తెలుగు సినీ గీతాల్లో తరాల తరబడి నిలిచిపోయే అతి గొప్పగీతమిది. ఈ పాట పల్లవి, చరణాలు, చివరి స్వరాలను - మోహనరాగంలోనూ, మధ్యన వచ్చే స్వరాలను - షణ్ముఖప్రియ, కాంభోజి, మధ్యమావతి రాగాలతోనూ రూపొందించారు. సుస్వర సంగీతానికి చెవి యొగ్గి వినే ప్రతివారింటా ఉండదగ్గ గీతమిది.

---

గిరిజ: అందాల రూపమూ!! ఆనందదీపమూ

కందోయి విందుసేయు మంద మందహాసము

అందుకే ఆ మోహమూ! ఇందుకే ఈ స్నేహమూ ||అందాల||

ప్రేమ తరంగమూ నా అంతరంగమూ

చెంగు చెంగున దూకే - పసిడి తురంగమూ

వినువీధులలో - విహరించేటి ||విను ||

ఆ చందమామ మీద అట్టె నిలిచిపోయెనూ

నీ కనుసన్నలూ - నీ చిరునవ్వులూ

అరవిరిసిన విరజాజి మల్లెపువ్వులు

నీ మురిపాలూ - నీ సరసాలూ

వేమారు మరువలేక వెర్రిదాననైతినీ

అందుకే ఆ మోహమూ

ఇందుకే ఈ స్నేహమూ ||అందాల||

ఈ పాటను సుశీల పాడగ గిరిజ, జగ్గయ్యపై చిత్రీకరించారు. విన్నవారెవరికైనా సరే... పాటలో ఓం ప్రధమంగా ఆకట్టుకునేది సుశీల గొంతులోని ఫ్రెష్ నెస్... స్వచ్ఛత! కొన్ని కొన్ని పాటలను వింటున్న కొద్దీ పరిజ్ఞానం పెరుగుతూ ఉంటుంది. ఎన్నో పాటల ఛాయలు

మనసుని స్పృశించిపోతుంటాయి. ఈ పాటలో ఇన్ని ఫ్రేజ్‌లు ఉన్నాయా... ఈ ఫ్రేజ్‌తో తర్వాత ఇంకో పాట తయారయిందా...అని అనిపించే రాగానుభావంతో హృదయం సుసంపన్నం అయిపోతూ ఉంటుంది. అటువంటి అనుభూతిని కలిగించే పాట ఇది.

పల్లవి రెండు లైన్లతో పాటు తొలి చరణంలోని 'ప్రేమ తరంగమూ - నా అంతరంగమూ' అనే లైనుకి, మలి చరణంలోని 'నీ కనుసన్నలూ - నీ చిరునవ్వులూ' అనే లైనుకి జతపడిన ట్యూన్ ఆలపిస్తూ ఉంటే... 'సుభాకా తారా (1954) సినిమాలో 'గయా అంధేరా - హువా వుర్ఝూలా' పాట గుర్తొస్తుంది. ఈ పాటను 'సంతానం (1955) సినిమాలో 'సంతోషమేలా సంగీతమేలా' పాటకు వాడుకున్నారు. అలాగే తొలి చరణంలోని రెండవ లైను 'ఛెంగు చెంగున దూకే పసిడి తురంగము', మలి చరణంలోని రెండవ లైను 'అరవిరిసిన విరజాజి మల్లెపువ్వులూ' వింటుంటే - హాస్యనటుడు భగవాన్ నిర్మించిన 'అల్బేలా' సినిమా కోసం సి.రామచంద్ర స్వరపరిచి చితల్ కర్ పేరుతో లతాతో పాడిన 'షోలాజ్ బడ్ కే - దిల్ మేరా ధడక్' అనే మూడవ లైను గుర్తొస్తుంది.

ఇక తొలి చరణంలోని మూడవ లైను - 'వినువీధులలో విహరించేటి' మలి చరణంలోని మూడవలైను - 'నీ మురిపాలూ - నీ సరసాలూ' ... ఈ రెండు లైన్ల ట్యూన్ ని వింటుంటే తర్వాతి రోజుల్లో రాజేశ్వరరావు 'అమాయకురాలు' సినిమా కొసం స్వరపరచిన 'సన్నజాజి పువ్వులు - చందమామ కాంతులు - చిన్నారి పాపా నవ్వులు' అనే పాట గుర్తొస్తూవుంటుంది.

ఇలా చరణాలలోని ఒకొక్క లైనూ ఒకొక్క ఫ్రేజ్ ని గుర్తుచేస్తున్నా అవన్నీ రాజేశ్వరరావుగారి తెలివితేటల మీద గౌరవాన్ని పెంచే విధంగానే ఉంటాయే తప్ప ఆయన స్వరకల్పనా సామర్థ్యాన్ని ఎక్కడా తక్కువ చేసే విధంగా ఉండవు. ఇన్స్పిరేషన్‌ని తీసుకుని పేర్లల్ గా క్రియేట్ చెయ్యడం అంటే ఇలా ఉండాలి అని అనిపించేట్టు ఉంటాయి.

---

జిప్సీ: చకచక ఝుణతా - తకధిమికిటతా
పకపక నవ్వుతా - పంతమాడతా
ఎంటెంట తిరుగుతున్న జంటసోకుసూడరే ||2||
కోరస్: హేయ్! చకచకఝునత - తకధిమికిటతా
పకపక నవ్వుతా - పంతమాడతా
ఎంటెంట తిరుగుతున్న జంటసోకు సూడరే ||2||
జిప్సీ: పక్కనున్న పిల్లా! పంచదారబిళ్ళ
టక్కులెన్నో చేస్తున్నది
కోరస్: ఆ అందగాణ్ణి బుట్టలోన వేసుకున్నది
జిప్సీ: మనసు లాగినాది! వయసు దోచినాది
మత్తుమందు చల్లినాది
కోరస్: అబ్బబ్బ ఉచ్చువేసి పట్టినాది - హైహో ||చక||
జిప్సీ: సూదంటురాయల్లె! లాగుతున్నదీ!! వాలు
సూపుల్తో లోకుల్ని ఊపుతున్నది
కోరస్: వాలుసూపుల్తో లోకుల్ని ఊపుతున్నది
జిప్సీ: వొళ్ళు తెలినీయకా! కళ్ళు గాననీయకా
గీటు దాటకుండకన్ను గీటుతున్నదీ
కోరస్: దీని నాటకాలు తెలిసెనని నవ్వుతునదీ
జిప్సీ: మంచికులుకులాడీ
కోరస్: తళుకుబెళుకులాడీ
జిప్సీ: మంచికులుకులాడీ
కోరస్: ఆహా! వలపుజూపి!! మోసపుచ్చుమాయలాడి
జిప్సీ: మురిసిపోయె రాజా!! ముచటైన రోజా
అంతు తెలిసి అడుగువెయవోయ్
కోరస్: ఓహోహో అందమంత అనుభవించవోయ్ ||చక||

---

ఈ పాటను జిక్కి, బృందం పాడగా పద్మిని ప్రియదర్శిని గ్రూప్ డాన్సర్లతో అభినయించింది. సన్నివేశ ప్రాధాన్యంగా ఎన్.టి.ఆర్, సావిత్రి కూడా భినయంలో పాలుపంచుకుంటారు. ఇక్కడ ఓ రెండు మూడు విషయాల్ని ప్రస్తావించి తీరాలి. ఈ చిత్రానికి మాతృక

అయిన బడీ బెహన్ (1949)లో 'చుప్ చుప్ ఖడె హో జరూర్ కొయి బాత్ హై' అనే పాట లత, ప్రేమ్‌లత కలిసి పాడినది ఉంది. ఆ పాట ఆ రోజుల్లో ఎంతగా హిట్ అయిందంటే - ఏ.వి.యం వారి 'జీవితం' సినిమాలో 'టిక్కు టిక్కు టక్కులాడి' అనే పల్లవితో యధాతథంగా తీసుకోక తప్పదనేటంత స్థాయిలో హిట్ అయిందంటే - ఏ.వి.యం. వారి 'జీవితం' సినిమాలో 'టిక్కు టిక్కు టక్కులాడి' అనే పల్లవితో యధాతథంగా తీసుకోక తప్పదనేటంత స్థాయిలో హిట్ అయింది. తెలుగు వెర్షన్ 'భలే అమ్మాయిలు' సినిమాకొచ్చేసరికి ఆ సన్నివేశానికి ఆ హిందీ ఒరిజినల పాట ప్లేస్‌లో తెలుగుపాట ఇంకొకటి చేసి తీరకతప్పదు. అటువంటి పరిస్థితుల్లో రాజేశ్వరరావు సృష్టించిన పాట - 'చక్ చక్ ఝుణతా'!

మోహనరాగాన్ని అవసరం అయిన చోట మిశ్రమం చేసుకుంటూ ఆయన ఈ పాటను ఎంత ధీటుగా స్వరపరిచారో తెలుసుకోవాలంటే ఒరిజినల్ సినిమాలోని 'చుప్ చుప్ ఖడేహో' పాటని 'చక్ చక్ ఝుణ్‌తా'! పాటని పక్క పక్కన పెట్టుకుని వింటే తెలుస్తుంది.

మరో విషయం ఏమిటంటే - ఈ పాటలో 'సూదంటు రాయలె లాగుతున్నది - వాలుసూపుల్తో లోకుల్ని ఊపుతున్నది' అనే లైనుకన్న ట్యూన్‌ని ఇప్పుడు గనక వింటే రాజేశ్వరరావుగారబ్బాయి కోటి 'పెదరాయుడు' సినిమా కోసం చేసిన 'అబ్బ దీని సోకు చూసి వచ్చా వచ్చా' అనే పాట పల్లవి గుర్తొస్తుంది.

ఇంకో విషయం ఏమిటంటే ఈ 'పెదరాయుడు' లోనే కోటి స్వరపరిచిన 'కదిలే కాలమా కాస్సేపు ఆగుమా' అనే పాటొకటి ఉంది. అందులో 'తాగ్తయ్య తేజం, పెదనాన్న నైజం' అనే చరణం వింటే రాజేశ్వరరావుగారు' 'డాక్టర్ చక్రవర్తి' సినిమా కోసం స్వరపరచిన 'ఓ బొంగరాల బుగ్గలున్నదానా'పాటలో 'నీ కైపు కళ్ళతో నీ కొంటె నవ్వుతో గారడీ చేశావు' అనే చరణం యధాతథంగా స్మృతి పథమో సాక్షాత్కరించి 'రసాలూరు జీన్స్' అంటూ మనచేత అనిపించేస్తాయి.

---

ఒహో బంగరు చిలుక
అహో ఎందుకె అలుకా
ఇలా చూడవు మాటాడవు మోమాటమా ||ఒహో||
చెరువు మీద అలకైతే చెడేదెవ్వరో
ఫలహారం మాని బాధపడేదెవ్వరో ||చెరువు||
చిరునవు నవ్వితే రతనాలు రాలునా ||చిరు ||
ఒక మాటకు వరహాలు ఒలికిపోవునా
వరాలొలికి పోవునా
కనికారం లేదా - కన్నెదుట నిలచినా
అనురాగం రాదా - నోరూర పిలిచినా
చిరునవ్వు నవ్వితే రతనాలు రాలునా
ఒక మాటకు వరహాలు ఒలికిపోవునా
వరాలొలికి పోవునా ||ఒహో||

'ఓహో బంగరు చిలుక' పాటను జిక్కి గానం చేయగా సావిత్రి, యన్.టి.ఆర్.పై చిత్రీకరించారు. ఈ పాట పీలూ, అభేరి రాగాలపై ఆధారపడింది. ఈ పాటలో రాజేశ్వరరావు ముద్ర చాలా చోట్ల కనబడుతూ ఉంటుంది. 'కనికారం లేదా కన్నెదుట నిలచినా' అనే రెండవ చరణానికి ముందు వచ్చే ఆలాపనను ఆలపించుకుంటూ పోతే 'భలేరాము' సినిమాలోని 'ఓహో మేఘమాలా... చల్లగ రావేలా' అనే పాటలో తేలతాం.. అలాగే రెండు చరణాలలోనూ 'చిరునవ్వు నవ్వితే రతనాలు రాలునా' అనే వాక్యం తర్వాత వచ్చే ఫ్లూట్ బిట్ ను ఆలాపించుకుంటూ పోతే 'చెంచులక్ష్మి' సినిమాలో 'కానగరావా ఓ శ్రీహరి రావా' పాటలోని మొదటి చరణంలోని

'వేచి వేచి కనులేమో కాయలు కాచే' తర్వాత వచ్చే ఫ్లూట్ బిట్ దగ్గర తేల్తాం. ఈ రెండు ఉదాహరణలు ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే - ఒక్కొక్క సంగీత దర్శకుడికి తనదైన శైలి ఉంటుంది. ఆ ముద్ర ద్వారా ఆయనను గుర్తించవచ్చు. శాస్త్రీయ సంగీతం అభ్యసించకుండా సినీ సంగీతం ద్వారా రాగాలతో పరిచయం ఏర్పర్చుకోవాలనే వారికి ఈ రకమైన సాధన సాధన ఉపకరిస్తుంది. ఈ పాటలోని 'చెరువు మీద అలకైతే' అనే ప్రయోగం సభ్య ప్రపంచంలోని విలువల దృష్ట్యా అప్పట్లో చాలామందికి కాస్త ఇబ్బందిగానే అనిపించింది.

---

మది ఉయ్యాలలూగే
నవ భావాలేవో రేగే
మానస మానంద మాయెనహో ||మది||
ప్రేమతో గగన వీధులలో
హాయిగా ఎగిరిపోవుదమా ||ప్రేమతో|| ||మది||
తీయని కోరికలూరెను నాలో
తెలియదు కారణమేమో
ప్రేమ ఇదేనా ప్రణయమిదేనా ప్రణయమిదేనా ||ప్రేమ ||
నూతన యవ్వన సమయమున ||మది||

చిన్నతనమేలా సిగ్గు పడనేలా
మన్ననలెందుకు మనలోనా ||చిన్న||
ప్రేమలో కరిగిపోవుదమా
భేదమె మరచిపోవుదమా ||ప్రేమ|| ||మది||
ఓ చెలియా మన జీవితమంతా
పున్నమి వెన్నెల కాదా
రేయి పవలు - నే - నినుమురిపించి
నిను వలపించి
ప్రేమ జగానికి కొనిపోనా ||మది||

'మది ఉయ్యాలలూగే' పాటను ఘంటసాల, లీల గానం చెయ్యగా ఎన్.టి.ఆర్ సావిత్రి అభినయించారు. ఈ పాటలో 'ప్రేమతో గగన వీధులలో' దగ్గర, 'చిన్నతనమేలా' దగ్గర, 'ఓ చెలియా మన జీవితమంతా' దగ్గర ఘంటసాల పాడిన పద్ధతి వింటే అన్ని స్థాయిల్లోనూ గాత్రాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించడం అంటే ఏమిటో అవగాహనకు వస్తుంది. రేంజ్‌కి తగ్గట్టుగా వాయిస్‌ని మలచుకోవడం తెలుస్తుంది. ఇది ఇలా ఉండగా ఈ పాటలో లీల పాడిన విధానాన్ని జాగ్రత్తగా గమనిస్తే - 'మది ఉయ్యాలలూగే నవభావాలేవో రేగే మానస మానంద మాయెనహో' అని అనిపించి పల్లవి అనుభవంలోకి వస్తుంది. 'ప్రేమలో కరిగిపోవుదమా - భేదమే మరచిపోవుదమా' లైన్‌ల దగ్గర లోబేస్ లో ఆమె ఇచ్చిన పెర్ఫార్మెన్సే అందుకే తిరుగులేని సాక్ష్యం. ఇక సంగీత దర్శకునిగా రాజేశ్వరరావు ముద్రని పల్లవిలోను చరణాలలోనూ పట్టుకోవడం కష్టం. వెస్టర్న్ కార్డ్స్‌తో కూడిన ఇంటర్ లూడ్స్ వింటే తరువాత రోజుల్లో ఆయన చేసిన - 'నీకో తోడు కావాలి నాకో నీడ కావాలి' (చదువుకున్న అమ్మాయిలు), 'ఎగురుచున్నది యవ్వనమా' (దొరికితే దొంగలు) - పాటలు గుర్తుకు వస్తాయి. బిళహరి, కమాస్ రాగాల ఆధారంగా ఈ పాట స్వరపరచబడింది. సాహిత్యపరంగా చూసుకుంటే కవులకు గౌరవం ఇచ్చే రోజులు కాబట్టి 'పున్నవి వెన్నెల' అనే పదాల్ని యధాతధంగా ఉంచారు. ఈ రోజుల్లో అయితే 'పొరపాటున గుడి పెట్టడం మర్చిపోయి ఉంటారు' అని నిర్ధారించేసుకుని ఎవరికి వారే కవులైపోయి 'పున్నమి వెన్నెల' అని దిద్దేస్తారని వేరే చెప్పనవసరంలేదు కదా!?

---

వెంకట్రా: అహా! నిసరిమపా! సరిమపా! రిమపా! మపా! పా
రత్నమ్మ: చీటికి మాటికి చీటికట్టి వేధించేవానాడు
లాటరీలోన లక్షలు లక్షలు సాధించేవీనాడు
వెంకట్రా: చీటికి మాటికి! చీటికట్టీ వేధించేనానాడు
లాటరీలోన లక్షలు లక్షలు సాధించేనానాడు
రత్నమ్మ: చెంగావీ చీరకట్టి! రంగైన రైక తొడిగి
వెంకట్రా: అహ .. అహ...అహ..అహ..
రత్నమ్మ: చెంగావీ చీరకట్టి! రంగైన రైక తొడిగి
బంగారు రవ్వల నగలు సింగారించి జోరుగా నేనీతో వస్తా జోడు7
వెంకట్రా: అహ! చిలకా గోరింకల్లాగ ఆలుమగలం హాయిగా ...ఆ
రత్నమ్మ: నిసరిమపా, సరిగపా, రిమపా, మపా, పా

వెంకట్రా: అహ! చిలకా గోరింకల్లాగ ఆలుమగలం హాయిగా
చీకూ చింతా లేకుండా ఇక ఆడుతు పాడుతు వేడుక చేద్దాం
నీలయ్య: గురువా
వెంకట్రా: హా!హా!హా!..
రత్నమ్మ: కోరిన కోరికలన్నీ! తీరెను ఒకటేసారి
సాటివారందరిలోన! రాణీలాగవుంటాను మహరాణీలాగ ఉంటాను
వెంకట్రా: అహ రాణీలావుంటే నువ్వు రాజాలా నే నుండనా
రాణీ నీవు, రాజా నేను చేతిలో బెల్లం ఉన్నంత కాలం
నీలయ: గురువా
వెంకట్రా: ఛీపా

ముగ్గురు: నిసరిమపా, సరిమపా, రిమపా, మపా, పా
లాటరీలోన లక్షలు లక్షలు లాభించె ఈనాడే
ఇద్దరు: మోటరు మీద ఇద్దరమింకా పోదామా ఈనాడే
ఇక పోదామా ఈనాడే టూర్ పోదామా ఈ నాడే

ఈ పాటను పి.బి.శ్రీనివాస్, జిక్కి పాడగా రేలంగి, సూర్యకళ, హాస్యనటుడు బాలకృష్ణపై చిత్రీకరించారు. పి.బి.శ్రీనివాస్, జిక్కితో పాటు బాలకృష్ణకు ప్లేబ్యాక్ పాడిన వారి పేరు టైటిల్స్‌లో గాని, క్యాసెట్ ఇన్‌లే కవర్ పై గాని ఎక్కడా పేర్కొనడం జరగలేదు. ఈ పాటకు మధ్యమావతి రాగం ఆధారం. 'నిసరిమపా' అనే స్వరాల దగ్గరకాని మధ్యమావతి రాగం సుస్పష్టంగా కనిపిస్తుంది. ఈ పాటను సాధన చేస్తే మాధ్యమావతి రాగంపై ఖచ్చితంగా అంచి పట్టువస్తుంది. పి.బి.శ్రీనివాస్ కంఠం రేలంగికి నప్పుతుందని నమ్మిన సంగీత దర్శకుడు యస్. రాజేశ్వరరావు అందుకే 'భలేరాముడు'లో ఒక పాట పాడిస్తే ఈ సినిమాలో రెండుపాటలు పాడించారు. అంతేకాదు - అంతకుముందుగాని, ఆ తర్వాత గాని పి.బి.శ్రీనివాస్ గళంలో మనం చూడని జిలుగుల్ని కూడా రాబట్టారాయన. ఈ సినిమాలోనే రేలంగికి పి.బి.పాడిన 'నాణెమైన సరుకుంది లాహిరి' అనే పాటను వింటుంటే రేలంగిని పి.బి.మిమిక్ చేసినట్టువుంటుంద్. ఇక ఈ లాటరీ పాటలో అయితే - ఫోక్ టైప్ లో 'అహ/ అహ' అని అనటంలోనూ, పై స్థాయిలో రాగాలాపన తీయటంలోనూ పి.బి.శ్రీనివాస్ లోని గాయకుణ్ణి రాజేశ్వరరావు బాగా రెచ్చగొట్టగలిగారనిపిస్తుంది.

---

సరోజ: దాగుడు మూతలు చాలునురా - నీ
ఆగడమంతా తేలెనురా - దొరికావ్ లేరా నీ దొంగవేషాలు మానరా
కోరస్: వేషాలింక మానరా - నీ మోసాలు మాకు తెలిసెనురా ||దాగుడు||
సరోజ: కలకలలాడుతూ - కిలకిల నవ్వుతూ ||కల||
వలపించి మోసగించే - వయ్యారి రాజా... హొయ్...
కోరస్: వలపించి మోసగించే - వయ్యారి రాజా... హొయ్...
సరోజ: మురిపించు మాటలా పులకించిపాటలా ||2||

మరపించి మాయచేసే - మన్మధరాజా
కోరస్: మరపించి మాయచేసే మన్మధరాజా ||దాగుడు||
సరోజ: వన్నెలు చూచి - కన్నెల మనసు దోచే వాడవోయీ
కోరస్: కన్నెల వయసుదోచే వాడవోయీ
సరోజ: నీటైనవాడా - నీ నాటకాలు ఇక సాగవోయి
కోరస్: నీ బూటకాలు ఇక సాగవోయ్ ||దాగుడు||

ఈ పాటను జిక్కి, బృందం పాడగా సావిత్రి ప్రధాన పాత్ర ధారిణిగా అభినయించింది. కిషోర్ కుమార్, వైజయంతిమాల హీరో హీరోయిన్లుగా నటించిన న్యూఢిల్లీ (1956) అనే సినిమా కోసం శంకర్ - జైకిషన్ స్వరపరచి లతతో పాడించిన 'తుమ్ సంగ్ ప్రీత్ లగాయి రసియా' అనే పాటను ఇంటర్ లూడ్స్‌తో సహా యథాతథంగా వాడుకున్నారు. దేశం మొత్తం మీద ఆ హిందీ పాట ఎంత హిట్ అయిందో - మన తెలుగు ఆడియన్స్ ఎంతవరకు ఉన్నారో అంతవరకు ఈ తెలుగు పాట కూడా హిట్ అయింది.

సినీ సంగీతం ద్వారా శృత పాండిత్యాన్ని సాధించవచ్చు. అయితే అందుకు శ్రవణ సంస్కారం తోడవ్వాలి. అటువంటి శ్రవణ సంస్కారానికి దోహదం చేసే పాటలుగా ఈ 'భలే అమ్మాయిలు' సినిమాలోని పాటల్ని చెప్పుకోవచ్చు.



# ఆ పాత పాట మధురం

## రాజా



### తోడికోడళ్ళు

చలన చిత్ర రంగంలో ఎన్నో నూతన అధ్యాయాలకు నాందిగా నిలిచిన చిత్రం అన్నపూర్ణ వారి తోడికోడళ్ళు. అంతకు ముందు 'అమర సందేశం' చిత్రానికి దర్శకత్వం వహించినా 'తోడికోడళ్ళు' తోనే ఆదుర్తి సుబ్బారావు తన జైత్రయాత్రను ప్రారంభించారని చెప్పాలి. అలాగే అన్నపూర్ణ సంస్థలో ఆత్రేయ అడుగుపెట్టడం, అంతవరకూ సెకండ్ హీరోయిన్‌లకు, పిల్లలకు పాడే సుశీల హీరోయిన్‌కు పాడడం తర్వాతర్వాత హీరోయిన్‌లకు సుశీలే పాడాలి అనే సెంటిమెంట్ ఏర్పడిపోవటం ఇవన్నీ 'తోడికోడళ్ళు' చిత్రంతోనే మొదలయ్యాయి. అనితర సాధ్యమైన వైవిధ్యంతో పాటలను స్వరపరిచే మాష్టర్ వేణు స్వరకల్పనలో ఆ చిత్రంలోని పాటలన్నీ అలరించాయి. వాటిలో ముచ్చట గొలిపే కొన్ని పాటలివి.

కారులో షికారు కెళ్ళే
పాలబుగ్గల పసిడి చానా
బుగ్గలమీద గులాబి రంగు
ఎలా వచ్చెనో చెప్పగలవా
నిన్ను మించిన కన్నెలెందరో
మండుటెండలో మాడుతుంటే
వారి బుగ్గల నిగ్గు నీకు
వచ్చి చేరెను తెలుసుకో
కారులో షికారు కెళ్ళే
పాలబుగ్గల పసిడి చానా
నిలిచి విను నీ బడాయి చాలు
తెలుసుకో ఈ నిజా నిజాలు

చలువ రాతి మేడలోన
కులుకుతావే కుర్రదానా
మేడకట్టిన చలువరాయి
ఎలా వచ్చెనో చెప్పగలవా
కడుపు కాలే కష్టజీవులు
ఒడలు విరిచి గనులు తొలిచి
చెమట చలువను చేర్చి రాళ్ళను పేర్చినారు తెలుసుకో ||కారులో షికారు||
గాలిలోనా తేలిపోయే చీరకట్టిన చిన్నదానా ||2||
జిలుగు వెలుగుల చీర శిల్పం ఎలా వచ్చెనో చెప్పగలవా
చిరుగు పాతల బరువు బ్రతుకుల నేతగాళ్ళే నేసినారు
చాకిరొకరిది సౌఖ్యమొకరిది సాగదింక తెలుసుకో ||కారులో షికారు||

ఇప్పటి వరకు కొన్ని సినిమా పాటలపై 'ఇది ఎవరు రాసి ఉంటారు?' అనే చర్చ రావటం, విషయం తేలాక ఆ వాదానికి తెరపడడం జరుగుతూ వచ్చింది. కానీ 'కారులో షికారుకెళ్ళే' పాట విషయంలో మాత్రం రాసింది ఆత్రేయేనని ఎన్నిసార్లు

నిరూపించబడుతున్నా సరే 'శ్రీశ్రీ' యా అని అడగటం పరిపాటిగా - అడగకపోవటం పొరపాటుగా - వస్తోంది. ఒకే విజయాన్ని ఆ సరస్వతీ పుత్రులిద్దరూ ప్రత్యక్షంగా, పరోక్షంగా పంచుకున్న అరుదైన సంఘటన ఇది. ఇక ఈ పాట సాహితీ వైభవాన్ని విశ్లేషించి రాయాలంటే మొత్తం పాటని తిరిగి మననం చేసుకోవటం తప్ప మరో గతిలేదు. నిజానికి ఈ పాటను ఆత్రేయ సినిమా కోసం రాయలేదు. రోజూ సాయంకాలం మెరీనా బీచ్‌కి వెళ్ళే అలవాటుండేదాయనకి, క్వీన్ మేరీస్ కాలేజ్‌లో చదువుకునే ధనవంతులైన అమ్మాయిలు చల్లగాలి కోసం కార్లలో కాలక్షేపానికి వచ్చేవారక్కడికి. వారిని చూసి స్పందించి ఆత్రేయ రాసుకున్న పాట అది. ఈ చిత్రంలో కథానాయకుడు ఆదర్శ భావాలున్న యువకుడు, అతనికో ఇంట్రడక్షన్ సాంగ్ అని అనుకున్నపుడు 'నా దగ్గరో పాటుంది వింటారా?' అంటూ ఆత్రేయ తను రాసుకున్న పాటను చూపించటం దానికి దుక్కిపాటి మధుసూధనరావుగారు ఎంతో బావుందని మెచ్చుకోవటంతో అలా చిత్రంలో చోటుచేసుకుందా పాట. ఘంటసాల హిట్స్‌లో ఒకటిగా నిలిచిపోయిన ఆ పాటను ఇంటర్ లూడ్స్‌తో సహా స్టడీ చేయగలిగితే వేణు పేరుకి ముందు మాష్టర్ అని ఎందుకు ఉందో కొంత అర్ధమవుతుంది.

---

జోజో.. జోజో..
జోజో... జోజో..
కలకాలమీ కలత నిలిచేది కాదు
కనుమూసి కాసేపు నిదిరించు బాబు
నిదిరించు బాబూ ||కలకాలమీ||
పెంచింది పెద్దమ్మ ముద్దార నిన్ను
మమకారమొకసారె మరచునా తాను
త్వరలోనే మనమంతా కలిసేము బాబు ||త్వరలో||
మదిలోన ఆ చింత మానరా నా తండ్రి
కనుమూసి కాసేపు నిదురించు బాబు
జోజో.. జోజో.. జోజో.... జోజో..
చలచల్లగా సాగు సంసారమందు
చెలరేగె మా పోరు నలిగావు నీవు
మా నేరముల నెల్ల మన్నించు బాబు ||మా నేరము||
మదిలోన ఆ చింత మానరా నా తండ్రి ||కలకాలమీ||

ఈ పాటను తాపీ ధర్మారావు నాయుడు గారు రాశారు. సుశీల పాడిన ఈ పాటను సావిత్రి(సినిమాలో) తన కొడుకును నిద్రపుచ్చడానికి పాడే పాటగా చిత్రీకరించారు. సంగీత దర్శకుడు నౌషాద్ అంటే మాష్టర్ వేణు గారికి ప్రాణం. ఆయన శైలిని ఈయన ఎంతగా పుణికి పుచ్చుకున్నారో ఈ పాటలో మనం పట్టుకోవచ్చు. 'పెంచింది పెద్దమ్మ ముద్దారనిన్ను' అనే చరణానికి ముందు గల ఇంటర్ లూడ్‌ను బాగా బైహార్ట్ చేసి ఆలపించుకుంటూ వెళితే 'మొఘల్ - ఎ - అజం' కోసం నౌషాద్ స్వరపరచిన 'ప్యార్‌కియాతో డర్నా క్యా' అనే పాట ఇంటర్ లూడ్స్‌లోకి వెళ్ళిపోతాం. ఆ తరహా ఇంటర్ లూడ్‌లు నౌషాద్ స్వరరచనలలో అంతకుముందు చాలాచోట్ల ఉన్నా 1960 లో విడుదలయిన 'మొఘల్ - ఎ - అజం' చిత్రంలోని ఆ పాటని సులువుగా అర్ధం అవడం కోసమే ఉదహరించటం జరిగింది.

---

ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపు సొలుపేమున్నది
ఇద్దరుమొకటై చేయికలిపితే ఎదురేమున్నది
మనకు కొదవేమున్నది ||ఆడుతు||
ఒంపులు తిరిగి ఒయ్యారంగా ఊగుతు విసురుతు గూడేస్తుంటే
నీ గాజులు ఘల్లని మోగుతుంటే
నా మనస్సు ఝల్లు మంటున్నది నా మనసు ఝల్లు మంటున్నది
తీరని కోరికలూరింపంగా ఓరకంట నను చూస్తుంటే
చిలిపి నవ్వులు చిందులు తొక్కి సిగ్గు ముంచుకొస్తున్నది
నును సిగ్గు ముంచుకొస్తున్నది ||ఆడుతు||
చెదరి జారిన కుంకుమ రేఖలు పెదవులపైన మెరుస్తు ఉంటే
తీయని తలుపులు నాలో ఏమో తికమక చేస్తూ ఉన్నవి
అహ.. తికమక చేస్తూ ఉన్నవి ||ఆడుతు||
మాటల్లో మోమాటం నిలిపి రాగంలో అనురాగం కలిపి
పాటపాడుతుంటే నా మది పరవశమై పోతున్నది
అహ పరవశమైపోతున్నది ||ఆడుతు||

చేలకు నీళ్ళను అందించటానికి 'గూడ' వేసే పద్ధతిని ఆడుతు పాడుతు' పాటలో చూపించారు. ఆ మూమెంట్‌కు తగ్గట్టుగా ఫోక్ మ్యూజిక్‌ని బేస్ చేసుకుని రిథమ్‌ని 2/4 లో అంటే చతురస్రంలో సెట్ చేసుకుని మరోవైపు అందమైన ఓ ప్రణయ గీతంలా కూడా రూపొందిస్తూ 'పనిపాటా' అనే నానుడికి అద్దంపట్టి అర్థం చెప్పే విధంగా నిర్మాత, దర్శకుడు, రచయిత, సంగీత దర్శకుడు, గాయనీ గాయకులు, నటీనటులు, తదితర సాంకేతిక బృందం అంతా కల్సి చేసిన సమిష్టి కృషి పాటంతా కనిపిస్తుంది - గూడవేసే పద్ధతి తప్ప మరో మూమెంట్ లేని ఆ పాటను మొనాటనీ అనిపించని రీతిలో - తీర్చిదిద్దుకున్న తీరుచూస్తే ఆ రోజుల్లో ఉన్నదేమిటో, ఈరోజుల్లో కొరవడుతున్నదేమిటో అరటిపండు చేతిలో ఒలిచి పెట్టినట్టు తెలిసి పోతుంది. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన అక్కినేని ఎంతో సులువుగా గూడ వేస్తూ చేసే అభినయానికి ధీటుగా ఉండటానికి సావిత్రి ఓ మూడురోజుల పాటు అక్కినేని శిక్షణలో సాధన చేసిందని ఈ సందర్భంగా ప్రత్యేకించి చెప్పక తప్పదు. ఛానల్స్‌లో ప్రసారం అయినప్పుడుగాని, సి.డి. తెచ్చుకుని చూసినపుడుగాని గమనించండి. అక్కినేని, సావిత్రి కలిసి గూడవేసే 'డైరెక్ట్ షాట్'లలో కనీసం 49 నుంచి 50 సార్లకు పైగా వారిద్దరూ గూడవేయటం కనిపిస్తుంది. పాటను, లిప్ మూమెంట్‌లను లాంగ్ షాట్‌లో మానేజ్ చేయించేసుకునే కళాకారుల దృష్టికి రావలసిన సత్యమిది.

ఇక్కడ ఇంకో విషయం కూడా ఉంది. జాగ్రత్తగా ఈ పాట ఆలపించుకుంటూ పోతే బాగా తెలిసినవారికి నౌషాద్ స్వరకల్పన చేసే పద్ధతి మనసులో మెదులుతుంది. నౌషాద్ వద్ద గులాం మహమ్మద్ (పకీజా సంగీత దర్శకుడు) వంటి వారు సైతం శిష్యరికం చేసినా ఆయన స్టయిల్ని అందిపుచ్చుకోలేకపోయారని అది కేవలం ఒక్క మాస్టర్ వేణుకే సాధ్యపడిందని ఓసారి నౌషాదే అంగీకరించారట. ఈ పాట చివరి చరణంలో ఆ ముద్ర చాలావరకు తొంగిచూడడాన్ని మనం గమనించవచ్చు. ఈ పాటను కొసరాజు వ్రాయగా ఘంటసాల, సుశీల ఆలపించారు.

నలుగురు కలిసి పొరుపులు మరిచి
చెయ్యాలి ఉమ్మడి వ్యవసాయం మన కిస్తుందెక్కువ ఫలసాయం
ఇది రైతులకెంతో సదుపాయం ||నలుగురు||
ఒక సంసారం వందెకరాలను పండించటమే అరుదుకదా
అది భరించలేని బరువు కదా
పది కుటుంబములు వెయ్యెకరాలను
సాగు చెయ్యడం సులువు కదా ||నలుగురు||
మహారాజులూ జమిందారులూ మచ్చుకు దొరకని కాలంలో
ఈ ప్రజలే ఏలే రాజ్యంలో ఇతరుల కష్టం దోచుకు తినడం
ఇదియే సూత్రం ఒక్కడూ మాత్రం భూమిని గుత్తకు కొనరాదు
కడు సోమరిపోతై మనరాదు
నేలా నీరూ గాలీ వెలుగూ కొందరి సొత్తని అనరాదు
అవి అందరి హక్కై అలరారు ||నలుగురు||
ఒకొక్క వ్యక్తీ, సమస్త శక్తీ ధారపోసి పనిచెయ్యాలి
ధన ధాన్యరాశులే పెంచాలి
కూటికి గుడ్డకు లోటులేక తనకవసరమైనవి పొందాలి ||నలుగురు||

ఈ పాటను శ్రీ శ్రీ రాయగా ఘంటసాల, బృందం ఆలపించారు. అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, కొంతమంది ఉపపాత్రధారులపై చిత్రీకరించారు. ఈ పాటలో సాహిత్యం గురించి ముందుగా చెప్పుకోవాలి. ఇవాళ ఎంతోమంది ప్రకటిస్తున్న భూసంస్కరణలు ఆ రోజుల్లోనే పాట ద్వారా తెలియజేయడానికి ప్రయత్నించారని పాట సాహిత్యం మొత్తం అవలోకిస్తే అవగతమవుతుంది. మూడో చరణంలో - గుత్తుకు కౌనరాదు / పాతని అనరాదు/ హక్కై అలరారు వంటి పదప్రయోగాలని ట్యూన్‌తో సహా మననం చేసుకుంటూ ఉంటే అర్థ సౌందర్యంతో పాటు శబ్ద సౌందర్యాన్ని కూడా శ్రీ శ్రీ ఎంత రసాత్మకంగా ఆవిష్కరించారో తెలుస్తుంది. అలాగే ఘంటసాల వారి గాత్ర మాధుర్యాన్ని ఏ రేంజ్‌లో ఉపయోగించుకున్నా రసానుభూతి చెడదని ఆఖరి చరణాన్ని ఓ సారి పాడుకుంటే అనుభవంలోకి వస్తుంది.

---

అ: తింటానిక్కూడు చాలదే, జాంగిరీ ఉంటానికిల్లు చాలదే
బస్తీకి పోదాం పైసా తెద్దామే రావేనా రంగసానీ!!
ఆ: టౌను పక్కకెల్లొద్దురా డింగరీ! డాంబికాలు పోవొద్దురా
టౌను పక్కకెళ్ళేవు డౌనైపోతావురా రబ్బీ బంగారు సామి!
అ: రెక్కలన్నీ ఇరుసుకుంట రిక్షాలు లాక్కుంట
చిల్లరంత జేర్చుకుంట సినిమాలు చూసుకుంట
షికార్లు కొడదామే - పిల్లా జలసా చేద్దామే ||బస్తీకి||
ఆ: కూలి దొరకదూ నాలిదొరకదూ
గొంతు తడుపుకొన నీరు దొరకదూ
రేయింబగలూ రిక్షా లాగిన
అద్దెకు [illegible] మిగలదు
గడప గడపకు కడుపు బట్టుకుని ఆకలాకలని అంగలార్చితే
గేటు బిగించీ కొట్టొస్తారు!
కుక్కలనే ఉసి కొల్పిస్తారు ||టౌను పక్క||
అ: ఫ్యాక్టరీలలో పని సులువంట
గంటయిపోతే ఇంట్లో ఉంట
వారం వారం బట్వాడంట
ఒరే అరే అన వీల్లేదంట
కాఫీ తోటే గడపొచ్చంట కబుర్లు చెప్పుకు బ్రతకొచ్చంట
చూడ చిత్రమంట పిల్లా! చోద్యమౌతదంట ||బస్తీకి ||

ఆ: పిప్పయి పోయే పిచ్చి ఖర్చులు పోకిరి మూకల సావాసాలు
చీట్ల పేకలు సిగసిగ పట్లు తాగుడు వాగుడు తన్నులాటలు
ఇంటి చుట్టునా ఈగలు దోమలు
ఇరుకు సందులు మురుగు వాసనలు
అంటురోగములు తగిలి చచ్చినా
అవతల కీడ్చే దిక్కు వుండదు ||టౌను||
అ: ఏలికేస్తేను కాలికేస్తావు ఎనక్కు రమ్మని గోల జేస్తావు
ఏ దారంటే గోదారంటవు ఇరుకున బెట్టి కొరుక్కుతింటవ్
దిక్కు దోచనీవే పిల్లా! తికమక జేసేవే

బస్తీకి నే బోను నీతో ఉంటానే! రాణీ నా రంగసానీ
గొడ్డూ గోదా మేపుకుందాం! కోళ్ళూ మేకలు పెంచుకుందాం
కూరానారా జరుపుకుందాం! పాలూ పెరుగు అమ్ముకుందాం
పిల్లా జెల్లను సూసుకుందాం! కలో గంజియో తాగి పడుందాం
ఇద్దరు:టౌను పకక్కెళ్ళద్దండోయ్ బాబూ
డాంబికాలు పోవద్దండోయ్
టౌను పక్కకెళ్ళేరు డౌనైపోతారు!
తానే తందాన తాన తందానే! తందాన తాన

ఈ పాటను కొసరాజు రాయగా ఘంటసాల, జిక్కి ఆలపించారు. ఇ.వి.సరోజ, ఈ చిత్ర నృత్యదర్శకుడు ఎ.కె.చోప్రా కలిసి అభినయించిన ఈ నృత్యగీతంలో అక్కినేని, సావిత్రితోపాటు, కొంతమంది ఉపపాత్రధారులు కూడా కనిపిస్తారు. వాస్తవాలను వ్యంగ్య వైభవంతో జోడించి చెప్పటంలో కొసరాజు ఎప్పుడూ ముందుండే రాజే తప్ప కొసన ఉండే రాజు మాత్రం కాదు. ఏ చరణానికి ఆ

చరణం 'కరెక్టే కదా' అని అనిపిస్తూ అందులోని గుణదోషాలను వ్యంగ్యరీతిలో తెలియజేయటంలో కొసరాజు ప్రతిభా విశేషాలు ఎటువంటివో తెలియజెప్పే మరొక గీతమిది. వికాసాన్ని పెంచే విధంగా విజ్ఞానాన్ని వినోదంతో పాటు అందించే సందేశాత్మక గీతాలను ప్రతి చిత్రంలోనూ ఉండేలా చూసుకోవటం అన్నపూర్ణ సంస్థ ఆనవాయితీ.. ఇక ట్యూన్ పరంగా చూసుకుంటే ఆ రోజుల్లో బాగా పాపులర్ అవటమే కాక ఇవాళ విన్నా కూడా ఎంతో ఫ్రెష్‌గా ఫీలయ్యే స్వరరచన ఇది.

గ్రామ జనాభా పెద్ద సంఖ్యలో పట్టణాలకు వలస రావడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడం, నగరపాలనా వ్యవస్థ అదుపు తప్పడం జరిగింది. అది అనేక సామాజిక సమస్యలకు దారి తీసింది. ఈ ప్రమాదాన్ని 45 సంవత్సరాలక్రితమే పసిగట్టి పెద్దగా చదువుకోని గ్రామవాసులకు ( ఈ హెచ్చరిక వారికేగా) సైతం అర్థమయ్యే రీతిలో విడమర్చి చెప్పారు కొసరాజు. అర్బనైజేషన్‌ను నిరసిస్తూనే గ్రామీణ సమాజంలో ఉండే లోపాలను (శ్రామిక వర్గాలకు మర్యాద ఇవ్వకపోవడం, పరిమితి లేకుండా పనిచేయించడం) కూడా ఎత్తి చూపి 'నేటివ్ సోషల్ సైంటిస్ట్'గా తన సత్తా చూపించారయన.

---

అ: నీ సోకు చూడకుండ నవనీతమ్మ
నే నిముసమైన బతకలేనె ముద్దుల గుమ్మ
నీ నీడ వదిలి ఉండలేనే ముద్దుల గుమ్మ
ఆ: ఎంత మాయగాడవురా రమణయ్ మావ
నిన్నే తల్లి కన్నదిరా వయ్యారి మావ
నీ కెన్ని విద్యలున్నయ్ రా వయ్యారి మావ
అ: నీవు చూసే చూపులకు వన్నెలాడీ
నీరుగారి పోతానె చిన్నెలాడి
మనసు దాచుకోలేను నవీనతమ్మా
పది మాటలైన చెప్పలేను ముద్దులగుమ్మా ||నీ సోకు||

అ: ముచ్చట్లు చెబుతావు వన్నెకాడ
మోసపుచ్చి పోతావు చిన్నవాడ
మాటవరసకైన నువ్వు రమణయ్ మావ
ఒక్క మాటైనా ఇచ్చావా రమణయ్ మావా ||ఎంత||
అ: నీ తోటి సరసమాడి పడుచు పిల్లా
నెల్లూరు వెళతానే గడుసుపిల్లా
మళ్ళి తిరిగి వస్తానే నవనీతమ్మా
నిను మరచిపోయి ఉండలేనె ముద్దులగుమ్మా ||నీ సోకు||
ఆ: నెల్లూరు పోతేను నీటుగాడా
తెల్ల బియ్యం తెస్తావా నీటు గాడా
పక్క ఊళ్ళో నువ్వుంటె రమణయ్ మావ
నే ప్రాణాలు నిల్పలేను రమణయ్ మావ ||ఎంత||

ఈ పాటను మాధవపెద్ది సత్యం, జిక్కి పాడగా రేలంగి, రాజసులోచన అభినయించారు. కథాపరంగా ఆలోచిస్తే వివాహితుడైన ఓ పాత్రధారి, అతడిని తన వలలో వేసేసుకున్న ఓ పాత్రధారిణి కలిసి వాళ్ళ మూడ్‌లో పాడుకునే పాట ఇది. ఇదే థీమ్‌తో ఇవాళ ఓ పాట సినిమాలో పెట్టాల్సి వస్తే ఎటువంటి సాహిత్యాన్ని కవిగారి దగ్గర్నుంచి రాబట్టుకుంటారన్న విషయంపై ఇప్పుడు తర్కించినా, తల బాదుకున్నా ఏ ప్రయోజనం నెరవేరదని తెలిసినా - కనీసం ఆనాటి పాటలలోనైనా దిగజారని భాష ఉందికదా, అవన్నీ మన పిల్లలకి చెప్పి మంచేదో చెడేదో వివరించే అవకాశమైనా ఉందికదా అనే తృప్తితో మనసు సేద తీరుతుంది. అంతేకాదు ఆ పాటని ఇవాళ చూస్తుంటే ఏదో కామెడి పాట చూస్తున్నట్టు ఉంటుందే తప్ప నైతిక విలువలు వదిలేసుకున్న ఇద్దరు పాడుకునే శృంగార గీతంలా ఉండదు. అదీ ఆనాటి పాటలుకున్న విలువ!!

శరత్ రాసిన బెంగాలీ నవల 'నిష్కృతి' ఆధారంగా ట్రీట్‌మెంట్ తయారు చేసుకున్న ఈ కథని 'తోడికోడళ్ళు'గా తెలుగులోను 'ఎంగళ్ విట్టు మహాలక్ష్మి'గా తమిళంలోను ఏకకాలంలో నిర్మించారు దుక్కిపాటి మధుసూధనరావు. రెండూ కొద్దిరోజుల తేడాతో 1957 లో విడుదలయ్యాయి. రెండిట్లోనూ కామన్‌గా అక్కినేని, సావిత్రి, కన్నాంబ, ఎస్వీ రంగారావు, రాజసులోచన ఉన్నారు. తమిళ వెర్షన్‌కి డైలాగుల్ని (తర్వాత దర్శకుడిగా మారిన) శ్రీధర్ రాయగా కొన్ని పాటల్ని ఉడుమలై నారాయణ కవి రాశారు. ఈ తెలుగు చిత్రం రజతోత్సవం చేసుకోగా, తమిళ చిత్రం శతదినోత్సవం జరుపుకుంది.



# ఆ పాత పాట మధురం

## రాజా



### సారంగధర

**పాటలోని నాదానికి** సంగీత దర్శకుడు సృష్టికర్త అయితే గాయకుడు ఆవిష్కర్త. మనో గర్భంలో అంకురార్పణ జరిగి ఆ నాద బీజానికి ఊపిరి పోసి, జవసత్వాలతో నింపి సునాదంగా మార్చి బాహ్యప్రపంచానికి పరిచయం చేసే గాయకుడు తల్లి అయితే కారకుడైన స్వరకర్త తండ్రి వంటివాడని వేరే చెప్పనవసరం లేదు. తల్లీ తండ్రీ తానే అయి బాధ్యత వహించిన తల్లి పెంపకంలో పెరిగిన సంతానం గణనీయమయిన పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవడానికి ఎంత అవకాశమున్నదో - తానే సంగీత దర్శకుడైన గాయకుని స్వర రచనలలో ప్రాణ ప్రతిష్ఠ వినూత్న చైతన్యంతో జరగటానికి కూడా అంతే అవకాశముంది. ఘంటసాల సంగీత దర్శకత్వంలో వచ్చిన సారంగధర చిత్రంలోని పాటలు ఆ భావనకు తగిన బలాన్ని చేకూరుస్తూ నిరూపిస్తాయి. సముద్రాల రాఘవాచార్య మాటలు, పాటలు రచించగా 1957 లో విడుదలయిన ఈ చిత్రాన్ని మినర్వా పిక్చర్స్ వారు నిర్మించారు. చక్కని అభిరుచికి మచ్చు తునకలుగా నిలిచే ఆ చిత్రంలో కొన్ని పాటలివి

అతడు: అన్నానా... భామినీ...
ఆమె: ఏమని
అతడు: ఎపుడైనా... అన్నానా.. భామినీ
ఆమె: ఏమని
అతడు: అరవిరిసిన పూలలోన
నీదు మురిపె మెరసేనని ||అరవిరిసిన||
మాటవరసకెపుడైనా ||అన్నానా||
ఆమె: అన్నానా.. మోహనా
అతడు: ఏమని
ఆమె: తొలి చూపులనాడె నీవు
వలపుదోచుకుని నావని ||తొలిచూపు||
ఆదమరచి ఎపుడైనా ||అన్నానా||
అతడు: లోకానికి రాజునైన
నీ ప్రేమకు దాసుడనని ||లోకానికి||
మాటవరసకెపుడైనా ||అన్నానా||
ఆమె: నిన్నె నమ్ముకున్నానని
నీవె నా దైవమని
ఆదమరచి ఎపుడైనా ||అన్నానా||
ఇద్దరూ: ఆ...ఆ...ఆ..

ఈ పాటను ఘంటసాల, పి.లీల గానం చేయగా ఎన్.టి.ఆర్, రాజసులోచన అభినయించారు. సాహిత్యపరంగా సముద్రాల సీనియర్ కొత్త పోకడలు పోయారీ గీతంలో. మనసులో అనుకున్నదంతా ఓ వైపు తెలియజేస్తూనే మరో వైపు 'ఆదమరచి ఎపుడైనా అన్నానా', 'మాట వరస కెపుడైనా అన్నానా' అని చిలిపిగా తప్పించుకుంటూ ఎదుటివారిని ఆటపట్టించుకోవడం వంటి ప్రక్రియ

ప్రేమికుల మధ్య చాలా ఆకర్షణీయంగా, తమాషాగా ఉంటుంది. ఆ స్పందనను సమతూకంతో అందించటంలో సముద్రాల - సీనియర్‌ని అనిపించుకున్నారు. సంగీత దర్శకునిగా ఘంటసాల ఈ పాటను స్వరపరచిన తీరు ప్రత్యేకించి పేర్కొనదగినది.

1948లో మద్రాసు వచ్చి కచ్చేరీ ఇచ్చిన ఉత్తరాది విద్వాంసుడు బడే గులాం ఆలీఖాన్ ప్రభావం ఘంటసాలపై ఎంతగానో ఉందని 'చంద్రహారం' చిత్రంలోని 'ఇది నా చెలి' పాట విశ్లేషణలో ప్రస్తావించడం జరిగింది. బడేగులాం ఆలీఖాన్ ప్రేరణగా హిందూస్థానీ సంగీతం నుంచి తీసుకున్న రాగేశ్వరి రాగంతో ఘంటసాల ఎంతగా ప్రభావితులయ్యారో మరోసారి చెబుతుందీ 'అన్నానా భామిని' పాట. విరామాలు పాటలో ఉంటే మనసుకి రిలీఫ్ ఎంత చక్కగా లభిస్తుందో తెలుసుకోవాలంటే ఈ పాటను వింటే చాలు. మాట వరుసకెపుడైనా అన్నానా, ఆదమరచి ఎపుడైనా అన్నానా వాక్యాల వద్ద లయని పూర్తిగా ఆపేసి డైలాగ్ ఫార్మ్‌లో ఆ లైన్లని రాగయుక్తంగా పలికించటంలో రసోత్పత్తి ఎంతగా పండిందో అనుభవైకవేద్యమే తప్ప వర్ణించలేం. గాయకుడే సంగీత దర్శకుడైతే సమకూరే కొత్త అందాలవి. ఇక గాన మాధుర్యాన్ని అందించటంలో ఆ రెండు గళాలు అనర్ఘళాలే కదా...

---

అడుగడుగో అల్లడుగో
అభినవ నారీ మన్మధుడు
అభినవ నారీ మన్మధుడు ||అడు||
మదిలో మెదిలే దేవుడే
కనిపించెను కన్నులకే
వ్రతము ఫలించే
బ్రతుకు తరించే ||వ్రతము||
వరుడరుదెంచెనుగా ||అడుగడుగో||

నీ ..రూపు రేఖ
నీ... నవ యవ్వన శోభా...
సఫలమయె శుభవేళ
సమకూరెనుగా... ||అడుగడుగో||
నీ చెలికానిని దోచుకునేనని
అలుగకుమా పావురమా...
నీ ఉపకృతికి బహుకృతిగా...
గైకొనుమా నా ప్రేమా... ||అడుగడుగో||

'అడుగడుగో అల్లడుగో' పాటను భానుమతి పాడారు, అభినయించారు అని వేరుగా చెప్పడం కన్నా 'ఇది భానుమతి పాట' అని అంటే నేరుగా భావం అందరికీ అందిపోతుంది. భీం ప్లాస్ రాగంలో మలచబడ్డ ఈ పాట భానుమతి స్వరజీవితానికి మరో ప్లస్ అయింది. దగ్గరి గమకాలు ఆమె గొంతులో ఎంత హాయిగా పలుకుతాయో గ్రహించి సమయస్ఫూర్తితో.. ఇంకా చెప్పాలంటే 'రసమయస్ఫూర్తితో.. ' ఉపయోగించుకున్నారు ఘంటసాల. హిందూస్థానీ సంప్రదాయంలో గల సాకీల ప్రయోగంలా రెండవ, మూడవ చరణాలను మలచుకుని పాటకు కొత్త సొగసులు సమకూర్చారాయన. ఈ పాట వింటుంటే - ఘంటసాల సంగీత దర్శకత్వంలో వచ్చిన మరో రెండు చిత్రాల్లోని పాటలు గుర్తొచ్చే అవకాశం ఉంది. మొదటి చరణంలోని రెండవ లైన్ 'కనిపించెను కన్నులకే' పూర్తి కాగానే వచ్చే ఇంటర్ లూడ్ - 'మాయాబజార్'లోని 'నీవేనా నను తలచినది' పాటలో 'ఆ మెలుకువలోనే ఒక కలగా' లైన్ తర్వాత వచ్చే ఇంటర్‌లూడ్‌ను స్ఫురింపచేస్తుంది. అలాగే ఈ పాటలోని సాకీలవలె సాగే చరణాలు వింటుంటే 'పెళ్ళినాటి ప్రమాణాలు' చిత్రంలోని 'నీతోనే నా లోకం' పాటలో గల 'కనులు తెరిచినా కనులు మూసినా ఆఫీసులో ఫైళ్ళు తెరిచినా' చరణం (ఇది కూడా సాకీలా సాగే ప్రయోగమే) జ్ఞప్తికి వస్తుంది.

సాకీ: రాజా - నా రాజా - ఓ రాజా

పల్లవి: ఓ నా రాజా - ఇటు చూడవోయి

నేనోయ్ - భీతిలవలదోయి ||ఓనా ||

చరణం: అలిగిపోతివి - అలనాడు

ఔనా నేడేది నీకు దారి

చరణం: కూరి తమి మీరి దరిజేరనా

మురిసి నీ మ్రోల కరిగిపోనా

వేసి కూరిమి చెరలోనా

కొసరి నా దాసు చేసుకోనా ||ఓనా||

ఈ పాటకు గానం, అభినయం శ్రీమతి భానుమతే! సన్నివేశ ప్రాధాన్యంగా నటుడు సీనియర్ ఏ.వీ సుబ్బారావు కూడా పాట చివర్లో కనిపిస్తారు. ఈ పాట కళ్యాణి రాగంతో స్వరపరచబడింది. అక్కడక్కడ యమన్ కూడా తొంగి చూస్తూ ఉంటుంది. సంగీతానికి సంబంధించినంతవరకూ ఈ పాట స్వరకల్పన ఒక ఎత్తు, గానం ఒక్కటీ ఒక ఎత్తు. ఎందుకంటే కళ్యాణిరాగంలో స్వరపరచటంలో ఘంటసాల గారికి తనకంటూ ఓ శైలి, ముద్ర ఉంది. రావే చెలియా (మంచిమనసుకు మంచిరోజులు), విరిసె చల్లని వెన్నెల (లవ-కుశ), తలనిండా పూదండ దాల్చిన రాణి (ప్రైవేట్ సాంగ్), పాటలను కూలంకషంగా మధించిన వారికి ఆ శైలి, ముద్ర మనోగతమై పోతూ ఉంటాయి. అలాగే కళ్యాణి రాగంలో గల పాటలను పాడటంలో భానుమతిగారికి విలక్షణమైన పంధా ఉంది. ఆ రెండు రీతులను కలగలపుకున్న పాట ఇది. మరోవిధంగా చెప్పాలంటే - ఈ పాటను గనుక సాధన చేసి యధాతధంగా పాడగలిగినవారికి కళ్యాణిరాగంపై మంచిపట్టు లభిస్తుంది.



# ఆ పాత పాట మధురం

## రాజా



### ప్రేమలేఖలు

తెలుగు సినీ పరిశ్రమకి అనువాద చిత్రాలు రావటమనే ప్రక్రియ ఎప్పటి నుంచో ఉంది. తమిళ, కన్నడ, హిందీ, మలయాళీ, ఆంగ్ల చిత్రాలెన్నో తెలుగులో డబ్ చేయబడ్డాయి. వాటిలో చాలా వరకు ఘనవిజయం సాధించినవీ ఉన్నాయి. ఘోరపరాజయం పొందినవీ ఉన్నాయి. ఒరిజినల్‌లో ఫెయిల్ అయినా - డబ్ చేసిన తెలుగు వర్షన్‌లు ఆంధ్రరాష్ట్రంలో హిట్ అయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇవాళ్టికీ శ్రోతల హృదయాలలో నిలిచిపోయిన డబ్బింగ్ పాటలెన్నో ఉన్నాయి. తెలుగు భాషకు అనుగుణంగా లిప్ మూమెంట్‌నిస్తూ కేవలం పాటల పోర్షన్ వరకు ప్రత్యేకంగా షూట్ చేసిన సందర్భాలు లేకపోలేదు. వాటిని 'సెమీ డబ్బింగ్'గా అనుకోవచ్చు. ఈ నేపథ్యంలో చిత్రంలో ఉన్న తొమ్మిది పాటలూ హిట్ అయి నేటికీ ప్రేక్షకుల హృదయాలలో సజీవంగా ఉన్న ఒక చిత్రం గురించి ప్రస్తావించక తప్పదు. అదే రాజ్ కపూర్ నిర్మించిన ప్రేమలేఖలు. ఈ చిత్రం 1953 లో విడుదలయింది. రాజ్ కపూర్, నర్గీస్, ప్రాణ్, విజయలక్ష్మి ముఖ్యతారాగణం. హిందీలో 'ఆహ్'గా, తెలుగులో 'ప్రేమలేఖలు'గా, తమిళంలో 'అవన్'గా మూడుభాషలలో ఏకకాలంలో నిర్మించారు. లిప్ మూమెంట్స్ అవసరంలేని షాట్‌లను మూడు భాషలకూ కామన్‌గా ఉంచుకుని మిగిలిన చిత్రంలో ఏ భాషకు కావలసిన భాగాన్ని ఆ భాషలో పాటలతో సహా చిత్రీకరించారు. తెలుగు వెర్షన్‌కి మాటలూ - పాటలూ ఆరుద్ర రాశారు. శంకర్ - జైకిషన్ స్వరపరచగా తెలుగునాట ఆ చిత్రానికి అఖండ విజయాన్ని చేకూర్చి పెట్టిన ఆ తొమ్మిది పాటలూ ఇవి.

నీవెవ్వరవో చిరునవ్వులతో
నీ రూపు నను మంత్రించే
మది పొంగి పొంగి పులకించె ||నీవెవ్వరివో||
కనుమూసిన తెరచిన నీ రూపే ||2||
నా కన్నుల ముందర కనిపించె ||2||
ఎల కోరికలేవో కుసుమించి
నా దేహమే వికసించే
మది పొంగి పొంగిపులకించే || 2|| ||నీవెవ్వరివో||
ప్రియురాలిని మొదటే తెలుసుకుని ||2||
నేనామె రహస్యం కనుగొంటే ||2|| నే
ఈ
నెందుకు బయటకు చెప్పాలి? -
తను దూరమై మురిపించే - ప్రతిరోజు రోజు వేధించె
ప్రతిరోజు రోజు వేధించె
నిను చూడకనే ప్రేమించితినే ||2||
మరి కనుగొనినా నే లోబడనా ||2||
నా మానస చోరా - నీ తలపే
ఈ లోకమే మురిపించె
మది పొంగి పొంగి పులకించె ||2|| ||నీ వెవ్వరివో||

ఈ పాటను జిక్కి, ఏ..యమ్.రాజా పాడగా నర్గీస్, రాజ్‌కపూర్‌పై చిత్రీకరించారు. శబ్దం ఆయువుపట్లు ఆరుద్రకు బాగా తెలుసు. అందుకే (అర్థంతో సంబంధం లేకపోయినా) 'మేరా అంగ్ అంగ్ ముస్ కాయా' అనే హిందీ లైన్‌కి పేర్లల్‌గా 'మది పొంగి పొంగి పులకించె' వంటి వాక్యాలను రాయటం జరిగింది. డ్రమ్ములో కూర్చున్న రాజ్‌కపూర్, పక్కనే దుప్పటి కప్పుకున్న నర్గీస్ పాడుకునే ఈ పాట ట్యూన్ పరంగా ఎంత హిట్ అయిందో చిత్రీకరణ పరంగా కూడా అంతే హిట్ అయింది. 'సప్నోం కా సౌదాగర్' సినిమాలో హేమామాలిని, రాజ్ కపూర్‌తో ఇటువంటి సన్నివేశమే చిత్రీకరించటం, మన తెలుగు సినిమా 'పిల్లా -పిడుగా'లో కూడా రామకృష్ణ, జ్యోతిలక్ష్మితో ఇలాటి సీనే ప్లాన్ చెయ్యటం ఇవన్నీ అందుకు ఉదాహరణలు.

---

ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతం
మువ్వల చిందు హుషారు పసందు - వినే చెవి విందు ||ఘల్లు||
ఓ.. చందురుని మోమందు
బంధించి వేస్తే.. బంధించి వేస్తే...
ఓ.. తారకల కోరికల
తలంబ్రాలు పోసే.. తలంబ్రాలు పోసే
తరుణి మిసిమించెను - వరుడు హసియించెను
వంపుల తీవి, కెంపుల మోవి ఇంపగు జోడీ ||ఘల్లు||
ఓ...మనసు మనసు కలియంగ
ఓ.. ఒడిదుడుకులు నిలబడితే
వలపు బుజువాయె... వలపు బుజువాయె
మింటి గిలిగింతకె - భూమి పులకింతలే
తెరలు తొలంగి మరులు చెలంగి కులుకులు పొంగి ||ఘల్లు||
ఓ.. వగలే సిరి నగలైతే
వలపంతా పండె. వలపంతా పండె
ఓ.. హాయి హాయి సన్నాయి
రేయంత నిండె. రేయంత నిండె
సాగెనూరేగింపు చేయి చేయీ కలుపు
మసక చీకటిలో మల్లె పందిటిలో

జిక్కి, బృందం పాడిన ఈ పాటను రాజ్‌కపూర్, నర్గీస్ ముఖ్య పాత్రధారులై ఓ నృత్యం చూస్తుంటే ఆ నట్టువరాళ్ళు అభినయించిన నృత్యగీతంగా చిత్రీకరించారు. ఈ పాట ఆ రోజుల్లో ఎంతగా హిట్ అయిందో చెప్పటానికి ఈ రోజుల్లోలాగ ప్లాటినం డిస్కులు, గోల్డెన్ డిస్కులు లేవు. ఇది శంకర్ - జైకిషన్‌ల బ్రాండ్ సాంగ్. ఇలాంటి పాటలు వారి సంగీత దర్శకత్వంలో..ముఖ్యంగా రాజ్‌కపూర్ సినిమాలలో ఎక్కువగా వినిపిస్తాయి. కావాలంటే 'రామయా వస్తావయా' (శ్రీ 420) అనే పాటను, ఈ 'ఘల్లు ఘల్లు' పాటను ఒకదాని వెంబడి మరొకటి సమాంతరంగా పాడుకుని చూడండి. ఒకే పేగు తెంచుకుని పుట్టిన పిల్లల్లాగ అనిపిస్తాయి. మువ్వల చిందు - హుషారు పసందు- వినే చెవి విందు/మిసిమించెను - హసియించెను వంటి ప్రయోగాలు శబ్దంపై పట్టుతో పాటు, ఆరుద్రకు గల అంత్యప్రాసలు అలవోకగా వేసే తత్వాన్ని; మింటి గిలిగింతకె భూమి పులకింతలె వంటి వాక్యాలు ఆ తత్వంతో పాటు ఉన్న భావుకత్వానికి అద్దం పడతాయి.

---

నీకు పూర్తిగా తెలుసునుగా ||2||
నీ మదిలో ఎంత ప్రేముందో
ఇపుడె ఇంతగా ప్రేమేలా - నీ
కిపుడే ఇంతగ ప్రేమేలా? ||నీకు||
ముందే ఆలోచించి పలికినా
మాటలు తడబడతాయేలా ||ముందే ||
అతనికి లోబడి ఆశలలో బడి
జీవిస్తూనే చావేలా.. జీవిస్తూనే చావేలా ||నీకిపుడె||
అంతూ పొంతూ అంటూ లేదా ||2||
ఏమిటి నీకీ సింగారం ||2||
అతని రాకకు ఆతుతలేలా
అంతూ పొంతూ అంటూ లేదా ||2||
అతని రాకకు ఆతుతలేలా (ఆతుత లేకా)
ఓ బేలా ముస్తాబేలా
ఓ బేలా ముస్తాబేలా ||నీకిపుడె||
ఏమిటి మదిలో తీయని బాధ
తీయని బాధా తొలిప్రేమ ||ఏమిటి||
బాధ తప్పదని తెలిసినదేగా
వలపుల వలలో పడనేలా
బాధ తప్పదని తెలిసినదేగా
వలపుల వలలో పడనేలా.....
వలపుల వలలో పడనేలా ||నీకు||

ఈ పాటను జిక్కి పాడగా నర్గీస్‌పై చిత్రీకరించారు. పదే పదే  పాడుకోడానికి వీలుగా, హాయిగా ఉండే ట్యూన్ ఇది. ముఖ్యంగా - అంతూ పొంతూ అంటూ లేదా - అనే చరణం మిగిలిన చరణాలకు భిన్నంగా ఉండి ఎంత బావుంటుందో వర్ణించలేం! మెలోడీ అంటే ఇదీ అని అనిపించేట్టుగా ఉంటుందా చరణం!! ఇక ఈ పాట రెండో చరణం మూడో లైనులో'అతని రాకకు ఆత్రుత లేకా' అని పాడడం జరిగింది. ఆరుద్ర పాటలతో వెలువడిన 'వలపుల కథకిది తొలిపలుకు' పుస్తకంలో 'ఆత్రుతలేలా' అని ప్రింటయివుంది. ప్రాసపరంగా చూసుకుంటే 'ఓ బేలా ముస్తాబేలా'కి 'ఆత్రుతలేలా' అన్నదే కరెక్టుగా ఉంటుంది. ఇక 'అతనికి లోబడి - ఆశలో బడి/ ఓ బేలా - ముస్తాబేలా' వంటి పదప్రయోగాలు ఆరుద్రకు హాట్సాఫ్ అనిపింపచేస్తాయి.

---

విధి రాకాసి కత్తులు దూసి
నను వేపునే ప్రేయసీ - ఓ.... ||విధి||
రావాలనున్నా రాలేను నేను
తోడెవరూ లేరయ్యో ||రావాల||
వెన్నెల కురిసే పున్నమి బ్రతుకే
అమావాస్య అయిపోయే - ఓ .. ||విధి||
ఆశాజ్యోతి ఘనమగు రీతి
వీచెను సుడిగాలి ఆశాజ్యోతి
జీవన వ్యవధి దాటెను అవధీ
ముదిరెను - నా వ్యాధీ...ఓ... ||విధి||

ఈ పాటను ఎం.ఎం.రాజ్‌కపూర్‌పై చిత్రీకరించారు. నర్గీస్ కూడా సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తుంది. ఒరిజినల్ వెర్షన్ 'రాత్ ఆంధేరీ - దూర్ సవేరా' పాట (చీకటి రాత్రి కమ్ముకుంది ఉదయం దూరమై పోతుంది) అర్ధంతో సంబంధం లేకుండా స్వేచ్ఛగా రాసిన పల్లవి ఇది. రెండో చరణంలో 'ఆశాజ్యోతి ఘనమగు రీతి' అనే వాక్యాన్ని గమనించండి. 'దీపం ఆరిపోయింది' అని కొందరు అనరు. ఏ తాడైనా సరే తెగిపోతే తెగిపోయిందనే అంటారు. మంగళ సూత్రం విషయంలో మాత్రం తెగిపోయింది అని అనకుండా పెరిగిపోయింది అని అంటున్నట్టే 'దీపం ఆరిపోయింది' అని అనడానికి బదులు 'ఘనం అయిపోయింది' అని అంటారు. ఈ పాటలో ఆరుద్ర చేసిన ప్రయోగం కూడా అదే! 'జీవన వ్యవధి -దాటెను అవధి - ముదిరెను నా వ్యాధి' అనే ప్రయోగం వెనక అంత్యప్రాసలు, వాటికి తగ్గ పదాల్ని ఎన్నుకోవటంతో పాటు - ఓ చిన్న దరహాసం కూడా విన్నవారికి కలిగించే అవకాశం ఉంది (ఇది విషాదం గీతం కావచ్చు గాక అది వేరే సంగతి). ఈ పాట కూడా శ్రోతల ఆదరణకు నోచుకుంది. 'విధి రాకాసి - పెనం మీది దోసి (దోస అన్నమాట) మాడిందె ఓ ప్రేయసీ' అంటూ ఆ రోజుల్లో పేరడీ పాటలు వచ్చాయి కూడా!

---

ఏకాంతము - సాయంత్రము ఎద నీకై వేగేను ||ఏకాం||
చిగురాకుల సడి వినను ఏదో దడ రేగేనూ
చిగురాకుల సడి విన్నను ఏదో దడ రేగేనూ ||ఏకాం||
ఏ దారి ద్వారా - నీ రాకయో ||ఏదారి||
ఆ దారి జాడే కనరాదాయో ||ఆదారి||
పేరాశలనా కోర్కెలే - ఈ మంచుగ కరిగేను ||2|| ||ఏకాం||
ఇన్నాళ్ళ ప్రేమ కన్నీరుగ ||2||
కన్నీరు మారె మునీరుగ ||2 ||
నన్నీగతి విడనాడితే - నా హృదయమూ పగిలేనూ ||2|| ||ఏకాం||

జిక్కి పాడిన ఈ పాటను నర్గీస్ పై చిత్రీకరించారు. నేటికే కాదు ఏనాటికైనా సజీవంగా ఉండేపాట ఇది. ఈ పాటను లతా కంఠంలో 'ఏ శామ్ కీ తన్ హాయియా' విన్నా, జిక్కీ స్వరంతో 'ఏకాంతము సాయంత్రము'గా విన్నా హృదయం అనిర్వచనీయమైన రస స్పందనతో నిండిపోతుంది. శంకర్ - జైకిషన్ తర్వాతి రోజుల్లో 'చోరీ చోరీ' (1956)లో 'రసిక్ బలమా' పాటను స్వరపరచినా, దానికి దీటుగా ఎస్.డి.బర్మన్ అంతటి సంగీత దర్శకుడు కూడా పేయింగ్ గెస్ట్ (1957)లో 'చాంద్ ఫిర్ నిక్ లా' పాటను స్వరపరచినా ఆయా పాటలకు మౌలికంగా ఈ 'ఏ శామ్ కీ తన్ హాయియా' (ఏకాంతము సాయంత్రము) పాట ట్యూన్ ప్రభావం ఉందని కొందరు పరిశీలకుల అభిప్రాయం

---

రారాదా..రారాదా మది నిన్నే పిలిచే కాదా
కన్నీట తడిసె బాధ - కడలేనిదా ఈ వ్యధా ||రారాదా||
చావు నా మీదకే రానున్నది
మనసు నీ మీదకే పోతున్నది
కారు చీకట్లు పగలే మూసెను ||2||
ఆశ పేరాశ అవబోతున్నదీ ||రారాదా||
ఓ.. చెలి బాధ తెలుసుకోవా ||2||
కలలోనికైన రావా ||2||

రావోయీ మది నిన్నే పిలిచేనోయీ
కన్నీట కరిగె హాయి కడలేనిదా ఈ వ్యధా ||రావోయి||
గుండె గాయాలు కూడా చూడవా
రెండు నిముసాలు - ప్రియము లాడవా
పంచ ప్రాణాలు బాసే వేళలో ||2||
నించు మన ప్రేమ నీ కన్నీళ్ళలో ||రారాదా||

ఈ పాటను ఎ.ఎం.రాజా, జిక్కి పాడగా రాజ్‌కపూర్, నర్గీస్‌పై చిత్రీకరించారు. ఇది కూడా ఓ మంచి పాట, ఆ రోజుల్లో ప్రతివారూ తరచుగా పాడుకునే పాట అని తప్పితే ఇంక ప్రత్యేకించి విశ్లేషించడానికి (ఈ వ్యాసకర్తకు సంబంధించినంత వరకూ) ఇంకేం లేదు.

---

నీ పేరు విన్నా నీ రూపు కన్నా
ఉయాలలూగు మది సై సై సై ||నీ పేరు||
నా కంట పడక దాగినవాడు ||2||
నీవని మనసు గుర్తించెను ||2||
నా కళ్ళలోకి నీ కళ్ళు చూస్తే
ఉల్లాసమగును - సై సై సై ||నీ పేరు||
ఏ ప్రేమ ముందు కాదనినావో ||2||
ఆ వలపేల ఆశింతువో

నీ వైపు గాలి నా వైపు వీస్తే
ఉరూతలూగెద సై సై సై ||నీ పేరు||
ఇన్నాళ్ళ దాకా మారని మనసు ||2||
ఈ దినమేల ఇటులాయెనో ||2||
నీ చేయి తగిలి, నా ప్రేమ రగిలె
ఉయాల లూగెనూ సై సై సై ||నీ పేరు||

ఈ పాటను జిక్కి పాడగా విజయలక్ష్మి అభినయించింది. రాజ్ కపూర్, ప్రాణ్ తదితర నటీనటులు సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. శంకర్ - జైకిషన్ మార్క్‌ని పట్టి ఇచ్చే పాట ఇది. ముఖ్యంగా తాళగతి, అకార్డియన్‌ను ఉపయోగించే విధానం ఇవన్నీ ఆ జంట యొక్క బ్రాండ్ ఈ బ్రాండ్‌కి ప్రభావితులైన సంగీత దర్శకులలో మన తెలుగు వరకూ సత్యంగారిని, ఎం.ఎస్.ప్రకాష్‌ని

చెప్పుకోవాలి. ఎం.ఎస్.ప్రకాష్ అయితే 'ఇంటిగుట్టు' (1958) సినిమాలో 'నీ లీలలన్నీ చాలించవోయీ' అనే పాటని ఏకంగా ఈ 'నీ పేరు విన్నా' పాట గుర్తొచ్చేలా స్వరపరిచేశాడు కూడా!

---

పందింట్లో పెళ్ళవుతున్నది - కనువిందవుతున్నదీ
నటనమే ఆడెదను... ఓ... నటనమే ఆడెదను... ||పందిట్లో||
పెండ్లి కుమార్తెకు పూజా ఫల చేతికందేను.. ఆ.. చేతికందేను
గోరింటాకు కోయగ బోతే - గోళ్ళుకందేను నా గోళ్ళు కందేను
కోరికలు ఊరుచున్నవి - అవి పేరుచున్నవీ -
నటనమే ఆడెదను.. ఓ నటనమే ఆడెదను ||పందిట్లో||
వధువూ వరుడూ పల్లకిలోన
పరదేశ మేగెదరూ.. ఆ.. ||వధువూ||
వారిని తలచి బంధువులంతా
సతతము వగచెదరూ ||2||
కనీరే కురియుచున్నది - మది తరుగుచున్నది
ఒంటరిగా ఆడెదనూ.. ఓ .. ఒంటరిగా ఆడెదనూ
పందిట్లో పెళ్ళవుతున్నది - కనువిందవుతున్నదీ
ఒంటరిగా ఆడెదనూ.. ఆ...ఒంటరిగా ఆడెదనూ ||పందిట్లో||

ఈ పాటను జిక్కి పాడగా నర్గీస్ అభినయించింది. రాజ్ కపూర్, ప్రాణ్, విజయలక్ష్మి తదితరులు సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. తెలుగు నాట ప్రతి ఇంటా మారుమ్రోగి పోయిన పాటల్లో ఇదొకటి. ఆ రోజుల్లో ఈ పాట స్పీకర్ లో వేయని పెళ్ళిపందిరి, బ్యాండ్ పై వాయింప జేయని పెళ్ళి లేవనే చెప్పాలి. అంతేకాదు ఆరోజుల్లో ఈ పాటను పాడకుండా జిక్కి స్టేజి దిగిన సంగీత కార్యక్రమం కూడా లేదనే చెప్పొచ్చు. ఇదిలా ఉండగా 'పెళ్ళవుతున్నాది - విందవుతున్నాదీ' అంటూ 'న'కు దీర్ఘం ఇచ్చి పాడించటం పట్ల కొన్ని ఆక్షేపణలు వెలువడినా అవి మేధావుల వరకే పరిమితం అయిపోయాయి. సామాన్య శ్రోతలు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా హ్యాపీగా పాటను హిట్ చేసేశారు.

---

పాడు జీవతమూ - యౌవ్వనం
మూడునాళ్ళా ముచ్చటలోయి - అయ్యయ్యో
నీదు పరుగూలెచటకోయి ||పాడు||
చీకటి దారి చుట్టూ ఎడారి - చేయునదేమి
నీ చెలి ఇల్లు చేరీ - ప్రేయసీ ఇల్లు చేరి
చీకటి దారిలో మూఢా తడబడకోరి! తడబడికోరి! ||పాడు||
కంటికి రెప్ప మన పుట్టిల్లు
కాని దానికి నీ ఋణమే చెల్లు - నీ ఋణమే చెల్లు ||కంటికి||
ఎడబాటంటే ఎదలో ముల్లు.. ఎదలో ముల్లు ||పాడు||

ఈ పాటను ఎ.ఎం.రాజా పాడగా రాజ్ కపూర్ పైనా, మరొక ప్రముఖ వ్యక్తి పైనా చిత్రీకరించారు. ఆ ప్రముఖ వ్యక్తి - రాజ్‌కపూర్ 'ఇతడు నా ఆత్మ' అని చెప్పుకునే నేపథ్యగాయకుడు - ముఖేష్! ఈ పాట సాహిత్యాన్ని ఆసాంతం గమనిస్తే - రాసే ముందు ఆరుద్రపై 'దేవదాసు' పాటల ప్రభావం ఉందేమోనని అనిపిస్తుంది. 'కొండలే రగిలే వడగాలి నీ సిగలో పూవేలోయ్, లాయిరి నడి సంద్రంలో నా లంగరుతో పని లేదోయ్' వంటి వాక్యాలు 'చేయునదేమి నీ చెలి ఇల్లు చేరి ప్రేయసి ఇల్లు చేరి, కంటికి రెప్ప మన పుట్టిల్లు - కాని దానికి నీ ఋణమే చెల్లు' అనే వాక్యాలను చూస్తుంటే గుర్తొస్తాయి. బహుశా ఆ ప్రభావమే కృష్ణ 'దేవదాసు' లోని 'ఇది నిశీధి సమయం' పాటలో 'తానే లేని సదనంలో తలుపులు ఎందుకురా / తిరిగి రానే రాని పయనంలో పిలుపులు ఎందుకురా / మరలా పుట్టుక మరలా చచ్చుట ఇరుసే లేని చక్రం/ వచ్చేవారు పోయేవారూ జగరి పురాతన సత్రం / రాకడైనా పోకడైనా కర్తవు కావురా నీవు / అన్ని అంచెలు దాటిన పిదప ఉన్నది కడపటి రేవు' వంటి వ్యాక్యాలను రాయడానికి ఉపయోగపడిందేమో!? ఎందుకంటే 'ప్రేమలేఖలు' సినిమా క్లయిమాక్స్ 'దేవదాసు' సినిమాలోని పతాక సన్నివేశాలను పోలివుందని ఆ రోజుల్లోనే అనుకున్నారు. కనుక ఇవన్నీ మనసులో అంతర్లీనంగా మెదిలి, తనదైన ముద్రతో బైటికి వచ్చే అవకాశం ఎవరికైనా ఉంటుంది.

ఈ సినిమా సంగీతానికి సంబంధించి - మరొక ముఖ్యమైన విశేషం ఉంది. తెలుగు, తమిళ వెర్షన్‌లో కూడా లతా, ముఖేష్‌లతో పాడిద్దామనుకున్నారు. రెండు పాటలు రికార్డు చేశారు కూడా.. రాజ్ కపూర్ తెలుగు, తమిళం తెలిసిన స్నేహితులకు వినిపించాడు. తెలుగు వరకు లత పట్ల వంకలు పెట్టలేదు కాని తమిళం విషయంలో మాత్రం కొన్ని లోపాలు వారు సూచించారట. అప్పుడు తెలుగు తమిళ వెర్షన్‌లకు దక్షిణాది గాయనీ గాయకులైతేనే బావుంటుందన్న నిర్ణయానికి రాజ్ కపూర్ వచ్చేశాడు. ఆ తర్వాత ఎం.ఎల్.వసంత కుమారిని అనుకున్నారు. ఆరుద్రగారే జిక్కి పేరుని సూచించారు. ఆ సమయంలో ఘంటసాలగారికి స్వల్ప అనారోగ్యం కారణంగా కొద్ది రోజులపాటు రికార్డింగులకు వెళ్ళటం లేదట. అంచేత ఎ.యం.రాజా పేరుని కూడా ఆరుద్రగారే సూచించారు. తనతో పాడించకపోవడం పట్ల లత మాత్రం అలిగింది. 'నా గొంతు మీ భాషకు పనికిరాకుండా పోయింది!?' అంటూ బాధపడింది. 'చూస్తూ ఉండండి.. ఏదో రోజు మద్రాసులోనే తమిళ ప్రేక్షకుల ముందు త్యాగరాజ కీర్తన కచ్చేరీ చేసి ఒప్పిస్తాను' అని శపథం కూడా చేసిందట. ఇవన్నీ ఆరుద్రగారు తన 'సినీ మినీ కబుర్లు'లో రాసుకున్నారు.

హిందీలో ఆశించినంత విజయం సాధించకపోయినా తెలుగులో (తమిళంలో కూడా) ఈ ప్రేమలేఖలు' చిత్రం అద్భుతమైన విజయాన్ని పొందిందీ అంటే అందుకు కారణం నిస్సందేహంగా పాటలే!



# ఆ పాత పాట మధురం

## రాజా



### శ్రీ వెంకటేశ్వర మహత్యం (బాలాజి)

**కలియుగ** దైవం శ్రీ వెంకటేశ్వరునిపై ఎన్ని సిన్మాలు వచ్చినా పద్మశ్రీ బ్యానర్‌పై 1960 లో వచ్చిన 'శ్రీ వేంకటేశ్వర మహత్యం' చిత్రం మాత్రం శాశ్వత కీర్తిని సంపాదించుకుంది. 1939 లో సి.ఎస్.ఆర్.ఆంజనేయులు, శాంతకుమారితో 'వేంకటేశ్వర మహత్యం' సినిమా తీసిన పి.పుల్లయ్యే ఈ శ్రీ వెంకటేశ్వర మహాత్యం చిత్రానికి కూడా దర్శకత్వం వహించారు. పుష్కరిణిలో మునిగితే కలిగే దివ్యానుభూతి ఆ క్షేత్రంలో ఆలయం ముందున్న కుళాయి దగ్గర స్నానమాడినా కలిగినట్టు - పెండ్యాల సంగీత దర్శకత్వంలో వచ్చిన ఈ 'శ్రీ వేంకటేశ్వర మహాత్యం'లోని పాటలు ఇప్పుడు క్యాసెట్ల రూపంలో విన్నా అదే ఆత్మానందాన్ని అనిర్వచనీయమైన అదే అనుభూతిని కల్గిస్తాయి. ...

శ్రీదేవిని నీదు దేవేరిని ॥శ్రీదేవి॥
సరిసాటి లేని సౌభాగ్యవతిని ॥శ్రీదేవిని॥
అనుపమ కౌస్తుభమణియందు నెలకొని ॥అనుపమ॥
నీ హృదయ పీఠాన నివసించుదాన ॥శ్రీదేవిని॥
పాలకడలిలో ప్రభవించి
మురిపాల కడలిలో తేలితిని

పదునాల్గు భువనాలు పరిపాలించు
నీ మది నేలి లాలించు భాగ్యము నాదే ॥శ్రీదేవిని॥
కలిమికి నేనే దేవతనైనా
నీ చెలిమియే నా కలిమి కదా ॥కలిమికి॥
ఎనలేని అనురాగ సంతోషములతో...
ఏనాటికీ మనకు ఎడబాటు లేదు ॥ఏనాటికీ॥ ॥శ్రీదేవిని॥

ఈ పాటను ఎస్.వరలక్ష్మి గానం చేయగా, ఎన్టీ.ఆర్, ఎస్.వరలక్ష్మి అభినయించారు. కథానుగుణంగా పాట మధ్యలో గుమ్మడి కూడా కనిపిస్తారు. బేహాగ్ రాగంలో వచ్చిన మరో మంచి పాట ఇది. 'ఎనలేని అనురాగ సంతోషములతో..' దగ్గర వచ్చే రాగాలాపనలో అమీర్ కళ్యాణి రాగచ్ఛాయలు కూడా ప్రయోగించబడ్డాయి. ఈ ఆలాపనను ఎస్.వరలక్ష్మి ఆవిష్కరించిన తీరు చూస్తే ఆమెను 'సుస్వరలక్ష్మి' అని పిలవాలనిపిస్తుంది. పైగా అభినయించింది కూడా లక్ష్మీదేవి పాత్రనే కనుక కథకు అవసరమైన రీతిలో ఆ పాత్ర స్వభావాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకుని, ఆవాహింపజేసుకుని.... సంపూర్ణ న్యాయంతో, పరిపూర్ణ జ్ఞానంతో పాడిన పాట ఇది. గాయనీ మణులుగా పేరు తెచ్చుకోవాలనుకునే వారికి ఈ పాట ఓ పరీక్షలాంటిది. ఇక రచయితగా ఈ పాటకు ఆరుద్ర అద్దిన సొగసులు ఈనాటికీ పసివాడనివి. 'పాలకడలిలో ప్రభవించి, మురిపాల కడలిలో తేలితిని' అంటూ ఉపయోగించిన అభంగ శ్లేష, 'పదునాలుగు

భువనాలు పాలించు నీ మదినేలి లాలించు భాగ్యము నాదే', 'కలిమికి నేనే దేవతనైనా నీ చెలిమియే నా కలిమి కదా' వంటి శబ్దగత చమత్కారాల ద్వారా అభివ్యక్తీకరించిన కవితా సౌందర్యం - ఇవన్నీ ఆరుద్రకు భాష మీదకు గల అధికారాన్ని పట్టును చాటి చెబుతాయి.

---

లక్ష్మి: వరాల బేరమయా వనరౌ బేరమయా
పరాకు సేయకు పదే పదే దొరుకదయా ||వరాల||
దేవతలు దీవించి పంపిన పసరమయా ||దేవ||
కొన్నవారికన్ని సిరులు కూర్చు గంగిగోవయా ||వరాల||
మనిషికున్న తెలివున్నది మనిషిలోని చెడులేనిది
కొందామని అందరూ కొమ్ముపడితె కుమ్ముతుంది
కోరుకున్నవారి వెంట గోవులాగె వస్తుంది ||వరాల||
మనువు నిజమాయె.. మనువు నిజమాయె...

పచ్చనీ లచ్చిమికి పసుపు కుంకుమ పెట్టి దినము
ప్రొద్దున్నే మొక్కుకుంటే పోతుంది పాపము
పచ్చనీ లచ్చిమికి పసుపు కుంకుమ పెట్టి దినము
ప్రొద్దున్నే మొక్కుకుంటే పోతుంది పాపము
పాత్ర చూచి పాలను మనసు తూచి మంచిని
ఇచ్చేది ఈ ఆవు ఇదే కామధేనువు ||వరాల||

ఈ పాటకు గానం, అభినయం రెండూ ఎస్. వరలక్ష్మే! మధ్యమావతి రాగం ఈ పాటకు ఆధారం. ఈ పాటలో కూడా యస్. వరలక్ష్మి గానం చేసిన విధానం కమనీయం, గమనీయం. ఇప్పుడు వాడుకలో లేని కొన్ని కొన్ని పదాల గురించి తెలుసుకోవాలంటే ఇలాంటి పాటలు వినటం చాలా అవసరం. లేకపోతే వనరు, పసరము వంటి పదలకు అర్థం చెప్పాలంటే నిఘంటువులు వెతుక్కోవలసిన పరిస్థితి వస్తుంది. 'కోరుకున్న వారి వెంట గోవులాగె వస్తుంది' అనే పదప్రయోగం ఒక రకంగా చమత్కారం.. ఎందుకంటే అక్కడ గోవు రూపంలో ఉన్నది శివుడు కనుక. అలాగే చిత్రీకరణపరంగా ఇంకో మాట చెప్పుకోవాలిక్కడ. ఈ పాటలో యస్. వరలక్ష్మి ఆవును గురించి పాడుతూ ఉన్నా దూడను లాలించే దృశ్యాలు ఎక్కువగా ఉంటాయి. దర్శకత్వ ప్రతిభకు సంబంధించిన కోణంలో ఆలోచిస్తే - దూడ రూపం ధరించింది బ్రహ్మ.. మారువేషంలో 'అమ్మ'గా వచ్చినామె లక్ష్మీ దేవి. మరి లక్ష్మీదేవికి బ్రహ్మ... పుత్రుడేగా?!

---

గోపాల.. నంద గోపాలా
ఎన్నాళ్ళని నా కన్నులు కాయగ
ఎదురు చూతురా గోపాలా
ఎంత పిలిచినా ఎంత వేడినా
ఈనాటికి దయ రాదేలా ||ఎంత||
గోపాలా నంద గోపాలా
వీనుల విందుగ వేణుగానము
విని తరింపగా వేచితిరా ||వీనుల||

వేచి వేచి ఈ వెన్నముద్దవలె
కరిగిపోయెరా నా బ్రతుకు
కరిపోయెరా నా బ్రతుకు ||ఎన్నాళ్ళని||
వెన్న మీగడలు జున్నుపాలకు
ఏమి కొరతరా మన ఇంటా ||వెన్న||
పాలను ముచ్చిలి పరుల చేతిలో
దెబ్బలు తినకురా కన్నయ్యా ||పాలను||
ఈ తల్లి హృదయము ఓర్వలేదయా ||ఎన్నాళ్ళని||

ఈ పాటను శాంతకుమారి గానం చేసి, ఆమెయే ముఖ్యపాత్రధారిణిగా అభినయించగా చిత్రీకరించారు. పీలూ రాగానికి అతి చక్కని ఉదాహరణ ఈ పాట. ఈ రాగంలో ఇదే అనుభూతితో పెండ్యాల 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రంలో స్వరపరచిన 'నీకై వేచితినయ్యా ఓ ఏకాంత రామయ్యా..' పాటను కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకోగలిగితే పీలూ రాగంపై కొంత అవగాహన కలుగుతుంది. ఈ పాట సాహిత్యాన్ని పరికిస్తే - ద్వాపర యుగంలోని యశోదయే కలియుగంలో వకుళగా జనించిందన్న పురాణ గాథల ఔచిత్యాన్ని ఒంట పట్టించుకుని - వకుళ గొంతుకు యశోద మనసు జత చేస్తూ ఆత్రేయ రాశారా అనిపిస్తుంది. ముఖ్యంగా - 'వేచి

వేచి ఈ వెన్నముద్దవలె కరిగిపోయెరా నా బతుకు, పాలను ముచ్చిలి పరుల చేతిలో దెబ్బలు తినకురా కన్నయ్యా ఈ తల్లి హృదయం ఓర్వలేదయా.. లాంటి వాక్యాలను గమనిస్తే మాతృ హృదయం అనే ఆలయంలో అక్షర దీపాలను పెట్టి - కవిగా తన రుణం ఆయన తీర్చుకున్నాడేమోనన్నంత ఉన్నతంగా ఉందీ భావప్రకటన. శాంతకుమారి గళం కూడా అదే తదాత్మ్యాన్ని పంచుతుంది. ఇక ఈ పాటలో ఉపయోగించిన ముచ్చిలి (దొంగలించుట) అనే పదం తెలుగు సినిమా పాటల్లో ఆ తర్వాత వచ్చినట్టుగా లేదు.

ఈ చిత్రంలో ఎస్.వరలక్ష్మి, శాంతకుమారి పాడిన పాటలను విన్న తర్వాత ఆ స్వర్ణ యుగాన్ని తిరిగి పొందే అదృష్టం మన తెలుగు సినిమా సంగీతానికి ఉందా అని ఎవరికైనా అనిపిస్తే - కాల ప్రవాహానికి ఎదురీది నిబడగలిగే మానవత్వపు విలువలు వారిలో ఇంకా ఉన్నట్టు లెక్క.

---

ఆమె: ఎవరో అతడెవరో
ఆ నవ మోహనుడెవరో
నా మానస చోరుడెవరో ||ఎవరో||
తొలిచూపులలో వలపులు చిలికి
దోచిన మగసిరి దొర ఎవరో ||తొలి||
అరయక హృదయమునర్పించితినె
ఆదరించునో ఆదమరచునో ||ఎవరో||
వలరాజా..? కలువల రాజా..?
కాడే... కన్నుల కగుపడినాడే?
అకలంకుడై. హరిణాకుండు కాడే ||అక||
మరి ఎవరో ఏమరినానో ||ఎవరో||
చలువలు కురిసి జాబిలి చెలి
కలతను తెలిసీ కౌగద జాలి
కరుణ చూపి కబురు తెలిపి
రమ్మనవా నను చే కొమ్మనవా
అతడు: ఎవరో తానెవరో ఆ నవ మోహిని ఎవరో
నా మానస హారిణి ఎవరో ||ఎవరో||
నందన వనమానందములో
తొలిసారిగ పూచిన పూవో ||నందన||
తొలకరి యవ్వన మొలికిన నవ్వో ||తొల||
మనసిచ్చిందో నను మెచ్చినదో ||తొల||
మనసిచ్చినదో నను మెచ్చినదో
ఆ జవ్వని ఎవరో తానెవరో ఆ నవమోహిని ఎవరో
నా మానాన హారిణి ఎవరో
ఎవరో తానెవరో...

ఈ పాట నిజంగా ఓ రసాత్మక గీతం. పెండ్యాల గుండెల్లో ఊపిరిపోసుకున్న స్వరానికి సుశీల, ఘంటసాల జీవ చైతన్యాల్ని కలబెట్టిన గీతమిది. లీనమై ఆలపించుకుంటూ పోతే కంటిపొరలలో ఓ చెమరింపును, తదనుగుణమైన ఆత్మానందాన్ని కలిగించగలిగే స్వరరచన ఇది. బృందావన సారంగ రాగంలో స్వరపరచబడిన ఈ గీతం గ్రహభేదం వల్ల తిల్లంగ్ రాగం అని అనిపించే అవకాశం కూడా ఉంది. ఎన్టీఆర్, సావిత్రి అభినయించిన ఈ పాటను రచించిన ఆత్రేయ గురించి చాలా చెప్పాలీ సందర్భంగా..

తను ప్రేమించినవాడు మన్మధుడా (వలరాజా)... మరి కళ్ళకు కనబడుతున్నాడే.!? పోనీ చంద్రుడా (కలువరాజా)... జింక చిహ్నం మచ్చగా గల చంద్రుని (హరిణాంకుడు)లాంటివాడు కాదే. మచ్చలేని వాడు (అకలంకుడు) కదా నా ప్రియుడు - అనే అర్థం వచ్చేట్లు ఉన్న రెండో చరణం ఆత్రేయ ఎంత గొప్పభావకుడో తెలుపుతుంది. అయితే, నాణేనికి రెండోవైపు అన్నట్టు - పాత్రల ఔచిత్యం ప్రకారం ఆలోచిస్తే - శ్రీనివాసుడిగాఅవతరించిన శ్రీ మహావిష్ణువుని అతనికన్నా స్థాయిలో చిన్నవారైన చంద్రునితోనూ, మన్మధునితోనూ పోల్చడం, ఆయన గుండెలపై ఉన్న శ్రీవత్సవ చిహ్నం గురించి మరిచిపోయి అకలంకుడు అని వర్ణించడం -- ఇవన్నీ విమర్శలకు తావిచ్చే అంశాలు అయితే, ఇందులో కూడా ఆత్రేయ పక్షాన వాదించాలంటే ఆ శ్రీనివాసుడు శ్రీ మహావిష్ణువని తెలీక కదా 'ఎవరో అతనెవరో'

అని ఈ పద్మావతి పడుకున్నది.. అయినా, అరయక హృదయం అర్పించిన వారికి తమ ప్రియులు అకలంకులుగానే కనిపిస్తారు కదా! అని సమర్థించుకోవచ్చు. ఏదిఏమైనా, అంతటి ఆలోచన, అంతటి అంతర్మధనం, అంతటి అంతర్ముఖత్వం - రాసిన వారికి, విన్నవారికి కూడా కలిగిస్తున్నాయి కనుకనే ఆ నాటి పాటలు ఈనాటికీ సాహితీ మర్యాదలను అందుకుంటున్నాయి.

'కరుణను చూపి కబురు తెలిపి' అనే వాక్యంలో 'కబురు'నే ఉర్దూ పదాన్ని వాడినందుకు ఈ పాట రికార్డింగ్ అయిపోయాక గుర్తొచ్చి, విపరీతంగా కలవరపడ్డారట ఆత్రేయ. గురుతుల్యుడూ మల్లాది రామకృష్ణశాస్త్రి దగ్గర తన బాధను వెళ్ళబోసుకుంటే 'ఏం ఫర్వాలేదులే.. ఆ కాలంలో బీబీ నాంచారి కూడా ఉందిగా' అంటూ ఆయన ఊరడించాక గాని నిద్రపట్టలేదట ఆత్రేయకి. అనుకున్న పని పూర్తయిపోయి, అవసరం తీరిపోయిన తర్వాత నాదేం పోయిందిలే అంటూ చేతులు దులిపేసుకోకుండా - బాధ్యతను నెత్తిన వేసుకుని ఆత్మ క్షోభను స్వీకరించగలిగే అటువంటి నిజాయితీయే చేసే ప్రతిపనికీ సార్థకతను ప్రసాదించేది..



# ఆ పాత పాట మధురం

## రాజా



### శ్రీ వెంకటేశ్వర మహత్మ్యం (బాలాజి) - 2

తెలుగు సినీ చరిత్రలో శాశ్వత కీర్తిని సంపాదించుకున్న శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం చిత్రంలోని పాటలలో మరో ఆరు పాటల....

యశోద: చిరు చిరు నగవుల చిలికే తండ్రీ మురిపితినయ్యా పున్నెము పండీ ||చిరు||
నవ్వులే ఇంత తీయనైనవే పలుకులెంతగా మధురములౌనో
విని సంబరపడ మది తొందరపడె మక్కువ తీరా మాటలాడరా ||చిరు||
యదుబాలా! గోపాలా! అందెలు ఘల్లన ఇటురారా ||యదు||
చక్కని నాన్నా టక్కులు మానీ అక్కున చేరి అమ్మా అనరా ||చక్క||
అల్లిబిలి జాబిల్లి ఆటలా నిను చూచి పొంగి తరింతునురా ||యదు||
కొంటెవాడ నీ తుంటరి పనులకు గోకులమంతా గోలపెట్టెరా
కృష్ణ: అల్లరి చేయని పిల్లలింటికి అలంకారము కారు కదమ్మా?
యశోద: అలాగా! పెండ్లి చేసి నీకాళ్ళకు బంధము వేయాలయ్యా వెన్నదొంగా!
కృష్ణ: అత్తరికము చెయాలని నీకు ఆశగవుందని అనవమ్మా
యశోద: అవునయ్యా.. అదే నా కోరిక.. ఎప్పుడు తీరుస్తావు నాయనా

ఆత్రేయ రాసిన ఈ పాటలో శాంతకుమారి ముఖ్య గాయని కాగా బాల, స్వర్ణలత అక్కడక్కడ గాత్ర సహకారాన్ని అందించారు. 'పూర్వజన్మలో నీవు యశోదవు' అంటూ వకుళకు నారదుడు తెలుపగా ఆ పూర్వ జన్మ జ్ఞాపకాలకు సంబంధించిన సన్నివేశంలో ఈ పాట వస్తుంది. స్వరకల్పనా పరంగా అధ్యయనం చేయవలసిన కొన్ని అంశాలున్నాయి ఈ గీతంలో. అందులో మొదటిది మహారాష్ట్ర సంగీత ప్రభావం. శాంతకుమారి, పి.సూరిబాబు ఈలపాట రఘురామయ్య మొదలైన వారు నాటక రంగం నుంచి వచ్చిన 'గానతారలు'. మన నాటక రంగంపై మహారాష్ట్రకు సంబంధించిన మరాఠీ సంగీతపు పోకడలు, వాటి ప్రభావం ఆ రోజుల్లో ఎక్కువగా ఉండేది. సంగీత దర్శకుడు పెండ్యాల కూడా నాటక రంగం నుంచి వచ్చిన వ్యక్తే కావటం వల్ల ఆ ధోరణులు పూర్తిగా తెలుసాయనకి. ఆ సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ పాటని ఆయన ట్యూన్ చేశారా అని అనిపిస్తుంది. అందుకే పాట మొదట్లోనూ తొలి చరణంలోనూ తొంగి

చూచే 'యమన్' రాగం సినీ సంగీత దర్శకులు అలవాటు చేసిన యమన్‌లా ఉండదు. మరాఠీ సంప్రదాయపు 'నాట్యగీత్'లా ఉంటుంది. మధ్యలో పీలూ రాగచ్చాయలు కూడా కనిపిస్తూవుంటాయి.

చిన్నారి ఓ చిలుక విన్నావా ||2||
ఇన్నాళ్ళ కోరిక ఈడేరే వేడుక ||చిన్నారి||
ఏమని నా స్వామికి మనవి చేసినావో ||2||
నా మనసు తెలిపినావో
ఫలియించే నీ మాట పల్లవించె నా పాట ||చిన్నారి||
పెళ్ళి పీటలపై నున్న వేళ ఒళ్ళు మరిచి పిలిచేవు
నే ననుకుని తాను వులికిపడేను
నలుగురూ ననుజూచి నవ్వుకునేరు ||చిన్నారి||
అత్తవారి ఇల్లు మనకు కొత్తచోటు అయినా
తొలి వలపు ముచ్చటలో పొలయలుకలు వచ్చెనా
బెట్టుచేసి వారినే కవ్వించవే
ప్రేమతో నను చేరి నవ్వించవే ||చిన్నారి||

ఆత్రేయ రాసిన ఈ పాటను పిసుశీల పాడగా సావిత్రి అభినయించింది. ఈ పాటకు తిలంగ్ ఆధార రాగం. ఇవాళ లభ్యం కాని పాటల్లో ఇదొకటి. ఎందుకంటే నిడివి కారణంగా చిత్రం నుండి తొలగించారు. తరువాత విడుదలయిన ఎల్పీ రికార్డులలో గాని, కాంబినేషన్ క్యాసెట్స్‌లో గాని ఈ పాటని చేర్చలేదు. ఆ రోజుల్లో విడుదలయ్యే 78 ఆర్.పి.యమ్. రికార్డులను సేకరించి భద్రపరచుకునే వారి వద్ద మాత్రమే ఈ పాటను ఈ తరం వారికి అందించవలసిన ఆవశ్యకత ఆడియో రంగానికి ఉన్నది. సాహిత్య పరంగా ఆత్రేయ వాడిన 'పొలయలుకలు' అనే పదం గమనించదగ్గది.

కళ్యాణ వైభవమీనాడే చెలి కళ్యాణ వైభవ మీనాడే
మన పద్మావతీ శ్రీనివాసుల ||కళ్యాణ||
చూతము రారే సుదతులందరు ||2||
చేతము రారే సింగారాలు ||కళ్యాణ||
పసుపు కుంకుమా అలదండీ
రంగు రంగులా రత్నాలు కలిపి
ముత్యాలు ముగ్గులు వేయరండి ||కళ్యాణ||
అతివ కోరిన వరుడూ అతిలోక సుందరుడోయమ్మా
అతగాని కన్నింట జతయౌను మా కొమ్మా - ఆహ హ
చిలకలకొలికి పద్మావతికీ కులుకే సింగారం - చెలి
గుణమే బంగారం
నవలామణికి నగవులగనికి మనసే లావణ్యం
లే వయసే వయ్యారం
చక్కని చెక్కిలి చుక్కెందులకే - ఎందుకే
చందమామలో నలుపున్నందుకే - ఆహా
చినదానికి ఆ సిగ్గెందులకే - అవును ఎందుకే?
చల్లనైన తల్లిని శంకరుని రాణివి ||చల్ల||
దీవెనలే ఇవ్వవమ్మ దేవేరీ జయగౌరీ ||చల్ల||
పసిడి కలల బాల తన పరిణయ శుభవేళ ||పసిడి ||
ప్రణమిల్లెను బ్రతుకెల్లను పచ్చనైన పంటగా
దీవెనలే ఇవ్వవమ్మా దేవేరీ జయగౌరీ

ఆత్రేయ రాసిన ఈ పాటలో లీల, జిక్కి ప్రధాన గాయనీ మణులు, ప్రధాన, ముఖ్య, సహ ఉపపాత్రధారులెంతో మంది మీద చిత్రీకరించిన పాటయిదని సాహిత్యం చూడగానే అర్థమయిపోతుంది. పాట పల్లవి నుంచి తొలిచరణం (చూతము రారే సుదతులందరూ) చివరి వరకూ సామరాగాన్ని, రెండవ చరణం (అతివ కోరిన వరుడు అతిలోక సుందరుడోయమ్మా)కి మోహనరాగాన్ని ఉపయోగించారు. మూడవ చరణం (చిలకలకొలికి పద్మావతికి కులుకే సింగారం)కి అంతర్గాంధారాన్ని కలుపుకుంటూ ఖరహప్రియ స్కేల్ లోని స్వరాల్ని, అక్కడక్కడ పీలూ రాగం అనిపించేలా కూడా స్వరపరిచారు. ఇక ఆఖరి చరణం (చల్లనైన తల్లివి శంకరుని రాణివి)కి

పక్కా సంప్రదాయరీతిలో శంకరాభరణం రాగాన్ని ఉపయోగించారు. ఈ చరణాన్ని, సీతారామకళ్యాణంలోని 'కానరార కైలాస నివాసా' పాటని, భూకైలాస్ లోని 'దేవమహదేవ మమ్ముబ్రోవుము శివ' పాటని, సాకల్యంగా సాధన చేస్తే శంకరాభరణ రాగంపై అవగాహన చాలావరకు వచ్చేస్తుంది.

---

ఆమె: కలగా కమ్మని కలగా
మన జీవితాలు మనవలెగా ||కలగా||
అనురాగమే జీవన జీవముగా
ఆనందమె మన కందముగా ||కలగా||
ఆమె: రాగవశమున మేఘమాలిక
మలయ పవనుని అలిసి తేలగా
అతడు: కొండను తగిలి గుండియ కరిగి
నీరై ఏరై పారునుగా
కలగా కమ్మని కలగా

అతడు: వెలుగు చీకటలు కలబోసిన
ఈ కాలము చేతిలో కీలు బొమ్మలము
ఆమె: భావనలోనే జీవనమునది
మమతే జగతిని నడుపునది
మమతె జగతిని నడుపునది
కలగా కమ్మని కలగా
ఆమె: తేటికోసమై తేనియ దోచే
విరి కన్నియకా సంబరమేమో
అతడు: వేరొక విరిని చేరిన ప్రియుని
కాంచినప్పుడా కలత ఏమిటో
ప్రేమకు శోకమే ఫలమేమో
రాగము త్యాగము జతలేమో ||కలగా||

ఈ పాటను ఘంటసాల, సుశీల ఆలపించారు. ఎన్టీఆర్, సావిత్రి అభినయించారు. లక్ష్మీదేవి, పద్మావతిదేవి మధ్య జరగబోయే సంవాద ఫలితంగా తాను శిలను కానన్న అర్థంతో శ్రీనివాసుడు - అవేవీ ఎరుగని తన లౌకిక ధోరణిలో పద్మావతి - పాడుతున్నట్టుగా పాత్రోచిత ఉన్మీలనంతో రాసిన ఆత్రేయ ముద్ర - రెండవ మూడవ చరణాలలో బలంగా కనిపిస్తుంది. అయితే పాట సాహిత్యాన్ని కాస్త లోతుగా పరిశీలిస్తేగాని ఈ 'కథార్థ సూచన ప్రక్రియ' అవగతమవదు. ట్యూన్ పరంగా చేసుకుంటే ఈ పాట బొత్తిగా, పూర్తిగా పెండ్యాల మార్కు గీతం అని ఒకటో ఎక్కం అప్పజెప్పినంత సులువుగా చెప్పెయ్యొచ్చు. మొదటి చరణం 'రాగవశమున మేఘమాలిక' అనే వాక్యం వినగానే 'రాగమయి రావె' (జయభేరి) పాటలో 'చివుర్లు మేసిన చిన్నారి కోయిల' అనే లైను దగ్గరి ట్యూన్ గుర్తుకొచ్చేస్తుంది. అలాగే చివర్న ఉన్న 'ప్రేమకు శోకమె ఫలమేమో' అనే వాక్యాల వరస 'చిగురాకులలో చిలకమ్మ' (దొంగరాముడు) పాటలోని 'కలువా విలువలు సెలవీయ' అనే లైనుని యధాతధంగా జ్ఞప్తికి తీసుకొస్తుంది. తర్వాతి రోజుల్లో వచ్చిన 'శ్రీకృష్ణార్జు యుద్ధం' చిత్రంలోని 'స్వాముల సేవకు వేళాయే' పాట చరణాల ఇంటర్ లూడ్‌లో ఫ్లూట్ బిట్‌ని స్మృతిపథంలో నిలుపుకుని మళ్ళీ వెనక్కి వచ్చి 'కలగా కమ్మనికలగా' పాటలోని 'తేటికోసమై తేనీయ దోచే' అనే చరణానికి ముందు వచ్చే ఫ్లూట్ ఇంటర్ లూడ్‌తో పోల్చుకుంటే రెండూ ఒక్కలాగే ఉన్నట్టనిపిస్తుంది. ఈ చిత్రాలన్నిటికి సంగీత దర్శకుడు పెండ్యాల కావడం, ఉదహరించిన ఈ పాటలన్నీ భీం ప్లాస్ రాగంలోనే ఉండడం ఇవన్నీ ఆ రాగాన్ని పెండ్యాల మలచుకునే పద్ధతిని స్పష్టంగా తెలియజేస్తాయి.

---

కళ్ళు తెరువరా నరుడా నీ ఖర్మ తెలియరా..
కళ్ళు తెరువరా నరుడా
కలిమిలేములకు కష్ట సుఖాలకు ||2||
కారణమొకటే రా.. కారణమొకటేరా....
నీ ఖర్మే మూలమురా కళ్ళు తెరువరా నరుడా
వేపను విత్తి దాతకోసమై వేడుక పడుట వెర్రి కదా ||2||

కాలికి రాయి తగులుట కల్ల.. కాలికి రాయి తగులుట కల్ల....
రాయికి కాలే తగులునా రా.. కళ్ళు తెరువరా నరుడా
కమల నాభుని పదకమలములే కలుష జలధికి చేతమురా ||2||
కలిమాయలలో కలత చెందిన ఆ... || 2||
ధరణికి అదియే తారకముగురా ||2 ||
కళ్ళు తెరువరా నరుడా నీ ఖర్మ తెలియరా.. కళ్ళు తెరువరా.. నరుడా

ఈ పాటను పి.సూరిబాబు గానం చేసి అభినయించారు. అద్భుతమైన స్వరధాటి కలిగిన పి.సూరిబాబు గురించి ఈ తరం వారికి బొత్తిగా తెలియదు. విచిత్రం ఏమిటంటే సినీ సంగీత రంగంలోనున్న వారిలో కూడా చాలా మందికి తెలియదు. వారికన్నా శ్రోతలోనే ఎక్కువమంది తెలిసినవాళ్ళున్నారనిపిస్తుంది. ఈ పాటకు రచన ఆత్రేయ. భక్తిగీతాలు ఆత్రేయ రాయడని చాలామంది అనుకుంటారు గానీ ఆయన రాసినవెన్నో ఉన్నాయి. సింధుభైరవి రాగంలో సాగిన ఈ పాటని కూడా నిడివి కారణంగా చిత్రం నుండి తొలగించారు. శ్రీ వేంకటేశ్వర వైభవం సినిమాతో పాటు వేసిన శ్రీ వేంకటేశ్వర మహత్యం కాంబినేషన్ క్యాసెట్‌లో కూడా లేదు. హెచ్.ఎం.వి.లో పనిచేసిన శివప్రసాద్ మాత్రం 78 ఆర్.పి.యమ్. రికార్డుల్లో దొరికిన ఈ పాటని టేపుల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసి 'సింగింగ్ స్టార్స్' అనే కాన్సెప్ట్‌తో ఓ ఆడియో క్యాసెట్‌గా విడుదల చేస్తే అదృష్టవశాత్తు మళ్ళీ బైటికొచ్చింది.

---

శేషశైలా వాస శ్రీ వెంకటేశా
శయనించు మా అయ్య శ్రీ చిద్విలాసా ||శేష||
శ్రీదేవి వంకకు చిలిపిగా చూడకు
అలమేలు మంగకు అలుకరానీయకు
ముద్దు సతులిదరిని ఇరువైపులా చేర్చి ||ముద్దు||
మురిపించి లాలించి ముచ్చటల దేల్చి
పట్టుపానుపుపైన పవ్వళించర స్వామి ||పట్టు||
భక్తులందరు నిన్ను ప్రస్తుతించి పాడ
చిరునగవులొలుకుచూ నిదురించు నీ మోము ||చిరు||
కరువుతీరా కాంచి తరియింతుము మేము ||శేష||

తెలుగు సినిమా పాటలలో ఈ యుగాంతం వరకు నిలిచిపోయే పాట ఏది అనే సందేహం ఎవరికైనా వస్తే అందుకు సమాధానంలా నిలిచిపోయే గీతంగా - 'శేషశైల వాస శ్రీ వేంకటేశా' పాటను ఉదహరించవచ్చు. తెలుగువారు తను సుస్థిరాస్తిగా చెప్పుకునే ప్రతిష్టాత్మక గాయకుడు ఘంటసాల - తన అణువణువూ భక్తి తత్వాన్ని నింపుకున్న స్వరార్చకుడు కాబట్టే - శాశ్వతత్వం కలిగిన ఈ గీతాన్ని పాడి, తెరపై అభినయించే అదృష్టం ఆ గానమయ్యకు దక్కిందని చెప్పాలి. పూర్వజన్మ సుకృతమో లేక ప్రస్తుత

జన్మలో అబ్బిన సంస్కారమో ఉంటేనే గాని ఇటువంటి మహద్భాగ్యాలు లభించవు. ఒక కృతికి చెందవలసిన గౌరవాన్ని స్వంతం చేసుకున్న ఈ గీతాన్ని రచించిన ఆత్రేయ కూడా ఆ కృపకు సమపాత్రుడు. ఈ పాటను 'రీతి గౌళ' రాగంలో స్వరపరిచారు పెండ్యాల. ఈ రాగంలో వచ్చిన పూర్తి సినిమా పాట తరువాత రోజుల్లో ఇంచుమించుగా ఇంకేదీ లేదనే చెప్పాలి. 'రహస్యం' చిత్రంలో ఘంటసాల స్వరపరిచిన 'గిరిజా కళ్యాణం' యక్షగానంలో 'ఈశుని దాసుని చేతువా' అంటూ సుశీల పాడిన చరణం మాత్రం మరో ఉదాహరణగా నిలుస్తుంది.

'వెంకటేశ్వర మహాత్మ్యం' చిత్రం సినిమా ప్రదర్శన జరిగినంతకాలం ఆంధ్రదేశంలోని అన్ని థియేటర్ల ఆవరణలోనూ వెంకటేశుని విగ్రహాలు ఉంచి నిత్యపూజలు జరిపేవారు. టిక్కెట్లతోపాటు వెంకటేశ్వరస్వామి, పద్మావతి క్యాలండర్లను ఇచ్చేవారు. పూజలు జరిగేచోట హుండీలలో భక్తులు వేసే ధనం ఒక్కోసారి థియేటర్‌లోని కలెక్షన్లను కూడా మించిపోయేది. సంగీత సాహిత్య నటనా చిత్రీకరణ పరంగా మొత్తం చిత్రాన్ని భక్తి పారవశ్యంతో ప్రతివారూ చూసి మెచ్చుకున్న చిత్రంగా చరిత్రలో నిలిచిపోయిందీ 'వెంకటేశ్వర మహాత్మ్యం'.



# ఆ పాత పాట మధురం

## రాజా



## రాణీ రత్నప్రభ

**దర్శకుడు బి.ఎ.సుబ్బారావుకి** తెలుగు సినీ రంగంలో ఓ చారిత్రాత్మక స్థానం ఉంది. ఎన్.టి.ఆర్, ఏ.యన్నార్ కాంబినేషన్‌లో తొలిసారిగా 'పల్లెటూరి పిల్ల' చిత్రాన్ని తీసింది ఆయనే. శోభనాచల బ్యానర్‌తో తన బి.ఎ.యస్ బ్యానర్‌ను కలుపుకుంటూ ఆ చిత్రాన్ని తీసిన తర్వాత స్వతంత్రంగా బి.ఎ.యస్ బ్యానర్‌పై అటు ఏయన్నార్ తోనూ ఇటు ఎన్.టి.ఆర్‌తోను ఎన్నో మంచి చిత్రాలు తన దర్శకత్వంలో నిర్మించారు. 'రాజు - పేద', 'చెంచులక్ష్మి, 'రాణీ రత్నప్రభ', 'భీష్మ' అందులోని కొన్ని. ఇవికాక 'మైరావణ', 'మోహినీ భస్మాసుర' వంటి చిత్రాలు కూడా ఆయన ఖాతాలో ఉన్నాయి. 'రాజు - పేద' నుంచి ఎస్. రాజేశ్వరరావే ఆయనకు సంగీత దర్శకుడు. వీళ్ళిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాల్లోని పాటలలో అభిరుచి ప్రత్యేకంగా కనిపిస్తూ ఉంటుంది. 1960 లో విడుదులైన రాణీ రత్నప్రభ అనే ఓ జానపద చిత్రంలో - అటు జనాదరణతో కూడిన అభిరుచికి, ఇటు అభిరుచితో కూడిన ప్రత్యేకతకు సాక్ష్యాలుగా నిలబడగలిగే ఓ నాలుగు పాటలివి:

నిన్న కనిపించింది
నన్ను మురిపించింది
అంద చందాల రాణీ ఆ చిన్నది ||నిన్న||
ఆమె చిరునవ్వులోనే
హాయున్నది
మనసు పులకించగా మధురభావాలు
నాలోన కలిగించింది
మరచిపోలేను ఆ రూపు ఏనాటికి ||మరచి||
మమత లేవేవో చెలరేగే ఇది ఏమిటి ||మమత||

తలచుకొనగానే ఏదో ఆనందమూ ||తలచు||
వలపు జనియించగా
ప్రణయ గీతాలు
నా చేత పాడించింది
సోగకనులార చూసింది సొంపారగా
మూగ కోరికలు చిగురించె ఇంపారగా ||సోగ||
నడచిపోయింది ఎంతో నాజూకుగా ||నడచి||
విడిచి మనజాలను విరహతాపాలు
మోహాలు రగిలించింది ||నిన్న||

ఈ పాటను ఆరుద్ర రాయగా ఘంటసాల గానం చేశారు. ఎన్.టి.ఆర్ ప్రధాన పాత్రధారిగా చిత్రీకరించిన ఈ పాటలో రేలంగి, సీతారామ్, అంజలి, సి.యస్.ఆర్. అవసరానుగుణంగా కనిపిస్తారు. ఘంటసాలకి, ఆరుద్రకి వారి సినీ జీవితంలో మైలురాయిలా నిలిచిపోయిన గీతమిది. తొలిచూపులో కలిగే ప్రేమానుభవాలు మనసులో ఎటువంటి భావాలను కలిగిస్తాయో వాటిన్నిటినీ అందమైన, తేలికైన మాటలతో విరహ గీతాలుగా మలిచి రాయటంలో ఆరుద్ర సిద్ధహస్తుడు, ప్రసిద్ధ హస్తుడు అని నిరూపించే గీతమిది. ఈ పాటతో పరిచయం ఉన్న ప్రతివారు తమ అనుభవాలతో కలుపుకుని జీవిత కాలంలో ఒక్కసారైనా నెమరు వేసుకోకుండా ఉండలేరేమో?! ఇక సంగీత పరంగా చూసుకుంటే మొదటి చరణం ట్యూన్ ఒకలాగ, రెండు మూడు చరణాల ట్యూన్ మరోలాగ ఉంటుంది. అప్పట్లో కొన్ని పాటలలో ఒకటి, మూడు చరణాలు ఒకలాగ రెండో చరణం మాత్రం మరోలాగ ఉండటం జరిగేది. మంచి ట్యూన్ హిట్ అవటానికి ఆ కొలతలేవీ అర్థం కావని ఋజువు చేసిన ఈ గీతానికి ప్రధాన రాగం భీంప్లాస్. ఆ రాగానికి సంబంధించిన స్వరాలతో పాటు అన్యస్వరాలను కూడా విస్తృతంగా వాడుకుంటూ కొండకచో అంతర్గాంధారం, శుద్ధ దైవతాన్ని జతచేసుకుంటూ ఖరహర ప్రియ రాగ లక్షణాలను జోడించుకుంటూ (ముఖ్యంగా రెండు, మూడు చరణాల్లో) ప్రయో'జనరంజకం'గా తయారు చేశారు యస్. రాజేశ్వరరావు. తదనుగుణంగా ఘంటసాల పాటను ఆవిష్కరించిన తీరుకూడా రసాత్మకంగా సాగటంతో ఎంతో కాలం మన్నటానికి, ఎంతోమంది మన్ననలను అందుకోవటానికి కావలసిన అర్హతలన్నిటినీ ఈ గీతం సంతరించుకున్నది.

---

ఆమె: అనురాగము ఒలికే ఈ రేయి మనసారగ కోర్కెలు తీరేయి
మన హాయికి సాటే లేదోయి అనురాగము
అతడు: ఆఆఆఆఆ
అనురాగము ఒలికే ఈ రేయి మనసారగ కోర్కెలు తీరేయి
మన హాయికి సాటే లేదోయి అనురాగము
ఆమె: చల్లని వెన్నెలలోన
ఝుల్లు ఝుల్లను వలపుల సోన ||చల్లని||
చిరునవ్వులతో విరితేనెలతో
మన జీవితాన పూలవాన అనురాగము
అతడు: ఆఆఆఆఆ
అనురాగము ఒలికే ఈ రేయి
మనసారగ కోర్కెలు తీరేయి
మన హాయికి సాటే లేదోయి
అనురాగము
ఆమె: తెలియని పరవశమొంది మన
కలలు ఫలించినవోయి ||తెలియని||
అనుబంధముతో ఆనందముతో మది
తేలి తేలి సోలిపోయె
అనురాగము
అతడు: ఆఆఆఆఆ
అనురాగము ఒలికే ఈ రేయి మనసారగ కోర్కెలు తీరేయి
మన హాయికి సాటే లేదోయీ
అనురాగము

ఈ పాటను పి.సుశీల, పి.బి.శ్రీనివాస్ గానం చేయగా అంజలీదేవి, ఎన్.టి.రామారావు అభినయించారు. ఈ పాటకు అమీర్ కళ్యాణి రాగం ఆధారం. ఇదే రాగంలో యస్.రాజేశ్వరరావు స్వరపరచిన 'భక్తజయదేవ' చిత్రంలోని 'నీ మధు మురళీ గానలీల' పాట సినీసంగీత ప్రియులకు ఘంటసాల ఆరాధకులకు బాగా గుర్తుండే ఉంటుంది. ఆ పాటను, ఈ పాటను సంపాదించి, కలిపి వినండి, ఆలాపనలు, ఇంటర్లూడ్‌లు ఎంత దగ్గరగా ఉన్నాయో తెలుస్తుంది. సరియైన ప్రచారం లభించక కాలగర్భంలో కలిసి పో(బో)తున్న మంచి పాటలలో ఇదొకటి. ఏ ఛానల్ వారయినా పూనుకుని ఈ పాటను వరసగా కొన్నాళ్ళపాటు ప్రేక్షక శ్రోతలకు అందిస్తే - చక్కని అభిరుచి గల వారి మన్ననకు పాత్రులవుతారు. ఆరుద్ర రాసిన ఈ పాటలో 'ఈ రేయి - తీరేయి' అనే పద ప్రయోగం ఆయనను పట్టి ఇచ్చే ముద్ర.

అతడు: నీటైన పడుచున్నదోయ్ నా రాజా
నీకే నా లబ్జన్నదోయ్ అహోహో నీటైన
నీతోటి మాటంది - నిన్నే రమంది ||నీ తోటి||
నీపైన కన్నేసింది - ఆహోహో
నీవే కావాలన్నది - ఓహోహో ||నీటైన||
వాలైన వన్నెలాడి - ముచ్చటైన ముద్దులాడి
చందమామ అందంతో - పై అన్న వగలాడి ||వాలైన||
ఏడేడు లోకాల ఈడులేని దొరసాని
నీ నీడ నున్నది - నీ జాడ గన్నది

స్త్రీ కంఠంతో: మగవారి మాయలోన చిక్కనన్నదోయ్ - అది
మాటంటె ఎన్నటికి పడనన్నదోయ్ ||మగవారి||
ఒకటంటే పది బాగ వడ్డిస్తానన్నదోయ్
చెవిపట్టుకుని సాగదీస్తా లెమ్మన్నదోయ్ ||నీటైన||
అతడు: ఓర్చుకున్నవారికే ఓరుగల్లన్నదీ
స్త్రీ కంఠంతో: ఆత్రపడ్డవారికే అందను పొమ్మన్నదీ
అతడు: రంగైన చిన్నదీ రాలుగాయ నన్నదీ
స్త్రీ కంఠంతో: వరసైతే చచ్చినా వదిలిపెట్టనన్నదీ ||నీటైన||

ఈ పాటను కొసరాజు రాయిగా ఘంటసాల, స్వర్ణలత ఆలపించారు. రేలంగి ప్రధాన పాత్రధారిగా అభినయించగా అలనాటి హాస్య జంట నల్లరామ్మూర్తి - సీతారామ్, మరికొంతమంది ఉపపాత్రధారులు కూడా అభినయించారు. హాస్యనటుడు బాలకృష్ణ పాట మధ్యలోనూ, హీరో ఎన్.టి.ఆర్ పాట చివర్లోనూ కనిపిస్తారు. ఓర్చుకున్నవారికే ఓరుగల్లు, వాలైన వన్నెలాడి, లబ్జు వంటి పదప్రయోగాలతో కొసరాజు కాస్సేపు ఆలోచింపచేస్తారు. పాటలో స్త్రీ పురుష కంఠాలు రెండు ఉన్నా ఇటు ఆడవారి పరంగానూ, ఇటు మగవారి పరంగానూ, రెండు అభినయాలను రేలంగి అందించారు. ఘంటసాల హుషారుగా, తమాషాగా పాడిన పాటల జాబితాలో ఈ పాట స్థానం ప్రత్యేకమైనదని ఇప్పుడు విన్నా కూడా అనిపిస్తుంది. ఈ పాటలో మరో తమాషా కూడా ఉంది. పల్లవి పూర్తికాగానే వచ్చే ఇంటర్ లూడ్‌ని, కంఠతా వచ్చేవరకూ పదే పదే వినండి. 'ప్రేమలేఖలు' సినిమా ద్వారా శంకర్ - జైకిషన్ అందించిన 'ఘల్లు ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతం' పాటలోని ఇంటర్ లూడ్స్‌తో పోల్చుకోండి. సరదా పాట కనుక యస్. రాజేశ్వరరావు సరదాగా పేరడీ చేసినట్లు అనిపిస్తుంది.

కనులలో కులుకులే కలిసి హాయిగ పిలిచెనే ||కనులలో||
తలపులో వలపులే మురిసి తీయగ నవ్వెనే ||కనులలో||
సొగసు చిలికే వయసులోనే ||సొగసు||
అనుభవించాలి ||సొగసు||
మంచి సమయము మించినా
తపించినా లభించునా
మనసు విరిచే వింత కలలే
మరచిపోవాలీ
నిజము తెలియక పోవునా ||నిజము||
నమ్మించినా కవ్వించినా
చిన్నారి రూపే మారినా ||కనులలో||

ఈ పాటను సుశీల గానం చేశారు. తెరపై ఎన్.టి.ఆర్, అంజలిపై చిత్రీకరించారు. ఈ పాటను కొసరాజు రాఘవయ్య చౌదరి రాసినట్టుగా పాటల పుస్తకంలో ఉంది. మంచి అభిరుచితో రూపుదిద్దుకున్నా, మరుగున పడిపోయిన మధుర గీతాలలో ఒకటిగా ఈ పాటను ఉదహరించవచ్చు. ఈ పాట దొరికే అవకాశాలు కూడా అంతంత మాత్రమే. లభ్యమైతే మాత్రం ఓ చక్కటి కలక్షన్‌గా దాచుకోదగ్గ ఈ పాట మోహనరాగం ఆధారంగా సాగుతుంది. మోహనరాగంలో రాజేశ్వరరావు శ్రోతలకు సమర్పించిన పాటలెన్నో... 'కళ్ళు తెరచి కనరా '(రాజు - పేద), 'ఎచట నుండి వీచెనో ఈ చల్లని గాలి' (అప్పు చేసి పప్పుకూడు), 'పాడవేల రాధికా' (ఇద్దరు మిత్రులు), 'వినిపించని రాగాలే' (చదువుకున్న అమ్మాయిలు), 'మదిలో వీణలు మ్రోగే' (ఆత్మీయులు) ఇవన్నీ మోహన రాగం ప్రధాన రాగంగా ఆయన స్వర రచనలో సాగినవే. ఆ పాటల మాధుర్యపు స్థాయికి ఏ మాత్రం తగ్గని రీతిలో ఉంటుంది ఈ 'కనులలో కులుకులే' గీతం. మోహన రాగంతో మాండ్ రాగాన్ని మిళితం చేసుకుంటూ అవసరం అయిన చోట పహాడీ రాగచ్ఛాయలతో మలుచుకుంటూ పాటను పారవశ్యపు అంచుల దాకా తీసుకు వెళ్ళగలగటం రాజేశ్వరరావు సాధించుకున్న ప్రత్యేకత. టోక్యో మోహన, సినీ మోహనలాగ 'రాజేశ్వరరావు మోహన' అంటూ ఓ బ్రాండ్ నేమ్ వచ్చేలా ఉంటాయి - ఆయన ఆ రాగంలో స్వరపడిన గీతాలు! అందుకు పైన ఉదహరించిన గీతాలే సాక్ష్యాలు వాటితో సమస్థాయిలో గౌరవాన్ని పొందదగ్గ అర్హత గల ఈ గీతాన్ని ప్రజలకు కొన్నాళ్ళపాటు అందించే కార్యక్రమాన్ని ఏ ఛానల్ వాళ్ళో ఆడియో వాళ్ళో పూనుకుంటే పుణ్యం కట్టుకున్నవారవుతారు.

ఈ చిత్రంలో మొత్తం తొమ్మిది పాటలున్నాయి. మిగిలిన అయిదు పాటలలో 'ఎక్కడ దాచావోయ్ సిపాయి', 'విన్నావా నూకాలమ్మా', 'ఒహ్హొహ్హో అందాల మహరాజా బందీగ మననేల రాజా' వంటి ఫరవాలేదనిపించే పాటలు కూడా లేకపోలేదు. అయితే పై నాలుగు పాటల ప్రత్యేకతే వేరు. ఈ చిత్రానికి సంబంధించిన పాటలలో ఇంకో ప్రత్యేకత ఉంది. 1960 నాటికి కథానాయకుడిగా ఎన్.టి.ఆర్, హాస్యనటుడిగా రేలంగి బాగా ఎస్టాబ్లిష్ అయిపోయారు. ఆయనకు ఘంటసాల, ఈయనకు మాధ్వపెద్ది రెగ్యులర్‌గా నేపథ్యం పాడేవారు. ఎప్పుడో ఒకటీ ఆరా మినహాయింపులు ఉండొచ్చు. కానీ ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్ అభినయించిన యుగళ గీతాలకి పి.బి శ్రీనివాస్ చేత పాడించడం (నిన్న కనిపించింది పాట సోలో కింద వస్తుంది), రేలంగికి ఘంటసాల చేత పాడించటం గమనించదగ్గ విషయం.



# ఆ పాత పాట మధురం

## రాజా



### సీతారామకళ్యాణం

కొన్ని చిత్రాలు - వాటిని నిర్మించిన సంస్థలకు ప్రతిష్ఠాత్మకంగా నిలిచిపోతే, మరికొన్ని చిత్రాలు సినీ రంగానికే గర్వకారణంగా మిగిలిపోతాయి. ఎన్.ఎ.టి. సంస్థ నిర్మించిన సీతారామకళ్యాణం చిత్రాన్ని ద్వితీయ శ్రేణికి చెందిన చిత్రాలలో ఓ అద్వితీయ చిత్రంగా ఉదహరించవచ్చు. నెగిటివ్ ఇమేజ్ కలిగిన రావణుని పాత్రను తొలిసారి కథానాయకుని స్థాయిలో ఎన్.టి.ఆర్ తీర్చిదిద్ది తానే ధరించడం, ఒక్క ఫ్రేములో కూడా రాజీపడకుండా మొత్తం చిత్రాన్ని కళాత్మకంగా ఆయన మలచిన తీరు, ఉత్కృష్ట ప్రమాణాలతో కూడిన సంగీత సాహిత్య గానాలు నటన - ఇవన్నీ ఆ చిత్రానికి చిరకీర్తిని, స్థిరకీర్తిని కట్టబెట్టాయి. ఈ చిత్రానికి ఎన్.టి.ఆర్. దర్శకత్వం వహించినా దర్శకుడుగా తన పేరును వేసుకోలేదు. ‘యూనిట్‘ అంటూ ఆ క్రెడిట్‌ని తన బృందానికి పంచారు. ఈ చిత్రానికి గాలి పెంచల నరసింహారావు సంగీత దర్శకుడు, మాటలు - పాటలు సీనియర్ సముద్రాల రచించారు. ఈ చిత్రంలోని ప్రతీ స్వరరచనకు ఓ ప్రత్యేకత ఉంది. ....

దేవ దేవ పరంధామ నీల మేఘ శ్యామా
దేవ దేవ పరంధామ నీల మేఘ శ్యామా
నిన్ను విడచి తనను మరిచి
హుంకరించు అహంకారి
నిన్ను విడిచి తనను మరిచి
హుంకరించు అహంకారి

కానలేడు నీ మహిమ
కానలేడు నీ మహిమ
నటన సూత్రధారి
దేవ దేవ పరంధామ నీల మేఘశ్యామా
దేవ దేవ పరంధామ నీల మేఘశ్యామా

రకరకాల చరణాల చొప్పున విభజించబడినా ‘దేవ దేవ పరంధామ నీల మేఘశ్యామ‘ అనే ఒకే మకుటం పల్లవిగా కలిగిన ఈ పాట చిత్రంలో రకరకాల సందర్భాలలో వస్తుంది. కుంభకర్ణ విభీషణులతో ఆకాశంలో పయనిస్తున్న రావణుడు తన పుష్పక విమానం మార్గమధ్యంలో ఆగిపోవడానికి కారణం సతీసమేతుడై శివుడు తాండవ కేళి జరిపే సమయమని నారదుని ద్వారా తెలుసుకుని, శివుని ప్రసన్నం చేసుకోవడానికి వెళుతుండగా నారదుడు నర్మగర్భంగా పాడిన చరణమది. దీనిని పి.బి.శ్రీనివాస్ ఆలపించగా కాంతారావు(నారదుడు), ఎన్.టి.ఆర్ (రావణుడు), కన్నడ నటుడు ఉదయ్ కుమార్(కుంభకర్ణుడు), జూనియర్ ఏవీ

సుబ్బారావు(విభీషణుడు)పై చిత్రీకరించారు. హిందోళరాగాన్ని పల్లవికి, ఆరభి రాగాన్ని చరణానికి ఉపయోగించారు. చరణం తర్వాత వచ్చే పల్లవిని తిరిగి ఇదే ఆరభి రాగంలో స్వరపరచడం సంగీతపరంగా చెప్పుకోతగ్గ విశేషం

---

కానరార కైలాస నివాస
బాలేందుధరా జటాధరా.....||కానరార||
భక్తజాళ పరిపాల దయాళ ||భక్త||
హిమ శైల సుత ప్రేమలోల ||కానరార||
నిన్ను చూడమది కోరితిరా....
నిన్ను చూడమది కోరితిరా...
నీ సన్నిధానమున చేరితిరా
నిన్ను చూడమది కోరితిరా...
నీ సన్నిధానమున చేరితిరా

కన్నడ సేయక కన్నులు చల్లగ
మన్నన సేయరా గిరిజా రమణా ||కానరార||
సర్వభూషితాంగ కందర్పదర్పభంగ
సర్వ భూషితాంగ కందర్పదర్పభంగ
భవపాశనాశ పార్వతీ మనోహర
హే మహేశ వ్యోమకేశ త్రిపుర హర
కానరార కైలాస నివాస
బాలేందుధరా జటాధరా హరా కానరార

ఈ పాటను ఘంటసాల గానం చేయగా ఎన్.టి.ఆర్, ప్రధాన పాత్రధారిగా అభినయించారు. ఈ పాటలో సముద్రాల ఉపయోగించిన ఎన్నో పదాలు, ఉపమానాలలో - కన్నడ సేయక (ఉపేక్షించక), కందర్ప దర్పభంగ (మన్మధునికి గర్వభంగం చేసిన వాడు), వ్యోమకేశ (ఆకాశమే కేశములుగా కలవాడు) వంటి ప్రయోగాలు భక్తిగీతాలలో అతి అరుదుగా కనిపిస్తాయి. శంకరాభరణ రాగానికి సదుపమానంగా నిలిచిపోయే ఈ గీతానికి జపం, జీవం అన్నీ ఘంటసాలే..! ప్రతీ పదం యొక్క అర్థాన్ని సమర్థంగా తెరపై ఆవిష్కరించగలిగే నటుడు ఉంటే వాటి పరమార్థం సంపూర్ణంగా తెలిసిన గాయకుడు ఎంతగా ప్రాణ ప్రతిష్ఠ చేసి పాడగలడో నిరూపించే పాట ఇది. ఈ పాటను సాకల్యంగా చేసి ఇంటర్‌లూడ్స్‌తో సహా మనసులో శాశ్వతంగా నిలుపుకోగలిగిన వారెవరైనా శంకరాభరణ రాగంపై కొంత పట్టుని సాధించగలిగానని చెప్పుకోవచ్చు, ఎందుకంటే ఈ పాటలో శంకరాభరణ రాగంతో పాటు ఆ రాగంలోని జన్యరాగాల నడకకు సంబంధించిన ప్రయోగాలన్నీ జరిగాయి కాబట్టి!

---

జయత్వదభ్ర విభ్రమద్భ్రమ ద్భుజంగ మస్ఫురత్
ధగద్ధగద్వినిర్గ మత్కరాళ పాలహవ్యవాట్
ధిమిద్ధిమిద్ధిమి ధ్వనన్మృదంగ తుంగ మంగళా
ధ్వనిక్రమ ప్రవర్తిత ప్రచండతాండవశ్శివాః
ఓం నమఃశ్శివాయ
అగర్వ సర్వమంగళా కళాకదంబ మంజరీమ్
రసప్రవాహ మాధురీ విజృంభణా మధూవ్రతమ్
స్మరాంతకమ్ పురాంతకమ్
భవాంతకమ్ మఖాంతకమ్
గజాంతకాంధకాంతకమ్

తమంతకాంధకమ్ భజే
ఓం నమఃహరాయ
ప్రఫుల్లనీల పంకజ ప్రపంచ కాలిమచ్ఛటా
విడంబి కంఠ కంధరా రుచిప్రబంధ కంధరమ్
స్వరచ్ఛితమ్ పురచ్ఛితమ్
భవచ్ఛితమ్ ముఖచ్ఛితమ్
గజచ్ఛికాంధ ఖచ్ఛితమ్
తమంత ఖచ్ఛితమ్ భజే

ఈ శివ తాండవ స్తోత్రాన్ని ఘంటసాల గానం చేయగా ఎన్.టి.ఆర్. ప్రధాన పాత్రధారిగా అభినయించారు. ప్రామాణిక వృత్తంతో సాగిన ఈ స్తోత్రం రావణకృతమని, కానీ తగిన ఆధారాలు లేవని, అనూచానంగా వస్తున్నదని చెప్పుకుంటారు. హంసధ్వని రాగంతో

మొదలైన ఈ స్తోత్రంలో 'అగర్వ సర్వ మంగళా కళాకదంబ మంజరీమ్' నుంచి 'ఓం నమఃహరాయ' వరకూ వలజి రాగంలోనూ 'ప్రఫుల్ల నీల పంకజా' దగ్గర నుంచి 'తమంత ఖచ్చితమ్ భజే' వరకూ మోహనరాగంలోనూ స్వరపరిచారు. సినీగాయకులలో ఘంటసాల వంటి అదృష్టవంతుడు వేరొకరు లేరని చెప్పాలి. జన్మచరితార్థమయ్యే స్వరరచనలెన్నో ఆయనకు తన సంగీత జీవన యానంలో లభించాయి. ఆ అవకాశాలన్నిటినీ సద్వినియోగం చేసుకోవడమే కాక అవి వింటే తాను గాని, నటించిన నటుడుగాని శ్రోతల మదిలో మెదిలేటంత పటిష్టమైన ముద్రను ఏర్పరచుకోగలిగారాయన.

తన ప్రతిభావ్యుత్పత్తులతో, స్వరరచనను సంపూర్ణ అవగాహనతో ఆకళింపు చేసుకుని, పాత్ర స్వభావాన్ని తనలోకి ఆవహింప చేసుకుని, స్పష్టమైన ఉచ్చారణతో పాటు ప్రాణ ప్రతిష్ఠ చేసే విధంగా పాడాలంటే గాయకుడన్నవాడు ఎటువంటి వాటిని అభ్యసించాలి, సాధన చేయాలి అనే ప్రశ్నలకు సమాధానంలా, సజీవ ఉదాహరణగా ఈ స్తోత్రాన్ని ఘంటసాల ఆవిష్కరించిన పద్ధతి నిలుస్తుంది. గాయకుడి స్వరార్చన మన చెవికి సోకగానే మనసు పులకరించిపోవాలి. ఒళ్ళు జలదరించిపోవాలి. ఈ రకమైన అనుభూతులన్నింటినీ ఏకకాలంలో అందించారు ఘంటసాల ఈ స్తోత్రం ద్వారా. ఇక నటుడిగా ఎన్.టి.ఆర్ స్తోత్రానికి అభినయించిన తీరు - న భూతో న భవిష్యతి.

---

పరమ శైవాచార పరులలో నత్యంత
ప్రియుడన్న యశము కల్పించినావు
తల్లి కోరిక దీర్పదలచి వేడగ ఆత్మ
లింగమ్ముప్రేమ నొసంగినావు
ముని కుబేరుడు దోచుకొనిన లంకాపురీ
విభవమ్ము మరల ఇప్పించినావు

తలచుటే తడువుగా దర్శన భాగ్యమ్ము
కరుణించి నీడవై కాచినావు'
స్వామీ భవదీయ దర్శనోత్సాహి నగుచు దరియ
ఈ వేళ ఈ నిషేధమ్ములేల
వైరమేలయ్య మరచి నా నేరములను
కరుణ గనవయ్య కైలాస గిరినివాస
కరుణ గనవయ్య కైలాస గిరినివాస

ఈ పద్యాన్ని ఘంటసాల ఆలపించగా రావణపాత్రధారియైన ఎన్.టి.ఆర్.పై చిత్రీకరించారు. కైలాసగిరిని రావణుడు పెకలించగా తాండవ చేస్తున్న శివునికి లయ తప్పుతుంది. పార్వతీదేవి పరిహాసదృక్కులకు కుపితుడైన పరమశివుడు తన పాదఘట్టనతో రావణుని బలగర్వాన్ని అణుస్తాడు. భంగపడిన రావణుడు ఖిన్నుడై శివుని కరుణ కోసం వేడుకుంటూ ఆలపించే పద్యమిది. ఈ పద్యాన్ని సింధుభైరవ రాగంలో స్వరపరిచారు.

పుష్పక విమానంపై వెళ్ళే రావణుడు నారదుని సూచనపై కైలాస పర్వతానికి వచ్చి శివుని చూడగోరి గానంతో ప్రార్థించి, విఫలుడై బలిమితో కైలాస పర్వతాన్ని పెకలించబూని, భంగపడి తిరిగి ఆత్మార్పణ మార్గంలో తన ప్రేవులనే తంత్రులుగా చేసి రుద్రవీణను పలికించి శివుని మెప్పించే వరకూ గల ఈ సన్నివేశం నిడివి పరంగా చూసుకుంటే ఎంతో పొడవైనది. సుమారు పదిహేను నిమిషాల పాటుగా ఏక బిగిన సాగే ఈ సన్నివేశం ఎక్కడా విసుగు చెందనీయకుండా ఈనాటికీ ఆ చిత్రానికి ఓ ప్రత్యేక ఆకర్షణలా ఉందంటే అందుకు కారణం సంగీత సాహిత్య గాన నటనా కౌశలాలే రుద్రవీణ పలికించే సన్నివేశంలోని నేపథ్యానికి వీణను వాయించింది కీ.శే.ఈమని శంకరశాస్త్రి.

---

హే పార్వతీ నాథ కైలాస శైలాగ్రవాసా
శశాంకార్ధ మౌళి ఉమాదేవతోల్లాసీ సవ్యాంగ భాగా
శ్రితానందదాయిస్మితాపాంగా
భస్మీకృతానంగ గంగాధరా
సర్వసంతాప హరా, హరా
శివా సదా శివా
నీయున్న చందంబు నేనంత
యూహింపగా వచ్చు

నేదములున్నీవ వాదమ్ములున్నీవ
ధైర్యంబులున్నీవ మర్మంబులున్నీవ
సర్వంబులున్నీవ
నీ లెంకలైనట్టి దాసుండనైనట్టి
నన్నున్ దయాళుండవై ప్రీతి రక్షింపవే
తప్పు సైరింపవే దేవ మన్నింపవే
దేవదేవా మహాదేవదేవా నమస్తే నమస్తే నమః

శివుని ప్రసన్నం చేసుకున్న రావణుడు స్తుతించిన స్తోత్రమిది. ఘంటసాల ఆలపించగా ఎన్.టి.ఆర్ ప్రధాన పాత్రధారిగా అభినయించారు. ఈ స్తోత్రం తొలిభాగం ఆరభి రాగంలో మొదలయి 'నీయున్న చందంబు' దగ్గర్నుంచి మాయమాళవ గౌళ రాగంలోకి మారిపోతుంది.

---

దానకుల వైరి దర్పంబు వర్ణించు
చదువు లెవ్వరుగాని చదువరాదు
సురపక్షపాతి విస్ఫురణకై గావించు
యాగంబు లేవియు సాగరాదు
అమరుల మేలుకై ఆచరించెడి యజ్ఞ
గుడంబలందగ్ని మండరాదు

హరనామమేగాని హరినామధేయంబు
త్రిజగాల నెవ్వరు స్మరించరాదు
అమరలోక విజేత లంకాధినేత
అమరలోక విజేత లంకాధినేత
రావణుని శాసనంబు నిరాకరించు
విష్ణుదాసుల బట్టి కేల్ విరచిగట్టి
చెఱను నెట్టుడు దానవ శ్రేష్ఠులారా!

శివుడొసగిన వరగర్వంతో దిక్పాలందర్ని తన బానిసలుగా చేసుకుని - విష్ణుభక్తిని బోధించే చదువులు ఎవ్వరూ చదువరాదని, అమరులైన దేవతల మేలు కోసం చేసే యజ్ఞాలు ఇక సాగరాదని, శివుని పేరు తప్ప విష్ణువు పేరును ముల్లోకాలలో ఎవ్వరూ స్మరించరాదని, అలా కాదని జపించె విష్ణుభక్తులకు పెడరెక్కలు విరిచి చెరలో వేయమని రావణుడు తన అనుచర అసుర గణాలకు తెలిపే పద్యమిది. ఈ పద్యంలో 'అమరలోక విజేత లంకాధినేత' అనే పదాలను తొలుత యన్.టి.ఆర్ పలుకుతారు. తిరిగి ఘంటసాల కంఠంలో అవే పదాలు పునరుక్తి అవుతూ పద్యం కొనసాగుతుంది. ఎన్.టి.ఆర్ గాత్రం, నవ్వు, ఆ తర్వాత ఘంటసాల ఒక ఊపుతో అందుకుని పాడిన తీరు - ఈ పద్యానికి అమరిన ప్రత్యేక ఆకర్షణ. ఇదికాక - గమనిస్తే స్వరపరంగా ప్రత్యేకత కలిగిన మరొక ఆకర్షణ ఉంది. అది - అయిదు రాగాలలో ఈ పద్యాన్ని స్వరపరచడం. 'దానవకులవైరి' దగ్గర్నుంచి 'చదువరాదు వరకు మోహనరాగాన్ని, 'సురపక్షపాతి' దగ్గర్నుంచి యాగంబు లేవియు సాగరాదు' వరకు ఖరహరప్రియ రాగాన్ని, 'అమరుల మేలుకై ఆచరించెడి దగ్గర్నుండి 'అగ్ని మండరాదు' వరకు కేదారగౌళ రాగాన్ని 'హరనామమే గాను' దగ్గర్నుంచి 'స్మరించరాదు' వరకు సింహేంద్ర మధ్యమం రాగాన్ని, 'అమరలోక విజేత లంకాధినేత' దగ్గర్నుంచి పద్యం చివరి వరకు శ్రీరాగాన్ని ఉపయోగించారు.

పైన ఉదహరించిన పద్యాల్లో రాగాలను ఉపయోగిస్తున్నప్పుడు ఒకరాగంలో ఇంకొక రాగాన్ని మిశ్రమం చేయకపోవటం, ఒక రాగంలోంచి ఇంకొక రాగంలోకి వెళుతున్నప్పుడు 'జంప్' అనిపించేలా కాకుండా ఎంతో హాయిగా సంచారం చేయడం - విశేషంగా పేర్కొనక తప్పదు. ఆ ఘనత సంగీత దర్శకుడు గాలి పెంచల నరసింహరావుదే ఆ కీర్తి కట్టబెట్టవలసింది కూడా ఆయనకే. (చాలామంది ఆయన పేరుని గాలిపెంచల నరసింహారావు అని పలుకుతారు. నిజానికి గాలి ఆయన ఇంటిపేరు. ఆయన పేరు పెంచల నరసింహరావు. అందుచేత గాలి (గ్యాప్ ఇచ్చి) పెంచల నరసింహరావు అని వ్యవహరించటం సబబని కొందరి అభిప్రాయం) సంగీత దర్శకుడు ఎంత ప్రతిభావంతుడైనా, సమర్థుడైన గాయకుడు లేకపోతే కళావిష్కరణలో స్పందన, శాశ్వతత్వం కొరవడుతుంది. ఈ కోణంలోంచి చూస్తే పైన ఉదహరించిన పాటలు, పద్యాలు ఇప్పటికీ మన గుండెల్లో మార్మోగుతూ ఉండడానికి కారణం అర్థమయిపోతుంది.



# ఆ పాత పాట మధురం
## రాజా



## సీతారామ కళ్యాణం - 2

ి

...

వీణా..పాడవే...రాగమయీ
పాడవే రాగమయీ వీణా పాడవే రాగమయీ
లంకానాధుని రమణీయగాధ ||లంకా||
పాడవే రాగమయీ
రాగములో అనురాగము కలిపి ||రాగము||
శివయోగములో భోగము తెలిపి
జగమే ప్రేమకు నెలవును చేసే ||జగమే ||
రసికావతంసుని రమణీయగాధ ||పాడవే||
వీణా మాధురి శివుమురిపించి ||వీణా ||
విక్రమధాటిని అమరుల నుంచి
కనుల సైగల నా మనసేలే ||కనుల ||
కైకసి సూనుని కమనీయగాధ
పాడవే రాగమయీ వీణా పాడవే రాగమయీ
రాగమయీ... రాగమయీ

'వీణా పాడవే రాగమయీ' పాటను సుశీల ఆలపించగా బి.సరోజాదేవి, ఎన్.టి.ఆర్. అభినయించారు. ఈ పాటకు దేశ్ రాగం ఆధారం. కథాగమనం, పాత్రల పరిచయం, వాటి పూర్వాపరాలు అన్నీ సాహిత్యం ద్వారా తెలియజేయడం ఈ పాట ప్రత్యేకత. ఇక దేశ్ రాగాన్ని గాలిపెంచెల నరసింహారావు. ఎంతచక్కగా మలచుకున్నారంటే ఆ రాగంలో గల జీవస్వరాలన్నిటినీ అమృతధారలు ఒలికించే విధంగా పిండుకుని పాటంతా పరిచారాయన. సుశీల కూడా అంతే రసస్ఫూర్తితో పాడి రక్తికట్టించిన ఈ గీతం గాయనీమణులుగా రాణిద్దామనుకునే వారికి అతిసులువుగా లభించే వరం.

---

అఖిల జగతి సృష్టిజేసి
ఆడిపాడి అంతలోనే ||అఖిల||
ఆ పెదవు బొమ్మలాట
నటన సూత్రధారీ!
దేవ దేవ పరంధామ నీల మేఘశ్యామా

హిందోళ రాగంలో స్వరపరచబడిన ఈ స్వరఖండికను పి.బి.శ్రీనివాస్ ఆలపించగా కాంతారావుపై చిత్రీకరించారు. ఈ ఖండికలకు మకుట వాక్యమైన 'దేవదేవ పరంధామ నీలమేఘశ్యామా'ను కూడా చివరన హిందోళ రాగంతో కలిపి ఆలపించటం జరిగింది.

---

నెలత ఇటువంటి నీ మాట నీదుపాట
నీ వలపు చూపు నీ నడల్ నెమ్మి వినగ కనగా
దొరకునే సామాన్య కామునకు
నీ వలపు చూపు దొరకునే
బహు తపంబులు గావించి బడయకున్న

ఈ పద్యాన్ని అఠాణారాగంలో స్వరపరిచారు. ఈ రాగంలో గల పాటను గురించి చెప్పుకోవాలంటే 'శ్రీ కృష్ణ విజయం'లో జోహారు శిఖిపించమౌళి పాట తొలి భాగాన్ని, 'సీతయ్య'లోని 'ఒక్క మగాడు' పాటలో 'సుగుణాల రాముడు సమరాన భీముడు' అనేవాక్యాన్ని ఉదహరించాలి. రెండింటినీ గుర్తుచేసుకుంటూ ఈ పద్యాన్ని కూడా ఆలపిస్తూ పోతే అఠాణా రాగం సొగసులన్నీ అవగతమవుతాయి. ఈ పద్యాన్ని ఘంటసాల పాడగా ఎన్.టి.ఆర్ కుచలకుమారి అభినయించారు. ఈ పద్యం అర్థాన్ని సంపూర్ణంగా తెలుసుకుని సినిమా చూస్తే ఎన్.టి.ఆర్ ఎంత గొప్ప నటుడో, పురాణాలపై ఎంతటి అవగాహన గల కళాకారుడో అర్థమవుతుంది.

---

జనకుండు సుతుడును జన్నంబు జేసిన
వనితా వారేమి కావలయు నీకు
అన్నదమ్ములు సోమయాజులై వెలసిన
లలనా వారేమి కావలయు నీకు
బావయు మరదియు
బవరాన గూలిన చెలువా వారేమి కావలయు నీకు

అల్లుండు మామయు అని త్రెళ్ళి వచ్చిన
పొలతీ వారేమి కావలయు నీకు
వావి వరసలు గణియింప వచ్చితేని
పడతీ మాతోడ మాటాడ వశమె నీకు
చాలు ఇక చాలు వెర్రి వాదాలు మాని
వగలు దీరిచి ఏలవే చిగురుబోణీ

ఈ పద్యాన్ని ఘంటసాల ఆలపించగా ఎన్.టి.ఆర్, కుచలకుమారి అభినయించారు. శంకరాభరణ రాగం ఈ పద్యానికి ఆధారం. ముందు ఉదహరించిన పద్యానికి ఉపయోగించిన విశ్లేషణ ఈ పద్యానికీ అన్వయించుకోవచ్చు. ఈ పద్యాన్ని అర్థం చేసుకోవడం కన్నా అవగాహన చేసుకోవడం ముఖ్యం. అందుకు మానసిక పరిపక్వత ఎంతో కావాలి. వక్ర దృష్టితో ఈ పద్యాన్ని చూస్తే సమాజానికి హానిచేసిన వాళ్ళమవుతాం. అంతటి శక్తిగల ఈ పద్యాన్ని - అసలు ఆ పోకడలు, ఆ అనుమానాలు ఏవీ సామాన్య ప్రేక్షకుడి మనసుని ఆవహించకుండా పవిత్రంగా, నర్మగర్భంగా తెరపై ఆవిష్కరించడంలో ఎన్.టి.ఆర్, సముద్రాల ఘంటసాల చూపిన స్థిత ప్రజ్ఞతకు హైందవ సంస్కృతి సంప్రదాయాల పట్ల, పురాణాల పట్ల గౌరవం ఉన్న ప్రతి తెలుగు వారూ నమోవాకాలు అర్పించవలసిందే

---

పరమ పురుష నీదు కరుణ
పరుగు దీయు కుంటివాడు
మాతయౌను గొడ్రాలే
నటన సూత్రధీ
దేవ దేవ పరంధామ నీల మేఘ శ్యామా

మోహనరాగంలో స్వరపరచిన ఈ ఖండికను కూడా పి.బి శ్రీనివాసే ఆలపించారు. కాంతారావే అభినయించారు. సినిమాలో మూడు భాగాలుగా వచ్చిన ఈ ఖండికల్ని కలిపి సమర్ధవంతంగా ఆలపించదలిస్తే రాగమాలికను ఆవిష్కరించడంలో గాత్రాన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో తెలుస్తుంది.

---

వేయి కనులు చాలవుగా
కన వేయి కన్నులు చాలవుగా
వేడుకైన మా సీతను చూడ ||2|| ||వేయి||
జనకుని ఇంటను చందమామలా ||2||
దినమొక వన్నెగ వర్ధిల్లీ
కన్నవారి కన్నుల చల్లగ ||2||
ఆటలనాడే సీతను చూడ ||వేయి||
తూగుటూయలా తోడి చెలులతో ||2||
గగన వీధిలో తేలియాడుతూ
వింత వింత పూబంతులాటలా ||2||
వేడుక చూసే సీతను చూడ ||వేయి||

పి.లీల పాడిన ఈ పాటను సీతగా నటించిన గీతాంజలి ప్రధాన పాత్రధారిణిగా చిత్రీకరించారు. కస్తూరి శివరావు, మిక్కిలినేని, ఛాయాదేవి సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. సంగీత పరంగా ఈ పాటలో గాలి పెంచలవారు చాలా మంచి ప్రయోగం చేశారు. కమాచ్, దేశ్, శంకరాభరణ రాగాలను అతి నైపుణ్యంగా ప్రయోగించారీ పాటలో. ఈ రాగాల స్వరాలను తీసుకుని మిశ్రమం చేస్తూ - పాడే వారికి సునాయాసంగా ఉండేలా పాటను మలచటంలో గాలి పెంచలవారి మేధో సంపద ఎన్నదగినది, మిన్నయైనది.

---

మాయసీత: ఓ సుకుమార నినుగని మురిసితిరా
నిను వలచేర రారా ఏలరా ||ఓ సుకుమార||
మాయసీత: కనులా నిన్ను చూచిన నాడే ||2||
మనసూ నీదై పోయెనురా ||2||
శివుని విల్లూ విరచిన నాడు
నేనే కానుక నైతినిరా సుకుమార ||ఓ సుకుమార||
మాయరామ: తొలి నీ మోము చూచిననాడే ||2||
నాలో మోహము రేగినదే ||2||
తాళగలేనే నీ ఎడబాటూ వలపులు తీరిచి ఏలవే బేలా
సుకుమారి ఓ సుకుమారి నినుగన మనసగునే
నా వగదీర్చి ఏలవే జానకీ ఓ సుకుమారీ
మాయసీత: మనసొకటాయె మమతలు తెలిసెనుగా
మాయరామ: మది చిగురించు వాంఛా తీరునుగా||2||

ఈ పాటను లీల, ఘంటసాల పాడగా హరనాథ్ (రాముడు) గీతాంజలి (సీత) అభినయించారు. రావణుడు రాముని రూపంలో వచ్చి సీతని కలవాలనుకుంటే - సీత రూపంలో శూర్పణఖ వచ్చి రాముని కలవాలనుకుంటుంది. తెరపై కనిపించేది రాముడు, సీత అయినా - వారు రావణుడు, శూర్పణఖ అని ప్రేక్షకుడికి అర్థమయ్యేలా కల్పించిన సరదా సన్నివేశంలో వచ్చే గీతమిది. శూర్పణఖ పాత్రధారిణి పేరు స్వర్ణ. ఈమె గీతాంజలి సోదరి. ఈ పాటకు హిందుస్థానీ పీలూ రాగచ్ఛాయలలో ఉండే కాపీ రాగాన్ని ఉపయోగించారు. లలిత సంగీతానికి శాస్త్రీయత కన్న రసభావాలే ప్రధానం కనుక - ఇక్కడ సన్నివేశం కూడా అంత శాస్త్రసమ్మతమైనది కాకపోవడం చేత కాపీ, పీలూలని శాస్త్రబద్ధంగా వాడుకోలేదు సరికదా ఇంటర్ లూడ్స్‌లో దేశ్ రాగచ్ఛాయలని, కొంత జానపద ధోరణిని కూడా అనుసరించారు. నిజానికి అక్కడున్నది మాయారూపాలలో ఉన్న రాక్షసులు. వారు చేసే పని నాగరికం కాదు. అంచేత రాగప్రయోగాలు కూడా అంత శాస్త్రీయంగా కాకుండా కాస్త మిశ్రమం పొందుతూ చెందుతూ ఉపయోగించారని సరదాగా అన్వయించుకోవచ్చు.

---

జగదేక మాతా గౌరీ
కరుణించవే భవానీ కరుణించవే ||జగ||
ఘనమౌ శివుని ధనువు వంచి ||ఘన||
జనకుని కోరిక తీరుట జేసి
మనసిజ మోహను రఘుకులేశుని ||మన||
స్వామిని జయవే మంగళ గౌరి
కరుణించవే భవాని కరుణించవే
నీ పదములను, లంకాపతిని ||నీపద||
నా పెన్నిధిగా నమ్ముకొంటినే
నా పతికాపద కలుగనీయక ||నా పతి||
కాపాడవే మంగళ గౌరీ
కరుణించవే భవానీ కరుణించవే భవానీ ||జగ||

ఈ పాటను సుశీల గానం చేయగా గీతాంజలి (అప్పట్లో పేరు మణి), బి.సరోజాదేవి అభినయించారు. ఈ పాటకు సారంగ రాగం ఆధారం. కొన్ని కొన్ని పాటలు సినిమా రూపేణా వచ్చినా తర్వాత మన సంప్రదాయంలో అవి కూడా ఓ భాగమై పోవటం జరిగింది. అటువంటి పాటలలో ఈ పాటను పేర్కొనాలి. స్త్రీల పండగలకు, పూజలకు సంబంధించిన పేరంటాలలో ఈ నాటికీ ఈ పాటను యధావిధిగా, యధాతథంగా పాడటం జరుగుతోంది. ఆ సంప్రదాయం ఎంత పటిష్ఠంగా కొనసాగుతోందంటే అర్థాన్ని కూడా పట్టించుకోకుండా తు.చ తప్పకుండా పాడటం మనం చాలా ఇళ్ళల్లో గమనించవచ్చు. ముఖ్యంగా రెండవ చరణంలో వచ్చే 'నీ పదములను, లంకాపతిని నా పెన్నిధిగా నమ్ముకుంటినే' అనే వాక్యాన్ని అలా యధాతథంగా పాడితే మరీ అనుచితంగా ఉంటుందన్న సంగతి కూడా మనవాళ్ళ మనసులకు తట్టటం లేదంటే ఆ తర్వాత వచ్చే 'నా పతికాపద కలుగనీయక కాపాడగదే మంగళ గౌరి' అనే వాక్యాల ప్రభావంలోనూ, ప్రవాహంలోనూ ఎంతగా మునిగిపోతున్నారో గమనించాలి. అది ఒక విధంగా పాట సాధించిన విజయమే.

---

సీతారాముల కళాణము చూతము రారండి
శ్రీ సీతారాలము కళాణము చూతము రారండి
చూచువారలకు చూడముచ్చటట
పుణ్యపురుషులకు ధన్య భాగ్యమట
భక్తియుక్తులకు ముక్తి ప్రధమట.... ||భక్తి||
సురలును మునులును చూడవత్తురట
కళ్యాణము చూతము రారండి
దుర్జన కోటిని దర్పమడంచగ
సజ్జన కోటిని సంరక్షింపగ ||దుర్జన||
ధారుణి శాంతిని స్థాపన చేయగ... ||ధారుణి||
నరుడై పుట్టిన పురుషోత్తముని
కళ్యాణము చూతుము రారండి
దశరధ రాజు సుతుడై వెలసి
కౌశిక యాగము రక్షణ జేసి ||దశ||
జనకుని సభలో హరువిలు విరచి... జన
జానకి మనసు గెలిచిన రాముని
కళ్యాణము చూతుము రారండి ||శ్రీ సీతా||
సిరి కళ్యాణపు బొట్టును పెట్టి
మణి బాసికమును నుదుటను కట్టి ||నుదుటను||
పారాణిని పాదాలకు పెట్టి
పెళ్ళికూతురై వెలసిన సీతా
కళ్యాణము చూతము రారండి ||శ్రీ సీతా||
సంపంగి నూనెను కురులను దువ్వి ||కురులకు||
సొంపుగ కస్తూరి నామము దీర్చి ||నామము||
చెంప జవాది చుక్కను బెట్టి....
పెండ్లి కొడుకై వెలసిన రాముని
కళ్యాణము చూతము రారండి ||శ్రీ సీతా||
జానకి దోసిట కెంపుల ప్రోగై ||కెంపుల||
రాముని దోసిట నీలపు రాశై ||నీలపు||
ఆణి ముత్యములు తలంబ్రాలుగా..... ||ఆణి||
శిరముల మెరిసిన సీతారాముల
కళ్యాణము చూతము రారండి. ||శ్రీ సీతా||

సుశీల బృందంతో కలిసి పాడిన ఈ పాటని తెలుగు వారి సంప్రదాయ జీవనంపై అఖండ విజయాన్ని సాధించిన పాటగా చెప్పుకోవచ్చు. తెలుగు వారింట ఈ పాటలేని పెళ్ళి పందిరి లేదు. ఎంత కష్టమైనా సరే ఈ పాటను తెప్పించి ఉపయోగించాల్సిందే లేకుంటే అది అశుభమేమోనన్న సెంటిమెంట్ కూడా కొన్ని కొన్ని గ్రామాలలో ఉంది. 'పదికొంపలు లేని పల్లెనైనను రామభజన మందిరమొండు వరలు గాత' అన్నట్టు ఈ పాట లేని రాముని కోవెల కూడా ఆంధ్రదేశంలో లేదనే చెప్పాలి. పూర్తిగా మధ్యమావతి రాగంపై సాగిన ఈ పాటలో 'ఆణిముత్యములు తలంబ్రాలుగా శిరముల మెరిసిన సీతారాముల కళ్యాణము చూతము రారండి' తరువాత వాద్య సంగీతంగా వచ్చే 'ఆనందమానందమాయెనే' ఒక్కటే ఆనందభైరవి రాగంలో ఉంటుంది. సీతారాముల పాత్రలను ధరించిన గీతాంజలి, హరనాథ్ పైన ప్రధానంగాను, చిత్రంలో గల మిగిలిన పాత్రధారులందరి పైన అవసరమైన మేరకు ఈ పాటను చిత్రీకరించారు.

ఈ 'సీతారామ కళ్యాణం' చిత్రానికి సంబంధించి నిష్ఠతో కూడిన కళావిష్కరణను ఆద్యంతం గమనించవచ్చు. ఇక తెరపై కనిపించని సంఘటన ఒకటుంది. చిత్రంలోని యజ్ఞానికి సంబంధించిన ఒక సన్నివేశంలో నిజమైన ఆవు నెయ్యినే తెప్పించి వాడారు ఎన్.టి.ఆర్. ఆ నేతి వాసనతో సెట్ అంతా ఘుమ ఘుమలాడిపోయింది. అందరి ముఖంలోనూ ఆశ్చర్యాన్ని గమనించి "ఇది హౌస్ కౌస్ ఘీ బ్రదర్"అని అన్నారట ఎన్.టి. ఆర్. 'మనింటి పాడి ఆవుల పాల నుంచి వచ్చిన నెయ్యి అని చెప్పటానికి ఎన్.టి.ఆర్ ఆనాడు వాడిన "హౌస్ కౌస్ ఘీ బ్రదర్" అనే ప్రయోగాన్ని ఇప్పటికీ సినీపరిశ్రమకు చెందిన కొందరు ప్రముఖులు - తమ ఇంటి విందు భోజనాలలో నెయ్యి వడ్డించేటప్పుడు తమాషాగా గుర్తు చేసుకుంటుంటారు.

సరసాల జవరాలను నేనేగదా
మురిపాలు వెలబోయు భామలలోన ..సరసా..
బంగారు రంగారు మైజిగిలోన
పొంగారు వయసూ పొంకములోన
సంగీత నాట్యాల నైపుణిలోన
నా సాటి నెరజాణ కనరాదుగా ..సరసా..
మగువల నొల్లని మునియైనా
నా నగుమోమును గన చేజాచడా
యాగము యోగము దానములన్నీ
నా బిగికౌగిలి సుఖమునకేగా ..సరసా..

ఈ పాటను పి.లీల పాడగా రంభ పాత్రను అభినయించిన నాట్యతార కుచలకుమారి నర్తించింది. సన్నివేశ ప్రాధాన్యంగా ఎన్.టి. ఆర్ కూడా కనిపిస్తాడు. శాస్త్రబద్ధమైన కళ్యాణి రాగానికి ఈ పాట ఓ చక్కని ఉదాహరణ. ఈ పాటను ఇంటర్‌లూడ్స్‌తో సహా గుర్తుంచుకో గలిగిన వారికి కళ్యాణి రాగం మీద మంచి అవగాహన, పట్టు లభించే అవకాశం చాలావుంది. 'మైజిగి' (శరీరకాంతి) వంటి పద ప్రయోగాలను గమనించడం ఈ తరం వారికి చాలా అవసరం. ఒక విధంగా చెప్పాలంటే అలనాటి పౌరాణిక చిత్రాలలోని పాటల సాహిత్యాన్ని ప్రతిపదార్థ తాత్పర్య సహితంగా పూర్వాపరాలతో సహా ఒంటపట్టించుకునేట్టు మనం చెయ్యకపోవటం వల్లనే ఇవాళ్టి యువతకు తెలుగు భాష గురించి ఇంత మొత్తుకోవాల్సిన ఆగత్యం ఏర్పడుతుందేమోననిపిస్తుంది.



# ఆ పాత పాట మధురం

రాజా



## వెలుగునీడలు

'దొంగరాముడు', 'తోడికోడళ్ళు', మాగల్యబలం' చిత్రాల ద్వారా ప్రతిష్ఠాత్మక సంస్థగా పేరును ఇనుమడింప జేసుకున్న అన్నపూర్ణ పిక్చర్స్ తమ తదుపరి యత్నంగా తీసిన వెలుగునీడలు చిత్రం 1961లో విడుదలయింది. అక్కినేని, సావిత్రి, గిరిజ, జగ్గయ్య, రంగారావు, సూర్యకాంతం, రేలంగి ముఖ్యతారాగణం. ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు 'దొంగరాముడు' చిత్రం తర్వాత పెండ్యాల నాగేశ్వరరావు సంగీత దర్శకుడిగా బిజీగా ఉండడం చేత 'తోడికోడళ్ళు' 'మాంగల్య బలం' చిత్రాలకు స్వర రచన చేయలేకపోయారు. ఈ చిత్రానికి తిరిగి ఆయనకు సంగీత దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. నిజానికి పెండ్యాల నాగేశ్వరరావుకి, అన్నపూర్ణ అధినేత దుక్కిపాటి మధుసూదనరావు గారికి ఉన్న అనుబంధం సినిమాలతో ప్రారంభం కాలేదు. పెండ్యాల నాగేశ్వరరావుగారి తండ్రి దుక్కిపాటి వారి సతీమణి సుశీలా దేవి గారికి సంగీతం చెప్పేవారు. అలా ప్రారంభం అయింది వారి పరిచయం. అసలు పెండ్యాల వారే అక్కినేని నాగేశ్వరరావు, దుక్కిపాటి మధుసూధనరావు గారికి పరిచయం అవటానికి కారణం కూడా. పెండ్యాల సంగీత దర్శకత్వంలో వచ్చిన 'వెలుగునీడలు' చిత్రంలోని పాటలన్నీ ప్రజాదరణ పొందాయి. కొన్ని శాశ్వత కీర్తిని కూడా సంపాదించుకున్నాయి.

శివ గోవింద గోవింద హరి గోవింద గోవింద ||2||

1. సంతానమే లేక స్వర్గమేలేదని
   చిట్టిపాపను తెచ్చి పెంచుకుంటారు ||సంతా||
   సంతు కలిగిందంటే చిట్టిపాపాయీ గతి
   శ్రీమతే రామానుజాయనమః
2. తమ బాగుకోసమై తంటాలు పడలేరు
   ఎదుటి కొంపకు ఎసరు పెడతారయా
   పొరుగు పచ్చను ఓర్వలేని వారిగతి
   శ్రీమతే రామానుజాయనమః ||శివ||
3. ఒరుల కోసం త్యాగమొనరించు వారొకరు
   పరుల మోసం చేసి బ్రతుకు వారింకొకరు
   ఉపకారికే కీడు తలపెట్టువారి గతి
   శ్రీమన్మదరమారమణ గోవిందో హరి గోవింద గోవింద ||శివ||
4. కలిమి లేనన్నాళ్ళు కలిసి మెలిసుంటారు
   కలిమి చేరిననాడు కాట్లాడుకుంటారు
   కలిమి పెంచే కాయకష్ట జీవుల గతి
   శ్రీమతే రామానుజాయనమః
5. ఆనాడు శ్రీ యోగి వీర్రబహ్మంగారు
   కాలజ్ఞానము బోధ చేసేరయా ||ఆనాడు||
   ఈనాడు కొసవెర్రి వెంగళప్ప మాట
   అక్షరాలా జరిగి తీరేనయా ||శివ||

ఈ పాటను కొసరాజు రాఘవయ్య చౌదరి రాయగా మాధవపెద్ది సత్యం, సరోజిని ఆలపించారు. రేలంగి, బేబి శశికళ, టి.జి.కమలాదేవి అభినయించారు. హరికాంభోజి రాగాన్ని ఆధారంగా చేసుకుని స్వరపరిచిన ఈ పాట అందరి ఆదరాభిమానాలనూ చూరగొన్నదంటే కారణం - కథలో, కథతో ఇమిడిపోయే సాహిత్యం, విన్నవెంటనే నోటికి పట్టుకునే ట్యూన్, వ్యంగ్య ధోరణి లోకరీతిని సున్నితంగా తెలియజేసిన విధానాలే! నిర్మాత దుక్కిపాటి మధుసూధనరావు గారికి బాగా పరిచయం ఉన్న ఒక కుటుంబంలో సంతానం లేకపోతే ఒకరిని తెచ్చిపెంచుకుంటూ తమ కంటూ పిల్లలు పుట్టాక వారిని నిర్లక్ష్యం చేయటం జరిగింది. ఆ అనుభవాన్ని 'వెలుగు నీడలు' కథకు మూలంగా వాడుకోవడమే కాకుండా ఈ పాట మొదటి చరణానికి కూడా ఉపయోగించుకున్నారు. గుడివాడ దగ్గర్లో ఆరుగొలను అనే గ్రామం ఉండేది. ఆ చుట్టు ప్రక్కల ప్రాంతంలోనే ఓ కాంగ్రెస్ నాయకుడు ఉండేవారు. ఆయనకు 'శ్రీమతే రామనుజాయనమః' అని మాటిమాటికి అనే అలవాటు ఉండేది. ఆ మాటనే ఈ పాటలో పెడితే బావుంటుందని కొసరాజుకి సూచించారు దుక్కిపాటి. అలా వాడేసరికి పాట చాలా బాగా వచ్చిందనిపించి మొత్తం సినిమాలో రేలంగికి ఆ మాటను ఊతపదంగా చేశారు. ఇదిలా ఉండగా తన పాత్రకి పంచకట్టు, పిలక, బుర్రమీసాలు ఇవన్నీ ఉండడం చేత గ్లామర్ లేదని రేలంగికి అనిపించింది. దుక్కిపాటి వారితో ఎదురుగా అనే ధైర్యం లేక తమిళ నటుడు తంగవేలుతో చెప్పించారాయన. 'వెలుగు నీడలు' తమిళ వెర్షన్ 'తూయ ఉళ్ళం' షూటింగ్ కూడా ఏకకాలంలో జరిగేది. అందులో రేలంగి పాత్రను తంగవేలు చేశారు. ఇద్దరి వాదన విన్న దుక్కిపాటి వారు 'మీ పాత్రను జనం ఖచ్చితంగా బాగా రిసీవ్ చేసుకుంటారు. ఈ పాట కూడా హిట్ అవుతుంది' అని పందెం కాశారు. అలాగే జరిగింది కూడా!

---

మిత్రుడుఆ: కర్నూలు ఎక్కడ? కాకినాడెక్కడ?
ఏలూరు సాలూరు ఆలూరు ఎక్కడ?
వరంగల్లు ఎక్కడ?
మిత్రుడు2: స్టాప్! రైల్వేగైడ్ చూడరా గురూ!
మిత్రుడు1:శిష్యా! శాంతి! శాంతి!
వాడవాడలనుండి వాలాము ఇక్కడ
లక్కా బంగారంలా అతుక్కుపోయామురా మైడియర్
ఆహాఁ.. కరెక్ట్
బలే బలే మంచి రోజులులే
మళ్ళీ మళ్ళీ ఇక రావులే ||బలే బలే||
స్టూడెంట్ లైఫే సౌఖ్యములే
చీకు చింతకు దూరములే ||బలే బలే||
చంద్రం: పంపు నీళ్ళు బందైతే స్నానానికి నోచుకోము
మిత్రుడు: "గుఁయ్యి"మని దోమలు దాడిచేస్తే శివరాత్రి జాగారణ చేస్తాము
చంద్రం: ఉప్పూకారం లేని హోటల్ సాపాటుతో చప్పబడిపోయాము రా బ్రదర్
మిత్రుడు: హా..ఎన్ని కష్టాలురా నా తండ్రీ!
చంద్రం: భయపడకురా పుత్రా కష్టాలను దిగమింగేస్తాం
కలకలనవ్వుతూ గడిపేస్తాం ||కష్టా|| ||బలే బలే||
చంద్రం: ఇంటికి పోతే పెళ్ళీ పెళ్ళ'ని వెంటబడతారు పెద్దలు
మిత్రులు: పెళ్ళిచేసుకుంటే 'మేము మేము'ని పుట్టుకొస్తారు పిన్నలు
చంద్రం: ఈ జంఝాటంతో విద్యనాశాయ
సర్వం నాశాయ నమో నమో రా బ్రదర్
మిత్రుడు: హా! హతవిధీ!
చంద్రం: సహనం! సహనం! ఉపాయం ఉంది నాయనా!
పెళ్ళికి బకాయి పెట్టేస్తాం బాధ్యతలన్నీ నెట్టేస్తాం ||పెళ్ళికి|| ||బలే బలే||
చంద్రం: బాధ్యతలనెన్నడూ మరచిపోరాదు 'ప్రగతి మార్గము నెపుడూ వదిలిపోరాదు
క్రమశిక్ష పాటించి కదిలిపోవాలిరా బ్రదర్
మిత్రులు: హియర్! హియర్!
చంద్ర: ఆదర్శంగా నడవాలి
అందరూ 'భేష్'ని పొగడాలి ||ఆదర్శం|| ||బలే బలే||

ఈ పాటను కొసరాజు రాయగా ఘంటసాల, మాధవపెద్ది సత్యం, బృందం పాడగా అక్కినేని, పద్మనాభం, పేకేటి మరికొందరు జూనియర్ ఆర్టిస్టులు నటించారు. ఈ ఆర్టిస్టులలో కొంత ప్రముఖంగా చెప్పుకోవలసింది కొమ్మినేని శేషగిరిరావు గురించి. ఈ పాటలో ఆయన ఎక్కువగా పేకేటి పక్కనే కనబడుతూ ఉంటారు. ఈయన సంగీత దర్శకుడు చక్రవర్తికి సోదరుడు. నటుడిగా కొంచెం స్థిరపడ్డాక గా మారి "దేవతలారా దీవించండి" అనే చిత్రానికి దర్శకత్వం వహించారు సన్నివేశపరంగా సావిత్రి కూడా కొన్ని ఇంటర్ కట్స్‌లో కనిపిస్తుంది. ఇది కేవలం సరదాకోసం స్టూడెంట్లు పాడుకునే పాట. అంచేత వారి సమస్యల్ని ప్రతిబింబించేలా సాహిత్యం రూపుదిద్దుకుంది. కొన్ని కొన్ని సమస్యలని పాటలో ప్రతిఫలింపచేయటంలో కవి, నిర్మాత, సంగీత దర్శకుడు వీరి యొక్క వ్యక్తిగత సంస్కారం ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఇక్కడ మనం గమనించవలసింది అదే! ఇదే పాటని ఇప్పుడు రాయించవలసివస్తే ఎన్ని కుసంస్కార భావాలు అక్షర గౌరవాన్ని పొందుతాయో వేరేగా వర్ణించనవసరం లేదు. ట్యూన్ పరంగా ఈ పాట ఎక్కువగా ఫోక్ మ్యూజిక్‌పై ఆధారపడిందని చెప్పుకోవాలి. జానపదసంగీతానికి ఎక్కువగా ఉపయోగించే 'హరి కాంభోజి' రాగాన్ని కేవలం ఆధారంగా మాత్రమే తీసుకుని జనరంజకత్వం కోసం ఎక్కువగా ఆలోచిస్తే - రెండో చరణం చివర్న బాధ్యతలన్నీ నెట్టేస్తాం - అంటూనే వెంటనే వచ్చే మూడో చరణంలో - బాధ్యతలనెన్నడు మరచిపోరాదు - అంటూ ఉపదేశం చెయ్యడం అంత సబబుగా అనిపించదు.

---

పాడవోయి భారతీయుడా
ఆడిపాడవోయి విజయగీతికా ||పాడవోయి||
నేడే స్వాతంత్ర్యదినం వీరుల త్యాగఫలం
నేడే స్వాతంత్ర్యదినం వీరుల త్యాగఫలం
నేడే నవోదయం నీదే ఆనందం ఓఓఓ ||పాడవోయి||
స్వాంతంత్ర్యం వచ్చెననీ సభలే చేసి
సంబరపడగానే సరిపోదోయి
సాధించిన దానికి సంతృప్తిని పొంది
అదే విజయమనుకుంటే పొరపాటోయి
ఆగకోయి భారతీయుడా
కదలి సాగవోయి ప్రగతి దారులా ||ఆగ|| ||పాడవోయి||
ఆకాశం అందుకునే ధరలొకవైపు
అదుపులేని నిరుద్యోగమింకొక వైపు
అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు...
అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు
అలుముకున్న నీ దేశం ఎటు దిగజారు
కాంచవోయి నేటి దుస్థితి
ఎదిరించబోయి ఈ పరిస్థితి
పదవి వ్యామోహాలు కులమత భేదాలు
భాషా ద్వేషాలు చెలరేగే నేడు
ప్రతి మనిషి మరియొకని దోచుకునే వాడే.
ప్రతి మనిషి మరియొకని దోచుకునే వాడే
తన సౌఖ్యం తన భాగ్యం చూసుకునే వాడే
స్వార్థమీ అనర్థ కారణం
అది చంపుకునుటె క్షేమదాయకం
స్వార్థమీ అనర్థకారణం
అది చంపుకొనుటె క్షేమదాయకం
స్వార్థమీ అనర్థ కారణం
సమసమాజ నిర్మాణమే నీ ధ్యేయం... నీ ధ్యేయం..
సకల జనుల సౌభాగ్యమే నీ లక్ష్యం... నీ లక్ష్యం
సమసమాజ నిర్మాణమే నీ ధ్యేయం...
సకల జనుల సౌభాగ్యమే నీ లక్ష్యం...
ఏక దీక్షతో గమ్యంచేరిననాడే
లోకానికి మన భారతదేశం
అందించునులే శుభసందేశం
లోకానికి మన భారతదేశం
అందించునులే శుభసందేశం
ఆ...హా..హా...హా.....

ఈ పాటను శ్రీశ్రీ రాయగా సుశీల, ఘంటసాల, బృందం ఆలపించారు. తెరపై రాజసులోచన, అక్కినేని ప్రధాన పాత్రధారులుగా అభినయించారు. ప్రేక్షకులుగా రేలంగి, సావిత్రి తదితరులు కనిపిస్తారు. తరువాత కాలంలో నృత్యదర్శకుడిగా, దర్శకుడిగా పేరు తెచ్చుకున్న కె.యస్.రెడ్డి ఈ పాటలో ఓ గ్రూప్ డాన్సర్‌గా కనిపిస్తారు. అప్పట్లో శ్రీశ్రీ రోజుకి రెండు, మూడు పాటలు రాసేవారు. ఈ పాటను రాయడానికి పదిహేను రోజులు పట్టిందాయనకి, ఆయనకు అఖండ కీర్తిప్రతిష్టలను సంపాదించి పెట్టిన పాటలలో ఇదొకటి. అందుకే తన సినీ గీతాల సంకలనానికి 'పాడవోయి భారతీయుడా' అనే పేరును పెట్టుకున్నారాయన. అంతేకాదు పాట చివరలో తాళగతిని మారిస్తే బావుంటుందన్న ఆలోచనకూడా ఆయనదే అందుకే అంతవరకూ త్రిశంలో సాగిన తాళగతిని 'సమసమాజ నిర్మాణమె నీ ధ్యేయం' దగ్గర నుంచి చతురస్రంలోకి మార్చడం జరిగింది. 'పదవీవ్యామోలు', చరణానికి శివరంజని రాగాన్ని, మిగిలిన చరణాలకి మోహనరాగాన్ని, పల్లవికి శంకరాభరణంలోని కార్డ్సని మాత్రమే వాడుకుని సాహిత్యరీత్యా శాశ్వతత్వాన్ని, సంతరించుకున్న ఈ గీతానికి వెన్నుదన్నుగా నిలిచారు పెండ్యాల. ఇక సాహిత్య రీత్యా ఈ పాట గొప్పదనాన్ని విశ్లేషించాల్సి వస్తే ప్రతివాక్యాన్ని పదే పదే పేర్కొనాలి. "మా సాహిత్యాన్ని బాగా చదివి సినిమాల్లోకి వెళ్ళిపోయావనే బాధ ఉండేది. కానీ ఈ పాట విన్నాక ఆ బాధపోయింది" అని దుక్కిపాటి వారితో ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకులు చండ్ర రాజేశ్వరరావు అన్నారట. అప్పటి ఆర్థిక మంత్రిగా ఉన్న కాసు బ్రహ్మానంద రెడ్డి, అర్జంటుగా రమ్మనమని ఓ రోజు కబురుపెట్టి తీరా వెళ్ళాక - 'నేను సినిమాలు ఎక్కువగా చూస్తానని మీకు తెలుసుకదా... నిన్ననే తాడేపల్లి గూడెంలోని రేలంగి స్వంత థియేటర్‌లో మీ 'వెలుగునీడలు' సినిమాని చూశాను. ఏం పాటండీ అది..!? మరో యాభైయేళ్ళయినా సరే సజీవంగా ఉంటుంది' అంటూ తెగపొగిడారీపాట గురించి. నిజానికి అప్పుడూ ఎప్పుడూ పాడుకున్నా సరే - ఇవాళే స్పందించి రాసారా అన్నంత నిత్యనూతనంగా ఉంటుందీ గీతం. ప్రభుత్వ నిబంధనల రీత్యా ఇబ్బందిగా ఉంటుందేమోనని ఆలిండియా రేడియో వాళ్ళు కొన్నాళ్ళు పాటు మొహమాట పడ్డా ఆ తరువాత పాటలోని బలం ఆ మొహమాటాన్ని తప్పించేసింది. ప్రతీ ఆగస్ట్ 15 న ఆంధ్రదేశంలో ఇన్నేళ్ళయినా ఈ నాటికీ ఈ పాట వినిపించని ఊరు ఉండదనే చెప్పాలి. నిజానికి పాట యొక్క ప్రయోజనం అంతటి సార్థకత్వాన్ని సంపాదించుకోవడమే కదా.....



# ఆ పాత పాట మధురం



## రాజా

## వెలుగునీడలు - 2

ఉన్న పాటలన్నీ మంచి పాటలేనని అనిపించుకున్న అన్నపూర్ణావారి వెలుగునీడలు.

....

ఓ రంగయో పూల రంగయో
ఓర చూపు చాలించి
సాగిపోవయో
పొద్దువాలి పోతున్నదోయి
ఇంత ముద్దు నడక
నీకెందుకోయి - ||పొద్దు|| ||ఓ రంగయో||
పగలనక రేయనక
పడుతున్న శ్రమనంతా
పరుల కొరకు ధారపోయు
మూగజీవులు

ఆటలలో పాటలలో
ఆయాసం మరిచిపోయి
ఆనందం పొందగలుగు
ధన్యజీవులు ||ఓ రంగయో ||
కడుపారగ కూడులేని
తలదాచగ గూడులేని
ఈ దీనుల జీవితాలు
మారు టెన్నడో ||కడుపారగ||
కలవారలు లేనివారి
కష్టాలను తీర్చుదారి
కనిపెట్టి మేలు చేయగలిగనప్పుడే ||ఓ రంగయో||

ఈ పాటను శ్రీ శ్రీ రాయగా సుశీల, ఘంటసాల బృందం ఆలపించారు. సావిత్రి, అక్కినేనితో పాటు కొందరు జూనియర్ ఆర్టిస్టులు అభినయించారు. సన్నివేశపరంగా చూసుకుంటే హీరో, హీరోయిన్లు అలా చల్లగాలి కోసం బైటికెళ్ళి పాడుకుని ఒకరినొకరు మరింతగా అర్ధం చేసుకోవాలి. ఇప్పటి పరిస్థితుల్లో ఇటువంటి సన్నివేశాలకి ఎటువంటి పాటలు వస్తాయో తలచుకుంటే - విలువలకు విలువనిచ్చే మనసేదైనా సరే కుమిలిపోతుందే తప్ప మరేం చేయలేదు. కానీ 'అన్నపూర్ణ' వారికి ఇటువంటి ఊహలు రావు. హీరో ఎలాగూ అభ్యుదయ భావాలున్న వ్యక్తి కనుక హీరోయిన్ అతడి భావాలను అభిమానిస్తూ ఉంటుంది కనుక బోట్‌పై విహరిస్తున్నప్పుడు కూలిపనులు ముగించుకుని ఇళ్ళకు వెళుతున్న శ్రమజీవులను చూస్తూ పాడుకుంటే బావుంటుందనీ - కథలో తరువాత వచ్చే భాగంలో అక్కినేని మాట మీద ఒకటైన జగ్గయ్య, సావిత్రి తమ జీవితాలను పేదవారికి అంకితం చేయాలనుకోవడానికి, ఆ తరువాత వైధవ్యం

పొందిన సావిత్రి పాత్ర వారి సేవలలో తన జీవితాలను గడపాలనుకునే నిర్ణయం తీసుకోడానికి ఈ సన్నివేశం ఆలంబనగా ఉంటుందనీ - ప్లాన్ చేసుకున్నారు. శ్రమశక్తిని గౌరవిస్తూ అభ్యుదయభావాలకు తావిచ్చే పాట అనగానే శ్రీశ్రీ కలం ఎంతగా పులకించిపోతూ ఎన్నేళ్ళయినా వన్నె తగ్గని అమృతధారలను అక్షర రూపంలో ఎలా వర్షిస్తుందో ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ఈ పాటను తమిళ వెర్షన్ 'తూయ ఉళ్ళమ్'లో రాసిన ఉడూమలై నారాయణ కవి పల్లవి కోసం చాలా రకాలుగా ప్రయత్నించి ప్రయత్నించి చివరకి అసంతృప్తిగానే 'ఓ వేలప్పా - తంగవేలప్పా' అంటూ సరిపెట్టుకోవలసి వచ్చింది. హరి కాంభోజి రాగానికి కైశిక నిషాదాన్ని అన్యస్వరంగా చేసుకుంటూ స్వరపరిచిన ఈ పాటలో ఇంటర్ల్యూడ్స్‌లో ఫ్లూట్ - ఆ వెనుక వినిపించే రిథమ్, ఆ తరువాత వయొలిన్ల నడకను బాగా ఒంట పట్టించుకోగలిగితే తర్వాతి రోజుల్లో పెండ్యాల స్వరపరిచిన ఎన్నో పాటలలో ఆ పోకడను గమనించవచ్చు. ఈ గీతానికి మాతృక ఓ మరాఠీ చిత్రగీతమని శ్రీ వి.ఏ.కె.రంగారావు తన 'ఆలాపన' శీర్షికలో పేర్కొన్నారు.

---

కలకానిది విలువైనది
బ్రతుకు కన్నీటి ధారలలోనే ||కల||
బలిచేయకు
గాలివీచి పూవుల తీగ
నేలవాలిపోగా
జాలి వీడి అటులే దాని వదిలివైతువా... ఓ...ఓ...ఓ
చేరదీసి నీరు పోసి
చిగురించనీయవా ||కల||
అలుముకున్న చీకటిలోనే
అలమటించనేలా ||అలమ||
కలతలకే లొంగిపోయి కలువరించనేలా...ఓ...ఓ...ఓ.
సాహసమను జ్యోతిని
చేకొని సాగిపో ||కల||
అగాధమౌ జలనిధిలోన
ఆణిముత్యమున్నటులే
శోకాల మరుగున దాగి
సుఖమున్నదిలే
ఏది తనంత తానై నీ దరికి రాదు
శోధించి సాగించాలి
అదియే ధీరగుణం ||కల||

కేవలం 'అన్నపూర్ణ' సంస్థకు మాత్రమే - అని పరిమితం చేయకుండా - తెలుగు సినీగీతాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోదగ్గ పాటగా, ఈ పాటతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ తమ జీవితాంతం గర్వంగా చెప్పుకునే పాటగా 'కలకానిది విలువైనది' పాటను పేర్కొనాలి. పదసంపదకు, భావ పరిణతకు అద్దం పట్టే ఈ పాటలోని విషయాన్ని ఇవాళ మనం వ్యక్తిత్వ వికాసానికి, మనో

విజ్ఞానానికి తోడ్పడే ఎన్నో వ్యాసాల్లో మరో రూపంలో చదువుతున్నామని గ్రహించాలి. 'లైఫ్ ఈజ్ నాట్ ఏ డ్రీమ్' అని వివేకానందుడు చెప్పిన మాట ఈ పాటకు ప్రేరణ అని అనే వాళ్ళున్నారు. 'అగాధమౌ జలనిధిలోన' అన్న విషయాన్ని ఖలీల్ జిబ్రాన్ ఏనాడో తన సూక్తులలో చెప్పాడని అనేవాళ్ళున్నారు. శ్రీ శ్రీ మాత్రం ఈ చిత్రం తమిళ వెర్షన్‌లో ఇదే సన్నివేశానికి ఉడుమలై నారయణ కవి రాసిన చరణాలలోంచి ఈ చరణాన్ని తను తీసుకున్నానని తన సినీ గీతాల సంకలనంలో రాసుకున్నారు. ఇక సంగీత పరంగా చూసుకుంటే - ఈ పాట పీలూ రాగచ్ఛాయలలో ఉందని చెప్పాలి. 1960 లో 'సారంగా' అనే హిందీ చిత్రం వచ్చింది. నేటి ప్రముఖ సంగీత దర్శకుడు అనుమల్లిక్ తండ్రి సర్దార్ మల్లిక్ ఆ చిత్రానికి సంగీత దర్శకుడు. ఆ చిత్రంలో ఆయన స్వరపరచిన 'సారంగా తేరి యాద్ మె' వంటి హిట్ సాంగ్ తో పాటు 'పియాకైసె మిలూంతుఝ్‌సే మెరెపాంవ్ పడే జంజీర్' అనే మరో మంచి పాటకూడా ఉంది. రఫీ, లతా పాడిన ఆ పాట పీలూ రాగంలోనూ, మధ్యమ (మ) నిషాద (ని) స్వరాలను కలుపుకున్న శివరంజని రాగంలోనూ ఉంటుంది. ఈ రెండు రాగాల మిశ్రమంతో కూడిన పాడిన ఆ పాట ఎక్కడైనా దొరికితే విని చూడండి. స్వరపరిచిన పద్ధతి, పాడించిన పద్ధతి, అంతా ఈ 'కల కానిది విలువైనది' ఈ పాటకు రేఖామాత్రంగానైనా ప్రేరణ అయి ఉంటుందా అనే అనుమానం రావడానికి ఆస్కారం ఉంది. ఈ పాటను తెరపై అక్కినేని నాగేశ్వరరావు ప్రధాన పాత్రధారిగా అభినయించగా సావిత్రి, రేలంగి, యస్వీ రంగారావు, సూర్యకాంతం సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. అంతేకాదు ఈ పాటను కథానాయకుడు రేడియో స్టేషన్ లోని రికార్డింగ్ రూములో పాడాలి కనుక ఆర్కెస్ట్రాకు సూచనలిచ్చే సంగీత దర్శకుడిగా ఈ చిత్ర సంగీతదర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు కనిపించడం మరో విశేషం. ఈ పాట మూడవ చరణంలో గల 'శోకాలా మరుగున దాగి' అనే లైను రిపీట్ అవుతున్నప్పుడే ఘంటసాల తన గొంతులో పలికించిన అందమైన జీరను ఈ నాటికీ ఎందరో గాయకులు యధాతథంగా అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారంటే - ఘంటసాల ఈ పాటను హృదయానికి హత్తుకునేలా పాడారని చెప్పడానికి ఇంతకన్నా మంచి ఉదాహరణ దొరకదు.



# ఆ పాత పాట మధురం

## రాజా



## వెలుగునీడలు - 3

.

ఆ: హాయి హాయిగ జాబిల్లి -
తొలిరేయి వెండి దారాలల్లి
మందు జల్లి నవ్వసాగే ఎందుకో -
మత్తుమందు జల్లి నవ్వసాగే ఎందుకో అ: ||హాయి||
ఆ: తళ తళ మెరిసిన తారక -
తెలి వెలుగుల వెన్నెల దారుల ||తళ||
అ: కోరి పిలిచెనో తన దరి చేరగా -
మది కలచెనో తీయని కోరిక
మిల మిల వెలిగే నీటిలో
చెలి కలువల రాణీ చూపులో ||మిల||
ఆ: సుమదళములు పూచిన తోటలో
తొలి వలపుల తేనెలు రాలెనో ||హాయి||
విరిసిన హృదయమె వీణగా
అ: తొలి పరువము లొలికెడు సోయగం
కని పరవశమందెనో మానసం ||హాయి||

ఈ పాటను శ్రీ శ్రీ రాయగా, సుశీల, ఘంటసాల గానం చేశారు. గిరిజ, అక్కినేని, అభినయించారు. `ఒ`కారాలను విరివిగా ప్రయోగించడంలో శ్రీ శ్రీ కి ఓ ప్రత్యేకత ఉంది. `ఓహో మేఘ సఖా ఒకచో ఆగేవా` అంటూ ఓ డబ్బింగ్ పాటకు రాశారాయన. ఈ పాటలో కూడా - `కోరి పిలిచెనో, మది కలచెనో, తేనెలు రాలెనో, పరవశమందెనో` - వంటి ప్రయోగాలు ఆ ప్రత్యేకతను మరోసారి గుర్తుచేస్తాయి. అలాగే చంద్రుని కిరణాలను వెండి దారాలతో ఉపమించడం ఓ మంచి ప్రయోగం. ఈ పాట రెండో చరణం కూడా ట్యూన్ పరంగా చాలా బావుంటుంది. పాడుకుంటుంటే ఎంతో తృప్తిగా ఉంటుంది. అయితే ఈ చరణం ఆ రోజుల్లో విడుదలైన రికార్డులలో లేకపోవటం వల్ల ఎంతో మంది సంగీతాభిమానుల మదిలో చోటు చేసుకోలేకపోయింది. కళ్యాణి రాగంలో స్వరపరుస్తూ అవసరమైన చోట యమన్ రాగాన్ని కలుపుకుంటూ సాగిన ఈ పాట - పల్లవికి - 1959లో విడుదలైన `సయా సంసార్` హిందీ చిత్రంలో సంగీత దర్శకుడు చిత్రగుప్త స్వరపరచగా లతా పాడిన `చందా లోరియా సునాయె - హవా ఝూల్ నఝులాయే` పాట ఆధారం.

అ: సరిగంచు చీరెగట్టి బొమ్మంచు రైక తొడిగి
జలసాగ నాతో రాయే వయ్యారి ముద్దులగుమ్మ
సినిమాకు పోదంలేవే గయ్యాళి రంగుల బొమ్మ
ఆ: నిలపర చిన్నోడో నీ సోకు నీ రీకు
ఏడ నేర్చినావురో ఈ నీటు ఈ గోటు
మింగ మెతుకు లేదాయె మీసాలకు సెంటాయె ||మింగ||
ఏటేటా బిడ్డాయె - ఓపిక ఉడిగిపోయే
ఇంట్లో ఈగలమోత - బయట పల్లకి మోత ||నిలపర||
అ: సంపాదన జేసుకోను సత్తవున్నాదీ
సక్కనైన సుక్కనాకు పక్కనున్నాదీ ||సంపా||
సామి సల్లగా జూసి సంతు ఉన్నదీ
ఇంతకన్న సొర్గముంటె ఎక్కడున్నదీ
నిలపవె నా రాణీ - నీ కేల భయమింక
ఆపవె బఠాణీ - అల్లిబిల్లి కూతలింక
ఆ: కనంగానె ఏమాయె గాలికి వదిలావాయె
బిడ్డలంటె పట్టదాయె చదువు గొడవ ఎత్తవాయె
బండ చాకిరీతొ వాళ్ళ బతుకె తెల్లారిపోయె ||నిలపర||
అ: సంతానం పెరక్కుండ సూసుకుందామె
సంసారం సాగుమానం సేసుకుందామె
సిల్లరంత కూడబెట్టి దాచుకుందామె
పిల్లగోళ్ళ సదువులకు వాడుకుందామె
నిజమేనే రాణి నువ్వు చూపిన బాట
ఇంటాను లేవే ఇక మీద నీ మాట
ఇ: సంతోషమే - సంతోషమే
సింతలేని కాపురమే శ్రీరంగమే
ఆలుమగలు ఒక్కటైతే ఆనందమే ||సంతోషమే||

ఈ పాటను కొసరాజు రాయగా ఘంటసాల, సుశీల ఆలపించారు. ఇ.వి.సరోజ, బి.ధర్మరాజు అభినయించారు. యస్వీ.రంగారావు, జగ్గయ్య సావిత్రి, సంధ్య, ప్రేక్షకులలో సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. అంతర్లీనంగా గానీ, నేరుగా గాని ఎంతో కొంత సందేశం ఉండే ప్రయోజనాత్మక గీతం కనీసం ఒక్కటైనా తమ చిత్రాలలో ఉండాలని ఇంచుమించు ప్రతి నిర్మాణ సంస్థా ఆ రోజుల్లో భావించేది. అందులో అన్నపూర్ణా సంస్థ అయితే చెప్పనవసరమే లేదు. కచ్చితంగా ఉండి తీరేది. అంతేకాదు ఇటువంటి గీతాలలో అభినయించే వారికి, లేదా నర్తించే వారికి క్లోజప్‌లు, మిడ్ షాట్లు ఉండేవి. అంతేగాని లాంగ్ షాట్‌లలో డ్రస్సులతోను, లొకేషన్ అందాలతోనూ మ్యానేజ్ చెయ్యడం ఆ తరానికి తెలియదనే అనుకోవాలి. అందుకే ఇటువంటి గీతాలలో పాల్గొనే వారికి ప్రేక్షకుల నుండి గుర్తింపు లభించేది. ఈ పాటలో నృత్యం చేసిన ఇ.వి.సరోజకు అన్నపూర్ణా వారి తర్వాతి చిత్రం 'ఇద్దరు మిత్రులు' చిత్రంలో ఏకంగా నాగేశ్వరరావు పక్కనే హీరోయిన్‌గా చేసే అవకాశం వస్తే ప్రేక్షకులామెను ఎంతోకాలంగా పరిచయం ఉన్న నటిలా ఆదరించడానికి గల కారణాలలో ఇదొకటి. ఈ చిత్రం ఛానల్స్‌లో వచ్చినప్పుడు గాని, డివిడి దొరికినప్పుడు గాని జాగ్రత్తగా చూడండి - పాటలో ఎక్కడా వల్గర్ మూమెంట్స్ ఉండవు. పైగా కష్టపడి చేయవలసిన స్టెప్పు, మూమెంట్స్ ఉంటాయి. నృత్యగీతం అంటే అదీ! తిరిగి బైట ఎవరైనా ప్రదర్శిస్తే ప్రేక్షకుల నుండి గౌరవంతో కూడిన స్పందన లభించాలే తప్ప వేరొకటి కాదు. ఇక సాహిత్యపరంగా చూసుకుంటే - చక్కటి తెలుగు నుడికారంతో, జానపద శైలిలో, అందరికి తెలిసిన సూక్తులతో పాటకు కొసరాజు కల్పించిన గౌరవాన్ని తలుచుకుంటే ఆయనకు పాదాభివందనం చెయ్యాలనిపిస్తుంది. సరిగంచు, బొమ్మంచు, సోకురీకు, నీటుగోటు, మింగమెతుకు లేకపోయినా మీసాలకు సెంటు (ఇక్కడ సంపంగి నూనె అని అనకుండా ట్యూన్‌కి కుదిరేట్టు సెంటు అని వాడడం డీసెంటు ప్రయోగమే) సాగుమానం, పిల్లగోళ్ళు, చింతలేని కాపురం శ్రీరంగం - లాంటివి మచ్చుకి, మెచ్చుకి కొన్ని... ఈ పాట ఇవాళ వింటున్నా ఇంకా వినబుద్దేస్తుందంటే అందుకు మరో కారణం ఆ సాహిత్యాన్ని సజీవంగా ఉంచిన సంగీతం, సుస్పష్టంగా అందించిన గళాల మాధుర్యం.

సుగుణ: చల్లని వెన్నెల సోనలు - తెల్లని మల్లెల మాలలు
మా పాపాయి బోసినవ్వులే
మంచి ముత్యముల వానలు ||చల్లని||
వరలక్ష్మి: పిడికిలి మూసిన చేతులు - లేత గులాబీ రేకులు పిడికిలి
మూసిన చేతులు - లేత గులాబీ రేకులు పిడికిలి
చెంపకు చారెడు సోగకన్నులే
సంపదలీనెడు జ్యోతులు
మా పాపాయి బోసినవ్వులే మంచి ముత్యముల వానలు ||చల్లని||
సుగుణ: ఇంటను వెలసిన దైవము - కంటను మెరిసిన దీపం
మా హృదయాలకు హాయి నొసంగే
పాపాయే మా ప్రాణము ||ఇంటను||
చల్లని వెన్నెల సోనలు - తెల్లని మల్లెల మాలలు
మా పాపాయి నవ్వు పువ్వులె
మంచి ముత్యముల వానలు
నోచిన నోముల పంటగ - అందరి కళ్ళకు విందుగా
పేరు ప్రతిష్టలె నీ పెన్నిధిగా
నూరేళ్ళాయువు పొందుమా ||చల్లని||

ఈ పాటను శ్రీశ్రీ రాయగా సుశీల, జిక్కి ఆలపించారు. సావిత్రి, గిరిజ అభినయించారు. సన్నివేశ ప్రాధాన్యంగా సూర్యకాంతం, ముగ్గురు చిన్నపిల్లలు ఏడాదిలోపు, రెండు మూడేళ్ళలోపు, అయిదారేళ్ళ లోపు పిల్లలు కనిపిస్తారు. పుట్టి పెరుగుతున్న పిల్లవాణ్ణి పెంచుతున్న కన్న తల్లి హృదయం, ఆ పిల్లవాడిపై మమకారం పెంచుకున్న మరో మాతృహృదయం - స్పందిస్తే ఎటువంటి భావాలు కలుగుతాయో వాటినే అక్షర రూపంలో అందించారు శ్రీశ్రీ పరకాయ ప్రవేశ విద్య మంచి కవికి అంతర్లీనంగా ఉంటుందనటానికి ఈ పాట ఓ ఉదాహరణ. ఇక్కడ ఆ నాటి విలువల గురించి మరోసారి చెప్పుకోవాలి. పాట మొదట్లో మా పాపాయి బోసినవ్వులె మంచి ముత్యముల వానలు - అని ఉంటుంది. తర్వాత నుంచి - మా పాపాయి నవ్వు పువ్వులె మంచి ముత్యముల వానలు -గా ఆ లైను రూపాంతరం చెందుతుంది. అందుకు కారణం - పిల్లవాడు పెరిగి బోసి నవ్వుల స్థాయి నుండి పళ్ళొచ్చాక అందంగా నవ్వేటంతగా పెద్దవాడయ్యాడు - అని ఎస్టాబ్లిష్ చెయ్యాలనుకోవటమే! నిర్మాత, దర్శకుడు, పాటల రచయిత కలిసి కూర్చుని అనుకుంటేనే గాని ఇంత లోతైన అవగాహన కలగదు. ఆనాడు ఉన్నదీ, ఈనాడు కొరవడుతున్నదీ అదే!

ఈ పాటను వకుళాభరణం రాగం ఆధారంగా స్వరపరిచారు. 'ఇంటను వెలిసిన దీపము' చరణానికి చక్రవాక రాగాన్ని, 'నోచిన నోములు పండగా' చరణం వద్ద మాయా మాళవ రాగాన్ని స్పృశించినా వకుళాభరణ రాగాన్నే ప్రధానంగా చేసుకుని పాటను నడపడం జరిగింది. ఈ పాటకు బెంగాలీలో గీతారాయ్ పాడిన 'కాజల్ కాజల్ కుమ్ కుమ్' అనే ప్రైవేట్ గీతం ట్యూన్ ఆధారం అని శ్రీ వి.ఎ.కె రంగారావు తన 'ఆలాపన' శీర్షికలో పేర్కొన్నారు.

---

సుగుణ: చిట్టీ పొట్టీ చిన్నారి పుట్టినరోజు
చేరి మనం ఆడిపాడే పండుగ రోజు ||చిట్టీ||
సుగుణ: వేడుకగా ఈ పూట - ఆడుదమా దొంగాట ||2|| ||చిట్టీ పొట్టీ||
వరలక్ష్మి: కన్నులుండి చూడలేరు కొంతమంది జనం
దారితప్పి తిరగడమే తెలివిలేనితనం - కన్ను
సుగుణ: మెదడు పదును పెట్టాలి - అసలు దొంగను పట్టాలి ||2|| ||చిట్టీపొట్టీ||
సుగుణ: "అంబా" అనే అరుపు వినీ తల్లిని చేరులేగ
నేలమీది పిట్టను పోల్చు నింగి నెగురు డేగ ||అంబా||
వరలక్ష్మి: చీకటైనా చిటారు కొమ్మ చేరును కోతి
గురి తెలిసి మసలుకొనే నిదానమే నీతి ||వేడుకగా|| ||చిట్టీ పొట్టీ||

ఈ పాటను కూడా శ్రీశ్రీయే రాయగా సుశీల, స్వర్ణలత ఆలపించారు. సావిత్రి, గిరిజ పాటను అభినయించగా అక్కినేని నాగేశ్వరరావు, సూర్యకాంతం మరొక చిన్నబాబు సన్నివేశంలో పాల్గొని తమవంతు అభినయాన్ని అందించారు. చరణాలలో మోహన రాగాన్ని స్పృశించడం, 'వేడుకగా ఈ పూటా ఆడుదమా దొంగాటా' అనే వాక్యాన్ని రెండు స్థాయిలలో సుశీలతో పలికించటం పెండ్యాల రసదృష్టికి నిదర్శనం. ఎందుకంటే అలా రెండు స్థాయిలలో మాధుర్యం తగ్గకుండా, కొండొకచో పెరుగుతూ పాడడం కొన్ని స్త్రీ కంఠాలకు మాత్రమే నప్పుతుంది. ఉదాహరాణకు 'భలే అమ్మాయిలు' చిత్రంలోని 'మది ఉయ్యాలలూగె నవభావాలేవో రేగే 'పాటలో' 'ప్రేమలో కరిగిపోవుదమా.. భేదమే మరచిపోవుదమా' అనే లైన్లని పి.లీలతో యస్. రాజేశ్వరరావు పాడించిన విధానాన్ని గుర్తుకు తెచ్చుకోండి.

ఓ చిన్నపిల్లవాడికి పుట్టినరోజు సందర్భంగా కళ్ళకు గంతలు కట్టుకుని దొంగాట ఆడే సన్నివేశానికి సరిపడేట్టుగానే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే విషయాలను కూడా పరోక్షంగా అందించారు శ్రీశ్రీ చురుకుదనం, బుద్ధిబలం ఉంటేనే చాలు - చూడకనే తెలియు కదా నిజానిజాలు/ కన్నులుండి చూడలేరు కొంతమంది జనం - దారి తప్పి తిరగడమే తెలివిలేనితనం / గురి తెలిసి మసలుకునే నిదానమే నీతి .. లాంటి వాక్యాలు మన నిత్య జీవితంలో ఎన్నిసార్లు అనుభవంలోకి వచ్చుంటాయో కదా.. అలాగే భవిష్యత్తులో కూడా ఇక ఎవరికీ వీటి అవసరం రాదని చెప్పలేం కదా... శాశ్వతత్వం అంటే అదీ ... అటువంటి అక్షరజ్యోతుల్ని మనలో వెలిగించిన ఆనాటి కవులను ఇవాళ్టికీ మనం తల్చుకుని తల్చుకుని మురిసిపోతూ కన్నీళ్ళు పెట్టుకోవటానికి కారణం కూడా అదే!



# ఆ పాత పాట మధురం

## రాజా



## జగదేకవీరుని కథ

**నిర్మించేది సాంఘికమైనా, జానపదమైనా,** పౌరాణికమైనా అభిరుచి విషయంలో తమకంటూ కొన్ని విలువల్ని 'తమ బ్రాండ్'గా ముద్ర వేసుకుని యాంబ్లెమ్ మ్యూజిక్‌తో సహా తమ చిత్రాల్లోని సంగీతాన్ని గుర్తుంచుకునేలా చిత్రాల్ని నిర్మించిన విజయా సంస్థ నుంచి 1961లో వచ్చిన మరో మంచి చిత్రం జగదేకవీరుని కథ. ఈ చిత్రానికి దర్శకుడు కె.వి.రెడ్డి. మాటలూ, పాటలూ, పద్యాలు మొత్తం రచనా బాధ్యత అంతా పింగళి నాగేంద్రరావుది. ఎన్.టి.ఆర్, బి.సరోజాదేవి, ఎల్.విజయలక్ష్మి, రేలంగి, గిరిజ, రాజనాల, సి.యస్.ఆర్, ముక్కామల, లంక సత్యం ముఖ్య తారాగణం. అంతవరకూ ఘంటసాల, యస్. రాజేశ్వరరావు మాత్రమే సంగీతాన్ని ఇచ్చిన సంస్థలో పెండ్యాల నాగేశ్వరరావు ఈ చితంతో ప్రవేశించారు. ఆయన కూడా ఆ బాధ్యతను ఎంత పవిత్రంగా నిర్వర్తించారో చెప్పాలంటే - నిద్రలో లేపి అడిగినా సరే చటుక్కుని చెప్పే విధంగా ఈనాటికీ ప్రజల నోట నర్తిస్తున్న పది పాటలు సాక్ష్యంగా నిలబడయి.

ై.

జలకాలాటలలో
కలకల పాటలలో ఏమి హాయిలే హలా
ఆహా ఏమి హాయిలే హలా ||జలకా||
ఉన్నది పగలైనా అహ వెన్నెల కురిసెనే ||ఉన్నది||
అహ వన్నె చిన్నెల కన్నె మనసులో
సన్న వలపు విరిసే

అహ వన్నె చిన్నెల కన్నె మనసులో
సన్న వలపు విరిసే ||జలకా||
తీయని రాగమేదో మది హాయిగ పాడెనే ||తీయని ||
తరుణ కాలమేలే అది వరుని కొరకు పిలుపే
అది వరుని కొరకు పిలుపే ||జలకా||

ఈ పాటను పి.లీల, పి.సుశీల, బృందం పాడగా బి.సరోజాదేవి, యల్. విజయలక్ష్మి, జయంతి (అప్పుడు కమలకుమారి), బాలపై చిత్రీకరించారు. సన్నివేశ ప్రాధాన్యంగా మధ్య మధ్య ఎన్.టి.ఆర్.కూడా కనిపిస్తారు. పల్లవికి కీరవాణిరాగాన్ని, చరణాలకు నటభైరవి రాగాన్ని, పల్లవికి దారితీసే చరణాలలోని ఆఖరు వాక్యాలకు తిరిగి కీరవాణి రాగాన్ని ఉపయోగించారు. ఆనాటి నుంచి ఈనాటి వరకూ సినిమాల్లో స్నానం చేస్తూ పాడుకునే పాటలెన్ని వచ్చినా సరే ఈ పాట ప్రథమ స్థానంలో ఉందంటే అందుకు కారణం - వినగానే నోటికి సులువుగా వచ్చేసే ట్యూన్, విలువలు కోల్పోకుండా సామాన్యుడికి అర్థమయ్యేలా వాడిన సరళమైన భాష అనే చెపుకోవాలి. తర్వాత వచ్చిన

కొన్ని సినిమాల్లో ఈ పాట పల్లవిని డైలాగ్స్‌కి, ట్యూన్‌ని పాటల మధ్య ఇంటర్ లూడ్స్‌కి వాడుకోవటం కూడా జరిగింది. 'అల్లరిమొగుడు' చిత్రంలోని యోగా పాటకు ఈ పాట పల్లవిని ఇంటర్ లూడ్‌గా ఉపయోగించుకోవటం ఓ ఉదాహరణ. రాగం కీరవాణి కాబట్టి ఆ చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి అలా ఉపయోగించుకుని ఉంటాడు అని సంగీత ప్రియుల మధ్య అప్పుడప్పుడు వినిపించే మాటని కేవలం ఛలోక్తిగానే తీసుకోవాలి. వీటన్నిటికన్నా ఈ పాటలో పింగళి వాడిన 'హలా' అనే మాట గురించి అతి ముఖ్యంగా చెప్పుకోవాలి. 'హలో' అనడానికి బదులు చమత్కారంగా ఈ మాటను పింగళి ప్రయోగించారనుకున్నారు ఆ రోజుల్లో చాలామంది. నిజానికది కావ్యప్రయోగమే. పూర్వం ఎన్నో సంస్కృత నాటకాలలో ఈ ప్రయోగం జరిగింది. చెలికత్తెను 'హలా' అని సంభోదించాలని అమరంలో కూడా ఉంది. ఏది ఏమైనా విరళంగా (అరుదుగా) లభ్యమయ్యే పదాల్ని అటు తరళంగాను (ప్రకాశించేట్టుగా) ఇటు సరళంగాను వాడిన పింగళికి తెలుగు సినీ సంగీత సాహిత్యాభిమానులు ఋణపడి ఉండక తప్పదు.

---

ఓ దివ్య రమణులారా.. నేటికి కనికరించినారా
కలకాదు కదా సఖులారా
ఓ సఖీ ఒహో చెలీ ఒహో మదీయ మోహినీ ||ఓ సఖీ||
కలలోపల కనిపించి వలపించిన చెలులోహో
కనులవిందు చేశారే
కనుల విందు చేశారిక ధన్యుడనైతిని నేనహా ||ఓ సఖీ||
నయగారము లొలికించి
ప్రియరాగము పలికించి
హాయి నొసగు ప్రియలేలే
హాయి నొసరు ప్రియలే మరి
మాయలు సిగ్గులు ఏలనె
కనుచూపులు ఒకవైపు
మనసేమో నా వైపు ఆటలహో తెలిసేనులే కను
ఆటలహో తెలిసెను
చెలగాటమయ నా కడ చెల్లునె ఓ సఖీ

ఈ పాట సాకీతో మొదలై 'ఓ సఖీ ఒహో చెలీ ఒహో మదియా మోహిని' అనే పల్లవితో సాగే పాటను ఘంటసాల పాడగా ఎన్.టి.ఆర్, బి.సరోజాదేవి. యల్. విజయలక్ష్మి, జయంతి, బాల అభినయించారు. దేశ్ రాగానికి ఈ పాట అతి చక్కని ఉదాహరణ. ఈ పాట వేసుకున్న ముద్ర ఎంత పటిష్టమైనదంటే - విజయా వారు సుమారు 35 సంవత్సరాల తర్వాత 'భైరవద్వీపం' అనే చిత్రాన్ని తియ్యాల్సి వస్తే అందులోని 'ఎంత ఎంత ఎంత మోహమో, రతి కాంతుని శృంగారమంత్రమో' అనే పాటకి ఈ 'ఓ సఖీ' పాటనే ప్రేరణగా చేసుకోవలసి వచ్చింది. 'అహో ఒహో' అనే పదాల్ని ప్రయోగించటంలో పింగళి వారికో ప్రత్యేకత ఉంది. 'శ్రీకృష్ణార్జున యుద్ధం' (1963) చిత్రంలోని 'అన్నీ మంచి శకునములే' పాటలో 'మనసున మంగళ వాద్యమహా మ్రోగెలే' అన్న అను పల్లవి విన్న తర్వాతే ఈ విషయాన్ని చాలామంది గమనించగలిగారు. ట్యూన్ పరంగా ఈ పాటలో ఓ తమాషా ఉంది. ఎప్పటి నుంచో ప్రాచుర్యంలో ఉన్న 'భలే మంచి చౌక బేరము' అనే పాటలోని రాగాన్ని పక్కని పెట్టేసి నడకను మాత్రం తీసుకుని జాగ్రత్తగా గమనిస్తే ఆ తరహా పోకడ ఈ పాటలో అక్కడక్కడ కనిపించే అవకాశం ఉంది. అయితే దీన్ని కేవలం ఆత్మాశ్రయమే కాని నిరూపణకు దొరకని విషయంగా పేర్కొనాలి.

---

వరించి వచ్చిన మానవ వీరుడు ఏమైనాడని విచారమా
ఔన చెలీ ఔన సఖీ ఔన చెలీ ఔన సఖీ
అయితే వినవే మా మాట అయితే వినవే మా మాట
నీవు చేసిన మాయలు మించి నవ మన్మధుడే ఆయెనే
అహ నవ మన్మధుడే ఆయెనే
మన్మధుడై నిన్నావేశించి మైమరపించేనే హలా
నిను మైమరపించేనే హలా ||వరించి||

ఓహో మలయానిలుడై చల్లగ చెలిపై వలుపులు విసిరినే హలా
అహ వలుపులు విసిరేనే హలా
చెలి అడుగులలో పూలు చల్లగా లలిత వసంతుడె ఆయెనే
అహ లలిత వసంతుడె ఆయెనే
వసంతుడై నిను కోయిల పాటల చెంతకు పిలిచేనే హలా
తన చెంతకు పిలిచేనే హలా ||వరించి||

ఈ పాటను పి.లీల, పి.సుశీల, బృందం ఆలపించగా బి.సరోజాదేవి, యల్. విజయలక్ష్మి జయంతి, బాల అభినయించారు. ఈ పాటను మధ్యమావతి రాగంలో స్వరపరిచారు. అయితే ఆ రాగంలో రాకూడని గాంధార, దైవత స్వరాలను వినసొంపుగా ఉండటం కోసం జతచేసుకోవటం జరిగింది. ఈ పాటను కొందరు 'ఔనె చెలి ఔనె సఖీ' అంటూ పాడతారు. నిజానికి పింగళి రాసింది, గాయనీమణులు పాడింది – 'ఔన చెలి ఔన సఖీ' అనే.

చరణాలలోని వాక్యాలకి తరువాత వచ్చే వాక్యాలతో లింకు ఉండటం ఈ పాట ప్రత్యేకత. ఇంకొక విశేషం ఏమిటంటే – కొన్నేళ్ళ క్రితం పెండ్యాల ఓ పత్రికలో సమాధానాలు ఇస్తున్నప్పుడు 'ఈ పాట మొదలవడానికి ముందు వినిపించే ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ చాలా కొత్తగా ఉందండీ.. అది ఏ వాద్యం?' అని కొందరు అడిగితే దానికాయన "దాన్ని క్లేవయొలిన్ అంటారు. అది ఎలక్ట్రికల్‌గా ఆపరేట్ చేసే వాయిద్యం" అంటూ సమాధానమిచ్చారు. 'అంత చిన్న బిట్ కూడా ప్రేక్షకులకి గుర్తుండిపోయిందంటే అలాంటి పాటలు స్వరపరిచే అవకాశం నాకు కలిగినందుకు నేనెంతో పుణ్యం చేసుకున్నానో' అంటూ మిత్రుల మధ్య జరిగే పిచ్చాపాటీలో కన్నీళ్ళు పెట్టుకు మరీ చెప్పేవారు పెండ్యాల.



# ఆ పాత పాట మధురం
## రాజా



## జగదేకవీరుని కథ - 2

తెలుగు చలన చిత్ర సంగీత చరిత్రలో ఉదాత్తమైన గీతాలు, ప్రామాణికమైన గీతాలు వచ్చిన సంవత్సరాల్లో 1961 ఒకటి. ఆ సంవత్సరం విడుదలైన చిత్రాలలో విజయావారి జగదేకవీరుని కథ చిత్రాన్ని సంగీత ప్రియులెవ్వరూ మరచిపోలేరు. ఆ చిత్రంలో 'శివశంకరీ శివనందలహరి' పాట - ఆ పాటతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి జీవితంలోనే కాకుండా తెలుగువారికి కూడా ప్రతిష్ఠాత్మకంగా నిలిచింది. ఆ పాటకు సంబంధించిన వివరాలివి:

శివశంకరీ శివానందలహరి
శివశంకరీ శివానందలహరి
శివ శంకరీ
శివానందలహరి శివశంకరీ
చరణం: చంద్రకళాధరి ఈశ్వరీ..
చంద్రకళాధరి ఈశ్వరీ
కరుణామృతమును కురియుజేయుమా
మనసు కరుగదా మహిమ జూపవా
దీనపాలనము చేయవే
శివశంకరీ
శివానంద లహరి శివశంకరీ
శివశంకరీ శివానందలహరి శివశంకరీ
శివశంకరీ
చంద్రకళాధరి ఈశ్వరీ
రిరి సనిపమగా రిసధా నీరీనీసా
రిమపదా మపనిరి నిసదప
చంద్ర కళాధరి ఈశ్వరీ
దనిస మపదనిస
సరిమగరిమపని దనిస్
మప నిరి సరి నిస దనిప
మపనిసరీసని సరిగా రిస రిరి సని
సనిపనిపమ పమ గమరిసనిస
సరిమపనిదానిస
సరిమపనిదానిస
సరిమపనిదానిస
చంద్రకళాధరి ఈశ్వరీ
ఆ...
చంద్రకళాధరి ఈశ్వరీ
శివశంకరీ..
శివశంకరీ..
తోం తోం తోం
దిరిదిరి తోం దిరిదిరి తోం
దిరిదిరి తోం దిరిదిరి తోం
దిర్ ద్రి యానా దరితోం
దిరిదిరి తోం దిరిదిరి తోం
తోం తోం
దిరిదిరి దిరిదిరి దిరిదిరి
నాదిరి దిరిదిరి దిరి దిరి దిరిదిరి దిరి
నాదిరి దిరిదిరి తోం దిరిదిరి దిరి
నాదిరి దిరిదిరి తోం దిరిదిరి దిరి
నాదిరి దిరిదిరి తోం
నినినిని నినినిని దనిని దనినినిని దప

రిమరి సరిసనిసని పనిప మపమరిగా
సరి సస మపమమ సరిసస ససస
సరిసస పనిపప సరిసస ససస
మపమమ పనిదద
మపమ పనిదద
మపమ పనిద మపమ పనిద
పదపప సరిసస
పదప సరిస పదప సరిస
మమమ పపప దదద నినిని
ససస రిరిరి గరిసనిసరిపా ||శివశంకరీ||

'శివశంకరి' పాట స్వరపరచటానికి ముందే 'జగదేకవీరుని కథ' చిత్రంలోని మిగతా పాటల రికార్డింగు, పిక్చరైజేషనూ కూడా అయిపోయింది. క్లయిమాక్స్ షూటింగ్ ఇంకా రెండు నెలలుందనగా దర్శకుడు కె.వి.రెడ్డి, సంగీత దర్శకుడు పెండ్యాలను పిలిచి 'నాగేశ్వరరావుగారూ! ఇప్పుడు మీరు చేయబోయే పాట పిక్చర్‌కి ప్రాణం వంటిది. పూర్వం నారదుడు, తుంబరుడు వాదించుకుంటుంటే హనుమంతుడు పాడితే శిలలు కరిగాయట. ఈ యుగంలో కూడా తాన్‌సేన్ పాడితే దీపాలు వెలిగాయట, అంతెందుకు మన కళ్ళముందే బీహార్ రాష్ట్రం క్షామంతో తల్లడిల్లిపోతుంటే పండిట్ ఓంకారనాథ్ ఠాకూర్ వరుసగా ఆరు రోజుల పాటు 'మేఘ మల్హార్' రాగం పాడి వర్షాలు కురిపించి చరిత్ర సృష్టించలేదా..! సో.. సంగీతానికున్న శక్తి అపారం. అసలు రిథమ్‌కు ఎంత శక్తి ఉందంటే.. ఆర్మీ ఒక బ్రిడ్జ్ మీద ఒకే రిథమ్‌లో మార్చ్ చేసుకుంటూ వెళితే ఆ బ్రిడ్జి కూలిపోతుంది తెలుసా..!? అందుకే బ్రిడ్జిల మీద ఆర్మీ చేత చెల్లాచెదురుగా నాన్ రిథమేటిక్‌గా నడిపిస్తారు. ఆర్మీలో ఉండేటప్పుడు నీగ్రో సింగర్ పాల్ రాబ్సన్ పాడుతూ ఒక మ్యూజికల్ నోట్ దగ్గర తన వాయిస్‌ని సస్టెయిన్ చేస్తే ఆ పవర్‌కి గ్లాసులు పగిలిపోయేవి. కరెక్టు స్పాట్లో కరెక్ట్ నోట్ గనక పడితే మీ ముందున్న హార్మోనియం కూడా లేచి నాట్యం చేస్తుందండి..' అంటూ అన్ని ఉపమానాలు చెప్పేసరికి పెండ్యాల వారికి గుండె అదిరిపోయింది.

అంత ఎఫెక్ట్‌ని ఎలా తీసుకురావాలా అని ఆలోచిస్తుండగా ఇంకో మాట అన్నారు కె.వి.రెడ్డి, "మామూలు లైట్ సాంగ్స్‌లో మా కోరికలు, సలహాలు చెప్పగలం.. ఇది కేవలం శాస్త్రీయ సంగీతంతో సృష్టించవలసిన ఎఫెక్ట్.. మేం మాట్లాడగలిగేది ఏమీ లేదు. మీరు తయారు చేస్తే విని బాగుందో లేదో చెప్పడమే మా పని. ఇక్కడ (మద్రాసులో) ఇప్పుడు 'జగదల ప్రతాపన్' అనే సినిమా ఆడుతోంది. మన కథకు బేస్ అదే కావాలంటే వెళ్ళి చూడండి" అంటూ చెప్పారు, "వద్దండీ.. చూస్తే ఆ ప్రభావం నా ఫ్లోకి అడ్డురావచ్చు. మనమే తయారుచేద్దాం, నా శాయశక్తులా ట్రై చేస్తాను" అన్నారు పెండ్యాల.

మరునాటి సిట్టింగ్‌లో చిన్న పేపరు మీద 'శివశంకరీ శివానందలహరీ' అంటూ రాసి కె.వి.రెడ్డిగారికి చూపించారు పింగళి నాగేంద్రరావు. దానికాయన 'బాగుందండీ ' అంటూ పెండ్యాలగారికిచ్చారు. ఆ కాగితాన్ని అలా ఇస్తూ 'ఆర్తి బాగా కనబడాలి.. మీ ఇష్టమొచ్చిన రాగాల్లో వినిపించండి" అన్నారు. పెండ్యాల బాగా ఆలోచించి ముల్తానీ, ఘూర్జరీ, తోడీ, కాళింగడా, దర్బారీ, అసావేరి రాగాలలో ఆ పల్లవిని పాడి వినిపించారు. కె.వి.రెడ్డిగారికి, పింగళి నాగేంద్రరావు గారికి దర్బారీ రాగంలో చేసిన ట్యూనే నచ్చింది. మిగతా

చరణం తర్వాత రాసిస్తానని మర్నాటికే తెచ్చారు పింగళి. 'నాగేశ్వరరావుగారూ.. మొత్తం పాటంతా మీ చేతికొచ్చింది.. ఇంక మీ ఇష్టం.. మీరెప్పుడు ఫోన్ చేసి వినిపిస్తానంటే అప్పుడే నెక్స్ట్ సిట్టింగ్' అన్నారు కె.వి.రెడ్డి.

సరేనని ఓ పదిహేను రోజుల పాటు ఇంటివద్దే కూచుని స్వర రచన ముగించి 'పాట రెడీసార్' అన్నారు పెండ్యాల. ఆ మర్నాడు కూర్చున్నారంతా.. పెండ్యాల మరింత ఉత్సాహంతో పాడారు. పాట పూర్తయిన కొంతసేపటి వరకూ నిశ్శబ్దం. 'నాగేశ్వరరావుగారూ.. పాట చాలా బావుంది, బాగా కష్టపడి చేశారు.. కానీ..' అంటూ ఆగారు కె.వి.రెడ్డి, దాంతో గుండాగినంత పనైంది పెండ్యాలగారికి.. 'ఏవయిందండీ..?' అంటూ అడిగారు జంకుతూనే. "ఏం లేదండీ.. టైం చూసుకున్నారా.. పదమూడు నిమిషాలు.. పదమూడు నిమిషాల పాటు తెరమీద ఏం చూపించమంటారు మమ్మల్ని!? తగ్గించక తప్పదు. ఆరున్నర నిమిషాలు మేగ్జిమమ్.. అంతే. అంతే..' అన్నారు కె.వి.రెడ్డి.

'సరే సార్ ఫిల్టర్ చేస్తాను' అంటూ మరో నాలుగు రోజులు కష్ట పడి పాటని చిత్రికపట్టి ఆ తర్వాత వినిపించారు పెండ్యాల. దానికి బాగా సంతృప్తి చెంది ఘంటసాల గారిని పిలిపించి' నాగేశ్వరరావు గారూ.. పాడవలసిన వారు ఈయన. ఆయనకు వినిపించండి' అన్నారు. పాట వినగానే 'బ్రహ్మాండం బాబూ.. ఈ పాట కోసం నేను పదిహేను రోజులైనా సరే రిహార్సిలుకి వస్తాను బాబూ. బాగా పాడతాను' అన్నారు ఘంటసాల. అలాగే వచ్చి సాధన చేశారు కూడా. రికార్డింగ్ అయ్యాక పాటను విన్న యన్.టి.ఆర్ 'హిందూస్థానీ విద్వాంసులు పాడుతున్నప్పుడు, వాయిస్తున్నప్పుడు కొన్ని కొన్ని విన్యాసాలు చేస్తారు. మాస్టారితో పాటు కూచుని అవన్నీ ప్రాక్టీస్ చేస్తాను" అన్నారు. అలాగే నాలుగు రోజులు రిహార్సిల్స్ చేయటమే కాకుండా, 'మాస్టారూ...షూటింగ్ టైములో కంప్లీట్ మీరు సెట్ మీదే ఉండాలి" అన్నారు పెండ్యాల గారితో. అలాగే ఉన్నారు పెండ్యాల. వారం రోజుల పాటు ఆ పాట షూటింగ్ జరిగింది. పాట మొత్తంలో ఎక్కడా ఒక దగ్గర కూడా తొట్రుపాటు లేకుండా, తడబడకుండా ఎ టు జెడ్ బై హార్ట్ చేసి లిప్ మూవ్ మెంటు ఇస్తూ రకరకాల విన్యాసాలతో ఎన్.టి.ఆర్ నటించిన విధానానికి షూటింగ్ టైములో ఉన్నవారు, విజిటర్స్‌గా వచ్చిన వారు ఆశ్చర్యపోయేవారు. ఆ తర్వాత ఈ పాట ఎంతటి చరిత్రను సృష్టించిందో.. అది అందరికీ తెలిసిన విషయమే.



# ఆ పాత పాట మధురం



రాజా

## జగదేకవీరుని కథ - 3

సంగీత సాహిత్యాల పరంగా నాటికీ, నేటికీ, ఏనాటికీ మేటి అనిపించుకోగల జానపద చిత్రాలలో విజయావారి జగదేకవీరుని కథ ఒకటి. ...

ఐనదేమో ఐనదీ ప్రియ
గానమేదే ప్రేయసీ ||ఐనదేమో ||
ప్రేమ గానము సాగ గానే
భూమి స్వర్గమె ఐనది
భూమి స్వర్గమె ఐనది ||ఐనదేమో||
ఏమి మంత్రము వేసినావో
ఏమి మత్తును చల్లినావో ||ఏమి||
నిన్ను చూసిన నిమసమందె
మనసు నీ వశమైనదీ..
మనసు నీ వశమైనదీ...
మనసు నీ వశమైనదీ.. ||ఐనదేమో||
కులుకులొలికే హొయలు చూసి
వలపు చిలికే లయలు చూసి ||కులుకు||
తలపు లేవో రేగి నాలో
చాలా కలవరమైనదీ
చాలా కలవరమైనదీ
ఐనదేమో ఐనదీ ప్రియ
గానమేదే ప్రేయసీ

**ఈ పాటను ఘంటసాల,** సుశీల ఆలపించగా ఎన్.టి.రామారావు, బి.సరోజాదేవి అభినయించారు. కళ్యాణి రాగాన్ని బేస్‌గా చేసుకుని స్వరపరచిన ఈ గీతంలోని ట్యూన్ 'మ'ధ్యమం, 'ని'షాద స్వరాలపై తక్కువగాను, మిగిలిన 'సరిగపద' స్వరాలపైన ఎక్కువగాను సంచరించడం వలన ఈ పాటకు ప్రధాన రాగం మోహన అని అనుకోవడానికి ఆస్కారం ఉంది. అటు 'మ', 'ని'లను తక్కువగా వాడినా, ఇటు 'సరిగపద'లనే ఎక్కువగా ఉపయోగించినా మొత్తం ట్యూన్‌ని తన పట్టులో ఉంచుకుంటూ 'సరిగపదమని' శాసించగల పెండ్యాల హస్తవాసితో ఈ గీతం ఎంతో 'కళ్యాణ'ప్రదంగా ఎంత సమ్మోహనంగా తయారయిందో విన్నవారికి అనుభవ యోగ్యమే! మోహనరాగంలో 'సరిగపద' అనే 5 స్వరాలు మాత్రమే వస్తాయి. కళ్యాణి రాగంలో 'సరిగమపదని' అనే సప్త స్వరాలు వస్తాయి. ఈ పాటకు కళ్యాణి రాగాన్నే ఆధార రాగంగా తీసుకున్న పెండ్యాల వారు 'మ' 'ని' అనే స్వరాలు అతి తక్కువగా ప్రయోగిస్తూ మోహనరాగం అనే భ్రమను కలిగించారు. ఈ పాట మొదలవడానికి ముందు ఘంటసాల, సుశీల ఆలపించిన అలాపనలు మొత్తం ఒక పాటకు ఎంత ప్రాచుర్యం లభిస్తుందో అంతటి ఖ్యాతిని సంపాదించుకున్నాయి. అదీగాక ఈ పాటలో ఆ ఆలాపనలలోంచి అన్నపూర్ణా వారి 'వెలుగు నీడలు' (1961) చిత్రంలోని 'హాయి హాయిగ జాబిల్లి' పాటలోకి పాడుకుంటూ వెళ్ళి పోవడం చాలా సులువు. కావాలంటే ఓసారి సాధన చేసి చూడండి. 'ఐ'కారంతో మొదలైన పాటలు చాలా తక్కువ గల మన తెలుగు సినీగీతాల చరిత్రలో తెలుగుతో పింగళి జల్లిన మచ్చు కూడా!

---

రారా కనరారా
కరుణ మానినారా ప్రియతమలారా
రారా కనరారా
కరుణ మానినారా ప్రియతమలారా
నాలో నాలుగు ప్రాణములనగా
నాలో నాలుగు దీపములనగా
నాలో నాలుగు ప్రాణములనగా
నాలో నాలుగు దీపములనగా
కలిసి మెరిసి అలరించిన చెలులే
కలిసి మెలసి అలరించిన చెలులే
నను విడనాడెదరా
రారా కనరారా
కరుణ మానినారా ప్రియతమలారా.. రారా
మీ ప్రేమలతో మీ స్నేహముతో
మీ ప్రేమలతో మీ స్నేహముతో
అమరజీవిగా నను చేసితిరే
మీరు లేని నా బ్రతుకేలా
మీరు లేని నా బ్రతుకేలా
మరణమె శరణముగా
రారా కనరా
కరుణ మానినారా ప్రియతమలారా

**ఈ పాటను ఘంటసాల ఆలపించగా** - ఎన్టీఆర్ అభినయించారు. సన్నివేశ ప్రాధాన్యంగా మధ్య మధ్య బి.సరోజాదేవి, యల్.విజయలక్ష్మి జయంతి, బాల కనిపిస్తారు. ఈ పాట సాహిత్యం అతి తక్కువే అయినా పూర్తిపాఠం ఈనాటికీ ఎందరికో కంఠోపాఠంగా ఉందంటే అందుకు కారణం ఆ సాహిత్యంలోని లోతు మాత్రమే! భాగీశ్వరి మొదలైన రాగాలను వాడతారని చెబుతూ సాహిత్యాన్ని చూసి భాగీశ్వరి రాగంలో ట్యూన్‌ని ఓసారి అనుకున్నారు పెండ్యాల. అలా కాసేపు మనసులో సాధన జరిగాక, అది బాగుందనిపించాక - కె.వి.రెడ్డిగారికి వినిపించారాయన. "ఆర్తి, ఆరాధనా భావం రెండూ బాగా వచ్చాయండీ.. చాలా బాగుంది" అన్నారు కె.వి.రెడ్డి. అయినా పెండ్యాల వారి మనసెందుకో ఊరుకోలేదు. ఇంకా ఆలోచిస్తూనే ఉంది. ఆ సమయంలో ఆయనకి అరబిక్, ఈజిప్షియన్ మెలోడీస్ కొన్ని స్ఫురించాయి. ఊహకందని లోకాల నుంచి వచ్చి తిరిగి అదే లోకాలకు వెళ్ళిపోయిన దేవకన్యలను ఉద్దేశించి పాడిన పాట కాబట్టి ఆ ట్యూన్స్‌లో ప్రయత్నిస్తే కొత్తదనంగా ఉంటుందనిపించింది. రాత్రంతా కూర్చుని ఆ మెలోడీస్‌తో స్వరపరిచి మర్నాడు కె.వి.రెడ్డిగారి దగ్గరకు వెళ్ళి 'మరో రాగంలో కూడా ట్రై చేశానండీ.. వింటారా?" అని అడిగారు "చాలా.. సంతోషం.. కానివ్వండి" అన్నారు కె.వి.రెడ్డి - పక్కనే ఉన్న పింగళి నాగేంద్రరావుగారిని మళ్ళీ పాడమన్నారాయన. ముందు రోజు పాడిన భాగీశ్వరి రాగం ట్యూన్‌తో పోల్చుకుంటూ మరోసారి పాడారు పెండ్యాల. "రెండింటిలోనూ పూర్తి ఎక్స్‌ప్రెషన్ కనిపిస్తోందే! దేన్ని ఒదులుకుంటాం!?" అనే సందిగ్ధంలో పడ్డారు వారిద్దరూ ఆయన పాడాక, ఈ పరిస్థితి ఓ మూడు నాలుగు రోజులపాటు కొనసాగింది. ఎవరిచేత ఏ పని చేయిస్తున్నా నిర్ణయాన్ని మాత్రం తన దగ్గిరే అట్టిపెట్టుకునే కె.వి.రెడ్డి సైతం సందేహంలో పడి ఎన్.టి.ఆర్.ను తీరిక చూసుకుని రమ్మని కబురు పంపించారు. అలాగే వచ్చారాయన. జరిగిన వైనమంతా తెలిపి "సన్నివేశం మీకు తెలుసు కనుక పైగా నటించాల్సింది కూడా మీరే కనక నిర్ణయం మీకే వదిలేస్తున్నాం. మీరే నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటాం" అన్నారు. "పాడండి మాష్టారూ" అన్నారు ఎన్.టి.ఆర్. అలాగేనని మొదలు పెట్టారు పెండ్యాల. కళ్ళుమూసుకుని రెండు స్వర రచనల్నీ విన్నారు ఎన్.టి.ఆర్. మొత్తం అనుభూతిని ఆకళింపు చేసుకున్నారు. "మరొకసారి పాడండి మాష్టారూ" అని అడిగారు. సరేనని మళ్ళీ పాడారు పెండ్యాల. అయిదు నిమిషాల పాటు ఏమీ మాట్లాడలేదు ఎన్.టి.ఆర్. ఎవ్వరూ ఆయన్ని మాట్లాడించలేదు కూడా. అందరూ తదేక దీక్షతో ఆయన్నే చూస్తున్నారు. కాసేపాగి "రెడ్డిగారు.. నా నిర్ణయం భాగీశ్వరికే.. ఎందుకంటారా.. అరబిక్ మెలోడీలో కొత్తదనం ఉన్నమాట వాస్తవమే అయినా సాహిత్యాన్ని కొంచెం వెనక్కి, నెట్టి ముందుకు దూకుతోంది. అంటే ముందు సంగీతమే చెవులను తాకుతోంది. భాగీశ్వరిలో సంగీత సాహిత్యాలు రెండూ జోడుగా ఒకేసారి మనసుని తాకుతున్నాయి. అదే సన్నివేశానికి నిండుదనం చేకూరుస్తుంద"ని ప్రకటించారు. ఎన్.టి.ఆర్. లోతైన ఆయన పరిశీలన అందరికీ ఆమోదయోగ్యమైంది. ఆ ప్రకారమే "రారాకనరారా" పాట భాగీశ్వరి రాగంలోనే రికార్డయి ఈనాటికీ సజీవంగా ఉంది.



# ఆ పాత పాట మధురం



## రాజా

### జగదేకవీరుని కథ - 4

**సంగీత సాహిత్యాలకు పెద్దపీట వేసే** తత్వంగల విజయావారి చిత్రాలలో జగదేకవీరుని కథ కల స్థానం ప్రత్యేకం.

౧.

అతడు: ఆశా ఏకాశా నీ నీడను మేడలు కట్టేశా ||ఆశా||
ఆమె: చింతలో రెండు చింతలో
నా చెంత కాదు నీ తంతులు..ఓయ్... చింతలో
అతడు : ఓ..ఓ..ఓ..ఓయ్.... చింతలో
వద్దంటే కాదె ముద్దుల బాలా
ప్రేమ పరగణా రాసేశా ఒద్దంటె
నిన్ను రాణిగా.. నిను రాణిగా చేసేశా
చేతులు జోడించి మొక్కేశా.. ఆశా. ||ఆశా||
ఆమె: ఓ..ఓ..ఓ..ఓయ్...
కోశావు లేవోయి కోతలు
చాలా చూశానులే నీ చేతలు ||కోశావు||
రాజు ఉన్నాడూ - రాజు ఉన్నాడు
మంత్రి ఉన్నాడు సాగవు సాగవు
నీ గంతులు.. చింతలూ ||చింతలూ||
అతడు: రాజా.. మంత్రా.. ఎవరూ? ఎక్కడా?
తా తరికిట తా తరికిట తళాంగు తక భా
రాజు గారి బూజు దులిపేస్తా
మంత్రిగారి చర్మం ఒలిచేస్తా ||రాజు||
కోటలో పాగా.. కోటలో పాగా వేసేస్తా
గట్టిగ నీ చెయ్యి పట్టేస్తా..ఆశా... ||ఆశా||

**ఈ పాటను ఘంటసాల,** స్వర్ణలత ఆలపించగా రేలంగి, గిరిజ అభినయించారు. రాజనాల, సి.యస్.ఆర్. కూడా సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ఎక్కువగా మధ్యమావతి రాగంలోనూ అప్పుడప్పుడు శ్రీరాగం ఛాయలలోనూ సంచరించిన ఈ గీతంలో హాస్యరస స్పర్శతో పాటు మధ్యమావతి రాగాన్ని సాధన చేయాలనుకునే వారికి కావలసినంత విషయం ఉంది. ఈ హాస్యగీతాన్ని నేడు వస్తున్న హీరో హీరోయిన్ల యుగళగీతాల ముందు పెట్టి వింటే ఏవి అపహాస్యం పాలవుతాయో తిరిగి వివరించి చెప్పనవసరంలేదు. ఒకే ఒక ఆశ ఉండే గిరిజకు 'ఏకాశ' అని, రెండే రెండు కోరికలుండే రేలంగికి 'రెండు చింతలు' అని పేర్లు పెట్టడంతో పాటు వాటిని పాటలో ఇరికించడం, ప్రేమ పరగణాలాంటి ప్రయోగం - ఇవన్నీ పింగళి చమత్కారానికి అద్దం పడతాయి. హాస్యగీతాలు పాడేటప్పుడు ఘంటసాల ఇచ్చే ఝలక్ కొన్ని ప్రత్యేకంగా ఉంటాయి. పల్లవిని చేరుకోవడానికి చరణాంతాలలొ వచ్చే 'ఆశా...' దగ్గర ఇచ్చే గమకాల్లాంటి గిరికీలు, "రాజుగారి బూజు దులిపేస్తా, మంత్రిగారి చర్మ ఒలిచేస్తా' అనే వాక్యాలు మొదటి సారి అంటున్నప్పుడు ముక్కుతో పాడినట్టుగా నాజల్ ఎఫెక్ట్‌తో ఒత్తిమరీ పాడడం లాంటివి ఆ ఝలక్‌లలో కొన్ని..

---

ఆ..ఆ...ఆ..ఆ..
అతడు: మనోహరముగా మధుర మధురముగ -
మనసులు కలిసెనులే
ఆమె: మమతలు వెలసెనులే ||మనో||
అతడు: ఇది చంద్రుని మహిమేలే - అదంతేలే సరేలే -
మనకిది మంచిదిలే ||ఇది||
ఆమె: మంచిది యైనా కొంచెమైనా వంచన నీదేలే
అయినా - మంచిదిలే ||మనో||
అతడు: ఇది మోహన మంత్రమెలే - అదంతేలే సరేలే -
మనకిది మేలేలే ||ఇది||
ఆమె: మేలే అయినా మాలిమైనా - జాలము నీదేలే
అయినా మేలేలే.... ||మనో||

ఈ పాటను ఘంటసాల, సుశీల ఆలపించగా ఎన్.టి.రామారావు. బి.సరోజాదేవి, యల్. విజయలక్ష్మిపై చిత్రీకరించారు. ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్.కి గలయుగళగీతాలు రెండు. ఐనదేమో ఐనదీ పాట మొదటిదయితే ఇది రెండవది. నిజానికి ఐనదేమో ఐనది పాటకు జనాకర్షణ శక్తి ఎక్కువ. మరి ఈ పాట కూడా గుర్తుండి పోవాలంటే ఈ పాటవల్ల కథకు ఓ ప్రయోజనం ఉండితీరాలి. కథ ప్రకారం ఎన్.టి.ఆర్ ను పెళ్ళాడిన బి.సరోజాదేవి, యల్.విజయలక్ష్మి మీరు నా గానమునే వినవలెను, మీరు నా నాట్యమునే చూడవలెను - అంటూ ఇరకాటంలో పెట్టేస్తారు. ఆ ఇబ్బంది నుండి బైటపడడానికి బి.సరోజాదేవి అతనికి 'ఓం ఏకోనేకో హమస్మి' అనే మంత్రాన్ని ఉపదేశిస్తుంది. ఆ మంత్రభావంతో అతడు ఇద్దరుగా మారి అటు బి.సరోజాదేవి మందిరంలో ఆమె గానాన్ని వింటాడు. ఇటు ఎల్.విజయలక్ష్మి మందిరంలో ఆమె నాట్యాన్నీ చూడగలుగుతాడు. పతాక సన్నివేశంలో ఆ మంత్ర ప్రభావంతోనే అయిదుగురిగా మారి ఒకేసారి 4 వాద్యాలను వాయిస్తూ 'శివశంకరీ' పాటను ఆలపించి దేవతానుగ్రహ పాత్రుడవుతాడు. అలా అతడిని ఆదుకునే ఆ

మంత్రాన్నివ్వడానికి ఓ బలమైన కారణం, అందుకు అనువైన సన్నివేశం, పాటతో ముడిపడి ఉండేట్టు తీర్చిదిద్దటం వల్ల సన్నివేశం ప్రాధాన్యంగా ఈ  పాటకూడా ప్రేక్షక శ్రోతల మన్నలను అందుకోగలిగింది. ఈ పాటను ప్రత్యేకించి ఒకరాగానికి చెందేట్టు - రాగ ప్రాధాన్యగీతంగా మలచలేదు పెండ్యాల. కేవలం మనోధర్మంతో మలుచుకుంటూ పోయారు. పాటలో సాహిత్యపరంగా చిలిపితనం ఉంది, చమత్కారం ఉంది. వాటిని విప్పి చెప్పడం కన్న ఎవరి అనుభవానికి వార్ని ఒదిలేస్తే మంచిది. అలిగిన ప్రియురాలిని మచ్చిక చేసుకునే ప్రియుడు, ఆ సన్నివేశాన్ని తనకు అనువుగా మలుచుకుంటే, అది గ్రహించిన ప్రియురాలు 'నీ సంగతి తెలుసులే' అన్నట్టు కౌంటర్ ఇస్తూనే కరిగిపోవటం ఇవన్నీ ఎవరికివారు తమ తమ అనుభవాలను నెమరు వేసుకుంటూ పాట సాహిత్యంతో బేరీజు వేసుకుంటే పింగళివారి మీద గౌరవం రెట్టింపవుతుంది. ఆయన బ్రహ్మచారి అనే విషయం ఈ సందర్భంగా మరోసారి గుర్తుచేసుకుంటే ఆ గౌరవం ఆరాధనగా కూడా మారుతుంది. సృజనాత్మకతకు, భావుకతకు ప్రత్యక్షానుభవం అవసరం లేదనిపిస్తుంది.

---

ఆదిలక్ష్మి వంటి అత్తగారివమ్మ ||2||
సేవలంది మాకు వరములీయవమ్మ ||2|| ||ఆది||
జయంతి: కలుగునే మీ వంటి సాధ్వి అత్తగా మాకు
తొలి మేము చేసిన పుణ్యమున గాక
నాగిని: మందార మాలతీ పారిజాతాలతో
అందముగ ముడివేసి అలరజేసేము ||ఆది||
జయంతి: మనసు చల్లన కాగ మంచిగంధము పూసి
మా ముచ్చటలు తీర్ప మనవి చేసేము
మరిచి : పారాణి వెలయించి పాదపూజను చేసే
వారుణి: కోరికలు తీరునవి పొంగిపోయేము ||ఆది||

**ఈ పాటను లీల,** సుశీల ఆలపించగా బి.సరోజాదేవి, యల్. విజయలక్ష్మి జయంతి, బాల, ఋష్యేంద్రమణిపై చిత్రీకరించారు. తెలుగు సినీ చరిత్రలో తల్లిమీద, తండ్రిమీద, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళ మీద పొగుడుతూ ఉన్న పాటలు చాలానే ఉన్నాయి. అయితే అత్తగారిని పొగుడుతూ ఉన్న పాటలెన్ని అనే ప్రశ్న గనక వస్తే ఈ పాట స్ఫురణకు వచ్చినంత త్వరగా మరో పాటకు అవకాశం చిక్కదు. అందుకు పింగళికి ప్రథమ తాంబూలం ఇచ్చి తీరవలసిందే! ఈ పాటకు పీలూ రాగం ఆధారం. పీలూ రాగంపై పెండ్యాలకున్న మక్కువ, పట్టు చాలా ఎక్కువనై - 'పరువు ప్రతిష్ట' లోని ప్రభుగిరిధారి శౌరీ రావయా, 'మహాకవి కాళిదాసు' లోని 'ఎందుకు వేసిన వేషమయా', 'శ్రీ కృష్ణార్జున యుద్ధం'లోని 'నీకై వేచితినయ్యా ఓ ఏకాంత రామయ్యా' - మొదలైన పాటలు నిరూపిస్తాయి. విచిత్రం ఏమిటంటే పీలూ రాగానికి ప్రామాణిక సినీగీతాలను పేర్కొనవలసి వస్తే ఈ పాటలను మినహాయించటం కుదరదు. 'జగదేకవీరుని కథ' చిత్రంలోని ఈ 'ఆదిలక్ష్మి' వంటి పాట ద్వారా ఆ రాగం సుసంపన్నమైంది.



# ఆ పాత పాట మధురం
రాజా



## పెళ్ళి సందడి...

**మాటల రచయిత సముద్రాల జూనియర్** తన సినీ జీవితానికి ఫుల్ స్టాప్ పెట్టేసి హైదరాబాద్‌కు వచ్చి ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ఇంచుమించు తన మనసు పంచుకున్న ప్రతీవారితోనూ అనేవారు – 'మాట కన్నా పాట చాలా శక్తివంతమైంది. పాటకుండే ఆయుఃప్రమాణం మాటకు లేదు. నేను పూర్తిగా పాటల రచయితనే అయివుంటే నా సినీ జీవితం మరికొన్నాళ్ళపాటు సాగేదేమో!?' అని. ఆ మాటల్లో అనుభవపూర్వకమైన సత్యం ఉంది. మాటను పాటగా మలిచి దానికి శాశ్వతత్వాన్ని కట్టబెట్టే గుణం స్వరానికుంది. పాటకు అంత శక్తి ఉంది గనకనే మరుగున పడ్డ ఎన్నో సినిమాలలో కేవలం పాటలు ఇవాళ్టికీ గుర్తుండే సంఘటనలు కూడా ఉన్నాయి. అటువంటి సినిమాలలో ఒకటి.. రిపబ్లిక్ ప్రొడక్షన్ వారి 'పెళ్ళి సందడి'. 1959లో విడుదలైన ఈ చిత్రానికి పాటలను జూనియర్ సముద్రాల రాశారు. ఘంటసాల సంగీత దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో గల ఎన్నో మంచి పాటలలో అధికశాతం జనం గుర్తుంచుకున్న నాలుగుపాటలు ఈ సంచికలో....

అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా
అది తెలిసీ మసులుకో బస్తీ చిన్నోడా ||అప్పటికీ||
బాల వయసు పెళ్ళిళ్ళ బాధలు పోయాయోయ్
ప్రేమించి పెళ్ళాడే రోజులోయి వోయి ||అప్పటికీ||
చెప్పినట్లు పడి ఉండే కాలం పోయిందోయ్
చెప్పినట్లు పడి ఉండే కాలం పోయిందోయ్
తిప్పలు పెట్టారా తప్పవోయి విడాకులు ||అప్పటికీ||
ఒకరి మీద ఇంకొకరు అదుపులు మానేసి
ఒకరి మీద ఇంకొకరు అదుపులు మానేసి
కలసి మెలసి సాగించే సంసారం స్వర్గమోయ్ ||కలసి||
అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా
అది తెలిసీ మసలుకో బస్తీ చిన్నోడా
అది తెలిసీ మసలుకో బస్తీ చిన్నోడా

ఈ పాటను పి.లీల పాడగా అక్కినేని, అంజలీదేవిపై చిత్రీకరించారు. ఈ పాటలో రాగ ప్రాధాన్యత అంత బలంగా లేకున్నా వినసొంపైన గీతంగా తీర్చిదిద్దారు ఘంటసాల. 1930 నుంచి 1950కి, ఆ తరువాత 1950 నుంచి 1960కి మధ్యగల పరిస్థితులను

గమనిస్తే పెళ్ళిళ్ళ విషయంలో గాని ప్రేమ వ్యవహారాల్లోగాని కనిపించిన సాంఘిక చైతన్య ప్రభావమే ఈ పాట సాహిత్యంపై కూడా పడిందని ఆ మూడు దశాబ్దాల్ని తమ అనుభవంలో పండించుకున్న పరిశీలకులు ఒప్పుకుంటారు. ఆ రకంగా చూడగలిగితే సినిమా పాటలు కూడా అధ్యయనం చేయడానికి ఎంతగా ఉపకరిస్తాయో తెలుస్తాయి.

---

**చూపుల తీపితో కొసరుచున్ దరిజేరి మనోజ్ఞ గీతికాలాపన సేయు కూర్మి జవరాలొకవైపు, మరొక్క వైపునన్ ఈ పసి కమ్మ తెమ్మరలు ఈ పూవు దోటల శోభలున్నచో రేపటి ఆశ నిన్నవెతలేటికి నేటి సుఖాల తేలుమా**

అతడు: రావే ప్రేమలతా
నీవేనా కవితా
కిన్నెర మీటుల కిలకిలవే
పలువన్నెల మెరపుల మిలమిలవే
ఆమె: ఓహో కవిరాజా
నేడే నెలరాజా
ఎందులకోయీ పరవశము
నీ కెందునకో ఈ కలవరము
అతడు: పూవులలో నును తీవెలలో
ఏ తావున నీవే వనరాణీ
పూవులలో నును తీవెలలో
ఏ తావున నీవే వనరాణీ
ఆమె: అందవతి కనుపించినచో
కవులందరి చందమిదేలే ||రావే||
అతడు: పరువులిడే సెలయేరువలె
నిను చేరగ కోరును నా మనసు
పరువులిడే సెలయేరువలె
నిను చేరగకోరును నా మనసు
ఆమె: ఊహలతో ఉలికించకుమా
నవమోహన ఈ చెలి మదినే ||రావే||
ఆమె: ముచ్చటగా మనముండినచో
మన మచ్చికకు జగమేమన్నో
అతడు: లోకముతో మనకేమి పని
మనసేకమ్మి మనముంటే
ఆమె: నేనే నీ కవితా
అతడు: రావే ప్రేమలతా

ఈ పాటను ఘంటసాల, రావు బాలసరస్వతీదేవి పాడారు. అక్కినేని, అంజలీదేవి అభినయించారు. మాండ్ రాగం ఆధారంగా మలచబడ్డ ఈ పాట సంగీత ప్రియుల హృదయాల్లో ఈనాటికీ సజీవంగా ఉన్నదంటే అందుకు కారణం స్వరరచన మాత్రమే కాక, పాడిన ఆర్.బాలసరస్వతి కంఠంలోని విలక్షణత కూడానని విన్న ప్రతీవారు ఒప్పుకుంటారు. మాండ్ రాగంలో ఘంటసాల సంగీత దర్శకత్వంలో వచ్చిన మంచి ప్రయోగాలలో ఈ పాటతో పాటు 'రహస్యం' చిత్రంలో 'సాధించనౌనా జగానా' పాటను, 'మర్మయోగి' 'మధువు మనకేల సఖియరో' అన్న పద్యాన్ని చెప్పుకోవాలి. అలాగే 'రావే ప్రేమలతా' పాటకు ముందు వచ్చే పద్యం కూడా (చివర్న వచ్చే ఆలాపనలో పంతువరాళి రాగచ్ఛాయలు కొంత కలిసినా) మాండ్ రాగంలోనే ఉంటుంది. అప్పట్లో ఈ పద్యం రికార్డులలో గానీ తర్వాత వచ్చిన కొన్ని క్యాసెట్లలో గానీ లేదు. ప్రేమగీతానికి ముందు ఓ మంచి పద్యాన్ని జత చేయడం విషయంలో నిర్మాత సీతారామ్ - ఈ చిత్రానికి సముద్రాల జూనియర్ సమకూర్చిన మూలకథను సినిమాకు కావల్సిన రీతిలో మలుచుకోవడంలో దర్శకుడు డి.యోగానంద్‌తో పాటు పాలు పంచుకున్నారు. కొన్నాళ్ళ తరువాత ఎన్టీఆర్, భానుమతి, యస్వీ.రంగారావుతో 'బొబ్బిలి యుద్ధం' చిత్రం నిర్మించి అందులో వెంగళరాయుడు పాత్రను స్వయంగా పోషించి జమునకు భర్తగా దీటైన నటనను కూడా ప్రదర్శించారు. ఆ చిత్రంలో గల 'మురిపించే

అందాలే' పాటకు ముందు శ్రీ శ్రీ చేత 'సొగసు కీల్జడదాన' అనే సాకీని పద్యంలాగా రాయించిన ఆయన అభిరుచి ఈ సందర్భంగా సంస్మరణీయం.

కాకపోతే ఈ పాటలో జూనియర్ సముద్రాల ఉపయోగించిన 'అందవతి' అనే పదం పంటి కింద పలుకులా గుండెను కలుక్కుమనిపిస్తుంది. కేవలం -'కవులందరి చందమిదేలే' అనే మాటకు ప్రాస సరిపోతుందని 'అందవతి' అని వాడేరే గాని 'సౌందర్యవతి' అనిగాని 'అందగత్తె' అని గాని వాడాలని - పాటకు ముందు ఉత్పలమాలలో ఛందోబద్ధంగా అంత చక్కటి పద్యాన్ని అందించిన సముద్రాల జూనియర్‌కి తెలియదని అనుకోలేం.

---

ఆమె: ఝుమకు ఝుమకు తారా
ఝణకు ఝణక్ సితారా
ఈ తారను విడిచి పోతారా?
అతడు: ఛమకు ఛమకు తారా
ఝణక్ ఝణక్ సితారా
నా తారను విడిచి పోతానా?
ఆమె: కలల మైకములో
కనుమూసి నేనుంటే ||కలల||
సెలవు గైకొనకుండా
తరలిపోతారా ||ఝుమకు||
అతడు: కాలికి బందలై
నీ అందచందాలు ||కాలికి||
కలకాలం నన్ను నీ ఖైదీ చేసెనే ||ఝుమకు||
ఆమె: రాగాలు సరాగాలు ఏనాటికి
ఇలా సాగిపోయేన ముమ్మాటికి
అతడు: ఏ చోటనున్న ఏ నాటికైనా
నా చెలివి నీవే అను ఔనౌనను ||ఝుమకు||

ఈ పాటను ఘంటసాల, లీల, పాడగా అక్కినేని, అంజలి అభినయించారు. పాటలను స్వరపరచడానికి ఘంటసాల అత్యంత ఆప్యాయంగా ఎన్నుకునే రాగేశ్వరి రాగం ఈ పాటకు ఆధారం. ఘంటసాల స్వర రచనలో వచ్చిన - ఇది నా చెలి (చంద్రహారం), తాళలేరా మదనా (పాండవవనవాసం) మగరాయ వలరాయ (రహస్యం) బుద్ధ దేవుని భూమిలో పుట్టినావు (పుష్పవిలాపం పద్యాలలో ఒకటి) - ఇవన్నీ ఈ 'ఝుమకుఝుమకు తారా' పాటతో కూడా కలుపుకుంటూ ఒక క్యాసెట్‌లో రికార్డు చేయించి వరుసగా విని చూడండి. ఒకే రక్తం పంచుకు పుట్టిన అక్కచెల్లెళ్ళలా ఉంటాయి. ఈ పాటలో జూనియర్ సముద్రాల ఉపయోగించిన 'బందాలై' అనే పదం తెలుగు భాష మీద మక్కువ ఉన్నవారికి ఆనందం కలిగిస్తుంది. వ్యస్తపదంగా 'బందం'గాను సమానంగా 'బంధం'గాను ఉపయోగించ తగ్గ ఈ పదం యొక్క లక్షణం తెలియకుండానే ఇవాళ ఎవరికి తోచిన రీతిలో వారు వ్యవహరించడం జరిగిపోతోంది.

మనుచరిత్రలో 'కచ్చడాల్ కట్టుకొనిన ముని ముచ్చులైన తామరసనేత్రలిండ్ల బందాలు కారె,' అన్న అల్లసాని పెద్దన వారి ప్రయోగం ఈ సందర్భంగా ఒకసారి గుర్తుతెచ్చుకుంటే సముద్రాల జూనియర్ మీదా, అలాగే ఉచ్చరిస్తూ పాడిన ఘంటసాల మీద గౌరవం ఎంతగా పెరిగిపోతుందో చెప్పలేం. ఈ పాటలో స్వరరచనా పరంగా ఒకటి రెండు చరణాలు ఒక ఎత్తు. మూడవ చరణం ఒక్కటీ ఒక ఎత్తు. వాటి మధ్య తేడాలను గమనిస్తూ పాడుకోగలిగితే సంగీత దర్శకుడిగా ఘంటసాల సృజనాత్మక సామర్ధ్యం ఆరాధనాత్మకమైన అభిమానం ఇంకా ఎక్కువైపోతుంది.

ఆమె: బైరో బైరో పెళ్ళికొడకా
అతడు: ఆల్ రైరో రైరో నా పెళ్ళికూతురా ||బైరో||
అతడు: అడ్రస్ తెలియక అల్లాడిపోతి అందాల పూబంతి ||అడ్రస్||
నిను చూచి నా దినం మొదలు నే మజ్నూనైపోతినే
హాయ్.. మజ్నూనైపోతినే
హాయ్.. మజ్నూనైపోతినే బైరో
ఆమె: అయ్యో పాపమీ అవస్థ చూస్తే గుండె నీరుకాదా ||అయ్యో||
వెళ్ళి వెదకు నీ చెలీ లైలను ఎడారీ దారులా ||వెళ్ళి||
అతడు: హాయ్ ఎడారీ దారులా ||బైరో||
అతడు: వలచి నన్ను దయ తలచకున్న
నా తలను కోసుకుంటా
ఆమె: తలాతీసుకొను పనే లేదురా
నిన్నే చేసుకుంటా తలా
అతడు: హాయ్ అదే కావాలంటా ||బైరో||

ఈ పాటను బి.సరోజాదేవి, చలంపై చిత్రీకరించారు. జిక్కి, రాఘవులు పాడారు. ఈ రాఘవులు మరెవ్వరో కాదు. ఘంటసాల వారికి అన్నిటా చేదోడు వాదోడుగా ఉంటూ, తర్వాత రోజుల్లో స్వతంత్ర ప్రతిపత్తిగల సంగీత దర్శకుడిగా నిలదొక్కుకుని ఘంటసాల స్వర జీవితంలో చెప్పుకోదగ్గ పాటలలో ఒకటిగా నిలిచిపోయిన 'ఈ జీవన తరంగాలలో ఆ దేవుని చదరంగంలో' వంటి పాటను స్వరపరచిన జె.వి.రాఘవులే. ఓ వైపు వెస్టర్న్ కంపోజిషన్‌లా అనిపించినా – శోకరసానికి ఉపయోగించే శివరంజని రాగాన్ని అంతర్లీనంగా ఆవహింప చేసుకుంటూ ఎంతో హుషారుగా నడిచిన ఈ 'బైరో బైరో' పాట స్వర రచనను మెచ్చుకోకుండా ఉండలేం. కాకపోతే శివరంజని రాగంలో పడకూడని అంతర్గాంధారం, ప్రతి మధ్యమం, కైశిక కాకలి నిషాద స్వరాలను వాడుకోవడం జరిగింది గనుక దీనిని మిశ్ర శివరంజనిగా పేర్కొనవచ్చు. వినోదా వారి దేవదాసులోని 'అంతా భ్రాంతియేనా', సంగమ్ లోని 'ఓ మేరే సనమ్ ఓమేరే సనమ్', సూరజ్ లోని 'బహారో ఫూల్ బర్ సావో' పాటలను గుర్తుచేసుకుంటే ఈ మిశ్ర శివరంజని రాగం ఎంత జనరంజకంగా ఉంటుందో కూడా తెలుస్తుంది.

తరచి చూస్తే తెలుసుకోదగ్గ విషయాలెన్నో ఆ నాటి పాటల్లో ఉండేవనిపిస్తే – ఆ గొప్పదనమంతా – తెలిసి చేసినా తెలియక చేసినా వాటికో చరిత్ర కలిగేలా సృష్టి చేసిన ఆయా కళాకారుల తపనా సంస్కారాలదే



# ఆ పాత పాట మధురం
## రాజా



## శభాష్‌రాముడు

**బాగా హిట్ అయిన చిత్రాన్ని తమిళ రంగం** నుంచే కాకుండా హిందీ నుంచి కూడా తీసుకుని, హక్కుల్ని కొని తెలుగులో పునర్నిర్మించటం ఎప్పటినుంచో జరుగుతున్నదే! కె.అమరనాథ్ నిర్మించగా 1957 లో విడుదలయిన 'బడాభాయ్' హిందీ చిత్రం హక్కుల్ని సుందర్‌లాల్ నహతా - డూండి కొని, రాజశ్రీ ప్రొడక్షన్స్ పతాకంపై 'శభాష్ రాముడు' పేరిట తెలుగులో పునర్నిర్మించారు. హిందీలో అజిత్, కామిని కౌశల్, అనంత్ మరాఠే, అమిత, నసీర్‌హుస్సేన్, జయంత్, కుంకుం, పాత్రల్ని తెలుగులో ఎన్.టి.ఆర్, దేవిక, జె.వి.రమణమూర్తి, మాలిని, గుమ్మడి, ఆర్.నాగేశ్వరరావు, ఎమ్.ఎన్.రాజం నటించారు. కామెడి ట్రాక్‌కి మాత్రం - రాజ్ ఖోస్లా దర్శకత్వంలో దేవానంద్, వహీదారెహమాన్‌తో గురుదత్ నిర్మించగా 1956లో విడుదలైన 'సి.ఐ.డి' చిత్రంలోని జానీవాకర్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ప్రేరణగా తీసుకున్నారు. 1959లో విడుదలైన శభాష్ రాముడు చిత్రంలో ఘంటసాల సంగీత నిర్వహణలో ప్రజాదరణ పొందిన ఓ నాలుగుపాటలివి.

అతడు: హల్లో డార్లింగ్ మాట్లాడవా
మురిపిస్తావ్ మెరిపిస్తావ్
దరికొస్తే గొడవా
ఆమె: మాటా మంతీ మనకెందుకోయ్
సరిసరిలె నిర్వాకం తెలిసింది పోవోయ్
అతడు: మన ప్రేమ మరిచేవా కనికరం లేదా
ఆమె: కనికరం మమకారం అనకింక నాతో
అతడు: ఏమే చిలుకా ఇంకా అలుకా
మురిపిస్తావ్ మురిపిస్తావ్ దరికొస్తే గొడవా
దయగంటె మొరవింటె నీ పాదాల్ పడతా
మనలోన మనకేమి తలవొంపే చిలకా
దండాల్ పెడతా సెల్యూట్ కొడతా
మురిపిస్తావ్ మెరిపిస్తావ్ దరికొస్తే గొడవా
ఆమె: పదిమంది ఇదివింటే పరువా మరియాదా
అతడు: వదిలేస్తా ఒట్టేస్తా ఇదిగో నీ మీదా
ఆమె: అయితే సరిలే
అతడు: రైటో పదవే
ఇద్దరు: మనసొకటే మాటొకటే మనజీవాలొకటే

ఈ పాటను సదా శివబ్రహ్మం రాయగా పిఠాపురం నాగేశ్వరరావు, జమునారాణి ఆలపించారు. రేలంగి, గిరిజపై చిత్రీకరించారు. పైన ఉదహరించిన సి.ఐ.డి చిత్రం కోసం ఓ.పి.నయ్యర్ సంగీత దర్శకత్వంలో రఫీ పాడగా హాస్యనటుడు జానీవాకర్ అభినయించిన 'ఏ దిల్ హై ముష్కిల్ జీనా యహా' పాట ట్యూన్‌ని ఈ పాటకు యథాతథంగా వాడుకోవటం జరిగింది. శంకరాభరణం స్వరాలతో వచ్చే మేజర్ కార్డ్సని ఉపయోగించుకుని చేసిన 'కార్డ్స్ కంపోజిషన్'లో అద్భుతమైన స్వర రచనగా పేరు తెచ్చుకున్న మాతృకకు ఏ మాత్రం అన్యాయం జరగని రీతిలో మన వాతావరణానికి అనువుగా మలచుకోవటంలో అందరూ కృతకృత్యులయ్యారనే చెప్పాలి.

జయమ్ము నిశ్చయమ్మురా బయమ్ము లేదురా
జంకు గొంకు లేక ముందుకు సాగిపొమ్మురా
సాగిపొమ్మురా ||జయమ్ము||
ఏనాటికైన స్వార్థమూ నశించి తీరునూ ||ఏనాటి||
ఏ రోజుకైన సత్యమే జయించి తీరును జయించి తీరునూ
కష్టాల కోర్చుకున్ననే సుఖాలు దక్కును
సుఖాలు దక్కునూ ||జయమ్ము||
విద్యార్థులంతా విజ్ఞానం సాధించాలి ||విద్యా||
విశాల దృష్టి తప్పకుండ బోధించాలి బోధించాలి
పెద్దలను గౌరవించి పూజించాలి పూజించాలి ||జయమ్ము||

కష్టాల కోర్చుకొన్ననే సుఖాలు దక్కును సుఖాలు దక్కునూ
ఈ లోక మందు సోమరులై ఉండకూడదు ఉండకూడదు
పవిత్రమైన ఆశయాలు మరువకూడదు
మరువకూడదు ||జయమ్ము||
గృహాన్ని స్వర్గసీమగా చేయుము దేవా బ్రోవుము దేవా
కుటుంబ మొక్క త్రాటిపైన నిలుపుము దేవా నడుపుము దేవా
బీదసాద నాదరించు బుద్ధి నొసగుమా శక్తి నొసగుమా ||జయమ్ము||
పరాభవమ్ము కల్గునంచు పారిపోకుమోయ్
జయమ్ము నిర్వరించుదాక పోరి గెల్వవోయ్ పోరిగెల్వవోయ్
స్వతంత్ర యోధుడన్న పేరు నిల్వబెట్టవోయ్
నిల్వబెట్టవోయ్ ||జయమ్ము||

ఈ పాట ఆ రోజుల్లో విపరీతమైన హిట్. 'బడాభాయ్' చిత్రంలోని 'కదమ్ బడాకె జా.. నడర్.. కదమ్ బడాకే జా' పాటను కొద్ది మార్పులతో స్వరపరచి ఈ పాటను మలచుకోవటం జరిగింది. ఘంటసాల, సుశీల, తమిళ గాయని ఎమ్మెస్ రాజేశ్వరి కలిసి బృందంతో పాడిన 'జయమ్ము నిశ్చయమ్మురా' పాటను సినిమాలో మూడు బిట్‌లుగా చూపిస్తారు. మొదటి బిట్‌ని తెలుగు చిత్రాల తొలి తార సురభి కమలాభాయ్‌ని రిక్షాలో ఎక్కించుకుని తొక్కుతూ ఎన్.టి.ఆర్ అభినయించారు. విఠలాచార్య చిత్రాలలో ఎక్కువగా పాల్గొనే హాస్యనటుడు మోతుకూరి సత్యం ఈ బిట్‌లో ఎన్.టి.ఆర్ ప్రక్కన జూనియర్ ఆర్టిస్ట్‌గా కనిపిస్తాడు కూడా. రెండో బిట్‌ను, మూడో బిట్‌ను, రమణ మూర్తి, బేబీ శశికళ, దేవిక అభినయించగా సన్నివేశపరంగా ఇంటర్ కట్స్‌లో ఎన్.టి.ఆర్ కూడా కనిపిస్తారు. సింధుభైరవి రాగంలో వచ్చిన పాటల్లో ఒక మంచి పాటగా ఉదహరించవచ్చు ఈ గీతాన్ని. జానపద గీతాలకు పేరెన్నికగన్న కొసరాజు రాఘవయ్య చౌదరి ఈ పాటను వ్రాశారన్న నిజం - క్యాసెట్ కంపెనీల వారికి తెలియరాలేదంటే ఇవాళ ఆశ్చర్యపోవడం తప్ప ఇంకేం చేయగలం!?

---

రేయి మించెనోయ్ రాజా
హాయిగ నిదురించరా హాయిగ నిదురించరా ||రేయి||
వెల్లి విరిసి వెన్నెల్లు కాసే
చల్లని చిరుగాలి మెల్లంగ వీచె ||వెల్లి||
స్వప్నాలలోనా స్వర్గాలు కంటూ
స్వర్గాలలో దేవగానాలు వింటూ
హాయిగ నీవింక నిదురించవోయి ||రేయి||
చీకటి వెంటా వెలుగేరాదా
కష్ట సుఖాలు ఇంతాకాదా
చింతావంతా నీకేల నోయి
అంతా జయమౌను శాంతించవోయి
హాయిగ నీవింక నిదురించవోయి ||రేయి||

ఈ పాటను సదా శివబ్రహ్మం వ్రాయగా సుశీల ఆలపించారు. దేవిక, ఎన్.టి.ఆర్ అభినయించారు. రాగ నిర్ధారణకు దొరకని మిశ్రమ స్వరాలతో స్వరపరిచిన ఈ 'విశ్రమగీతం' (విశ్రమించటానికి ఉపయోగించిన గీతం) - జోలపాటంటే ఇలా ఉండాల్సి అనిపిస్తుంది.

---

ఆమె: కల కల విరిసి జగాలె పులకించెనే ||కలకల||
అతడు: వలపులు కురిసి సుఖాలే చిలికించెనే ||కలకల||
ఆమె: అలరుల తోటా అందాల బాటా
హాయిగ పాడే కోయిల పాట కోయిలపాట
అతడు: తెలియని కోరికలేవో కలిగించెనే ||కలకల||
ఆమె: చల్లని గాలీ మెల్లగ వీచే
హృదయము దూసే మనసే దోచే మనసే దోచే
అతడు: మనసులు నిండి ప్రణయాలే చెలరేగెనే ||కలకల||
అతడు: చెలి చూపులలో అనురాగాలూ
నిజమేనా అని అనుమానాలూ అనుమానాలు
ఆమె: సందేహాలేలా హృదయాలే మన సాక్షులు ||కలకల||

ఈ పాటను ఘంటసాల, సుశీల ఆలపించారు. రమణమూర్తి, మాలిని అభినయించారు. 'బడాభాయ్' చిత్రంలోని 'చోరి చోరి దిల్‌కా లగా నా బురీ బాత్ హై' పాటకు 'కలకల విరిసే' పాట యథాతథంగా అనుసరణ. మధ్యమావతి రాగాన్ని ఆధారంగా చేసుకుని స్వరపరిచిన ఈ 'చోరిచోరి దిల్‌కా' పాట వింటుంటే 'మాంగల్యబలం' చిత్రంలో 'ఆకాశవీధిలో అందాలజాబిలి' పాటను ఈ పాటలోంచే తీసుకున్నారని మ్యూజిక్ ఇయర్ లేని వారికి కూడా తెలిసిపోతుంది. ఆ 'ఆకాశవీధిలో అందాల జాబిలి' పాటకి గాని ఈ 'కలకల విరిసే జగాలే పులకించెనే' పాటకి గాని సాహిత్యాన్ని సమకూర్చింది శ్రీశ్రీయే అన్న విషయాన్ని ఇక్కడ ఓ విశేషంగా చెప్పుకోక తప్పదు మరి.

ఈ సందర్భంగా నాషాద్ అనే ఓ స్వరకర్త గురించి ప్రస్తావించి తీరాలి. నాషాద్ అంటే నౌషాద్ అని పొరబడే వాళ్ళు ఎంతో మంది ఉన్నారు. 'బరాదరి' చిత్రంలో తలత్ మొహమ్మద్ పాడిన 'తస్ వీర్ బనాథా హు తక్ ధీర్ నహీ బన్ తీ' పాటను ఇప్పటికీ మరిచిపోలేని వారు ఎంత మంది ఉన్నారో ఆ పాటను స్వరపరిచిన నాషాద్ గురించి తెలియని వాళ్ళు కూడా అంతకు మించే ఉన్నారు. 'బరాదరి' (1955) చిత్రానికి సంగీతాన్నిచ్చిన నాషాద్ 'బడాభాయ్' చిత్రానికి కూడా స్వరరచన చేశారు. నగ్మా(1953) చిత్రానికి కూడా నాషాదే సంగీత దర్శకత్వం వహించారు. చక్కటి సంగీతాన్ని ఇచ్చే నాషాద్ బాలీవుడ్‌లో ఇమడలేక 1970లో పాకిస్తాన్‌కు వెళ్ళిపోయి, అక్కడే మనుగడ సాగిస్తూ, 31.01.1981న మరణించారని ఆయన్ని అభిమానించే ఆప్తులు సేకరించిన సమాచారంలో ఉంది.



# ఆ పాత పాట మధురం

## రాజా



## మనోరమ

**తెలుగువాడిగా పుట్టి చిన్నతనంలోనే** బొంబాయి వెళ్ళిపోయి తన పదహారవ ఏటనే మంచి పాటల్ని కంపోజ్ చేసిన ఒక సంగీత దర్శకుడితో తమ చిత్రానికి మ్యూజిక్ చేయిద్దామనుకున్నారు - అప్పటికే చక్కటి పేరు సంపాదించుకున్న కొందరు నిర్మాతలు. ఆ సంగీత దర్శకుడు 'అలాగే' అన్న తర్వాత ఓ అగ్ర కథానాయకుడితో ఒప్పందం కూడా జరిగింది. ఫలానా గాయకుడే తనకు పాడితీరాలని పట్టుబట్టాడా అగ్రకథానాయకుడు. ఆ గాయకుడు తనతో పాడడానికి ఓ గాయని పేరును ప్రత్యేకంగా సూచించారు. ఈ ఆంక్షలు చూసేసరికి ఆ సంగీత దర్శకుడికి చిర్రెత్తుకొచ్చింది. నేను చెయ్యనన్నాడు. నిర్మాతలు చిత్రం పూర్తిచేశారు. మొదట వారనుకున్న ఆ అగ్రకథానాయకుడులేడు. ఆ నాయకుడు కోరుకున్న గాయకుడు, ఆ గాయకుడు సూచించిన గాయని లేరు. సంగీత దర్శకుడిని మాత్రం ఒదులుకోలేదు ఆ నిర్మాతలు. ఆ సంగీత దర్శకుడు ఈ సంఘటనను ఓ సవాలుగా తీసుకుని బొంబాయి నుంచి ఓ గాయకుణ్ణి తీసుకువచ్చి తెలుగు పాటలు పాడించి అన్నిటినీ హిట్ చేశాడు.

ఆ సంగీత దర్శకుడు రమేష్ నాయుడు. ఆ గాయకుడు తలత్ మహమ్మద్. ఆ చిత్రం పేరు మనోరమ. ఈ చిత్రం 1959లో విడుదలైంది. ఇందులో తలత్ మహమ్మద్ పాడిన మూడు పాటలతో పాటు సుశీల పాడిన మరో పాట కూడా హిట్ అయ్యింది. సముద్రాల జూనియర్ రాసిన ఆ నాలుగు పాటలు ఇవి:

అందాల సీమా సుధానిలయం
ఈ లోకమే దివ్య ప్రేమమయం ||అందాల||
వలపేమో తెలియకా తెలవారు బ్రతుకేలా
తొలినాటి ప్రేమలూ ఫలమైన కలయైనా
మాయని గాయమై మిగిలినా అది నయం
మాయని గాయమై మిగిలినా అది నయం ||అందాల||
అందాల వెలుగులా అలరారు ఆనందం
అలరించు సొగసులా ఆనందమున తేలే
తీయని అనుభవం దేవుని పరిచయం
తీయని అనుభవం దేవుని పరిచయం ||అందాల||

ఈ పాట తలత్ మహమ్మద్ సోలో సాంగ్. హీరో బాలయ్య మీద చిత్రీకరించారు. తలత్ మహమ్మద్ పాడిన తెలుగు పాట ఏదంటే ఎవరికైనా సరే ఠక్కున స్ఫురించే గీతం ఇదే ఈ పాట వింటుంటే కొత్త తెలుగు గాయకుడు పాడేడనుకుంటాం గాని ఉత్తరాదికి చెందిన తెలుగురాని, గాయకుడనుకోలేం. అంత బాగా పాడించుకున్నారు రమేష్ నాయుడు. ఉత్తరాది గాయకులతో పాడించడం ఓ క్రేజ్‌గా ఫీలవుతున్న ప్రతివారూ ఈ పాటని విని తెలుగుభాషకు మనం ఇస్తున్న గౌరవం పట్ల ఓసారి ఆత్మ విమర్శ చేసుకుంటే బావుంటుంది. సంగీత పరంగా ప్రతి మధ్యమ స్వరాలే ఎక్కువగా వినిపిస్తాయి ఈ పాటలో.

---

అ: మరచిపోయేవేమో మాయని బాసలూ
మనవిదే ఓ సఖీ
ఆ: మరచిపోరాదోయి చేసిన బాసలూ
ఆశలు మూసినా
అ: వెలిగేను నీ కులుకే నా కన్నుదోయి
వెలిగేను నా మదిలో నీ చెలిమి హాయి
వెలుగొందు ఆ తారలాగా
మాయని బాసలు మనవిదే ఓ సఖీ ||మరచి||
ఆ: విరబూసె ఈ పూవూ నీ పూజ కొరకే
విరిసేవు..దూరముగా పసివాడునోయి
నీదాన ఏనాటికైనా
మాయని బాసలూ మనవిదే ఓ సఖా ||మరచి||

ఈ పాటను తలత్ మహమ్మద్, సుశీల పాడారు. బాలయ్య, కృష్ణకుమారి అభినయించారు. లలితగీతం అంటే ఎలా ఉండాలి? అసలు లలితగీతం యొక్క నిజమైన నిర్వచనం ఏమిటి? ట్యూన్ బాగుంటే చాలుకదా... సాహిత్యానికి జీవం పోస్తూ ట్యూన్ చేయడమంటే ఏమిటి? లాంటి వితండవాదాలకి ఎదురుగా ఈ పాటను నిలబెడితే చాలు - సమాధానం వేరేగా చెప్పనవసరంలేదు. ముఖ్యంగా 'విసిరేవు దూరముగా' దగ్గర 'నిజంగా వదులుకునేవు సుమా' అన్నట్టుగా ఓ రకమైన పాజ్ ఇస్తూ పాడించిన పద్ధతిని తలచుకుంటే రమేష్ నాయుడు నిజంగా కీర్తిశేషుడే అనిపిస్తుంది. చక్కని 'కార్డ్ కంపోజిషన్'గా చెప్పుకోదగ్గ ఈ పాట శంకరాభరణం స్వరాలను స్పృశిస్తున్నా హిందుస్తాని రాగం 'అలయ్యా బిలావల్'కి దగ్గరగా ఉందని చెప్పాలి.

---

గతిలేని వాణ్ణి గుడ్డివాణ్ణి బాబయా
గంజి కొొక్క ధర్మ మెయ్యి బాబయా ||గతి||
ప్రేమ తోడ లోకమేలు దేవుడూ
మా మొగాన మరణమైన రాయుడూ
మా మొగాన మరణమైన రాయుడూ
చావలేము బ్రతకలేము బాబయా
గంజి కొొక్క ధర్మ మెయ్యి బాబయా ||గతి||
ఆకలి చికాకు తోడ వేగుతూ ||2||
చీకటి జగాన బ్రతుకు జీవులం
చీదరించుకోకు బాబు నీదయా
గంజి కొొక్క ధర్మ మెయ్యి బాబయా ||గతి||

ఈ పాటను తలత్ మహమ్మద్, సుశీల పాడారు. తన నటనతో ప్రేక్షకుల చేతిరుమాళ్ళను తడిపేసే నటుడు పెరుమాళ్ళు ఈ పాటలో ప్రధాన పాత్రధారి. సింధుభైరవి రాగచ్ఛాయలలో సంచరించే ఈ గీతం ఆర్ద్రతకు అద్దం పడుతూ, అర్థం చెబుతూ ఒకసారి వింటే వెంటాడే విధంగా నిలిచిపోతుంది. ముఖ్యంగా 'ప్రేమతోడ లోకమేలు దేముడూ, మా మొగాన మరణమైన రాయుడు' అనే వాక్యాల ద్వారా 'మెర్సీ కిల్లింగ్' అనే పదాన్ని కవితా రూపంలో చెప్పిన తీరుకి, దానికి రమేష్ నాయుడు జతచేసిన ట్యూన్‌కి మనసు మారుమూలల నుండి కలుక్కుమంటుంది.

---

చందమామ రావే జాబిల్లిరావే
కొండెక్కి రావే గోగుపూలు తేవే ||చంద||
వెండిగిన్నెలో వేడి బువ్వతేవే
పైడి గిన్నెలో పాల బువ్వతేవే ||వెండి||
అందాల పాపకు అందించిపోవే
తెల్లమబ్బుల తేరు మీదరావే ||తెల్ల||
పాలవెన్నెల పానకాలు తేవే
అందాల పాపకు అందించిపోవే ||చంద||

'చందమామ రావే జాబిల్లి రావే' పాటను సుశీల పాడగా హీరోయిన్ కృష్ణకుమారి అభినయించింది. ఈ సన్నివేశంలో ఆమె ఎత్తుకుని లాలించిన చిన్ని కుర్రాడు నటుడు ఎం.బాలయ్య కుమారుడు తులసీరాం. తర్వాత రోజుల్లో ఈ తులసీరాం మనకు 'పసుపుతాడు' 'శ్రీమతి ఒక బహుమతి', 'ఇల్లు - ఇల్లాలు - పిల్లలు' చిత్రాలలో నటుడిగా కనిపించాడు కూడా. ఆంధ్రదేశంలో ప్రతిమాతృమూర్తి పాడుకునే 'చందమామ రావే జాబిల్లిరావే' పాటకు మూలం అన్నమయ్య గీతమని చాలామందికి తెలియదు. 15వ

శతాబ్దానికి చెందిన పదకవితా పితామహుడు అన్నమాచార్య రాసిన ‘చందమామ రావొ జాబిల్లీ రావొ మంచి కుందనపు పైడికోర వెన్నపాలు తేవొ‘ అనే గీతం ఎన్నో సినీగీతాలకు ప్రేరణగా నిలిచింది. 1941లో వచ్చిన ‘దేవత‘ చిత్రంలో సీనియర్ సముద్రాల రాసిన ‘వెండి కంచాలలో పాలబువ్వందోయ్ పమిడి కంచాలలో పాలబువ్వందోయ్ తిందాము రావోయి జాబిల్లీ ఆడుకుందాము రావోయి తేవోయ్‘ అనే వాక్యాలు ఈ చందమామ రావే పాటలో మరో రూపంలో చోటు చేసుకోవడం గమనార్హం. కాకపోతే ఆ పాట రాసింది సీనియర్ అయితే ఈ పాట రాసింది జూనియర్. ఇక రాగప్రధానంగా ఆలోచిస్తే అనుకుని చేస్తే తప్ప ఒక రాగానికి కట్టుబడి చేసే స్వభావం కాదు రమేష్ నాయుడిది. ఈ పాట వరకు చూసుకుంటే శుద్ధదైవతం సాధారణ గాంధారం వంటి అన్యస్వరాలు పడుతున్నా ఎక్కువగా హరికాంభోజి రాగచ్ఛాయలలోనే ఈ పాట సంచరించిందని చెప్పవచ్చు.

తలత్ మహమ్మద్ తెలుగు పాటలు పాడిన చారిత్రక అంశాన్ని దృష్టిలో ఉంచుకుని పై పాటలు దొరికితే భద్రపరిచి మరింత ప్రాచుర్యం కల్పించవలసిన అవసరం ప్రతి సంగీతాభిమానికీ ఉంది. ఆ మధ్య హెచ్.ఎం.వివారు విడుదల చేసిన ‘తెలుగుపాట - హిందీనోట‘ అనే క్యాసెట్‌లో పైన పేర్కొన్న మొదటి మూడు పాటలు చోటు చేసుకోవటం ఓ రకంగా అదృష్టమే!



# ఆ పాత పాట మధురం

## రాజా



## చెంచులక్ష్మి

**కొన్నాళ్ళ క్రితం పాటలకొక అస్థిత్వం ఉండేదని చెపితే** - ఈనాటి తెలుగు సినీగీతాల స్వరూప స్వభావాలకు అలవాటు పడిపోయిన వారికి చాలా విచిత్రంగానే ఉంటుంది. సినిమా పేరు వినగానే పాట, పాట పల్లవి చెప్పగానే సినిమాలో సన్నివేశం గుర్తొచ్చేటంతటి పరస్పరాశ్రయ సంపూర్ణ సంబధ బాంధవ్యాలుండేవి అప్పట్లో..

తను సంగీత దర్శకత్వం వహించిన ప్రతి సినిమాలోనూ ఉన్న అన్ని పాటలూ ప్రామాణిక గీతాలుగా రూపొందేట్లు వరుసలు కూర్చే సంగీత దర్శకుడు ఎస్.రాజేశ్వరరావు. ఈ రికార్డును చాలా ఎక్కువ కాలం నిలుపుకున్న ఆయన స్వరపరచిన మరో సంగీత భరిత చిత్రం చెంచులక్ష్మి. 1958లో విడుదలైన ఈ చిత్రానికి దర్శకుడు బి.ఎ సుబ్బారావి. అటు పౌరాణికం మీదా, ఇటు జానపదం మీదా ఆయనకు మంచి పట్టు ఉండేది. అందుకే 'చెంచులక్ష్మి' చి త్రంలోనూ, పాటలలోనూ ఆ రెండు ధోరణులూ కనిపిస్తాయి. చెంచులక్ష్మి చిత్రంలోని పాటలను సముద్రాల, సదాశివబ్రహ్మం, ఆరుద్ర, కొసరాజు రాశారు. కథతో పాటలకు 'రాగస్వామ్యం' ఉన్న రోజుల్లోనే వచ్చిన బి.ఏ.యస్ వారి 'చెంచులక్ష్మి'...

నీలగగన ఘనశ్యామా! ఘనశ్యామా దేవా
నీల గగన ఘనశ్యామా!
హాని కలిగితే - అవతారాలను
పూని, బ్రోచునదీ - నీవేకావా ||నీలగగన||
చదువులు హరించి - అసురం డేగిన
జలచరమైతివి - ఆగమరూపా
వేద నిధులనే - విధాత కొసగిన
ఆదిదేవుడవు - నీవే కావా ||నీలగగన||

కడలి మధించగ - కదిలే నగమును
వెడలి కూర్మమై - వీపున మోసి
అతివ రూపమున - అమృతము గాచిన
ఆదిదేవుడవు నీవే కావా ||నీలగగన||
సుజనుల కోసము - ఎపుడే వేషము
ధరియించెదవో - తెలియగ నేరము ||సుజనుల||
పెండ్లి కొడుకువై - వెడలినాడవు
ఎందులకొరకో - హే జగదీశా ||నీలగగన||

ఆరుద్ర రాసిన ఈ పాటను ఘంటసాల పాడగా నారద పాత్రధారి రేలంగి అభినయించారు చెంచులక్ష్మి కథను నరసింహావతారానికి అనుగుణంగా మలచుకున్న తీరుకి వెన్నుదన్నుగా నిలిచే విధంగా రాయబడిన పాట ఇది. శ్రీ మహావిష్ణువు నృసింహావతారాన్ని దాల్చి హిరణ్య కశిపుని సంహరించిన తరువాత ఆ ఉగ్రరూపంలోని రౌద్రాన్ని ఉపశమింపజేయడానికి లక్ష్మీ కళలున్న ఓ

స్త్రీ మూర్తి కావాలి. ఆ లక్ష్మీ కళలు శ్రీ మహాలక్ష్మివే అయితే!? మహాలక్ష్మికి తల్లిదండ్రులైన సముద్రరాజు దంపతులకు ఈ లక్ష్మీ కళలున్న స్త్రీ మూర్తి కూడా జన్మిస్తే? అలా జనించడానికి ఆ సముద్రరాజు దంపతులకు ఓ శాపం, ఈ లక్ష్మిదేవికి తనలోని కళారూపాన్ని వేరుగా ఉంచవలసిన పరిస్థితి. వీటికి ఓ కథ. ఆ కథకు ఒక నాంది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని చూస్తే ఈ పాటను ఆరుద్ర ఎంత అర్థవంతంగా రాశారో అర్థమవుతుంది. దొరికితే చెంచులక్ష్మి సీడీని సంపాదించి మొత్తం సినిమాను చూసి - రివైండ్ చేసుకుని ప్రారంభంలో వచ్చే ఈ పాటను మళ్ళీ వింటూ చూస్తే పాట సాహిత్యంలో కవి హృదయం స్పష్టంగా గోచరిస్తుంది. ఈ పాటకు బేహార్ రాగం ఆధారం. ఈ సందర్భంగా మరో విశేషాన్నిక్కడ ప్రస్తావించుకోవలసిన అవసరం ఉంది. అది ఈ చిత్రం విడుదలయిన తొమ్మిదేళ్ళకి చెంచులక్ష్మి ఉదంతం లేకుండా కేవలం ప్రహ్లాద చరిత్ర వరకు తీసుకుని నిర్మించబడిన 'భక్తప్రహ్లాద' (ఏవియం వారిది) సినిమాలో నారదుడు పాడే.. వరమొసగే వనమాలీ నా వాంఛితమ్ము నెరవేరెనుగా.. అనే పాటకి యస్. రాజేశ్వరరావు తిరిగి బేహాగ్ రాగాన్నే ఉపయోగించటమే!

---

ఆనందమాయె అలివేణి ||2||
అరుదెంచినావా అందాల దేవి ||ఆనంద||
అనువైన వేళ అనురాగశోభ
హరిప్రేమ పూజ నా భాగ్యమాయె
అలనాటి నోము కలనేడు పండె
అరుదైన హాయి నాలోన నిండె
ఆనందమాయె అసమాన తేజా
అపురూపమైనా అందాల దేవా ||ఆనంద||

సొగసైన రూపె సోలించు చూపె
సగమైన కనుల సంతోషమిడులే
నగుమోము పైన నడయాడు కళలే
అగుపించగానే మగువను నాలో ||ఆనంద||
ఎనలేని స్వామి నిను చేరబోతే
నునులేత ప్రేమ ననుసాగ నీదే
తనువేమో నీకై తపియించు నిలిచి
మనసేమో నీలో మునుపె కలిసే ||ఆనంద||

ఈ పాటను ఘంటసాల, జిక్కి గానం చేశారు. అక్కినేని, అంజలీదేవి అభినయించారు. జయజయావంతి రాగాన్ని ఆధారంగా చేసుకుని మలచిన ఈ పాటలోగల ఆలాపనలు, గమకాలు అన్నీ మంద్రంలోనూ, మధ్యమంలోనూ ఉండడం, అవన్నీ రక్తికట్టేలా ఉండడం.. ప్రత్యేకంగా చెప్పుకోవాలి. గాత్రంపై గాయకునికి ఉండవలసిన సమన్వయ లక్షణాన్ని సాధించడానికి ఏం చేయాలో ఈ పాట సాధన చేస్తే అవగతమవుతుంది. పాటకు ముందు వచ్చే ఆలాపన, సొగసైన రూపె అనే చరణం అందుకు సాక్ష్యంగా నిలుస్తాయి. ఇదే జయజయవంతి రాగంలో రాజేశ్వరరావు స్వరపరిచిన మరొక పాట 'డాక్టర్ చక్రవర్తి'లోని 'మనసున మనసై', ఈ 'ఆనందమాయ్ అలినీలవేణి' పాటలోని 'సొగసైన రూపె' అనే చరణం మొదలవడానికి ముందు వచ్చే ఇంటర్ లూడ్‌ని బాగా మనసుకి పట్టించేసుకుని ఆలాపించుకుంటూ పోతే 'మనసున మనసై' పాటకి మన మనసు చేరుకుంటుంది. ఈ 'మనసున మనసై' పాటలో 'చెలిమియె కరువై' అనే చరణానికి ముందు వచ్చే ఇంటర్ లూడ్‌ని గమనిస్తే 'ఇది - ఆనందమాయే అలినీలవేణి - పాటకు కూడా అమరుతుంది కదా' అని అనిపిస్తుంది. ఈ అనుభూతులన్నిటికీ ప్రధాన కారణం రెండు పాటలూ ఒకే రాగంపై ఆధారపడినవి కావడమే! ఇక సాహిత్యపరంగా చూసుకుంటే పోలించు చూపు, ఎనలేని స్వామి వంటి పదప్రయోగాలు గమనించతగ్గవి. ఈ పాటకు రచన ఆరుద్ర.

"ఈ పాటకి సంబంధించి ఇంకో విశేషం ఉంది. చెంచులక్ష్మి సినిమాని మొదట అక్కినేని, భానుమతి కాంబినేషన్‌లో తీద్దామనుకున్నారు. ఈ 'ఆనందమాయే అలి నీలవేణీ' పాటని వాళ్ళిద్దరి మీదా చిత్రీకరించారు కూడా. తర్వాత ఏం జరిగిందో ఏమో

గానీ భానుమతి ఆ చిత్రం నుండి తప్పుకున్నారు. ఈ రోజుల్లోలాగా ప్రతి విషయానికీ పత్రికలకెక్కే సంస్కృతి ఆ రోజుల్లో లేదు కనుక కారణాలు ఈనాటికీ బైటికి రాలేదు. (అక్కినేని వారితో మా టీవీ కోసం 'గుర్తుకొస్తున్నాయి' టెలీ సీరియల్ 74 ఎపిసోడ్‌లు చేశాను కనుక ఆ అనుబంధంతో వారిని కూడా అడిగాను. "అది వారికి సంబందించిన విషయం. నా పని యాక్ట్ చెయ్యడం వరకే. ఇలాటి వాటిలో నేను కల్పించుకోను" అని అన్నారాయన).

ఈ చిత్ర నిర్మాత, దర్శకుడు బి.ఏ.సుబ్బారావుగారికి అంజలీదేవి, ఆదినారాయణరావు దంపతులతో 'పల్లెటూరి పిల్ల' సినిమా నుంచి మంచి రిలేషన్స్ ఉండడంతో హీరోయిన్‌గా అంజలీదేవి ఈ చిత్రంలో ప్రవేశించారు.





అంజలీదేవితో చిత్రీకరించిన ఆనందమాయే అలినీలవేణి పాటలోని స్టిల్

ఈ ఎపిసోడ్‌కి మరో ఉపకథ ఏమిటంటే జగపతి వారి 'అంతస్తులు' సినిమాలో భానుమతి నటించారు. ఆ చిత్రంలోని 'దులపర బుల్లోడా' పాట చిత్రీకరణకి ముందు రోజు రాత్రి ఆవిడ రూములోకి ఓ ఎలుక దూరి భానుమతిగారి కాలు కొరికింది. అయినా మర్నాడు అదేమీ లెక్క చేయకుండా ఆ పాటలో ఆవిడ నటించారు. ఆ తర్వాత కాలికి కట్టు కట్టుకుంటూ ఉంటే 'అదేమిటి?' అని అడిగిన వారితో "నిన్న రాత్రి ఓ చుంచులక్ష్మి నాకాలు కొరికింది" అన్నారు కారణాలు బైటికి తెలియని ఆనాటి సంఘటనను గుర్తుపెట్టుకుని. (ఎలుకను చుంచు అని అంటారని వేరే చెప్పక్కర్లేదనుకుంటా). కారణాలు బైటికి రాకపోయినా 'చెంచులక్ష్మి'లో భానుమతి, అక్కినేని నటించిన 'ఆనందమాయే అలినీలవేణీ' పాటకు సంబందించిన స్టిల్ మాత్రం బైటకి వచ్చేసింది. అది ఇదే

---

చిన్న చెంచులక్ష్మి: చెయ్యి చెయ్యి కలుపుదాం ||2|| - చిందులేసి కులుకుదాం
చిట్టిపొట్టి పిల్లలార - చుట్టీ చుట్టీ తిరుగుదాం
బృందం: చెయ్యి చెయ్యి కలుపుదాం ||2|| - చిందులేసి కులుకుదాం
చిట్టిపొట్టి పిల్లలార - చుట్టీ చుట్టీ తిరుగుదాం
చెంచులక్ష్మి: ఓ..
అల్లిబిల్లిలాడదాం - అంగలేసి దూకుదాం
గున్నమావి చెట్టునీడ - గుంపు గూడదాం
బృందం: గుంపుగూడదాం. ||చెయ్యి చెయ్యి||
పెద్ద చెంచులక్ష్మి: దాగుడు మూతాటంట సాగిరండమ్మా
పిల్లివచ్చె ఎలుక హూత్ - చూడండమ్మా!
పైన పోయె చిలుకలూ ||2|| పావురాయి జంటలూ
మీకు మాకు దీటైన - వాట పందలూ.
బృందం: మనకు వాట పందాలూ చెయ్యి చెయ్యి
చెంచులక్ష్మి: చిక్కు చిక్కు చెమ్మచెక్క చేరరండమ్మా ||2||
చారడేసి మొగ్గలంట - ఏరండమ్మా
వయ్యారి జాణలు ||2|| - వగలాడి చానలు
ఓడిపోతె మీకంత - ఆరుగుంజిళ్ళూ ||చెయ్యి చెయ్యి||

జిక్కి ప్రధాన గాయనిగా సాగే ఈపాటకి అంజలీదేవి ముఖ్య నటి, వాట పందాలు, చిక్కు చిక్కు చెమ్మచెక్కలాంటి పదప్రయోగాలు ఈపాట రచన కొసరాజు అని చెప్పకనే చెబుతాయి. ఈ పాటలో చెంచులక్ష్మి కౌమార ప్రాయం నుండి యవ్వన దశకు వచ్చినట్టుగా చూపిస్తారు. అలా మారినట్టు చూపించడానికి చెట్టు వెనక్కి కుడివైపు నుండి చిన్న చెంచులక్ష్మి వెళ్ళడం, చెట్టుకి ఎడం వైపు

నుంచి పెద్ద చెంచులక్ష్మి రావడం.. అలా వచ్చిన వెంటనే మొదలైన ఓ చిన్న ఆలాపన ఇవన్నీ శాంతారాం నిర్మించిన 'నవరంగ్' సినిమాలో 'అరెజారెహాసీ' అనే పాటలో హీరోయిన్ సంధ్య చెట్టు వెనకకి వెళ్ళి అటు మగవేషంతో వచ్చి ఇటు తిరిగి స్త్రీగా రావటం ... ఆ పాటలోని ఆలాపనను గుర్తుకు తెస్తాయి. నిజానికి చెంచులక్ష్మి 1958లోనూ నవరంగ్ 1959లోనూ విడుదలయ్యాయి. రెప్పపాటు కాలంలో మిస్సయిపోయే ఈ పోలిక ఎలా సంభవించింది?! మేధావుల ఆలోచనా ధోరణి ఒకేలా ఉండడానికి ఆస్కారం ఉందనుకోవచ్చా? అప్పటి రోజుల్లోని కొంతమంది పరిశీలకులు మాత్రమే వీటికి సరియైన సమాధానం

---

పాలకడలిపై శేషతల్పమున
పవళించేవా దేవా
పాలకడలిపై శేషతల్పమున
పవళించేవా దేవా
బాలుని నను దయపాలించుటకై
కనుపించేవ మహానుభావా
బాలుని నను దయపాలించుటకై
కనిపించేవ మహానుభావా ||పాల||

అలకలు అల్లలనాడుచు ముసరగ ||అల||
నెలనవ్వులు తుకించే మోము ||నెల||
తెలికన్నుల కరుణారస సృష్టి ||తెలి||
తిలకించిన మై పులకించే స్వామి ||పాల||
ఆదిలక్ష్మి నీ పాదములొత్తగ
వేద మంత్రములు విరించి చదువు ||ఆది||
నారదాది ముని ముఖ్యులు చేరి.. ||నార||
మోదమలర నిను గానము సేయగ ||పాల||

'పాలకడలిపై శేషతల్పమున' పాట యమన్ రాగానికి చక్కని ఉదాహరణ. యమన్ రాగంలో రాజేశ్వరరావుకి ఒక ప్రత్యేకమైన ముద్ర ఉంది. ఆ ముద్రను స్పష్టంగా పట్టి ఇచ్చే పాట ఇది. సుశీల హిట్స్‌లో ముందు వరుసలో ఉంచదగ్గ ఈ పాటను - తన చిన్నతనంలో ఎప్పుడూ పాడేవాడినని, తన కంఠాన్ని తాను ఓ టేప్‌రికార్డర్‌లో మొదటిసారిగా విన్నది ఈ పాటతోనేనని ఎస్పీ.బాలసుబ్రహ్మణ్యం చాలా సభలలో చెప్పేవారు. అంతేకాదు అనుపల్లవిలో 'బాలునినను దయ పాలించుటకై' అనే వాక్యాన్ని తనకు అన్వయించుకుంటూ సుశీలను, ఎస్ రాజేశ్వరరావును కీర్తించేవారు. సుశీల ప్రాణ ప్రతిష్ఠ చేసి పాడిన ఈ పాటలో 'ఆదిలక్ష్మి నీ పాదములొత్తగ' దగ్గర ఆమె చూపిన గళ విన్యాసం మరపురానిది. తులకించే మోము, తెలికన్నుల కరుణారస వృష్టి, మై పులకించే స్వామి వంటి వాక్యాలు సాహిత్యపరంగా మన పదసంపదను చూసి మురిసిపోదగ్గవి. ఈ పాటకు రచన సదాశివబ్రహ్మం. జాతీయ స్థాయిలో నటిగా గుర్తింపు పొందిన నటి రేఖ తల్లి పుష్పవల్లి ఈ చిత్రంలో లీలావతి పాత్ర ధరించింది. ఆమె కుమారుడు బాబ్జీ ఈ చిత్రంలో ప్రహ్లాదుని పాత్రను ధరించాడు. ఈ పాటకు అభినయం అతనిదే!

---

శ్రీనాధుని పద సరసిజ భజనే
ఈ నర జన్మము కనినా ఫలం
ఈ నర జన్మము కనినా ఫలం ||శ్రీనాధుని||
నారాయణుని నామ స్మరణయె
నారాయణుని నామ స్మరణయె
మాయని తీయని విద్యాఫలం

నారాయణా యని నోరారా పిలువా
నారాయణా యని నోరారా పిలువా
కనుదోయి వెలసి ఆడేను కలసి
కనుదోయి వెలసి ఆడేను కలసి
శ్రీహరికి సరి దైవమిక లేరు
మన తల్లిదండ్రి గురువమ్మ
దైవమ్ము హరియే ||శ్రీనాధుని||
నారాయణా హరినారాయణా

సుశీల పాడిన ఈ పాటను ప్రహ్లాద పాత్రధారి బాబ్జీ, సహచర శిష్య బృందంగా నటించిన కొందరు ఉపపాత్రధారులైన బాలురు అభినయించారు. సింధు భైరవి రాగం గురించి తెలుసుకోవాలన్నా, ఆ రాగాన్ని జీవస్వరాలతో సహా స్వంతం చేసుకోవాలన్నా ఈ పాటను సాధన చేస్తే చాలు. పి.సుశీల అనర్గళ గళం అప్రతిహతంగా కొన్ని దశాబ్దాల పాటు కొనసాగడానికి కారణం ఒక విధంగా చెంచులక్ష్మి వంటి చిత్రాలలోని పాటలు, పద్యాలే..! ఆ విషయాన్ని నిరూపించే పాటలలో ఇదొకటి.

చెంచులక్ష్మిలోని పాటలు, పద్యాలు ఎన్నిసార్లు విన్నా, ఎంత ఆస్వాదించినా, ఎంత మందితో పంచుకున్నా ఇంకా ఎంతో కొంత మిగిలిపోయి ఉందేమోనని అనిపిస్తూ ఉంటుంది. అందుకే ఆ చిత్రంలోని మరికొన్ని పాటలు, పద్యాలు గురించి వచ్చే నెలలో.



# ఆ పాత పాట మధురం

## రాజా



## చెంచులక్ష్మి - 2

స్వరపరిచిన ప్రతిపాటా, ప్రతిపద్యం, ప్రతి స్వర ఖండికా వీనుల విందుగా ఉండడమే కాకుండా తర్వాతి తరంవారికి సగర్వంగా చెప్పుకోగలిగిన ప్రమాణాలతో కూడిన చిత్రాలు కొన్ని వచ్చాయి అటువంటి వాటిలో బి.ఎ.ఎస్ ప్రొడక్షన్స్ వారి చెంచులక్ష్మి ఒకటి. 1958లో విదుదలయిన ఈ చిత్రంలోని అయిదుపాటల గురించి.

..

కనలేరా కమలా కాంతుని
అదిగో కనలేరా భక్తపరిపాలుని
ఇదిగో కనలేరా శంఖు చక్రధారిని
నారాయణా హరి నారాయణా
శ్రీమన్నారాయణా లక్ష్మీనారాయణా
నారాయణా హరి నారాయణా
శ్రీమన్నారాయణా లక్ష్మీనారాయణా

దీనావన నీ దివ్య స్వరూపము
మూర్ఖులు మదిలో కనగలరా ||దీనా నారాయణా||
పాపాత్ములు నిను పరికింపరుగా ||పాపా||
నీపై కోపం, వైరము పూని
హే పరమేశా.. హే పరమేశా
ఎటు చూచిన నీ రూపమేకాదా లోకేశా ||నారాయణా||

సదా శివబ్రహ్మం రాసిన ఈ పాటను పి.సుశీల పాడగా మాష్టర్ బాబ్జీ అభినయించాడు. ప్రహ్లాదుని గురువులైన చండామార్కుల పాత్రలను ధరించిన వంగర వెంకట సుబ్బయ్య, ఎ.యల్.నారాయణ, మహా విష్ణువు పాత్రధారి అక్కినేని నాగేశ్వరరావు కూడా ఈ పాట అభినయంలో పాలుపంచుకుంటారు. హిందోళ రాగంలో స్వరపరచబడిన ఈ పాట కూడా సుశీల జీవం పోసి పాడిన పాటలలో ఒకటిగా చెప్పుకుని తీరాలి. ఈ పాటను తాదాత్మ్యంతో ఆలపించుకుంటూ పోతే చాలా చోట్ల కనులు చెమరుస్తాయి. ఆ అనుభూతికి యస్.రాజేశ్వరరావు, సుశీల ఎంత కారణమో ఈ పాటను ఒక్కసారి వింటే చాలు తెలిసిపోతుంది.

హే దేవా! దివ్యప్రభావా!
పావనా - భక్త జనావనా
సేవింతును - నీ పాదాబ్దములే..
ఎంత దయామతివయ్యా - అనంతా!
సంతతమూ నిను స్మరించు వారికి ||2||
చింతా? నంతా కమలాకాంతా ||ఎంత||
దయామతివయ్యా
నారాయణా అని ఒకమారైనా
నోరారాగ నీ నామము తలచిన || నారా||
ఘోర దురితములు - దూరము చేసి
దయసేయుదువట! ||ఎంత దయామతివయ్యా||

మహారాష్ట్ర సంగీత సంప్రదాయాన్ని గుర్తుచేస్తూ మాండ్ రాగంలో సాగిన ఈ పాటకు రచన సదాశివబ్రహ్మం, గానం పి.సుశీల, అభినయం మాస్టర్ బాబ్జీ తదితరులు. మాండ్ రాగం ఆధారంగా ఎన్నోపాటలు ఉండవచ్చు. కానీ ఈ పాటను ఒకసారి హృదయానికి పట్టించుకునే ఆ రాగం ఎప్పుడు ఏ రూపంలో వినిపించినా వెంటనే పోల్చుకునే శక్తి వచ్చేస్తుంది. ఈపాటలో 'నారాయణ యని ఒకమారైనా' అనే చరణం వింటుంటే కలిగే రసస్పర్శను అనువదించడానికి అక్షరాలు తూగవు. అంతటి రసస్పందన కలగడానికి రాజేశ్వరరావు, సుశీల కారణం.

---

చెట్టులెక్కగలవా ఓ నరహరి
పుట్టలెక్కగలవా
చెట్టులెక్కి ఆ చిటారుకొమ్మల
చిగురు కోయగలవా
ఓ నరహరి చిగురు కోయగలవా
చెట్టులెక్కగలనే ఓ చెంచిత పుట్టలెక్కగలనే
చెట్టులెక్కి ఆ చిటారు కొమ్మల
చిగురు కోయగలనే ఓ చెంచిత
చిగురు కోయగలనే
ఉరకలేయగలవా ఓ నరహరి
పరుగులెత్తగలవా ||ఉరక||
ఊడ పట్టుకుని జారుడు బండకు
ఊగి చేరగలవా
ఉరకలేయగలనే ఓ చెంచిత
పరుగులెత్తగలనే
ఊడపట్టుకుని జారుడు బండకు
ఊగి చేరగలనే ఓ చెంచిత
ఊగి చేరగలనే
గురిని చూసుకొని కనులు మూసుకుని
బాణమేయగలనే ఓ చెంచిత
బాణమేయగలనే
ఓ చెంచిత నిన్ను మించగలనే ||చెట్టు||
తగువులేల ఎగతాళికాదు
నను తాళికట్టనీవా ఓ చెంచిత
తాళి కట్టనీవా
మనసు తెలుసుకుని మరులు చూపితే
మనువునాడనిస్తా ఓ నరహరి
మనువునాడనిస్తా ఓ నరహరి

'చెట్టులెక్కగలవా' పాట పూర్తిగా జానపద రీతులపై ఆధారపడి మలచిన గీతం. హరి కాంభోజి, శంకరాభరణం రాగాల స్వరాలను కలుపుకుంటూ చతురస్ర గీతిలో సాగిన ఈ పాట నేటికీ ఎందరి పెదవులపైనో నర్తిస్తూనే ఉంది. ఒకరడిగిన ప్రశ్నకు ఇంకొకరు

కొద్దిపాటి మార్పులతో అడిగిన మాటలలోనే సమాధానం ఇవ్వడమే పాటలోని ముఖ్యాంశం. కొద్దిపాటి మార్పులతో అలా సాహిత్యం పునరక్తి అవుతున్నా ఎక్కడా విసుగు చెందనీయని విధంగా పాట సాగిందంటే కారణం ట్యూన్‌కున్న బలమే. ఈ పాట రచన ఆరుద్ర; గానం ఘంటసాల, జిక్కి; అభినయం అక్కినేని, అంజలీదేవి. ఇదేపాట పి.బి శ్రీనివాస్, సుశీల పాడగా మరో వెర్షన్‌లో రికార్డులుగా రిలీజయింది. సినిమాలో ఉపయోగించిన ఘంటసాల, జిక్కి వెర్షన్‌కూడా రికార్డులుగా రావడంతో కాల్రక్రమేణా సుశీల, పి.బి.శ్రీనివాస్‌ల వెర్షన్ మరుగున పడిపోయింది. ఇటీవల హెచ్.ఎం.వి వారి ధర్మమా అని మెలోడీస్ ఆఫ్ పి.బి.శ్రీనివాస్ అనే డబుల్ ప్యాక్ ఆడియోలో ఈ వెర్షన్ మళ్ళీ వెలుగుచూసింది. వీలైతే ఈ రెండు వెర్షన్‌లూ సంపాదించి మార్చి మార్చి వినడానికి ప్రయత్నిస్తే భలేగా ఉంటుంది. తమతమ గాత్రాల పరిధులు తెలిసిన గాయనీగాయకుల ప్రతిభావిష్కరణ ఎలాఉంటుందో గమనించవచ్చు కూడా!

---

చిలకా గోరింకా కులికే పకాపకా
నేనే చిలకనైతే నీవే గోరింకా రావా నా వంక
చిలకా గోరింకా కులికే పకా పకా
నీవే చిలకైతే నేనే గోరింకా రావా నా వంక
చెలియా నేటికి చెలిమీ ఫలించెనే
కలలూ కన్నట్టి కలిమీ లభించెనే ||చెలియా||
మనసే నిజమాయే తనువులు ఒకటాయె
మదిలో తలంపులే తీరే తీయగా
మారే హాయిగా ||చిలకా||
కలికీ నీవిలా ఎదుటా నిలాబడా
పలుకే బంగారం ఒలికే వయ్యారమే ||కలికీ||
ఒకటే సరాగము ఒకటే పరాచికం
కలిసీ విహారమే చేద్దాం హాయిగా
నీవే నేనుగా ||చిలకా ||

'చిలకా గోరింకా కులికే పకాపకా' పాట కూడా హరికాంభోజి, శంకరాభరణం రాగాల స్వరాలను కలుపుకుంటూ స్వరపరచినదే. కావాలంటే లయని మరిచిపోయి కేవలం రాగాల్ని మాత్రం ఆలపించుకుంటూ పాడుకోండి అది 'చెట్టులెక్కగలవా' పాటకి తీసుకు వెళ్ళిపోతుంది. ఆ రోజుల్లో యువతరాన్ని ఉర్రూతలూపిన యుగళ గీతాలలో త్రిశగతిలో సాగిన ఈ పాట కూడా ఒకటి. ఈ పాటకు రచన ఆరుద్ర గానం ఘంటసాల. జిక్కి అభినయం అక్కినేని, అంజలి. పైన ఉదహరించిన పాటలతో పాటు కొన్ని స్వరఖండికలు, పద్యాలు కూడా 'చెంచులక్ష్మి' చిత్రంలో ఉన్నాయి.

---



# ఆ పాత పాట మధురం

రాజా



## చెంచులక్ష్మి - 3

**చెంచులక్ష్మి చిత్రంలోని పాటలతో పాటు** పేర్కొన్నట్టుగా ఆ చిత్రంలో అతి చక్కని అనుభూతిని అందించే కొన్ని స్వరఖండికల గురించి, పద్యాలలో అలౌకికమైన ఆనందాన్ని అందించే ఓ రెండు పద్యాలను గురించి...

మందార మకరంద - మాధుర్యమున దేలు
మధువంబు వోవునే - మదనములకు
నిర్మల మందాకినీ వీచికల దూగు
రాయంచ చమనే - తరంగిణులకు
లలిత రసాల పల్లవ - ఖాదియై చొక్కు
కోయిల చేరునే - కుటజములకు
పూర్ణేందు చంద్రికా - స్ఫురిత చకోరక
మరుగునే సాంద్ర - నీహారములకు
అంబుజోదర దివ్యపాదారవింద - చింతనామృతపాన విశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు - వినుత గుణశీల మాటలు వేయునేల

పద్యం తెలుగువారికి మాత్రమే లభించిన వరం. అది మనసొత్తు.. ఆస్తి. అసలు పద్యాల్లో ఏముంది, ఎందుకు చాలామంది పద్యాల గురించి అంతగా చెపుతుంటారు అని అనుకునేవారు ఈ 'మందార మకరంద' పద్యాన్ని విని చూడండి - రస యోగం అంటే ఏమిటో తెలుస్తుంది రససిద్ధి అంటే ఏమిటో అంటే అనుభవంలోకి వస్తుంది. గుండె అట్టడుగు పొరల్లో ఇంకిపోతున్న రసగంగ కళ్ళలోకి ఒక్కసారిగా జిమ్మితే ఎలా ఉంటుందో తెలిసొస్తుంది. తెలిసిన తెలుగు మాష్టరుంటే ఈ పద్యంలోని ప్రతి పదానికి గల అర్థాన్ని, తాత్పర్యాన్ని అడిగి మరీ తెలుసుకోండి. మన పురాణ గ్రంథాలలో ఎంతటి ఔన్నత్యం ఉన్నదో, ఇవాళ మనం కోల్పోతున్నదేమిటో, మనకు కావలసినదేమిటో అవగాహన కొస్తుంది. తెలుగువాడిగా పుట్టినందుకు గర్వంతో గుండె ఉప్పొంగుతుంది. ఇంతటి వైభవాన్ని ఇన్నాళ్ళూ అందుకోలేకపోయానేమిటి అనే భావనతో మనసు సిగ్గుపడి తన తలదించుకుంటుంది.

ఈ పద్యం బమ్మెర పోతన విరచితమైన శ్రీమద్భాగవతంలోనిది. గాయనిగా సుశీలకు ఈ ఒక్క పద్యం పాడినందుకే పద్మశ్రీ ఇచ్చెయ్యాలి. అంత గొప్పగా పాడారామె. సుతి మెత్తగా ప్రారంభమై రసభావాలను సమశృతిలో సమ్మిళితం చేసుకుంటూ 'ఇంతింతై

వటుడింతింతై' అన్నట్టు పతాకస్థాయికి చేర్చటంలో సుశీల గళం, గాన సామర్ధ్యం ఎంతగా సహకరించాయో అక్షరాలలోకి అనువదించి చెప్పటం కష్టం. ఇంతటి తాదాత్మ్యత రసజ్ఞ శ్రోతలకు కలగడానికి అసలు కారకుడు యస్.రాజేశ్వరరావు. బమ్మెర పోతన గనుక బ్రతికుంటే 'పలికెడిది భాగవతమట - పలికించెడి వాడు రామభద్రుడట' అనే పద్యపాదాలకు 'వినిపించెడి వాడు రాజేశ్వరుండట' అని మరో పాదాన్ని కూడా చేర్చి ఉండేవాడేమోనని అనిపిస్తుంది.

ముఖ్యంగా 'కోయిల చేరునే కుటజములకు' అనే పాదం వద్ద 'కో...ఓ...ఓ..ఇల' అంటూ పాడించి గుండెలు పిండేశారాయన.

ఇక ఖమాస్ రాగానికి రాజేశ్వరరావుకి ఎంత చక్కటి అనుబంధం ఉందో - ఎందుకే నీకింత తొందరా (మల్లీశ్వరి), పాడమని నన్నడగవలెనా (డాక్టర్ చక్రవర్తి) వంటి పాటల ద్వారా శ్రోతలు గమనించవచ్చు. ఈ 'మందార మకరంద' పద్యం స్వరపరుస్తున్నప్పుడు కూడా ఖమాస్ రాగంలోని మకరందాన్నంతా పిండి పద్యంలోని అక్షరం అక్షరంకి అద్ది తెలుగు తల్లికి, సరస్వతీ మాతకు ఏకకాలంలో స్వరాక్షరార్చన చేశాడాయన. 'అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృతపాన విశేష మత్త చిత్తమేరీతి' అని సుశీల గళం ద్వారా వినిపిస్తుంటే ఈ పద్యాన్ని స్వరపరుస్తూ ఆనాడు రాజేశ్వరరావుగారు ఎన్నిసార్లు ద్రవించిపోయి ఉంటారోనని ఊహించుకుంటే చాలు - గుండె చెమ్మగిల్లిపోతుంది. కళ్ళు కన్నీటి బావులవుతాయి. 'ఈ పద్యం పూర్తికాకముందే ప్రాణం పోతే ఎంతబావుణ్ణు' అని అనిపిస్తుంది.

"ఎక్కడున్నారు రాజేశ్వరరావుగారూ మీ స్వర మకరందాల మాధుర్యంలో మునిగి తేలిన మా మనసులు కుటజాల్లాంటి పాటల్ని ఇవాళ వినలేకపోతున్నాయి. లలిత రసాల పల్లవాల్ని పల్లవుల్లోనే లలిత లలితంగా రుచి చూపించిన రసాలూరు రాజేశ్వర రావుగారూ మళ్ళీ ఎప్పుడు పుడతారు సార్" అంటూ శూన్యంలోకి చూస్తూ బిగ్గరగా రోదించాలనిపిస్తుంది.

'డాక్టర్ చక్రవర్తి'లోని 'పాడమని నన్నడగవలెనా' పాటలో 'ఈ వీణ మోగకపోయినా నే పాడజాలక పోయినా' అనేవాక్యం వద్ద వచ్చే ట్యూన్‌ని తర్వాత ఆలాపనతో సహా గుర్తుచేసుకుంటూ ఈ 'మందార మకరంద' పద్యంలోని 'వినుత గుణశీల మాటలు వేయినేల' అనే పాదంతో కలిపి ఆలాపించుకుంటూ ఓ క్షణం పాటు నిశ్శబ్దంగా ఉండి పోయి చూడండి పైన ఉదహరించిన అనుభూతి మీకు కలుగుతుందో కలగదో తెలుస్తుంది.

కావాలంటే యస్.పి.బాలసుబ్రహ్మణ్యంని - ఆయన మ్యూజిక్ ప్రోగ్రామ్లలో గానీ వ్యక్తిగతంగా కానీ కలిసి మాట్లాడే అవకాశం ఉంటే ఈ గొప్పదనం పద్యాన్ని ఒక్కసారి ఆలపించమని అడిగి చూడండి. రాజేశ్వరరావు గారు ఈ పద్యంలో 'కో...ఓ...ఓ..యిల' అంటూ స్వరపరచడంలో ఎంతటి గొప్పదనం ఇమిడ్చారో, మన 'తెల్లకోయిల సుశీల' ఆ పాదాన్ని ఇంకెంత గొప్పగా ఆలపించారో - పద్యంలోని ప్రతిపాదాన్నీ విశదీకరిస్తూ, ఈ తన్మయత్వంతో మమేకమై పోతూ - ఆయన అందించే అనుభూతుల్ని అందుకుని చూడండి. జీవితాంతం వరకు మనల్ని బలోపేతం చేసేలా ఉంటుందా అనుభవం.

---

కంజాక్షునకుగాని కాయంబు కాయమే
పవన గుంభిత చర్మ భస్త్రిగాక
వైకుంఠు పొగడని వక్త్రంబు, వక్రమే
ఢమ ఢమ ధ్వనితోడి ఢక్కగాక
హరి పూజనము లేని హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత దర్విగాక
కమలేశు జూడని కన్నులు కన్నులే
తన కుడ్యజాల రంధ్రములు గాక
చక్రి చింతలేని జన్మంబు జన్మమే - తరళ సలిల బుద్బుదంబు
గాన విష్ణు భక్తిలేని విబుధుండి విబుధుడే - పార్ధ యుగముతోటి

ఈ పద్యం కూడా బమ్మెర పోతన విరచితమైన శ్రీమద్భాగవతం నుండి తీసుకున్నదే నిజానికి ఈ పద్యం సినిమలో 'మందార మకరంద' పద్యానికి ముందు వస్తుంది. రెండు పద్యాలలోనూ ప్రహ్లాద పాత్రధారి బాబ్జీ చూపిన అభినయం మరుపురానిది. లీలావతి పాత్రధారిణి, నిజజీవితంలో కూడా అతని తల్లియైన పుష్పవల్లి, హిరణ్యకశిపుని పాత్రధారి ఎస్వీ.రంగారావు సన్నివేశానుగుణంగా ఈ పద్యాల చిత్రీకరణలో కనిపిస్తారు.

ఈ పద్యం భీంప్లాస్ రాగంపై ఆధారపడింది. భీంప్లాస్ రాగంలో రాజేశ్వరరావు స్టాంప్ ఈ పద్యం ఆద్యంతం పరుచుకుని కనిపిస్తుంది. ఈరాగంలో రాజేశ్వరరావు గారు స్వరపరచిన పాటలను - ఈ పద్యాన్ని కలిపి ఆలపించుకుంటూ ఉంటే రసజ్ఞుడెవరికైనా సరే ఆ ట్రాన్స్ నుంచి ఓ పట్టాన రాబుద్ధి పుట్టదు. ఇక పద్య ప్రక్రియపైన, రాజేశ్వరరావు గారి స్వర రచనపైన, సుశీల గాన సామర్థ్యంపైన ఉదహరించిన భావాలనే ఇక్కడ మరోసారి అనుకోవాలి అంతే!

ఇక కీలకమైన కొన్ని కొన్ని సన్నివేశాలలో కథా సంవిధానం ప్రేక్షకులకు మరింత స్పష్టంగా అర్థమయ్యేలాగ నారద పాత్ర వ్యాఖ్యానిస్తున్నట్టుగా కొన్ని స్వర ఖండికలను జతకలిపారీ చిత్రంలో. దిగువ పేర్కొంటున్నవి అవే. ఈ స్వరఖండికలన్నిటిని ఆరుద్ర రాయగా ఘంటసాల గానం చేశారు.

---

కరుణాల వాల ఇది నీదు లీల
అంతయును వింత
పొగడగ నేనెంత కరుణా
నీ మయ కానంగలేరు
వేయి నేత్రాలు ఉన్నను ఎవరు ||నీ మాయ|| ||కరుణా||
పరసతులను చెరబట్టే అంధుడు
అతడా సురలోకము పాలించే ఇంద్రుడు ||పర||
పదవి మీద ఆశ చేత
ప్రభువాయెను పశువు ||పదవి||
పాపము తననేమి చేసె
కడుపులోని శిశువు ||కరుణా||

సింహేంద్ర మధ్యమం అనే రాగంలో ఈ స్వరఖండిక స్వరపరచబడింది. యోగము పట్టినప్పుడు ఎవరినైనా సరే లక్ష్మీదేవి సేవించవలసినదేనని సినిమాలోని ఓ డైలాగుని సమర్థించే స్వర ఖండిక ఇది. పాలకడలిన పుట్టి నేలపాలు అయినావా నేటికి మహాలక్ష్మి అంటూ ఆరుద్ర చేసిన చమత్కారం గమనీయం.

---

కాంత చేతిలోపల - ఏమంత్రమున్నదో
కాంత చేతిలోపల - ఏమంత్రమున్నదో
ఎంత భీకరుండైనా -
శాంతమొంది తీరునే..
ఇంతి కంటి చూపుకి -
ఇనుమైనా కరగునని -
అంత ఉగ్రమూర్తివీ -
ఇటుల మారినాడవా..
కరుణాలవాల - ఇది నీదు లీలా
అంతయును వింత - పొగడగ నేనెంత

హిరణ్య కశిపుని వధించిన నృసింహస్వామి ఉగ్రత చెంచులక్ష్మి స్పర్శ వలన తగ్గటం, అతడు ఆమె ప్రేమలో పడటం పట్ల సమకూర్చిన స్వర ఖండిక యిది. ఏ మంత్రమున్నదో, శాంతమొంది తీరునే, ఇటుల మారినాడవా అనే వాక్యాల దగ్గర గాయకుడిగా ఘంటసాల చూపిన సమతుల్యమైన ప్రజ్ఞ వర్ధమాన గాయకులు గ్రహించవలసినదీ, అనుసరించవలసినదీ! ఈ స్వరఖండిక మోహన రాగం ఆధారంగా స్వరపరచబడినదే అయినా మరాఠీ సంప్రదాయరీతిలో జారుడు గమకాలు ప్రయోగించటం వలన ఆ రాగం వినూత్నంగా వినిపించి వీనుల విందు చేసింది.

కొన్ని కొన్ని సినిమాలు తర్వాతి తరం వారికి తప్పనిసరిగా చూపించి తీరాలి. లేకపోతే ధ్వని కాలుష్యంలో యువతరం కొట్టుకుపోతుంది. పిజ్జాలు, బర్గర్‌లు లాంటివి తినేవారికి అవి కాల్రకమేణా హానిచేస్తాయని చెబుతూ ఇంట్లో కనీసం పెరుగన్నమైనా ఎలా తినిపిస్తామో అలాగే పిల్లల మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని తెలుసుకోవాలి. చెంచులక్ష్మి సినిమాలోని పాటలు, పద్యాలు వినడం - ఆకళింపు చేసుకోవడం - పిల్లలకి పెద్దలకి ఉత్తమ సంస్కారానికి దోహదం చేసే ఒక కాయకల్ప చికిత్సలాంటిది. మన సంస్కృతి సంప్రదాయాలపట్ల గౌరవం పెంపొందేలా మన పిల్లల అభిరుచులు రూపొందాలనుకుంటే ఇటువంటి సినిమాలు సీడీల రూపంలో భద్రపరచుకుని తర్వాతి తరాలకు చూపిస్తూ ఉండాలి.



# ఆ పాత పాట మధురం

## రాజా



## భూకైలాస్

**తమ సంస్థ చిహ్నాన్ని** చూపిస్తున్నపుడు వినిపించే నేపథ్య సంగీతంతో సహా ప్రేక్షకులందరూ గుర్తుపెట్టుకునే బ్యానర్ వాల్యూ కలిగిన చిత్రాలెన్నింటినో నిర్మించిన సంస్థ - ఏ.వి.యమ్. 1958లో విడుదలయిన భూకైలాస్ చిత్రం ఈ సంస్థ నిర్మించిందే ప్రతిష్ఠాత్మకంగా భారీ ఎత్తున నిర్మించబడ్డ ఈ పౌరాణిక చిత్రానికి నేటికీ తరగని ప్రజాదరణ ఉంది ముఖ్యంగా ప్రతి శివరాత్రికి ఈ చిత్రం ప్రదర్శింపబడని ఊరు తెలుగునాట లేదేమో?

కొన్ని పాటలు వింటున్నప్పుడు రాసింది ఎవరని అడుగుతాం. కొంతమంది గీత రచయితల గురించి చెప్పేటప్పుడు వారు రాసిన పాటలను తప్పనిసరిగా పేర్కొంటుంటాం. రాసిన ప్రతిపాటా తన గురించి అడిగి మరీ తెలుసుకునేట్టుగా తన ముద్రను ‘కలం‘కరించుకున్న రచయిత సముద్రాల(సీనియర్) అయితే - ఆయన గురించి చెప్పేటప్పుడు తప్పక ఉదహరించవలసిన గీతాలలో ‘భూకైలాస్‘ చిత్రంలోని పాటలు ఉండి తీరతాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని సుదర్శనం - గోవర్ధనం సమకూర్చారు. వారి సంగీత దర్శకత్వంలో ప్రాణం పోసుకుని, నేటికి జన చైతన్యాలతో సజీవంగా ఉన్న ఆ చిత్రంలోని పాటలలో ఓ ఆరు:

దేవ మహాదేవ మము బ్రోవుము శివా  
భవ పాశ నాశనా భువనైక పోషణా ||దేవ||  
పరమ ప్రేమకార నిఖిల జీవాధార  
సకల పాప విదూర దరహాస గంభీర ||దేవ||  
దివ్య తేజోపూర్ణ తనయులను గన్నాను  
దేవతా మాతలతో పరియశము గొన్నాను  
కావుమా నా సుతుల చల్లగా గౌరీశ  
ఈ వరము నాకొసగు ప్రేమతో సర్వేశ ||దేవ||

ఈ పాటను ఎమ్.ఎల్. వసంతకుమారి పాడగా రావణుని తల్లి కైకసి పాత్రను పోషించిన హేమలత అభినయించారు. శంకరాభరణ రాగానికి చక్కని ఉదాహరణగా ఈ గీతాన్ని చెప్పుకోవచ్చు. ఓ పాటకు సాహిత్యాన్ని సమకూర్చే ముందు పాత్ర పూర్వాపరాలు రచయితకు తెలియటం ఎంత ముఖ్యమో ఈ పాటను ఆసాంతంగా గమనిస్తే తెలుస్తుంది. రెండో చరణంలో సముద్రాల ఉపయోగించిన ‘పరియశయ‘ అనే పదాన్ని తర్వాత ఏ సినీసంగీతంలోనూ ఏ గీత రచయితా ఉపయోగించినట్టులేదు.

మున్నీట పవళించు నాగశయన
చిన్నారి దేవేరి సేవలు చేయ ||మున్నీ||
నీ నాభి కమలాన కొలువు జేసే
వాణీసు భుజపీఠి బరువు వేసి ||మున్నీ||
మీనాకృతి దాల్చినావు
వేదాల రక్షింప!
కూర్మాకృతి బూనినావు
వారధి మథియింప!
కిటి రూపము దాల్చినావు
కనకాక్షు వధియింప!
నరసింహమై వెలసినావు
ప్రహ్లాదు రక్షింప!
నతపాల మమునేల జాగేల - పాల ||మున్నీ||
మోహినీ విలాస కలిత నవమోహణ
మోహదూర మౌనిరాజ మనోమోహన
మందహాస మధుర వదన రమానాయక
కోటి చంద్ర కాంతి సదన శ్రీలోల - పాల ||మున్నీ ||

ఈ గీతాన్ని ఎమ్.ఎల్.వసంతకుమారి పాడగా అప్పటి ప్రసిద్ధ నృత్యకళాకారిణి శ్రీమతి కమలాలక్ష్మణ్ అభినయించారు. మండోదరి తండ్రి మాయాసురుడి పాత్ర ధరించిన ఎస్.వి.రంగారావు తదితరులు ఈ పాటలో సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. షణ్ముఖప్రియ రాగం ప్రధానరాగంగా సాగుతూ చివరి చరణాల వద్ద నటభైరవిరాగాన్ని కలుపుకున్న ఈ పాటను - సంగీత రంగాన్ని నమ్ముకోదలచిన ప్రతివారూ ఆడైనా, మగయినా సరే సాధన చేసి తీరాలి. ఇలాటి పాటలు పాతాళ్లాంటివి. పట్టు సాధించిన కొద్దీ సామర్థ్యం పెరుగుతుంది.

---

మండో: అందములు విందులయే అవని ఇదేనా
కమలాసనునీ కోటి శిల్ప కూటమిదేనా
ఎందును లేనీ తీయందనాలూ
చిందులు వేసేనుగా ||అం||
చెలి: తెలుసును నీలో వలపుదూరం
కలచివేసేనట్టే విచారం
చెలి: నీ మది దోచే మన్మథుడెవరే
చెలి: నిజమేనా యోచనా
చెలి: ప్రణయ సుధా యాచన
చెలి: తగవేనా
చెలి: ఈ నటనా
మండో: చాలునిక వంచన
అందరూ: అందములు విందులయే అవని ఇదేనే
మండో: తామర పూవులా తురిమేము రారే
చెలి: మనసున వేదన మితిమీరి పోనే
చెలి: అంతేనా
చెలి: ఔనవె
మండో: చాలు మీదు ఆగడాలు

ఈ పాటను పి.సుశీల, బృందం పాడగా, మండోదరి పాత్రను ధరించిన జమున, ఆమె చెలికత్తెల పాత్రలను ధరించిన కొందరు ఉపపాత్రధారులు అభినయించారు. సంగీత పరంగా ఈ పాటలో ఓ తమాషా ఉంది. అదేమిటంటే వి.శాంతారాం దర్శకత్వంలో 1954లో వచ్చిన 'సుబహ్ కా తారా' చిత్రం కోసం సంగీత దర్శకుడు సి.రామచంద్ర స్వరపరచగా తలత్ మహమ్మద్, లతా పాడిన 'గయా అంధేరా/హువా ఉజాలా/చమ్‌కే చమ్‌కే సుభాకా తారా' అనే గీతం ఆరోజుల్లో పెద్ద హిట్.

ఆ పాట ట్యూన్‌ని సుసర్ల దక్షిణామూర్తి 'సంతానం'(1955) చిత్రంలో 'సంతోషమేలా సంగీత మేలా పొంగి పొరలేను మనసీవేళా' అనే పాటకు వాడుకున్నారు. ఇంతకుముందు 'సంతానం' చిత్రంలోని ఈ పాట గురించి రాస్తూ 'భూకైలాస్' చిత్రంలోని

ఓ పాటకు కూడా ఈ ట్యూన్ వాడుకోవడం జరిగిందని, ఆ వివరణ 'భూకైలాస్' గురించి రాసే సమయంలో ప్రస్తావిస్తామని తెలపటం జరిగింది. పాఠకులకు గుర్తుండే ఉంటుంది.

ఈ 'అందములు విందులయే అవని ఇదేనా' పాట మొదటి చరణంలో. 'నీ మదిదోచే మన్మధుడెవరే' అనే లైనుకి రెండో చరణంలో 'తామర పూవులా తురిమేము రారే' అనే లైనుకి - ఆనాటి 'సుభాహ్ కా తారా' చిత్రంలోని 'గయా అంధేరా' పాటలోని చరణాల ట్యూన్‌ని వాడుకున్నారు. ఒక పౌరాణిక చిత్రంలోని పాటలకు వేరే భాషలోని పాత ట్యూన్‌ని తీసుకోవటంలో కొన్ని మినహాయింపులు ఉన్నా ఎంతో మందికి విడ్డూరంగా అనిపిస్తే మాత్రం ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

---

దేవ దేవ ధవళాచల మందిర
గంగాధరా హర నమో నమో
దైవత లోక సుధాంబుధి హిమకర
లోక శుభంకర నమో నమో
పాలిత కింకర భవనా శంకర
శంకర పురహర నమో నమో
హాలహలధర, శూలాయుధకర
శైలసుతావర నమో నమో ||దేవ దేవ||

దురిత విమోచన, ఫాల విలోచన
పరమ దయాకర నమోనమో
కరి చర్మంబర, చంద్రకళాధర
సాంబ దిగంబర నమో నమో ||దేవ దేవ||
నారాయణహరి నమో నమో ||నారయణ||
నారద హృదయ విహారీ నమోనమో ||నారాయణ||
పంకజనయన, పన్నగశయనా ||పంకజ||
శంకర వినుతా నమోనమో ||శంకర|| ||నారాయణ||

ఈ పాటను ఘంటసాల గానం చేయగా ఎన్.టి.ఆర్, ఏయన్నార్‌లపై చిత్రీకరించారు. ఇంటర్‌లూడ్స్‌లో (చెలికత్తెలతో) జమున కూడా కనిపిస్తారు. పాటలో శివపరంగా ఉండే భాగానికి ఝంఝూటా రాగాన్ని, విష్ణుపరంగా ఉండే భాగానికి కాపీ రాగాన్ని ఉపయోగించారు. ఈ పాట వింటున్నప్పుడు రామారావుకు, నాగేశ్వరరావుకు వేర్వేరుగా ఘంటసాల తన కంఠాన్ని, మార్చి పాడేరని ఫీలయ్యేవాళ్ళు నేటికీ ఉన్నారు. నిజానికి రాగంలోని మార్పువల్ల సన్నివేశపరంగా పాత్రధారి మారటం వల్ల, తరాల తరబడి మనసుల్లో పడిన ముద్ర ప్రభావంగా ఏర్పడిన అభిప్రాయాల వల్ల 'పదుగురాడు మాట పాడియై ధర చెల్లు' అన్న రీతిలో ఆ నమ్మకం అలా చలామణి అయిందే కాని నిజానికి ఘంటసాల ఆ విధంగా పాడలేదు. తెలుగునాట ఈ పాటతో పరిచయం లేనివారు చాలా తక్కువగా ఉంటారు. అంతేకాదు ఈ పాటను మోగించని శివాలయం కూడా ఆంధ్ర ప్రాంతంలో లేదనే చెప్పాలి. ఇక సాహిత్యపరంగా చెప్పాలంటే నమోనమో అనే పదాల్ని మినహాయిస్తే - దేవదేవ, ధవళాచల మందిర, గంగాధర, హర ఇలా అన్నీ ప్రస్తుతించే విశేషణాలే. పాట మొత్త విశేషణాలనే కలిగి ఉండటం ఈ పాట విశేషం. అతి అరుదుగా జరిగే ప్రయోగం ఇది.

---

సుందరాంగా అందుకోరా
సౌందర్య మాధుర్య మందారము
అందంలేని పొందలేని
ఆనందలోకాలు చూపింతురా ||ఆనంద|| ||సుందరాంగా||
కేలుకేలుగొని మేనులేకముగ
ఏకాంత సీమలలో
మది సంతాప మారగ సంతోషమూరగ
చెంత చేరరార ||కేలు|| ||సుందరాంగా||

యోగము చేదు విరాగము చేదు
అనురాగమె మధురమ్
చాలు సాధన విడవోయి వేదన
సంతోషాబ్ధికి పోదము ||యోగము||
ఆట రంగారు బంగారు మీనాలమై
చవులూరించుచు తేనె జూరాడుదాం
తేలాడుదాం ఓలాడుదాం ముదమార
తమితీర ఈదాడుదాం ||సుందరాంగా||

ఘంటసాల పాట మొత్తం 'ఓం నమఃశివాయ' అంటూ మంత్రోచ్చాటన చేస్తుండగా సుశీల అద్భుతంగా పాడిన ఈ పాట ప్రేక్షకులను మైమరపించే మధుర మనోహర గీతం. ఈ పాటను ఉత్తరాదికి శృంగార నాట్యతార హెలెన్ అభినయించారు. సన్నివేశపరంగా తపోదీక్షలో ఎన్.టిఆర్ కూడా కనిపిస్తారు. పాట స్వరరచనలో మనోగతమైన అల్లికే కనిపిస్తుంది గాని రాగ స్వభావాలకు ప్రాధాన్యత నిచ్చినట్టు అనిపించదు. అయినా కాస్త తరచి చూస్తే భీంప్లాస్ స్కేల్‌ను ఆధారంగా చేసుకున్నట్టు అనిపిస్తుంది. శివధ్యానంలో ఉన్న రావణుని తపోనిష్టను భంగపరచలేని ఓ అప్సరస చివరికి తాను కూడా శివనామ స్మరణలో అంతర్ధానమై పోవడం పాటలోని ప్రధానాంశం. అందుకుగాను ఓ పక్క 'ఓం నమఃశివాయ' అంటూ చేసే మంత్రోచ్చాటనను పాట మొత్తం వినిపింపచేస్తూ - మరో వైపు పాటను కొనసాగించే ప్రక్రియ పాటకు ప్రత్యేక అందల్ని సమకూర్చి పెట్టింది. సాహిత్యపరంగా లోతుల్లోకి వెళితే ఉద్రేకపరిచే శృంగార - భావం విరుపులతో, మెరుపులతో మైమరుపులతో పాటంతా విస్తరించుకుని ఉన్న పదిమందిలో నిర్భయంగా స్వేచ్ఛగా పాడుకునేలా ఉన్నదంటే దానికి కారణం భాషాసంస్కారం. కవికి కావాలిసింది, వారితో పనిచేయించుకునే వారికి తెలియాల్సింది అదే!

---

జయ జయ మహాదేవా
శంభో సదాశివా
ఆశ్రిత మందారా
శృతి శిఖర సంచారా
నీలకంధరా దేవా దీన బాంధవా రావా
నన్ను గావరా ||నీల||
సత్యసుందరా స్వామి
నిత్య నిర్మలా పాహి ||నీల||
అన్యదైవము కొలువా
నీదు పాదమూ విడువా
దర్శనమ్ము నీరా మంగళాంగా
గంగాధరా
దేహీయన వరములిడు

దానగుణ సీమా
పాహియన్నను ముక్తి
నిను పరంధామా
నీమమున నీ దివ్య నామ సంస్మరణగా
ఏమరక సేయుదును భవతాపహరణా
బవతాపహరణా
నీ దయామయ దృష్టి
దురితమ్ములారా
పర సుధావృష్టి
నా వాంఛ లీడేరా
కరుణించు పరమేశా
దరహాసభాసా
హరహర మహాదేవ

కైలాసవాసా కైలాసవాసా
ఫాలలోచన నాదు మొరవిని
జాలిని పూనవయా,
నాగభూషణ నన్నుగావక
జాగును సేయకయా
కన్నుల విందుగ భక్తవత్సల
కావగ రావయ్యా ||కన్నుల||
ప్రేమమీర నీదు భక్తుని మాటను నిల్పవయా ||ప్రేమ||
శంకరా శివశమరా అభయంకరా
విజయంకరా

'జయ జయ మహాదేవా'తో మొదలయి 'నీలకంఠరా దేవా' అనే మకుటంతో సాగే పాట ఘంటసాల భక్తి గీతాలలో ఎన్నదగినది, మిన్నయైనది. గాయకుని సామర్ధ్యానికి గీటురాయిలా నిలిచే ఈ పాట మొదట్నుంచి 'దర్శనమ్మునీరా మంగళాంగ గంగాధరా' వరకు తిలంగ్ రాగాన్ని – దేహియన వరములిడు దానగుణసీమా' దగ్గర్నుంచి 'హరహర మహాదేవ కైలాసవాసా' వరకు శుద్ధ సావేరి రాగాన్ని – 'ఫాలలోచన నాదు మొరవిని' దగ్గర్నుంచి పాట చివరి వరకు నాద నామక క్రియ రాగాన్ని ఉపయోగించారు. సాధారణంగా ఈ పాటను భావ, రసస్ఫోరకంగా పాడగలిగే ఏ గాయకుడైనా పోటీలలో ప్రత్యేకంగా ప్రశంసించబడతాడు. అంతటి పట్టు ఉందీ పాటలో. ఎన్.టి.ఆర్, అభినయించిన ఈ పాటలో నాగభూషణం, బి.సరోజాదేవికూడా కనిపిస్తారు. సంగీత పరంగా మరో విశేషమేమిటంటే పాట మధ్యన వచ్చే 'దేహియన వరములిడు' చరణం దగ్గర్నుంచి పాట పూర్తి అయ్యేలోగా ఏ రకమైన స్పందనకూ లోనుకాని హృదయం ఎక్కడైనా ఉంటే దాన్ని పాషాణంగా భావించాలి. ఇక సాహిత్య పరంగా 'అన్యదైవమూ కొలువనీదు పాదము విడువా' అనే వాక్యాల ద్వారా రావణాసురుని వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారని చెప్పాలి. కవికి గాని, రచయితకి గాని విషయ పరిజ్ఞానంతో పాటు గ్రంథ పఠనాబలం కూడా తోడైతే భావుకతకు, భాషా పటిమ చేకూరి ఆలోచింపజేసే వాక్యాల ఆవిర్భావం జరుగుతుంది. పాట మొదట్లో వచ్చే 'శృతి శిఖర సంచారా' అనే వాక్యం ఆ కోవకు చెందినదే. శృతులనబడే వేదాల శిఖరమందు ఉండేవి ఉపనిషత్తులు, జీవాత్మను పరమాత్మ సన్నిధికి సమీపంగా (ఉప), నియబద్ధంగా(ని), ఉంచునది (షత్), – కనుక ఆ ఉపనిషత్తులలో సంచరించే వాడా అని అర్ధంతో వాడిన 'శృతి శిఖర సంచారా' వాక్యాన్ని మన ముందుంచిన సముద్రాల వారి పాండిత్య వైభవానికి నమోవాకాలర్పించకుండా ఉండలేం.



# ఆ పాత పాట మధురం

## రాజా



### భూకైలాస్ - 2

***మరో ఆరు పాటలు గురించి...***

మండోదరి: ప్రేమలీవిధమా - విషాదమే ఫలమా
మన్నాయెనా, మా ఆశలు
కన్నీరే మిగిలేనా ||ప్రేమలీ||
కన్నెమది చిరువెన్నెల
పున్నమియె కరువాయెనా
తీరని మది కోరిక
కొనసగగా దరిజేరినా
తరితీయని మన ప్రేమలా
తండ్రియె దూరము చేసె ||ప్రేమలీ||

మనరాగమేగా అనురాగం
తనవూ మనసూ సాగిసే ప్రేమరాగం ||మన||
రావణ: కోరిన ప్రియులు చేరిన వెనుక
కూరిమి బేరము లాడగనేల ||కోరిన||
మండోదరి:కన్నుల పూచే నిన్నుగనీ
రావణ: మనసు దోచేసి చేసె, నీ దాసుని
మండోదరి: కొనవోయి వెల వోసితి నా మది
రావణ: తీయని కోరికలు తీరును రావె ||మన||

సుశీల, ఘంటసాల పాడిన ఈ పాటను జమున, ఎన్.టి.రామారావు అభినయించారు. సన్నివేశ ప్రాధాన్యంగా యస్వీ.రంగారావు కూడా కనిపిస్తారు. పాడిన వారి గళం పూర్తిగా వారి ఆధీనంలో ఉన్నప్పుడే స్వర అస్వర సంచారం చేయగలుగుతుంది. ప్రతి స్వరస్థానంలోనూ, ఆరోహణ అవరోహణలలోనూ, గమకాలలోను, మలుపుల్లోనూ అందంగా ఒదుగుతుంది. ఈ పాటను కనుక గాయనీగాయకులు యధాతథంగా పాడి చూసుకుంటే వారి కంఠం వారి ఆధీనంలో ఎంతవరకూ ఉందో, ఉంటుందో తెలిసిపోతుంది. అంత టిపికల్ కంపోజిషన్ ఇది. ఇక సాహిత్య పరంగా ఓ రెండు పదాల్ని కూడా గమనించాలి. ఒకటి సాగిసే రెండు ప్రియులు. అందమైన, ఇంపైన అనే అర్థంలోనే సాగిసే అనే పదాన్ని ప్రయోగించటం జరిగింది. ప్రేయసీ ప్రియులిరువుర్నీ ప్రేమికులు అనచ్చు కనుక ఒకరికొకరు ప్రియమైన వారు కనుక ప్రియులు అనే పదం కచ్చితంగా నప్పుతుంది. ఇక రావుణుడు పౌరుష పరాక్రమవంతుడు, రాజు కనుక 'రాయల్ వుయ్'లా 'ప్రియులు' అని తనని సంభావించుకున్నాడని కూడా చమత్కారంగా అనుకుంటే అనుకోవచ్చు.

ద్వారపాలుర మరల దరిదీయు కృపయో
ధరలోన ధర్మము నెలకొల్పునెపమో
రాముని అవతారం
రవికుల సోముని అవతారం ||రాముని||
సుజన జనావన ధర్మాకారం
దుర్జన హృదయ విదారం ||రాముని||
దాశరధిగ శ్రీకాంతుడు వెలయు
కౌసల్యాసతి తపము ఫలించు
జన్మింతురు సహజజాతులు ముప్పురు ||జన్మింతురు||
లక్ష్మణ శత్రుఘ్న భరత ||రాముని||
చదువులు నేరుచు మిషచేత
చాపము దాలిచి చేత
విశ్వామిత్రుని వెనువెంట
యాగము కావగ చనునంట
అంతము చేయు నహల్యకు శాపము ||అంతము||
ఒసగును సుందర రూపం
ధనువో జనకుని మనసున భయమో
ధారుణి కన్యా సంశయమో
దనుజులు కలగను సుఖగోపురమో ||దనుజులు||
విరిగెను మిథిలా నగరమున ||రాముని||
కపట నాటకుని పట్టాభిషేకం
కలుగును తాత్కాలికా శోకం
భీకర కానన వాసారంభం
లోకోద్ధరణకు ప్రారంభం

భరతుని కోరిక తీరుచు కోసం
పాదుక లొసగే ప్రేమావేశం
నరజాతికి నవ నవసంతోషం ||నరజాతికి||
గురుజన సేవకు ఆదేశం ||రాముని||
అదిగో చూడుము బంగరు జింక
మున్నె చనునయ్యో లంక
హరనయనాగ్ని పరాంగనవంక
అడిగిన అంరనమె నీ జింక
రమ్ము రమ్ము హే భాగవతోత్తమ
వానర కుల పుంగవ హనుమాన్ ||రమ్ము||
ముద్రిక కాదిది భువన నిదానం ||ముద్రిక||
జీవన్ముక్తికి సోపానం ||జీవన్ముక్తి||
రామ రామ జయ రామరామ
జయ రామరామ రఘుకుల సోమా
సీతాశోక వినాశనకారి
లంకా వైభవ సంహారి
అయ్యో రావణ భక్తాగ్రేసర
అమరం చౌనిక నీ చరిత
సమయును పరసతిపై మమకారం
వెలయును ధర్మ విచారం ||రాముని||

'రాముని అవతారం' అనే మకుటంతో సాగే ఈ పాటలో - తరచిన కొద్దీ దొరికే ముత్యాలను అందిస్తూ - కవిగా తన లోతులను ప్రదర్శించారు సముద్రాల. రాముడు సూర్యవంశానికి చంద్రుని వంటి వాడట. ఆయన అవతారం ఈ భూలోకంలో ధర్మాన్ని నెలకొల్పడానికి ఓ నెపమే గానీ నిజానికి తన ద్వారపాలురైన జయవిజయులను తిరిగి తన దరికి చేర్చుకునే కృపయెనట. విషయాన్ని తిప్పి చెప్పితే ఎంత గొప్పగా ఉంటుందో ఈ సాకీ తెలుపుతుంది. సీతా స్వయంవరం వర్ణనలో - ఈ విల్లుని ఎక్కుపెట్టగల వారెవరైనా ఉన్నారా అని అనుకునే జనకుని మనసులో భయాన్ని, సీత మనసులో సంశయాన్ని, రాక్షసుల స్వప్నసౌధాన్ని వీటన్నింటినీ ముక్కలు చేస్తూ మిథిలా నగరంలో రాముడు ఎక్కుపెట్టిన విల్లు విరిగిపోయిందట. నెపమే అయిన లోకోద్ధరణకు రాక్షస సంహారం తప్పనిసరి కనుక అందుకు దారి తీయించే అరణ్యవాసం, దానికి మూలంగా నిలిచి విఫలమైన పట్టాభిషేకం పట్టాభిషేకం. అది కలిగించే తాత్కాలిక శోకం అంతా ఆ లీలా మానుష వేషధారి కల్పించిన కపట నాటకమే. ఇవే భావాల్ని సముద్రాల ఎంత రసవత్తంగా అందించారో తల్చుకుంటే మనసు పులకరించి పోతుంది. ఇక మాయలేడిని వర్ణిస్తూ - అది బంగరు జింక మాత్రమే కాదట, అడిగిన మరణం లాంటిదట, పరసతి -

శివుని మూడో కన్ను వంటిదట - ఇలా చెప్పాలనుకున్న విషయన్ని వీలయినంత నవీనంగా, 'కవీనం'గా, కమనీయంగా, గమనీయంగా చెప్పిన సముద్రాల - సీనియర్‌నని - మరోసారి నిరూపించుకున్న పాట ఇది.

స్వరపరంగా విశ్లేషిస్తే పాట సాహిత్యాన్ని పక్కన పెట్టేసి - కేవలం వరసని మాత్రం మననం చేసుకుంటూ పోతే - మధ్యలో వచ్చే - సుజన జనావన ధర్మకారం - దగ్గర లయని కొంచెం త్వరితం చేస్తే - మూలం దొరికిపోతుంది. పల్లె పదాలుగా, లొల్లాయి పదాలుగా విస్తరించుకుంటూ పోయిన జానపద సంగీతం స్పష్టంగా దర్శనమిస్తుంది. ఘంటసాల హిట్స్‌లో నిలిచిపోయిన ఈ పాట గురించి మరొక 50 ఏళ్ళ తర్వాత చెప్పుకున్నా కూడా ఆశ్చర్యంలేదు. అక్కినేని అభినయించిన ఈ పాటలో బి.సరోజాదేవి, విజయనిర్మల (సీతగా) మొదలగువారు కనిపిస్తారు.

---

నా నోము ఫలించెనుగా
నా నోము ఫలించెనుగా నేడే ||2||
సురభామినులు
తలచేవలచే
నవప్రేమామృత సారములు
చవులు గొలిపే నేడే ||నా నోము||
కాంతి సోయగమించి
ఆశలు పెంచే
ప్రేమిక హృదయాల ||కాంతి||
విరహానల తాపము బాయెగా
తొలిప్రేమలు పూలు పూచి కాయగా
నవ ప్రేమామృత సారములు
చవులు గొలిపే నేడే ||నా నోము||

నీదు సొమ్మెరా నా మేను సుకుమార (వీణ)
మృదు గానమీవు లయనౌదు నేను
చేసెము రాగసాధన (వేణువు)
తానన తాన తన్ననన (మృదంగం)
భావరాగ తాళమేళన (మోర్‌సింగ్)
శృంగార కలిత (ఘటం)
సరళ సరస రీతి గీతి
సరళ సరస రీతి గీతి
పొరలిపొంగు వారు విమల ప్రీతి
జగజగాల విరియజేయు హాయి
అమర సౌఖ్యమావహించు రేయి
నా నోము ఫలించెనుగా

తెరపై జమున, ఎన్.టి.ఆర్ అభినయించిన 'నా నోము ఫలించెనుగా' పాట రసస్ఫోరకంగా విజృంభించిన భావరాగ వాద్య సమ్మేళనంగా ఉంటుంది. యమన్ రాగాన్ని ఆధారంగా చేసుకుని ఈ పాట రూపొందింది. రావణాసురుడు సంగీత ప్రియుడు కనుక అతనిలోని ఆ ప్రతిభను వెల్లడించడానికి అతని చేతనే వీణ, వేణువు, మృదంగం, ఘటం, మోర్ సింగ్ వాద్యాలను వాయింపచేస్తూ తెరపై ఆవిష్కరించిన తీరు - అందుకు ఈ పాటను మలచుకున్న తీరు శ్రవణ నయన మనోహరంగా ఉంటుంది (అందుకే ఈ పాట సాహిత్యంలో ఎక్కడెక్కడ ఏ వాద్యాన్ని ఉపయోగించారో ఉదహరించడం జరిగింది) సుశీల అత్యద్భుతంగా పాడిన పాటలలో ఇదొకటి. 'కాంతి సోయగమించి' అనే చరణాన్ని మూడురకాలుగా పాడడంలో స్వరకల్పనా సామర్ధ్యంతో పాటు గాయని ప్రతిభ కూడా గమనించతగ్గది. ఇక ఈ పాటను ఆద్యంతం గమనిస్తే సంగీత దర్శకుల మేధా సంపత్తితో పాటు దర్శకుడు, రచయిత, ఛాయాగ్రహకుడు మొదలైన అన్ని శాఖల వారి యొక్క సామూహిక సామర్ధ్యం అవగతమవుతుంది.

---

1. అగ్నిశిఖలతో ఆడకుమా నీవు
   ఆపదపాలుగాకుమా
   పరసతిగోరి పరుగులవారీ
   నరకములోబడి నవయుగనేల? ||అ||
2. జలధర శ్యామ, మంగళనామ
   శ్రీపరంధామా కావుమా
   పిలిచిన పుకుమ, నెనరును చిలుకుమ
   వరముల నిడుమ కమలా రమణా! ||జ||

ఈ రెండు స్వర ఖండికలనూ ఘంటసాల పాడగా నారద పాత్రధారి అక్కినేని నాగేశ్వరరరావు అభినయించారు. తొలి ఖండిక పార్వతి మాయాసురుడు (ఎస్.వి.రంగారావు) దగ్గరికి మండోదరి - రావణుల వివాహ ప్రయత్నకి నారదుడు వచ్చే సన్నివేశంలో వస్తుంది. మాయమోహితుడైన రావణుడు పార్వతీదేవిని ఇల్లాలిగా చేసుకొన కోరి శివుని వద్ద ఆమెను వరంగా పొంది ఆమెను తన ఇంటికి తీసుకెళుతుండగా అది తగదనే హిత బోధను సూచనప్రాయంగా తెలియజేయడం తొలి స్వరఖండిక ప్రయోజనం అయితే మాయాసురుడు విష్ణుభక్తుడు కనుక అతనికి ప్రీతిపాత్రమైన విష్ణువుని స్తుతించంటం రెండవ స్వర ఖండన ప్రధానాంశం. రెండు స్వర ఖండికలకూ మాండ్ రాగమే ఆధారం.

---

తగునా వరమీయ
ఈ నీతి దూరునకు, పరమ పావునకు ||తగునా||
స్నేహము మీరగ నీవేలగా
ద్రోహము నే జేసితి ||స్నేహము||
పాప కర్మ దుర్మదాంధు నన్ను
వేపక దయ చూపితేల - హర
మంగళదాయిని, మాత పార్వతిని
మతిమాలి మోహించితి
కన్నులనించే శూలాల పొడిచి
కామము మాపుమా ||కన్నుల||
తాళజాలను సలిపిన ఘనపాప
సంతాప భారమేనిక
చాలునూ కడతేర్చుము ఇకనైన
వీని పుణ్యహీన దుర్జన్నము
పోనాడితి మతి, వేరేగతి మరిలేదు
ఈ నీచుని తల ఇందే తునకలు గానీ
మేనియ్యెడ పసివాడి మాడీ మసిమసి గానీ
పాపము బాపుమాణ నీ దయజూపుమా
నీ దయ చూపుమా
చేకొనుమా దేవా - శిరము
చేకొనుమాదేవా శిరము చేకొనుమా దేవా
శిరము చేకొనుమాదేవా
చేకొనుమా దేవా శిరము చేకొను మహాదేవా
మాలికలో మణిగా నిల్పు -
కంఠ మాలికలో మనీగా నిలుపు ||3||
నా పాప భరము తరుగు విరుగు ||చేకొనుమా||

రచన, స్వరకల్పన, గానం, అభినయం, చిత్రీకరన ఒకదానితో ఒకటి పోటీ పడిన రసావిష్కరణకు మరో దర్పణం - ఈ గీతం! భావానికి తగిన భాషను జతచేసి ప్రజల మనసులను పవిత్రమైన రసస్పర్శతో పులకింపజేయటంలోనే కవి యొక్క సంస్కారం గోచరిస్తుంది. ఈ గీతం సాహిత్యం ఆసాంతం గమనిస్తే అది అవగాహనలోకి వస్తుంది. చేకొనుమా శిరము/మాలికలో మణిగా నిలుపు అనే వాక్యాలను వివిధ రీతులలో స్వరపరిచిన విధానం. వాటిని అమృత తుల్యమైన తన గళ మాధుర్యంతో ఘంటసాల ఆవిష్కరించిన తీరు, వాటినిఆవహింపచేసుకుంటూ వింటే గుండె సంతృప్తితో నిండిపోతుంది. పొంగిపోతుంది. కనుల వెంట రసగంగా పెల్లుబికిపోతుంది కూడా. మాయా మాళవగౌళ, పీలూ రాగాల మిశ్రమంతో పాటను స్వరపరచటం జరిగింది.

---

ఈమేను మూడునాళ్ళ ముచ్చటేరా - మిత్తి
వెన్నంటి తిరుగుతుంటె ఎరుగవేరా
అంతలోనే మానవ ఇంత మారుపేలరా
ఐశ్వర్య దాస్యంబు మానుకోరా ||ఈ మేను||
అరచేత కైలాస మరయనెంతో - ఇహ
సౌఖ్యాలు మనసార జూరనెంతో ||అర||
ధరయెల్ల ఏలగా ఆశలేలా ||2||
యమ కింకరులు కాచుకుంటే కానవేరా ||ఈ మేను||
అత్యాశ మానవుని శత్రువంట - త్యాగ
జీవనమె వీడిపోని మిత్రమంట ||అత్యాశ||
శరణన్న కనిపించు దేవుడంట ||2||
తన కింకరుల చేవిడక కాచునంట ||ఈ మేను||

రావణుని చేతిలో ఉన్న ఆత్మలింగాన్ని నేలపై ఉంచే ప్రయత్నంలో తోడ్పడానికి విఘ్నేశ్వరుడు ఓ బాల పశుల కాపరిలా వచ్చి రావణుని కంట పడడానికి పాడుకుంటూ వెళ్ళే సన్నివేశంతో ఈ పాట వస్తుంది. జీవికి అహంకారం ప్రబలినపుడు అది భక్తితో కూడినదే అయినా ఆ పొరలను తొలగించడానికి, అంతర్ముఖుణ్ణి చేసి ఆత్మ దర్శనంతో తిరిగి పునీతుణ్ణి చేయడానికి తాత్వికచింతన, ఆధ్యాత్మిక ప్రభోధం అవసరమవుతుంది. ఈ పాత ప్రయోజనం అదే! ఇందులో కొంతమందికి అర్ధంకానీ పదం అంటూ ఉంటే అది ఒక్కటే మిత్తి. మిత్తి అంటే మృత్యుదేవత.

ఇప్పటికీ ఈ 'భూకైలాస్' చిత్రం విడుదలై 53 సంవత్సరాలవుతోంది. ఇవాల్టికీ ఈ పాటలు సజీవంగా ఉన్నాయి. అందుకే వీటిని వింటూ ఉంటే చిత్తశుద్ధితో కూడిన శ్రద్ధ, ఆసక్తి ఉంటే పాటలు అజరామరంగా ఉండక ఏమవుతాయి అనిపిస్తుంది.



# ఆ పాత పాట మధురం

## రాజా



### అత్తా ఒకింటి కోడలే

*విజయ, వాహిని, ఏ.వి.యం. అన్నపూర్ణా, ఎన్.ఏ.టి, సారథి సంస్థలలాగే మంచి చిత్రాలను నిర్మించిన సంస్థలలో అనుపమ ఫిలిమ్స్ ఒకటి. దర్శక నిర్మాత కె.బి.తిలక్ ఈ సంస్థకు అధినేత, పెండ్యాల, ఆరుద్ర వంటివారు ఈ సంస్థలు వెన్నెముకలు. అనుపమ సంస్థ నుండి వెలువడిన ఎన్నో చక్కటి చిత్రాలలో విలువలతో కూడిన పాటల ఆవిర్భావానికి ఈ ముగ్గురి కలయికే కారణం. అటువంటి చిత్రాలలో ఒకటి అత్తా ఒకింటి కోడలే. 1958లో వెలువడిన ఈ చిత్రంలోని పాటలను, పద్యాలను ఆరుద్ర వ్రాయగా పెండ్యాల స్వరపరిచారు. ఆ చిత్రంలోని ఓ ఆరుపాటలివి:*

అ: పైలా పచ్చీసు పరువంలోని లేడీసు ||2||
మగాళ్ళతోటి సమానమంటూ
ఎక్కారండీ సైకిల్సు
పైలా పైలా పచ్చీసు
ఆ: జీరోలైన హీరోను
వెంట తిరుగుతూ వెక్కిరించితే
అవుతారండి ముసుగీసు ||పైలా||
అ: నోటికి పవరు జాస్తి - దానికి తాళం నాస్తి
పోట్లాడేందుకు మాటలు ఈటెలు - ఆడాళ్ళకు ఆస్తి ||పైలా||

ఆ: అల్లరి బుద్ధి పోదు తిన్నని మాట రాదు ||2||
మీ మగవారి మాటల తీటలు వేపకాయిలా చేదు
పైలా పైలా పచ్చీసు
లైలా అంటూ మజ్నూను
వెంట తిరుగుతూ వెక్కిరించితే
చేస్తారండీ - మాలీసు ||పైలా||
అ: సమాన హక్కుల కోసం హోరాహోరీ పోరాటం ||2||
రైలు బందిలో సినిమాహాల్లో స్థానం మాత్రం ప్రత్యేకం ||పైలా||
ఆ: ఆశయాలకై వీరు నిలబడతారని పేరు ||2||
కట్న కోసం పట్నం చదువులు చదివే పెద్ద మొనగాళ్ళు ||పైలా||

పి.బి.శ్రీనివాస్, జిక్కి బృందం పాడిన ఈ పాటను జగ్గయ్య, గిరిజ, మరికొందరు ఉప పాత్రధారులు అభినయించారు. సంగీతం ప్రపంచంలో వాద సంవాదాల ప్రక్రియ పద్యాలతో నాటకాలలో మొదలై సినిమాలో ప్రవేశించి పాటలతో పెద్ద మలుపు తిరిగి చాలాకాలం వరకు ఆరోగ్యకరమైన ధోరణిలోనే కొనసాగింది. ఆ రోజులలో పుట్టిన పాటే ఇది. ఈ వాద సంవాదాలలో ఇరువైపుల నుంచి వచ్చే ఆరోపణలు దేనికదే కరెక్ట్‌గా ఉంటాయి. అలా రాయగలగడం, అందుకు తగ్గ పాయింట్లను పోగుచేసుకోవటం, వాటికి భాషా చమత్కారాన్ని జోడించటం రచయిత ప్రత్యేకతలలో ఒకటి. ఈ పాటను ఆసాంతం గమనిస్తే ఆ లక్షణాలన్నీ పరిపుష్టంగా కనిపిస్తాయి. ఆ రోజుల్లో సినిమా థియేటర్లలో మధ్యకి ఓ గోడ కట్టేవారు. ఆ గోడకి అటువైపు ఆడవారు, ఇటువైపు మగవారు కూర్చునేటట్టుగా సీట్లను

ఏర్పాటు చేసేవారు. ఇప్పటికీ దొరుకుతున్న పూలరంగడు, సీతామాలక్ష్మి సినిమాలు చూస్తే ఈ తరం వారికి ఆనాటి పోకడలపై ఓ అవగాహన ఏర్పడుతుంది.

ఈ పాటలో - రైలుబండిలో, సినిమా హాల్లో స్థానం మాత్రం ప్రత్యేకం - అనే వాక్యం ఆనాటి ఆ పోకడలకు అనుగుణంగా రాయబడినదే! నోటికి పట్టుబడే సులువైన సాహిత్యాన్ని చక్కటి తూగుతో పెండ్యాల నడిపించిన విధం పాటను నలుగురి నోళ్ళలోనూ నానే విధంగా నిలిపింది.

---

అ: రమ్మంటే వచ్చారు అమ్మాయిగారూ - మన
సిమ్మంటే కమ్మగా ఏమంటారు? ||రమ్మంటే ||
ఆ: రమ్మంటే వచ్చానా అబ్బాయిగారూ - ఇలా
రాలుగాయి మాటలంటే పొమ్మంటారు ||రమ్మంటే||
అ: కయ్యంతో మొదలైంది మన కలయిక - ఇది
వియ్యంగా మారాలని నా కోరిక ||కయ్యంతో||
ఆ: ఇద్దరమూ వియ్యానికి ఇష్టపడిననూ - మన
పెద్దవాళ్ళు లైను క్లియరు ఇవ్వాలిగా
అ: ఇద్దరమూ వియ్యానికి ఇష్టపడిననూ - మన
పెద్దవాళ్ళు లైను క్లియరు ఇవ్వాలిగా
అ: రమ్మంటే వచ్చారు అమ్మాయిగారూ - మనసిమ్మంటే కమ్మగా ఏమంటారు?
ఆ: మీరిమ్మంటే ఇవ్వనండీ అబ్బాయిగారూ - పెద్దలిమ్మంటే ఇస్తానే ఏమంటారు

అ: ముచ్చటలు మురిపాలు పెద్దవాళ్ళని - మన
సిచ్చి పుచ్చుకొనడాలు చిన్నవాళ్ళవి
ఆ: ఇల్లలికిన వెంటనే పండుగయ్యేనా - ఈ
ఇంపైన మాటలు నిలకడయ్యేనా..
అ: అహహ ||రమ్మంటే||
ఆ: పట్నంలో చదివారు అబ్బాయిగారూ - మీకు
కట్నం కావాలంటే పొమ్మంటారు -
అ: కట్నం కావాలి నాకు అమ్మాయిగారూ -
మిఠాయ్ పొట్లం వలె నీ మనసే కట్నం నాకు
ఆ: ఏనాడో మనసిచ్చా అబ్బాయిగారూ - మన
మిద్దరమూ హాయిగా జీవిద్దాము.

ఈ పాటను పి.బి.శ్రీనివాస్, జిక్కి పాడగా జగ్గయ్య, గిరిజ అభినయించారు. ప్రస్తుతం యుగళగీతాల పేరిట వస్తున్న విన్యాస గీతాల (రచన, స్వరరచన, అభినయం అంతా విన్యాసమే) ప్రభంజనంలో ఈ పాటను గనుక వినడం జరిగితే మనసు వికలమైపోతుంది. ప్రేమికులు మనసిచ్చిపుచ్చుకునే ప్రయత్నాలలో ఏకాంతంగా హాయిగా పాట రూపంలో వెలిబుచ్చుకునే అభిప్రాయాలు రానురాను ఓ ఇరవై ముప్పై మంది మధ్య 'మంద' భాగ్యంతో వెల్లడించవలసిన బహిరంగ శృంగార విన్యాసాలుగా మారినందుకు గుండె తరుక్కుపోతుంది. అనారోగ్యాన్ని ఇనుమడింప చేసే తిండిని తింటున్న సంతానాన్ని చూసి ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగిన పెద్దల మనసు విలవిలలాడినట్టు అయిపోతుంది. హాయిగా అనిపించి, వినిపించే ఈ పాటకు హిందుస్థానీ రాగమైన తిలంగ్ ఆధారరాగం.

---

అశోక వనమున సీతా
శోకించే వియోగము చేతా ||అశోక||
కంటికి మంటికి ఏకధారగా
కారెను వేడి కన్నీరు కారెను వేడి కన్నీరు
ఆ కన్నీరే లంకాపురమున
ఐనది పెద్ద కోనేరు ||అశోక||
పతినీ తననూ విడదీసి
చెరపట్టెను క్రూర రావణుడు

చెరపట్టెను క్రూర రావణుడు
భరించలేని నరకమది
విడిపించను రాడా రాముడు ||అశోక||
శీలవతి ఆ సీత గతి చూచిన
శిలలే ద్రవించెను
నాధుని కొరకై సాధ్వి రోదన ||2||
నాలుగు దిసెలను దహించెను ||2|| ||అశోక||

ఈ పాటను పి.సుశీల పాడగా తర్వాతి రోజుల్లో దేవికగా ప్రసిద్ధి చెందిన ప్రమీల అభినయించింది. జగ్గయ్య, పెరుమాళ్ళు, లక్ష్మీకాంతమ్మ సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ఈ పాట రచనా విధానంపై ముళ్ళపూడి వెంకటరమణగారి అభిప్రాయం, సాక్షి సినిమా తీసేటప్పుడు ఆరుద్రగారితో ఆ అభిప్రాయాన్ని వెలిబుచ్చిన తీరు, దానికి ఆరుద్ర స్పందించిన విధానం ఇవన్నీ ఇంతకు ముందు ప్రచురించటం జరిగింది. ఆ వైనాన్ని చదివి ఈ పాటను వింటే ఆ రోజులలో సమీక్షలు, విమర్శలు పాఠకులకు అందించే ప్రయత్నంలో ఫిలింక్రిటిక్స్ ఎంత లోతుగా ఆలోచించేవారో తెలుస్తుంది. ఆ విషయాన్ని ఓ పక్కన పెట్టి పాటను పాటగా చూస్తే హృదయాన్ని నేరుగా స్పృశించే ఆర్ద్రతో రసభావాల్ని ఆరుద్ర ఆవిష్కరించిన శైలి, ఆ స్పదనను తన స్వరరచనా నైపుణ్యంతో అందించిన పెండ్యాల, తన గళ మాధుర్యంతో వీరిరువురి సామర్ధ్యాలను అందించిన సుశీల ముగ్గురు సమాన ప్రాతినిధ్యాన్ని అందుకుంటారు. హరికాంభోజి రాగం ఆధారంగా ఈ పాట స్వరపరచబడింది.

---

నీ దయరాదా ఈ దాసిపైనా
నెనరుంచి పాలించు ఏనాటికైనా ||నీ దయ||
ఏ కొర నోములు నోచుట వలనో
శోకనికే బ్రతుకంకితమైనది
చేరువలోనే ఎడబాటులేలా
గారవించి నను కాపాడలేవా ||నీ దయ||
చెలి నిండు పరువాన చెంతను నిలిచినా ||2||
ఉలకవు పలకవు ఒకసారి చూడవు
మురిపాల సరదాలు కరువైన నను చూసి
కరుణించి ఇసుమంత కరుగదా మనసు ||నీ దయ||

ఈ పాటను పి.సుశీల పాడగా ప్రమీల (దేవిక), రమణమూర్తి అభినయించారు. సుశీల పాడిన పాటల్లో చాలా మంచిపాటగా పేరు తెచ్చుకోవలసిన పాట ఇది. ఎందుకు మరుగున పడిపోయిందో ఇవాల్టికీ అర్ధంకాదు. హెచ్.ఎం.వి వారు పుణ్యం కట్టుకుంటే బావుండననిపించే గొప్ప పాట ఇది. ఫిమేల్ సోలోలు కరువయిపోతున్న ఈనాటి ఔత్సాహిక గాయనీమణులకు సాధన చేసుకోడానికి పనికి వచ్చే పాట ఇది. అందుకు తగ్గ ఆలాపనలు, గమకాలు హృద్యంగా ఉన్నాయి ఆ పాటలో. ఈ పాటకు జయజయావంతి రాగం ఆధారం. జయజయావంతి రాగంలో పెండ్యాల స్వరపరచిన ఏమి రామ కథ శబరీ శబరీ ఎంతగా ఆకట్టుకుంటుందో అంతగానూ ఆకట్టుకోగల సత్తావుందీ పాటలో. వీలైతే సంపాదించి వినండి. ఇంత మంచి పాటని ఇన్నాళ్ళ పాటు ఎలా మిస్సయ్యాం, మిస్సయి ఎలా ఉండగలిగాం అని అనిపించి తీరుతుంది.

నటీనటులకు కొన్ని కొన్ని విషయాలలో ప్రావీణ్యం, ప్రవేశం లేకపోయినా కనీసం గమనించే సామర్ధ్యం ఉండి తీరాలి. ఈ పాటలో రమణమూర్తి వయొలిన్ వాయిస్తూ వేళ్ళు కదిపిన తీరు ఈ మాటను సమర్ధిస్తుంది. ఇలాంటి చిన్న చిన్న విషయాలను ఎవరు పట్టించుకుంటారులే అనే ధోరణిని ఇవాళ వస్తున్న చాలా సినిమాలలోని పాత్రధారులు వాద్య పరికరాలను ఉపయోగించే తీరుతెన్నులు బట్టి అర్ధం చేసుకోవచ్చు.

---

అ: నాలో కలిగినది - అది ఏమో ఏమో
మధుర భావం నాలో కలిగినది
ఆ: పెదవి దాటి మాటలు రావు బెదిరిపోతయి ||2||
అ: హృదయములో విరితేనెలు సోలిన ||2||
ఊహలు రేగాయి ||నాలో||
అ: కనులముందు కమ్మని ఆశలు కలకల మన్నయి ||2||
ఆ: మనసు పడి మన ప్రేమ లతాళి పూవులు పూసింది ||నాలో||
ఆ: కలువరించే కలలు పండే - శుభదినముదయించే ||2||
ఆ: కల నిజమై ఒడి నిండుగ తీయని కోరిక ఫలియించే ||నాలో||

ఈ పాటను ఘంటసాల, సుశీల పాడగా జగ్గయ్య, గిరిజ అభినయించారు. తెలుగు సినీ యుగళగీతాల లిస్ట్‌లో అతి చక్కటి స్థానాన్ని పొందవలసిన ఈ పాట కూడా ఎంతమంది రసజ్ఞ శ్రోతలకు వినమరుగై పోవటం దురదృష్టం. ఘంటసాల అభిమానులు. ఇంకా చెప్పాలంటే మంచి పాటలకు చెవియొగ్గే ప్రతి శ్రోతా దాచుకోదగ్గ పాటయిది. ఈ పాటను కూడా తిరిగి సినీ సంగీతాభిమానులకు చేరవేసే బాధ్యతను స్వీకరించమని హెచ్.ఎం.వి వారిని ఈ శీర్షికను వేదికగా చేసుకుని పత్రికా ముఖంగా ఈ సమీక్షకుడు అభ్యర్థిస్తున్నాడు. ఈ పాటకు భాగీశ్వరి రాగం ఆధారం. ఈ రాగంలో పెండ్యాల వారు ఎన్ని మంచిపాటలందించారో అందరికీ తెలుసు. అయినా రసస్పందన కోసం అలిగితివా సఖీ ప్రియా, రారా కనరారా పాటలను గుర్తుచేసుకోవడం అప్పుడప్పుడు అవసరం. అలా జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఈ 'నాలో కలిగినది' పాటను వింటుంటే మనసులో నిండిపోయే తృప్తిని మాటలలోకి అనువదించలేం.

శాంతారాం నిర్మించిన 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే' చిత్రంలో వసంత్ దేశాయ్ స్వరపరచగా హేమంత్ కుమార్, లత పాడిన 'నైన్ సే నైన్ నాహి మిలావో' పాటను ప్రేరణగా తీసుకుని ఈ పాటను పెండ్యాల ట్యూన్ చేశారని ఈ చిత్ర దర్శక నిర్మాత శ్రీ కె.బి.తిలక్ ఓ సారి అన్నారు. ఆ హిందీ మాటకు మాల్ గుంజ్ రాగం ఆధారం. మాల్ గుంజ్ రాగాన్ని భాగీశ్వరి రాగం అనుకుని పొరబడే అవకాశాలు ఉన్నాయి. ఈ 'నాలో కలిగినది' పాటను పెండ్యాలగారు భాగీశ్వరి రాగంలోనే స్వరపరిచారు కనుక ఈ పాటను, ఆ హిందీ పాటను సంపాదించి వినగలిగితే భాగీశ్వరి - మాల్‌గుంజ్ రాగాలకు గల తేడాలు పోలికలు తెలిసే అవకాశం ఉంది.

---

జోడు గుళ్ళ పిస్తోలు రా - నేను
ఆడి తప్పని వాణ్ణే - జీ౦హో ||నేను||
హద్దు మీరు వారు శిక్షింప బడుదురు
బుద్ధిమంతులెపుదు రక్షింపబడుదురు ||జోడు||
ఆఫీసరు భార్యననే అహం కూడదు
అధికారం చెలాయిస్తే ఇంక చెల్లదు
తొండ ముదిరితే ఊసరవెల్లి
అత్తా హజం ముదిరితే హళ్ళికి హళ్ళి ||జోడు||

కాకి పిల్ల కాకికి కడు ముద్దు - అది అందుచేత
కాకూడదు మొద్దు -
ఎవరి గొప్ప వాళ్ళ వద్ద - ఆగకున్నచో ఎవరి
దేహశుద్ధి కొండొకచో జరుగుట కద్దు ||జోడు||
నోరు మంచిదైతే ఊరు మంచిది
పోరు నష్టమూ - ఎపుడూ పొందు లాభము
ఇది కోర్టుకెక్కితే అంతా అభాసు - అత్తా
నీ జోరు తగ్గకుంటేనూ కొంప కలాసు ||జోడు||

ఈ పాట ఘంటసాల పాడగా జగ్గయ్య అభినయించారు. సూర్యకాంతం, గిరిజ సన్నివేశ ప్రాధాన్యంగా పాల్గొంటారు. పాట విన్న తరువాత ఘంటసాల పెర్ఫార్మెన్స్ తప్ప ఇంకేదీ మనసులో నిలవదు. ఆ గళానికి ఉన్న ఆకర్షణ, సామర్థ్యం అదీ.! శోక రసానికి ఎప్పుడూ ఉపయోగించే శివరంజని రాగాన్ని ఈ పాటకి ఉపయోగించడంలో పెండ్యాల వారి ప్రతిభను గమనించినకొద్దీ ఆయన మీద గౌరవం మరింత పెరిగిపోతుంది. ఇక ఈ పాటలో రచయితగా ఆరుద్ర చేసిన చమత్కారాలు కొన్ని ఉన్నాయి. రెగ్యులర్‌గా మనకు వినిపించే జోడు గుళ్ళ పిస్తోలు రా, ట్రెస్ పాసర్స్ ఆర్ ప్రాసిక్యూటెడ్ (హద్దు మీరిన వారు శిక్షింపబడుదురు) హళ్ళికి హళ్ళి, కొంప కలాస్ వంటి వాక్యాలు; అహంకూడదు, తొండ ముదిరితే ఊసరవెల్లి, కాకి పిల్లకాకికి ముద్దు, నోరు మంచిదైతే ఊరుమంచిది, పోరు నష్టం - పొందు లాభం వంటి సుద్దుల్నీ, సామెతల్నీ చాలా తెలివిగా వాడుకున్నాడాయన. పాటను త్వరగా జనం నోటికి పట్టుబడేట్టు చేసేవి ఇలాంటి చమత్కృతులే.

పైనుదహరించిన 6 పాటలు మాత్రమే కాక మరో మూడు పాటలు కూడా ఉన్నాయి ఈ చిత్రంలో. వాటిలో తడికో తడికా పాట ఒకటి.

ఈ చిత్రం ప్రింట్ దొరకటం ఇంచుమించు దుర్లభం. ఛానల్ వారెవరైనా పూనుకుంటే ఈ చిత్రాన్ని పాటలతో సహా ప్రేక్షకులకు అందించగలరు. కేవలం పాటల వరకు హెచ్. ఎం.వి వారు తలుచుకుంటే వీలయినంత త్వరగా శ్రోతలకు చేరుతుంది. ఇందుకు సంకల్పం ముఖ్యం.



# ఆ పాత పాట మధురం



రాజా

## మాంగల్యబలం

**నిర్మాణ కాలంలోను, విడుదలయిన** కొన్నిరోజుల వరకు మాత్రమే కాకుండా - దశాబ్దాలు దాటిన తర్వాత కూడా సదుపమానంగా ఉదహరించుకునే రీతిలో, ఉన్నత ప్రమాణాలతో చిత్రాలను నిర్మించిన ప్రతిష్ఠాత్మకమైన అన్నపూర్ణా సంస్థనుండి వెలువడిన మరో మణిపూస మాంగల్యబలం.

1959లో విడుదలయిన ఈ చిత్రంలోని పాటలు - వాటి ఆవిర్భావానికి కారకులైన వారందరి పేరు ప్రతిష్ఠలను శ్రోతల హృదయాలలో మరింత పటిష్ఠం చేస్తూ నేటికీ అలరిస్తున్నాయి. ఏ రాగాన్ని తీసుకున్నా అందులో తనదైన శైలిని, ముద్రని పూర్తిగా ప్రతిబింబించేటట్టుగానే కాకుండా అనుకరించలేనంత అనన్య సాధ్యంగా స్వరపరచటం కూడా మాస్టర్ వేణు ప్రత్యేకతల్లో ఒకటి, ఆయన సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రంలో గల తొమ్మిది గీతాలలో ఓ నాలుగు పాటలు.

హాయిగా ఆలూ మగలై కాలం గడపాలి హాయిగా
వేయేళ్ళు మీరనుకూలంగా ఒకటై బ్రతకాలి
హాయిగా చేయి చేయిగా ఆలు మగలై కాలం గడపాలి
సతి ధర్మం పతిసేవేయని పతి భక్తిని చూపాలి
అనుదినము అత్తామామల పరిచర్యలనే చేయాలి
పతి ఇంట్లో బంధు జనాల అభిమానం పొందాలి ||పతి||
పదిమందీ నీ సుగుణాలే పలుమార్లు పొగడాలి ||హాయిగా||
ఇల్లాలే ఇంటికి వెలుగని ఎల్లప్పుడు తెలియలి
సంసారపు బండికి మీరే చక్రాలై తిరగాలి
శరీరాలు వేరేగాని మనసొకటై మసలాలి ||శరీరాలు||
సుఖమైనా కష్టమైనా సగపాలుగా మెలగాలి ||హాయిగా||
ఇరుగమ్మలు పొరుగమ్మలతో ఇంటి సంగతులు అనవద్దు
చీరలు నగలిమ్మని భర్తను చీటికి మాటికి అడగొద్దు
అత్తింటను అదరిపాటుతో పుట్టింటిని పొగడొద్దు అత్తింటి
తరుణం దొరికిందే చాలని 'తలగడ మంత్రం' చదవొద్దు ||హాయిగా||

ఈ పాటను శ్రీ శ్రీ రాశారు. సుశీల, సరోజిని ఆలపించగా తెరపై అభినయించిన వారిలో అలనాటి ప్రముఖ నటి పుష్పవల్లి కుమారుడు, ఈనాటి ప్రసిద్ధ నటి రేఖ సోదరుడు అయిన మాస్టర్ బాబ్జీతోపాటు బేబీ శశికళ, కన్నాంబ, జి.వరలక్ష్మి మరి కొందరు బాల కళాకారులు ఉన్నారు. శ్రీ శ్రీ ఆ రోజుల్లో డబ్బింగ్ చిత్రాలలో బిజీగా ఉండేవారు. 'మీకైతే ప్రత్యేకంగా రాస్తాను' అని నిర్మాత దుక్కిపాటి మధుసూధనరావుగారితో చెప్పి ఈ చిత్రంలో అయిదు పాటలను రాశారాయన. ఈ పాట సన్నివేశాన్ని వివరించి పిల్లలకు అనుకూలంగా ఉండేటట్లు రాయమన్నారు మధుసూధనరావు. 'పెద్దవాళ్ళకు కూడా పనికొచ్చేటట్లు రాస్తాను' అంటూ పై విధంగా రాశారు శ్రీ శ్రీ చివరి చరణంలో 'తలగడ మంత్రం' అంటూ శ్రీశ్రీ చేసిన చమత్కారానికి యూనిట్‌లో అందరూ ముసిముసిగా నవ్వుకున్నారట. ఖచ్చితంగా వేరు చేసి, వ్యత్యాసాన్ని చూపలేనంత దగ్గరగా కాఫీ, పీలూరాగాలను మిశ్రమం చేసుకుంటూ మాస్టర్ వేణు స్వరపరిచారీ గీతాన్ని.

---

తెలియని ఆనందం నాలో కలిగినదీ ఉదయం
పరవశమై పాడే నా హృదయం ||తెలి||
కలకలలాడెను వసంతవనము
మై మరిపించెను మలయానిలము ||కల||
తీయని ఊహల ఊయల లూగి
తేలే మానసము - ఏమో ||తెలి||
రోజాపూసే రోజాపూలు ఒలికించినవి నవరాగాలు ||రోజా||
పరిచయమైన కోయిల పాటే
కురిసే అనురాగం - ఏమో ||తెలి||
అరుణ కిరణముల గిలిగింతలతో
కరిగిన తెలిమంచు తెరలే తరలి
ఎరుగని వింతలు ఎదుటే నిలచి
వెలుగే వికసించే - ఏమో ||తెలి||

ఈ పాటను సుశీల పాడగా సావిత్రి, అక్కినేని అభినయించారు. శ్రీశ్రీ రాయగా దేశ్, తిలక్ కామోద్ రాగాలలో మలచబడ్డ ఈ పాట ఈ నాటికీ సుశీల క్రెడిట్స్‌లో ఒకటిగా నిలిచిపోయింది. 'రోజాపూసే రోజాపూలు' చరణంలో 'ఒలికించినవి నవరాగాలు' తర్వాత దేశ్ రాగంలో సుశీల చేసిన ఆలాపన మనసుని ఎంతగానో ఉత్తేజపరుస్తుంది. అలా లీనం చేసుకుంటూ ఉత్తేజపరిచే గుణం ఉండబట్టే ఇవాళ మనం వింటున్న 'బజే సర్‌గమ్ హర్ తరఫ్‌సే' దేశభక్తి గీతానికి దేశ్ రాగాన్ని ఎన్నుకున్నారేమోననిపిస్తుంది. ఈ 'తెలియని ఆనంద్మ' పాటను నిజానికి ఊటీలో కొన్ని సన్నివేశాలతో పాటు చిత్రీకరించవలసి ఉంది. 40 రోజులపాటు షూటింగ్ ప్లాన్ చేసుకుని యూనిట్ మొత్తం అక్కడకు వెళ్ళి ఎనిమిది రోజుల పాటు షూటింగ్ చేశాక ఎడతెరిపిలేని వర్షం మొదలయి షెడ్యూల్ అంతా క్యాన్సిల్ అయింది. సెప్టెంబరులో అయితే అక్కడ వర్షాలు ఉండవని అప్పుడు తీసుకుందామని వెనక్కి వచ్చేశారు. సెప్టెంబరులో తనకు నెలలు నిండుతాయని చెబుతూ తాను గర్భవతినన్న శుభవార్తను తెలియచేసింది సావిత్రి. దాంతో ఊటీలో తీసిన సన్నివేశాలను తిరుపతి సన్నివేశాలుగానూ, కొంత కథ తిరుపతిలో జరిగినట్టుగానూ మార్చి వాహినీ స్టూడియోలో ఈ పాటకోసం ప్రత్యేకంగా సెట్‌వేసి తీసారు.

---

తిరుపతి వెంకటేశ్వరా! దొరా! నీవె
దిక్కని నమ్మినామురా
ఉన్నవాళ్ళు నీ కోసం పుణ్యానికి వస్తారు
కడుపు చూసి యాచిస్తే కసిరి తిట్టిపోస్తారు ||తిరుపతి||
మిట్టరాళ్ళ దారి పోయి సిమెంటు రోడ్డు వెలిసింది
కాలినడక మారిపోయి కార్ల వసతి కలిగింది
వచ్చే పొయ్యే వారికెల్ల వసరు బాగ కుదిరింది
బిచ్చగాళ్ళ బొచ్చెలోన గచ్చకాయ పడింది ||తిరుపతి||
పొంగల్ పులిహోర బూంది అట్టు
చక్కెర పొంగల్ వడ లడ్డు బొబ్బట్టు
ఆరగించని నీ పేరున అర్పణ చేస్తుంటారు
ప్రసాదాలు వంతులేసి పంచుకుని తింటారు
నీకు మాకు సున్నమేనయో! నీవైనగాని
నిగ్గదీసి అడగవేమయో! ||తిరుపతి||
ఉన్నది చాలదని హుండీలో డబ్బువేసి
వరములెన్నో కోరుకుంటారు
మేము జానెడు పొట్టకని బిచ్చం ఎత్తామని
ఉరిమి చూసి తరుముకొస్తారు
పోలీసులు పిలుస్తారు వ్యానులోన
పొలిమేర దాటిస్తారు ||తిరుపతి||
ఆపదలో మొక్కువారె అసలు భక్తులనుకోకు
ఆకలితో కొల్చు మమ్ము అన్యులమని యెంచకు
భేదాలకు తావులేక ఆదర్శమ్మున చూచుకో
సర్వసముడవన్న పేరు సార్థకమ్ము చేసుకో
దైవమన్న పేరు నిలుపుకో - ఈ పేదవాళ్ళ
కడుపు మంట తీర్చి ఏలుకో ||తిరుపతి||

ఈ పాటను కొసరాజు వ్రాయగా జమునారాణి ఆలపించారు. సుకుమారి అనే నటి నృత్యం చేసి అభినయించింది. ఈ సుకుమారి తర్వాతి రోజుల్లో 'లవ-కుశ' చిత్రంలో 'విరిసె చల్లని వెన్నెల' అనే పాటకు నృత్యం చేసి ఎంతోమంది ప్రేక్షకుల చేత 'సుకుమారి అంటే ఈవిడే' అన్న గుర్తింపును తెచ్చుకుంది. ట్రావెన్కూర్‌లో పుట్టి కేరళ నుంచి వచ్చింది కనుక కాల్రక్రమేణా మలయాళ చిత్ర పరిశ్రమకు వెళ్ళిపోయింది. ఆ తరువాత నాగార్జు నటించిన 'రక్షకుడు' సినిమాలో సుస్మితాసేన్‌కి బామ్మగా నటించి మళ్ళీ తెలుగు ప్రేక్షకుల కంటబడింది. కృష్ణవంశీ 'మురారి'లో మహేష్ బాబు చేత ముద్దుగా 'శబరీ' అని పిలిపించుకునే మామ్మ పాత్రలో కనిపించి ప్రేక్షకులతో కంటతడి పెట్టించింది. ఆ తరువాత ఎన్నో ఛానల్స్ ప్రసారం చేసిన పెక్కు డబ్బింగ్ సీరియల్స్‌లో కనబడింది. ఈ పాటలో ఇంకో విశేషం కూడా ఉంది. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వం వహించిన సినిమాలకు ఎడిటర్ గా పనిచేసి, తర్వాత రోజుల్లో ఉపాయంలో

అపాయం, ఖైదీబాబాయ్, మంచి బాబాయ్ చిత్రాలకు దర్శకత్వం వహించిన టి.కృష్ణ ఈ పాటలో తెల్లచొక్కా వేసుకుని, కళ్ళజోడు పెట్టుకుని, రేలంగి పక్కన నిలబడి ఓ ప్రేక్షకుడిగా కనిపిస్తారు.

ఇక సాహిత్యపరంగా ఎన్నదగిన విశేషం ఒకటుంది ఈ పాటలో. మొత్తం సాహిత్యమంతా అవలోకించి చూడండి. ఇన్నేళ్ళ తర్వాత కూడా ఇవాళ్టికీ పరిస్థితులు అలాగే ఉన్నాయేంటి అనిపించే విధంగా రాసిన కొసరాజు దార్శనికతయే ఈ పాటలోని విశిష్ట గీత రచయితలకు ఆ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ఇచ్చి వారి ప్రతిభ మీద నమ్మకంతో వేచి ఉండే రోజులవి. అందుకు తగ్గట్టుగానే కొసరాజు వంటి రచయితలు కూడా తగు క్రమశిక్షణతో స్పందించేవారు.

---

అ: చెక్కిలి మీద చెయ్యి జేర్చి చిన్నదాన
నీవు చింత పోదువెందుకే ఇంతలోన
నీ చిక్కులన్ని తీరిపోయె చిటికెలోన
ఆ: చేసిన మేలు మరువలేను చిన్నవాడ
నీకు చేతులెత్తి మొక్కుతాను వన్నెకాడ
నా జీవితమె మారిపోయె నేటితోడ
అ: ఆడదాని బ్రతుకంటె తీగ వంటిది
బాగా నీరు పోసి పెంచకుంటె సాగనంటదీ
ఆడదాని బ్రతుకంటె తీగ వంటిది
బాగా నీరు పోసి పెంచకుంటె సాగనంటదీ
మగతోడు ఉంటేనే జోరుగుంటది
అది మూడుపువులారు కాయలౌతుంటది ||చెక్కిలి ||
ఆ: చదువు సంధ్యాలేని చవటను గానోయ్
నీ చాతుర్యమంతా నే కనిపెడితినోయ్
చదువు సంధ్యాలేని చవటను గానోయ్
నీ చాతుర్యమంతా నే కనిపెడితినోయ్
మగవారి నాటకాలు వినియుంటినోయ్
వారి మోజులెంత బూటకాలో తెలుసుకొంటినోయ్ ||చేసిన||

అ: ఒంటిగానె బతుకంత నదుపుకొందువా
అబ్బ జంట జోలి లేకుండ జరుపుకొందువా
ఒంటిగానె బతుకంత నడుపుకొందువా
ఒంటిగానె బతుకంత నడుపుకొందువా
అబ్బ జంట జోలి లేకుండ జరుపుకుందువా
లోకులంటె కాకులని మరచిపోదువా
ఈ లోకమంటె లెక్కలేక ఎగిరిపోదువా ||చెక్కిలి||
ఆ: ఊక దంపు నీతులన్ని ఆలకిస్తినోయ్
నీ ఊహలోని కిటుకంతా విప్పి చూస్తినోయ్ ||ఊక||
సూటిపోటి మాటలన్ని కట్టిపెట్టవోయ్
ఇంక చాటు మాటు చూపులన్ని దాచిపెట్టవోయ్ ||చేసిన ||

ఈ పాటను మాధవ పెద్ది సత్యం, జిక్కి పాడగా రేలంగి, రాజసులోచన అభినయించారు. జానపద బాణీలో సాగే ఈ పాటను ఆ రకం గీతాలకు పేరెన్నికగన్న కొసరాజు రాశారు. జానపద గీతాలు ఎక్కువగా వినిపించే హరికాంభోజి రాగానికి జన్యమైన నారాయణి అనే రాగానికి ఉండే స్వరాల మధ్య ఈ పాట సంచరించిదని చెప్పవచ్చు. పల్లవిలో కొసరాజు పదాలెంత ఛమక్కునిచ్చాయో మాధవపెద్ది గళం అంతటి ఝలక్ నిచ్చిందని చెప్పడానికి ఓ చిన్నపిట్ట కథ ఉంది.

'మాంగల్యబలం' చిత్రాన్ని తమిళంలో 'మంజిల్ మహిమై'గా ఏకకాలంలో తీసారు. తమిళ గీతాలకు రచయితగా ఉడుమలై నారాయణ కవిని ఎన్నుకున్నారు. ఆయనకు సంగీతంలో కూడా ప్రవేశం ఉంది. ఉడుమలై శరబమ్ ముత్తుస్వామి కవి వద్ద శిష్యరికం చేసి ఆయన మీద గౌరవంతో తన పేరుకు కూడా 'ఉడుమలై' అన్న పదాన్ని చేర్చుకున్న సంస్కారి ఆయన. కొన్ని వ్యక్తిగత కారణాల వలన 'చెక్కిలి మీద చెయ్యి జేర్చి' పాత తమిళ వెర్షను రాయలేక పోవటంతో ఆయనకు అసిస్టెంట్‌గా ఉన్న కె.యస్.గోపాలకృష్ణ చేత ఆ తమిళ గీతాన్ని రాయించడం జరిగింది. తర్వాత కాలంలో ఈ కె.యస్.గోపాలకృష్ణ దర్శకునిగా ప్రసిద్ధుడైనారు కూడా.

'ఆనదు ఆచ్చి పోనదు పోచ్చి' అంటూ కె.యస్.గోపాలకృష్ణ రాసిన పాటను విని 'చెక్కిలి మీద చెయ్యి జేర్చి' పాటలో ఉన్న ఛమక్కు లేదు నేను తిరిగి రాస్తాను రెమ్యునిరేషన్ అక్కర్లేదు అంటూ బాధపడ్డారట ఉడుమలై నారాయణ కవి. ఎలాగొలా ఆయన్ని సమాధాన పరిచారు మధుసూధనరావు. అలా ఉండేవి ఆ రోజుల్లో తపన.. నిజాయితీ..



# ఆ పాత పాట మధురం
## రాజా



### మాంగల్యబలం - 2

**శ్రీమతి ఆశాపూర్ణదేవి రాసిన ‘అగ్నిపరీక్ష’** అనే ఓ బెంగాలీ నవల ఆధారంగా బెంగాలీలో ఓ సినిమా తీశారు. ఆ సినిమా ప్రింట్‌ని చూసి ‘యాంటీ సెంటిమెంట్’ అని తక్కిన నిర్మాతలందరూ నిరుత్సాహపరుస్తున్నా అన్నపూర్ణా పిక్చర్స్ అధినేత దుక్కిపాటి మధుసూదన రావుగారు తెలుగులో రీమేక్‌గా నిర్మించారు. ఆ చిత్రమే మాంగల్యబలం. ఆ చిత్రంలోగల 9 పాటలలో మరో నాలుగు.

ఆ: ఆకాశ వీధిలో అందాల జాబిలి
వయ్యారి తారను చేరి ఉయ్యాలలూగునే
సయ్యాట లాడెనే ||ఆకాశ||
జలతారు మేలి మబ్బు
పరదాలు వేసి తెరచాటు చేసి
అ: పలుమారు దాగి దాగి
పంతాలు పోయి పందాలు వేసి
ఆ: అందాల చందమామ దొంగాటలాడెనే
దోబూచులాడెనే ||ఆకాశ||
అ:జడివాన హోరుగాలి
సుడి రేగి రానీ జడిపించబోనీ
ఆ: కలకాలము నీవేనని
పలుబాసలాడి చెలి చెంత చేరి
అ: అందాల చందమామ
అనురాగం చాటెనే నయగారం చేసెనే ||ఆకాశ ||

ఈ పాటను మధ్యమావతి రాగాన్ని ప్రధానంగా తీసుకుని స్వరపరచటం జరిగింది. అక్కడక్కడ అంతర్గాంధారం, చతుశృతి దైవతం వంటి అన్య స్వరాలు పడుతున్నా - దేశ్ రాగంలోకి వెళ్ళకుండా కేదార గౌళ రాగంలా అనిపించకుండా మధ్యమావతి లక్షణాలను ప్రతిఫలింపజేస్తూ ఈ పాటను మాస్టర్ వేణు మలచిన తీరుని, ఆ విశిష్టతను కేవలం స్వరకర్తలు, వాద్యకారులు మాత్రమే గ్రహించగలరు. పాట సాహిత్యం, పాడిన పద్ధతి ఎంత హుందాగా సాగిపోతాయో చరణాల మధ్య గల ఇంటర్‌లూడ్స్ వాటికి భిన్నంగా కొంచెం

హుషారుగా వయ్యారాలతో ఉంటాయి. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుకి - యుగళగీతాన్ని నృత్య దర్శకులపై ఆధారపడకుండా మూమెంట్స్‌తో సహా స్వతంత్రంగా రూపకల్పన చేసుకుని చిత్రీకరించటం అలవాటు. నృత్య దర్శకులను యుగళ గీతాల చిత్రీకరణ సమయంలో ఆయన రానిచ్చేవారు కాదట. అందుచేత ఈ పాటను అక్కినేని, సావిత్రిపై ఎలా చిత్రీకరిస్తారోనని అనుకుంటూ ఉత్సుకతతో ఎదురు చూసిన నిర్మాత దుక్కిపాటి మధుసూధనరావుగారికి - ఆ ఇంటర్ లూడ్స్‌ని రేలంగి, రాజసులోచనపై చిత్రీకరించటం చూసి - ఆదుర్తి వారి స్కీమింగ్‌కి ఆనందాశ్చర్యాలు కలిగాయిట. "'ఓ..ఓ..ఓ' అనే ఆలాపనతో ఈ పాట బాగా కనిపించదండీ.. ఈ మాట డైరెక్టర్ గారికి చెప్పాలంటే భయంగా ఉంది. ముందు ముందు మీ చిత్రాల్లోని పాటల్లో ఆలాపనలు ఉంటే అవి 'ఓ..ఓ..ఓ' అని కాకుండా 'ఆ...ఆ...ఆ' అని వచ్చేట్టు చూడరూ?" అంటూ మధుసూధనరావుగారిని సావిత్రి బ్రతిమాలిందట. అంతగా లీనం కావటం, అంతటి దార్శనికత ఉండటమే ఆ మహానటి దర్శకురాలు కావడానికి కారణం అయ్యాయేమో? ఈ పాట కోసం "ఆకాశవీధిలో దడదడ ఉరుములు మ్రోగెనే/జడివాన ముంచుకొచ్చి వడగళ్ళు రాలెనే/కడగండ్లు కల్గెనే" అనే ఓ చిన్న బిట్‌ని కూడా రాయించి, పాడించి, అసలు పాట తర్వాత వచ్చే చిన్న ప్రహసనానికి వాడుకున్నారు.

1957లో 'బడాభాయ్' అనే ఓ హిందీ చిత్రం వచ్చింది. ఆ చిత్రం ఆధారంగానే తెలుగులో 'శభాష్ రాముడు' చిత్రాన్ని తీశారు. ఆ 'బడాభాయ్' చిత్రానికి సంగీత దర్శకుడు నాషాద్. (నౌషాద్ కాదు. ఈ నాషాద్ గురించి 'శభాష్ రాముడు' పాటలకు సంబంధించిన విశ్లేషణలున్న ఆ పాతపాట మధురంలో చర్చించటం జరుగుతుంది) సదరు 'బడాభాయ్' సినిమాలో స్వరపరిచిన 'చోరీ చోరీ దిల్ క లగానా బురీ బాత్‌హై' పాట ఆ రోజుల్లో పెద్ద హిట్ ఆ పాట పోలికలు, ఛాయలు ఈ 'ఆకాశవీధిలో అందాల జాబిలి' పాటలో చాలా వరకూ కనిపిస్తాయి. మధ్య మధ్య వేణు మార్క్స్ ఉన్నా సరే..! ఆ పాటనీ ఈ పాటనీ పక్కపక్కనే పెట్టుకుని వింటే - రెండూ ఎంత దగ్గరగా ఉన్నయో తెలుస్తుంది. కావాలంటే 'చోరి చోరి దిల్ కా లగానా బురి బాత్ హై' పాట ఆధారంగా 'శభాష్ రాముడు'లో స్వరపరిచిన 'కల కల విరిసి జగాలే పులకించెనే' పాటనీ, 'ఆకాశవీధిలో అందాల జాబిలి' పాట నీ కలిపి పాడుకుని ఆ పోలికల్ని పట్టుకోవడానికి ప్రయత్నించండి. అదో ప్రత్యేకమైన అనుభూతిగా మనసులో మిగిలిపోతుంది. ఇక్కడ గమ్మత్తేమిటంటే - ఆ హిందీ పాట ఆధారంగా స్వరపరచబడిన ఈ రెండు తెలుగు పాటల్ని శ్రీశ్రీయే రాశారు. అదీ విశేషం.

---

అ: పెను చీకటాయె లోకం
చెలరేగే నాలో శోకం
విషమాయె మా ప్రేమా
విధియే పగాయె ||పెను||
ఆ: చిననాటి పరిణయ గాధ
ఎదిరించలేనైతినే
ఈనాటి ప్రేమగాధ తలదాల్ప లేనైతినే
కలలే నశించిపోయే
మనసే కృశించిపోయే
విషమయె మా ప్రేమా విధియే పగాయె ||పెను||
అ: మొగమైన చూపలేదే
మనసింతలో మారెనా
నా ప్రాణ సతివని తెలిసే
అవకాశమే పోయెనా
చిననాటి కలతల వలన
హృదయాలు బలి కావలెనా
విషమాయె మా ప్రేమా విధియే పగాయె ||పెను||

చిత్రంలో గల పాటలన్నింటిలోనూ ఆణిముత్యం లాంటి పాట ఇది. కళ్యాణి రాగంలో శోకరసం ఎంత గాఢంగా పలుకుతుందో తెలియజేసే పాట ఇది. శరీరం రోమాంచితం అవుతూ ఉండగా గుండె చెమరించడం, కళ్ళలో రస బిందువులతో కూడిన సన్నటి పొర కదలాడడం వంటి అనుభూతులు - ఘంటసాల చూపిన గళ మధురిమ ద్వారా అవగాహనలోకొస్తాయి. గమకాలు సహజంగా పడడం అంటే ఏమిటో తెలుసుకోవాలంటే - 'మొగమైన చూపలేదే మనసింతలో మారెనా' అనే వాక్యంలో 'లేదే' దగ్గిరా, 'మారెనా' దగ్గిరా - గమనిస్తే చాలు.

ఇక ఈ పాటకు సంబంధించి - ట్యూన్ వరకు ఈ చిత్రానికి మూలమైన 'అగ్ని పరీక్ష' (బెంగాలి 1955) చిత్రంలోని 'కె తుమీ అమారే దాకో' అనే పాట వరుసను యధాతథంగా వాడుకున్నారు. అనుపమ్ ఘటక్ సంగీతాన్నిచ్చిన ఈ బెంగాలీ పాటను సంధ్యా ముఖర్జీ పాడారు. సుచిత్ర సేన్, ఉత్తమ్ కుమార్ అభినయించారు. నిజం చెప్పాలంటే తెలుగు వెర్షన్‌లో ఘంటసాల గళం హాయిగా ఉంటుందో బెంగాలీ వెర్షన్‌లో సంధ్యా ముఖర్జీ వాయిస్ అంత మృదువుగా అంతకన్నా మెత్తగా ఉంటుంది. ఇప్పటి సంగీత దర్శకుల మనస్తత్వం అప్పటి సంగీత దర్శకులకు ఉండి ఉంటే ఖచ్చితంగా తెలుగు పాటను కూడా సంధ్యా ముఖర్జీతోనే పాడించి ఉండేవారు.

ఈ బెంగాలీ పాట వీడియో, యూ ట్యూబ్‌లోనూ, ఆడియో రాగా డాట్ కాం.లోనూ ఉన్నాయి. కావాలంటే విని కంపేర్ చేసుకోండి.

---

ఆ: వాడిన పూలే వికసించెనే - చెర
వీడిన హృదయాలు పులకించెనే
అ: తీయని కలలే ఫలియించెనే - ఎల
కోయిల తన గొంతు సవరించెనే
ఆ: వేయి రేకులు విసిరింది జలజం
అ: తీయ తేనియ కొసరింది భ్రమరం
ఆ: లోకమే ఒక ఉద్యానవనము
లోటూ లేదిక మనదే సుఖము
అ: పగలే జాబిలి ఉదయించనేల
ఆ: పగలే చాలును పరిహాసమేల
అ: తేట నీటను నీ నవ్వు మొగమే
తేలియాడెను నెలరేని వలెనే
ఆ: జీవితాలకు నేడే వసంతం
అ: చెదిరి పోవని ప్రేమానుబంధం
ఇ: ఆలపించిన ఆనంద గీతం
ఆలకించగ మధురం మధురం

ఈ పాట సింధుభైరవి రాగానికి - మధ్య మధ్య పీలూ రాగాన్ని కలుపుకుంటూ మలచబడ్డ పాట.

'పగలే జాబిలి ఉదయించెనేల' అన్న చరణంలోని మూడు లైన్లనూ తిలంగ్ రాగచ్ఛాయలో స్వరపరిచారు. ప్రియురాలి ముఖబింబాన్ని నీటిలో చూసి పగలే జాబిలి ఉదయించినట్లు వర్ణిస్తే బాగుండునన్న ఆలోచన తమిళ వెర్షన్‌కు రాసిన ఉడుమలై నారాయణ కవిది. 'ఇది బాగుంది ఇలాగే తీసుకుందాం' అని ఆ చరణం వరకూ ఆ భావాన్ని తెలుగులో రాశారు శ్రీశ్రీ

రచయితగా శ్రీ శ్రీ - గాత్రధారులుగా సుశీల, ఘంటసాల - పాత్రధారులుగా సావిత్రి, అక్కినేని - ఈ మూడు పాటలకూ కామన్ అయినా మూడు పాటలూ దేనికదే ఓ ప్రత్యేకతలో ఉండి హిట్ అవటం ఇవాళ ఓ విశేషంగా చెప్పుకోదగ్గ విషయం.

ఇది కాక మరో విశేషమేమిటంటే - అన్నపూర్ణ సంస్థకి ఆప్తులైన ఆత్రేయ కూడా ఈ చిత్రంలో ఓ పాట రాశారు. 'రెండు కుటుంబాలను కలపటానికి చిన్నపిల్లలకు పెళ్ళి చేసావు కానీ దూరం ఇంకా పెరిగింది' అనే భావంతో రచనా పరంగా లోతులకెళ్ళి ఆత్రేయ రాసిన ఆ మూడు చరణాల పాట సుశీల - ఘంటసాల పాడగా రికార్డు చేసారు. కన్నాంబ - ఎస్వీ రంగారావు మొదలైన వారిపై చిత్రీకరించారు కూడా. కానీ సెన్సారు ఆఫీసరు జి.టి.శాస్త్రి అభ్యంతరం చెప్పారు. పిల్లలకు పెళ్ళి చేసినట్లు చూపించినా కారకులైన వారికి కోర్టులో శిక్ష పడేట్లు చూపించారు కాబట్టి సరిపోయింది. కానీ ఆ పాట మాత్రం బాల్య వివాహాలని సమర్థిస్తున్నట్లు ఉంది. చట్టరీత్యా నేరం, తీసేయక తప్పదు' అన్నారాయన ఓ ఆప్తుడిగా(కూడా) సలహానిస్తు. ప్రొడక్షన్ వ్యవహారాలు చూసే సంపత్ అనే కుర్రాడి దగ్గర్నుంచీ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు వరకూ అందరికీ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అంత బాగా వచ్చిందా పాట. కానీ మధుసూదనరావుగారు సెన్సారు ఆఫీసరు చేసిన ఆర్గ్యుమెంట్సుకి కన్విన్స్ అయ్యారు. గుండెను రాయిగా చేసుకుని ఆ పాట మొత్తం తొలిగించారు. సర్టిఫికెట్ కోసం తీసేసి - రెండో రోజుకే జతచేసి ప్రదర్శనలు జరుపుతున్న ఈ రోజుల్లో - ఆనాడు కట్ చేసిన ఆ పాటకు సంబంధించిన సమాచారం ఇవాళ ఆవగింజంత కూడా దొరకదంటే ఆశ్చర్యంగానే ఉంటుంది.

---

అ: మైడియర్ మీనా! మహా మంచిదానా!
వీలు చిక్కెనా? నేటికి జాలికల్గెనా
ఆ: మైడియరు సారూ! అహ తగ్గించు జోరు
నవ్వి పోతారు నలుగురు నవ్వి పోతారు.
అ: తగ్గు తగ్గంటావు తప్పించుకుంటావు
టైము లేదంటావు టక్కు జేస్తుంటావు
ఎంత వేడినగాని, వినను పొమ్మంటావు
ఏకాకిగా జేసి ఏడిపిస్తుంటావు మైడియర్
ఆ: పిలిచి పిలిచీ నన్ను ఉలికింప జేస్తావు
ప్రేమ పాఠాలన్ని వల్లించేస్తావు
పదిమందిలో నీవు పలచనైపోతావు
నా బ్రతుకు తీస్తావు నగుపాటు జేస్తావు ||మైడియర్||

అ: పస్తులైనా ఉండి కాపాడతాను ప్రానమైనా నీకు ధారపోస్తాను
పూలలోనా బెట్టి పూజింతాను నీళ్ళలోనా మునిగి బాస జేస్తాను
అ: కొత్తగా నీ పైత్యమేముందిలే కుర్రాళ్ళకీ వెర్రి సహజమ్ములే
ఈ రోజుకి గొడవ చాలించులే
తీరికగ నీ గోల వింటానులే ||మైడియర్||

ఈ పాటను కొసరాజు రాయగా మాధవపెద్ది, జిక్కి పాడారు. టైటిల్స్‌లో జిక్కి పేరుని పి.జి కృష్ణవేణిగా వేసిన చిత్రాల్లో ఇదొకటి. పాట సాహిత్యాన్ని ఒక్కసారి గమనించి చూడండి. ఆదర్శంగా ఉండవలసిన హీరో హీరోయిన్ల యుగళగీతాల్లో సైతం అనైతికత ధ్వనిస్తున్న నేటి సాహిత్యానికి, హాస్య జంటకు నిర్దేశించబడిన ఆనాటి ఈ యుగళ గీతంలోని నైతిక నిబద్ధతకి, తేడా తల్చుకుంటే ఎవ్వరి హృదయమైనా సరే సిగ్గుతో బాధపడక తప్పదు. ఈ పాట చరణాల మధ్య ఇంటర్ల్యూడ్స్‌ని బాగా మనసుకి పట్టించుకుంటే మాస్టర్ వేణు స్వరపరిచే పాటలని ఎప్పుడు ఎక్కడ విన్నా 'ఇది వేణు మార్క్స్' అని ఇట్టే పట్టేయవచ్చు. చక్కటి సరదా గీతమిది.

ఇక నేపథ్యసంగీతానికి సంబంధించిన విశేషాలు కొన్ని ఉన్నాయి. రేలంగిగారు డిక్కీలో రాజసులోచన దాక్కుని ప్రయాణం చేసిన సన్నివేశంలో ఉపయోగించిన సంగీతం 'కులదైవం' చిత్రంలోని 'ఆడిపాడెను నా మది ఈ వేళా అరుదెంచే ఉగాది శుభవేళా' పాటగా వచ్చింది. అలాగే రేలంగి తన రూముని దుప్పట్లతో సగభాగం చేసి రాజసులోచనకు ఆశ్రయం ఇచ్చిన సన్నివేశంలో వినిపించిన ట్యూన్ - అంతకుముందు 'తోడికోడళ్ళు' చిత్రంలో ఆ జంట మీదే చిత్రీకరించిన 'నీ తోనే ఉంటాను రమణయ్య మావా' అన్న పాటే! ఇక అక్కినేని, సావిత్రికి సంబంధించి తాంబూలం సీన్‌లోనూ, చిన్నతనంలో తనకు తాళి కట్టింది, తను ప్రేమించింది ఒకరేనన్న నిజం సావిత్రికి తెలిసిన సన్నివేశంలోనూ, చివరికి అందరూ కలిసి భోజనం చేస్తున్న సన్నివేశంలోనూ, కామన్‌గా వినిపించిన సంగీతం - తరువాత వచ్చిన 'బాటసారి' చిత్రంలో 'మౌనములు చాలుర మదిని పగ ఏలరా' పాటగా రూపుదిద్దుకుంది. అవన్నీ ఇప్పుడు గమనిస్తే ఆసక్తికరంగా ఉండటమే కాకుండా నిత్యం సర్వాంబుధిలో మునిగి తేలే ఆనాటి అధ్యయన రీతులపై గౌరవాభిమానాలు పెరుగుతాయి కూడా.



# ఆ పాత పాట మధురం

## రాజా



## అప్పుచేసి పప్పుకూడు

**వీనుల విందు,** కన్నుల పండుగ, మనసుకి తృప్తి.. ఇవన్నీ విజయావారి చిత్రాలు చూసిన తరువాత కలిగే భావాలు. 1959లో విడుదలైన విజయావారి 'అప్పుచేసి పప్పుకూడు' చిత్రంలోని పాటలు కూడా అదే అనుభూతికి తిరిగి ఊపోసనపడతాయి. ఈ చిత్రంలోని 'కొన్ని' పాటలలో ఓ ప్రత్యేకత ఉంది. సాహిత్యాన్ని పక్కన పెట్టేసి పాటను మాత్రం ఆలపించుకుంటూ పోతే పల్లవికి. చరణాలకు ట్యూన్‌లో తేడా పెద్దగా ఉండదు. అయినా ఎక్కడా విసుగు చెందని రీతిలో ఆపాటలున్నాయంటే అందుకు కారణం. అసలు బలం ఏమిటన్నది నిజాయితీగా అంతర్ముఖులై ఎవరికివారు తమని తాము ప్రశ్నించుకుంటే దొరుకుతుందే తప్ప వాదోపవాదాల వల్ల లభించదు. ఎస్. రాజేశ్వరరావు సంగీతాన్ని సమకూర్చగా పింగళి నాగేంద్రరావు రాశారా పాటలని. నాగిరెడ్డి, చక్రపాణి ఈ చిత్రానికి నిర్మాతలు కాగా జాతీయ స్థాయిలో తెలుగువారు గర్వించదగ్గ మహామనీషి ఎల్.వి.ప్రసాద్(అక్కినేని లక్ష్మీ వరప్రసాద్) దర్శకుడు. అరవై నాలుగు కళలలో సంగీత సాహిత్యాలకు అగ్ర తాంబూలం ఇచ్చారు పెద్దలు. అలాగే భారీ తారాగణానికి ధీటుగా పాటలు ఉండేలా సంగీత సాహిత్యాల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధను తీసుకుంటూ అది తమ పరువు ప్రతిష్ఠలకు సంబంధించిన సవాల్‌గా బ్యానర్‌కొక విలువను సంపాదించి పెట్టేవారు ఆ రోజుల్లో. అటువంటి ప్రాశస్త్యాన్ని కలిగిన విజయావారు నిర్మించిన చిత్రమే అప్పుచేసి పప్పుకూడు.

ఆ చిత్రంలోని పాటలలో ఓ అయిదు

అప్పుచేసి పప్పుకూడు తినరా ఓ నరుడా
గొప్పనీతి వాక్యమిదే వినరా పామరుడా
దొంగతనము తప్పురా దోపిడీలు ముప్పురా
అందినంత అప్పుచేసి మీసం మెలితిప్పరా ||అప్పు||
ఉన్నవారు లేనివారు రెండే రెండు జాతులురా
ఉన్నచోట తెచ్చుకొనుట లేనివారి హక్కురా ||అప్పు||
వేలిముద్ర వేయరా సంతకాలు చేయరా
అంతగాను కోర్టుకీడిస్తే ఐ బాంబుందిరా ||అప్పు||
రూపాయె దైవమురా రూపాయే లోకమురా
రూకలేని వాడు భువిని కాసుకు కొరకాదురా ||అప్పు||

ఈ పాట టైటిల్స్ చూపిస్తుండగా వస్తుంది. ఘంటసాల ప్రధాన గాయకుడుగా సాగిన ఈ నేపథ్య బృందగీతాన్ని హరికాంభోజి రాగచ్ఛాయలలో స్వరపరిచారు. వ్యంగ్య వైభవంతో రాసిన ఈ పాట సాహిత్యంలో గల అర్థాన్ని, పరమార్థాన్ని గ్రహిస్తూ మరోసారి మననం చేసుకుంటూ అవలోకించగలిస్తే - ఈ నలభై నాలుగేళ్ళుగా అర్థం విషయంలోనూ, స్వార్థం విషయంలోనూ మనలో ఏ మార్పూ రాలేదన్న విషయాన్ని - చీమ కుట్టినట్టుగా కూడా ఫీలవనంత మంద మనస్కులుగా ఎలా మరిపోయామా అనే బాధ కలుగుతుంది.

---

మంజరి: చివురుల పూవుల సింగారముతో తీవెలు సొంపును గనలేదూ
ముసిముసి నవ్వుల గిలిగింతలతో వసంత ఋతువా రానేలేదూ -
కాలం కాని కాలంలో కూయిల కూత లెందుకనో
తరుణం కాని తరుణంలో న మది ఈ గుబులెందుకనో ||కాలం కాని||

ఉష: వలపులు మీటగ తీయని పాటలు హృదయ వీణపై పలికెనుగా
ప్రియతమ గాంచిన ఆనందంలో మనసే వసంత ఋతువాయెనుగా
కాలం కాని కాలంలో కోయిల కూతలందుకనే
తరుణం కాని తరుణంలో నీ మది ఆ గుబులందుకనే ||కాలం కాని||

మంజరి: తళుకు బెళుకుల తారామణులతో శారదరాత్రులు రాలేదూ
ఆకాశంలో పకపకలాడుతు రాకా చంద్రుడా రానే లేదూ -
కాలం కాని కాలంలో చల్లని వెన్నెల ఎందుకనో
తరుణం కాని తరుణంలో నా మది ఈ గుబులెందుకనో ||కాలం కాని||

ఉష: తలచిన తలపులు ఫలించగలవని బులబాటము బలమాయెనుగా
పగటి కలలు గను కన్యామణులకు ప్రియుడే రాకా చంద్రుడుగా
కాలం కాని కాలంలో చల్లని వెన్నెల అందుకనే
తరుణం కాని తరుణంలో నీ మది ఆ గుబులెందుకనే ||కాలం కాని||

ఈ పాటను పి.లీల, పి.సుశీల పాడగా సావిత్రి, గిరిజ అభినయించారు. పాట చివర్లో యస్వీరంగారావు, రమణారెడ్డి కూడా కనిపిస్తారు. భీంప్లాస్ రాగం అంటే ఎలా ఉంటుందని తెలుసుకోవాలనుకునే వారికి ఈ పాట ఒక మంచి ఉదాహరణ. అంతేకాదు. ఈ భీంప్లాస్ రాగంలో రాజేశ్వరరావు గారి శైలిని ఆకళింపు చేసుకోడానికి కూడా పనికొస్తుందిపాట. కావాలంటే చరణాలలోని తొలి పంక్తులను ఆలపించుకుంటూ రాగఝరీ ప్రపంచంలో కాస్సేపు నిమగ్నమవడానికి ప్రయత్నించండి. 'చదువుకున్న అమ్మాయిలు' సినిమాలోని 'ఒకటే హృదయం కోసము' పాట స్ఫురిస్తుంది. ఇంకా కాస్త వెనక్కి వెళ్ళగలిగితే రాజేశ్వరరావు గారి ప్రైవేటు రికార్డు 'పాట పాడుమా కృష్ణా.. పలుకు తేనెలొలుకునటుల' అనే పాట స్మృతి పథంలో సాక్షాత్కరిస్తుంది. ఈ రెండు అనుభవాలను పొందగలిగితే భీంప్లాస్ రాగం మీద అవగాహన కొంత వచ్చేసినట్టే. ఇక సాహిత్య పరంగా చూసుకుంటే యుక్తవయసు వచ్చిన ఇద్దరమ్మాయిల మనోభావాలు. ఆ మనోభావాల స్వభావాలు. వీటిని భాషలోకి అనువదించాల్సి వస్తే - అదీ రాగ తాళాలకు కట్టుబడే ఒక పాట రూపంలో చెప్పాల్సివస్తే - ఎలా రాయాలి అనే కోణం నుంచి ఆలోచిస్తే - ఈ పాటలో రచయితగా పింగళి నాగేంద్రరావు చూపిన సంస్కారానికి హృదయం పులకించిపోతుంది. తాళం, లయ ప్రసక్తి వచ్చింది కనుక ఈ పాటలో గమనించవలసిన విషయాలలో వాటి గురించి కూడా చెప్పాలి. ఒక లయ, ఒక తూగు పాట మొత్తం పరుచుకుని ఉన్నా, తాళం మాత్రం ఒక్క పల్లవి వచ్చినప్పుడు మాత్రమే ఉంటుంది.

---

భజ: ఓ మరదలా! నా మదిలో పొంగి పొరలే ప్రేమ వరదలా
నీరూ, పాలూ కలిసి ఒకటై నటులే నీవూ, నేనూ ఒకటేగదా - ఓ పంచెవన్నెల చిలకా
ఓ పంచవన్నెల చిలకా! నీ కెందుకింత అలకా! ||ఓ పంచ||
మాటాడవేమే, మాటాడవేమే నీ నోటి ముత్యాలొలకా!
ఉష: ఓహో! బావా! మార్చుకో నీ వంకరటింకర దోవా!
ఊరికే, నీవూ నేనూ ఒకటే ననుకుంటే ఒప్పుతుందా ఈ లోకం.. ఓ కొంటె బావగారూ
ఓ కొంటె బావగారూ, మనకెందుకింక పోరూ -
మా నాన్నగారు చూస్తే, మా నాన్నగారు చూస్తే మీ దుమ్ము దులుపుతారు ||ఓ కొంటె||
భజ: సీమ టపాకాయలాగ, చిటపటలాడేవు ||సీమ||
ప్రేముందా లేదా ఓ మరదలా నా మీదా ||పంచ వన్నెల||
ఉష: మరదలినైతే మాత్రం, మరీ అంత చనువా ||మరదలి||
మర్యాద కాదూ నీ బావమరిది చొరవా ||ఓ కొంటె||

ఈ పాటలను ఘంటసాల, స్వర్ణలత పాడగా రేలంగి, గిరిజ అభినయించారు. ఒక హాస్య జంటకు యుగళగీతం రాయాల్సి వస్తే ఎటువంటి పద ప్రయోగాలు చెయ్యొచ్చు, సంస్కారం సరిహద్దులు దాటకుండా భాషని భావాలకు ఎంతవరకు సహకరింప చేయవచ్చు అనే అంశంపై ఎప్పటికప్పుడు ధోరణులు మారుతూవున్నా కొన్నిటినైనా ప్రామాణికంగా తీసుకోక తప్పదు. అటువంటి ప్రామాణిక గీతాలలో ఈ పాట కూడా ఒకటి. కావాలంటే ఉన్న రెండు చరణాలలో స్త్రీ పాత్రకి రాసిన వాక్యాలను గమనించండి. ఇదే భావాలకి తర్వాతి రోజులలో వచ్చిన సాహిత్యం ఎటువంటి మార్పులకు గురి అయిందో బేరీజు వేసుకోండి చాలు. ఒక మంచి పాట పుట్టాలన్నా, పాటల ద్వారా సంస్కారం పెరగాలన్నా, పెంచుకోవాలన్నా ఈ రకమైన 'మనోవికాస వైజ్ఞానిక వ్యాయామం' తప్పదు మరి.

ఇక స్వరరచన పరంగా చూసుకుంటే ఈ పాట పీలూ రాగంపై ఎక్కువగా ఆధారపడిందని చెప్పుకోవాలి. ఈ రాగంలో వచ్చిన పాటల గురించి తెలుసుకోవాలంటే - 'ప్రభు గిరిధారి శౌరీ రావయా' (పరువు - ప్రతిష్ఠ), 'ఆదిలక్ష్మి వంటి అత్తగారివమ్మా' (జగదేకవీరుని కథ), 'నీకై వేచితినయ్యా ఓ ఏకాంత రామయ్యా' (శ్రీ కృష్ణార్జున యుద్ధం) పాటలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఉదహరించిన పాటల బట్టి రాగం పోకడను అవగాహన చేసుకోగలిగితే - అటువంటి రాగాన్ని - ఇంత హాస్యస్ఫోరకమైన గీతానికి వాడడంలో రాజేశ్వరరావు ప్రజ్ఞ తెలుస్తుంది. చరణాలలోగానీ, ఇంటర్ లూడ్స్‌లోగానీ - ఎక్కడైనా రావోయి చందమామా (మిస్సమ్మ) పాట గుర్తుకు రావడం సబబు. అందుకు కారణం ఏమిటంటే రావోయి చందమామ పాటకి బేసికల్ గా భీంప్లాస్ రాగం ఆధారమే అయినా చరణాలలో స్వతంత్ర సంచారం చేశారు రాజేశ్వరరావు. అలా స్వతంత్రంగా చేసిన సంచారంలో పడిన స్వరాలు ఈ పీలూ రాగంలో కూడా ఉన్నాయి. 'చెవులుండే మనసుకే ఇనిపిస్తుందా ఇదీ' అని ఆత్రేయగారన్నట్టు - మంచి పాట ఏదైనా సరే - కాస్త లోతుగా వెళ్ళగలిగితే - ఎన్నో విషయాలు నేర్పుతుంది మనకి.

మంజరి: ఎచటి నుండి వీచెనో ఈ చల్లని గాలి ||ఎచటి||
తీవెలపై ఊగుతూ పూవులపై తూగుతూ ||తీవె||
ప్రకృతి నెల్ల హాయిగా
రాజా: ఎచటి నుండి వీచెనో ఈ చల్లనిగాలి
జాబిలితో ఆడుతూ వెన్నెలతో పాడుతూ ||జాబిలి||
మనసు మీద హాయిగా.. మనసు
తీయగా మాయగా మత్తుమందు జల్లుతూ
మంజరి: ఎచటి నుండి వీచెనో ఈ చల్లనిగాలి
హృదయవీణ మీటుతూ ప్రేమగీతి పాడుతూ ||హృదయ||
ప్రకృతి నెల్ల హాయిగా.. ||ప్రకృతి||
తీయగా మాయగా పరవశింపజేయుచు ||ఎచటి||

ఈ పాట ఈ రోజుకి కూడా తీయగా, మాయ(లా)గ, మత్తుమందు జల్లుతూ పరవశింపజేస్తూ ఉంటుంది. ఘంటసాల, లీల పాడిన ఈ పాటను ఎన్.టి.ఆర్, సావిత్రి అభినయించారు. మోహనరాగంలో త్రిశగతిలో సాగిన ఈ పాట స్వరరచనలో మాధుర్యం కోసం నిషేధం ('ని అనే స్వరం)ని కలుపుకున్నా అలా వచ్చిన స్వరాల నడక 'హంసధ్వని' రాగంలా ధ్వనించకుండా 'సినీమోహన' అని అనుకునేలా ఉండడం ఓ ప్రత్యేకతగా చెప్పుకోవాలి. (ఇటువంటి అనుభవాల్ని దృష్టిలో పెట్టుకోబట్టే 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రంలో మోహనరాగాన్ని వర్ణించవలసిన 'మోహనరాగమహా' అనే పాటలో 'చిత్రసీమలో వెలయగజేసి దివ్యగానమున జీవము పోసి' అనే వాక్యాలను పింగళి నాగేంద్రరావు గారు నర్మగర్భంగా రాసారేమోనని కొందరు ఆత్మీయంగా భాష్యం చెబుతూ ఉంటారు కూడా) 'ఎచటి నుండి వీచెనో' పాటలో ఫ్లూట్, పియానో మాత్రమే ప్రధానంగా వినిపిస్తాయి. తెరపై కనిపించే హీరో హీరోయిన్లకి డ్రెస్ ఛేంజ్ లేదు. లొకేషన్ ఛేంజ్ లేదు. మూమెంట్ విషయంలో కూడా ఎడం పక్క ఎన్.టి.ఆర్ గానీ కుడిపక్క సావిత్రి గాని ఒక్క అడుగు కూడా ముందుకు కదలడం ఉండదు. వినిపించే వాద్యాలు కూడా రెండే మరి ఆ పాటని ఇవాల్టికీ వినడానికే కాక చూడ్డానికెూడా ఇష్టపడుతున్నారంటే అందుకు కారణం ఏమిటన్నది తిరిగి ఎవరికి వారు తమలోకి తాము తొంగి చూసుకుని అర్థం చేసుకోవలసిందే!

మంజరి: సుందరాంగులను చూసిన వేళల
కొందరు ముచ్చట పడనేలా
కొందరు పిచ్చను పడనేలా ||సుంద||
రఘు: అందము ప్రాయము ఐశ్వర్యము గల
సుందరి దొరుకుటె అరుదుకదా ||అందము||
ముందుగ ఎవరిని వరించునోయని
తొందరలో మతిపోవుకదా ||సుంద||
రాజా: హృదయమునందలి ప్రేమగీతమే
మధురముగా వినిపించు కదా
మందహాసమున మనసును దెలిపే
ఇందువదన కనువిందు కదా

మంజరి: ప్రేమ పరీక్షలు జరిగే వేళల
కొందరు పరవశ పడనేలా
కొందరు కలవర పడనేల
రఘు: యువతి చెంత పరపురుషుడు నిలిచిన
భావావేశము కలుగుకదా ||యువతి||
ప్రేమ పందెమును గెలిచే వరకు
నా మది కలవర పడును కదా ||ప్రేమపరీక్షలు||
రాజా: కోయిల పలుకుల కోమలి గాంచిన
తీయని తలుపులు కలుగు కదా ||కోయిల||
వరము లొసంగే ప్రేమదేవి గన
ప్రవశమే మది కలుగుకదా ||సుంద||

ఈ పాట ఆరభి రాగంలో చతురస్ర రీతిలో మలచబడింది. లీల, ఎం.ఎ.రాజా, ఘంటసాల ఆలపించగా సావిత్రి, జగ్గయ్య, ఎన్.టి.ఆర్ అభినయించారు. ఈ పాటను వినగానే 'ఇది విజయావారి సినిమాలోది కదూ?' అని ఓ మోస్తరుగా అడపాదడపా సినిమాలు చూసే వాళ్ళు కూడా ఇట్టే చెప్పేస్తారు. అందుక్కారణం - 'మిస్సమ్మ' చిత్రంలో ఇదే రాజేశ్వరరావుగారి చేతులమీదుగా వచ్చిన 'బృందావన మది అందరిది' పాటే. పక్క పక్కన పెట్టి చూస్తే ఈ రెండు పాటలూ అక్క చెల్లెళ్ళలా ఉంటాయి. చాలాకాలం గ్యాప్ తీసుకుని విజయావారు నిర్మించిన 'రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్' సినిమాలో పెండ్యాల సంగీతంలో వచ్చిన 'నా పేరు బికారీ నా దారి ఎడారి' పాట, ఆ తర్వాత ఇంకొంచెం గ్యాప్ తీసుకుని నిర్మించిన 'బృందావనం', 'భైరవద్వీపం' సినిమాలలో మాధవపెద్ది సురేష్ సంగీతంలో వచ్చిన ఆ రోజు నా రాజు చిరునవ్వు చూసి అనుకున్నా ఏదో నవ్వని' పాట, 'ఘాటైన ప్రేమ నటన' పాట ఇవన్నీ ఆ రెండు పాటల ప్రేరణతో పుట్టినవే. విజయా సంస్థతో సన్నిహిత సంబంధాలు ఉన్న దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుగారు ఓసారి ఓ టీవీ సీరియల్‌కి సంగీత దర్శకత్వాన్ని వహించవలసి వచ్చినప్పుడు 'మా విజయావారి రాగాన్ని వాడుకుందామా?' అంటూ ఓ చరణాన్ని ఆ రాగంలో ట్యూన్ చేశారు కూడా. త్రికోణ ప్రేమలో కలిగే హృదయ స్పందనలను వర్ణించే గీతాలలో ఇంత సంస్కారంగా ఇంత చమత్కారంగా మరోపాట రాలేదేమోనన్నంత ఉదాత్తంగా సాహిత్య సుగంధాలను పాట మొత్తం పరచిన పింగళివారి పాళీని తల్చుకుని మరీ మురిసిపోక తప్పదు.



# ఆ పాత పాట మధురం

## రాజా



### అప్పుచేసి పప్పుకూడు - 2

**సినిమాలో హాస్యానికి ప్రశంసనీయమైన** స్థానన్నివ్వడం వేరు, సంపూర్ణ హాస్య చిత్రాన్ని నిర్మించటం వేరు. అలా సంపూర్ణ హాస్యంతో నిర్మించబడిన చిత్రాలలోని హాస్యపు స్థానం గర్వించతగ్గదిగా ఉండటం అంతకన్నా వేరు. గర్వించదగ్గ స్థాయిలో ఉన్న హాస్యంతో పాటు మానవతా విలువలున్న కథా కథనం - వాటికి జతపడే సంగీత సాహిత్యాలు - వీటన్నిటి కలయిక అతి అరుదుగా జతపడుతూ ఉంటాయి. అటువంటి చిత్రాల కోవలోకి వచ్చే చిత్రమే అప్పుచేసి పప్పుకూడు.

..

రఘు: మూగవైన ఏమిలే
నగుమోమే చాలులే
సైగలింక చాలింపుము
జాణ తనము తెలిసెనులే
ఆపలేని అనురాగం చూపులలో తొణికెనులే ||ఆపలేని||
దొంగ మనసు దాగదులే ||దొంగ||
సంగతెల్ల తెలిసెనులే ||మూగ||
పలుకకున్న ఏమయెను వలపు బాసలింతేలే పలుక
ననుదయతో ఏలుకొనుము ||నను||
కనుసన్నల మెలిగెదలే ||మూగ||
అందాలే బందాలై నను బందీ చేసెనులే ||అందాలే||
కలవరమిక ఎందుకులే ||కలవర||
వలదన్నా వదలనులే ||మూగ||

ఈ పాటను ఏ.ఎమ్.రాజా పాడగా తెరపై జగ్గయ్య, జమున అభినయించారు. మాల్‌కౌస్ రాగంలో త్రిశగతిలో సాగిన ఈ పాతను అత్యంత హుషారైన రీతిలో రాజేశ్వరరావు మలచారు. ఏ.ఎమ్.రాజా సంగీత జీవితంలో మరిచిపోలేని హిట్‌ని ఆయనకు ఇచ్చిన మరో మంచి పాట ఇది. ఈ పాటలో ఉచ్ఛారణకు సంబంధించిన ఓ విశేషం ఉంది 'అందాలే బందాలైనను బందీ చేసెనులే' అనే

వాక్యంలో 'బందాలై' అనే పదప్రయోగం కొంతమందికి ఆశ్చర్యం కలిగించవచ్చు. 'బంధాలై' అని ఉండాలని అనిపించవచ్చు. 'బందాలై' అనే ప్రయోగం సరియైనదే గాయనీ గాయకుల ఉచ్చారణను బట్టి భాషని, రచయితని తప్పుపట్టే రోజులు కావవి.

---

చిన్నారి చూపులకు ఓ చందమామా
ఎన్నెన్నో అర్థాలు ఓ చందమామ, నా చందమామా ||చిన్నారి||
తలుపు చాటున దాగి ఓరచూపులు చూస్తె
పిలిచినట్టె వెళ్ళి పలకరించాలంట ||తలుపు||
తప్పించుకుని పోయి జాలిగా చూస్తేను
వలచినట్టే ఎంచి మురిసిపోవాలంట ||చిన్నారి||
కనుబొమలు చిట్లించి కోరచూపులు చూస్తె
తననింక విడువనని బాస చేయాలంట ||కను||
కొంగు సవరించుకుని కొరకొరా చూస్తేను
కొంగు సవరించుకుని కొరకొరా చూస్తేను
చెంగు వీడనటంచు చెంత చేరాలంట ||చిన్నారి||

ఈ పాటను ఏ.ఎం.రాజా పాడగా జగ్గయ్య, జమున అభినయించారు. సన్నివేశ ప్రాధాన్యంగా చివర్లో సి.యస్.ఆర్ కనిపిస్తారు. ట్యూన్‌ని పూర్తిగా మరిచిపోయి కేవలం సాహిత్యాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకుని చూస్తే - 'మిస్సమ్మ' సినిమాలోని 'ఆడువారి మాటలకు అర్థాలే వేరులే' అనే పాటకు ఈ పాట సెకెండ్ వెర్షన్‌లా కనిపిస్తుంది. ఇక సంగీతపరంగా చూసుకుంటే హరికాంభోజి రాగచ్ఛాయలు కనిపిస్తాయి. 'పూజాఫలం' సినిమాలో బి.వసంత పాడిన 'వస్తావు పోతావు నాకోసం వచ్చి కూర్చున్నాడు నీకోసం యముడు వచ్చి కూర్చున్నాడు నీకోసం' అనే 'హాస్య-తత్వగీతం' ఈ పాటకు చెల్లెలులా అనిపిస్తుంది. రెండు పాటలకీ సంగీత దర్శకుడు యస్.రాజేశ్వరరావే కనుక 'ఏక మనోజనితాలు'గా అనుకోవచ్చు.

---

రఘు: చేయి చేయి కలపరావె హాయిహాయిగా
నదురు బెదురు మనకింక లేదు లేదుగా ||చేయి||
లీల: పెద్దవారి అనుమతింకా లేదు లేదుగా
చేయి చేయి కలుపుటెలా హాయిహాయిగా ||పెద్ద|| ||చేయి||
రఘు: మగని మాట కెదురాడుట తగదు తగదుగా
నాతి చెంత విరహమునే తాళలేనుగా ||మగని|| ||చేయి||
లీల: వీలుకాని విరహమింకా వలదు వలదుగా
దాసి మీద వలపు మీకు తగదు తగదుగా ||వీలు|| ||చేయి||

'చేయి చేయి కలుపరావే హాయి హాయిగా' పాటను ఏ.ఎమ్.రాజా, పి.లీల పాడారు. తెరపై జగ్గయ్య, జమున అభినయించారు. చివర్లో సి.యస్.ఆర్, యస్వీ రంగారావు కూడా కనిపిస్తారు. అన్యస్వరమైన విషదాన్ని ("ని" అన్న స్వరాన్ని) అక్కడక్కడ కలుపుకున్నా మోహన రాగానికుండే మాధుర్యాన్ని పాటంతా పరుచుతూ స్వరపరచిన ఈ పాట ట్యూనంతా మొదట్నించి చివరి వరకూ ఒకేలా

ఉంటుంది. పల్లవికి చరణానికీ తేడా ఉండదు. అదే ఈ పాట విశేషం. 1989లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తిరిగి రావటానికి ముందు జరిగిన ఎన్నికలలో తమ ప్రచారం కోసం ఈ పాట పల్లవిని తమ ఎన్నికల గుర్తుకు దగ్గరగా ఉందని మొత్తం పాటని ప్యారడీ చేసి వాడుకోవటం, అప్పుడున్న పత్రికలన్నీ ఈ పద్ధతిని ఓ ప్రత్యేక ప్రక్రియగా పేర్కొనటం ఇవన్నీ ఈ పాట సాధించిన పరోక్ష విజయాలే.

---

భజ: కాశీకి పోయాను రామాహరి
గంగ తీర్థమ్ము తెచ్చాను రామాహరి
గంగ తీర్థాము తెచ్చాను రామహరి
ఉష: కాశీకి పోలేదు రామాహరి
ఊరికాల్వలో నీళ్ళండి రామాహరి
భజ: శ్రీశైలం వెళ్ళాను రామాహరి
శివుని వీభూది తెచ్చాను రామాహరి
శివుని వీభూది తెచ్చాను రామాహరి
ఉష: శ్రీశైలం పోలేదు రామాహరి
శివుని వీభూది తేలేదు రామాహరి
ఇది కాష్టంలో బూడిద రామాహరి
భజ: అన్నముక్కరలేదు రామాహరి
ఉత్తగాలి భోంచేస్తాను రామాహరి
ఉష: గాలితో పాటుగా రామాహరి
వీరు గారెలే తింటారు రామాహరి
భజ: కైలాసమెళ్ళాను రామాహరి
శివుని కళ్ళారా చూశాను
రెండు కళ్ళార చూశాను రామాహరి
ఉష: కైలాస మెళితేను రామాహరి
నంది తన్ని పంపించాడు రామాహరి
బాగా తన్ని పంపించారు రామాహరి
భజ: ఆలుబిడ్డలు లేరు రామాహరి
నేను ఆత్మయోగినండి రామాహరి
గొప్ప ఆత్మయోగినండి రామాహరి
ఉష: ఆ మాట నిజమండి రామాహరి
నేను అందుకే వచ్చాను రామాహరి
నేను అందుకే వచ్చాను రామాహరి

ఈ పాటను ఘంటసాల, స్వర్ణలత ఆలపించారు. రేలంగి, గిరిజ అభినయించిన ఈ పాతలో కస్తూరి శివరావు, నల్ల రామ్మూర్తి, బొడ్డపాటి కృష్ణారావు (వినాయక చవితి సినిమాలో వినాయకుడు), అల్లురామలింగయ్య తదితరులు కూడా కనిపిస్తారు. మధ్యమావతి

రాగంలో ఖండగతిలో సాగిన ఈ పాట రచనకు కాశికావడి ప్రదర్శకులు పాడుకునే జానపద గీతం మూలం. ఆ జానపదగీతం ఇలా ఉంటుంది.

కాశీకి పోయాను రామాహరీ - కాశీతీర్థమూ తెచ్చాను రామాహరీ
కాశీకి పోలేదు రామాహరీ - ఊరి కాలువలో నీళ్ళండి రామాహరీ
కాశీకి పోయాను రామాహరి - కాశి విభూతి తెచ్చాను రామాహరీ
కాశీకి పోలేదు రామాహరీ - వీడి కాష్టంబులో బూడిదండి రామహరీ
పంచేంద్రియములూ రామాహరీ - నేను బంధించి ఉన్నాను రామాహరీ
కొంచెం నమ్మినా రామాహరీ - కొంపముంచి వేస్తాడండి రామాహరీ.

ఇదీ ఆ జానపద గీతం ధోరణి. విలువలు పాటిస్తే హాస్యగీతమైనా సరే నాలుక్కాలాలు పాటు నిలబడుతుందని నిరూపించిన ఈ పాట కూడా ట్యూన్ పరంగా పల్లవికి, చరణానికి ఏ మాత్రం తేడా లేకుండా ఉంటుంది.

---

ఈ పాటలే కాక కొన్ని పద్యాలు కూడా ఉన్నాయి ఈ చిత్రంలో. అందులో ఓ సరదా పద్యమిది...

సీ: నవకళా సమితిలో నా వేషమును చూసి
ఎచ్చటెచ్చటి జనుల్ మెచ్చవలదె!
నటరాజ నటరత్న నటకావతం సుడన్
బిరుదులు గొని విఱ్ఱవీగవలదె!
ప్రతి పట్టణ గ్రమ పల్లెపల్లెలు కూడా
ఈ భజగోవింద మేలవలదె!
ఊరూర గల కాఫీ హోటళ్ళలో, కిల్లి
కొట్లలో మన కప్పు పుట్టవలదె!
ఆంధ్ర నాటక రంగమార్తాండు డనుచు
సభలు కావించి ప్రేక్షకుల్ సత్కరింప
పెట్టుబడికోస మప్పులిప్పించి, ఇచ్చి,
ఈ విశాలాంధ్ర నన్ను పోషింపవలదె !

ఈ పద్యాన్ని ఘంటసాల ఆలపించగా రేలంగి అభినయించారు. నల్లరామ్మూర్తి, కస్తూరి శివరావు కూడా సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. వేరొకరి రచనను పేరడీ చెయ్యడం కన్నా తన రచననే తిరిగి పేరడీ చేసుకోవటం నిజంగా చాలా గొప్ప విషయం. తన మీద తానె జోక్ చేసుకోగలిగిన వ్యక్తి గ్రేట్ హ్యూమరిస్ట్ కాకపోతే మరేమవుతారు? 'మాయాబజార్'లోని ఘటోత్కచుని పాత్ర ప్రవేశిస్తూ ఆలపించిన

'అష్టదిక్కుంభి కుంభాగ్రాలపై మన
కుంభధ్వజము గ్రాల చూడవలదె!

గగన పాతాళ లోకాలలోని సమస్త
భూత కోటులు నాకె మ్రొక్కవలదే!
ఏదేశమైన నా ఆదేశముద్ర పడి
సంభ్రమాశ్చర్యాల జరుగవలదె
'హై హై ఘటోత్కచ' జై హే ఘటోత్కచ'
అని దేవగరుడె కొండాడవలదే!
ఏనె ఈ యుర్వినెల్ల శాసించవలదె
ఏనె ఐశ్వర్యమెల్ల సాధించవలదె
ఏనె మన బంధు హితులకు ఘనతలన్ని
కట్టపెట్టిన ఘనకీర్తి కొట్టవలదే!

అనే పద్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ ఈ పద్యాన్ని గమనించండి. పింగళి వారు తనను తాను పేరడీ చేసుకోవటంలో ఎంతటి ఔన్నత్యాన్ని ఔచిత్యాన్ని పాటించారో అవగతమవుతుంది.

పైన ఉదహరించిన స్వరరచనలే కాక రామ రామ శరణం, ఆనందం పరమానందం వంటి పాటలు ఆత్మత్యాగం అనే ఓ నృత్యనాటిక, నలదమయంతి అనే ఓ స్వప్న రూపక, మరో పద్యం కూడా ఉన్నాయి.. ఉరుకులు పరుగుల హడావుడితో కూడిన ఫాస్ట్‌ఫుడ్ కల్చర్‌తో కాకుండా తెలుసుకుందామన్న కుతూహలంతో అధ్యయనం చేయడానికి తగిన ఏకాగ్రతతో చూస్తే 'అప్పుచేసి పప్పుకూడు' చిత్రం తవ్వుతున్న కొద్దీ బైటపడే ఓ గని...



# ఆ పాత పాట మధురం
## రాజా



### ఇల్లరికం

**పాటకు ట్యూన్ కట్టేటప్పుడు సంగీత దర్శకులు** రకరకాల వాద్యాలను ఆసరాగా తీసుకుని వరస చేయడం పరిపాటి. ఆ రోజుల్లో ఎక్కువగా హార్మోనియం మీద ఆధారపడేవారు. అశ్వత్థామ వంటివారు అగ్గిపెట్టె మీద తాళం వేస్తూ ట్యూన్ చేసేవారు. వీణ వంటి ప్రాచీన తంత్రీవాద్యంపై ఆధారపడి ట్యూన్ చేసేవారు అతి తక్కువ. వారిలో తాతినేని చలపతిరావు ఒకరు. ఆయన ప్రతిభా విశేషాలను వెల్లడించే చిత్రాలలో ప్రసాద్ ఆర్ట్ పిక్చర్ వారి ఇల్లరికం ఒకటి. 1959లో విడుదలైన ఆ చిత్రంలో బహుళ జనాదరణ పొంది నేటికీ అదే స్ఫూర్తిని కలిగిస్తూ సజీవంగా ఉన్న పాటలివి.

వేణు: అడిగిందానికి చెప్పి - ఎదురాడక ప్రశ్నను విప్పి
నిల్చెదవా గెల్చెదవా - ఓహో చిన్నదానా
రాధ: అడిగిందానికి చెబుతా - ఎంతైనా పందెం గడతా
నిల్చెదనోయి గెల్చెదనోయ్ - ఓహో చిన్నవాడా
వేణు: ఒంటికాలిపై నుండి హఠయోగ ముద్రలో నుండి
గుట్టుగ తన పని సాధించునది - వివరిస్తావా ఏదది
కోరస్: అడిగిందానికి చెప్పి - ఎదురాడక ప్రశ్నను విప్పి
నిల్చెదవా గెల్చెదవా - ఓహో చిన్నదానా
రాధ: ముక్కు మూరెడే యౌను అది కొక్కొకొమని గొణిగేను ||ముక్కు||
కొంగ జపమని ప్రసిద్ధియేను ముందుకు వచ్చి కాదను
కోరస్: అడిగిందానికి చెబుతం ఎంతైనా పందెం గడతాం
నిల్చెదమోయ్ గెల్చెదమోయ్ ఓహో చిన్నవాడా
వేణు: వాయువేగమును మించి లోకాలన్నీ గాలించి ||వాయు||
గడియలోననే ఉన్న చోటకే వడిగా చేరేదేది
మొగవాళ్ళు: అడిగిందానికి చెప్పి ఎదురాడక ప్రశ్నను విప్పి
నిల్చెదవా గెల్చెదవా ఓహో చిన్నదానా

రాధ: రాకెట్టని అనుకోను అది స్పూత్నిక్కని అనలేను ||రాకెట్టని||
మున్మాటికి అది మనసేను ఇక - ముందుకు వచ్చి కాదను.
కోరస్: అడిగిందానికి చెబుతాం ఎంతైనా పందెం గడతాం
నిల్చెదమోయ్ గెల్చెదమోయ్ ఓహో చిన్నవాడా
వేణు: దానమిచ్చి చెడె నెవ్వడు
రాధ: కర్ణుడు
ఆడపిల్లలు: కర్ణుడు
వేణు: తప్పు తప్పు బలిచక్రవర్తి
మగవాళ్ళు: హేయ్ బలిచక్రవర్తి
వేణు: జూదానికి నిపుణుండెవ్వడు
రాధ: ధర్మజుడు
కోరస్: ధర్మజుడు
వేణు: తప్పు తప్పు శకుని
మొగవాళ్ళు: హేయ్ శకుని
వేణు: అన్నదమ్ముల పోరాటంలో సందు చూచుకుని కూల్చిందెవడు
రాధ: భీముడు
కోరస్: భీముడు
వేణు: తప్పు తప్పు రాముడు
మొగవాళ్ళు: హేయ్ రాముడు - శ్రీరాముడు

సుశీల, ఘంటసాల బృందం పాడిన ఈ పాటను జమున, అక్కినేని, మరికొంతమంది నృత్యకళాకారులు అభినయించారు. పహడీ, మోహనరాగాలకు సంబంధించిన స్వరాలపై ఈ పాట ఆధారపడిందని చెప్పొచ్చు. వాద సంవాద ప్రక్రియలతో కూడిన పద్యాలు కానీ పాటలు గానీ ఎప్పుడు విన్నా శ్రోతలకు ఆనందంగానే ఉంటుంది. నోటికి పట్టుబడ్డే ట్యూన్ దానికి జతపడితే ఆ పాటగాని పద్యం గాని ఎక్కువ కాలం జనం నోట నలిగే అవకాశం ఉంటుంది. ఆ కోవలోకి ఈ పాట కూడా చేర్చుకోవచ్చు. ఈ పాటలో స్వరరచన, గానం, అభినయం ఒక ఎత్తయితే రచన ఒక్కటీ ఒక ఎత్తు. సాహిత్యం గమనిస్తే ఈ పాటను కొసరాజు రాశారంటే చాలామందికి నమ్మ బుద్దేయదు, అందుకు కారణం ఆయన వ్యంగ్య వైభవం ఈ పాటలో నేరుగా కనిపించక పోవటం. పైగా 'హఠ యోగ ముద్రలోనుండి' వంటి వాక్యాలు - మనకు రెగ్యులర్‌గా అలవాటైన కొసరాజు శైలికి భిన్నంగా కనిపిస్తాయి. కొంగ జపానికి హఠయోగ ముద్రకి ముడిపెట్టడంలోనే కొసరాజు చమత్కారం ఉందేమో? ఇదిలా ఉండగా జూదానికి నిపుణుడు శకుని అని, అన్నదమ్ముల పోరాటం సందు చూసుకుని కూల్చినవాడు ఎవరంటే (కథానాయకుడు గెలవటం కోసం అన్నట్టు) చటుక్కని భీముని పేరు చెప్పటం వీటికి మనసంత త్వరగా అంగీకరించదు. అయినా పాట, సన్నివేశం, అభినయం బలంగా ఉండడం చేత ఈ 'దిష్టిచుక్కలు' అందంగానే ప్రకాశించడమే గాని అడ్డు మాత్రం కాలేదు. ఎప్పటికైనా తీర్చుకోవలసిన సందేహాల లిస్ట్‌లో - ఈ సమీక్షకుని మనసులో ఇంకా ఉన్నవాటిలో ఇవి కూడా ఉన్నాయి.

---

పల్లవి: ఎక్కడి దొంగలు అక్కడనే గుప్‌చుప్ ||ఎక్కడి||
ఎవరే పిలిచారు నిన్నెవరే పిలిచారు
ఎవరే పిలిచారు? నిన్నెవరే పిలిచారు ||ఎక్కడి||
చరణం: చాటుగా కనుచాటుగా
చూడకే ఇటు చూడకే
పొదలలో - పూపొదలలో పొంచినా గాలించినా ||పొదలలో||
కనులకు నే కనిపించనులే ||ఎక్కడి||
చరణం: నీడలో దోబూచిగా - ఆడకే తారాడకే
నీటిలో కోనేటిలో - చూడకే వెదుకాడకే ||నీటిలో||
దాగుడు మూతలు చాలునులే ||ఎక్కడి||
చరణం: నీడలో దోబూచిగా - ఆడకే తారాడకే
నీటిలో కోనేటిలో - చూడకే వెదుకాడకే ||నీటిలో||
దాగుడు మూతలు చాలునులే
చరణం: వెదికినా నే దొరకనే - పిలిచినా నే పలుకనే
హృదయమే నా కొసగినా - ఎదుటనే కనిపింతునే ||హృద||
ఎన్నటికీ నిను వీడనులే

ఈ పాటను ఘంటసాల పాడారు. శ్రీ శ్రీ రాసిన ఈ పాటను తెరపై అక్కినేని, జమున అభినయించారు. కళ్యాణి రాగం స్వరాలతో వినిపించే ఈ పాటను 'తుమ్ సా నహీ దేఖా'(1957) అనే హిందీ చిత్రంలోని టైటిల్ సాంగ్‌ను ఆధారంగా తీసుకుని చేశారు. 'యూతో హమ్‌నే లాఖ్ హసీ దేఖే హై తుమ్ సా నహీ దేఖా' అనే పల్లవితో ప్రారంభమయ్యే ఆ హిందీ పాట - స్వరకర్త

ఓపినయ్యర్‌కు, గాయకుడు మహమ్మద్ రఫీకి, అభినయించిన షమ్మీకపూర్‌కి ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది. కలిపి అయినా విడివిడిగా అయినా ఆ ముగ్గురిలో ఏ ఒక్కరి గురించి చెప్పాలన్నా ఈ పాటను ఉదహరించకపోతే అది సంపూర్ణం అనిపించుకోనంత గొప్పగా హిట్ అయిన ఆ పాటను తీసుకుని చరణాలలో మొదటి రెండు లైన్లను తనదైన ట్యూన్‌తో ముడిపెట్టి, పల్లవిని అందుకునే లైన్లకు మాతృకలోని ట్యూన్‌ని జత కలుపుతూ వరస చేశారు టి.చలపతిరావు. ఆ హిందీ పాటను, ఈ తెలుగు పాటను ఏక కాలంలో వినటం జరిగితే ఆ తేడా తెలుస్తుంది. అంతేకాదు ఒకే ట్యూన్‌ను ఇద్దరు మహాగాయకులు వారి వారి పద్ధతుల ప్రకారం పోలికలో తేడాని, తేడాలో పోలికను చూపిస్తూ పాడిన విధానాన్ని అధ్యయనానికి సంబంధించిన ఓ అనుభవంగా స్వీకరిస్తే ఆ అనుభూతి ఎంత హృద్యంగా ఉంటుందో అది కేవలం అనుభవైక వేద్యం మాత్రమే. ముఖ్యంగా 'గప్‌చుప్' అనే మాటని ఘంటసాల ఎంత లబ్జుగా అంటారో వర్ణించలేం.

---

చేతులు కలిసిన చప్పట్లు మనసులు కలిసిన ముచ్చట్లు ||చేతు||
ఇద్దరి మధ్యా పొందిక ఉంటే రానే రావు పొరపాట్లు
రానేరావు పొరపాట్లు ||చేతు||
పాలూ తేనే కలిసిన మాదిరి ఆలూ మగలూ ఉండాలి ||పాలూ||
గువ్వల జంటా కులికే రీతిగ నవ్వుల పంట పండాలి
నవ్వుల పంట పండాలి ||చేతు||
కొత్త కుండలో నీరు తీయనా కోరిన మగవాడే తీయన ||కొత్త||
కొత్త కాపురం చక్కని వరము - కోరిక తీరు రఁయ్ రఁయ్ నా ||చేతు||
వన్నెల చిన్నెల వలపు తోటలో పూలబాటలే వేయాలి ||వన్నెల||
అన్యోన్యంగా దంపతులెప్పుడూ కన్నుల పండుగ చెయ్యాలి
కన్నుల పండుగ చెయ్యాలి ||చేతు||
ఇద్దరి మధ్య పొందిక ఉంటే రానే రావు పొరపాట్లు
చేతులు కలిసిన చప్పట్లు మనసులు కలిసిన ముచ్చట్లు ||చేతు||

ఈ పాటను ఘంటసాల, సుశీల, మాధవపెద్ది సత్యం, బృందం పాడగా అక్కినేని, జమున, రేలంగి, కొందరు నృత్య కళాకారులు అభినయించారు. రచనా పరంగా ఎటువంటి విన్యాసాలూ, ప్రయోగాలూ లేకుండా, చెప్పాలనుకున్న విషయాన్ని నేరుగా చెప్పేసిన పాట ఇది. ఈ పాట రచన ఆరుద్ర. పాట మూడవ చరణంలోని 'వన్నెల చెన్నెల వలపు తోటలో పూలబాటలే వెయ్యాలి' అనే లైన్లకి జతపడిన ట్యూన్‌ని గమనిస్తే - మాస్టర్ వేణు స్వరకల్పనా విధానానికి దగ్గరగా వచ్చిందనిపిస్తుంది. ఇది కేవలం పరిశీలనతో కూడిన అభిప్రాయం మాత్రమే. అది - నిజమో కాదో - అయితే అలా అంత దగ్గరగా రావటానికి కారణాలు, పరిస్థితులు ఏమిటో ఇంకా నిర్ధారించుకోవలసి ఉంది.

---

ఆమె: నేడు శ్రీవారికి మేమంటే పరాకా
తగని బలే చిరాకా ఎందుకో తగని బలే చిరాకా ||నేడు||
ఆమె: మొదట మగవారు వేస్తారు వేషాలు
పెళ్ళి కాగానే చేస్తారు మోసం
అతడు: ఆడవారంటే శాంత స్వరూపాలే
కోపతాపాలు రావండి పాపం
ఆమె: కోరి చేరిన మనసు చేత చిక్కిన అలుసు ||కోరి||
కొనకు ఎడబాటు అలవాటు చేస్తారు
అతడు: నేడు శ్రీమతికి మాతోటి వివాదం
తగువే బలే వినోదం - ఎందుకో
తగువే బలే వినోదం ||నేడు శ్రీమతికి||
అతడు: వారి మనసైతే వస్తారు ఆడవారు
చేర రమ్మంటే రానేరారు.
ఆమె: ఆ.. అ.. తెలుసుకున్నారు స్త్రీల స్వభావాలు
తెలిసి తీర్చారు ముద్దు మురిపాలు
అతడు: అలుక సరదా మీకు - అదే వేడుక మాకు ||అలుక||
కడకు మురిపించి గెలిచేది మీరేలే
ఇద్దరు: ప్రణయ కలహాల సరసాలె వినోదం
నిజమే బలే వినోదం..ఆ...ఆ..ఆ
నిజమే బలే వినోదం..ఆ....

ఈ పాట యమన్ రాగంలో స్వరపరచబడింది. ఆరుద్ర రాసిన పాటను గంటసాల, సుశీల పాడగా తెరపై అక్కినేని, జమున అభినయించారు. ఏ వాద్యం తర్వాత ఏ వాద్యం రావాలి అనే 'ఇన్‌స్ట్రుమెంట్స్ ప్లేసింగ్'కి ఉదాహరణగా ఈ పాటని చెప్పుకోవాలి. చక్కగా అమరే అటువంటి ప్లేసింగ్ - సన్నివేశానికి తగిన మూడ్‌ని సృష్టించి పాటకు శాశ్వతత్వాన్ని కట్టబెడుతుంది. ముఖ్యంగా ఈ పాట మొదట్లో వరసగా వచ్చే పియానో, క్లారినెట్, వయొలిన్, వీణ ఫ్లూట్ వాద్యాలు ఆ వాదాన్ని ధ్రువీకరిస్తాయి. ఇక ఈ పాటలోని 'అక్షర సత్యాలు' అనుభవంలోకి రాని జంట భూత భవిష్యద్వర్తమానాలలో ఉండదని చెప్పవచ్చు. కవిగా అదీ ఆరుద్ర ప్రామాణికత!

భలే ఛాన్సులే... భలే ఛాన్సులే.. భలే ఛాన్సులే
లలల్లాం లలల్లాం లక్కీ ఛాన్సులే - భలే ఛాన్సులే
ఇల్లరికంలో ఉన్న మజా ||ఇల్లరికం ||
అది అనుభవించితే తెలియునులే భలే ఛాన్సులే
అత్తమామలకు ఒక్క కూతుర్రై అదృష్టయోగం పడితే ||అత్త ||
బావమరుదులే లేకుంటే
ఇంటల్లుడిదేలే అధికారం - భలే ఛాన్సులే
గంజి పోసినా అమృతంలాగ
కమ్మగ ఉందనుకుంటే - బహు కమ్మగా ఉందనుకుంటే
ఛీ - ఛా.. ఛీ - ఛా.. యన్నా చిరాకు పడక
దులపరించుకుని పొయ్యే వారికి - భలే ఛాన్సులే ||ఇల్లరికం||
జుట్టు పట్టుకుని బయటికీడ్చినా
చూరుపట్టుకుని వ్రేలాడీ... ఈ...ఈ ||జుట్టు||
దూషణ భూషణ తిరస్కారములు ఆశీసులుగా
తలిచే వాడికి - భలే ఛాన్సులే ||భలే||
అణిగి మణిగి ఉన్నామంటే
అంతా మనకే చిక్కేది ||అణిగి||
మామ లోభియై కూడబెట్టితే మనకే గాదా దక్కేది
అది మనకే గాదా దక్కేది ఇహ మనకే గాదా దక్కేది
అది మనకే - ఇహ మనకే అది మనకే - మనకే - మనకే
మ...మ..మ..మనకే

పాటను మాధవపెద్ది సత్యం పాడారు. తెరపై రేలంగి ప్రధాన పాత్రధారి. ఆయనతో పాటు పేకేటి శివరాం, బాల, చివర్న వచ్చి కలిసే రమణారెడ్డి, జమున కూడా అభినయించారు. హిందూస్థానీ రాగలైన పహాడీ, మాండ్ రాగాలను తీసుకుని వాటిని కాస్తా అటూ, ఇటూ చేసి బహుజన రంజకంగా తయారు చేసిన ట్యూన్ ఇది. ఒక్క ఇల్లరికం ఉండే అల్లుళ్ళకే కాకుండా విద్య, ఉద్యోగం, కళ, వ్యాపారం, రాజకీయం ఇలా ఏ రంగంలోనైనా సరే అంతరాత్మ గొంతు నొక్కేసుకుంటూ బాధపడేవాళ్ళకి ఓదార్పులా - కష్టపడకుండా పైకొచ్చేద్దామనుకునే తత్వంతో అతి లౌక్యంగా ప్రవర్తించే వాళ్ళకు ఓ చురకలా - ఇలా రెండు విధాలా పనికొచ్చేట్టుగా రెండు వైపులా పదునున్న కత్తిలా రాసిన ఈ పాటలోని వ్యంగ్య వైభవం తెలుగువాడి గుండెల్లో తెలుగుతనం చచ్చిపోనంతవరకు బ్రతికుంటుంది. ఈ పాట రచన కొసరాజు.

నిలువవే వాలుకనులదానా - వయ్యారి హంసనడక దాన
నీ నడకలో హొయలున్నదె చానా
నువు కులుకుతు ఘలఘల నడుస్తువుంటే
నిలువదె నా మనసు ఓ లలనా అది నీకే తెలుసు ||నిలువవే||
ఎవరనీ ఎంచుకుని నావో పరుడని భ్రాంతి పడినావొ
ఎవరనీ ఎంచుకొనినావో భ్రాంతి పడినావొ సిగ్గుపడి తొలిగేవో
విరహాగ్నిలో నను తోసిపోయేవో ||నువు కులుకుచు|| ||నిలువవే||
ఒకసారీ నన్ను చూడరాదా చెంతజేరా సమయమిది కాదా
ఒకసారీ నన్ను చూడరాదా సమయమిది కాదా
చాలు నీ మరియాదా
వగలాడి నే నీవాడనే కాదా ||నువు కులుకుచు|| ||నిలువవే||
మగడంటే మోజు లేనిదానా మనసుంటే నీకు నేను లేనా
మగడంటే మోజు లేనిదానా నీకు నేను లేనా కోపమా నా పైనా
నీ నోటి మాటకు నోచుకోలేనా ||నిలువవే||

ఈ పాటను కూడా కొసరాజు రాఘవయ్య చౌదరిగారే రాశారు. ఘంటసాల పాడిన ఈ పాటను జమునతో కలిసి అక్కినేని అభినయించారు. ట్యూన్ పరంగా పూర్తి జానపద సరళిలో సాగిన ఈ పాట - అక్కినేని, ఘంటసాల, కొసరాజు, చలపతిరావు కాంబినేషన్‌కి ఓ సదుపమానంగా నేటికీ నిలిచిపోయింది. ఈ పాట వినగానే ఇది కథానాయకుని స్థాయికి తగదని, తీసెయ్యమని, కావాలంటే ఆ పాట కోసం ఎంత ఖర్చయిందో అంతా భర్తీ చేస్తానని అప్పట్లో అక్కినేని అన్నారట. కానీ దర్శకులు టి.ప్రకాశరావు తదితరులంతా ఈ పాట బాగా వస్తుందని, తమకు నమ్మకం ఉందని చెప్పి ఆయనని ఒప్పించారట. సినిమా పూర్తయిన తర్వాత రిలీజ్ అయ్యేలోగా కొన్ని ప్రివ్యూలు వేయడం జరిగింది. ఎవరెవరు వచ్చారు, సినిమా ఎలా ఉందన్నారు అని తెలుసుకుంటూ ఉండగా తన సతీమణి అన్నపూర్ణ మూడుసార్లు వచ్చి చూసినట్టు తెలిసిందట అక్కినేనికి. ఇంటికి వెళ్ళి - మూడుసార్లు వెళ్ళేటంతగా సినిమాలో ఏం ఆకర్షించిందని అడిగితే - ఆవిడ 'నిలువవే వాలు కనులదానా' పాటని ప్రశంసించారట. తీసుకునే నిర్ణయాలు తిరిగి పరిశీలించుకుని అవసరమైతే మార్చుకునే తన తత్వానికి ఆనాటి ఆ సంఘటన, ఆ పాట విజయం ఎంతగానో ఉపకరించిందని స్వయంగా అక్కినేనే ఎన్నో సభలలో చెప్పేవారు. ఆ సినిమాని మళ్ళీ ఎప్పుడైనా చూడటం తటిస్తే జాగ్రత్తగా ఆ పాటని గమనించండి. మొదట ఆ పాటను కాదన్నా తనను బలవంతంగా ఒప్పించారన్న అసంతృప్తిగాని, ఏదోలా చేసేసి చేతులు దులిపేసుకుందాంలే అనే ధోరణి గానీ అక్కినేని అభినయంలో రవంత కూడా కనిపించదు. అంకితభావంతో కూడిన వృత్తి ధర్మానికి ప్రతీకలా తన తత్వాన్ని తీర్చిదిద్దుకున్నారు కనుకనే నేటికీ పరిశ్రమలో ఆయన స్థానం పతాక స్థాయిలో ఉందని అనిపిస్తుంది.

ఇక సన్నివేశాల నేపథ్యంలో వినిపించే సంగీతానికి సంబంధించినంతవరకూ గమనించవలసిన అంశం ఒకటుందీ చిత్రంలో, వీడియో దొరికినప్పుడు గానీ, ఛానల్స్‌లో ప్రసారం అవుతున్నప్పుడు కానీ, లేదా పాత సినిమాలు మళ్ళీ థియేటర్లలో ఆడే మంచిరోజులు కలిసొచ్చినప్పుడుగానీ.. జాగ్రత్తగా చూడండి. టైటిల్స్ చూపిస్తున్నప్పుడు సంగీత దర్శకునిగా టి.చలపతిరావు పేరు రాగానే - అంతవరకూ వినిపించిన వాద్య సంగీతం ఓ మలుపు తీసుకుంటుంది. అక్కణ్ణించి వినిపించే వాద్య సంగీతాన్నే ఈ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావుకి గుమ్మడి తన మైకా ఫ్యాక్టరీని చూపిస్తున్నప్పుడు ఉపయోగించారు. ఆ మ్యూజిక్‌ని గుండెల్లో బలంగా ముద్రించుకుని భద్రపరచుకుని -

1973లో శోభన్ బాబు, వాణిశ్రీ హీరోయిన్‌లుగా నటించిన 'మైనర్ బాబు' అనే చిత్రం చూడటం తటస్థించినపుడు - మనసులో రీకాల్ చేసుకోండి. ఈ 'మైనర్ బాబు' చిత్రంలో శోభన్ బాబు ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్టుగా ఎస్టాబ్లిష్ చేసే సన్నివేశాల్లో తిరిగి అదే వాద్య సంగీతాన్ని ఉపయోగించినట్టు అర్థమైతే ఆ అనుభూతి భలే థ్రిల్లింగ్‌గా ఉంటుంది. కారణం - 'ఇల్లరికం'కి దర్శకత్వం, సంగీత దర్శకత్వం వహించిన తాతినేని ప్రకాశరావు, తాతినేని చలపతిరావులే 'మైనరుబాబు'కి కూడా దర్శకత్వం, సంగీత దర్శకత్వం నెరపటమే.



# ఆ పాత పాట మధురం
## రాజా



### పెళ్ళికానుక

**సంగీత దర్శకుడు గాయకుడైతే** అతని వద్ద పాడే వాళ్ళకి గీతం పూర్తి రసస్పర్శతో త్వరగా పట్టుబడుతుంది. గాయకుడు సంగీత దర్శకుడయితే అతను సృష్టించే గీతాలలోని కొన్ని పట్లు అతని గాత్ర ధర్మానికి దగ్గరగా ఉంటాయి. ఏ పాటనైనా సుతిమెత్తగా, మృదువుగా పాడే గాయకుడు  ఏ.ఎం.రాజా సంగీత దర్శకుడిగా స్వర రచనలు చేసిన చిత్రం వీనస్ పిక్చర్స్ వారి పెళ్ళి కానుక.

ఈ చిత్రంలోని పాటలు పైన పేర్కొన్న ద్వితీయ భాగానికి అద్వితీయ సాక్ష్యాలుగా నిలబడతాయి. ప్రముఖ నాటక కర్త సి.వి.శ్రీధర్ 1959లో 'కళ్యాణపరిసు' అనే చిత్రాన్ని తీశాడు. ఆ చిత్రంలో జెమినీ గణేశన్, అక్కినేని నాగేశ్వరరావు, తంగవేలు, బి.సరోజాదేవి, విజయకుమారి, ఎం.సరోజ నటించారు. అదే చిత్రం అదే శ్రీధర్ దర్శకత్వంలో 'పెళ్ళికానుక'గా 1960లో వచ్చింది. తెలుగులో అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, రేలంగి, బి.సరోజాదేవి, కృష్ణకుమారి, గిరిజ మొదలుగువారు ప్రధాన పాత్రలను పోషించారు. 'కళ్యాణ పరిసు' చిత్రానికి సంగీతాన్నిచ్చిన ఏ.ఎం.రాజాయే తెలుగు చిత్రం 'పెళ్ళికానుక'కు కూడా సంగీత దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలోని ఎనిమిది పాటలూ శ్రోతల అబిమానాన్ని చూరగొన్నాయి. వాటిలో బహుళ జనాదరణ పొందిన పాటలివి.

అ: వాడుక మరచెదవేల నను వేడుక చేసెదవేల
నిను చూడని దినము నాకొక యుగము
నీకు తెలుసును నిజము
నీకు తెలుసును నిజము
ఆ: వాడుక మరువను నేను నిను వేడుక చేయగలేను
నిను చూడని క్షణము నాకొక దినము
నీకు తెలుసును నిజము
నీకు తెలుసును నిజము
అ: సంజ రంగుల చల్లని గాలుల
మధుర రాగము మంజుల గానము ||సంజ||
తేనె విందుల తీయని కలలూ
మరులు తొడగ లేవా వాడుక

అ: కన్నులా ఇవి కలల వెన్నెలా
చిన్నె వన్నెల చిలిపి తెన్నులా ||కన్నులా||
మనసు తెలిసీ మర్మమేల
ఆ: ఇంత తొందర ఏలా
ఇటు పంతాలాడుట మేలా
నాకందరికన్నా ఆశలు ఉన్న
హద్దు కాదనగలనా హద్దు కాదనగలనా
ఇ: వాడని నవ్వుల తోడ
నడయాడెడు పువ్వుల జాడ
అనురాగము విరిసి లోకము మరచి
ఏకమౌదము కలసి ఏకమౌదము కలసి

ఈ పాటను ఆత్రేయ రాయగా ఎ.ఎం.రాజా, సుశీల పాడారు. అక్కినేని, బి.సరోజాదేవి అభినయించిన ఈ పాటలో వారిరువుతూ సైకిళ్ళపై బయలుదేరడం, పల్లవి పాడిన తర్వాత ఇద్దరూ స్పీడుగా సైకిల్స్ తొక్కుతూ వెళుతుండగా ఓ చోట ఒకదాని నొకటి అడ్డుకోవడంతో ఇద్దరూ ఇసుక తిన్నెలపై పడిపోవడం తిరిగి లేచి చరణానికి ముందు వచ్చే ఆలాపనను అందుకునేవరకు వచ్చే ఇంటర్ లూడ్ - సంగీత దర్శకుడిగా ఎ.ఎం.రాజాకున్న దార్శనికతను తెలియజేస్తుంది. చిత్రాన్ని ఒకసారి చూసినవారెవరికైనా సరే ఈ పాట కొన్ని సంవత్సరాల తర్వత విన్నాసరే, ఈ సన్నివేశం, తదనుగుణమైన చిత్రీకరణ గుర్తొస్తాయి. హిందుస్తానీ రాగం పహాడీ ఛాయలలో స్వరపరచబడిన ఈ పాటలో సాహిత్య పరంగా చూసుకుంటే 'నా కందరికన్నా ఆశలు ఉన్నా హద్దు కాదనగలనా' అని తెలియజేసే కథానాయిక మనస్తత్వమే ఈ చిత్రం కథకు ఆయువు పట్టు.

---

ఆ: కన్నులతో పలుకరించు వలపులూ
ఎన్నటికీ మరువరాని తలపులూ
రెండూ ఏకమై ప్రేమె లోకమై
నా మది పాడే పరాధీనమై

అ: అలాగా!

ఆమె: ||కన్నులతో||

ఆ: చల్లని వేళా మల్లెల నీడా
చక్కని దొంగా దాగెనటే
దారులు కాచి సమయము చూచి
దాచిన ప్రేమా దోచెనటా
మరలా వచ్చెనో మనసే ఇచ్చెనో ||మరలా||
అతనే నీవైతే ఆమే నేనటా

అ: నిజంగా!?

ఆమె: ||కన్నులతో||

ఆ: నల్లని మేఘం మెల్లగ రాగా
నాట్యము నెమలీ చేసినది
వలచిన వాడూ సరసకు రాగా
ఎంతో సిగ్గూ వేసినది
తనివి తీరా తనలో తానే తనవి
మనసే మురిసింది పరవశ మొందగా

అ: ఐసీ!?

ఆమె: ||కన్నులతో||

ఆరుద్ర రాసిన ఈ పాటను సుశీల, ఏ.ఎం.రాజా పాడగా బి.సరోజాదేవి, అక్కినేని అభినయించారు. శంకరాభరణం స్కేల్‌లో మాండ్ రాగం టచ్‌తో సాగిన ఈ పాట మొదట్లో ఒక ఊపుతో వచ్చే పియానో వాద్యపు వాయింపు - నిజంగా ఎంతో ఇంపుగా, ఈ నాటికీ వినసొంపుగా ఉంటుంది. స్పష్టత, శ్రావ్యత ఈ రెండు యుగళ గీతాల్లోనూ గమనించదగ్గ ముఖ్యాంశాలుగా పేర్కొనాలి.

---

పులకించని మది పులకించు
వినిపించని కథ వినిపించు
అనిపించని ఆశలనించు
మనసునే మరపించు ||పుల||
రాగమందనురాగ మొలికి
రక్తినొసగును గానం ||రాగ||
రేపు రేపను తీపి కలలకు
రూపమిచ్చును గానం
చెదిరి పోయే భావములను
చేర్చి గూర్చును గానం
జీవమొసగును గానం
మది చింత బాపును గానం
వాడిపోయిన పైరులైనా
నీరుగని నర్తించును
కూలిపోయిన తీగలైనా ||వాడి||
కొమ్మ నలిమి ప్రాకును
కన్నె మనసు ఎన్నుకున్న
తోడు దొరికిన మరిము
దొరవలపే కురియు
మది దోచు కొమ్మని పిలుచు
వినిపించని కథ వినిపించు
అనిపించని ఆశలనించు
మనసునే మరపించు
ప్రేమ.. మనసునే మరపించు

ఈ పాటను జిక్కి పాడగా కృష్ణకుమారి అభినయించారు. తెర్పై అక్కినేని కూడా కనిపిస్తారు. కవిత్వాంశ కలిగిన ఈ గీతాన్ని ఆత్రేయ రాసారు. మొదటి చరణం గానానికి, రెండో చరణం ప్రేమకు అన్వయించుకుంటే కుదిరిపోయేలా మొత్తం పాటను స్కీమ్ చేసిన విధానం, అలాగే 'ఇంచు' అనే పదాన్ని వాడుకున్న పద్ధతి ఇవన్నీ ప్రశంసా పాత్రమైనవి. ఈ పాతలో సితార్ ఉపయోగించుకున్న తీరుని ఇవాళ పునశ్చరణ చేసుకుంటే ఇక్కడ వచ్చే ట్యూన్‌కి ఆ వాద్యం తప్ప మరొకటి నప్పదన్నంత గొప్పగా అమిరిందనిపిస్తుంది. ఆరోహణలో

మోహన రాగస్వరాలైన 'సరిగ పదస' -ని, అవరోహణలో కళ్యాణి రాగ స్వరాలైన 'సనిదపమగరిస' - ని, కలిగిన 'మోహన కళ్యాణి' రాగాన్ని ఈ పాటకు ఉపయోగించారు. ఇందులో 'మ' అనే స్వరాన్ని అతి తక్కువగాను మిగిలిన కళ్యాణి రాగ స్వరాలను అనుస్వరాలుగాను వాడుకోవటం వల్ల స్వర రచనలో కొత్తందాలు కొత్తదనాలు సంతరించుకున్నాయి. జిక్కి సూపర్ హిట్స్‌లో ఒకటిగా నిలిచిపోయిన ఈ పాట - ఒక స్వరకర్తగానే కాకుండా భర్తగా కూడా ఏ.ఎం.రాజా ఆమెకు మిగిల్చిన ఒక తీపి గుర్తు.

---

ఆడే పాడే పసివాడా
ఆడేనోయీ నీ తోడా
ఆనందం పొంగేనోయి దీపావళీ
ఇంటింట వెలుగు
దీపాల మెరుగు
ఎనలేని వేడుకురా
ఎనలేని వేడుకురా
చిరునవ్వు వెన్నెల్లు చిలికేటి వాడా
అరుదైన చిరుముద్దు అరువీయరారా ||చిరు||
నా మదిలో నీకు నెలవే కలదూ ||నా మది||
బదులే నాకూ నీవీయవలదు
నీపై మేము నిలిపిన ఆశలు
నిజమైన చాలునురా నిజమైన చాలునురా
చిన్నారి జయమంచు మోగే పటాసు
చిటపటమని పూలు చిమ్మే మతాబు ||చిన్నారి ||
నీ రూపమే ఇంటి దీపము బాబు ||నీ రూపమే||
మాలో పెరిగె మమతవు మరిపించిన
మరివేరే కోరమురా మరివేరే కోరమురా ||ఆడే||

ఈ పాటను పి.సుశీల గానం చేయగా బి.సరోజా దేవి ప్రధాన పాత్రధారణిగా అభినయించారు. ఆమెతో పాటు అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణకుమారి, మాస్టర్ బాబు తదితరులు సన్నివేశానుగుణంగా కనిపిస్తారు. ఈ పాటను చెరువు ఆంజనేయ శాస్త్రి రాశారు. రాసినవి అతి తక్కువ పాటలే అయినా గుర్తుండిపోయే పాటల్ని రాసిన వారిలో చెఱువు ఆంజనేయ శాస్త్రి ఒకరు. సముద్రల రాఘవాచార్యుల వారి కుటుంబంతో ఈయనకు సన్నిహిత సంబంధాలుండేవి. అదే సమయంలో ఫిలిం సర్కిల్స్‌లో కొలను బ్రహ్మానందరావుగారికి జర్నలిస్ట్‌గా మంచి పేరుండేది. ఈ ముగ్గురి ఇంటి పేర్ల (కొలను, చెఱువు, సముద్రం)లో ఉన్న సారూప్యత వల్ల బంధుత్వం ఉండేదనుకుని ముగ్గుర్నీ కలుపుకుంటూ ఛలోక్తులు పడేవి ఆ రోజుల్లో, 'పెళ్ళికానుక' చిత్రానికి ముందు కొన్ని చిత్రాలలోను, తర్వాత కొన్ని చిత్రాలలోనూ దీపావళికి సంబంధించిన పాటలు మొత్తం ఓ పదిలోపే వచ్చినా ఈ 'ఆడేపాడే పసివాడా' పాటే ఎక్కువ కాలం సజీవంగా ఉన్నదని చెప్పాలి. చెరువు ఆంజనేయ శాస్త్రి ఈ పాటను కార్తిక్ అనే పేరుతో రాశారు.

---

ఆడేపాడే పసివాడా
అమ్మలేని నిన్ను చూడా
కన్నీటి కథ ఆయె దీపావళి ||ఆడే||
ఊరెల్ల వెలుగు ఆనందం మనకు
కనరాని దూరమురా కనరాని దూరమురా
నెనరెల్ల అనలాన నీరైన నాడు
నెమ్మది మనకింక కనరాదు ||నెన||
ఇలవేల్పు వలె ఇంట వెలసిన దేవి ||ఇల||
మమతే మరచి మరుగైనదేమి
కన్నులలోని కంక్షలు అన్నీ
కలలాయె నేటికిరా కలలాయె నేటికిరా
అనురాగమున తానె
అనిపించు దేవి
ఎనలేని భావాల పెనవేసి ||అనురాగ||
పాశము తెగతెంచి మోసము చేసే ||పాశము||
బ్రతుకే మనకు బరువైపోయె
నిన్నటి కథలే నేటికి వ్యధలలై
నిను నన్ను వేధించెరా
నిను నన్ను వేధించెరా

సంతోషంగా వచ్చే 'ఆడే పాడే పసివాడా' పాట ట్యూన్‌ని కాస్త స్లో చేసి విషాదం మేళవించి 'ఆడేపాడే పసివాడా అమ్మలేని నిను చూడా' అంటూ ఏ.ఎం.రాజా పాడగా అక్కినేని అభినయించారు. మాస్టర్ బాబు కూడా కనిపిస్తాడీ పాటలో. ఈ విషాద గీతాన్ని ఆచార్య ఆత్రేయ రాశారు. మొదటి చరణంలో ఉన్న 'నెనరెల్ల అనలాన నీరైన నాడు నెమ్మది మనకింక కనరాదు' వాక్యంలోని పదాలు - సినీ సాహిత్యంలో అరుదుగా వినిపిస్తూ ఉంటాయి. ముఖ్యంగా 'నెమ్మది' అనే పదాన్ని 'శాంతం' అనే అర్ధంతో ఆత్రేయ వాడడానికి కారణం ఆయన పెరిగిన సూళ్ళూరి పేటలోని మాండలికమే కారణం అని ఒక విశ్లేషణ కూడా ప్రచారంలో ఉంది.

అను పల్లవిలో వచ్చే 'ఆనందం మనకు కనరాని దూరమురా' అనే వాక్యాన్ని ట్యూన్ పరంగా విడగొట్టి 'ఊరెల్ల వెలుగుతో ఆనందం మనకు'ని జత చేయటం వల్ల అర్థాన్ని వివరించల్సి వస్తే 'అది మనకు కనరాని దూరమురా' అని అనుకోవలసి రావటం ఓ విధంగా బాధపడాల్సిన విషయమే. ఇదిలా ఉండగా ఆత్రేయ సాహిత్యంపై వచ్చిన సినీ గీతాల సంకలనంలో ఈ పాటకి సంబంధించిన రెండో చరణంలో 'అనురాగమున తానె' అని ఉంది. నిజానికి 'అనురాగమనతానై అన్నదే కరెక్ట్.

ఈ రెండు పాటలకి ఎక్కువగా రాగశ్రీ రాగాన్ని, అక్కడక్కడ'ఇలవేల్పు వలె ఇంట వెలసిన జయ జయ వంతి రాగాన్ని ఉపయోగించారు. రెండో పాటలో 'ఇలవేల్పు వలె ఇంట వెలసిన దేవి దగ్గర 'పాశము తెగ తెంచి మోసము చేసి దగ్గర వినిపించే ఇంటర్ లూడ్‌కి భాగేశ్వరి రాగాన్ని వాడుకున్నారు. విషాదాన్ని మరింతగా ప్రతిఫలింపజేయడానికి ఆ రాగం అక్కడ బాగా ఉపయోగపడింది. మొదటి పాటకి పల్లవి ఒకసారైనా రిపీట్ అవుతుంది కానీ రెండో పాటలో పల్లవి ఎక్కడా రిపీట్ కాకపోవడం గమనార్హం.

1. తీరెనుగా నేటితో - నీ
తీయని గాథా
మిగిలిపోయే నీ మదిలో
మాయని బాధా తీరెనుగా
రాగముల పంట జూడ కోరిన వేళా
త్యాగములే మీరరాని శోధనలాయె ||రాగము||
బలి ఆయె నీదు ప్రేమ పాశానికీ
కరిగిపోయావె కర్పూరమై ||తీరెనుగా||
2. తీరెనుగా నేటితో - నీ
తీయని గాథా
మిగిలిపోయే నీ మదిలో
మాయని బాధా
ప్రేమమయీ నాట్యమాడ మేడలు కట్టి
ఘన విషాద నాటకమమ్మా కన్నుల జూసి || ప్రేమ||
నీ ప్రేమ ధారబోసి దైవానికీ
కదిలిపోయావే ఏకాకివై
నీ ప్రేమ ధారబోసి దైవానికీ
కదిలి పోయావే ఏకాకివై

ఈ స్వర ఖండికలు రెండూ ఒకే వరుసపై ఆధారపడినా, రెండు వేర్వేరు సన్నివేశాలలో వస్తాయి. మొదటి స్వరఖండికను బి.సరోజాదేవి పైనా, రెండవ స్వరఖండికను అక్కినేని నాగేశ్వరరావు పైనా చిత్రీకరించారు. రెండు స్వర ఖండికలూ మిశ్ర శివరంజని రాగంపై ఆధారపడి స్వరపరిచినవి. సీనియర్ సముద్రాల అందించిన బరువైన సాహిత్యం కన్నా స్వరకల్పనలోని గాఢతయే ఈ స్వర ఖండికల్ని జనహృదయాలకు దగ్గర చేసిందని చెప్పాలి. 'అనగ అనగ రాగమతిశయిల్లుచునుండు' అన్నట్టు ఈ స్వరఖండికలకు జతపడ్డ వరసను - పాడుకుంటున్న కొద్దీ స్వరకర్తకున్న డెప్త్‌ను మనసుతో చూడగలిగే శక్తి వస్తుంది.

పొన్నులూరి వారి 'శోభ' చిత్రానికి తొలిసారిగా సంగీత దర్శకత్వం వహించిన ఏ.ఎం.రాజా తరువాత కొన్ని తమిళ చిత్రాలకు, ఒక మలయాళ చిత్రానికి సంగీతాన్ని ఇచ్చారు. 'పెళ్ళికానుక' చిత్రానికి మాతృక అయిన 'కళ్యాణ పరిసు' చిత్ర సంగీత దర్శకుడిగా తమిళనాట ఉత్తమ సంగీత దర్శకుడిగా ఏ.ఎం.రాజా నిలదొక్కుకోకపోవటం పరిశ్రమకు దూరంగా ఉండే సంగీతాభిమానులకు ఇప్పటికీ ఓ శేషప్రశ్నే.



# ఆ పాత పాట మధురం

## రాజా



### శాంతి నివాసం

1960 లో విడుదలైన ఎన్నో మంచి చిత్రాలలో శ్రీ ప్రొడక్షన్స్ వారి శాంతినివాసం గురించి ప్రత్యేకించి చెప్పుకుని తీరాలి. సంగీత పరంగానే కాక మొత్తం సినిమా పరంగా కూడా తెలుసుకోదగ్గ విశేషాలు ఈ చిత్రంలో ఉన్నాయి. ఈ చిత్రానికి సి.యస్.రావు దర్శకుడు. మాటలు, పాటలు సముద్రాల జూనియర్ రాయగా - ఘంటసాల నేతృత్వంలో సంగీత శాఖ ఎనిమిది పాటలను, అయిదు పద్యాలను, ఒక శ్లోకాన్ని ఈ చిత్రం ద్వారా అందించింది.

1950 దశకంలో బి.యస్.రామయ్య అనే రచయిత రాసిన 'మల్లియమ్ మంగళమ్' నాటకాన్ని ఆయన అనుమతితో 'శాంతినివాసం' అనే పేరిట నటులు పద్మనాభం, వల్లం నరసింహారావు కలిసి రేఖా అండ్ మురళీ ఆర్ట్స్ బ్యానర్పై వందకు పైగా ప్రదర్శనలిచ్చారు. మూల రచయిత బి.యస్ రామయ్య వద్ద నేరుగా హక్కులు కొనుక్కుని కొన్ని మార్పులతో 'శాంతినివాసం' పేరుతోనే సినిమాగా విడుదల చేస్తే ప్రేక్షకులంతా విపరీతంగా ఆదరించారా చిత్రాన్ని. ఈనాటికీ ప్రజల మన్ననలను అందుకుంటున్న పాటల ద్వారా సంగీతపరంగా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న శాంతినివాసం చిత్రంలోని ఓ మూడు పాటల గురించి ...

శ్లో: శ్రీరామచంద్రః ఆశ్రిత పారిజాతః
సమస్త కళ్యాణ గుణాభిరామః
సీతారాముఖాంబోరుహ చంచరీకః
నిరంతరం మంగలమాత నోతు..

పాట: శ్రీ రఘురాం జయ రఘురాం ||శ్రీరఘు||
సీతా మనోభిరాం
అన్నదమ్ముల ఆదర్శమైన
ఆలుమగల అన్యోన్యమైన ||అన్న||
తండ్రి మాటను నిలుపుటకైన
ధరలో మీరే దశరథరాం ||శ్రీ రఘు||
వెలయు నీ ఎడా నీ దివ్యమూర్తి
వెలిగే నా ఎడ ఆనందజ్యోతి ||వెలయు||
వెలసి మా గృహం శాంతినివాసం
సలుపవె శుభగుణ శోభిత రాం ||శ్రీ రఘు||

చిత్రం "శ్రీ రామచంద్రః ఆశ్రిత పారిజాతః శ్లోకంతో మొదలై శ్రీ రఘురాం జయ రఘురాం' పాటకు దారితీస్తుంది. 'రామ కర్ణామృతం' అనే కావ్యంలోని మూడవ అశ్వాసంలో 105 వ శ్లోకంగా ఈ 'శ్రీ రామచంద్రః ఆశ్రిత పారిజాతం' శ్లోకం ఉన్నదని తెలిసింది. ఈ శ్లోకాన్ని ఆది శంకరాచార్యుల వారు రచించగా చేకూరి సిద్ధకవి ద్వారా ప్రజలకు అందిందని లభించిన ఆధారాలు తెలుపుతున్నాయి. తరువాత వచ్చే 'శ్రీ రఘురాం' పాట మాత్రం సముద్రాల జూనియర్ రాసినదే కానీ శ్లోకం నుంచి పాటవరకు ఉన్న రచనా భాగం అంతా ఆయన పేరుమీదే చాలా చోట్ల ముద్రితం అవుతూ రావటంలో ఆయన బాధ్యత ఎంత మాత్రమూ లేదు. ఈ పాటను పి.బి.శ్రీనివాస్, పి.సుశీల పాడగా నాగయ్య, దేవిక, మాస్టర్ భీమశంకరం, మాస్టర్ బాలుపై చిత్రీకరించారు. స్వతహాగా గాయకుడు, సంగీత దర్శకుడు అయిన నాగయ్యకు సంగీత దర్శకుడైన గాయకుడు ఘంటసాల మరో గాయకుడు పి.బి.శ్రీనివాస్ చేత పాడించటం ఈ పాటకు చేకూరిన ఓ విశేషంగా చెప్పుకోవాలి. హంసధ్వని రాగానికి అతి చక్కని ఉదాహరణంగా చెప్పుకోతగ్గ పాట ఇది. ఈ రాగంలో వచ్చే 'సరిగ పనిస, సనిపగరిస' స్వరాలలో 'రి'షభాన్ని వాడకుండా పాటను స్వరపరచటం ఓ ప్రత్యేకత. అయితే ఆ రాగంలో పడకూడని దైవత్వాన్ని 'అన్నదమ్ముల ఆదర్శమైనా' దగ్గర 'వెలయు నీ ఎడా నా దివ్యమూర్తి' దగ్గర వాడడం కేవలం దైవికం అనుకోక తప్పదు మరి. 'శాంతి నివాసం' నాటకంలో పాలగుమ్మి పద్మరాజు రాయగా ఎస్.జానకి పాడగా తొలి పాటగా వచ్చే 'అంతా నీ లీల గోపాలా' అనే పాటలోని చివర్నగల 'మా శాంతి నివాసం స్వర్గసీమగా చేయవె దేవా' అనే వాక్యాలు 'శ్రీ రఘురాం' పాటలో 'వెలసి మా గృహం శాంతినివాసం సలుపవె శుభగుణ శోభితరాం'గా రూపుదిద్దుకున్నాయి.

---

అతడు: రాగాలా సరాగాలా హాసాలా విలాసాలా
సాగే సంసారం హాయ్ సుఖ జీవనసారం ||రాగాలా||
ఆమె: పతి పద సేవయే యోగముగా
నాతికి పతియె దైవముగా ||పతి||
అతడు: పతి సౌభాగ్యాలే తన భాగ్యమనె
భావనయే సతి ధర్మముగ ||సతి|| ||రాగాలా||
ఆమె: మాయని ప్రేమల కాపురమె
మహిలో వెలసిన స్వర్గముగా ||మాయని||
అతడు: జతబాయని కూరిమి జంటగ మెరిసే
దంపతులె ఇల ధన్యులుగా ||జత|| ||రాగాలా||

ఈ పాటను ఘంటసాల, సుశీల పాడగా కాంతారావు, దేవికపై చిత్రీకరించారు, ఘంటసాల అత్యంత ఆప్యాయంగా ఉపయోగించే రాగేశ్రీ రాగం ఈ పాటకు ఆధారం. 'శాంతి నివాసం' నాటకంలో వీటూరి రాయగా ఎస్.జానకి, పి.బి.శ్రీనివాస్ పాడిన 'అనురాగమొలికే ఆనంద సీమ' పాటలోని పాదసేవ పరమార్థమూ, ఇలలోన శాంతికి ఇల్లాలి చలువే' వాక్యాలు 'రాగాలా సరాగలా' పాటలో మొదటి చరణానికి ప్రేరణ అయ్యాయి.

---

అతడు: రాధ రావె రాణీ రావె రాధ నీవే కృష్ణుడు నేనే
రమ్యమైన శారద రాత్రి రాసలీలా వేళ ఇదే
ఆమె: రారా కృష్ణా రారా కృష్ణా రాధ నేనే కృష్ణుడు నీవే
రమ్యమైన శారద రాత్రి రాసలీలా వేళ ఇదే
ఆమె: ఒంపులతో సొంపమరే ఇంపొసగే యమునేదీ
అతడు: సుందరి నీ వాలు జడే సొగసైనా ఆ యమునా
ఆమె: నాటి తారా కోటులు వీరె నాటి పున్నమి జాబిలి వీడే
రాధ నేనే కృష్ణుడు నీవే రాసలీల వేల ఇదే
అతడు: వికసించె నీ కనులా వెలిగేనే నీ విభుడు
ఆమె: మూగవోయే మానవ మురళీ
మురిసి మోగే మోహన మురళీ
అతడు: రాధ నీవే కృష్ణుడు నేనే రాసలీలా వేల ఇదే
అతడు: రాధ నీవే కృష్ణుడు నేనే రాసలిలా వేళ ఇదే
ఇద్దరూ: దేవి రాధా మాధవలిలా పావనమ్ము బృందావనము
మనము రాధా కృష్ణులమేలే మధురమాయే ఈ వనము

ఈ పాటను ఘంటసాల, జిక్కి గానం చేయగా అక్కినేని, రాజసులోచనపై చిత్రీకరించారు. షమ్మీకపూర్, మాలాసిన్హా హీరో హీరోయిన్లుగా 1959లో 'ఉజాలా' చిత్రం కోసం శంకర్ - జైకిషన్ స్వరపరచిన 'ఝూమ్‌త మౌసమ్ మస్త్ మహీనా..' పాట ట్యూన్‌ని తీసుకుని - పాట పాడే పద్ధతిలో షమ్మీకపూర్ స్థాయిలోని తీవ్రతను తగ్గించి, అక్కినేని ఇమేజ్‌కి తగ్గట్టు సరళంగా మృదువుగా ఈ 'రావే రాధా రాణీ రావే' పాటను తయారు చేశారు. హిందుస్థానీ భైరవి రాగం ఆధారంగా స్వరపరచబడిన ఈ 'ఝూమ్‌త మౌసమ్ మస్త్ మహీనా..' పాట ట్యూన్ ప్రజల హృదయాలలో ఎంతగా ముద్రించుకుపోయిందంటే తెలుగు వెర్షన్ కొచ్చేసరికి 'నాటి తారా కోటులు వీరె' దగ్గర తారని, కోటుని విడదీసి అనుచిత విభాగం (wrong split)తో పాడినా జనం అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఏది ఏమైనా ఒరిజినల్‌లోని 'యాలయాలా దిల్ లేగయా' ట్యూన్‌కి తెలుగులో పొదిగిన 'రాసలీల వేళ ఇదే' వాక్యం ఏమాత్రం దిగిపోలేదు సరికదా అది చక్కగా ఒదిగిపోయింది. మూలనాటకం 'శాంతి నివాసం'లో పాలగుమ్మి పద్మరాజు రాయగా ఉడత సరోజిని, రావు పాడగా మీనాకుమారి, పద్మనాభం అభినయించిన 'చెలియ ఇదియే బృందావనము' పాటలోని కృష్ణుడు, రాధ, యమునా నది వంటివి 'రావే రాధా రాణీ రావే' పాటకు కవితా వస్తువులుగా ఉపయోగపడ్డాయి.



# ఆ పాత పాట మధురం

## రాజా



### *శాంతి నివాసం - 2*

శాంతి నివాసం చిత్రంలోని స్వర రచనలలో ఓ నాలుగు పాటలు, ఓ నాలుగు పద్యాల గురించి

...

ఆశలు తీర్చవె ఓ జననీ
ఆదరముంచవే జాలిగొనీ ||ఆశలు||
సవతి తల్లి దయమాలినది
తండ్రి మాట ఇటు సాగనిది ||సవతి||
పగలూ రేయీ వాపోవుటయే
నా పరమైనది ఈ జగతి ||ఆశలు||
శోకమైన నా లోకములో
గోచరించె శుభరేఖలెవో
ఈ వెలుగే నా జీవన శోభా
దీవెన సేయవె ప్రేమఖనీ ||ఆశలు||

ఈ పాటను జిక్కి గానం చేయగా రాజసులోచనపై చిత్రీకరించారు శంకరాభరణ రాగస్వరాలపై చేసిన కార్డ్ కంపోజిషన్ పాట ఇది. 1959లో 'ఖైదీ నం 911' అనే హిందీ చిత్రం ఒకటి వచ్చింది. ఈ చిత్రం కోసం దత్తారామ్ స్వరపరచగా లతా పాడిన 'మీఠి మీఠి బాతో సే బచ్‌నా జరా' ట్యూన్‌ని 'ఆశలు తీర్చవే ఓ జనని' పాటకు వాడుకున్నారు ఇలా వాడుకోవడం వల్ల 'ఖైదీ నం 911' చిత్రాన్ని తర్వాతి రోజుల్లో తెలుగులో 'ఖైదీ కన్నయ్య' చిత్రంగా తీసినప్పుడు - పిల్లాడికి ఓ టీచర్ పాటలతో పాఠం చెప్పే సన్నివేశంలో వచ్చే పాట 'తియతీయని తేనెల మాటలతో తీస్తారు సుమా గోతులు నమ్మవద్దూ'కి 'ససురాల్' చిత్రంలోని 'తెరి ప్యారి ప్యారి సూరత్ కో కిసీకి నజర్ నా లగే చష్మె బద్దూ' అనే పాట ట్యూన్‌ని ఆశ్రయించవలసి వచ్చింది. అంచేత 'ఖైదీ నెం 911' చిత్రంలోని 'మీఠి మీఠి బాతోసే' పాట సంగీత సాహిత్యాల్ని వేరు చేసి ట్యూన్‌ని 'ఆశలు తీర్చవె' పాటకి, లిరిక్‌ని 'తియ తీయని తేనెల మాటలతో' పాటకి (ఖైదీ కన్నయ్యలో) వాడుకోవడాన్ని ఓ విశేషంగా ఇక్కడ ఉదహరించక తప్పదు. హుషారుగాను విషాదంగాను రెండు రకాలుగా పాడిన

'మిరి మిరి బాతోసే బచ్‌నా జరా' పాటకి, తెలుగులో వచ్చిన 'ఆశలు తీర్చవె ఓ జననీ' పాటకి తాళాన్ని చతురస్ర గతిలోనే ఉపయోగించినా నడకలో తేడా చూపించారు అటు దత్తారామ్ ఇటు ఘంటసాల.

హిట్ అయిన హిందీ పాటలో తర్వాతి రోజులకి పనికొచ్చే సాహిత్యం ఓ వైపు డామినేట్ చేస్తూ ఉన్నా ప్రస్తుత సన్నివేశానికి తగిన సాహిత్యాన్ని తగు విలువలతో సమకూర్చడం నిజంగా గొప్ప విషయమే ముఖ్యంగా 'దీవెన సేవయె ప్రేమఖనీ' అనే వాక్యం శబ్దపరంగా ప్రశంసించదగ్గది.

---

అతడు: కమ్ కమ్ కంగారు నీకేలనే
నా వంక రావేలనే చెలి నీకింక సిగ్గేలనే
ఆమె: నో నో నో నీ జోరు తగ్గాలిగా
ఆ రోజు రావాలిగా ఇక ఆ పైన నీదానగా నో నో నో
అతడు: కోరి ఏనాడు జతచేరి ఎగతాళిగా
చేరువైనామొ ఆనాడే జోడైతిమే ||కోరి||
ఆమె: ఇంతస్నేహానికె అంత ఆరాటమా
చాలులే తమరికి ఏల ఈ తొందరా ||కమ్||
ఆమె: ఏల ఈ లీల పదిమందిలో పాటలా
పరువు మరియాద లేని ఈ సయ్యాటలా ||ఏల||
అతడు: నీవు నా దానవై నేను నీ వాడనై
నీడగా నిలిచినా చాలులే నా చెలి ||కమ్||

ఈ పాటను ఘంటసాల, జిక్కి గానం చేయగా అక్కినేని, రాజసులోచనపై చిత్రీకరించారు 1958లో వచ్చి 'మౌసీ' హిందీ చిత్రం కోసం వసంత్ దేశాయ్ స్వరపరచగా లతా, తలత్ మహమ్మద్ పాడిన 'టిం టిం టిం తారోంకే బీచ్ తలే' పాట ట్యూన్‌ని ఈ పాటకు వాడుకున్నారు. శంకరాభరణ రాగంపై వచ్చే స్వరాలపై చేసిన ఈ కార్డ్ కంపోజిషన్ సాంగ్‌లో పల్లవి తర్వాతా, చరణాల మధ్య మధ్యా - వచ్చే ఆలాపనలు పాటకు ఎంతో వన్నె తెచ్చాయి. ఒరిజినల్ హిందీ ట్యూన్ తలత్ మహమ్మద్ గొంతుతో అతి మృదువుగా అమిరిపోతే తెలుగు అనుకరణ ఘంటసాల కంఠంలో మధుర మార్దవంగా ఇమిడిపోయింది. విభిన్న గాత్రధర్మాలు కలిగిన ఇద్దరు గాయకులకు తగ్గ ట్యూన్‌ని సృష్టించిన వసంత్ దేశాయ్‌ని ప్రత్యేకంగా అభినందించాలి.

---

సాకీ: తుషార శీతల సరోవరాన
అనంత నీరవ నిశీధిలోన
ఈ కలువ నిరీక్షణా..
నీ కొరకే - రాజా - వెన్నెల రాజా
ప: కలనైన నీ తలపే ||కలనైనా||
కలవరమందైనా నీ తలపే ||కలనైనా||
చ: కలువ మిఠారపు కమ్మని కలలు ||కలువ ||
కళలూ కాంతులు నీ కొరకేలే ||కళలూ||
చెలి ఆరాధన సాధన నీవె
జిలిబిలి రాజా జాలి తలచరా ||కలనైనా||
చ: కనుల మనోరథ మాధురి దాచి ||కనుల||
కానుక చేసే వేళకు కాచి
వాడే రేకుల విడని మమతల
వేడుచు నీకై వేచి నిలచెరా ||కలనైనా||

'తుషార శీతల సరోవరాన' అనే సాకీతో మొదలై 'కలనైనా నీ వలపే' అనే మకుటంతో ప్రసిద్ధికెక్కిన ఈ గీత స్వరకర్తగా ఘంటసాలకు, గాయనిగా పి.లీలకు ఎనలేని పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టింది. కృష్ణకుమారి, కాంతారావు, రాజేశ్వరిపై పాట చిత్రీకరించారు. ఈ రాజేశ్వరి ఎవరో కాదు ప్రముఖ నటి శ్రీదేవి తల్లి. మొదట ఈ వేషానికి సుజాత అనే నటిని అనుకున్నారు. సమయానికి ఆవిడ లభించకపోవడంతో కాంతారావుగారి సలహాపై రాజేశ్వరిని తీసుకోవటం జరిగింది. ఈ 'కలనైన నీ వలపే' పాటకి హిందోళ రాగం ఆధారం. సితార్ వాద్యానికి అతి చక్కని ప్రాధాన్యత గల ఈ గీతం ఔత్సాహిక గాయనీ మణులకు ఘంటసాల శాశ్వతంగా ఇచ్చిన ఓ వరం.

---

అతడు: చక్కనిదానా చిక్కనిదానా ఇంకా అలకేనా
ఆమె: నీ మాయలన్నీ చాలించు నాతోనా నీ మాయ
అతడు" పోతా పోతానంటే నేనేమైపోతానే
ఎనిమిది గంటల షరతు పోయింది నిన్నటితోనే ||పోతా||
ఆమె: తమరి నాన్న హై హై హై విడవలేదే తమరి ||చక్కని||
ఆమె: అమ్మగారి ఇంటా మా నాన్నతోటీ తంటా
అత్తగారి ఇంటా హై హై పోరంటా
అతడు: జతగ ఉంటే ఏం తంటా మనకు లేదంటా ||జతగా|| ||చక్కని||

ఈ పాటను పిఠాపురం నాగేశ్వరరావు, స్వర్ణలత పాడగా రేలంగి, సురభి బాలసరస్వతి అభినయించారు సంగీత దర్శకురాలు ఉషాఖన్నా స్వరపరచగా 1959లో వచ్చిన 'దిల్ దేకె దేఖో' చిత్రంలోని టైటిల్ సాంగ్ ఈ పాటకి యధాతథంగా ఆధారం. రఫీ పాడిన ఆ హిందీ పాటకు ఇంకో ఒరిజినల్ ఉంది 'Sugar Time' అనే టైటిల్ తో మెక్ గ్వయిర్ సిస్టర్స్ స్వరపరచి, పాడి 1958లో విడుదల చేసిన Sugar at supper Time, Be my l ittle sugar and love me alla the time' అనే పాప్ సాంగ్ ఈ 'దిల్ దేకె దేఖో దిల్ దేకె దేఖో దిల్ దేకె దేఖోజీ దిల్ లేనే వాలో దిల్ దేనా సీఖోజీ' పాటకు ఆధారం చరిత్ర ప్రాధాన్యం కలిగిన కొన్ని విషయాలను, విశేషాలను ఆసక్తితో సేకరించి దాచుకునే పాఠకుల సౌకర్యార్థం పొందు పరచిన 'sugar in the morning' పాప్ సాంగ్ సాహిత్యమిది

Sugar in the morning
Sugar in the evening,
Sugar at supper Time,
Be my little sugar and love me alla the time;
Like the stars above you – I will always love you,
When I call you mine,
So be my little sugar and love me all the time,
Won't you say you love me, like the starts above

And forever be mine in this heaven of ive,
Honey in the morning honey in the evening,
Honey at supper time;
Be my little honey and love me all the time,
You went away, that Saturday,
And you thought you'd make me pay;
Well, you did, but now you're back,
Oh, we'll live in a little shake: "Oh, be my little."

---

హిందీ పాటలోని చరణాల స్వర రచనకి 'sugar i n the mornin g' లోని చరణాల స్వరరచనకీ చాలా తేడా ఉంది. కానీ మన తెలుగు పాట 'చక్కని దానా చిక్కని దానా'కు మాత్రం 'దిల్ దెకె దేఖో' హిందీ పాటే పూర్తిగా ఆధారం. పాటలోని సాహిత్యం జాగ్రత్తగా గమనిస్తే కామెడీ ట్రాక్ కొంతవరకు అర్థమయిపోవటమే కాకుండా కథతోపాటు కామెడీ ట్రాక్‌కు తగ్గట్టుగా కూడా ఆ రోజుల్లో పాటల సాహిత్యం ఉండేదని తెలుస్తుంది.

హిందీ చిత్రాలలోని ట్యూన్‌లను యధాతథంగా తీసుకుని తయారు చేసిన - రావె రాధా రాణీరావే, ఆశలు తీర్చవె ఓ జననీ, కమ్ కమ్ కమ్ కంగారు నీకేలనే, చక్కనిదానా చిక్కని దానా పాటలను జాగ్రత్తగా పరిశీలించి చూస్తే ఒక్క విషయం అరటి పండు చేతిలో ఒలిచిపెట్టినట్టు అర్థమవుతుంది. బాగా పాపులర్ అయిన హిందీ పాటల ట్యూన్‌లను ఎంత మనం అడాప్ట్ చేసుకున్నా - తెలుగులో కూడా ఈ నాలుగు ఇంత హిట్ అయ్యాయంటే అందుకు కారణం ట్యూన్స్‌లో ఉన్న గొప్పదనం మాత్రమే కాదు - ఈ సంగీతం మనదే ఈ సాహిత్యం మనదే అన్నంతగా మన హృదయాలలో చొచ్చుకుపోయిన - నేటివిటి టచ్. ఇవాళ తయారవుతున్న ద్విబాషా చిత్రాలలో గానీ, నిర్మాణానికి ముందుగానే ప్లాన్ చేసుకుంటున్న డబ్బింగ్ చిత్రాలలో గానీ పాటల పరంగా మనం మిస్ అవుతున్నది అదే!

పైన ఉదహరించిన పాటలే కొన్ని పద్యాలు కూడా ఉన్నాయీ చిత్రంలో.. వాటిలో ఓ నాలుగు పద్యాల గురించి..

---

లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులన్
ఠావుల్ దప్పను మూర్ఛవచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప ఇతఃపరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్
రావే ప్రేయసీ.. కావవే సఖియ.. సంరక్షించు ప్రాణేశ్వరీ

బమ్మెర పోతన విరచితమైన భాగవతంలోని గజేంద్ర మోక్షఘట్టంలో పద్యాన్ని తీసుకుని సినిమా పరంగా కొన్ని మార్పులు చేసి ఉపయోగించుకోవడం జరిగిందిక్కడ. శార్దూల విక్రీడితమైన అసలు పద్యంలోని ‘రావే ఈశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మక‘ అనే చతుర్థ పాదాన్ని ‘రావే ప్రేయసీ కావవే సఖియ సంరక్షించు ప్రాణేశ్వరీ‘ అంటూ మార్చారు. పద్యాల్ని పాడుతున్నప్పుడు అందులోని పదాల్ని ఉచ్చరించటంలో వ్యాకరణ పరంగా ఉండే అరసున్నాల్ని తీసేసి ఆ ప్రకారంగా వచ్చే మార్పుల్ని సరళతరం చేసి - పాండిత్యంతో సంబంధం లేనివారు కూడా హాయిగా పడుకోడానికి అనువుగా తీర్చిదిద్దుకున్నారీ పద్యాన్ని. సంగీతపరంగా ఈ పద్యాన్ని ఘంటసాల హిందోళరాగంలో స్వరపరచి పాడగా అక్కినేని నాగేశ్వరరావుపై చిత్రీకరించారు. ఆఖరున రాజసులోచన కూడా సన్నివేశ ప్రాధాన్యంగా వచ్చి చేరుతుంది.

---

తే.గీ. మగని ప్రాణంబు, అత్తమామలకు చూపు
పరులు గైకొన్న రాజ్యము వైభవమ్ము
ముద్దు పాపల వరముగా పొందగలిగే
వెలది సావిత్రి తన యుక్తివలనగాదే!

తే.గీ. నిండు కొలువున కీడిచి నీచమతులు
వలువలూడించి తలవంపు సలుప నెంచ
ప్రజలు కీర్తింప పరువు కాపాడు కొనియె
కలికి ద్రౌపది తన భక్తి కతనగాదె!

తే.గీ. దుష్ట దానవ విద్రోహ దుఃఖభార
వివశమై విలపించెడు విశ్వమందు
రాక్షసుల ద్రుంచి శాంతిని రక్షచేసి
కాళికామాత తన శక్తి కతనకాదె!

ఘంటసాల ఆలపించిన ఈ మూడు పద్యాలను కూడా అక్కినేని నాగేశ్వరరావు, రాజసులోచనపై చిత్రీకరించారు. ఇందులో సతీసావిత్రిపై గల పద్యాన్ని కళ్యాణి రాగంలోనూ, ద్రౌపదిపై గల పద్యాన్ని ఆరభి రాగంలోనూ, కాళికామాతపై గల పద్యాన్ని కేదార గౌళ రాగంలోనూ స్వరపరచారు ఘంటసాల.

కళ్యాణి రాగానికి సంబంధించి, యమన్ గురించి - సినీ గీతాల పరంగా - సంగీతంలో ప్రవేశం లేకుండా - కేవలం అభిరుచి మాత్రమే కలిగిన శ్రోతలకు కొన్ని కన్ఫ్యూజన్స్ ఉంటాయి. శుద్ధమైన కళ్యాణి రాగం ఎలా ఉంటుందో తెలుసుకొనగోరే శ్రోతలకు ఈ సతీసావిత్రిపై స్వరపరిచిన పద్యం సదుపాయంగా పనికి వస్తుంది.

కొన్ని కొన్ని సంఘటనలు జరిగిపోయాక తరచి చూసుకుని విశ్లేషించుకుంటే ఆ అనుభవం ఇచ్చే తృప్తే వేరు. కాళికాదేవిపై పద్యాలు అనగానే ఎవరికైనా గుర్తొచ్చేది. మహాకవి కాళిదాసు చిత్రంలో ఘంటసాల ఆలపించిన శ్యామలాదండకం. అందులోని ‘చతుర్భుజే చంద్రకళావతంసే‘ అనే శ్లోకం ఈ శ్లోకాన్ని కేదార గౌళ రాగంలో స్వరపరిచారు పెండ్యాల. ఇక్కడ ఈ చిత్రంలోని కాళికామాతపై గల

ఈ పద్యం కూడా కేదారగౌళ రాగంలోనే స్వరపరచబడింది. అందుకు కనిపించే కారణం ఒక్కటే. కేదారగౌళ రాగంలో పై స్థాయి నుంచి పాడే సౌలభ్యం ఉంది. అది ఒక రకమైన ఆవేశాన్ని ప్రతిఫలింపచేస్తూ ఉంటుంది. కాళికాదేవి అవతారం కూడా ఆవేశానికి ప్రతిరూపమే కదా!

ఈ శాంతి నివాసం చిత్రానికి మూలమైన తమిళ నాటకం ‘మల్లియమ్ మంగళమ్‘ని సహస్రనామం బృందం వారు ప్రదర్శించేవారు. అప్పట్లో విజయా సంస్థలో నటిస్తూ నెలకు 125 రూపాయల వేతనంతో పెర్మనెంట్ ఆర్టిస్టుల బృందంలో వల్లం నరసింహారావు, పద్మనాభం ఉండేవారు. మద్రాసు అన్నామలై మండ్రంలో ప్రదర్శించిన ఆ నాటకాన్ని పద్మనాభం పల్లం నరసింహారావు చూసి బాగుందనుకుని ఆ నాటక రచయిత బి.యస్.రామయ్య వద్ద అనుమతి తీసుకుని పాలగుమ్మి పద్మరాజు చేత తెలుగులో ‘శాంతినివాసం‘ పేరుతో నాటకంగా రాయించి, రేఖ అండ్ మురళి ఆర్ట్స్ బ్యానర్‌పై సుమారు వందమందికి పైగా ప్రదర్శనలు ఇచ్చారు . ఈ నాటకం కోసం శ్రీ శ్రీ, వీటూరి (వేటూరి కాదు), వడ్డాది, పాలగుమ్మి పద్మరాజు పాటలను రాశారు. యస్.పి.కోదండపాణి సంగీతాన్ని ఇచ్చారు. మాధవపెద్ది సత్యం, పి.బి.శ్రీనివాస్, సత్యారావు, ఎస్.జానకి, ఉడత సరోజిని ఆ పాటలను పాడారు. అవి గ్రామ్ ఫోన్ రికార్డులుగా కూడా వచ్చాయి. ఆ పాటల పుస్తకాల్ని పన్నెండు నయాపైసలకు అమ్మేవారు. అప్పటికి, ఆ తరువాత సినీనటులుగా గుర్తింపు తెచ్చుకున్న పద్మనాభం, వల్లం నరసింహారావు, వడ్లమాని విశ్వనాథం, మోహన్ దాస్, మహంకాళి వెంకయ్య, మీనాకుమారి, ఆదోని లక్ష్మి (ఆగమనం టీవీ సీరియల్ ద్వారా పాపులర్ అయిన నటి రూపాదేవి తల్లి), రమాదేవి, డబ్బింగ్ జానకి, పార్వతి ఆ నాటకంలో ధరించిన పాత్రలను తర్వాత సినిమాగా వచ్చిన ‘శాంతి నివాసం‘లో అక్కినేని నాగేశ్వరరావు, కాంతారావు, నాగయ్య, రేలంగి, రమణారెడ్డి, రాజసులోచన, దేవిక, సూర్యకాంతం, సురభి, బాలసరస్వతి, కృష్ణకుమారి పోషించారు.

వల్లం నరసింహారావు కుమార్తె రేఖ, పద్మనాభం కుమారుడు మురళి పేరుతో వెలసిన రేఖా అండ్ మురళీ ఆర్ట్ బ్యానర్‌పై ఆ నాటకం తొలి ప్రదర్శన మద్రాసు పానగల్ పార్క్‌లోని కృష్ణగాన సభలో జరిగింది. మూలం అయిన తమిళ నాటకం ‘మల్లియమ్ మంగళమ్‘ బృందం నాయకుడు, నటుడు అయిన సహస్రనామం - మా నూరో ప్రదర్శన అంత గొప్పగా ఉంది మీ తొలిప్రదర్శన - అని పొగిడారట. నాటకాన్ని చూసిన ఆత్రేయ మర్నాడు తన అభిప్రాయాన్ని చెప్పొచ్చులే అని ఇంటికి వెళుతూ సగం దూరం వెళ్ళాక మనసొప్పక మళ్ళీ వెనక్కి తిరిగొచ్చి - తెలుగు నాటక రంగం ఇంకా చచ్చిపోలేదని, తమిళ నాటకరంగానికి ఏ మాత్రం తీసిపోదని నిరూపించారయ్యా - అంటూ ఎంతో ఆవేశంగా కళ్ళనీళ్ళు పెట్టుకున్నారట. అంత సత్తా ఉండబట్టే అదే స్థాయిలో రూపొందిన ‘శాంతినివాసం‘ చిత్రం ఆనాడే కాదు ఈనాడు కూడా అందర్నీ అలరించే స్థాయిలో ఉంది.



# ఆ పాత పాట మధురం

## రాజా



### *కనకదుర్గ పూజామహిమ*

**పౌరాణిక చిత్రాలలోనే కాక జానపద చిత్రాల** నిర్మాణంలో కూడా తెలుగువారికున్నంత మంచిపేరు మరెవరికీ లేదనే చెప్పాలి. జానపద చిత్రాలలో ఒక ప్రత్యేకమైన ఒరవడిని తనకు తానుగా సృష్టించుకున్న దర్శకుడు విఠలాచార్య. తన చిత్రాలలో పాటలకు సంబంధించినంతవరకు విలక్షణమైన అభిరుచిని కనపరిచేవారు. 60వ దశకంలో వచ్చిన జానపద చిత్రాలలో - కొన్నింటిలో - ఇంకా భక్తి, మహిమలు, ఆదర్శంలాంటివి అంతర్లీనంగా ఉండడం చేత కొంతవరకు శాస్త్రం సమ్మతించే రాగ లక్షణాలు ఆయా పాటలు స్వర రచనలలో ఉండేవి. 1960లో విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన కనకదుర్గ పూజమహిమ చిత్రంలో కూడా ఆ ధోరణి ఎక్కువగా కనబడుతుంది. చిత్రానికి మాటలతో పాటు పాటలను కూడా జి.కె.మూర్తి రాయగా, జంట సంగీత దర్శకులైన రాజన్ - నాగేంద్ర స్వరరచనలో బాగా పాపులర్ అయిన ఓ ఆరు గీతాలివి.

ఆమె: జీవనమే పావనం మానవ జీవనమే పావనం
  ఈ భువి సంతత సంతోష సంధాయిని గాన జీవనమే పావనం
అతడు: ప్రణయము మనలోన... ప్రణవము కాగా ||ప్రణ||
  మనరాగములోన అనురాగమె మ్రోగ
  జీవనమే పావనం మానవ జీవనమే పావనం
ఆమె: పతి పదముల సేవ సతులకు సరిత్రోవ ||2|| ఇహపర లోకాల నాకు
అతడు: కూరిమి అలరార కోరికలింపార ||2|| చేరువగా జంట చేర
ఆమె: మాటలు భావాలు .. మాటలు భావాలు పూవులు తావి ||మాటలు||
అతడు: మెలిసిన ఆ రీతి కలిసిన ఆనాడె
  జీవనమే పావనం మా నవ జీవనమే పావనం
ఇద్దరు: ఈ భువి సంతత సంతోష సంధాయని గాన జీవనమే పావనం
ఆమె: మదమపమ జీవనమే పావనం
  నిద దప పమ స్స మ్మ ప జీవనమే పావనం
  సనిదపమమ్మ పమపమాపమప
అతడు: సస్సా మదనిద సన్నిదని దప దద్దనిదపమ సదమమప
ఇద్దరు: జీవనమే పావనం ఈ భువి సంతత సంతోష సంధాయిని గాన జీవనమే పావనం

ఈ పాటను ఘంటసాల, రాజ్యలక్ష్మి గానం చేశారు. శాస్త్రీయ సంగీత ప్రపంచంలో శూలమంగళం సిస్టర్స్‌గా పేరు పొందిన రాజ్యలక్ష్మి జయలక్ష్మిలో ఒకరైన రాజ్యలక్ష్మితో ఈ పాటను ఎందుకు పాడించారో పైన ఉదహరించిన స్వరాలు చూస్తేనే చాలామందికి అర్థమైపోతుంది. ఈ పాట 'కుంతలవరాళి' రాగంలో స్వరపరచబడింది. ఈ రాగంలో సినిమా పాటలు చాలా తక్కువనే చెప్పాలి 'కుంతలవరాళి' అనగానే చాలామందికి గుర్తొచ్చేది బాలమురళీకృష్ణ పాడిన 'తిల్లాన నాదిరి దిరితోం' అనే తిల్లాన 'సమపనిదస' అనే స్వరాలు ఆరోహణలోనూ 'సనిదపమన' అనే స్వరాలు అవరోహణలోనూ కలిగిన ఈ వక్రరాగంలో 'రి,గ' అనే రెండు వరస స్వరాలు లేకపోయినా రంజకత్వం ఉండడం ఈ రాగ విశేషం. అటువంటి రాగాన్ని - అందునా హీరోహీరోయిన్లకు కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టులు పాడే పాట కోసం ఎన్నుకోవడం చక్కని అభిరుచికి నిదర్శనమనే చెప్పుకోవాలి. ఈ పాటలో మిక్కిలినేని, ఆదోని లక్ష్మి ప్రధాన పాత్రధారులు. 'ఆగమనం' టీవీ సీరియల్ ద్వారా పునఃప్రాచుర్యం పొందిన రూపాదేవికి ఈ ఆదోని లక్ష్మి తల్లి.

---

మాలతి: వసంతుడేరాగా ఈ - వసుంధరే రాగాలా
ఊగి తూగాడెనూ చిందీ అందించె - అందాలనూ ||వసం||
కొమ్మల వీడె రంగుల పులా జుమ్మని పాడె తుమ్మెద వ్రాలా
చెలికత్తెలు: సరాగములాడేయీ - పరాసికాలాడేయీ
మాలతి: కమ్మదనాల - కోకిల కూయ తెమ్మెర వీచి తన్మ మీయ
చెలికత్తెలు: పరాకు పొందేవేలా - చిరాకు చెందేవేల
మాలతి: వీనులవిందయీ - కన్నులకింపయీ వెలపే నేడే హాయీ ||వసం||
తెలిమబ్బులతో తేలిపోయీ - సోలిపోదమా
పరుగులాడే మెరుపు తీగై - మెరసిపోదామా
వెలసే శాంతిలో వెలిగే కాంతిలో ||వెలసే||
ఒలికించింది - హాయీ ||వసం||

ఈ పాటను ఏపి కోమల, బృందం పాడగా కృష్ణకుమారి, చెలికత్తెలపై చిత్రీకరించారు. కాంతారావు, బాలకృష్ణ సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ఏ.పి కోమల అనగానే 'దీపావళి' సినిమాలోని 'సరియా మాతో సమరాన నిలువగలడా' పాటని, 'బంగారు పంజరం' సినిమాలోని 'పదములె చాలు రామా' పాటని మాత్రమే ఉదహరించేవారు ఈ 'వసంతుడె రాగా' పాటను ఒక్కసారి వింటే ఇది కూడా ఆమె బాగా పాడిన పాటలలో ఒకటిగా చేర్చుకోడానికి మనసారా అంగీకరిస్తారు ఈ పాటలో - ముఖ్యంగా రెండవ చరణమైన తెలివిమబ్బులలో తేలిపోయి - దగ్గర ఆమె హాయిగా పాడిందనిపిస్తుంది. ఈ పాటకు మోహనరాగం ఆధారం. ఈ పాటను జాగ్రత్తగా గమనిస్తే - 1959లో విడుదలైన శాంతారాంగారి 'నవరంగ్' సినిమాలోని 'అరెజారె హట్ నట్‌కట్' పాట నడకను ప్రేరణగా తీసుకున్నారనిపిస్తుంది.

---

అతడు: అనురాగ సీమ మనమేలుదామ ఆనందాల చవిచూదమా
ఆమె: మేఘాల తేలాడి ఓలాడుదామా మెరిసే ధరణి మనదే సుమా ||అనురాగ||
అతడు: ఎగిరేటి ఎలతేటి తీగాలు మ్రోగే చిగురాకు పూబాలలూగే
ఆమె: తెరవోలె చిరుగాలి పారాడి సాగె కెరటాలు కోనేట తూగె
అతడు: మధురానుభవమే ఈ జగానమధుమాసమై నేడు శోభించెనా
ఆమె: ఇలనిండె వలపు ఈ దినాన కలలన్ని కనులార కాంతుమా ||అనురాగ||
ఆమె: నెలరాజు నేడేల తన రాక మానె
అతడు నీ మోము తిలకించి తలదించెనే
ఆమె: ఆ.. పలికేటి చిలుకేల తన పాటమానె
అతడు: కలకంఠి నీ కంఠమాలించెనే
ఆమె: ఉలికింది కళలా ఈ లోకమెల్ల
అతడు: పులకించె నిలువెల్ల గిలిగింతలా
ఆమె: మనలోని ప్రేమ
అతడు: ఎనలేని ప్రేమ
ఇద్దరు: మనసార తనివితీర సేవింతుమా ||అనురాగ||

ఈ పాటను జిక్కి, పి.బి.శ్రీనివాస్ ఆలపించారు. కృష్ణకుమారి, కాంతారావుపై చిత్రీకరించారు. రాగేశ్రీ రాగం ఆధారంగా సాగిన ఈ పాట రెండో చరణంలోని మొదటి నాలుగులైన్లలో ఉపయోగించిన ఉల్లేఖాలంకారం సినీగీతాలలోని సాహితీ మర్యాదలకు మచ్చుతునక అతి మృదువుగా సాగే ఈ యుగళగీతంలో - మాధుర్యంలోని సున్నితత్వానికి దోసిలిపట్టే తత్వం గల జిక్కి, పి.బి.శ్రీనివాస్ గాత్రధర్మాలు ఎంతగా సహకరించాయో అక్షరాలలోకి అనువదించలేం. అది కేవలం అనుభవైకవేద్యం.

---

జయం మనదే జయం మనదే ||జయం||
జాణనని గని జాలిమదిగొని ||జాణ||
చేరెరా గారాల రా చిలుక ||జయం||
హహహహహహ హొహొహొహొహొహొ లలలలలల
కనుల కొనల కులుకు లొలుక వినరగానే వలా
మనసు ఊగి కులుకు లొలుక వినరగానే వలా
మనసు ఊగి మంత రేగి మరిగె కోరికలా
పెదవి తుదిలో మధువు చెదరా ఎరను వేసితి అలా...
ముదిమి మదిలో ముదము కదిలి లేచెలే మరలా
కన్నార గనుచు నన్నేలమనుచు నోరార కోరెనులే ||జయం||
ఓపలేనే ఈ తాపమనుచు నోరార కోరెనులే ||జయం||
ఓపలేనే ఈ తాపమనెను దాపునే ననుగని
కోపమేల నేతాళజాల ఏలుకోమనెను
అందరాని ఆనందములకై అలమటించే తనూ
పాదమాన నీ బానిసనుచు చేసే బాసలను
కన్నార గనుచు నన్నేల మనుచు నోరార కోరెనులే ||జయం||

అత్యద్భుత రసస్ఫోరకంగా ఉండే ఈ పాటని గీతంగా పేర్కొనాలి. పి.సుశీల హిట్స్‌లోగల ఎన్నో పాటలతో సవాల్ చేసి నిలబడదగ్గ ప్రమాణాలన్నీ ఉన్న గీతం ఇది. ఉదయ రవిచంద్రిక రాగం ఈ పాటకు ఆధారం. ఓ విధంగా చెప్పాలంటే ఈ రాగానికి ఈ పాటను ఓ ప్రామాణిక గీతంగా చెప్పుకోవచ్చు కూడా. నిజానికి ఈ పాట పాడడానికి అతి స్పష్టమైన వాచకం కావాలి. లేకపోతే ‘చేరెరా గారాల రా చిలుక‘ వంటి ప్రయోగాలు ఇష్టమొచ్చినట్లు దొర్లిపోతాయి. రెండో చరణంలో పాదమాన నీ బానిసనుచు అనే వాక్యంలో ‘పాదమాన‘ అనే ప్రయోగంలో స్పష్టత లోపిస్తే అది శ్రోతలను ఆలోచింపచేయకుండా మెదడు పొరలోంచి పైకి దూకేస్తుంది కూడా. అందుకే ఈ పాటలోని సంగీత సాహిత్యాలకు సుశీల స్వరం ఓ వరం అని చెప్పాలి. ఈ పాట చిత్రంలోంచి తొలగించబడింది పాటల పుస్తకంలో ఈ పాటను మాయపాత్రధారిణి కోసం అన్నట్టుగా పేర్కొనబడింది కనుక, ఆ మాయ పాత్ర ధరించిన పాత్రధారిణి మాధురి.

---

ఓహోహో - ఓహోహో
రారా - రారా - రారా - మార కుమార
రరా - రారా - రారా - రారా - ||రారా||
నీదారి చూచి చూచీ - నిలచేను నేను వేచి
నీదారి చూచి చూచీ- నిలచేను నేను వేచి
విరహానలాన చేరి - విరహానలాన చేరి
వేసారి వేగినారా - వేసారి వేగినారా ||రారా||
తమి తీరలేని మరులా - తపియించు దీనురాలా
తమి తీరలేని మరులా - తపియించు దీనురాలా
సుఖసాగరాన తేల - సుఖసాగరాన తేల
ఇక జాగుసేయనేల - ఇక జాగుసేయనేల ||రారా||

ఈ పాటను జిక్కీ పాడగా శాంతి(పాటల పుస్తకంలో ఈమె పేరు స్వర్ణలతగా పేర్కొనబడింది), కాంతారావుపై చిత్రీకరించారు. జిక్కి పాడిన మంచి పాటలలో ఇదొకటి శంకరాభరణ రాగం స్కేల్‌ని ఆధారంగా తీసుకుని ఎన్నో పాటలు వచ్చాయి. మన శంకరాభరణాన్ని హిందుస్తానీలో బిలావల్ అని అంటారు శాస్త్రకారులు. ఆ బిలావత్ రాగం పోకడని స్కేల్‌గా తీసుకుని అంతర్లీనంగా హిందుస్తానీ ఫోక్‌ని స్పృశిస్తూ వెస్టనైజ్ చేశారు సంగీత దర్శకులు రాజన్ నాగేంద్ర ఈ పాటలో.

---

ఓంకార పంజర సుఖీమ్
ఉపనిషదుద్యాన కేళికలకంఠీమ్
ఆగమ విపన మమూరీమ్
ఆర్యామ్ అంతర్వి భావయే గౌరీమ్ గౌరీమ్ గౌరీమ్
జయజయనమో కనకదుర్గా నమో మోక్షమార్గా
శ్రితానీక రక్షానునురాగా ఘోర దుర్వార దౌర్భాగ్యంభంగా
అనంగారింగా మహాచండ సింగత్తురంగా
గౌరీ సదా భక్త క్షేమంకరీ
జయకరీ! శంకరీ కింకరవంశకరీ వసుధా శుభంకరీ
ఆర్తజన అభయంకరీ ఆర్త జన అభయంకరీ
పాహి త్రిలోకైక జననీ భవానీ భక్త చింతామణి
ముక్తి సంధాయిని ఆర్త సంతారిణి ధూర్త సంహారిణి
కాళీ కళ్యాణి గీర్వాణీ హ్రీంకారిణీ
అన్నపూర్ణా అపర్ణాంబ కాత్యాయినీ
శ్రీ చక్ర సింహాసినీ.. శాంభవీ –
శాంభవీ భ్రమరాంభ శ్యామలా యవ్వనీ
భగల జ్వాలాముఖీ కామాక్షి మీనాక్షి దాక్షాయణీ
పేరులే వేరుగా అందరూ నీవెగా ఈ దీను గావగా రావేల వేగ
అమ్మ నీ పాద పద్మాలు నమ్మ
వెతలు తీరునమ్మా సుతులు సేయగా కొంగు బంగారమమ్మా
నా జన్మకారకులు నీ పూజలను మాని అపరాధములు చేసిరమ్మ
పావులు పుణ్యులూ నీ పాపలే గాన ఈ కోపమింకేలనమ్మా
కృప చూపవమ్మా మనోవాంఛితార్థమ్మునిమ్మా
మొరాలించవమ్మా పాలించవమ్మా
కనికరించమ్మ కనికరించమ్మా కనకదుర్గమ్మా

'ఓంకార పంజర సుఖీమ్' అనే శ్లోకంతో మొదలై 'జయజయ నమో కనకదుర్గ' అనే మకుటంతో సాగిన గీతంలో దుర్గమాత నామావళిని పొందుపరచడం ఓ చక్కని ఆలోచన. మొదట ఉన్న శ్లోకం నుంచి 'ఆర్తజన అభయంకరీ' వరకు మోహనరాగంలోనూ, 'పాహిత్రిలోకైక జననీ' దగ్గర్నుంచి 'దాక్షాయణీ' వరకు హిందోళ రాగంలోనూ 'పేరులే వేరుగా' నుంచి చివరి వరకు శుభపంతువరాళి రాగంలోనూ సాగే ఈ స్వరరచనను మాధవ పెద్ది సత్యం, పి.బి.శ్రీనివాస్ గానం చేయగా కాంతారావుపైనా, ఆంగికంలోనూ,

వాచకంలోనూ ముక్కామలను స్ఫురింపజేసే నటుడు శ్రీకాంత్‌పైనా చిత్రీకరించారు. గాయకుడిగా పి.బి.శ్రీనివాస్ సంగీత జీవన యానంలో భక్తిరస ప్రధానంగా నిలిచిపోయే ఈ గీతం ఓ మైలురాయి వంటింది.



# ఆ పాత పాట మధురం

## రాజా



### శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం

**కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరునిపై** ఎన్ని సిన్మాలు వచ్చినా పద్మశ్రీ బ్యానర్ పై 1960లో వచ్చిన 'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం' చిత్రం మాత్రం శాశ్వత కీర్తిని సంపాదించుకుంది. 1939లో సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, శాంతకుమారితో 'వేంకటేశ్వర మహాత్మ్యం' సినిమా తీసిన పి.పుల్లయ్యే ఈ చిత్రానికి కూడా దర్శకత్వం వహించారు. పుష్కరిణిలో మునిగితే కలిగే దివ్యానుభూతి ఆ క్షేత్రంలో ఆలయం ముందున్న కుళయి దగ్గర స్నానమాడినా కలిగినట్టు..పెండ్యాల సంగీత దర్శకత్వంలో వచ్చిన వచ్చిన ఈ 'శ్రీ వెంకటేశ్వర మహత్మ్యం'లోని పాటలు ఇప్పుడు క్యాసెట్ల రూపంలో విన్నా అదే ఆత్మానందాన్ని అనిర్వచనీయమైన అదే అనుభూతిని కలిగిస్తాయి. అటువంటి తాదాత్మ్యాన్ని కలిగించే ఆ చిత్రంలోని పాటలలో ఓ నాలుగు..

శ్రీదేవిని నీదు దేవేరిని ||శ్రీదేవిని||
సరిసాటి లేని సౌభాగ్యవతిని ||శ్రీదేవిని||
అనుపమ కౌస్తుభమణియందు నెలకొని ||అనుపమ ||
నీ హృదయ పీఠాన నివసించుదాన ||నీ హృదయ|| ||శ్రీదేవిని||
పాలకడలిలో ప్రభవించి
మురిపాల కడలిలో తేలితిని ||పాల||
పదునాల్గు భువనాలు పరిపాలించు
నీ మది నేలి లాలించు భాగ్యము నాదే ||శ్రీదేవిని||
కలిమికి నేనే దేవతనైనా
నీ చెలిమియే నా కలిమి కదా ||కలిమి||
ఎనలేని అనురాగ సంతోషములతో..
ఏనాటికీ మనకు ఎడబాటు లేదు ||ఏనాటికీ|| ||శ్రీదేవిని ||

ఈ పాటను ఎస్.వరలక్ష్మి గానం చేయగా, ఎన్టీ.ఆర్, ఎస్ వరలక్ష్మి అభినయించారు. కథానుగుణంగా పాట మధ్యలో గుమ్మడి కూడా కనిపిస్తారు. బేహాగ్ రాగంలో వచ్చిన మరో మంచి పాట ఇది. 'ఎనలేని అనురాగ సంతోషములతో' దగ్గర వచ్చే రాగాలాపనలో అమీర్ కళ్యాణి రాగచ్ఛాయలు కూడా ప్రయోగించబడ్డాయి. ఈ ఆలాపనను ఎస్.వరలక్ష్మి ఆవిష్కరించిన తీరు చూస్తే ఆమెను 'సుస్వరలక్ష్మి' అని పిలవాలనిపిస్తుంది. పైగా అభినయించింది కూడా లక్ష్మీదేవి పాత్రనే కనుక కథకు అవసరమైన రీతిలో ఆ పాత్ర స్వభావాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకుని, ఆవహింపజేసుకుని సంపూర్ణ న్యాయంతో, పరిపూర్ణ జ్ఞానంతో పాడిన పాట ఇది. గాయనీమణులుగా పేరు తెచ్చుకోవాలనుకునే వారికి ఈ పాట ఓ పరీక్షలాంటిది. ఇక సంపూర్ణ రచయితగా ఈ పాటకు ఆరుద్ర అద్దిన సొగసులు ఈనాటికీ పసివాడనివి. 'పాలకడలిలో ప్రభవించి, మురిపాల కడలిలో తేలితిని ' అంటూ ఉపయోగించిన అభంగ శ్లేష 'పదునాలుగు భువనాలు పాలించు నీ మదినేలి లాలించు భాగ్యము నాదే', 'కలిమికి నేనే దేవతననా నీ చెలిమియే నా కలిమి కదా' వంటి శబ్దగత చమత్కారాల ద్వారా అభివ్యక్తీకరించిన కవితా సౌందర్యం - ఇవన్నీ ఆరుద్రకు భాష మీదకు గల అధికారాన్ని, పట్టును చాటి చెబుతాయి.

---

లక్ష్మి: వరాల బేరమయా వనరౌ బేరమయా
పరాకు సాయకు పదే పదే దొరుకదయా ||వరాల||
దేవతలు దీవించి పంపిన పసరమయా ||దేవ||
కొన్నవారికన్ని సిరులు కూర్చు గంగిగోవయా ||వరాల||
మనిషికున్న తెలివున్నది మనిషిలోని చెడులేనిది
కొందామని అందరూ కొమ్ముపడితే కుమ్ముతుంది
కోరుకున్నవారి వెంట గోవులాగె వస్తుంది ||వరాల||
పచ్చనీ లచ్చిమికి పసుపు కుంకుమ పెట్టి దినము
ప్రొద్దున్నే మొక్కుకుంటే పోతుంది పాపము
పచ్చనీ లచ్చిమికి పసుపు కుంకుమపెట్టి దినము
ప్రొద్దున్నే మొక్కుకుంటే పోతుంది పాపము
పాత్ర చూచి పాలను మనసు తూచి మంచిని
ఇచ్చేది ఈ ఆవు ఇదే కామధేనువు ||వరాల||

ఈ పాటకు గానం, అభినయం రెండూ ఎస్.వరలక్ష్మే. మధ్యమావతి రాగం ఈ పాటకు ఆధారం. ఈ పాటలో కూడా యస్. వరలక్ష్మి గానం చేసిన విధానం కమనీయం. గమనీయం. ఇప్పుడు వాడుకలో లేని కొన్ని కొన్ని పదాల గురించి తెలుసుకోవాలంటే ఇలాంటి పాటలు వినటం చాలా అవసరం. లేకపోతే వనరు, పసరము వంటి పదాలకు అర్థం చెప్పాలంటే నిఘంటువులు వెతుక్కోవలసిన పరిస్థితి వస్తుంది. 'కోరుకున్నవారి వెంట గోవులాగే వస్తుంది' అనే పదప్రయోగం ఒక రకంగా చమత్కారం ఎందుకంటే అక్కడ గోపురూపంలో ఉన్నది శివుడు కనుక. అలాగే చిత్రీకరణ పరంగా ఇంకో మాట చెప్పుకోవాలిక్కడ. ఈ పాటలో యస్. వరలక్ష్మి ఆవును గురించి

పాడుతూ ఉన్నా దూడను లాలించే దృశ్యాలు ఎక్కువగా ఉంటాయి. దర్శకత్వ ప్రతిభకు సంబంధించిన కోణంలో ఆలోచిస్తే దూడ రూపం ధరించినది బ్రహ్మ. మారువేషంలో 'అమ్మ'గా వచ్చినామె లక్ష్మీదేవి. మరి లక్ష్మీదేవికి బ్రహ్మ పుత్రుడేగా!

---

గోపాల.. నంద గోపాలా
ఎన్నాళ్ళని నా కన్నులు కాయగ
ఎదురు చూతురా గోపాలా
ఎంత పిలిచినా ఎంత వేడినా
ఈనాటికి దయ రాదేలా ||ఎంత||
గోపాలా నంద గోపాలా
వీనుల విందుగ వేణుగానము
విని తరింపగా వేచితిరా ||వీనుల||
వేచి చేచి ఈ వెన్నముద్దవలె
కరిగిపోయెరా నా బ్రతుకు
కరిగిపోయెరా నా బ్రతుకు ||ఎన్నాళ్ళని||
వెన్న మీగడలు జున్ను పాలకు
ఏమి కొరతరా మన ఇంటా ||వెన్న||
పాలను ముచ్చిలి పరుల చేతిలో
దెబ్బలు తినకురా కన్నయ్యా ||పాలను||
ఈ తల్లి హృదయము ఓర్వలేరయా ||ఎన్నాళ్ళని||

ఈ పాటను శాంతకుమారి గానం చేసి, ఆమెయే ముఖ్య పాత్రధారిణిగా అభినయించగా చిత్రీకరించారు. పీలూ రాగానికి అతి చక్కని ఉదాహరణ ఈ పాట. ఈ రాగంలో ఇదే అనుభూతితో పెండ్యాల 'శ్రీ కృష్ణార్జున యుద్ధం' చిత్రంలో స్వరపరచిన 'నీకై వేచితినయ్యా ఓ ఏకాంత రామయ్యా' పాటను కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకోగలిగితే పీలూ రాగంపై కొంత అవగాహన కలుగుతుంది. ఈ పాట సాహిత్యాన్ని పరికిస్తే - ద్వాపర యుగంలోని యశోదయే కలియుగంలో వకుళగా జన్మించిందన్న పురాణ గాథల ఔచిత్యాన్ని ఒంట పట్టించుకుని - వకుళ గొంతుకు యశోద మనసును జత చేస్తూ ఆత్రేయ రాశారా అనిపిస్తుంది. ముఖ్యంగా - ''వేచి వేచి ఈ వెన్నముద్దవలె కరిగిపోయెరా నా బతుకు, పాలను ముచ్చిలి పరుల చేతిలో దెబ్బలు తినకురా కన్నయ్యా ఈ తల్లి హృదయం ఓర్వలేదయా.. లాంటి వాక్యాలను గమనిస్తే మాతృ హృదయం అనే ఆలయంలో అక్షర దీపాలను పెట్టి - కవిగా తన రుణం ఆయన తీర్చుకున్నాడేమోనన్నంత ఉన్నతంగా ఉందీ భావప్రకటన. శాంతకుమారి గళం కూడా అదే తదాత్మ్యాన్ని పంచుతుంది. ఇక ఈ పాటలా ఉపయోగించిన ముచ్చిలి(దొంగలించుట) అనే పదం తెలుగు సినిమా పాటల్లో ఆ తర్వాత వచ్చినట్టుగా లేదు.

ఈ చిత్రంలో ఎస్. వరలక్ష్మి, శాంతకుమారి పాడిన పాటలను విన్న తర్వాత ఆ స్వర్ణ యుగాన్ని తిరిగి పొందే అదృష్టం మన తెలుగు సినిమా సంగీతానికి ఉందా అని ఎవరికైనా అనిపిస్తే - కాలప్రవాహానికి ఎదురీది నిలబడగలిగే మానవత్వపు విలువలు వారిలో ఇంకా ఉన్నట్టు లెక్క.

---

ఆమె: ఎవరో అతడెవరో ఆ నవ మోహనుడెవరో
నా మానస చోరుడెవరో ||ఎవరో||
తొలిచూపులలో వలపులు చిలికి
దోచిన మగసిరి దొర ఎవరో తొలి
అరయక హృదయమునర్పించితినె
ఆదరించునో ఆదమరచునో
వలరాజా..? కలువల రాజా..?
కాదే.. కన్నుల కగుపడినాడే?
అకలంకుడె. హరిణాకుండు కాడే ||అక||
మరి ఎవరో ఏమరినానో
చలువలు కురిసి జాబిలి చెలి
కలతను తెలిసీ కలుగద జాలి
కరుణ చూపి కబురు తెలిపి
రమ్మనవా నను చే కొమ్మనవా
అతడు: ఎవరో తానెవరో ఆ నవమోహిని ||ఎవరో||
నా మానసహారిణి ఎవరో ||ఎవరో||
నందన వనమానందములో
తొలిసారిగ పూచిన పూవో
తొలకరి యవ్వన మొలికిన నవ్వో ||తొల||
మనసిచ్చినదో నను మెచ్చినదో
ఆ జవ్వని ఎవరో తానెవరో ఆ నవమోహిని ఎవరో
నా మానస హారిణి ఎవరో
ఎవరో తానెవరో...

ఈ పాట నిజంగా ఓ రసాత్మక గీతం. పెండ్యాల గుండెల్లో ఊపిరి పోసుకున్న స్వరానికి సుశీల, ఘంటసాల జీవ చైతన్యాల్ని కలబెట్టిన గీతమిది. లీనమై ఆలపించుకుంటూ పోతే కంటిపొరలలో ఓ చెమరింపును, తదనుగుణమైన ఆత్మానందాన్ని కల్గించగలిగే స్వరరచన ఇది. బృందావన సారంగ రాగంలో స్వరపరచబైన ఈ గీతం గ్రహభేదం వల్ల తిల్లంగ్ రాగం అని అనిపించే అవకాశం కూడా ఉంది. ఎన్టీ.ఆర్, సావిత్రి అభినయించిన ఈ పాటను రచించిన ఆత్రేయ గురించి చాలా చెప్పాలి సందర్భంగా.

తను ప్రేమించినవాడు మన్మధుడా (వలరాజా) మరి కళ్ళకు కనబడుతున్నాడే? పోనీ చంద్రుడా (కలువల రాజా) జింక చిహ్నం మచ్చగా గల చంద్రుని (హరిణాంకుడు) లాంటివాడు కాదే మచ్చలేనివాడు (అకలంకుడు) కదా నా ప్రియుడు - అనే అర్థం వచ్చేట్లు

ఉన్న రెండో చరణం - ఆత్రేయ ఎంత గొప్ప భావకుడో తెలుపుతుంది. అయితే, నాణేనికి రెండో వైపు అన్నట్టు - పాత్రల ఔచిత్యం ప్రకారం ఆలోచిస్తే - శ్రీనివాసుడిగా అవతరించిన శ్రీ మహావిష్ణువుని అతనికన్నా స్థాయిలో చిన్నవారైన చంద్రునితోనూ, మన్మధునితోనూ పోల్చడం. ఆయన గుండెలపై ఉన్న శ్రీ వత్స చిహ్నం గురించి మరిచిపోయి అకలంకుడు అని వర్ణించడం - ఇవన్నీ విమర్శలకు తావిచ్చే అంశాలు. అయితే, ఇందులో కూడా ఆత్రేయ పక్షాన వాదించాలంటే ఆ శ్రీనివాసుడు శ్రీ మహావిష్ణువని తెలీకే కదా. అని సమర్ధించుకోవచ్చు. ఏది ఏమైనా, అంతటి ఆలోచన, అంతటి అంతర్మధనం, అంతటి అంతర్ముఖత్వం రాసినవారికి, విన్నవారికి కూడా కల్గిస్తున్నాయి కనుకనే ఆనాటి పాటలు ఈనాటికీ సాహితీ మర్యాదలను అందుకుంటున్నాయి.

'కరుణ చూపి కబురు తెలిపి' అనే వాక్యంలో 'కబురు' అనే ఉర్దూ పదం వాడినందుకు ఈ పాట రికార్డింగ్ అయిపోయాక గుర్తొచ్చి, విపరీతంగా కలవరపడ్డారట ఆత్రేయ. గురుతుల్యుడు మల్లాది రామకృష్ణశాస్త్రి దగ్గర తన బాధను వెళ్ళబోసుకుంటే 'ఏం ఫర్వాలేదులే ఆ కాలంలో బీబీ నాంచారి కూడా ఉందిగా' అంటూ ఆయన ఊరడించాకగానీ నిద్రపట్టలేదట ఆత్రేయకి. అనుకున్న పని పూర్తయిపోయి, అవసరం తీరిపోయిన తర్వాత నాదేం పోయిందిలే అని చేయి దులిపేసుకోకుండా - బాధ్యతను నెత్తిన వేసుకుని ఆత్మ క్షోభను స్వీకరించగలిగే అటువంటి నిజాయితీయే చేసే ప్రతిపనికీ సార్ధకతను ప్రసాదించేది.



# ఆ పాత పాట మధురం

## రాజా



## శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం - 2

శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం చిత్రంలోని మరో ఆరు పాటల గురించి .

.

యశోద: చిరు చిరు నగవుల చిలికే తండ్రీ మురిసితినయ్యా పున్నెముపండీ ||చిరు||
నవ్వులే ఇంత తీయనైనవే పలుకులెంతగా మధురములౌనో
విని సంబరపడ మది తొందరపడె మక్కువతీరా మాటలాడరా ||చిరు||
యదుబాలా! గోపాలా! అందెలు ఘల్లన ఇటురారా ||యదు||
చక్కని నాన్నా టక్కులు మానీ అక్కున చేరి అమ్మా అనరా
అల్లిబిల్లి జాబిల్లి ఆటలా నిను చూచి పొంగి తరింతునురా ||యదు||
కొంటెవాడ నీ తుంటరిపనులకు గోకులమంతా గోలపెట్టెరా
కృష్ణ: అల్లరి చేయని పిల్లలింటికి అలంకారము కారు కదమ్మా?
యశోద: అలాగా! పెండ్లి చేసి నీ కాళ్ళకు బంధము వేయాలయ్యా వెన్నదొంగా!
కృష్ణ: అత్తరికము చెయ్యాలని నీకు ఆశగవుందని అనవమ్మా
యశోద: అవునయ్యా.. అదే నా కోరిక.. ఎప్పుడు తీరుస్తావు నాయనా

ఆత్రేయ రాసిన ఈ పాటలో శాంతకుమారి ముఖ్య గాయని కాగా బాల, స్వర్ణలత అక్కడక్కడ గాత్ర సహకారాన్ని అందించారు. 'పూర్వజన్మలో నీవు యశోదవు' అంటూ వకుళకు నారదుడు తెలుపగా ఆ పూర్వ జన్మ జ్ఞాపకాలకు సంబంధించిన సన్నివేశంలో ఈ పాట వస్తుంది. స్వరకల్పనా పరంగా అధ్యయనం చేయవలసిన కొన్ని అంశాలున్నాయి ఈ గీతంలో. అందులో మొదటిది మహారాష్ట్ర సంగీత ప్రభావం. శాంతకుమారి. పి.సూరిబాబు, ఈలపాట రఘురామయ్య మొదలైన వారు నాటక రంగం నుంచి వచ్చిన 'గానతారలు', మన నాటక రంగంపై మహారాష్ట్రకు సంబంధించిన మరాఠీ సంగీతపు పోకడలు, వాటి ప్రభావం ఆ రోజుల్లో ఎక్కువగా ఉండేది. సంగీత దర్శకుడు పెండ్యాల కూడా నాటక రంగం నుంచి వచ్చిన వ్యక్తే కావటం వల్ల ఆ ధోరణులు పూర్తిగా తెలుసాయనకి. ఆ సంప్రదాయాన్ని

దృష్టిలో పెట్టుకుని ఈ పాటని ఆయన ట్యూన్ చేశారా అని అనిపిస్తుంది. అందుకే పాట మొదట్లోనూ తొలి చరణంలోనూ తొంగి చూచే 'యమన్' రాగం సినీ సంగీత దర్శకులు అలవాటు చేసిన యమన్‌లా ఉండదు. మరాఠీ సంప్రదాయపు 'నాట్యగీత్'లా ఉంటుంది. మధ్యలో పీలూ రాగచ్ఛాయలు కూడా కనిపిస్తూ ఉంటాయి.

---

చిన్నారి ఓ చిలుక విన్నావా ||2||
ఇన్నాళ్ళ కోరిక ఈడేరే వేడుక చిన్నారి
ఏమని నా స్వామికి మనవి చేసినావో ||2||
నా మనసు తెలిపినావో
ఫలియించే నీ మాట పల్లవించె నా పాట ||చిన్నారి||
పెళ్ళి పీటలపై నున్న వేళ ఒళ్ళు మరిచి పిలిచేవు
నేననుకుని తాను ఉలికిపడేను
నలుగురూ నను జూచి నవ్వుకునేరు ||చిన్నారి||
అత్తవారి ఇల్లు మనకు కొత్తచోటు అయినా
తొలివలపు ముచ్చటలో పొలయలుకలు వచ్చెనా
బెట్టు చేసి వారినే కవ్వించవే
ప్రేమతో నను చేరి నవ్వించవే ||చిన్నారి||

ఆత్రేయ రాసిన ఈ పాటను పి.సుశీల పాడగా సావిత్రి అభినయించింది. ఈ పాటకు తిలంగ్ ఆధార రాగం. ఇవాళ లభ్యం కాని పాటల్లో ఇదొకటి. ఎందుకంటే నిడివి కారణంగా చిత్రం నుండి తొలగించారు. తరువాత విడుదలయిన ఎల్పీ రికార్డులలో కానీ, కాంబినేషన్ క్యాసెట్స్‌లో గాని ఈ పాటని చేర్చలేదు. ఆ రోజుల్లో విడుదలయ్యే 78 ఆర్.పి.యమ్ రికార్డులను సేకరించి భద్రపరచుకునే వారి వద్ద మాత్రమే ఈ పాట దొరికే అవకాశముంది. పెండ్యాల - సుశీల కాంబినేషన్‌లో వచ్చిన పాటల్లో చెప్పుకోదగ్గ పాట ఇది. ఈ పాటను ఈ తరం వారికి అందించవలసిన ఆవశ్యకత ఆడియో రంగానికి ఉన్నది. సాహిత్య పరంగా ఆత్రేయ వాడిన 'పొలయలుకలు' అనే పదం గమనించదగ్గది.

---

కళ్యాణ వైభవమీనాడే చెలి కళ్యాణ వైభవ మీనాడే
మన పద్మావతీ శ్రీనివాసుల ||కళ్యాణ||
చూతము రారే సుదతులందరు ||2||
చేతము రారే సింగారాలు ||కళ్యాణ||
పసుపు కుంకుమా అలదండీ
పచ్చని తోరణాలు కట్టండీ ||పసుపు||
రంగు రంగులూ రత్నాలు కలిపి
ముత్యాల ముగ్గులు వేయరండి ||కళ్యాణ||
అతివ కోరిన వరుడు అతిలోక సుందరుడోయమ్మా
అతగాని కన్నింట జతయౌను మా కొమ్మా - అం హూం
అల్లారు ముద్దుగ ఓరిగింది మా పిల్ల ఓయమ్మా
పువ్వుల్లో పుట్టాడు మా పిల్లవాడమ్మా అం హూం
చిలకలికొలికి పద్మావతికి కులుకే సింగారం - చెలి
గుణమే బంగారం
నవలామణికి నగవులగనికి మనసే లావణ్యం
లే వయసే వయ్యారం
చక్కని చెక్కిలి చుక్కెందులకే - ఎందుకే
చందమామలో నలుపున్నందుకే - ఆహా
చినదానికి ఆ సిగ్గెందులకే - అవును ఎందుకే?
మనసులోన మరులున్నందులకే
చల్లనైన తల్లిని శంకరుని రాణివి ||చల్ల||
దీవెనలే ఇవ్వనమ్మ దేవేరీ జయగౌరీ ||చల్ల||
పసిడికలల బాల తన పరిణయ శుభవేళ ||పసిడి||
ప్రణమిల్లెను బ్రతుకెల్లను పచ్చనైన పంటగా
దీవెనలే ఇవ్వనమ్మా దేవేరీ జయగౌరీ

ఆత్రేయ రాసిన ఈ పాటలో లీల, జిక్కి ప్రధాన గాయనీమణులు. ప్రధాన, ముఖ్య, సహ, ఉపపాత్రధారులెంతో మంది మీద చిత్రీకరించిన పాట యిదని సాహిత్యం చూడగానే అర్థమయిపోతుంది. పాట పల్లవి నుంచి తొలి చరణం (చూతము రారే సుదతులందరూ) చివరివరకూ సామరాగాన్ని, రెండవ చరణం (అతివ కోరిన వరుడు అతిలోక సుందరుడోయమ్మా)కి మోహన రాగాన్ని ఉపయోగించారు. మూడవ చరణం (చిలుకల కొలికి పద్మావతికి కులుకే సింగారం)కి అంతర్గాంధారాన్ని కలుపుకుంటూ ఖరహరప్రియ స్కేల్‌లోని స్వరాలని, అక్కడక్కడ పీలూరాగం అనిపించేలా కూడా స్వరపరిచారు. ఇక ఆఖరి చరణం (చల్లనైన తల్లివి శంకరుని రాణివి)కి పక్కా సంప్రదాయ రీతిలో శంకరాభరణం రాగాన్ని ఉపయోగించారు. ఈ చరణాన్ని, సీతారామ కళ్యాణంలోని కానరార కైలాస నివాసా పాటని, భూకైలాస్‌లోని దేవ మహదేవ మమ్ముబ్రోవుము శివ పాటని, సాకల్యంగా సాధన చేస్తే శంకరాభరణరాగంపై అవగాహన చాలావరకు వచ్చేస్తుంది.

ఆమె: కలగా కమ్మని కలగా
మన జీవితాలు మనవలెగా ||కలగా||
అనురాగమే జీవన జీవముగా
ఆనందమె మన కందముగా ||కలగా||
ఆమె: రాగవశమున మేఘమాలిక
మలయపవనుని కలిసి తేలగా
అతడు: కొండను తగిలి గుండియ కరిగి
నీరై ఏరై పారునుగా
కలగా కమ్మని కలగా
మన జీవితాలే ఒక కలగా
అతడు: వెలుగు చీకటలు కలబోసిన
ఈ కాలము చేతిలో కీలు బొమ్మలము
ఆమె: భావనలోనే జీవనమున్నది
మమతే జగతిని నడుపునది
మమతే జగతిని నడుపునది
కలగా కమ్మని కలగా
ఆమె: తేటికోసమై తేనియ దోచే
విరి కన్నియకా సంబరమేమో
అతడు: వేరొక విరిని చేరిన ప్రియుని
కాంచినప్పుడా కలత ఏమిటో
ప్రేమకు శోకమే ఫలమేమో
రాగము త్యాగము జతలేమో ||కలగా||

ఈ పాటను ఘంటసాల, సుశీల ఆలపించారు. ఎన్టీఆర్, సావిత్రి అభినయించారు. లక్ష్మీదేవి, పద్మావతిదేవి మధ్య జరగబోయే సంవాద ఫలితంగా తాను శిలను కానున్నానన్న అర్థంతో శ్రీనివాసుడు - అవేమీ ఎరుగని తన లౌకిక ధోరణిలో పద్మావతి - పాడుతున్నట్టుగా పాత్రోచిత ఉన్మీలనంతో రాసిన ఆత్రేయ ముద్ర - రెండవ మూడవ చరణాలలో బలంగా కనిపిస్తుంది. అయితే పాట సాహిత్యాన్ని కాస్త లోతుగా పరిశీలిస్తేగాని ఈ 'కథార్థ సూచన ప్రక్రియ' అవగతమవదు. ట్యూన్ పరంగా చూసుకుంటే ఈ పాట బొత్తిగా, పూర్తిగా పెండ్యాల మార్కు గీతం అని ఒకటో ఎక్కం అప్పచెప్పినంత సులువుగా చెప్పెయ్యొచ్చు. మొదటి చరణం 'రాగవశమున మేఘమాలిక' అనే వాక్యం వినగానే 'రాగమయీ రావే' (జయభేరి) పాటలో 'చివురులు మేసిన చిన్నారి కోయిల' అనే లైను దగ్గరి ట్యూన్ గుర్తుకొచ్చేస్తుంది. అలాగే చివర్న ఉన్న 'ప్రేమకు శోకమె ఫలమేమో' అనే వాక్యాల వరస 'చిగురాకులలో చిలకమ్మ' (దొంగరాముడు) పాటలోని 'కలవా విలువలు సెలవీయ' అనే లైనుని యధాతథంగా జ్ఞప్తికి తీసుకొస్తుంది. తర్వాతి రోజుల్లో వచ్చిన 'శ్రీకృష్ణార్జున యుద్ధం' చిత్రంలోని 'స్వాముల సేవకు వేళాయే' పాట చరణాల ఇంటర్‌లూడ్‌తో పోల్చుకుంటే రెండూ ఒక్కలాగే

ఉన్నట్టనిపిస్తుంది. ఈ చిత్రాలన్నిటికి సంగీత దర్శకుడు పెండ్యాల కావడం, ఉదహరించిన ఈ పాటలన్నీ భీంప్లాస్ రాగంలోనే ఉండడం ఇవన్నీ ఆ రాగాన్ని పెండ్యాల మలచుకునే పద్ధతిని స్పష్టంగా తెలియజేస్తాయి.

---

కళ్ళు తెరువరా నరుడా నీ ఖర్మ తెలియరా..
కళ్ళు తెరువరా నరుడా
కలిమిలేములకు కష్ట సుఖాలకు ||2||
కారణమొకటే రా.. కారణమొకటేరా..
నీ ఖర్మే మూలమురా కళ్ళు తెరవరా నరుడా
కమలనాధుని పదకమలములే కలుష జలధికి చేతుమురా ||2||
కలిమాయలలో కలత చెందిన ఆ...
ధరణికి అదియే తారకమగురా ||2||
కళ్ళు తెరువరా నరుడా నీ ఖర్మ తెలియరా.. కళ్ళు తెరువరా..

ఈ పాటను పి.సూరిబాబు గానం చేసి అభినయించారు. అద్భుతమైన స్వరధాటి కలిగిన పి.సూరిబాబు గురించి ఈ తరం వారికి బొత్తిగా తెలియదు. విచిత్రం ఏమిటంటే సినీ సంగీత రంగంలోనున్న వారిలో కూడా చాలా మందికి తెలియదు. వారికన్నా శ్రోతలలోనే ఎక్కువమంది తెలిసిన వాళ్ళున్నారనిపిస్తుంది. ఈ పాటకు రచన ఆత్రేయ. భక్తిగీతాలు ఆత్రేయ రాయడని చాలామంది అనుకుంటారు గానీ ఆయన రాసినవెన్నో ఉన్నాయి. సింధుభైరవి రాగంలో సాగిన ఈ పాటని కూడా నిడివి కారణంగా చిత్రం నుండి తొలగించారు. శ్రీ వేంకటేశ్వర వైభవం సినిమాతో పాటు వేసిన శ్రీ వేంకటేశ్వర మహత్యం కాంబినేషన్ క్యాసెట్‌లో కూడా లేదు. హెచ్.ఎం.విలో పనిచేసిన శివప్రసాద్ మాత్రం 78 ఆర్.పి.యమ్ రికార్డుల్లో దొరికిన ఈ పాటని టేపుల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసి 'సింగింగ్ స్టార్స్' అనే కాన్సెప్ట్‌తో ఓ ఆడియో క్యాసెట్‌గా విడుదల చేస్తే అదృష్టవశాత్తు మళ్ళీ బైటికొచ్చింది.

---

శేషశైలా వాస శ్రీ వెంకటేశా
శయనించు మా అయ్య శ్రీ చిద్విలాసా ||శేష||
శ్రీదేవి వంకకు చిలిపిగా చూడకు
అలమేలు మంగకు అలుకరానీయకు ||శ్రీదేవి||
ముద్దు సతులిద్దరిని ఇరువైపులా చేర్చి |ముద్దు||
మురిపించి లాలించి ముచ్చటల దేల్చి ||శేష||
పట్టు పానుపుపైన పవ్వళించర స్వామి ||పట్టు||
భక్తులందరు నిన్ను ప్రస్తుతించి పాడ
చిరునగవులొలుకుచూ నిదురించు నీమోము ||చిరు||
కరువుతీరా కాంచి తరియింతుము మేము ||శేష||

తెలుగు సినిమా పాటలలో ఈ యుగాంతం వరకు నిలిచిపోయే పాట ఏది అనే సందేహం ఎవరికైనా వస్తే అందుకు సమాధానంలా నిలిచిపోయే గీతంగా - 'శేషశైలవాస శ్రీ వెంకటేశా' పాటను ఉదహరించవచ్చు. తెలుగువారు తను సుస్థిరాస్తిగా చెప్పుకునే ప్రతిష్ఠాత్మక గాయకుడు ఘంటసాల - తన అణువణువూ భక్తితత్వాన్ని నింపుకున్న స్వరార్చకుడు కాబట్టే - శాశ్వతత్వం కలిగిన ఈ గీతాన్ని పాడి, తెరపై అభినయించే అదృష్టం ఆ గానమయ్యకు దక్కిందని చెప్పాలి. పూర్వజన్మ సుకృతమో లేక ప్రస్తుత జన్మలో అబ్బిన సంస్కారమో ఉంటేనే గాని ఇటువంటి మహద్భాగ్యాలు లభించవు. ఒక కృతికి చెందవలసిన గౌరవాన్ని స్వంతం చేసుకున్న ఈ గీతాన్ని రచించిన ఆత్రేయ కూడా ఆ కృపకు సమపాత్రుడు. ఈ పాటను 'రీతిగౌళ' రాగంలో స్వరపరిచారు పెండ్యాల. ఈ రాగంలో వచ్చిన పూర్తి సినిమా పాట తరువాత రోజుల్లో ఇంచుమించుగా ఇంకేదీ లేదనే 'రహస్యం' చిత్రంలో ఘంటసాల స్వరపరిచిన 'గిరిజా కళ్యాణం' యక్షగానంలో 'ఈశుని దాసుని చేతువా' అంటూ సుశీల పాడిన చరణం మాత్రం మరో ఉదాహరణగా నిలుస్తుంది.

'వేంకటేశ్వర మహాత్మ్యం' చిత్రం సినిమా ప్రదర్శన జరిగినంతకాలం ఆంధ్రదేశంలోని అన్ని థియేటర్ల ఆవరణలోనూ వెంకటేశుని విగ్రహాలు ఉంచి నిత్యపూజలు జరిపేవారు. టిక్కెట్లతోపాటు వెంకటేశ్వరస్వామి, పద్మావతి క్యాలండర్లను ఇచ్చేవారు. పూజలు జరిగేచోట హుండీలలో భక్తులు వేసే ధనం ఒక్కోసారి థియేటర్‌లోని కలెక్షన్లను కూడా మించిపోయేది. సంగీత సాహిత్య నటనా చిత్రీకరణపరంగా మొత్తం చిత్రాన్ని భక్తి పారవశ్యంతో ప్రతివారూ చూసి మెచ్చుకున్న చిత్రంగా చరిత్రలో నిలిచిపోయిందీ 'వేంకటేశ్వర మహాత్మ్యం'.



# ఆ పాత పాట మధురం



## రాజా

### కులదైవం

**తెలుగు చలనచిత్ర పరిశ్రమ** ఆంధ్రదేశంలో స్థిరపడాలన్న సదుద్దేశంతో తొలి అంకురాలు మొలకెత్తించిన వారిలో సారథీ సంస్థను ప్రముఖంగా చెప్పుకోవాలి. హైదరాబాద్‌లో స్టూడియోను నిర్మించుకుని శ్రీ సారథీ స్టూడియోస్ పతాకంపై ఎన్నోమంచి చిత్రాలను నిర్మించిందీ సంస్థ. అగ్ర కథానాయకులు లేకుండా వీరు నిర్మించిన కులదైవం.

చిత్రం 1960లో విడుదలైంది. గుమ్మడి, అంజలి, జగ్గయ్య చలం, గిరిజ, కృష్ణకుమారి ప్రధాన తారాగణం. బాలరాజ్ సహానీ, పండరీబాయి, జగదీష్, నందా, శ్యామ మొదలగు వారితో ఏ.వి.యమ్ సంస్థ నిర్మించిన 'బాభీ' చిత్రానికి కృష్ణన్ పంజు దర్శకులు, చిత్రగుప్త సంగీత దర్శకుడు కాగా కులదైవం చిత్రానికి కబీర్‌దాస్ దర్శకుడు, మాస్టర్ వేణు సంగీత దర్శకుడు.

తనలోని కళను కమర్షియల్ రంగంలో నిలబెట్టిన తర్వాత ఏ కళాకారుడికైనా సరే - ఇన్స్పిరేషన్, ఇమిటేషన్, కాపీ, పేరడి, అనే ఈ నాలుగు ప్రక్రియలలో ఏదో ఒకదాన్ని ఎప్పుడో ఒకప్పుడు స్పృశించవలసిన అవసరం వచ్చి తీరుతుంది. అందుకు కారణాలు సామన్య జనానికి అనవసరం కావచ్చు అయినా ఆ కారణాలు అకారణాలు అయి ఉండవు. అర్థం చేసుకోవటానికి కాస్త ప్రయత్నిస్తే, అది ఆ కళాకారుడి పట్ల నిజమైన అభిమానాన్ని మనం ప్రదర్శించినట్టే. శ్రీ సారథీ స్టూడియోస్ పతాకంపై 1960లో విడుదల అయిన 'కులదైవం' చిత్రానికి సంగీతాన్నిచ్చేటప్పుడు మాస్టర్ వేణుకు అదే పరిస్థితి ఎదురైంది. ఆ చిత్రానికి మూలమైన 'బాభీ' 'హిందీ చిత్రాన్ని హక్కులతో సహా నిర్మాత తీసుకోవడం వల్ల అందులోని రెండు ప్రతిష్ఠాత్మక పాటలను మాత్రం 'మక్కీకి మక్కీ'లా తెలుగు వారికి అందించవలసిన బాధ్యత ఆయనపై పడింది. అది తెనిగించడమే తప్ప తెగించటం ఎంత మాత్రమూ కాదు. ఔచిత్య భంగం కలగకుండా నిజాయితీతో తెనిగించటం కూడా దోషం అనుకుంటే మనకు రామాయణ భారత భాగవతాలు ఉండేవా? ఘంటసాలకు సముద్రాలకు, తెలుగు వారికి 'పయనించే ఓ చిలుకా' వంటి అత్యద్భుత గీతం మిగులుండేదా? 'కులదైవం' చిత్రంకి సంబంధించి ఈనాటికీ ప్రజల స్మృతిపథంలో మిగిలున్న పాటలలో కొన్ని.

ఆడి పాడేను నా మది ఈ వేళ - అరుదెంచే ఉగాది శుభవేళ ||ఆడి||
కనువిందై ఈ జగమంతా - కలిగించు చక్కలిగింత ||కను||
మూగే ఎలతుమ్మెద రొదలో మురిసే విరి బాలా ||మూగే||
ఉప్పొంగి ఉవ్విళ్ళూరే - ఈ వేళా.. మనసూగే
మనసూగేను పూవుల ఉయ్యాలా ||ఆడి||

కేరింతల చిలుకలపాట - ఊరించే నన్నీపూటా
చిరుగాలి సందడి తేలే - చిన్నారి భావాలే ||చిరు||
వాసంతపు ఆనందాలే ఏచోటా...వయసూరే
వయసూరే ఒయ్యారపు అందాలే ||ఆడి||

జూనియర్ సముద్రాల రాసిన ఈ పాటను సుశీల పాడగా కృష్ణకుమారి అభినయించింది. మాస్టర్ వేణుపై నౌషాద్ ప్రభావం అణువణువునా ఎంతగా జీర్ణించుకుపోయి ఉందో సంగీత ప్రియులందరికీ తెలుసు. మాతృక అయిన బాభీలోని 'కారే కారే బాద్‌రా' పాట ట్యూన్‌ని నడకని ఈ పాటలో ఉపయోగించుకోవడం జరిగింది. చిత్రగుప్త చేసిన ట్యూన్‌ని నౌషాద్ ప్రభావం గల మాస్టర్ వేణు అనుసరించవలసి వస్తే ఎలా ఉంటుందోనన్న అనుభవం కోసం ఈ పాటని ఖచ్చితంగా అధ్యయనం చేసి తీరాలి. కొన్నిటిని అధ్యయనం చేస్తూ ఉంటే ఎంత ఆనందంగా ఉంటుందో చెప్పలేం. దేవుని సృష్టి రహస్యాలను ప్రకృతి మర్మాలను తెలుసుకుంటున్నప్పుడు శాస్త్రజ్ఞుల మనసు ఎంత ఉప్పొంగి పోయి ఉంటుందో మనం తెలుసుకోలేం పరిశోధనలలోనున్నప్పుడు వారెందుకలా మునిగిపోయి ఉంటారో కొంతమందికి ఓ పట్టాన అర్థంకాదు. ఇటువంటి వాటికి మనకు సమాధానం పరోక్షంగా దొరకాలంటే 'ఈ ఆడిపాడేను నా మది ఈవేళా' పాటను కారే కరే బాద్‌లా పాటను నౌషాద్ స్వరపరిచిన రతన్ అన్‌మోల్ ఘడీ చిత్రాలలోని పాటలను సంపాదించి ఒకదాని తర్వాత ఇంకొకటి మార్చి మార్చి విని చూడండి. అప్పుడు మీ మనసుకి అవధిలేని ప్రతి అనుభూతికి ఆత్మానందమె పరమార్థం అంటూ నారాయణరెడ్డి రాసిన మాటలు అనుభవానికొస్తాయి.

---

గారడిచేసే నీ కనులూ - ఆరడి చేయును నా మనసూ
తీయని ఆశల అలజడిలో - ఊగే ఆగని లేవయసూ ||గారడి||
నీ నవ్వుల వెన్నెల సోలి నటియించు మేను తూలి
నా వాలుకన్నుదోయీ - తాళాలు వేయునోయ్
మనమందు చిందులేసే నా ఆశలూ
వినిపించు హాయి మీరే ప్రేమ సంగీతాలే ||గారడి||
నా వెనుక చేరి నిలిచీ నవ్వేవు నన్ను జూచీ ||నా వెనుక||
అదరి వెనుజూచే సరికే ఆడేవు దోబూచీ
వెరగందీ దిక్కులన్నీ నే జూడగా
వెనుదట్టీ నవ్వుతావు వేళాకోళమనీ ||గారడి||

జూనియర్ సముద్రాల రాసిన ఈ పాటను సుశీల పాడగా కృష్ణకుమారి, కృష్ణారావు అనే నూతన నటుడు అభినయించారు. ట్యూన్ పరంగా ఈ పాటలోని చరణాల ఎత్తుగడను, 'ఆడిపాడేను నా మది ఈవేళా' పాటలోని చరణాల ఎత్తుగడను గమనించి చూస్తే ఆడిపాడేను పాట చరణాలను ఎత్తుగడను కాస్త స్లో చేసి 'గారడి చేసెను నీ కనులు' పాట చరణాలకు టేకాఫ్‌లాగ ఉపయోగించుకున్నారేమోననిపిస్తుంది. ఈ రెండు పాటల సాహిత్యాన్నీ తీరిగ్గా ఓ పదిసార్లు చూసి నెమరు వేసుకుంటే ఇవాళ ఎంతో బావున్న సాహిత్యం ఉందీ అనుకున్న కొన్ని పాటల్లో కూడా ఈ సున్నితత్వం కనబడదు. జీవితంలో నాజూకుగా ఉండే కొన్ని రసస్పందనల్లో ఓ మోస్తరు కరుకుదనం మోటుదనం తెలియకుండానే చోటు చేసుకుంటూ ఆక్రమించేస్తూ ఉండటం వల్లనే ఈ మార్పులు సంభవిస్తూ ఉన్నాయేమోనని అనిపిస్తుంది.

---

సాకీ. మనసులో ఒకటుంచి మాటాడతారు
కన్నీటితో గుండె కరిగించుతారు ఆ..ఆ..
అరచేత వైకుంఠ మొరిగించుతారూ ఎవరు? ఆడవారు
పాట: నమ్మరాదూ అసలె నమ్మరాదూ ||నమ్మ||
ఈ గడుసైన ఆడవాళ్ళ నమ్మరాదూ ||నమ్మ||
ఇలలోన గూడ నమ్మరాదూ ||నమ్మ||
అబ్బ కలలోన గూడ నమ్మరాదూ
సాకి: ఆడది బొంకిందంటే గోడబెట్టినట్టేరా
మూడుముళ్ళు పడ్డ వెన్క బ్రతుకంతా గోడేరా
ఆ స్టోరీ కొండవీటి చేంతాడురా ఆ...ఆ
పాట:ఇక్కడి మాటక్కడ చెపుతూ అక్కడి మాటిక్కడ చెపుతూ ||ఇక్కడి||
గడియారం ముల్లులాగా కాలికొద్ది చెక్కర గొడుతూ ||గడి||
జుట్టూ జుట్టూ ముడిపెడతారూ చోద్యం చూస్తూ నిలబడతారూ
ఎవరు? ఆడవారు ||నమ్మ||
రోషం రెండౌన్సులు - మోసం మూడౌన్సులు
అసూయ మొండిపట్టు - మోసం మూడౌన్సులు
సాహసం ఆరౌన్సులు - ఏడుపు ఏడౌన్సులు
తళుకు బెళుకు, కులుకు జిలుకు
లిప్‌స్టిక్ స్నో, పౌడర్ మేకప్ పదౌన్సులు
అంతా కలిమిల జేస్తె ఆడదౌనురా
చూడవేడుకౌనురా నమ్మరాదు

ఈ పాటను కొసరాజు వ్రాయగా ఎమ్. చిత్తరంజన్ పాడేరు జగ్గయ్య ప్రధాన పాత్రధారిగా కొంతమంది ఉపపాత్రధారులతో కలిసి అభినయించిన పాట ఇది పాట సాహిత్యం అసాంతం పరికించి చూస్తే కొసరాజు వ్యంగ్య చమత్కృతి అర్థం అయిపోతుంది ఇక సంగీత పరంగా చూసుకుంటే కళ్యాణి రాగం ఆ పాటకు ఆధారం. ఇలలోన కూడ నమ్మరాదు అబ్బ కలలోన కూడ నమ్మరాదు - అనే లైనుకు జతపడిన ట్యూన్‌ని ఆలపించుకుంటూ పోతే ఈ రాగంలో మరిన్ని పాటలు తట్టే అవకాశం ఉంది. ఈ పాటను వినగానే చాలామంది ఏ.యం.రాజా పాడేడని అనుకున్నారు ఆ రోజుల్లో కానీ ఏ.యం.రాజా పాడే పద్ధతికి భిన్నంగా ఉండడంతో ఎవరిదీ నూతన గాత్రం అంటూ శ్రోతలు ఆసక్తి కనపరచి ఆకాశవాణికి చెందిన చిత్తరంజన్ ఈ పాటను పాడారని తెలుసుకున్నారు.

ఆకాశవాణి ద్వారా అందరికి స్వరపరిచితుడైన చిత్తరంజన్‌కి రేడియో అన్నయ్యగా ప్రసిద్ధులైన కీ.శే న్యాపతి రాఘవరావు ద్వారా ఈ చిత్రంలో పాడే అవకాశం వచ్చింది. 'హైదరాబాద్‌లో తీస్తున్నాం కాబట్టి లోకల్ టాలెంట్‌ని చూద్దాం' అని అనుకున్న తరుణంలో న్యాపతి రాఘవరావు ఓ గెట్ టు గెదర్‌ని ఏర్పాటు చేసి చిత్తరంజన్ పాటలను మాస్టర్ వేణు వినేట్టు చేశారు. అప్పుడు ఆలిండియా రేడియోలో క్యాజువల్ ఆర్టిస్ట్‌గా ఉండే చిత్తరంజన్ తన స్వయంగా ట్యూన్ చేసుకున్న దేవులపల్లి, సి.నా.రె గీతాలను ఆలపించి మాస్టర్

వేణును ఆకట్టుకున్నారు ఆ తరువాత వారిరువురి మధ్య అనురాగబంధం ఎంతగానో ముడివేసుకుంది. మాస్టర్ వేణు సంగీత జీవిత పయనంలో ఎన్నో మలుపులకు మజలీలకు సాక్షిగా నిలబడే కొద్దిమందిలో ఇవాళ చిత్తరంజన్ ఒకరు.

---

అతడు: రావే రావే వయ్యారి ఓ చెలీ ||రావే||
నా గారాల జిలిజిలి జాబిలీ ||రావే||
ఆమె: చాలూ చాలోయి సఖ ఈ కేళీ ||చాలూ||
చెలులెవరైన చూచిన ఎగతాళి
ఆమె: దొరవారు కన్నులు మూసి
దోచేందుకు వేరేమంది
దొరికేది కన్నియ వలపే
దోచారది ఇంతకు మునుపే
అతడు: ఓహో చమత్కారివే
ఓ జవరాలా ||చాలు చాలొయి||
అతడు: కలవోలె కాపరాలు
కలకాలం సాగాలంటే
కలవాలి మనసూ మనసూ
శృతిలో లయగా మెలగాలీ
ఆమె: తమరే సదా నాకు
మనసైన జీవనమైనా ||రావే||
అతడు: నీ కేలూ వీడగ తరమే
ఆమె: వేడేది నేనా వరమే
అతడు: నిజమైతే ఈ అనురాగం
ఆమె: జీవితమే తీయనిరాగం
ఇద్దరూ: మనకీ సరాగాలు సరదాలు శాశ్వతమేలే ||రావే||
ఓఓఓఓ

ఈ పాటను సుశీల, యం. చిత్తరంజన్ పాడారు తెరపై కృష్ణకుమారి, కృష్ణారావు అభినయించారు ఈ పాటను సముద్రాల జూనియర్ రాశారు. చాలాసార్లు పహడీ రాగఛాయల్లోను, ఎక్కువసార్లు మోహన రాగంలోనూ వినిపించే ఈ పాటలో సంవాద తీతిగా వినిపించే సంగీత సాహిత్యాలు తెలియకుండానే మనసుకి హత్తుకుంటాయి. అది అందరికీ తెలిసేట్టు చేసింది మాత్రం గాయనీ గాయకుల ఉచ్చారణలోని స్పష్టతే. ఇదిలా ఉండగా ఆ పాట రెండో చరణంలో ‘కాపురాలు‘కి బదులు ‘కాపరాలు‘ అంటూ చిత్తరంజన్ చేత పాడించటం ఓ గమనించదగ్గ విషయం

---

అతడు: పదపదవె వయ్యారి గాలిపటమా ||పద||
పైన పక్షిలాగ ఎగిరిపోయి
పక్క చూపు చూసుకుంటు
తిరిగెదవే గాలిపటమా ||పద||
ప్రేమగోల లోన చిక్కిపోయినావా
నీ ప్రియుడున్న చోటుకై పోదువా ||ప్రేమ||
ఆమె: నీ తళుకంతా నీ కులుకంతా
అది ఎందుకో తెలుసును అంతా ||పద||
నీకు ఎవరిచ్చారే బిరుదు తోక
కొని తెచ్చావేమో అంతెగాక ||నీకు||
అతడు: రాజులెందరూడినా మోజు లెంత మారినా
తెగిపోక నిలిచెనీ తోక ||పద||
ఆమె: నీలిమబ్బుల్లో ఆడుకుందువేమో
మింట చుక్కల్తో నవ్వుకుందువేమో ||నీలి||
అతడు: వగలాడివిలే జగదంతవులే
దిగిరాకుండ ఎటులుందువులే ||పద||

నటభైరవి రాగచ్చాయలలో సాగే 'పద పదవే వయ్యారి గాలిపటమా' పాటను ఘంటసాల, జమునారాణి పాడగా చలం, గిరిజపై చిత్రీకరించారు. ఈ పాట కూడా సంగీత సాహిత్యాలతో సహా ఒరిజినల్ చిత్రం 'బాభీ'లో రఫీ, లత పాడిన 'చల్ చల్‌రే పతంగ్ మేరే చల్‌రే' పాటకు మక్కీకి మక్కీగా చెప్పుకోవాలి. ఆ హిందీ పాటలోని ఇంటర్ లూడ్స్‌ని జాగ్రత్తగా గమనిస్తే ఆర్కెస్ట్రయిజేషన్ అంతా శంకర్ జైకిషన్ స్టయిల్లో ఉంటుంది. ఒకరి స్టయిల్లో ఇంకొకరు స్వరపరచటం అనేది ఆ రోజుల్లో తమ సామర్ధ్యానికి ఒక సవాల్ లాగే భావించేవారని, శంకర్ జైకిషన్‌లు స్వరపరిచిన 'చోరి చోరి'లో 'రసిక్ బల్‌మా' పాటలా 'పేయింగ్ గెస్ట్'లో యస్.డి.బర్మన్ 'చాంద్‌ఫిర్‌నికలా' పాటని స్వరపరచారని ఇదివరకు పేర్కొనటం జరిగింది అలాగే తనకంటూ ఓ బాణీని ఏర్పరచుకుని ప్రత్యేక పంథాలో స్వరపరిచే మదన్ మోహన్ ఆఖరీదావ్ (1958)లో స్వరపరిచిన 'ఓ చాంద్ మస్కరాయే ఓ తారేషర్మ్ ఆయే' పాట వింటే 'చోరీ చోరీ'లో శంకర్ - జై కిషన్ స్వరపరిచిన 'ఏరాత్ భీగీ భీగీ' పాట ఆర్కెస్ట్రయిజేషన్, గాయనీ గాయకుల కాంబినేషన్‌తో సహా గుర్తొస్తుంది. ఈ ఉదాహరణలన్నింటితో పోలిస్తే చిత్రగుప్త కూడా ఈ 'చల్ చల్‌రే పతంగ్ మేరే చల్‌రే' పాటలో తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూనే అత్యద్భుతంగా సక్సెస్ అయ్యాడని చెప్పాలి. ఇక తెలుగుపాట వరకూ వస్తే చలంకి ఘంటసాల పాడిన పాటలన్నీ ఓ వరుసలో టేప్ చేసి వింటే ఓ తమాషా అయిన పద్ధతిలో తన గాత్రాన్ని విసురుతూ ఆయనకు ఘంటసాల పాడారనిపిస్తుంది. (కావాలంటే నిత్యకళ్యాణ పచ్చ తోరణంలో 'టనానా టంకు చలో' పాటని 'తోబుట్టువులు'లో 'ఏమయ్యా ప్రేమయ్యా పడితే లేవవు ఓ భయ్యా' అనే పాటను గుర్తుకు తెచ్చుకోండి) ఇక సాహిత్యం వైపు వస్తే ఆంధ్రాలో చాలాచోట్ల గాలిపటాన్ని 'తోక' అని కూడా అంటారు ఆ పదాన్ని. జగాల అంతు చూసే ఘనమైన దానివిలే అనే అర్థంతో వాడిన 'జగదంతవులే' అనే మాటను పూర్తి నేటివిటి టచ్‌తో ప్రయోగించిన గీత రచయిత కొసరాజు రాఘవయ్య చౌదరి శైలిని ప్రత్యేకంగా శ్లాఘించి తీరాలిక్కడ.

పయనించే ఓ చిలుకా
ఎగిరిపో పాడై పోయెను గూడు ||పయ||
నీకీ కొమ్మకు ||తీరెను||
పోమ్మా ఈ చోటు వదిలి
ఎవరికీ వారె ఏదో నాటికి ఎరుగము ఎటకో ఈ బదిలీ
మూడు దినాల ముచ్చటయే.. ||మూడు||
ఈ లోకములో మన మజిలీ
నిజాయితీగా ధర్మపధాన ||నిజాయితీ||
చనుమా ధైర్యమే తోడు ||పయ||
పుల్లా పుడకా ముక్కున కరచి గూడును కట్టితి వోయీ ||పుల్లా||
వానకు తడిసిన నీ బిగి రెక్కలు ఎండకు ఆరిన వోయీ
ఫలించలేదని చేసిన కష్టమూ...
ఫలించలేదని చేసిన కష్టమూ మదిలో వేదన వలదోయీ
రాదోయి సిరి నీ వెనువెంటా రాదోయీ
త్యాగమె నీ చేదోడు ||పయనించే||
మరవాలి నీ కులుకులు సడలె మదిలో నయగారాలే ||మరవాలి||
తీరని వేదన తీయని ముసుగే శిరసున సింగారాలే
ఓర్వలేని ఈ జగతికి నీపై ||ఓర్వలేని||
లేవే కనికారాలే
కరిగి కన్నీరై కరిగి
కడతేరుటె నీ తలవ్రాలే ||పయనించే||
గోడుమనీ విలపించారే నీ గుణము తెలిసినవారూ ||గోడు||
జోడుగ నీతో ఆడిపాడి కూరుములాడినవారూ
ఏరులయే కన్నీరులతో మనసారా దీవించేరే
ఎన్నడో తిరిగి ఇటు నీ రాకా ఎవడే తెలిసినవాడు ||పయనించే||

జూనియర్ సముద్రాల రాయగా ఘంటసాల పాడిన 'పయనించే ఓ చిలుకా' పాట చిత్రంలో వివిధ సన్నివేశాలలో వస్తుంది అక్కడక్కడ యమన్ రాగం కలుస్తున్నా ఆసాంతం కళ్యాణి రాగంలో పాటగా ఉదహరించాలీ గీతాన్ని. కళ్యాణి రాగంలో వచ్చే చతుశృతి రిషభంతో పాటు శుద్ధ రిషభాన్ని అనుస్వరంగా కలుపుకుంటూ అక్కడక్కడ ప్రతిమధ్యమం బదులు శుద్ధ మధ్యమాన్ని వేసినా - కళ్యాణి రాగానికి సదుపమానంగా నిలిచిపోయిందీ గీతం. ఒరిజనల్ చిత్రం 'బాబీ' లో రఫీ పాడిన 'చల్ ఉడ్‌జారే పంచీ' పాట ఈ పాటకు ఆధారం నిజానికిది మక్కికి మక్కీ గీతమైనా ఘంటసాల క్లాసికల్‌లో ఒకటిగా నిలిచిపోవటానికి కారణం ఘంటసాల, సముద్రాల అనే చెప్పాలి. సముద్రమంత గాంభీర్యాన్ని తన స్వరంలో నిలుపుకున్న గళం ఘంటసాలదైతే, ఆద్యంతం ఇది తెలుగువారి పాటేనని ఘంటాపథంగా అందరూ నమ్మేట్లు రాసిన కలం సముద్రాలది. వాస్తవానికి ట్యూన్‌తో పాటు - హిందీ రచయిత రాజేంద్ర కిషన్ రాసిన 'చల్ ఉడ్‌జారే సంచీ' పాట భావాన్ని సాహిత్యంతో సహా తీసుకోవడం జరిగింది. కానీ తెలుగు పాట మొత్తం ఎన్నిసార్లు ఎంతమంది పరిశీలించినా సరే అందులో మనది కానిది ఒక్కటి కూడా మచ్చుకైనా సరే కనిపించదు (మజలీ, బదిలీలాంటివి ఎప్పుడో మన వ్యవహారికంలో కలిసిపోయాయి) మన పలుకుబడిని అంత గొప్పగా ఉపయోగించుకున్న జూనియర్ సముద్రలను తప్పనిసరిగా వేనోళ్ళ

కొనియాడాల్సిందే. ఇటువంటి వేదనా గీతాలకు ఘంటసాల స్వరం ఒక వరం అయితే ఆయన పాడే పద్ధతి తెలుగువారి గుండెల్లో గుడికట్టుకున్న గోపురం. ముఖ్యంగా ఈ పాట చివరిలో వచ్చే ఆలాపనను నిశితంగా గమనిస్తే ఒరిజనల్‌గా రఫీ పాడిన పద్ధతికన్నా మరింత మెరుగ్గా వచ్చిందనిపిస్తుంది. తన గాత్ర ధర్మం ప్రకారం ఘంటసాలవారు ఆ ఆలాపనను ఎత్తుకున్న పద్ధతి, చివర్న గ్యాప్‌లతో తన వాయిస్‌ని ప్రాజెక్ట్ చేసుకున్న విధానం ఎత్తుకున్న ఆ ఆలాపనను మధ్యలో దించి - మెలొడీని మిళితం చేసి తిరిగి అద్భుతమైన రేంజ్‌కి చేరుకునేలా ఆయన ఇచ్చిన స్పందనకి తనువు, అణువణువు పులికించి పోతుంది. సానుభూతి రసానుభూతిని సమపాళ్ళలో పండించుకున్న ఈ గీతానికి సంబంధించిన మరో ముఖ్య విషయం ఏమిటంటే 'పుల్లా పుడక ముక్కున కరచి' అనే చరణం ఎక్కడ ఎవరివలన తొలగించబడిందో కానీ, ఇప్పుడు చాలా క్యాసెట్లలో ఉండటం లేదు.

'కులదైవం' చిత్రంలోని మొత్తం పాటలన్నీ సారధీ స్టూడియోలోనే రికార్డ్ అయ్యాయి. ఆర్కెస్ట్రాలో చాలామంది హైదరాబాద్‌కు చెందినవారే అందులోని వయొలినిస్ట్ ఏ.ఆర్.రామానుజులుని, తబలిస్ట్ నారాయణని ప్రముఖంగా పేర్కొనాలి. ఎన్నో టీ.వీ ఎపిసోడ్స్‌కి సంగీతాన్ని ఇచ్చి మరెన్నో టీ.వీ కార్యక్రమాల్లో కీ బోర్డు వాయిస్తూ కనిపించిన కీ.శే మనోజ్ కుమార్, ఎన్నో సంగీత కార్యక్రమాల్లో గిటారిస్ట్‌గా కనిపిస్తూ, సానాయాదిరెడ్డి తీసిన 'ప్రేమపల్లకి' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించిన కృష్ణ-నీరజ్ ద్వయంలోని నీరజ్‌కుమార్, ఆనాటి వయొలినిస్ట్ రామానుజులు కుమారులే.



# ఆ పాత పాట మధురం

## రాజా



### భట్టివిక్రమార్క

**తెలుగువారందరూ గుర్తుంచుకోదగ్గ సంగీత దర్శకుడు,** సినీ సంగీత ప్రియులెవ్వరూ మరచిపోలేని స్వరకర్త - పెండ్యాల నాగేశ్వరరావు. 'మా ఘంటసాల' అంటూ ఘనంగా చెప్పుకునే వారంతా ఆ ఘంటసాలకు ఘనకీర్తిని కట్టపెట్టిన ప్రతిష్ఠాత్మక గీతాలు రెండూ (రసికరాజ, శివ శంకరీ) స్వరపరిచింది పెండ్యాలే అని జ్ఞప్తికి తెచ్చుకుంటే చాలు. ఒక్క తెలుగువారే కాక దక్షిణాదిలోని ఇతర ప్రాంతీయ భాషలకు సంబంధించిన సినీ సంగీతాభిమానులు కూడా ఎంతగానో ఆదరించిన గాయనీమణులు సుశీల, జానకి, వసంత చేత తొలిసారి తెలుగులో పాడించినదీ పెండ్యాలే. ఆత్రేయ తొలిగీతం 'దీక్ష' చిత్రంలో 'పోరాబాబూ పో' స్వరపరిచిందీ పెండ్యాలే. వేటూరిని సినీ పరిశ్రమకు పరిచయం చేసిన 'సిరికా కొలను చిన్నది' రూపకాన్ని స్వరపరిచింది కూడా పెండ్యాలే, అంతటి హస్త'వాసి' గల స్వరకల్పనా ధరీణుడాయన. ఆయన సంగీత దర్శకత్వం వహించిన చిత్రాలలో ఒకటి భట్టివిక్రమార్క.

1960లో విడుదలైన ఈ చిత్రం గుర్తున్నవాళ్ళు ఇవాళ చాలా తక్కువ మంది ఉంటారు. అందులో నటించిన ఎన్.టి.ఆర్, అంజలి, కాంతారావు, ఎస్వీ.రంగారావు గురించి కొద్దిపాటి జ్ఞాపకంతో కొందరు చెప్పగలిగినా ఆ చిత్రానికి దర్శకుడు ఎవరో, మాటలూ పాటలూ రాసిందెవరో నూటికి తొంభైమంది చెప్పలేరు. అయినా - 'భట్టి విక్రమార్క' అనగానే 'ఓ..నెలరాజా వెన్నెల రాజా' పాటకదూ!? అని 'అందరూ' అంటారు. అదీ పెండ్యాల అంటే. జంపన దర్శకత్వంలో, అనిసెట్టి మాటలూ - పాటలూ రాసిన ఈ చిత్రంలో పాటలెన్ని ఉన్నా ఇప్పటికీ శ్రోతల స్మృతిపథంలో ఉన్న ఓ రెండుపాటల గురించి, ఆ స్థానంలో చేర్చదగిన మరో రెండుగీతాల గురించి .

నటించనా జగాలనే జయించనా
రసిక హృదయాలె తపించగ ||నటించనా||
పలుకే కమ్మని గానమయేనో
నా కులుకే తీయని సోవలయేనో
ఆ....ఆ...ఆ..ఆ...ఆ ||నటించనా||
హావభావాల అభినయమందు
నా అందములే కనువిందు
చరణ చలంచణ స్వరముల పిలుపు
అరుణ జనాళి శృతికలుపు
ఆ...ఆ....ఆ.... ||నటించనా||

ఈ పాటను సుశీల, లీల పాడగా రాజరాజేశ్వరి, జ్యోతి నృత్యాభినయాన్ని అందించారు. రంభ, ఊర్వశిలలో ఎవరు ఉత్తమ నర్తకి అనే వివాదాన్ని పరిష్కరించడానికి దేవేంద్రుడు, దేవతలు, దేవరుషులు మొదలైన వారు భూలోకం నుండి విక్రమార్కుని రప్పించగా అతని ముందు రంభ, ఊర్వశి ప్రదర్శించిన నృత్యగీతమే ఇది. దేవేంద్రునిగా మిక్కిలినేని, విక్రమార్కునిగా ఎన్.టి.ఆర్, తక్కిన పాత్రలలో ఉప పాత్రధారులు సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. ఈ పాటని నటభైరవి రాగంలో స్వరపరిచారు. పెండ్యాల జావళీ సంప్రదాయానికి సంబంధించి - తెలుగు సినీ సంగీత చరిత్రలో అతి తక్కువగా ఉన్న గీతాలలో చేర్చదగిన గీతమిది. అంతేకాదు నట భైరవి రాగంలో ఒక ప్రామాణిక గీతాన్ని అందించినందుకు పెండ్యాలకు సినీ శ్రోతలు కృతజ్ఞతలు చెప్పుకోవాలి కూడా.

---

ఆమె: ఓ..నెలరాజా వెన్నెల రాజా
నీ వన్నెలన్ని చిన్నెలన్ని
మాకేలోయ్
నా వెన్నుతట్టి పిలిచింది
నీవేనోయ్.. ||ఓ నెలరాజా||
చల్లని జాడలో
తెల్ల మబ్బు నీడలో
కొంటె చూపు నీకేల చంద్రుడా
నా వెంటనంటి రాకోయి చంద్రుడా ||ఓ నెలరాజా||
అతడు: కలువల చిరునవ్వులే కన్నెల నునుసిగ్గులే
ఆమె: ఓఓఓ
అతడు: కలువల చిరునవ్వులే
కన్నెల నునుసిగ్గులే
వెంటనంటి పిలిచినపుడు చంద్రుడా
వాని విడువ మనకు తరమౌనా చంద్రుడా ||ఓ నెలరాజా||
ఆమె: లేత లేత వలపులే
పూత పూయువేళలో
కలవరింత లెందుకోయి చంద్రుడా
నా చెలిమి నీది కాదటోయి చంద్రుడా ||కలవ||
ఇద్దరు: ఈ నెలరాజా వెన్నెల రాజా

'ఓ నెలరాజా' సుశీల, ఘంటసాల పాడగా అంజలీదేవి, ఎన్.టీ.ఆర్ అభినయించారు. సినిమా పాటలకు సంబంధించినంత వరకూ భీంప్లాస్ రాగాన్ని ఉదయ రవిచంద్రిక రాగాన్ని - విడివిడిగానూ ఎందరో సంగీత దర్శకులు ఎంతగానో వాడుకున్నారు. కానీ కొందరు ఉదయరవి చంద్రికలో పడాల్సిన 'సగమపనిస - సనిపమగస 'స్వరాలతో పాటు 'రి' అన్న స్వరాన్ని వేస్తుంటారు. అలాగే భీంప్లాస్ రాగంలో పడాల్సిన 'సగమపనిస సనిదపమగరిస' బదులు 'ద' అన్న స్వరాన్ని వర్జించి స్వరపరుస్తూ ఉంటారు. దాంతో చాలా పాటల రాగాల గురించి - ఇవ్వాళ సినిమా డైలాగ్‌లా చెప్పాలంటే - ఉదయ రవి చంద్రికకి ఎక్కువ భీంప్లాస్‌కి తక్కువ అని అనాల్సి వస్తుంది. కానీ పెండ్యాల విషయం కొస్తే మటుకు భీంప్లాస్ రాగం సర్వలక్షణ సమన్వితమై ఆయన పాటల్లో వినిపిస్తూ ఉంటుంది.

అటువంటి పాటల్లో ఈ పాటను చేర్చుకుని తీరాలి. ఈ పాటను బాగా ఆకళింపు చేసుకుని - 'వాగ్దానం' చిత్రంలోని 'నా కంటిపాపలో నిలిచిపోరా' పాటని, 'బావామరదళ్ళు' చిత్రంలోని 'నీలి మేఘాలలో గాలి కెరటాలలో' పాటతో పోల్చుకుంటూ ఒక్కసారి మనసులో ఆలపించుకుంటూ చూడండి. మూడూ ఒకే తానులోంచి వచ్చిన ఓణీల్లాగా ఒకే ట్యూనులోంచి వచ్చిన బాణీల్లాగా ఉంటాయి. ఈ పాటలోని మొదటి రెండు చరణాల ట్యూన్ ఒకలా ఉంటే మూడవ చరణం మొదటి రెండు పాదాల ట్యూన్ తొలి చరణాలలాగే ఉండటం, చివరి రెండు పాదాల ట్యూన్ మరోలా ఉండటం - వైవిధ్యానికి పీట వేసే పెండ్యాల రసజ్ఞతకు ఓ చిన్ని ఉదాహరణ మాత్రమే.

---

కొమ్ములు తిరిగిన మగవారు
కొంగు తగిలితే పోలేరు
మా కొంగు తగిలితే పోలేరు ||కొమ్ములు||
కత్తులు దూసే మగవాడు
ఎత్తులే వేసే మొనగాడు
గాజుల గలగల
గజ్జెల ఝుణఝుణ ||గాజుల||
విన్నాడంటే తిన్నాడే
కన్నెకు దాస్యం చేశాడే ||కొమ్ములు||
కన్నులు సైగలు చేశాయంటే
పెదవులు నవ్వులు విరిశాయంటే
ముదుసలియైనా ముచ్చటపడునే
పడుచుదనమ్మొ కోరునులే
ప్రణయంలో పడిపోవునులే ||కొమ్ములు||
పడతుల తీయని కౌగిలిలో
ప్రభువైనా పసిబాలుడనే
మంచిని చెడుగా చెడుని మంచిగా
మార్చే శక్తి ఆడయుక్తి
ఆడువారిదే ఈ జగతి ||కొమ్ములు||

'కొమ్ములు తిరిగిన మగవారు' పాటను జిక్కి పాడగా నృత్యతార కుచలకుమారి అభినయించింది. ఈ పాట జానపద బాణీలో ఉంటుంది కనక హరికాంభోజి రాగాన్ని ఎక్కువగా ఆశ్రయించవలసి వచ్చింది. ఇది ఇలా ఉండగా 'రోజులు మారాయి' చిత్రంలోని 'ఏరువాకా సాగారో' పాట ప్రభావం తరువాత వచ్చిన ఎన్నోపాటలపై పడక తప్పలేదని ఈ పాట ఋజువు చేసింది. ఆ పాటను స్వరపరచిన మాస్టర్ వేణు కూడా 'రాజమకుటం' చిత్రంలో 'ఏటి ఒడ్డునా మా ఊరు' పాటను ఆ ధోరణిలోనే స్వరపరచవలసి వచ్చింది. ఈ 'కొమ్ములు తిరిగిన మగవారు' పాటను నడిపించిన విధానాన్ని చూస్తే సరిగ్గా అటువంటి పరిస్థితే పెండ్యాలకి

వచ్చిందనిపిస్తుంది. ఇది ఇలా ఉండగా 'ఇల్లరికం'లోని 'భలే ఛాన్సులే' పాట గుర్తుంటే 'దూషణ భూషణ తిరస్కారములు ఆశీనులుగా తలచేవాడికి' అనే లైను, ఆ పాటలో గుర్తొస్తే ఇవన్నీ జానపద బాణీలపై ఆధారపడినవి కనుక ఈ పోలిక సంభవించిందని అనుకోవాలి. జానపద ధోరణిలో స్వరపరచిన పాటలలో ఈ పాటి పోలిక తప్పదనడానికి మరో ఉదాహరణ కనుక తీసుకుంటే - ఏ.ఆర్.రెహమాన్ స్వరపరచగా విడుదలైన 'నరసింహ' చిత్రంలో 'చుట్టూ చుట్టీ వచ్చావా' పాట బిగినింగ్ ఈ 'కొమ్ములు తిరిగిన మగవారు' పాట మొదటి లైను ట్యూన్ పరంగా ఒక్కలా ఉండటమే.

---

మనసార ప్రేమించినారా ||2||
మరుకేళి తెలింపవేరా
మారుడు తానెంత క్రూరుడు గాకున్న ||2||
మగువల మంత్రించి వంచించునా
మారుని వంచింప ||2||
విరహము వారింప ||మారుని||
రారా బిరాన కుబేర సమాన ||మనసార||
రారా నే పిలిచిన లోకువ లేరా
నీకిది మరియాదర పోరా
నీ పంతమె నా చెంతను సాగింతువ
ఆ కంతుని సామంతుని కావింతుము
బలే బలే రసపిపాసీ
ఇదా సరసమిదా సమయమిదా సరస
రసహృదయమిది కదర సరసము ||మనసార||

ఆ. దనిస పదనిదమప రిగమ ||మనసార||
2. రిగరి నినిరిదదనిదపద రిగమప ||మనసార||
3. పదని..పదని...దసనిదపమపా రిగమపా
నినిద సమపా - నిదా
రిసని దపదా - సనీ
రిగరిసనిసా
సరిసనిదనీ
నిసనిదపదా
సనిదపా
సగరి రిగసా దపమా మదపా పనిద దసని
నిరిసా సగరీ
పదపగరి నిసరిసని పదపమప ||మనసార||

ఈ పాటను సుశీల, ఏ.పి కోమల పాడగా మాంత్రికుడైన ఎస్వీ.రంగారావు ముందు లలితారావ్(బి.ఏ), పద్మినీ ప్రియదర్శిని నృత్యం చేస్తూ అభినయించారు. వీణ వాయిస్తూ సంధ్య, బంధించబడ్డ రాణిగా అంజలీదేవి కూడా సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. సంధ్యని తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తల్లిగా ఈ తరం వారికి పరిచయం చేయక తప్పదు. ఈ పాటను తిల్లంగ్ రాగంలో స్వరపరిచారు. ఇది హిందుస్థానీ రాగం. ఈ రాగం మన కర్ణాటక సంప్రదాయంలో లేదు.



# ఆ పాత పాట మధురం

రాజా



## రాణీ రత్నప్రభ

**దర్శకుడు బి.ఏ.సుబ్బారావుకి** తెలుగు సినీ రంగంలో ఓ చారిత్రాత్మక స్థానం ఉంది. ఎన్.టి.ఆర్, ఏయన్నార్ కాంబినేషన్‌లో తొలిసారిగా 'పల్లెటూరి పిల్ల' చిత్రాన్ని తీసింది ఆయనే. శోభనాచల బ్యానర్‌తో తన బి.ఎ.యస్ బ్యానర్‌ను కలుపుకుంటూ ఆ చిత్రాన్ని తీసిన తర్వాత స్వతంత్రంగా బి.ఏ.యస్ బ్యానర్‌పై అటు ఏయన్నార్ తోను, ఇటు ఎన్.టి.ఆర్ తోను ఎన్నో మంచిచిత్రాలు తన దర్శకత్వంలో నిర్మించారు. 'రాజు - పేద', 'చెంచులక్ష్మి', 'రాణీ రత్నప్రభ', 'భీష్మ' అందులోని కొన్ని. ఇవి కాక 'మైరావణ', 'మోహినీ భస్మాసుర' వంటి చిత్రాలు కూడా ఆయన ఖాతాలో ఉన్నాయి. 'రాజు - పేద' నుంచి ఎస్. రాజేశ్వరరావే ఆయనకు సంగీత దర్శకుడు. వీళ్ళిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాల్లోని పాటలలో అభిరుచి ప్రత్యేకంగా కనిపిస్తూ ఉంటుంది. 1960లో విడుదలైన రాణీ రత్నప్రభ అనే ఓ జానపద చిత్రంలో - అటు జనాదరణతో కూడిన అభిరుచికి, ఇటు అభిరుచితో కూడిన ప్రత్యేకతకు సాక్ష్యాలుగా నిలబడగలిగే ఓ నాలుగు పాటలివి:

నిన్న కనిపించింది
నన్ను మురిపించింది
అంద చందాల రాణీ ఆ చిన్నది ||నిన్న||
ఆమె చిరునవ్వులోనే
హాయున్నది ||ఆమె||
మనసు పులకించగా మధురభావాలు
నాలోన కలిగించింది ||నిన్న||
మరచిపోలేను ఆ రూపు ఏనాటికి ||మరచి||
మమత లేవేవో చెలరేగే ఇది ఏమిటి ||మమత ||
తలచుకొనగానే ఏదో ఆనందము ||తలచు||
వలపు జనియించగా
ప్రణయ గీతాలు
నా చేత పాడించింది ||నిన్న||
సోగకనులార చూసింది సొంపారగా
మూగ కోరికలు చిగురించె ఇంపారగా ||సోగ||
నడచిపోయింది ఎంతో నాజూకుగా ||నడిచి||
విడచి మనజాలను విరహతాపాలు
మోహాలు రగిలించింది ||నిన్న||

ఈ పాటను ఆరుద్ర రాయగా ఘంటసాల గానం చేశారు. ఎన్.టి.ఆర్ ప్రధాన పాత్రధారిగా చిత్రీకరించిన ఈ పాటలో రేలంగి, సీతారామ్, అంజలి, సి.యస్.ఆర్ అవసరానుగుణంగా కనిపిస్తారు. ఘంటసాలకి, ఆరుద్రకి వారి సినీ జీవితంలో మైలురాయిలా నిలిచిపోయిన గీతమిది, తొలిచూపులో కలిగే ప్రేమానుభవాలు మనసులో ఎటువంటి భావాలను కలిగిస్తాయో వాటిన్నిటినీ అందమైన, తేలికైన మాటలతో విరహగీతాలుగా మలిచిరాయటంలో ఆరుద్ర సిద్ధహస్తుడు, ప్రసిద్ధ హస్తుడు అని నిరూపించే గీతమిది. ఈ పాటతో పరిచయం ఉన్న ప్రతివారు తమ అనుభవాలతో కలుపుకుని జీవితకాలంలో ఒక్కసారైనా నెమరు వేసుకోకుండా ఉండలేరేమో?! ఇక సంగీత పరంగా చూసుకుంటే మొదటి చరణం ట్యూన్ ఒకలాగ, రెండు, మూడు చరణాల ట్యూన్ మరోలాగ ఉంటుంది. అప్పట్లో కొన్ని పాటలలో ఒకటి, మూడు చరణాలు ఒకలాగ, రెండో చరణం మాత్రం మరోలాగ ఉండటం జరిగేది. మంచి ట్యూన్ హిట్ అవటానికి ఆ కొలతలేవీ అడ్డం కావని ఋజువు చేసిన ఈ గీతానికి ప్రధాన రాగం భీం ప్లాస్. ఆ రాగానికి సంబంధించిన స్వరాలతోపాటు అన్యస్వరాలను కూడా విస్తృతంగా వాడుకుంటూ కొండకచో అంతర్గాంధకారం, శుద్ధ దైవతంని జత చేసుకుంటూ ఖరహర ప్రియరాగ లక్షణాలను జోడించుకుంటూ (ముఖ్యంగా రెండు, మూడు చరణాల్లో) 'ప్రయోజనరంజకం'గా తయారు చేశారు యస్.రాజేశ్వరరావు. తదనుగుణంగా ఘంటసాల పాటను ఆవిష్కరించిన తీరుకూడా రసాత్మకంగా సాగటంతో ఎంతోకాలం మన్నటానికి, ఎంతోమంది మన్ననలను అందుకోవటానికి కావలసిన అర్హతలన్నిటినీ ఈ గీతం సంతరించుకున్నది.

---

ఆమె: అనురాగము ఒలికే ఈ రేయి మనసారగ కోర్కెలు తీరేయి
మన హాయికి సాటేలేదోయి అనురాగము
అతడు: ఆ..ఆ..ఆ..ఆ...ఆ
అనురాగము ఒలికే ఈ రేయి మనసారగ కోర్కెలు తీరేయి
మన హాయికి సాటే లేదోయి అనురాగము
ఆమె: చల్లని వెన్నెలలోన
ఝల్లు ఝల్లును వలపులసోన ||చల్లని||
చిరునవ్వులతో విరితేనెలతో
మన జీవితాన పూలవాన అనురాగము
అతడు: ఆ...ఆ...ఆ...ఆ..ఆ

అనురాగము ఒలికే ఈ రేయి
మనసారగ కోర్కెలు తీరేయి
మన హాయికి సాటే లేదోయి
అనురాగము
ఆమె: తెలియని పరవశమొంది మన
కలలు ఫలించినవోయి ||తెలియని||
అనుబంధముతో ఆనందముతో మది
తేలి తేలి సోలిపోయె
అనురాగము
అతడు: ఆ...ఆ...ఆ...ఆ...ఆ
అనురాగము
ఒలికే ఈ రేయి మనసారగ కోర్కెలు తీరేయి
మన హాయికి సాటే లేదోయీ
అనురాగము

ఈ పాటను పి.సుశీల, పి.బి.శ్రీనివాస్ గానం చేయగా అంజలీదేవి, ఎన్.టి.రామారావు అభినయించారు. ఈ పాటకు అమీర్ కళ్యాణి రాగం ఆధారం. ఇదే రాగంలో యస్. రాజేశ్వరరావు స్వరపరచిన 'భక్తజయదేవ' చిత్రంలోని 'నీ మధు మురళీ గానలీల' పాట సినీ సంగీత ప్రియులకు, ఘంటసాల ఆరాధకులకు బాగా గుర్తుండే ఉంటుంది. ఆ పాటను, ఈ పాటను సంపాదించి, కలిపి వినండి. ఆలాపనలు, ఇంటర్లూడ్‌లు ఎంత దగ్గరగ ఉన్నాయో తెలుస్తుంది. సరియైన ప్రచారం లభించక కాలగర్భంలో కలిసి పో(బో)తున్న మంచి పాటలలో ఇదొకటి. ఏ ఛానల్ వారయినా పూనుకుని ఈ పాటను వరసగా కొన్నాళ్ళపాటు ప్రేక్షక శ్రోతలకు అందిస్తే - చక్కని అభిరుచి

గల వారి మన్ననకు పాత్రులవుతారు. ఆరుద్ర రాసిన ఈ పాటలో 'ఈ రేయి - తీరేయి' అనే పద ప్రయోగం ఆయనను పట్టి ఇచ్చే ముద్ర.

---

అతడు: నీటైన పడుచున్నదోయ్ నా రాజా
నీకే నా లబ్జన్నదోయ్ ఆహాహా ||నీటైన||
నీతోటి మాటంది - నిన్నే రమ్మంది ||నీ తోటి||
నీ పైన కన్నేసింది - ఆహాహా
నీవే కావాలన్నది - ఓహోహో ||నీటైన||
వాలైన వన్నెలాడి - ముచ్చటైన ముద్దులాడి
చందమామ అందంతో - సై అన్న వగలాడి
వాలైన ఏడేడు లోకాల ఈడులేని దొరసాని
నీ నీడ నున్నది - నీ జాడ గన్నది ||నీటైన||
అతడు: ఓర్చుకున్నవారికే ఓరుగల్లన్నదీ
స్త్రీ కంఠంతో: ఆత్రపడ్డవారికే అందను పొమ్మన్నదీ
అతడు: రంగైన చిన్నదీ రాలుగాయ నన్నదీ
స్త్రీ కంఠంతో: వరసైతే చచ్చినా వదలిపెట్టనన్నదీ ||నీటైన||

ఈ పాటను కొసరాజు రాయిగా ఘంటసాల, స్వర్ణలత ఆలపించారు. రేలంగి ప్రధాన పాత్రధరిగా అభినయించగా అలనాటి హాస్యజంట నల్లరామ్మూర్తి - సీతారామ్‌లోని సీతారామ్, మరికొంతమంది ఉపపాత్రధారులు కూడా అభినయించారు. హాస్యనటుడు బాలకృష్ణ పాట మధ్యలోనూ, హీరో ఎన్.టీ.ఆర్ పాట చివర్లోనూ కనిపిస్తారు. ఓర్చుకున్నవారికే ఓరుగల్లు, వాలైన వన్నెలాడి, లబ్జు వంటి ప్రయోగాలతో కొసరాజు కాస్సేపు ఆలోచింపచేస్తారు. పాటలో స్త్రీ పురుష కంఠాలు రెండూ ఉన్నా ఇటు ఆడవారి పరంగానూ ఇటు మగవారి పరంగానూ, రెండు అభినయాలను రేలంగి అందించారు. ఘంటసాల హుషారుగా, తమాషాగా పాడిన పాటల జాబితాలో ఈ పాట స్థానం ప్రత్యేకమైనదని ఇప్పుడు విన్నాకూడా అనిపిస్తుంది.

---

కనులలో కులుకులే కలిసి హాయిగ పిలిచెనో ||కనులలో||
తలపులో వలపులే మురిసి తీయగ నవ్వెనే ||కనులలో||
సొగసు చిలికే వయసులోనే
అనుభవించాలి
మంచి సమయము మించినా ||మంచి||
తపించినా లభించునా
ఈ మౌనమేలా జాబిలీ ||కనులలో||
మనసు విరిచే వింత కలలే
మరచిపోవాలీ
నిజము తెలియక పోవునా ||నిజము||
నమ్మించినా కవ్వించినా
చిన్నారి రూపే మారినా ||కనులలో||

ఈ పాటను సుశీల గానం చేశారు. తెరపై ఎన్.టి.ఆర్, అంజలిపై చిత్రీకరించారు. ఈ పాటను కొసరాజు రాఘవయ్య చౌదరి రాసినట్టుగా పాటల పుస్తకంలో ఉంది. మంచి అభిరుచితో రూపుదిద్దుకున్నా, మరుగున పడిపోయిన మధుర గీతాలలో ఒకటిగా ఈ పాటను ఉదహరించవచ్చు. ఈ పాట దొరికే అవకాశాలు కూడా అంతంత మాత్రమే. లభ్యమైతే మాత్రం ఓ చక్కటి కలక్షన్‌గా దాచుకోదగ్గ ఈ పాట మోహనరాగం ఆధారంగా సాగుతుంది. మోహనరాగంలో రాజేశ్వరరావు శ్రోతలకు సమర్పించిన పాటలెన్నో.. 'కళ్ళు తెరచి కనరా' (రాజు - పేద), ఎచట నుండి వీచెనో ఈ చల్లనిగాలి (అప్పుచేసి పప్పుకూడు), పాడవేల రాధికా (ఇద్దరు మిత్రులు), వినిపించని రాగాలే (చదువుకున్న అమ్మాయిలు), మదిలో వీణలు మ్రోగే (ఆత్మీయులు) ఇవన్నీ మోహనరాగం ప్రధాన రాగంగా ఆయన స్వర రచనలో సాగినవే. ఆ పాటల మాధుర్యపు స్థాయికి ఏ మాత్రం తగ్గని రీతిలో ఉంటుంది ఈ 'కనులలో కులుకులే' గీతం. మోహనరాగంతో మాండ్ రాగాన్ని మిళితం చేసుకుంటూ అవసరం అయిన చోట పహాడీ రాగచ్ఛాయలతో మలచుకుంటూ పాటను పారవశ్యపు అంచుల దాకా తీసుకు వెళ్ళగలగటం రాజేశ్వరరావు సాధించుకున్న ప్రత్యేకత. టోక్యో మోహన, సినీ మోహనలాగ 'రాజేశ్వరరావు మోహన' అంటూ ఓ బ్రాండ్ నేమ్ వచ్చేలా ఉంటాయి - అయినా ఆ రాగంలో స్వరపరిచిన గీతాలు. అందుకు పైన ఉదహరించిన గీతాలే సాక్ష్యాలు. వాటితో సమస్థాయిలో గౌరవాన్ని పొందదగ్గ అర్హతగల ఈ గీతాన్ని ప్రజలకు కొన్నాళ్ళపాటు అందించే కార్యక్రమాన్ని ఏ ఛానల్ వాళ్ళో ఆడియో వాళ్ళో పూనుకుంటే పుణ్యం కటుకున్నవారవుతారు.

ఈ చిత్రంలో మొత్తం తొమ్మిదిపాటలున్నాయి. మిగిలిన అయిదు పాటలలో ఎక్కడ దాచావోయ్ సిపాయి, విన్నావా నూకాలమ్మా, ఒహ్హోహ్హో అందాల మహరాజా బందీగ మననేల రాజా వంటి ఫరవాలేదనిపించే పాటలు కూడా లేకపోలేదు. అయితే పై నాలుగు పాటల ప్రత్యేకతే వేరు. ఈ చిత్రానికి సంబంధించిన పాటలలో ఇంకో ప్రత్యేకత ఉంది. 1960 నాటికి కథనాయకుడిగా ఎన్.టి.ఆర్, హాస్యనటుడిగా రేలంగి బాగా ఎస్టాబ్లిష్ అయిపోయారు. ఆయనకు ఘంటసాల, ఈయనకు మాధవి పెద్ది రెగ్యులర్‌గా నేపథ్యం పాడేవారు. ఎప్పుడో ఒకటీ అరా మినహాయింపులు ఉండొచ్చు. కానీ ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్ అభినయించిన యుగళ గీతాలకి పి.బీ శ్రీనివాస్ చేత పాడించడం (నిన్న కనిపించింది పాట సోలో కింద వస్తుంది), రేలంగికి ఘంటసాల చేత పాడించటం గమనించదగ్గ విషయం.



# ఆ పాత పాట మధురం

## రాజా



### సీతారామకళ్యాణం

కొన్ని చిత్రాలు - వాటిని నిర్మించిన సంస్థలకు ప్రతిష్ఠాత్మకంగా నిలిచిపోతే, మరికొన్ని చిత్రాలు సినీ రంగానికే గర్వకారణంగా మిగిలిపోతాయి. ఎన్. ఏ. టి సంస్థ నిర్మించిన సీతారామకళ్యాణం చిత్రాన్ని రెండో వర్గానికి చెందిన చిత్రాలలో ఓ అద్వితీయ చిత్రంగా ఉదహరించవచ్చు. నెగిటివ్ ఇమేజ్ కలిగిన రావణుని పాత్రను తొలిసారి కథానాయకుని స్థాయిలో ఎన్.టి.ఆర్ తీర్చిదిద్ది తానే ధరించడం, ఒక్క ఫ్రేమ్‌లో కూడా రాజీపడకుండా మొత్తం చిత్రాన్ని కళాత్మకంగా ఆయన మలచిన తీరు, ఉత్కృష్ట ప్రమాణాలతో కూడిన సంగీత సాహిత్య గానాలు నటన - ఇవన్నీ ఆ చిత్రానికి చిరకీర్తిని స్థిరకీర్తిని కట్టపెట్టాయి. ఈ చిత్రానికి ఎన్.టి.ఆర్ దర్శకత్వం వహించినా దర్శకుడుగా తన పేరును వేసుకోలేదు. 'యూనిట్' అంటూ ఆ క్రెడిట్‌ని తన బృందానికి పంచారు. ఈ చిత్రానికి గాలి పెంచల నరసింహారావు సంగీత దర్శకుడు, మాటలు - పాటలు సీనియర్ సముద్రాల రచించారు. ఈ చిత్రంలోని ప్రతీ స్వరరచనకు ఓ ప్రత్యేకత ఉంది. నేటికీ ప్రాచుర్యాన్ని కలిగిన కొన్ని స్వరరచనలు ..

దేవ దేవ పరంధామ నీల మేఘ శ్యామా
దేవ దేవ పరంధామ నీల మేఘ శ్యామా
నిన్ను విడచి తనను మరిచి
హుంకరించు అహంకారి
నిన్ను విడిచి తనను మరిచి
హుంకరించు అహంకారి
కానలేడు నీ మహిమ
కానలేడు మహిమ
నటన సూత్రధారి
దేవ దేవ పరంధామ నీల మేఘ శ్యామా
దేవ దేవ పరంధామ నీల మేఘ శ్యామా

రకరకాల చరణాల చొప్పున విభజించబడినా 'దేవ దేవ పరంధామ నీలమేఘశ్యామ' అనే ఒకే మకుటం పల్లవిగా కలిగిన ఈ పాట చిత్రంలో రకరకాల సందర్భాలలో వస్తుంది. కుంభకర్ణ విభీషణులతో ఆకాశంలో పయనిస్తున్న రావణుడు తన పుష్పకవిమానం మార్గమధ్యంలో ఆగిపోవడానికి కారణం సతీసమేతుడై శివుడు తాండవ కేళి జరిపే సమయని నారదుని ద్వారా తెలుసుకుని, శివుని ప్రసన్నం చేసుకోవడానికి వెళుతుండగా నారదుడు నర్మగర్భంగా పాడిన చరణమది. దీనిని పి.బి.శ్రీనివాస్ ఆలపించగా కాంతారావు (నారదుడు), ఎన్.టి.ఆర్(రావణుడు), కన్నడ నటుడు ఉదయ్ కుమార్ (కుంభకర్ణుడు), జూనియర్ ఏ.వీ సుబ్బారావు (విభీషణుడు) పై చిత్రీకరించారు. హిందోళరాగాన్ని పల్లవికి, ఆరభి రాగాన్ని చరణానికి ఉపయోగించారు. చరణం తర్వాత వచ్చే పల్లవిని తిరిగి ఇదే ఆరభి రాగంలో స్వరపరచడం సంగీతపరంగా చెప్పుకోదగ్గ విశేషం.

---

కానరార కైలాస నివాస
బాలేందుధరా జటాధరా హరా
కానరార కైలాస నివాసబాలేందుధరా జటాధరా.... ||కానరార||
భక్తజాల పరిపాల దయాళ ||భక్త ||
హిమశైలసుత ప్రేమ లోల ||కానరార ||
నిన్ను చూడమది కోరితిరా..
నిన్ను చూడమంది కోరితిరా..
నీ సన్నిధానమున చేరితిరా
నిన్ను చూడమది కోరితిరా..
నీ సన్నిధానమున చేరితిరా
కన్నడ సేయక కన్నులు చల్లగ
మన్నన సేయరా గిరిజా రమణా ||కానరార ||
సర్వభూషితాంగ కందర్పదర్పభంగ
సర్వభూషితాంగ కందర్పదర్పభంగ
భవపాశనాశ పార్వతీ మనోహర
హే మహేశ వ్యోమకేశ త్రిపుర హర
కానరార కైలాస నివాస
బాలేందుధరా జటాధరా హరా ||కానరార ||

ఈ పాటను ఘంటసాల గానం చేయగా ఎన్.టి.ఆర్ ప్రధాన పాత్రధారిగా అభినయించారు. ఈ పాటలో సముద్రాల ఉపయోగించిన ఎన్నో పదాలు, ఉపమానాలలో - కన్నడ సేయక (ఉపేక్షించక), కందర్ప దర్ప భంగ (మన్మధునికి గర్వభంగము చేసిన వాడు). వ్యోమకేశ (ఆకాశమే కేశములుగా కలవాడు) వంటి ప్రయోగాలు భక్తిగీతాలలో అతి అరుదుగా కనిపిస్తాయి. శంకరాభరణ రాగానికి సదుపమానంగా నిలిచిపోయే ఈ గీతానికి జవం, జీవం అన్నీ ఘంటసాలే! ప్రతీ పదం యొక్క అర్ధాన్ని సమర్ధంగా తెరపై ఆవిష్కరించగలిగే నటుడు ఉంటే వాటి పరమార్ధం సంపూర్ణంగా తెలిసిన గాయకుడు ఎంతగా ప్రాణ ప్రతిష్ట చేసి పాడగలడో నిరూపించే పాట ఇది. ఈ పాటను సాకల్యంగా సాధన చేసి ఇంటర్ లూడ్స్‌తో సహా మనసులో శాశ్వతంగా నిలుపుకోగలిగిన వారెవరైనా శంకరాభరణ రాగంపై కొంత పట్టుని సాధించగలిగానని చెప్పుకోవచ్చు - ఎందుకంటే ఈ పాటలో శంకరాభరణ రాగంతో పాటు ఆ రాగంలోని జన్యరాగాల నడకకు సంబంధించిన ప్రయోగాలన్నీ జరిగాయి కాబట్టి.

---

జయత్వదభ్ర విభ్రమద్భ్రమ ద్భుజంగ మస్ఫురత్
ధగధగద్విని‌ర్గ మత్కరాళ ఫాలహవ్యవాట్
ధిమిద్ధిమిద్ధిమి ధ్వనన్మృదంగ తుంగ మంగళా
ధ్వనిక్రమ ప్రవర్తిత ప్రచండతాండవశ్శివాః
ఓం నమఃశివాయ
అగర్వ సర్వమంగళా కళాకదంబ మంజరీమ్
రసప్రవాహ మాధురీ విజృంభణా మధూవ్రతమ్
స్మరాంతకమ్ మఖాంతకమ్
గజాంతకాంధకాంతకమ్
తమంతకాంధకమ్ భజే
ఓం నమఃహరాయ
ప్రఫుల్లనీల పంకజ ప్రపంచ కాలిమచ్ఛటా
విడంభి కంఠ కంధరా రుచి ప్రబంధ కంధరమ్
స్మరచ్ఛితమ్ పురచ్ఛితమ్
గజచ్ఛికాంధ ఖచ్ఛితమ్
తమంత కచ్ఛితమ్ భజే

ఈ శివతాండవ స్తోత్రాన్ని ఘంటసాల గానం చేయగా ఎన్.టి.ఆర్ ప్రధాన పాత్రధారిగా అభినయించారు. ప్రామాణిక వృత్తంతో సాగిన ఈ స్తోత్రం రావణకృతమని, కానీ తగిన ఆధారాలు లేవని, అనూచానంగా వస్తున్నదని చెప్పుకుంటారు. హంసధ్వని రాగంతో మొదలైన ఈ స్తోత్రంలో ‘అగర్వ సర్వమంగళా కళాకదంబ మంజరీమ్‘ నుంచి ‘ఓం నమః హరాయ‘ వరకూ వలజి రాగంలోనూ ‘ప్రఫుల్ల నీల పంకజా‘ దగ్గర నుంచి ‘తమంత ఖచ్ఛితమ్ భజే‘ వరకూ మోహనరాగంలోనూ స్వరపరిచారు. సినీగాయకులలో ఘంటసాల వంటి అదృష్టవంతుడు వేరొకరు లేరని చెప్పాలి. జన్మచరితార్థమయ్యే స్వరరచనలెన్నో ఆయనకు తన సంగీత జీవన యానంలో లభించాయి. ఆ అవకాశాలన్నిటినీ సద్వినియోగం చేసుకోవడమే కాక అవి వింటే తానుగాని, నటించిన నటుడుగాని శ్రోతల మదిలో మెదిలేటంత పటిష్టమైన ముద్రను ఏర్పరచుకోగలిగారాయన.

తన ప్రతిభావ్యుత్పత్తులతో, స్వరరచనను సంపూర్ణ అవగాహనతో ఆకళింపు చేసుకుని, పాత్ర స్వభావాన్ని తనలోకి ఆవహింపచేసుకుని, స్పష్టమైన ఉచ్చారణతో పాటు ప్రాణ ప్రతిష్ట చేసే విధంగా పాడాలంటే గాయకుడన్నవాడు ఎటువంటి వాటిని అభ్యసించాలి, సాధన చేయాలి అనే ప్రశ్నలకు సమాధానంలా, సజీవ ఉదాహరణగా ఈ స్తోత్రాన్ని ఘంటసాల ఆవిష్కరించిన పద్ధతి నిలుస్తుంది. గాయకుడి స్వరార్చన మన చెవికి సోకగానే మనసు పులకరించిపోవాలి. ఒళ్ళు జలదరించి పోవాలి. అప్రయత్నంగానే హస్తాలు ముకుళితమైపోవాలి. కళ్ళలో తన్మయత్మంతో కూడిన తడి పరుచుకుపోవాలి. ఈ రకమైన అనుభూతులన్నింటినీ ఏక కాలంలో అందించారు ఘంటసాల ఈ స్తోత్రంద్వారా. ఇక నటుడిగా ఎన్.టి.ఆర్. ఈ స్తోత్రానికి అభినయించిన తీరు - న భూతో న భవిష్యతి.

పరమ శైవాచర పరులలో నత్యంత
ప్రియుడనన్ యసము కల్పించినావు
తల్లి కోరిక దీర్పదలచి వేడగ ఆత్మ
లింగమ్ము ప్రేమ నొసంగినావు
మును కుబేరుడు దోచుకొనిన లంకాపురీ
విభవమ్ము మరల ఇప్పించినావు
తలచుటే తడవుగా దర్శన భాగ్యమ్ము
కరుణించి నీడవై కాచినావు
స్వామీ భవదీయ దర్శనోత్సాహి నగుచు దరియు
ఈ వేళ యీ నిషేధమ్ము లేల
వైరమేలయ్య మరచి నా నేరములను
కరుణ గనవయ్య కైళాస గిరినివాస
కరుణ గనవయ్య కైలాస గిరినివాస

ఈ పద్యాన్ని ఘంటసాల ఆలపించగా రావణ పాత్రధారియైన ఎన్.టి.ఆర్ పై చిత్రీకరించారు. కైలాసగిరిని రావణుడు పెకలించగా తాండవం చేస్తున్న శివునికి లయ తప్పుతుంది. పార్వతీ దేవి పరిహాసదృక్కులకు కుపితుడైన పరమశివుడు తన పాదఘట్టనతో రావణుని బలగర్వాన్ని అణుస్తాడు. భంగపడిన రావణుడు ఖిన్నుడై శివుని కరుణ కోసం వేడుకుంటూ ఆలపించే పద్యమిది. ఈ పద్యాన్ని సింధుభైరవ రాగంలో స్వరపరిచారు.

పుష్పక విమానంపై వెళ్ళే రావణుడు నారదుని సూచనపై కైలాస పర్వతానికి వచ్చి శివుని చూడగోరి గానంతో ప్రార్థించి, విఫలుడై బలిమితో కైలాస పర్వతాన్ని పెకిలించబూని, భంగపడి తిరిగి ఆత్మార్పణ మార్గంలో తన ప్రేవులనే తంత్రులుగా చేసి రుద్రవీణను పలికించి శివుని మెప్పించేవరకూ గల ఈ సన్నివేశం నిడివి పరంగా చూసుకుంటే ఎంతో పొడవైనది. సుమారు పదిహేను నిమిషాల పాటుగా ఏక బిగిన సాగే ఈ సన్నివేశం ఎక్కడా విసుగు చెందనీయకుండా ఈ నాటికీ ఆ చిత్రానికి ఓ ప్రత్యేక ఆకర్షణలా ఉందంటే అందుకు కారణం సంగీత సాహిత్య గాన నటనా కౌశలాలే. రుద్రవీణ పలికించే సన్నివేశంలోని నేపథ్యానికి వీణను వాయించింది కీ.శే ఈమని శంకర శాస్త్రి.

---

హే పార్వతీ నాథ కైలాస శైలాగ్రవాసా
శశాంకార్ధ మౌళి ఉమాదేవతోల్లాసి సర్వాంగ భాగా
శ్రితానందదాయిస్మితాపాంగా
భస్మీకృతానంగ గంగాధరా
సర్వసంతాప హరా, హరా
శివా సదా శివా
నీయున్న చందంబు నేనంత
యూహింపగా వచ్చు
నేదములున్నీవ వాదమ్ములున్నీవ
ధైర్యంబులున్నీవ మర్మంబులున్నీవ
సర్వంబులున్నీవ
నీ లెంక లైనట్టి దాసుండ నైనట్టి
నన్నున్ దయాళుండవై ప్రీతి రక్షింపవే
తప్పు సైరింపవే దేవ మన్నింపవే
దేవదేవా మహాదేవదేవా నమస్తే నమస్తే నమస్తే నం:

శివుని ప్రసన్నం చేసుకున్న రావణుడు స్తుతించిన స్తోత్రమిది. ఘంటసాల ఆలపించగా ఎన్.టి.ఆర్ ప్రధాన పాత్రధారిగా అభినయించారు. ఈ స్తోత్రం తొలిభాగం ఆరభి రాగంలో మొదలయి 'నీయున్న చందంబు' దగ్గర్నుంచి మాయమాళవ గౌళ రాగంలోకి మారిపోతుంది.

---

దానకుల వైరి దర్పంబు వర్ణించు
చదువు లెవ్వరుగాని చదువరాదు
సురపక్షపాతి విస్ఫురణకై గావించు
యాగంబు లేవియు సాగరాదు
అమరుల మేలుకై ఆచరించెడి యజ్ఞ
గుడంబులందగ్ని మండరాదు
హర నామమేగాని హరి నామధేయంబు
త్రిజగాల నెవ్వరు స్మరించరాదు
అమరలోక విజేత లంకాధినేత
అమరలోక విజేత లంకాధినేత
రావణుని శాసనంబు నిరాకరించు
విష్ణుదాసుల బట్టి కేల్ విరచిగట్టి
చెఱను నెట్టుడు దానవ శ్రేష్ఠులారా!

శివుడొసగిన వరగర్వంతో దిక్పాలులందర్నీ తన బానిసలుగా చేసుకుని - విష్ణుభక్తిని బోధించే చదువులు ఎవ్వరూ చదవరాదని, అమరులైన దేవతల మేలు కోసం చేసే యజ్ఞాలు ఇక సాగరాదని, శివుని పేరు తప్ప విష్ణువు పేరును ముల్లోకాలలో ఎవ్వరూ స్మరించరాదని, అలాకాదని జపించే విష్ణుభక్తులకు పెడరెక్కలు విరిచి చెరలో వేయమని రావణుడు తన అనుచర అసుర గణాలకు తెలిపే పద్యమిది. ఈ పద్యంలో 'అమరలోక విజేత - లంకాధినేత' అనే పదాలను తొలుత యన్.టి.ఆర్ పలుకుతారు. తిరిగి ఘంటసాల కంఠంతో అవే పదాలు పునరుక్తి అవుతూ పద్యం కొనసాగుతుంది. ఎన్.టి.ఆర్ గాత్రం, నవ్వు, ఆ తర్వాత ఘంటసాల ఒక ఊపుతో అందుకుని పాడిన తీరు - ఈ పద్యానికి అమరిన ప్రత్యేక ఆకర్షణ. ఇదికాక గమనిస్తే స్వరపరంగా ప్రత్యేకత కలిగిన మరొక ఆకర్షణ ఉంది. అది - అయిదు రాగాలలో ఈ పద్యాన్ని స్వరపరచడం. 'దానవకులవైరి' దగ్గర్నుంచి చదువరాదు వరకు మోహనరాగాన్ని, 'సురపక్షపాతి' దగ్గర్నుంచి యాగంబు లేవియు సాగరాదు' వరకు ఖరహరప్రియ రాగాన్ని, 'మరుల మేలుకై ఆచరించెడి' దగ్గర్నుండి 'అగ్ని మండరాదు' వరకు కేదారగౌళ రాగాన్ని 'హరనామమే గాని' దగ్గర్నుంచి 'స్మరించరాదు' వరకు సింహేంద్ర మధ్యమం రాగాన్ని, 'అమరలోక విజేత లంకాధినేత' దగ్గర్నుంచి పద్యం చివరి వరకు శ్రీరాగాన్ని ఉపయోగించారు.

పైన ఉదహరించిన పద్యాల్లో రాగాలను ఉపయోగిస్తున్నప్పుడు ఒక రాగంలో ఇంకొక రాగాన్ని మిశ్రమం చేయకపోవటం, ఒక రాగంలోంచి ఇంకొక రాగంలోకి వెళుతున్నప్పుడు 'జంప్' అనిపించేలా కాకుండా ఎంతో హాయిగా సంచారం చేయడం - విశేషంగా పేర్కొనక తప్పదు. ఆ ఘనత సంగీత దర్శకుడు గాలి పెంచల నరసింహారావుదే ఆ కీర్తి కట్టబెట్టవలసింది కూడా ఆయనకే. (చాలామంది ఆయన పేరుని గాలిపెంచల నరసింహారావు అని పలుకుతారు. నిజానికి గాలి ఆయన ఇంటిపేరు. ఆయన పెంచల నరసింహారావు. అందుచేత గాలి (గ్యాప్ ఇచ్చి) పెంచల నరసింహారావు అని వ్యవహరించటం సబబని కొందరి అభిప్రాయం) సంగీత

దర్శకుడు ఎంత ప్రతిభావంతుడైనా, సమర్థుడైన గాయకుడు లేకపోతే కళావిష్కరణలో స్పందన, శాశ్వతత్వం కొరవడుతుంది. ఈ కోణంలోంచి చూస్తే పైన ఉదహరించిన పాటలు, పద్యాలు ఇప్పటికీ మన గుండెల్లో మార్మోగుతూ ఉండడానికి కారణం అర్థమయిపోతుంది.



# ఆ పాత పాట మధురం

## రాజా



## సీతారామ కళ్యాణం - 2

సీతారామ కళ్యాణం చిత్రంలో - సీనియర్ సముద్రాల రచించగా గాలి పెంచెలనరసింహారావు సంగీత దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సర్వరచనలలో మిగిలినవి...

వీణా..పాడవే...రాగమయీ
పాడవే రాగమయీ వీణా పాడవే రాగమయీ
లంకానాధుని రమణీయగాధ ||లంకా||
పాడవే రాగమయీ
రాగములో అనురాగము కలిపి ||రాగము||
శివయోగములో భోగము తెలిపి
జగమే ప్రేమకు నెలవును చేసే ||జగమే ||
రసికావతంసుని రమణీయగాధ ||పాడవే||
వీణా మాధురి శివుమురిపించి ||వీణా ||
విక్రమధాటిని అమరుల నుంచి
కనుల సైగల నా మనసేలే ||కనుల ||
కైకసి సూనుని కమనీయగాధ
పాడవే రాగమయీ వీణా పాడవే రాగమయీ
రాగమయీ... రాగమయీ

'వీణా పాడవే రాగమయీ' పాటను సుశీల ఆలపించగా బి.సరోజాదేవి, ఎన్.టి.ఆర్. అభినయించారు. ఈ పాటకు దేశ్ రాగం ఆధారం. కథాగమనం, పాత్రల పరిచయం, వాటి పూర్వాపరాలు అన్నీ సాహిత్యం ద్వారా తెలియజేయడం ఈ పాట ప్రత్యేకత. ఇక దేశ్ రాగాన్ని గాలిపెంచెల నరసింహారావు ఎంతచక్కగా మలచుకున్నారంటే ఆ రాగంలో గల జీవస్వరాలన్నిటినీ అమృతధారలు ఒలికించే విధంగా పిండుకుని పాటంతా పరిచారాయన. సుశీల కూడా అంతే రసస్ఫూర్తితో పాడి రక్తికట్టించిన ఈ గీతం గాయనీమణులుగా రాణిద్దామనుకునే వారికి అతిసులువుగా లభించే వరం.

---

అఖిల జగతి సృష్టిజేసి
ఆడిపాడి అంతలోనే ||అఖిల||
ఆ పెదవు బొమ్మలాట
నటన సూత్రధారీ!
దేవ దేవ పరంధామ నీల మేఘశ్యామా

హిందోళ రాగంలో స్వరపరచబడిన ఈ స్వరఖండికను పి.బి.శ్రీనివాస్ ఆలపించగా కాంతారావుపై చిత్రీకరించారు. ఈ ఖండికలకు మకుట వాక్యమైన 'దేవదేవ పరంధామ నీలమేఘశ్యామా'ను కూడా చివరన హిందోళ రాగంతో కలిపి ఆలపించటం జరిగింది.

---

నెలత ఇటువంటి నీ మాట నీదుపాట
నీ వలపు చూపు నీ నడల్ నెమ్మి వినగ కనగా
దొరకునే సామాన్య కామునకు
నీ వలపు చూపు దొరకునే
బహు తపంబులు గావించి బడయకున్న

ఈ పద్యాన్ని అఠాణారాగంలో స్వరపరిచారు. ఈ రాగంలో గల పాటను గురించి చెప్పుకోవాలంటే 'శ్రీ కృష్ణ విజయం'లో జోహారు శిఖిపించమౌళి పాట తొలి భాగాన్ని, 'సీతయ్య'లోని 'ఒక్క మగాడు' పాటలో 'సుగుణాల రాముడు సమరాన భీముడు' అనేవాక్యాన్ని ఉదహరించాలి. రెండింటినీ గుర్తుచేసుకుంటూ ఈ పద్యాన్ని కూడా ఆలపిస్తూ పోతే అఠాణా రాగం సొగసులన్నీ అవగతమవుతాయి. ఈ పద్యాన్ని ఘంటసాల పాడగా ఎన్.టి.ఆర్ కుచలకుమారి అభినయించారు. ఈ పద్యం అర్థాన్ని సంపూర్ణంగా తెలుసుకుని  సినిమా చూస్తే ఎన్.టి.ఆర్ ఎంత గొప్ప నటుడో, పురాణాలపై ఎంతటి అవగాహన గల కళాకారుడో అర్థమవుతుంది.

---

జనకుండు సుతుడును జన్నంబు జేసిన
వనితా వారేమి కావలయు నీకు
అన్నదమ్ములు సోమయాజులై వెలసిన
లలనా వారేమి కావలయు నీకు
బావయు మరదియు
బవరాన గూలిన చెలువా వారేమి కావలయు నీకు

అల్లుండు మామయు అని త్రెళ్ళి వచ్చిన
పొలతీ వారేమి కావలయు నీకు
వావి వరసలు గణియింప వచ్చితేని
పడతీ మాతోడ మాటాడ వశమె నీకు
చాలు ఇక చాలు వెర్రి వాదాలు మాని
వగలు దీరిచి ఏలవే చిగురుబోణీ

ఈ పద్యాన్ని ఘంటసాల ఆలపించగా ఎన్.టి.ఆర్, కుచలకుమారి అభినయించారు. శంకరాభరణ రాగం ఈ పద్యానికి ఆధారం. ముందు ఉదహరించిన పద్యానికి ఉపయోగించిన విశ్లేషణ ఈ పద్యానికీ అన్వయించుకోవచ్చు. ఈ పద్యాన్ని అర్థం చేసుకోవడం కన్నా అవగాహన చేసుకోవడం ముఖ్యం. అందుకు మానసిక పరిపక్వత ఎంతో కావాలి. వక్ర దృష్టితో ఈ పద్యాన్ని చూస్తే సమాజానికి హానిచేసిన వాళ్ళమవుతాం. అంతటి శక్తిగల ఈ పద్యాన్ని - అసలు ఆ పోకడలు, ఆ అనుమానాలు ఏవీ సామాన్య ప్రేక్షకుడి మనసుని ఆవహించకుండా పవిత్రంగా, నర్మగర్భంగా తెరపై ఆవిష్కరించడంలో ఎన్.టి.ఆర్, సముద్రాల ఘంటసాల చూపిన స్థిత ప్రజ్ఞతకు హైందవ సంస్కృతి సంప్రదాయాల పట్ల, పురాణాల పట్ల గౌరవం ఉన్న ప్రతి తెలుగు వారూ నమోవాకాలు అర్పించవలసిందే

---

పరమ పురుష నీదు కరుణ
పరుగు దీయు కుంటివాడు
మాతయౌను గొడ్రాలే
నటన సూత్రధీ
దేవ దేవ పరంధామ నీల మేఘ శ్యామా

మోహనరాగంలో స్వరపరచిన ఈ ఖండికను కూడా పి.బి శ్రీనివాసే ఆలపించారు. కాంతారావే అభినయించారు. సినిమాలో మూడు భాగాలుగా వచ్చిన ఈ ఖండికల్ని కలిపి సమర్ధవంతంగా ఆలపించదలిస్తే రాగమాలికను ఆవిష్కరించడంలో గాత్రాన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో తెలుస్తుంది.

---

వేయి కనులు చాలవుగా
కన వేయి కన్నులు చాలవుగా
వేడుకైన మా సీతను చూడ ||2|| ||వేయి||
జనకుని ఇంటను చందమామలా ||2||
దినమొక వన్నెగ వర్ధిల్లీ
కన్నవారి కన్నుల చల్లగ ||2||
ఆటలనాడే సీతను చూడ ||వేయి||
తూగుటూయలా తోడి చెలులతో ||2||
గగన వీధిలో తేలియాడుతూ
వింత వింత పూబంతులాటలా ||2||
వేడుక చూసే సీతను చూడ ||వేయి||

పి.లీల పాడిన ఈ పాటను సీతగా నటించిన గీతాంజలి ప్రధాన పాత్రధారిణిగా చిత్రీకరించారు. కస్తూరి శివరావు, మిక్కిలినేని, ఛాయాదేవి సన్నివేశ ప్రాధాన్యంగా కనిపిస్తారు. సంగీత పరంగా ఈ పాటలో గాలి పెంచలవారు చాలా మంచి ప్రయోగం చేశారు. కమాచ్, దేశ్, శంకరాభరణ రాగాలను అతి నైపుణ్యంగా ప్రయోగించారీ పాటలో. ఈ రాగాల స్వరాలను తీసుకుని మిశ్రమం చేస్తూ - పాడే వారికి సునాయాసంగా ఉండేలా పాటను మలచటంలో గాలి పెంచలవారి మేధో సంపద ఎన్నదగినది, మిన్నయైనది.

---

మాయసీత: ఓ సుకుమార నినుగని మురిసితిరా
నిను వలచేర రారా ఏలరా ||ఓ సుకుమార||
మాయసీత: కనులా నిన్ను చూచిన నాడే ||2||
మనసూ నీదై పోయెనురా ||2||
శివుని విల్లూ విరచిన నాడు
నేనే కానుక నైతినిరా సుకుమార ||ఓ సుకుమార||
మాయరామ: తొలి నీ మోము చూచిననాడే ||2||
నాలో మోహము రేగినదే ||2||
తాళగలేనే నీ ఎడబాటూ వలపులు తీరిచి ఏలవే బేలా
సుకుమారి ఓ సుకుమారి నినుగన మనసగునే
నా వగదీర్చి ఏలవే జానకీ ఓ సుకుమారీ
మాయసీత: మనసొకటాయె మమతలు తెలిసెనుగా
మాయరామ: మది చిగురించు వాంఛా తీరునుగా||2||

ఈ పాటను లీల, ఘంటసాల పాడగా హరనాథ్

(రాముడు) గీతాంజలి (సీత) అభినయించారు. రావణుడు రాముని రూపంలో వచ్చి సీతని కలవాలనుకుంటే - సీత రూపంలో శూర్పణఖ వచ్చి రాముని కలవాలనుకుంటుంది. తెరపై కనిపించేది రాముడు, సీత అయినా - వారు రావణుడు, శూర్పణఖ అని ప్రేక్షకుడికి అర్ధమయ్యేలా కల్పించిన సరదా సన్నివేశంలో వచ్చే గీతమిది. శూర్పణఖ పాత్రధారిణి పేరు స్వర్ణ. ఈమె గీతాంజలి సోదరి. ఈ పాటకు హిందుస్థానీ పీలూ రాగచ్చాయలలో ఉండే కాపీ రాగాన్ని ఉపయోగించారు. లలిత సంగీతానికి శాస్త్రీయత కన్న రసభావాలే ప్రధానం కనుక - ఇక్కడ సన్నివేశం కూడా అంత శాస్త్రసమ్మతమైనది కాకపోవడం చేత కాపీ, పీలూలని శాస్త్రబద్ధంగా వాడుకోలేదు సరికదా ఇంటర్ లూడ్స్‌లో దేశ్ రాగచ్చాయలని, కొంత జానపద ధోరణిని కూడా అనుసరించారు. నిజానికి అక్కడున్నది మాయారూపాలలో ఉన్న రాక్షసులు. వారు చేసే పని నాగరికం కాదు. అంచేత రాగప్రయోగాలు కూడా అంత శాస్త్రీయంగా కాకుండా కాస్త మిశ్రమం పొందుతూ చెందుతూ ఉపయోగించారని సరదాగా అన్వయించుకోవచ్చు.

---

జగదేక మాతా గౌరీ  
కరుణించవే భవానీ కరుణించవే ||జగ||  
ఘనమౌ శివుని ధనువు వంచి ||ఘన||  
జనకుని కోరిక తీరుట జేసి  
మనసిజ మోహను రఘుకులేశుని ||మన||  
స్వామిని జయవే మంగళ గౌరి  
కరుణించవే భవాని కరుణించవే  
నీ పదములను, లంకాపతిని ||నీపద||  
నా పెన్నిధిగా నమ్ముకొంటినే  
నా పతికాపద కలుగనీయక ||నా పతి||  
కాపాడవే మంగళ గౌరీ  
కరుణించవే భవానీ కరుణించవే భవానీ ||జగ||

ఈ పాటను సుశీల గానం చేయగా గీతాంజలి (అప్పట్లో పేరు మణి), బి.సరోజాదేవి అభినయించారు. ఈ పాటకు సారంగ రాగం ఆధారం. కొన్ని కొన్ని పాటలు సినిమా రూపేణా వచ్చినా తర్వాత మన సంప్రదాయంలో అవి కూడా ఓ భాగమై పోవటం జరిగింది. అటువంటి పాటలలో ఈ పాటను పేర్కొనాలి. స్త్రీల పండగలకు, పూజలకు సంబంధించిన పేరంటాలలో ఈ నాటికీ ఈ పాటను యధావిధిగా, యధాతథంగా పాడటం జరుగుతోంది. ఆ సంప్రదాయం ఎంత పటిష్ఠంగా కొనసాగుతోందంటే అర్థాన్ని కూడా పట్టించుకోకుండా తు.చ తప్పకుండా పాడటం మనం చాలా ఇళ్ళల్లో గమనించవచ్చు. ముఖ్యంగా రెండవ చరణంలో వచ్చే 'నీ పదములను, లంకాపతిని నా పెన్నిధిగా నమ్ముకుంటినే' అనే వాక్యాన్ని అలా యధాతథంగా పాడితే మరీ అనుచితంగా ఉంటుందన్న సంగతి కూడా మనవాళ్ళ మనసులకు తట్టటం లేదంటే ఆ తర్వాత వచ్చే 'నా పతికాపద కలుగనీయక కాపాడగదే మంగళ గౌరీ' అనే వాక్యాల ప్రభావంలోనూ, ప్రవాహంలోనూ ఎంతగా మునిగిపోతున్నారో గమనించాలి. అది ఒక విధంగా పాట సాధించిన విజయమే.

---

సీతారాముల కళాణము చూతము రారండి
శ్రీ సీతారాలము కళాణము చూతము రారండి
చూచువారలకు చూడముచ్చటట
పుణ్యపురుషులకు ధన్య భాగ్యమట
భక్తియుక్తులకు ముక్తి ప్రధమట.... ||భక్తి||
సురలును మునులును చూడవత్తురట
కళ్యాణము చూతము రారండి
దుర్జన కోటిని దర్పమడంచగ
సజ్జన కోటిని సంరక్షింపగ ||దుర్జన||
ధారుణి శాంతిని స్థాపన చేయగ... ||ధారుణి||
నరుడై పుట్టిన పురుషోత్తముని
కళ్యాణము చూతుము రారండి
దశరథ రాజు సుతుడై వెలసి
కౌశిక యాగము రక్షణ జేసి ||దశ||
జనకుని సభలో హరువిలు విరచి... జన
జానకి మనసు గెలిచిన రాముని
కళ్యాణము చూతుము రారండి ||శ్రీ సీతా||
సిరి కళ్యాణపు బొట్టును పెట్టి
మణి బాసికమును నుదుటను కట్టి ||నుదుటను||
పారాణిని పాదాలకు పెట్టి
పెళ్ళికూతురై వెలసిన సీతా
కళ్యాణము చూతము రారండి ||శ్రీ సీతా||
సంపంగి నూనెను కురులను దువ్వి ||కురులకు||
సొంపుగ కస్తూరి నామము దీర్చి ||నామము||
చెంప జవాది చుక్కను బెట్టి....
పెండ్లి కొడుకై వెలసిన రాముని
కళ్యాణము చూతము రారండి ||శ్రీ సీతా||
జానకి దోసిట కెంపుల ప్రోగై ||కెంపుల||
రాముని దోసిట నీలపు రాశై ||నీలపు||
ఆణి ముత్యములు తలంబ్రాలుగా..... ||ఆణి||
శిరముల మెరిసిన సీతారాముల
కళ్యాణము చూతము రారండి. ||శ్రీ సీతా||

సుశీల బృందంతో కలిసి పాడిన ఈ పాటని తెలుగు వారి సంప్రదాయ జీవనంపై అఖండ విజయాన్ని సాధించిన పాటగా చెప్పుకోవచ్చు. తెలుగు వారింట ఈ పాటలేని పెళ్ళి పందిరి లేదు. ఎంత కష్టమైనా సరే ఈ పాటను తెప్పించి ఉపయోగించాల్సిందే లేకుంటే అది అశుభమేమోనన్న సెంటిమెంట్ కూడా కొన్ని కొన్ని గ్రామాలలో ఉంది. 'పదికొంపలు లేని పల్లెనైనను రామభజన మందిరమొండు వరలు గాత' అన్నట్టు ఈ పాట లేని రాముని కోవెల కూడా ఆంధ్రదేశంలో లేదనే చెప్పాలి. పూర్తిగా మధ్యమావతి రాగంపై సాగిన ఈ పాటలో 'ఆణిముత్యములు తలంబ్రాలుగా శిరముల మెరసిన సీతారాముల కళ్యాణము చూతము రారండి' తరువాత వాద్య సంగీతంగా వచ్చే 'ఆనందమానందమాయెనే' ఒక్కటే ఆనందభైరవి రాగంలో ఉంటుంది. సీతారాముల పాత్రలను ధరించిన గీతాంజలి, హరనాథ్ పైన ప్రధానంగాను, చిత్రంలో గల మిగిలిన పాత్రధారులందరి పైన అవసరమైన మేరకు ఈ పాటను చిత్రీకరించారు.

ఈ 'సీతారామ కళ్యాణం' చిత్రానికి సంబంధించి నిష్ఠతో కూడిన కళావిష్కరణను ఆద్యంతం గమనించవచ్చు. ఇక తెరపై కనిపించని సంఘటన ఒకటుంది. చిత్రంలోని యజ్ఞానికి సంబంధించిన ఒక సన్నివేశంలో నిజమైన ఆవు నెయ్యినే తెప్పించి వాడారు ఎన్.టి.ఆర్. ఆ నేతి వాసనతో సెట్ అంతా ఘుమ ఘుమలాడిపోయింది. అందరి ముఖంలోనూ ఆశ్చర్యాన్ని గమనించి "ఇది హౌస్ కౌస్ ఘీ బ్రదర్"అని అన్నారట ఎన్.టి. ఆర్. 'మనింటి పాడి ఆవుల పాల నుంచి వచ్చిన నెయ్యి అని చెప్పటానికి ఎన్.టి.ఆర్ ఆనాడు వాడిన "హౌస్ కౌస్ ఘీ బ్రదర్" అనే ప్రయోగాన్ని ఇప్పటికీ సినీపరిశ్రమకు చెందిన కొందరు ప్రముఖులు - తమ ఇంటి విందు భోజనాలలో నెయ్యి వడ్డించేటప్పుడు తమాషాగా గుర్తు చేసుకుంటుంటారు.

సరసాల జవరాలను నేనేగదా
మురిపాలు వెలబోయు భామలలోన ..సరసా..
బంగారు రంగారు మైజిగిలోన
పొంగారు వయసూ పొంకములోన
సంగీత నాట్యాల నైపుణిలోన
నా సాటి నెరజాణ కనరాదుగా ..సరసా..
మగువల నొల్లని మునియైనా
నా నగుమోమును గన చేజాచడా
యాగము యోగము దానములన్నీ
నా బిగికౌగిలి సుఖమునకేగా ..సరసా..

ఈ పాటను పి.లీల పాడగా రంభ పాత్రను అభినయించిన నాట్యతార కుచలకుమారి నర్తించింది. సన్నివేశ ప్రాధాన్యంగా ఎన్.టి. ఆర్ కూడా కనిపిస్తాడు. శాస్త్రబద్ధమైన కళ్యాణి రాగానికి ఈ పాట ఓ చక్కని ఉదాహరణ. ఈ పాటను ఇంటర్‌లూడ్స్‌తో సహా గుర్తుంచుకో గలిగిన వారికి కళ్యాణి రాగం మీద మంచి అవగాహన, పట్టు లభించే అవకాశం చాలావుంది. 'మైజిగి' (శరీరకాంతి) వంటి పద ప్రయోగాలను గమనించడం ఈ తరం వారికి చాలా అవసరం. ఒక విధంగా చెప్పాలంటే అలనాటి పౌరాణిక చిత్రాలలోని పాటల సాహిత్యాన్ని ప్రతిపదార్థ తాత్పర్య సహితంగా పూర్వాపరాలతో సహా ఒంటపట్టించుకునేట్టు మనం చెయ్యకపోవటం వల్లనే ఇవాళ్టి యువతకు తెలుగు భాష గురించి ఇంత మొత్తుకోవాల్సిన ఆగత్యం ఏర్పడుతుందేమోననిపిస్తుంది.



# ఆ పాత పాట మధురం

## రాజా



## కలసివుంటే కలదు సుఖం

**పౌరాణిక పాత్రలకు పెట్టింది పేరుగా** కీర్తిగడించిన ఎన్.టి.రామారావుకు మంచి పేరు తీసుకువచ్చి సాంఘిక చిత్రాలలో శ్రీ సారధీ స్టూడియోస్ "కలసివుంటే కలదు సుఖం" చిత్రం ఒకటి. తాపీ చాణక్య దర్శకత్వంలో ఎన్.టి.ఆర్‌తో పాటు సావిత్రి, యస్వీ.రంగారావు, సూర్యకాంతం, పెరుమాళ్ళు, హేమలత, రేలంగి, హరనాధ్, గిరిజ తదితరులు నటించిన ఈ చిత్రం 1961లో విడుదలయింది. మాస్టర్ వేణు ఈ చిత్రానికి సంగీత దర్శకత్వ బాధ్యతలను నిర్వహించారు. కొసరాజు, శ్రీశ్రీ ఆరుద్ర రాసిన ఎనిమిది పాటలలో మూడు పాటలు ఈనాటికీ జనం నోట నర్తిస్తూ ఉన్నాయి.

అ: ముద్దబంతి పూలు బెట్టి మొగలి రేకులు జడను చుట్టి<br>
ఆ: జడను చుట్టి<br>
అ: హంసలా నడిచివచ్చే చిట్టెమ్మా<br>
ఆ: చిట్టెమ్మా<br>
అ: మా ఇంటికేమి తెచ్చావమ్మా<br>
ఆ: చెప్పమ్మా ||ముద్ద||<br>
ఆ: అద్దమంటి మనసు ఉంది అందమైన వయసు ఉంది<br>
అ: వయసు ఉంది<br>
ఆ: ఇంతకన్నా ఉండేదేంది కిట్టయ్యా<br>
అ: కిట్టయ్యా<br>
ఆ: ఈ పేదవాళ్ళు తెచ్చేదేంది చెప్పయ్యా<br>
అ: చెప్పయ్యా ||అద్ద||<br>
అ: పుట్టింటి అరణాలూ...<br>
ఘనమైన కట్నాలూ.. హోయ్.. ఓ ||పుట్టింటి||<br>
అత్తవారింటినిండా వేసినా<br>
అవి అభిమాన మంత విలువ జేసునా<br>
మరియాదె భూషణం ||అభి||<br>
గుణము మంచిదైతే చాలయా<br>
మన గొప్పతనము చెప్పుకోను వీలయా<br>
గొప్పతనమూ చెప్పుకోను వీలయా ||అద్ద||<br>
అ: కాలు చెయ్ లోపమనీ..<br>
కొక్కిర్యా రూపమనీ.. ||కాలు చెయ్||<br>
ఒదినలు నన్ను గేలి చేతురా<br>
పిల్లను దెచ్చి పెళ్ళి చేతురా<br>
పిల్లను దెచ్చి పెళ్ళి చేతురా<br>
ఆ: ఎవరేమి అన్ననేమి<br>
ఎగతాళి చెయ్యనేమి<br>
నవ్విన నాపచేనె పండదా<br>
నలుగురు మెచ్చు రోజు ఉండదా<br>
నలుగురు మెచ్చురోజు ఉండదా ||అద్ద||

కొసరాజు రాసిన ఈ పాటను ఘంటసాల, సుశీల పాడగా ఎన్.టి.ఆర్, సావిత్రి అభినయించారు. 1959లో వచ్చిన 'బాగపిరివినై' తమిళ చిత్రం 'కలసి ఉంటే కలదు సుఖం' చిత్రానికి ఆధారం. తమిళంలో తాను తీసే ప్రతి చిత్రానికి 'ప' అనే అక్షరంతో గానీ, 'బ' అనే అక్షరంతో గానీ ముడిపడే పేరుని పెట్టే ఎ.భీమ్ సింగ్ ఈ 'బాగపిరివినై' చిత్రానికి దర్శకుడు. శివాజీ గణేశన్, బి.సరోజాదేవి హీరో, హీరోయిన్లు. విశ్వనాథం - రామ్మూర్తి ద్వయం సంగీత దర్శకులు. వారు సంగీతాన్ని సమకూర్చిన 'తాళయాం పూముడిచ్చు తడం పార్తుం నడై నడందు' పాట సంగీత సాహిత్యాన్ని 'ముద్దబంతి పూలు బెట్టి' పాటకు ఉపయోగించుకున్నారు. తమిళ గీతాన్ని టి.ఎమ్.సౌందరరాజన్, సుశీల పాడారు. తర్వాతి రోజుల్లో అద్భుతమైన సంగీత దర్శకుడిగా ప్రసిద్ధికెక్కిన విశ్వనాథం - రామ్మూర్తి జంటలోని ఎమ్మెస్ విశ్వనాథం ఈ పాట మొదట్లో వచ్చే 'తందనాన తానే' అనే సాకీని ఆలపించారు. తెలుగు పాటను ఘంటసాల, సుశీల ఆలపించినా ఎమ్మెస్ విశ్వనాథం పాడిన ఆ సాకియే పూర్తి జానపద ధోరణిలో అందర్నీ ఆకట్టుకునే రీతిలో ఉండటం చేత ఆ ఒక్క బిట్ కోసం మద్రాసుకి వెళ్ళి ఎమ్మెస్ చేత పాడించి - మిగిలిన పాటను రికార్డు చేసిన సారథి స్టూడియోలో మిక్స్ చేశారు. ఈ పాటకు ఉత్తరాది రాగం పహాడీ దగ్గరగా ఉంటుంది బిమల్ రాయ్ దర్శకత్వంలో 1959లో వచ్చిన 'సుజాత' హిందీ చిత్రంలో సంగీత దర్శకుడు యస్.డి బర్మన్ స్వరపరిచి పాడిన 'సున్ మెరె బంధూరే సున్ మేరె మిత్‌వా' పాట సంగీత ప్రియులకు గుర్తుండే ఉంటుంది. ఆ ఛాయ ఎమ్మెస్ విశ్వనాథ్ ఆలపించిన 'తందనాన తానే'లో స్పష్టంగా కనిపిస్తుంది. ఎమ్మెస్ విశ్వనాథం అత్యంత ప్రతిభావంతుడైన సంగీత దర్శకుడే అయినా ఆయన మీద ఎస్.డి.బర్మన్ ప్రభావం అప్పుడప్పుడు పడుతూ ఉంటుందనడానికి ఈ 'సున్ మేరె బంధూరే' పాటే కాకుండా మరో ఉదాహరణ కూడా ఉంది. ఆకలిరాజ్యం(1981) సినిమాలో 'కన్నెపిల్లవని కన్నులున్నవని' పాట గుర్తుండే ఉంటుంది. ఆ పాట ఇంటర్లూడ్స్‌లో ఉపయోగించిన సితార్ బిట్స్ నడకగానీ, మొదటి చరణంలో 'స్వరము నీవై' స్వరమున పదము నేనై' అనే వాక్యం ట్యూన్ గానీ, రెండో చరణంలోని 'తనన తన్న అన్నా తానా అన్నా స్వరమే ఒకటే కదా' అనే వాక్యం ట్యూన్ గాని గైడ్' (1965) హిందీ చిత్రంలో ఎస్.డి.బర్మన్ స్వరపరచి పాడిన 'వహ్ కౌన్ హై తేరా ముసాఫిర్ జాయెగాకహా' పాటలోని చరణాల పోకడని జ్ఞాపకం చేస్తూ ఉంటుంది.

ఇక ఈ 'ముద్దబంతి పూలు బెట్టి' పాట ట్యూన్ తమిళందే అయినా ఈనాటికి ఇది మన పాటేనేమో నన్నంతగా తెలుగువారి మనసుల్లో ముద్రపడిపోవడానికి కారణం - తెలుగుతనాన్ని పూర్తిగా ఉట్టిపడే స్థాయిలో కొసరాజు అందించిన సాహిత్యం ఒక ఎత్తు. అందుకు ముద్దబంతి, మొగిలిరేకు, అరణాలు, కొక్కిరాయ్, నవ్విన నాపచేను పండటం వంటివి ఒక ఉదాహరణ అని చెప్పాలి. ఇక ఘంటసాల, సుశీల గానం మరొక ఎత్తు అని చెప్పనక్కర్లేదు.

తరువాత రోజుల్లో రవీంద్ర ఆర్ట్స్ సంస్థను స్థాపించి లక్షాధికారి, జమిందార్, ధర్మదాత వంటి చిత్రాలు తీసిన తమ్మారెడ్డి కృష్ణమూర్తి (నేటి దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తండ్రి) ఈ 'కలసి ఉంటే కలదు సుఖం' చిత్రానికి ప్రొడక్షన్ వ్యవహారాలు చూసేవారు. 'ముద్దబంతి పూలు బెట్టి' పాట చిత్రీకరణ గురించి చెబుతూ, "అక్కడేమో ఎన్టీఆర్ ఓ గేద మీద కూర్చుని పాడాలి. ఒక చెయ్యి కుంటిగా పెట్టాలి కనుక మిగిలిన చేత్తోనే కంట్రోల్ చేయాలి. ఆయనేమో నల్లటి షర్ట్ వేసుకున్నారు. అది చూసి గేదె బెదిరేది. ఎందుకైనా మంచిదని ప్రొడక్షన్ డ్రైవర్ని ఎక్కించాం. అతన్ని విసిరేసింది ఆ గేదె. ఎలాగైతేనే నెమ్మదిగా ఆ గేదెని మచ్చిక చేసుకుని ఎన్టీఆర్‌ని కూర్చోబెట్టి జాగ్రత్తగా షూటింగ్ చెయ్యటం జరిగింది' అంటూ వివరించారు.

సాకీ: మందర మాటవిని మౌఢ్యమున కైకేయి
రామలక్ష్మణులు అడవికి పంపెగదా
శకుని మాయలు నమ్మి జూదమున ఓడించి
కౌరవులు పాండవుల కష్టపెట్టిరిగా
పరుల బోధకు లొంగి
పండువంటి సంసారాన్ని
భాగాలుగా చీల్చి పంచుచుండిరి గదా..
ప: కలిసి ఉంటే కలదు సుఖం వేరుపడితె తీరని దుఃఖం
చెడు బోధలు విన్నారంటే
ఎవరికైనా తప్పదు కష్టం ||కలిసి||
చ: చిట్టి చీమలన్ని మూగి
పెద్ద పుట్ట పెట్టునురా ||చిట్టి||
శిల్పులంత కట్టుగ ఉండే తాజమహలు కట్టిరిరా
జనులెందరో త్యాగం చేసి స్వారాజ్యము తెచ్చిరిరా
తగవులతో తన్నుకు ఛస్తే
పతనము ప్రాప్తించునురా ||కలిసి||
చ: పది కట్టెలు ఒకటిగ ఉంటె
పట్టి విరువ లేరురా ||పది||
ఒక కట్టెగ ఉంటేనే వికలము జేసేరురా
కర్ణుడొకడు చేరకపోతే భారతమె పూజ్యమురా
యాదవులే ఒకటిగా ఉంటే
నాశనమై యుండరురా ||కలిసి||

ఈ పాటను కొసరాజు వ్రాయగా ఘంటసాల, సుశీల బృందం ఆలపించారు. చిత్రంలోని ప్రధాన తారాగణంపై ఈ పాటను చిత్రీకరించారు. మాతృక అయిన తమిళ చిత్రం 'బాగపిరివినై'లోని 'ఒట్రుమయాయ్ వాళ్ వదాలె విలయం నన్మయే / వేట్రుమయై వళర్పదినాలే విళయం తీమయే' అనే పాట యొక్క సంగీత సాహిత్యాల్ని ఈ తెలుగు పాటకు వాడుకున్నారు. సాధారణ గాంధారాన్ని అన్యస్వరంగా వేసుకుంటూ రాగేశ్రీ రాగంతో మలచుకున్న ఈ పాట కూడా తెలుగు వారికి మరింత దగ్గర కావటానికి కారణం కొసరాజు సాహిత్యమేనని మరోసారి చెప్పక తప్పదు. ఈ పాట ట్యూన్‌కి సంబంధించి ఒక తమాషా ఉంది. మొదటి చరణంలోని 'జనులందరూ త్యాగం చేసి స్వారాజ్యము తెచ్చిరిరా' అనే వాక్యం యొక్క ట్యూన్స్‌ని, రెండో చరణంలోని 'కర్ణుడొకడు చేరకపోతే భారతమే పూజ్యము రా' అనే వ్యాక్యాన్ని మననం చేసుకుంటూ 1965లో వచ్చిన 'సుమంగళి' చిత్రంలో కె.వి.మహదేవన్ స్వరపరిచిన 'సిగలోకి విరులిచ్చి' పాటలోని చరణాలలో గల 'తనువు చిక్కి శల్యంబైన తలపులణగి పోయెనా', 'కోరినది చేతికి చిక్కి ఆరుతున్నదొక దీపం' అనే వాక్యాల ట్యూన్‌తో పోల్చి చూసుకుంటే ఒక్కలాగే ఉన్నట్టనిపిస్తుంది. ఇది కాపీకాదు. ఎమ్మెస్ విశ్వనాథం తన తొలిరోజుల్లో కొన్నాళ్ళపాటు కె.వి.మహదేవన్ వద్ద సహాయకునిగా పనిచేసేవారు. కొన్ని పాటల్ని ట్యూన్ చేసేటప్పుడు జరిగే రాగసాధనలో ఇద్దరి మస్తిష్కాల్లోనూ కామన్‌గా కొన్ని ప్రయోగాలు ముద్రపడి అవి ఇలా ఈ రూపంలో వచ్చి ఉండవచ్చు. కొన్ని కొన్ని పరిశీలనలు ఆత్మాశ్రయంగానూ,

నిరూపణకు బలం లేనివిగాను ఉంటాయని గతంలో చెప్పుకున్నట్లుగా ఈ ప్రయోగాన్ని కూడా అలాగే పేర్కొనాలి. ఇదిలా ఉండగా చిత్రం టైటిల్‌ని 'కలసి ఉంటె కలదు సుఖం' అని చూపిస్తూ పాటలో మాత్రం 'కలిసి ఉంటె కలదు సుఖం' అని పాడించటం గమనార్హం.

---

మేలిమి బంగరు మెలిక తిరిగినా విలువ తరిగేనా
మీ దేహములో చిరులోపములున్నా ప్రేమ కరువగునా ||మేలిమి||
సింహము కాళ్ళు చిక్కుపడినను
శౌర్యము కొరవడునా ||సింహము||
చేతలు మాటలు ఒకటే అయితే
త్యాగము కరువగునా
త్యాగము కరువగునా ||మేలిమి||
కాళ్ళేలేని కమ్మని చంద్రుడు నిరతము పయనించునే ||కాళ్ళే||
కరములు చాపే కలువను చేరి
ముదము కలిగించునే
ముదము కలిగించునే ||మేలిమి||
పతి పద సేవా భాగ్యము నేనే సతతము నోచితినీ ||పతి||
మీ చల్లని మదిలో సౌఖ్యము నొసగే
స్వర్గము చూచితినీ
స్వర్గము చూచితిని ||మేలిమి||

ఈ పాటను ఆరుద్ర వ్రాయగా సుశీల ఆలపించారు. సావిత్రి, ఎన్.టి.ఆర్ అభినయించారు. ఈ పాట ట్యూన్ కూడా తమిళ మాతృకలోని 'తంగత్తిలె ఒరుకుర్రై ఇరందాలుమ్' పాట నుంచి యథాతథంగా తీసుకోవటం జరిగింది. చిత్రంలో గల పాటలన్నిటిలోనూ సాహిత్యపరంగా ఈ పాటనే గొప్పపాటగా పేర్కొనాలి. దురదృష్టవశాత్తూ ఎలక్ట్రిక్ షాక్ తగిలి కాలూ, చెయ్యి వంకర పోయిన ఓ వ్యక్తిని, మంచి మనసుతో పెళ్ళి చేసుకున్న ఓ యువతి తొలినాటి రాత్రి అతనితో 'మీ పట్ల నాకేమీ తక్కువ భావం లేదు' అనే రీతిలో చెప్పడానికి వాడుకున్న ఉదాహరణలే తెలుగులో వాడుకున్నారనడానికి తమిళ గీతంలోని 'సింగత్తిన్ కాల్గళ్ పళదు పటాలం సీటం కురైవదుండో' అనే వ్యాక్యానికి తెలుగు సేతగా 'సింహము కాళ్ళు చిక్కుపడినను శౌర్యము కొరవడునా' అనే వాక్యం సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ పాట రాగ ప్రాధాన్యమైంది కాదు. తరచి తరచి చుస్తే శంకరాభరణ స్వరాలు, హరికాంభోజీ స్వరాలు, ఆరభి, దేశ్, తిలక్ కామీద్ నడకలు కనిపిస్తాయి. ఇంకా బాగా అవలోకించుకుంటే 'బైజూబావ్‌రా (1952) హిందీ చిత్రంలో నౌషాద్ స్వరపరచగా లత పాడిన 'బచ్‌పన్‌కి మొహబ్బత్ కో దిల్ సే న జుదాకర్ నా' పాట నడక గుర్తొస్తుంది.

ఈ 'కలిసి ఉంటే కలదు సుఖం' చిత్రంలో కాలూ, చెయ్యి వంకర పోయిన వ్యక్తిగా ఎన్.టి.ఆర్ నటించారు. చిత్రం అంతా ఆయన అలా నటించడానికి షాట్‌కి ముందు ఇంజక్షన్లు తీసుకునే వారని ఆ రోజుల్లో తెగచెప్పుకునేవారు. నిజానికి అవన్నీ పుకార్లే. ఎన్.టి.ఆర్ తొలి చిత్రం 'మనదేశం'కి ముందు - సారధీ స్టూడియోస్ నిర్మించే 'శ్రీమతి' అనే చిత్రం కోసం దర్శకుడు యల్వీప్రసాద్ ఆయన స్టిల్స్‌నీ తీసుకోవడం జరిగింది. ఆ చిత్రం కొన్ని కారణాల వల్ల తీయడం జరగలేదు. అలా సారధీ వారి చిత్రంలో నటించే ఛాన్సు

తప్పిపోయి, మ్యానేజ్‌మెంట్ మారి శ్రీ సారధి స్టూడియోస్‌గా రూపొందిన తరువాత 'కలసి ఉంటే కలదు సుఖం' రూపంలో ఎన్.టి.ఆర్ కి కలిసొచ్చింది. నిజానికది కలిసొచ్చినట్టే లెక్క.

ఎందుకంటే సారధీవారు తమిళ చిత్రం 'బాగపిరివినై' హక్కుల్ని కొని ఎవరితో తీద్దామా అనే చర్చల్లో ఉండగా రామకృష్ణ 70 ఎమ్.ఎమ్ థియేటర్ నిర్మాణం విషయంలో ఎన్.టి.ఆర్ తరచూ హైదరాబాద్ రావటం వారి దృష్టినాకర్షించింది. అప్పుడు ఎన్.టి.ఆర్‌ని సారధీ స్టూడియోస్‌కి చెందిన సి.వి.ఆర్.ప్రసాద్ కలిస్తే ఆయన ఓకే అన్నారు. ఒకవైపు థియేటర్‌కి సంబంధించిన విషయాలు అల్లాడి పెంటయ్య (రాజకీయ నాయకులు అల్లాడి రాజ్‌కుమార్ తండ్రి), పి.యస్ ప్రసాద్ చూసుకుంటూ ఉంటే ఎన్.టీ.ఆర్ ఇటు షూటింగ్‌లో పాల్గొంటూ వారితో అవసరం వచ్చినప్పుడు సంప్రదించేవారు. అంతేకాదు ఎన్.టీ.ఆర్ కోసం రిట్జ్ హోటల్‌ని బుక్ చేస్తే - 'ఎందుకు బ్రదర్ అనవసరంగా డబ్బు వేస్ట్ చేస్తారు?' అంటూ సారధీ స్టూడియోస్‌లో నిర్మించిన ఓ గదిలోకి తన సామాన్లను ఉన్న ఫళంగా తెప్పించుకుని షూటింగ్ జరిగినన్నాళ్ళు అక్కడే బస చేశారు. ఎన్.ఏ.టి బ్యానర్ పై తాను తీయబోయే చిత్రం స్క్రిప్ట్ వ్యవహారాన్ని ఆ రూములోనే తెల్లవారు ఝామున లేచి పరిశీలించే వారాయన. ఒకక్షణం కూడా వృధా కాకుండా కాలాన్ని ఎన్.టీ.ఆర్ పూర్తిగా వినియోగించుకునే వారనడానికి ఇదొక ఉదహరణ.

తమిళంలో 'బాగపిరివినై' చిత్రాన్ని తీసిన ఎ.భీమ్‌సింగ్ అదే కథతో 1965లో సునీల్‌దత్, నూతన్ హీరో, హీరోయిన్లుగా 'ఖాన్‌దాన్' చిత్రాన్ని తీయటం జరిగింది.



# ఆ పాత పాట మధురం



రాజా

## అన్నపూర్ణ

విజయ, వాహిని, అన్నపూర్ణ, ఎన్.ఏ.టి, ప్రసాద్ ఆర్ట్ సంస్థల్లా సంగీత సాహిత్యాల పరంగా తమ బ్యానర్‌తో ప్రత్యేకమైన ముద్రను సంపాదించుకున్న సంస్థ జగపతి పిక్చర్స్. నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ ఈ బ్యానర్‌పై నిర్మించిన తొలి చిత్రం అన్నపూర్ణ. ఈ చిత్రం 1960 లో విడుదలైంది. అప్పటి నుండి 'ఆస్తిపరులు' చిత్రం వరకు ఆ సంస్థకు వి.మధుసూదనరావే దర్శకుడు. రాజేంద్రప్రసాద్‌కి, మధుసూధనరావుకి ఇంటిపేరు ఒకటే (వీరమాచనేని) అవటం, ఇద్దరి అత్తవారి ఊళ్ళూ ఒకటే కావటం, ఇరుకుటుంబాలలో ఒకరితో ఒకరికి పరిచయం ఉండటం ఇవన్నీ 'అన్నపూర్ణ' చిత్రంద్వారా మొదలైన వారి కాంబినేషన్ తొలికారణాలుగా తోడ్పడ్డాయి. రాజ్యం పిక్చర్స్ అధినేత్రి, నటి లక్ష్మీరాజ్యం కుటుంబంతో కూడా వి.బి.రాజేంద్రప్రసాద్‌కి పరిచయం బాగా ఉండేది. సంసారం, శ్రీకృష్ణలీలలు, నర్తనశాల వంటి చిత్రాలు నిర్మించిన లక్ష్మీరాజ్యంకి అప్పట్లో సుసర్ల దక్షిణామూర్తి ఆస్థాన సంగీత దర్శకుడు. ఆ పరిచయంతోనే అన్నపూర్ణ చిత్రానికి కూడా సుసర్ల దక్షిణామూర్తినే సంగీత దర్శకునిగా నియమించుకోవటం జరిగింది. కథ, మాటలు సదాశివబ్రహ్మం, ఆరుద్ర కలిసి రాయగా పాటలన్నిటినీ ఆరుద్రే రాశారు. ఆ కాంబినేషన్ లో వచ్చిన 'అన్నపూర్ణ' చిత్రంలో ప్రజాదరణ పొందిన ఓ నాలుగు పాటలివి.

తళ తళా మిలమిలా ||తళ తళా||
పగటిపూట వెన్నెలా..
ఎందువలన ఓ లలనా ఎందువలన ||ఎందువలన|| ||తళతళా||
చిలకమ్మల కిలకిల చిగురాకుల కలకల
గాలివీచి పూలు కురిసి కథలు తెలిపి కోయిల
తెలియరాని ఊహలతో తేలిపోవు వేళ
చిలిపిగా పావురాలు చూసి నవ్వేలే ||తళతళా||
మురిసిపోవు మనసులోనే మధురభావన
మరుపురాని మరువలేని ఎవరిదీవెన
చిన్ననాటి మా చెలిమి చిగురించెను నేటికి
మనసు పయనమైనది మధురమైన చోటుకి ||తళతళా||

ఈ పాటను సుశీల పాడగా జమునపై చిత్రీకరించారు. ఈ పాటలో 'పగటిపూట వెన్నెల' అనే ప్రయోగాన్ని అప్పటికి ఓ కొత్త ఎక్స్‌ప్రెషన్‌లా ఫీలయి అందరూ ప్రశంసించడం జరిగింది. ట్యూన్ పరంగా దీన్నొక ప్రత్యేకమైన స్వరకల్పనగా చెప్పుకోవాలి. పల్లవిలో తిలంగ్ రాగచ్ఛాయలు కనిపిస్తాయి. చరణాలలో అక్కడక్కడ కైశిక విషాదం లేని ఖమాచ్ రాగలక్షణాలు, మరికొన్ని చోట్ల ప్రతి మధ్యమంలేని బేహాగ్ రాగచ్ఛాయలు కనిపిస్తాయి. మనోభావమే ప్రధానంగా ట్యూన్ చేసినట్టు అనిపించే ఈ పాటలో జలతరంగిణి వాద్యాన్ని ఉపయోగించుకున్న తీరు మనసులో ముద్రించుకుపోతుంది. సుశీల పాడిన పెక్యులియర్ ట్యూన్స్‌లో ఈ పాటను ప్రత్యేకంగా చెప్పుకోక తప్పదు. రెండవ చరణం చివర్లో 'చోటుకి' అనే పదం 'అన్నపూర్ణ' పాటల పుస్తకంలోను, ఆరుద్ర 'కొండగాలి తిరిగింది' పుస్తకంలోను 'చోటికి' అనే అచ్చయి ఉంది. కానీ సుశీల మాత్రం 'చోటుకి' అని పాడటాన్ని విన్నవారు గమనించవచ్చు. చరణాల చివర 'నేటి' - 'చోటికి' అనే ప్రయోగం ప్రాస ప్రకారం సరిపోయినా - చోటుకి అనే మార్పు చోటు చేసుకోవటానికి కారకుల్ని మాత్రం అభినందించి తీరాలి. ఎందుకంటే ట్యూన్‌లో 'చోటుకి' అని పాడితేనే బావుంటుంది కాబట్టి. అలాగే ఈ పాట రెండో చరణంలో 'మధురభావన - ఎవరిదీవెన' అనే ప్రయోగాలు తరువాత కాలంలో అంటే 1974లో 'తులసి' అనే చిత్రంలో 'సెలయేటి గలగల' పాటలో 'అనురాగం ఏదేదో అమర భావన - అది నీవు దయచేసిన గొప్పదీవెన' అనే చరణాల రూపంలో మరోసారి దర్శనమీయటం గమనార్హం.

---

అ: మనసేమిటో తెలిసిందిలే
కనుచూపులోనే అనురాగమంతా కనిపించెలే
ఆ: మనసేమిటో తెలిసిందిలే
చిననాటి ఆశలు ఈనాటికైనా నెరవేరెలే
అ: ఓ... ఓ..ఓహో..
ఆ: ఓ ఓ ఓ ఓ
అ: ఓ... మురిపించకే మది పులకించులే
చెలి చిరునవ్వుతో సుధ చిలికించవే
ఆ: ఆ...కనుమూసినా నే కనుతెరిచినా
నీవు కనిపింతువే హోయి కలిగింతువే
అ: ఆ .. చిననాటనే ప్రేమ చిగురించెనే
ఓ.. చిననాటనే ప్రేమ చిగురించెనే
ఓ.. ఓ.. ఓ.. ఓ వికసించినే
ఓ చెలి నీకు బిడియాలు ఇపుడెందుకే
హో చెలి నీకు బిడియాలు ఇపుడెందుకే ||మన||
అ: ఓ..ఓ.హో
ఆ: ఓ....ఓ...ఓ
అ: ఓ నను చేరవే చెలి ఇటు చూడవే
నేను నిను వీడనే వీడి మన జాలనే

ఈ పాట పి.బి.శ్రీనివాస్, సుశీల పాడగా జగ్గయ్య, జమున అబినయించారు. యమన్ రాగం ఆధారంగా సాగిపోయే ఈ పాటలో పి.బి.శ్రీనివాస్ పాడిన పద్ధతి వింటే అప్పట్లో ఆయన్ని 'ప్లేబ్యాక్ స్వీట్ వాయిస్' అని ఎందుకు అనేవారో అర్థం అవుతుంది. పడుకోబోయే ముందు వింటే నిద్రాదేవి ఒడిలోకి అతి సునాయసంగా చేరవెయ్యగల సుగుణం ఉన్న పాటలలో ఇదొకటి.

---

కులాసా రాదోయి రమ్మంటే
మజాకా కాదోయ్ వలపంటే
ఖలేజా అంటూ ఉండాలోయ్ రాజా
అదుంటే ఎపుడూ నిన్నూ ఎడబాయనోయ్ ||కులాసా||
గులాబీ చక్కదనం
జిలేబీ తియ్యదనం
చలాకీ సొగసుల లేతదనం
కలసిన యవ్వనం ||గులాబీ||
నీదే చేసెద అందము
నీకూ నాకు బందము
పోనోయ్ పొమ్మంటే ||నీదే|| ||కులాసా||
ఒయ్యారం ఒలికిస్తా
హుషారు కలిగిస్తా
వరించి నీచే వలపిస్తా
ఓహో అనిపిస్తా
రావాలనుకుని వచ్చావు - ||ఇక||
పోవాలన్న పోనీను -
మనసోయి నీవంటే ||రావా||
కులాసా రాదోయ్ రమ్మంటే
మజాకా కాదోయ్ వలపంటే
ఖలేజా అంటూ ఉండాలోయ్ రాజా
అదుంటే ఎపుడూ నిన్నూ ఎడబాయనోయ్

ఈ పాటను జిక్కి పాడగా రేలంగి, గిరిజపై చిత్రీకరించారు. శంకరాభరణం రాగ స్వరాలపై నడిచిన ఈ పాటలో అక్కడక్కడ కళ్యాణి రాగచ్ఛాయలు కనిపిస్తే అందుకు గ్రహబేధం కారణమై ఉండవచ్చు. లబ్ధప్రతిష్టుడు, శబ్దప్రతిష్టుడు అయిన ఆరుద్ర వాడిన పదాలలో తేలికదనం ఈ పాట జనం నోటికి త్వరగా పట్టుబడేందుకు తోడ్పడతాయి.

అ: వగలాడి వయ్యారం భలే జోరు
నీ వయ్యారం ఒలికించు వన్స్‌మోరు
ఆ: ఆడకండి నాటకాలు అయ్యగారు
మీ వన్స్‌మోరుకు జవాబు మూయినోరు ||వగ||
అ: ఆడకు నా ప్రాణంతో చెలగాటకం
అమ్మతోడు నామాటలు కావు నాటకం ||ఆడకు||
ఆ: చాలు చాలు కట్టిబెట్టు ఈ బూటకం
సాగదోయి నా దగ్గర పితలాటకం ||చాలు|| ||వగ||
అ: కోరుకున్నది దిచ్చుటలో కొద్దిగా లేటు
కోపమేల ఇదే కదా నా పొరపాటు ||కోరు||
ఆ: పొరపాటులు చేయుటే తమకలవాటు
అయినా ఇమ్మంటారు హృదయంలో చోటు
పొరపాటులు చేయుటే తమకలవాటు
రాజా ఇమ్మంటారు హృదయంలో చోటు ||వగ||

ఈ పాటను ఘంటసాల, జిక్కి పాడగా రేలంగి, గిరిజపై చిత్రీకరించారు. నిజానికి ఇదో తమాషా గీతం. ట్యూన్‌లో అంతర్లీనంగా ఉన్న జానపద శైలితో పాటు - జాగ్రత్తగా గమనిస్తే పూర్తిగా నిరాకరించలేని విధంగా దేశ్ రాగచ్ఛాయలు కూడా గోచరిస్తాయి. అటు క్లాస్‌ని ఇటు మాస్‌ని సమానంగా ఆకట్టుకున్న ఈ హాస్య గీతం ట్యూన్ పరంగా ఎంతటి విజయాన్ని సాధించిందో ఘంటసాల అభిమానుల్ని కూడా అంతగానే అలరించింది. ఈ చిత్రంలో హీరోకి పి.బి.శ్రీనివాస్, హాస్యనటునికి ఘంటసాల పాడటం ఒక విశేషం. అదేమాట నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ గారిని అడిగితే "అప్పట్లో జగ్గయ్యగారికి పి.బి.శ్రీనివాస్ బాగా ఎస్టాబ్లిష్ అయిపోయారు. ఘంటసాలగారి వాయిస్ మీదకూడా ఎంతో అభిమానం ఉండటం చేత ఆయనతో ఒక విషాదగీతం, ఈ హాస్య గీతం పాడించాం. అయినా ఘంటసాలగారు కామెడీ గీతాలు కూడా చక్కగా పాడుతారుగా" అని అన్నారు. అది అక్షరాల నిజం. ఈ 'వగలాడి వయ్యారం' పాటలలో మధ్య మధ్య వచ్చే 'ఆ, చాల్లే రాణీ, అద్దిగది' వంటి మాటలు దగ్గర రేలంగి పరంగా ఘంటసాల చేసిన 'స్వరకాయ ప్రవేశం' మనచేత ముసిముసి నవ్వులు నవ్విస్తుంది.



# ఆ పాత పాట మధురం



## రాజా

### విమల

**'కొన్ని పాటలు వింటున్నప్పుడు చాలా బాగుంటాయి.** కొన్ని పాటలు పదిమందిలో పాడేటంత ఉదాత్తనంగా, గౌరవనీయమైన స్థానంలో ఉంటాయి. కొన్ని పాటలు స్వర రచనాపరంగా క్లిష్టంగా ఉన్నా సరే ఆదరించదగ్గ స్థాయిలో ఉంటాయి. ఈ మూడు అర్హతలనూ కలిగి ఉన్నా కేవలం క్లాస్ అనే ఒక వర్గానికి మాత్రం కట్టుబడిపోయి ఎంతో మందికి అందకుండా ఉండిపోయిన మంచి పాటలలో విమల చిత్రంలోని ఓ రెండు పాటలు వస్తాయి. 1960లో విడుదలయిన ఈ చిత్రానికి మాటలూ - పాటలూ ముద్దుకృష్ణ రాశారు. సంగీతం సుబ్బయ్యనాయుడు అందించారు.

సుబ్బయ్య నాయుడు అనగానే తెలుగువారందరికీ 'మురిపించే మువ్వలు' చిత్రం 'నీ లీల పాడెదదేవా' పాట గుర్తొచ్చేస్తాయి. యన్.టి.ఆర్, భానుమతి నటించిన 'అగ్గిరాముడు' చిత్రాన్ని నిర్మించిన పక్షిరాజా సంస్థకు సుబ్బయ్య నాయుడు సంగీతాన్ని అందించేవారు. ఆ పక్షిరాజా సంస్థే నిర్మించిన ఈ చిత్రం ద్వారా అందించిన ఓ రెండు ఉత్తమగీతాలివి.

అ: కన్నుల్లో నీ బొమ్మ చూడు  
నా.. కన్నుల్లో నీ బొమ్మ చూడు  
అది కమ్మని పాటలు పాడు ||కన్నుల్లో||  
ఆ: పున్నమి వెన్నెల వన్నెలలో  
కన్నుల కట్టిన రూపముతో  
నీవే మనసున తోచగా  
నను నేనే మరిచిపోదురా ||కన్నుల్లో||  
అ: కోయిల పాటల తీరులతో ||కోయిల||  
సరికోయిల రాగాలల్లుదమా ||సరి||  
ఆ: నచ్చిన పూవు గద నేను ||నచ్చిన||  
కోరి వచ్చిన తుమ్మెద నీవెరా ||కన్నుల్లో ||  
అ: రాగమాలికల వీణనీవే ||రాగ ||  
అనురాగము లేలే జాణవెలే ||అను||  
ఆ: నీవే వలపుల జాబిలిరా ||నీవే||  
సరి నేనే కులుకుల వెన్నెలరా ||కన్నుల్లో ||

ఈ పాటను మరొక అద్భుత స్వరరచనగా పేర్కొనాలి. ఈ పాటను కూడా ఘంటసాల, జయలక్ష్మి పాడగా ఎన్.టి.ఆర్, సావిత్రిపై చిత్రీకరించారు. ఇది ఒక రాగమాలికా గీతం. సాధారణంగా రాగమాలిక అనగానే ఒక రాగం నుంచి ఇంకో రాగంకి స్వర రచన మారినప్పుడు శ్రోతలు ఒక విధమైన బేస్‌గా ఉంటే 'పున్నమి వెన్నెల వన్నెలలో' చరణానికి రాగేశ్రీ రాగాన్ని, 'కోయిల పాటల తీరులతో' చరణానికి తిలంగ్ రాగాన్ని 'రాగమాలికల వీణ నీవె' చరణానికి కాఫీ రాగాన్ని వాడుకున్నారు. ఈ రాగాలను వాడుకోవడంలో కూడా జనరంజకత్వం కోసం రాగేశ్రీ రాగంలో రాని కాకలినిషాదాన్ని - తిలంగ్ రాగంలో లేని రిషభాన్ని ఉపయోగించారు. ఇవికాక ఉపయోగించిన రూపక తాళ ప్రకారంగా చూసుకుంటే కర్ణాటక శాస్త్రీయ సంప్రదానికి కావలసిన రీతిలోని ఆరు మాత్రల నడకలో ఉండే రెండు మాత్రల చొప్పున మూడు ఖండాలుగా కాకుండా హిందుస్థానీ పద్ధతిలో ఉపయోగించే మూడు మాత్రల చొప్పున రెండు ఖండాలుగా నడిపించటం ఓ ప్రత్యేకత ప్రయోగంగా పేర్కొనాలి. ఇక పాడిన ఘంటసాల, జయలక్ష్మి - బిందువులో సింధువులా తమ ప్రతిభనంతా ఎంతో క్లుప్తంగా, వినేవాళ్ళ గుండెల్లో నిక్షిప్తంగా ఉండేట్లు ప్రదర్శించారు.

---

అ: కన్నుల బెళుకే కలువలురా ||కన్నుల||
కన్నియ తళుకే కనకమురా ||కన్నుల||
కలవోలే కనిపించే ||కల||
కలలోనే వలపించే ||కల||
కనులలో ఆ రూపే కాపురమైపోయే ||కను|| ||కన్నుల||
ఆ: కనరాని అందాలనే
కనులార కనినంతనే ||కనరాని||
వనమేమొ ఈ వేలనే ||వన||
నందనమనిపించెనే ||నందన||
విరులన్ని కనువిప్పెనే ||విరు||
చిరునవ్వు చిలికించెనే -
ఎనరాని శృంగారమే ||ఎన||
హృదయాలు కదిలించెనే ||హృద|| ||కనరాని||

ఆ:ఇటు చూడు ఇటు చూడవే
ఇది ఏమి మటుమాయమే ||ఇటు||
అ: వనరాణి వగలాడిగా కనుసైగ కావించగా ||వన||
వనమేమొ ఈ వేళనే నందనమనిపించెరా ||వన||
విరికన్నె కనువిప్పగా ||విరి||
చిరునవ్వు చిలికించగా ||చిరు||
ఎనరాని శృంగారమే హృదయాలు కరిగించెరా ఎనరాని వనరాణి
అ: కోరి కోరి నీ రూపము కనగా ||కోరి||
తీరుని ఆకలి దాహములే ||తీరును||
చేరి చేరి నీ పాటలు వినగా
చిందును అమృత బిందువులే ||చిందును|| ||కోరి||
అ: కలలు ఫలించె కాలములో ||కలలు||
కలసిన ప్రేమలు శాశ్వతమే ||కలిసిన||
ఆ: కలనైనా మెలుకువనైనా ||కల||
లోకము సుందర నందనమే ||లోకము కలలు||

ఈ పాటను ఘంటసాల, జయలక్ష్మిగానం చేశారు. ఎన్.టి.ఆర్, సావిత్రి ప్రధాన పాత్రలలో అభినయించిన ఈ పాటలో రేలంగిలా డైలాగులు చెప్పే వేళంగి అనే హాస్యనటుడు, సావిత్రికి చెలికత్తెగా నటించిన మరో నటి కూడా కనిపిస్తారు. ఇది ఒక రాగమాలికా గీతం. 'కన్నుల బెళుకే కలువలురా' అనే పల్లవి నుంచి 'కనులలో ఆ రూపే కాపురమై పోయే' అనే చరణం వరకు బేహాగ్ రాగంలో స్వరపరిచారు. వినసొంపుగా ఉండే ఈ బేహాగ్ రాగాన్ని మన సంగీత దర్శకులు అంతగా ఉపయోగించుకోలేదనే చెప్పాలి. ఓసారి సింహావలోకనం చేసుకుంటే ఎస్. రాజేశ్వరరావు స్వరపరచిన 'చెంచులక్ష్మి' చిత్రంలోని 'నీలగగన ఘనశ్యామా' పాట 'భక్తప్రహ్లాద'

చిత్రంలోని 'వరమొసగే వనమాలీ' పాట గుర్తుకు వస్తాయి. 'కన్నుల బెళుకే' పాట మొదటి చరణం – 'కనరాని అందాలనే' దగ్గర్నుంచి 'హృదయాలు కదిలించెనే' వరకు, ఆ తర్వాత అదే వరుసలో ఇచ్చే ఇంకో చరణం –

'వనరాణి వగలాడిగా' దగ్గర్నుంచి 'హృదయాలు కరిగించెరా' వరకు భాగేశ్రీ రాగాన్ని ఉపయోగించారు ఈ రెండు చరణాల మధ్య వచ్చే 'ఇటు చూడు ఇటు చూడవే. ఇది ఏమి మటుమాయమే' అనే వాక్యాలకు బిలహరి రాగాన్ని వాడుకున్నారు. 'కోరి కోరి నీ రూపము కనగా' అనే చరణాన్ని గౌరీ మనోహరి రాగంలోను 'కలలు ఫలించే కాలములో' చరణాన్ని కళ్యాణి రాగంలోను స్వరపరిచారు. ఔత్సాహిక గాయనీ గాయకులకు ఈ పాట ఓ పరీక్షలాంటిది. మొత్తం పాటను సాధన చేసి ఏకబిగిన పాడగలిగిననాడు 'మేం పాడడానికి పనికొస్తాం' అని వారు ధైర్యంగా చెప్పుకోవచ్చు. సాధారణంగా శాస్త్రీయ సంగీత కచ్చేరీలు చేసే విద్వాంసులు కొన్ని సినిమా పాటలు పాడవలసి వచ్చినప్పుడు తమకు అలవాటైన ధోరణిలో పాడడం, సినిమా పాటల ఒరవడికి అలవాటుపడ్డ శ్రోతలకు ఈ ధోరణి మింగుడు పడని విధంగా ఉండడం సహజం. 'రాధా – జయలక్ష్మి'గా శాస్త్రీయ సంగీత ప్రపంచంలో గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకున్న గాయనీమణుల్లో ఒకరైన జయలక్ష్మి ఈ 'కన్నుల బెళుకే' పాటలోని 'కనరాని అందాల' చరణాన్ని పాడుతుంటే సాధారణ స్థాయిలో ఉండే శ్రోతలకు కూడా శరీరం రోమాంచితం అయిపోతుంది. ముఖ్యంగా 'హృదయాలు కలిగించెనే' దగ్గర ఆవిడ హృదయాలను కదిలించేస్తుంది. ఆ రససిద్ధికి కారణం – రాగం భాగేశ్రీ కారణమా లేక జయలక్ష్మి పాడిన పద్ధతా అన్నది ఎవరికి వారే సమాధానం చెప్పుకోవలసిన ప్రశ్న. అలాగే 'చిరునవ్వు చిలికించగా' దగ్గర ఘంటసాల కూడా తనదైన తసస్పర్శతో పులకింప చేస్తారు.

ప్రజల మనసులలో చక్కని అభిరుచిని పెంపొందింపచేసి వారి చైతన్యంలో సంస్కారాన్ని నింపాలనుకునే దృశ్య, శ్రవణ మాధ్యమం ఏదైనా సరే ఇటువంటి పాటల వ్యాప్తి ద్వారా పదే పదే పూనుకుంటే చక్కని సాంస్కృతిక వారసత్వాన్ని తర్వాతి తరాల వారికి అందించిన సార్థకత చేకూరుతుంది.

(సమాప్తం)

నెలనెలా 'కౌముది' పాఠకుల్ని తన సినీ సంగీత, సాహిత్య పరిజ్ఞానంతో అలరిస్తున్న 'రాజా', 'మా టీవి' లో 'గుర్తుకొస్తున్నాయి' అనే కార్యక్రమాన్ని రూపొందిస్తున్న విషయం చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు. ప్రతి ఆదివారం ఉదయం 9.00 కి మాటివి లో ప్రసారమౌతున్న ఈ కార్యక్రమానికి విశేషమైన ప్రేక్షకాదరణ లభిస్తోంది. ఈ కార్యక్రమంలో అలనాటి నటీనట దిగ్గజాలతో అలనాటి జ్ఞాపకాల గురించి సమగ్రమైన ఇంటర్వ్యూ ప్రసారం చేస్తున్నారు. 2005 నవంబర్ 20న అంజలీదేవి గారితో మొదలైన ఈ కార్యక్రమంలో ఇంతవరకూ దాదాపు 130 పైగా ఎపిసోడ్స్ వచ్చాయి. ఒక్క అక్కినేని గారితోనే గత 42 వారాలుగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. వచ్చే సెప్టెంబర్ 21 వరకూ అక్కినేని గారి అరుదైన జ్ఞాపకాల సంచికగా ఈ కార్యక్రమం కొనసాగబోతోంది. జూన్ 7 వతేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన టీ.వి. అవార్డుల ఉత్సవంలో, ఈ కార్యక్రమానికి గాను మాటీవి కి బంగారు నంది, ఈ కార్యక్రమ రూపశిల్పి రాజాకి తామ్రనంది అవార్డులు బహూకరించారు. ఈ సందర్భంగా 'రాజా' గారిని హృదయపూర్వకంగా అభినందిస్తూ వారి నుంచీ మరిన్ని మంచి టీ.వి. కార్యక్రమాలు వస్తాయని 'కౌముది' ఆశిస్తోంది.









విశేష పరిశోధనలకు, వివిధ మాధ్యమాలలో వాటిని అందించిన విశ్లేషణలకు - మ్యూజికాలజిస్ట్ రాజా ను ఢిల్లీ తెలుగు అకాడమీ 'సమైక్య భారతి గౌరవ సత్కార్ ' అవార్డ్ తో సత్కరించింది. మోహన్ కందా వంటి మేధావులైన ఎంతోమంది ఐయ్యేయస్ ఆఫీసర్లను జ్యూరీ సభ్యులుగా కలిగిన తమ తె 'అకాడమీలో ఇటువంటి అవార్డును' ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారని ప్రధాన కార్యదర్శి ఎన్.వి.యల్. నాగరాజు తెలిపారు. ఈ అవార్డును తమిళ నాడు గవర్నర్ కె. రోశయ్య ద్వారా రాజా స్వీకరించారు.




*ఆ నాటినుంచీ ఈ నాటి వరకూ వచ్చిన, వస్తున్న సినిమాల్లోని పాటల సాహిత్యం గురించీ, సంగీతం గురించీ సాధికారకంగా, సవివరంగా, సరళంగా, సమగ్రంగా విశ్లేషించగల ఒకే ఒక్క సీనియర్ మోస్ట్ జర్నలిస్ట్ రాజా. 'కౌముది ' పాఠకులకోసం ఆయన వ్యాసాలని అందిస్తున్నాం. ఒక్కసారి నిన్నటి తరం పాటల్ని నెమరు వేసుకుందాం.. ఆ నాటి మధుర స్వరాలని మరోసారి గుర్తు తెచ్చుకుందాం.*

*ఇ-మెయిల్ ఎడ్రసు:* raja.musicologist@gmail.com *బ్లాగు:* ***http://musicologistraja.blogspot.com/***